# సాహిత్య తరంగిణి

అంతర్జాతీయ తెలుగు పరిశోధన పత్రిక

**Vollume – 3** **ISSN No. 3048-5908**

**Special Issue – 7** **Impact Factor: 6.673**


## అంతర్జాతీయ సదస్సు

# ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

## (ప్రత్యేక సంచిక–II)

**తేదీ 30-09-2026**

నిర్వహణ

## తెలుగు శాఖ

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్, భారతదేశం – **533101**

| | | |
|---|---|---|
| Book Title | : | **Adhunika Sahitya Prakriyalu – Samajika Prayojanalu** |
| Editor. | : | **Department of Telugu** |
| Book Subject | : | Telugu |
| Book Category | : | Edited book |
| Copy Right | : | Editor |
| First Edition | : | September, 2026, Volume-3 |
| Book Size | : | B5(Double Crown) |
| Paper | : | 21kg, Maplitho NS |
| Price | : | Rs.700/- |
| Published by | : | Published by: **Sahithyatharangini Telugu Journal** |
| | | **ISSN:3048-5908** |
| | | Impact Factor : 6.673(SJIF), Andhra Pradesh, India |
| Contact | : | 91 21 03 98 99 |
| E-Mail | : | sahithyatharangini@gmail.com |

ISSN Issued by

ISSN National Centre,
National Science Library
CSIR-NISCPR, 14 Satsang Vihar Marg,
New Delhi – 110067

First Edition September, 2026

**Disclaimer:** The Publisher and editor cannot be held responsible for errors or any consequences arising from the use of information in this Book; the views and opinions expressed herein are of the authors and do not necessarily reflect those of the publisher and editors. © All rights reserved. No part of the book may be reproduced, in any form or any means, without permission in writing from the publisher ,Editor, and the author.

అంతర్జాతీయ సదస్సు

# ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

(ప్రత్యేక సంచిక)

## సంపాదక మండలి వర్గం

1. డా. మోగంటి సుధామయి, తెలుగు శాఖ అధ్యక్షురాలు
2. డా. అల్లు పుష్పలత, తెలుగు ఉపన్యాసకురాలు
3. శ్రీమతి షేక్ జరీన బేగం, తెలుగు ఉపన్యాసకురాలు
4. డా. బి. సుబ్బలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు
5. డా. ఆతుకూరి వెంకటేశ్వర్లు (యోగి), తెలుగు ఉపన్యాసకులు
6. డా. జి. వెంకట లాల్, తెలుగు ఉపన్యాసకులు
7. డా. పి. శివాజీ, తెలుగు ఉపన్యాసకులు
8. శ్రీమతి కె. ఎం. సౌందర్యవతి తెలుగు ఉపన్యాసకురాలు
9. శ్రీ దాసరి రాజు, తెలుగు ఉపన్యాసకులు
10. డా. కె. ప్రేమ కుమారి, తెలుగు ఉపన్యాసకురాలు

(అతిథి ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో)

నిర్వహణ

## తెలుగు శాఖ

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 533101

# మన ఆత్మగౌరవానికి ప్రతీక – తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి



**డా. రామచంద్ర ఆర్.కె.**
ప్రిన్సిపాల్
ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి),
రాజమహేంద్రవరం.

ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), రాజమహేంద్రవరం విద్య, సంస్కృతి, సాహిత్య రంగాలలో రాష్ట్రంలో తనదైన విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న విద్యాసంస్థ. చారిత్రక, సాంస్కృతిక వైభవానికి నిలయమైన రాజమహేంద్రవరం నగరంలో ఈ కళాశాల అనేక దశాబ్దాలుగా విద్యార్థులలో జ్ఞానదాహాన్ని, సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నది. అనేక మంది విద్యావేత్తలు, సాహితీవేత్తలు, పరిశోధకులు, ప్రజ్ఞావంతులను సమాజానికి అందించిన ఘనత ఈ కళాశాలకు ఉంది. అధ్యాపక వర్గానికి, భారతీయ తత్వ శాస్త్రానికి తలమానికంగా చెప్పుకునే భారత రెండవ ప్రథమ పౌరుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఈ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయటం ఈ కళాశాల కీర్తి కిరీటంలో కలికితురాయి.

ఈ కళాశాల వైభవంలో తెలుగు శాఖకు ఒక ప్రత్యేకమైన చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. తెలుగు భాషా సాహిత్య వికాసానికి కృషి చేసిన మహనీయుల అడుగుజాడలను మోసుకొస్తున్న ఈ శాఖ తన వారసత్వాన్ని నేటికీ కొనసాగిస్తోంది. ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా ప్రసిద్ధి చెందిన కందుకూరి వీరేశలింగం పంతులు ఈ విభాగంలో పనిచేయడం ఈ శాఖ చరిత్రలో ఒక అపూర్వమైన గౌరవం. అలాగే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, సంపత్ రాఘవాచారి, పి.వి. రాజమన్నార్, వి.వి.ఎల్. నరసింహారావు, కొర్లపాటి రామమూర్తి వంటి ప్రముఖులు ఈ శాఖతో అనుబంధం కలిగి ఉండటం దీని సాహిత్య వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టింది.

గత వైభవాన్ని గౌరవిస్తూ, వర్తమాన సవాళ్లను స్వీకరిస్తూ, భవిష్యత్తు తరాలకు తెలుగు భాషా సాహిత్య సంపదను అందించడం తెలుగు శాఖ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశోధక దృక్పథం కలిగిన సాహిత్యాభిమానులతో శాఖ తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఉన్నత విద్యకు, పరిశోధనకు, సృజనాత్మక అభివ్యక్తికి ఈ శాఖ ఒక చక్కని వేదికగా నిలుస్తోంది.

తెలుగు కేవలం ఒక భాష మాత్రమే కాదు; అది మన చరిత్ర, మన సంస్కృతి, మన జ్ఞాపకాలు, మన జీవన విధానం, మన సామూహిక చైతన్యానికి వాహిక. కాలం మారుతున్న కొద్దీ భాషా ప్రయోగాలు, సాహిత్య ప్రక్రియలు, భావ వ్యక్తీకరణ పద్ధతులు మారుతున్నప్పటికీ, మానవ జీవితాన్ని అర్థం చేసుకోవడంలో సాహిత్య ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదు.

ఈ నేపథ్యంలో “ఆధునిక సాహిత్య ప్రక్రియలు — సామాజిక ప్రయోజనాలు ” అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సు ఎంతో సముచితమైనది. ఆధునిక కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, ఆత్మకథ, జీవితచరిత్ర, స్మృతిరచనలు, దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం, మైనారిటీ సాహిత్యం, పర్యావరణ సాహిత్యం, డిజిటల్ సాహిత్యం వంటి విభిన్న ప్రక్రియలు సమాజంలోని మార్పులను, వివిధ వర్గాల అనుభవాలను, సమకాలీన జీవన సంక్లిష్టతలను ప్రతిబింబిస్తున్నాయి.

సాహిత్యం సమాజానికి కేవలం అద్దం మాత్రమే కాదు; సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి, ప్రశ్నించే చైతన్యం, మార్పును కోరే ప్రేరణ కూడా. సామాజిక అసమానతలను

ప్రశ్నించడం, మానవ విలువలను పరిరక్షించడం, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించడం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం వంటి అంశాలలో సాహిత్యం నిరంతరం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సదస్సు సాహిత్యం—సమాజం మధ్య ఉన్న ఈ సజీవ సంబంధంపై విద్యావేత్తలు, పరిశోధకులు, రచయితలు, విద్యార్థులు పరస్పరం తమ ఆలోచనలను పంచుకునే విలువైన వేదికగా నిలిచిందని భావిస్తున్నాను.

ఈ సదస్సు ద్వారా వెలువడిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి ఒక ప్రత్యేక సంచికగా ఈరోజు పాల్గొన్నటువంటి పత్ర సమర్పకులకు పత్ర సమర్పణ ఆన్లైన్ ద్వారా చేసిన వారికి అందించడం ఒక గొప్ప మహోతర కార్యంగా భావిస్తూ... ఈ ప్రత్యేక సంచికలో ప్రచురితమైన పరిశోధనాపత్రాలు, ఈ సదస్సులో జరిగిన చర్చలు తెలుగు సాహిత్య పరిశోధనకు కొత్త దిశ,దశలను చూపాలని, యువ పరిశోధకులకు స్ఫూర్తిని అందించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తెలుగు శాఖాధిపతి డా. మోగంటి సుధామయి గారికి, శాఖ అధ్యాపక బృందానికి, నిర్వాహకులకు నా హృదయపూర్వక అభినందనలు. దేశవిదేశాలలోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొంటున్న ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీవేత్తలు, విద్యార్థులందరికీ హృదయపూర్వక స్వాగతంతో పాటూ శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

**తెలుగు భాష వెలుగొందాలి...**

**తెలుగు సాహిత్యం విరాజిల్లాలి...**

**మన సంస్కృతి తరతరాలకు సజీవంగా కొనసాగాలి.**

ఈ సదస్సు విజయవంతం అయిందని భావిస్తూ, సాహిత్య పరిశోధనకు, సామాజిక చైతన్యానికి ఒక అర్థవంతమైన వేదికగా నిలుస్తుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు మా తెలుగు శాఖ మరెన్నో నిర్వహించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను.

మీ
**డా. రామచంద్ర ఆర్.కె.**
ప్రిన్సిపాల్

# ఆలోచనలకు అవసరమైన ప్రయత్నం



**డా. చిలుకోటి కూర్మయ్య,**
ఎం.ఏ., పి. హెచ్. డి.
అనుబంధ ఆచార్యులు,

రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల నూట డెబ్బై సంవత్సరాలకు పైగా చరిత్రను సంతరించుకున్న ఉన్నత కళాశాల. ఈ సంస్థ కళాశాల స్థాయికి మారిన దగ్గర నుండి సామాజిక ప్రగతికి బాటలు వేసింది.

సాహిత్యాన్ని జీవితాన్ని ప్రజల ప్రగతికి అంకితం చేసిన కందుకూరి వీరేశలింగం ఈ తెలుగు శాఖ లో అధ్యాపకులుగా పనిచేసి సామాజిక మార్పుకు నాంది పలికారు.

సామాజిక సంస్కర్తలు, ప్రగతి వాదులు పనిచేసిన ఈ కళాశాలలో, "ఆధునిక సాహిత్య ప్రక్రియలు సామాజిక ప్రయోజనాలు" అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించటం అభినందించదగ్గ విషయం.

ఆ దిశ వైపు సాహిత్యం ఎలా కృషి చేస్తుందో ముదింపు చేసే ఒక సదస్సుని ఏర్పాటు చేయడం తెలుగు శాఖ చేస్తున్న ఒక మంచి ప్రయత్నం. సమాజంలో ఉన్న ఎక్కువమంది ప్రజలకు మెరుగైన, సమానమైన, స్వేచ్ఛాయుతమైన జీవితం అందే విధంగా జరిగే మార్పునే ప్రగతి అంటున్నాం.

సామాజిక సమానత్వం, మానవ హక్కులు, ఆర్థిక అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యంలో అందరి భాగస్వామ్యం వంటి అంశాలన్నిటినీ ఈ సదస్సు చర్చించి ఒక ఆలోచనాత్మకమైన మార్గాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను.

ఈ సదస్సు ఆధునిక సాహిత్య ప్రక్రియలలో సూమారుగా ఇరవైకి పైగా సాహిత్య ప్రక్రియల్ని శీర్షికలుగా తీసుకుంది. ఇంచుమించుగా ఆధునిక సాహిత్య వాతావరణమంతటినీ తమ సదస్సు పరిధిలోకి తీసుకొచ్చింది. ఒక ఆలోచనత్మకమైన నిర్ణయాలకు ఈ సదస్సు మార్గం కావాలని ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం కోరుకోవడం నిజంగా అభినందించదగ్గ విషయం.

దీనికి ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ & అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి, ముఖ్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్న తెలుగు శాఖకు అభినందనలు తెలియజేస్తున్నాను.

**డా. చిలుకోటి కూర్మయ్య,**
ఎం.ఏ., పి. హెచ్. డి.
అనుబంధ ఆచార్యులు,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
బొమ్మూరు, రాజమహేంద్రవరం.

# ఆముఖం



**డా. సుధామయి**

లెక్చరర్ ఇంచార్జ్ తెలుగు

శ్రీమయమైన తెలుగు సాహితీ కేదారంలో అనేకానేక సస్య సంపదలు పద్యం, గద్యం, కథ, కథానిక, నవల, నాటకం, వ్యాసం, ఉపన్యాసం, కవిత, పాట. మానవ జీవిత పరమార్థం ఏమిటని జిగీషువైన మానవుడు యోచించినపుడు అతని మనోమయ ఆకాశంలో తటిల్లతలా స్ఫురించినవి రెండే విషయాలు. ఒకటి సజ్జన సాంగత్యం, రెండోది సారస్వత సుధాపానం. సాహిత్యమెందుకు చదవాలి? అనే ప్రశ్నకు సమాధానంగా కావ్యాలంకారికులు, రసజ్ఞులు, పండితులు ఎన్నో  ఉదాహరణలిస్తారు. భౌతిక ప్రపంచంలోని వాస్తవ కఠిన పరిస్థితులను సునాయాసంగా ఎదుర్కొని ప్రశాంతంగా జీవించే మానసిక స్థితిని కల్పించేది, భ్రాంతికి గురి చేస్తున్న లౌకిక సృష్టి నుండి ఆనందమయ, చైతన్యానికి  దారి చూపేదీ ఐన సాహిత్య పఠనం ఇహ పర సాధనా కవచం. నవరసాత్మకమైన, సర్వ శ్రేయోదాయకమైన, సారస్వత యజ్ఞాన్ని అనవరతం కొనసాగించడానికి అనేకులైన కవులు, కళాకారులు, సాహితీ రసదృష్టలు, తమ జీవితాలను అక్షరాలుగా మార్చి జీవనకళను కరతలామలకం చేశారు.

వాస్తవాలను కళాత్మకతతో అద్ది, జీవితపు పూల తోటను హృదయావర్జకమైన సుగంధ సురభిళ పవనాలతో నైతిక విలువల అభేర రాగాలతో నొప్పింపక, తానొవ్వక జీవనయాత్రను, కర్తవ్యపు తురాయి పూల బాటలో నడుస్తూ ,చివరకు పరమపద సోపానపు ఛాయల్లో లీనం కావడమే సాహితీగాన పూర్ణాహుతి, అలాంటి మాధురీ మహిమగల తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ప్రయోజనాన్ని– సాహితీ నందనవనంలో పరిమళ భరితంగాప్రసరింపజేయటానికి రాజమహేంద్రవరం,తెలుగు శాఖ సెప్టెంబరు ౩౦ న ప్రత్యక్ష అంతర్జాల అంతర్జాతీయ సెమినార్ ను నిర్వహిస్తుందని  చెప్పడం చాలా అనందాన్ని కలిగిస్తోంది. సాహితీ క్షీరసాగరాన్ని జిజ్ఞాసతో: మధించి సారపు, అమృతపు వెన్నముద్దలను తర్వాతి తరాలకు అందించే విధంగా ప్రామాణిక పత్రాలను పంపిన కళామతల్లి ముద్దుబిడ్డలకు, ఈ పవిత్ర దీక్షకు అరుమతించిన డా। రామచంద్ర ఆర్కే గారికి, మా తెలుగుశాఖ సోదర సోదరీమణులందరికీరి వెయ్యేళ్ళ నన్నయ భారతీ గోదావరి సాక్షిగా శుభాభినందనలు.


**డా. సుధామయి**

లెక్చరర్ ఇంచార్జ్ తెలుగు

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి),

రాజమహేంద్రవరం

అంతర్జాతీయ సదస్సు

# ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

(ప్రత్యేక సంచిక–II)

# విషయ సూచిక


| క్ర. సం. | వ్యాసం పేరు | వ్యాస కర్త పేరు | పుట |
|---|---|---|---|
| **56** | మాలపల్లి సామాజిక చిత్రణ – చైతన్య స్పందన | **ఎన్. నాగలక్ష్మి** | **269** |
| **57** | సుధామూర్తి సాహిత్యం – మహిళా చైతన్యం | **శ్రీమతి పి. శైలజ** | **273** |
| **58** | బాహ్య సౌందర్యం – అంతర్గత సామాజిక, తాత్విక దర్శనం – జానపద నిర్మాణ అంశాలు | **పి. శైలజ** | **277** |
| **59** | కులవృత్తి నాగరికతకు ఇనుపరెక్కలు 'ఉసుల్లు' | **డా. సర్మేక లలిత** | **282** |
| **60** | మనసున్న 'రామక్క' | **డా. బందారి ప్రేమ్ కుమార్** | **285** |
| **61** | శ్రీశ్రీ దేశచరిత్రలు – సామాజిక మేలుకొలుపు | **పెద్దముత్తి ఝాన్సీ** | **288** |
| **62** | సెల్ ఫోన్ శతకము – సాంకేతిక యుగంలో మానవీయ విలువలు, సామాజిక చైతన్యం" | **డా. సుర్ల రమణ** | **292** |
| **63** | గురజాడ సాహిత్యం – సామాజికత | **డా. డి. సుజాత** | **296** |
| **64** | మహైక వచన కావ్యంలో సామాజికాంశాల ప్రాసంగికత | **హొటారికారి సందీప్** | **299** |
| **65** | దళిత సాహిత్యంలో – చోడగిరి చంద్రరావు శతకాల ప్రాశస్త్యం | **గుర్రాల రమాదేవి** | **303** |
| **66** | అడవి బాపిరాజు 'అంశుమతి' నవల – స్త్రీ పాత్రలు | **మీసరగండ గాయత్రి దేవి** | **305** |
| **67** | సాహిత్యం – సామాజిక చైతన్యం | **డా. ఎస్. శారద** | **310** |
| **68** | ధీరనారి నవల – సామాజిక అంశాలు | **మాణికె శివరంగస్వామి** | **314** |
| **69** | ఆధునిక తెలుగు సాహిత్యం– సామాజిక దృక్పథం. ప్రస్తుతం పత్రికల సేవ | **డా. ముట్నూరు ఉపేంద్రశర్మ** | **318** |
| **70** | అస్తిత్వ సంక్షోభం నుండి కార్యాచరణ వైపు: ఆధునిక కవిత్వంలో నిరసన – చైతన్య ప్రయోజనం | **తాళ్లపెల్లి నాగలక్ష్మి** | **320** |
| **71** | తెలుగు జానపద సాహిత్యం – సమాజంతో దానికి ఉన్న ప్రాధాన్యత | **యస్. మణికంఠ** | **329** |
| **72** | నగరంలోవాన – జీవిత చిత్రణ | **పరుచూరి విజయలక్ష్మి** | **333** |
| **73** | జానపద కళారూపం – బుడిగె జంగాలు | **ఇ. రాముడు** | **337** |

| | | | |
|---|---|---|---|
| **74** | డిజిటల్ లేదా AI సాహిత్యం – సాంకేతిక యుగంలో కొత్త ప్రక్రియలు, సామాజిక మార్పు | **అద్దంకి చంద్రశాంతి** | **341** |
| **75** | శాంతి నారాయణ: నాగలకట్ట సుద్దులు – సమకాలీన సమాజ ప్రతిఫలనం | **బి పెద్దన్న** | **350** |
| **76** | కందుకూరి 'రాజశేఖర చరిత్రము': సాంఘిక పరిస్థితులు | **డా. పులవర్తి పైడిరాజు** | **354** |
| **77** | తెలుగు సాహిత్యంపై కృత్రిమ మేధ (AI) ప్రభావం: సమగ్ర పరిశీలన | **పి. ఉషారాణి** | **360** |
| **78** | ఆధునిక తెలుగు నాటక కర్తలు: సామాజిక చైతన్యం నుండి రంగస్థల ప్రయోగాల వరకు | **సముద్రాల సమత** | **364** |
| **79** | నవల – సామాజిక జీవిత చిత్రణ – చెరువుగండి నవల ఇతివృత్తం పరిశీలన | **మాచర్ల శ్రీనివాసరావు** | **369** |
| **80** | నానీలు– సామాజిక స్పృహ | **డా. ఎం. పద్మగౌరి** | **373** |
| **81** | పాలేరు పాత్రలు – సమాజ ప్రతిబింబాలు | **డా. వాసిరెడ్డి భవాని** | **378** |
| **82** | వృత్తి కవిత్వం – సామాజిక చైతన్యం | **మదిరాజ్ నరేష్** | **382** |
| **83** | కాళోజి కవిత్వం – ఒక సమాలోచనం | **డా . వి. అరుణ్ కుమార్** | **388** |
| **84** | బండారు ప్రసాద మూర్తి కథలు సామాజిక స్పృహ | **పిడతల రామచంద్రుడు** | **394** |
| **85** | ప్రకృతి అనుబంధం – సాహిత్య ప్రతిబింబం | **డా. కందుకూరి దినేష్ బాబు** | **397** |
| **86** | ఆమె అడవిని జయించింది నవల – సామాజిక జీవన చిత్రణ | **ఎల్లముల మానస** | **401** |
| **87** | జోగులాంబ గద్వాల జిల్లా జానపద గేయాలు – ప్రయోజనం, వైశిష్ట్యం | **టి. వెంకట నర్సింహులు** | **406** |
| **88** | నందిని సిధారెడ్డి 'చిత్రకన్ను' కథ – సామాజిక చిత్రణ | **మున్నూరు వినయ్** | **412** |
| **89** | బి.ఎస్. రాములు "చూపు" నవల – సామాజిక జీవిన చిత్రణ | **డా. తలారి హరిష్ కుమార్** | **415** |
| **90** | ప్రపంచీకరణ – కొలిమి కథలో వడ్రంగుల జీవితం | **గంట అశోక్** | **419** |
| **91** | తెలుగులో పర్యావరణ సాహిత్యం: ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ | **మోటూరి హిమబిందు** | **423** |
| **92** | జూకంటి జగన్నాథం వచన కవిత్వం – సామాజికాంశాల పరిశీలన | **బూర్ల వెంకటేశ్వర్లు** | **431** |
| **93** | జాషువా కవిత్వంలో సామాజిక విప్లవం | **కె. ఎం. సౌందర్యవతి** | **435** |
| **94** | బలివాడ కాంతారావు కథలలో సామాజిక చిత్రణ | **డా. అనిత మార్గరెట్ నేలటూరి** | **439** |
| **95** | ఇనాక్ 'సూర్యుడు తలెత్తాడు' కథ – దళిత అస్థిత్వ కథానాయకుడు 'రావడు' | **డా. రత్నశేఖర్ కట్టెపోగు** | **442** |

| | | | |
|---|---|---|---|
| **96** | కథాసరిత్సాగరంలో జీవన చిత్రణ – సామాజిక ప్రయోజనం" ఉపకోశా కథ ఆధారంగా ఒక పరిశీలన. | **డా. ఆర్. అరుణా దేవి** | **446** |
| **97** | కథలు – సామాజిక ప్రయోజనం, జీవన చిత్రణ | **కంద్లావత్ కుమార్ నాయక్** | **450** |
| **98** | శతక కవి రాములుగారి సాహిత్యంలో – సామాజిక చిత్రణ | **నెమ్మలూరి భవాని** | **454** |
| **99** | 'నేనంటాను' కవితా ఖండికలో దాశరథి సామాజిక చైతన్యం – ఒక పరిశీలన | **అచ్చ రవీందర్** | **459** |
| **100** | ప్రజాచైతన్య దీపిక – తెలుగు గీతిక | **డా. సి. చెన్నకేశవులు** | **463** |
| **101** | నూతన కవితా రూపం 'కైతికాలు' – స్వరూప స్వభావాలు, సామాజిక దృక్పథం: సమగ్ర పరిశీలన | **సందుపట్ల మధు** | **468** |
| **102** | గిరిజనుల జీవన చిత్రణ | **శ్రీ యమ్.శ్రీనివాస ప్రసాద్** | **473** |
| **103** | శ్రీ వేలూరి శివరామ శాస్త్రి జీవిత చరిత్ర – వ్యక్తిత్వ నిర్మాణం – ప్రేరణ | **డా. దాసరి సుశీల్ ప్రత్యూష** | **477** |
| **104** | ఆధునిక సాహిత్యం సాంకేతికత – గ్రామీణ యువత వ్యవసాయం | **డా. పెద్దింటి ముకుందరావు** | **482** |
| **105** | కథానిక సామాజిక ప్రయోజనాలు – జీవన చిత్రణ | **అవ్వోల్ల అనిల్ కుమార్** | **486** |
| **106** | అబ్బూరి ఛాయాదేవి కథలు – సామాజిక దృక్పథం | **డా. గంధం అరుణ** | **491** |
| **107** | గిరిజన సాహిత్యము – ఆధునికత – విశ్లేషణ" | **డా. గౌరారపు శ్రీనివాస్** | **497** |
| **108** | ఆధునిక సాహిత్య ప్రయోజనం: ఆశయాలు – ఆచరణ – సమకాలీన సంక్షోభం | **జి. వీరన్న** | **500** |
| **109** | ఆరుద్ర 'కాటమరాజు కథ' —— నాటకశిల్పం, సామాజిక ప్రయోజనం | **డా. డి. ధాత్రి కుమారి** | **506** |

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# మాలపల్లి సామాజిక చిత్రణ – చైతన్య స్పందన

– ఎన్. నాగలక్ష్మి,
*పరిశోధక విద్యార్థిని,*
*తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,*
*ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.*

**ఉపోద్ఘాతం:**

సృష్టికి ప్రతి సృష్టి చేయగల సామర్థ్యం కలిగిందే సాహిత్యం. మనిషియొక్క జీవితాన్ని ప్రతిబింబింపచేసేది సాహిత్యం. ఆధునిక సాహిత్యంలో నవలా సాహిత్యానికి ఒక విశిష్ట స్థానం ఉంది. ''పెద్దగా చదువుకోకపోయినా, అందరూ చదివి సులభంగా అర్థం చేసుకొని ఆనందించే వచన సాహిత్య ప్రక్రియ నవల.''[1] నవల మనిషి జీవితంలోని ప్రతి అంశాన్ని తెలియజేస్తుంది. దానితోపాటు ఆనాటి సామాజిక పరిస్థితులను యథాతథంగా మనకు చూపిస్తుంది. అంతటి ఉన్నతమైన నవలా సాహిత్యంలో ఒక మైలురాయి 'మాలపల్లి'. 'మాలపల్లి' నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ రచించారు. తెలుగు నవలా సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని, మానవతా దృక్పథాన్ని ప్రతిబింబించిన ప్రముఖ నవల ''మాలపల్లి''.

**కీలక పదాలు:** మాలపల్లి, ఉన్నవలక్ష్మీనారాయణ, సామాజిక జీవితం, కులవ్యవస్థ, అంటరానితనం, పేదరికం, ఆర్థిక దోపిడీ, గ్రామీణ జీవితం, మానవతావాదం, సమానత్వం, సామాజిక చైతన్యం, జాతీయ చైతన్యం.

**పరిచయం:**

స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, స్త్రీ జనోద్ధారకుడిగా పేరు పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన నవల 'మాలపల్లి'. తెలుగు సాహిత్యంలో సామాజిక సమస్యలను, కథా రూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చిన ముఖ్యమైన రచనగా 'మాలపల్లి'కి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా అణగారిన వర్గాల జీవితం, కులవివక్ష, అంటరానితనం, పేదరికం, ఆర్థిక దోపిడీ, మతపరమైన పరిస్థితులు, స్వాతంత్ర్యోద్యమ ప్రభావం వంటి అంశాలు ఈ నవలలో కనిపిస్తాయి.

'మాలపల్లి' అనే పేరు కూడా సామాజికంగా వెనుకబడిన వర్గాల నివాస ప్రాంతాన్ని సూచిస్తుంది. ఈ నేపథ్యాన్ని తీసుకొని రచయిత ఆనాటి గ్రామీణ సమాజంలోని వాస్తవ పరిస్థితులను చిత్రించారు. అందువల్ల ఈ నవల ఒక కుటుంబం లేదా కొంతమంది వ్యక్తుల కథగా మాత్రమే కాకుండా, ఒక కాలం నాటి సామాజిక జీవితానికి ప్రతిబింబంగా నిలిచింది.

ఆ కాలంలో సమాజం కులాల ఆధారంగా విభజించబడి ఉండేది. అణగారిన వర్గాల ప్రజలు ఎన్నోరకాల వివక్షలను ఎదుర్కొనేవారు. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక ఆంక్షలు వారి అభివృద్ధికి అడ్డంకులుగా ఉండేవి. దీనికి తోడు బ్రిటీష్ వారి పాలనలో ప్రజలు బానిసలుగా బతుకుతున్నారు. గాంధీ మార్గంలో ఆయన పిలుపుతో సహాయనిరాకరణలో పాల్గొని అనేకులు స్వరాజ్య ఖైదీలుగా జైలు జీవితం గడిపారు. ఖద్దరును ధరించి గాంధీకి మద్దతునిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో సమానత్వం, మానవత్వం, స్వేచ్ఛ వంటి విలువలను ముందుకు తీసుకురావడం 'మాలపల్లి' నవల ప్రత్యేకత.

'మాలపల్లి' రచన ద్వారా ఉన్నవ లక్ష్మీనారాయణ సామాన్యులు కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేటట్లు చైతన్యపరిచాడు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని భయకంపితం చేసింది 'మాలపల్లి'. అందుకే బ్రిటీష్ ప్రభుత్వం 'మాలపల్లి' నవలను రెండుసార్లు నిషేధించింది. అయినప్పటికి ప్రజల హృదయాలలో నేటికి సజీవంగా నిలిచింది 'మాలపల్లి'.

## ముఖ్యాంశాలు:

'మాలపల్లి' సామాజిక చిత్రణలో ముఖ్యమైన అంశాలు:

### 1. గ్రామీణ సామాజిక జీవిత చిత్రణ:

భారతదేశ సౌభాగ్యానికి పట్టకొమ్మలు గ్రామాలు. 'మాలపల్లి'లో ప్రధానంగా కనిపించేది ఆనాటి గ్రామీణ సామాజిక జీవితం. గ్రామాల్లో ప్రజల జీవనం వ్యవసాయం, కూలిపని, కులవృత్తులు, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడి ఉండేది. గ్రామంలో ప్రతి వర్గానికీ ఒక ప్రత్యేకమైన సామాజిక స్థానం ఉండేది.

అయినప్పటికి అగ్రవర్ణాల ఆధిపత్యం వలన అగ్రవర్ణాలకు ఎక్కువ సామాజిక గౌరవం, అణగారిన వర్గాలకు తక్కువ గౌరవం ఉండే పరిస్థితులను, వాస్తవాలను రచయిత చూపించాడు. గ్రామంలో ఉండే సామాజిక సంబంధాలు, ప్రజల జీవన విధానం, వారి నమ్మకాలు, కష్ట సుఖాలలో పరస్పర సహకార సంబంధాలు మొదలైన వాటిని సహజంగా ఉన్నవగారు చిత్రీకరించారు.

ఈ విధంగా 'మాలపల్లి'లోని మంగళాపురం గ్రామం కేవలం కథకు నేపథ్యం మాత్రమే కాదు. ఆనాటి సమాజాన్ని ప్రతిబింబించే ఒక జీవన వేదికగా కనిపిస్తుంది.

### 2. కులవ్యవస్థ:

'మాలపల్లి'లో అత్యంత ముఖ్యమైన సామాజిక సమస్య కులవ్యవస్థ. తొలివేదకాలంలో ఋగ్వేదంలోని 'పురుష సూక్తం' ప్రకారం చాతుర్వర్ణ వ్యవస్థ బ్రహ్మ (సృష్టికర్త) యొక్క ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, ఉదరం నుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు జన్మించారని చెప్తారు. అసలు సమాజం సజావుగా సాగడానికి పనులను విభజించడానికి వర్ణాలను విభజించారు. కాని కాలక్రమంగా అది వర్ణ వ్యత్యాసానికి, అసమానతలకు దారి తీసింది. క్రమంగా సామాజిక సమస్యగా మారింది.

'మాలపల్లి'లో సమాజంలో అధిక వర్ణాలవారు పంచములను ఎంతో నీచంగా చూసేవారు. కనీసం వారిని మనుషులుగా కూడా గుర్తించేవారు కాదు. మానవత్వాన్ని మరచిపోయి వారిని కొట్టేవారు, తిట్టేవారు, చంపేవారు. అకారణంగా నిందించి అవమానించేవారు. మాలదాసరి అయిన రామదాసు చెల్లెలు సుబ్బలక్ష్మి. మునసబు పనోడు బసివిరెడ్డి కర్రతో ఎలా కొట్టాడో చూడన్నా అని కదుము కట్టిన చెయ్యిని అన్నకి చూపించింది. రామదాసు ఎందుకు కొట్టాడు అంటే ''సుబ్బలక్ష్మి వట్టి అభాండం వేశాడు. నేను గరువులకు పోయి గడ్డికోసుకొని మూటెత్తుకొని సావరాలమీదుగా వస్తూ ఉంటే తానెక్కడినుంచో బూతులు తిట్టుకుంటూ మా చేలన్నీ నీకు మాన్యాలయిపోయినవా అని కర్రతో మూటకిందబడనెట్టి యీ దెబ్బ కొట్టాడు. చేయి యెత్తనీయడం లేదు. అది కాదయ్యా, నేను గరువులకుపోయి గడ్డి దెచ్చుకొంటున్నాను. కావలిస్తే మూట విప్పి చూడండి. వట్టి గరుగాకూ, మదనాకు తప్ప మరేమయినా వుందేమో, ఇట్లాంటి గడ్డి మీచేలో ఒక పోచ చూపించండి. పయటివేళ బోయి వొక్కొక్క పోచ చొప్పున దుక్కులలో పీక్కొని వస్తున్నాను'' అనే వరకు ''దుక్కుల్లో పీకావో, దిక్కులేనివాండ్ల చేలల్లో దొంగిలించావో యెవరు చెప్పగలరు? పొద్దుకూకంగానే మా చేలగట్టులు మీకు రహదారులైనవి. మనిషుంటే గట్టున పోయేది, లేకపోతే కంకీ, కాయా తెంపేది. ఇంకొక తడవ మాచేని గట్టున పోయినావా అంటే నీ గేడికాళ్ళు విరగ్గొడతాను, యెత్తుకో! మూటెత్తుకో, మా కొట్టంలో వేసిపొ''మ్మని రెండోసారి కట్టితో యీడ్చి కొట్టేవరకు వెండిగాజులు రెండూ యెట్లా మెలిదిరిగిపోయినావో చూడు''[2] అంది.

రామదాసు ''మాల మాదిగలంటే అంత చౌక అని బాధపడ్డాడు''.

అలాంటి పరిస్థితులను ఆనాటి కాలంలో పంచములు ఎదుర్కొనేవారు. అణగారిన వర్గాల ప్రజలు కులం కారణంగా ఒక మనిషి మరొక మనిషిని తక్కువగా చూడడం మానవతా విలువలకు విరుద్ధం.

ఈ పరిస్థితిని 'మాలపల్లి' ప్రశ్నిస్తుంది. మనిషి విలువను కులం నిర్ణయించకూడదు. మానవత్వమే అసలైన విలువ అనే భావనను రచయిత ఈ నవలద్వారా మన ముందుకు తెచ్చారు.

### 3. అంటరానితనం:

ఆనాటి సమాజంలో అంటరానితనం ఒక తీవ్రమైన సమస్య. అణగారిన వర్గాల ప్రజలు ఊరిబయట ఉండేవారు. వారి నివాస ప్రాంతాన్ని మాలపల్లి, మాదిగపల్లి అని పిలిచేవారు. వారిని చూస్తేనే పాపంగా, నష్టంగా, శాపంగా ఆనాటి సమాజం భావించేది. వారికి దేవాలయాల, విద్యాలయాల ప్రవేశం ఉండేది కాదు. అన్ని కులాల వారు ఉపయోగించే చెరువులు, బావులు పంచములు వాడుకునే అవకాశం ఉండేది కాదు. వారు పట్టుకున్న వస్తువులను ఉన్నతవర్గాలవారు పట్టుకునేవారు కాదు. పంచముల సహవాసం చేసినా, వారితో కలిసి భోజనం చేసినా, వారిని వెలివేసేవారు. మాలదాసరి అయిన సంగదాసుతో కలిసి రామానాయుడు హోటల్లో మాదిగవాడు వడ్డిస్తుంటే భోజనం చేశాడని ''మునసబు వెలివేయించవలెనని నాలుగు కులాల వాండ్లను పోగు చేస్తున్నాడు.'' [3]

ఇలాంటి సమస్యను వ్యతిరేకతను అంబేద్కర్ ఎదుర్కొన్నాడు. గుర్రం జాషువా పంచముల దుస్థితిని తన గబ్బిలం కావ్యంలో పద్యం ద్వారా ఇలా తెలిపారు....

> ''పామునకుఁబాలు చీమకుఁ బంచదార
> మేపుకొనుచున్న కర్మభూమిన్ జనించు
> ప్రాక్తనంబైన ధర్మదేవతకుఁగూడ
> నులికిపడు జబ్బు గలదు వీఁడున్నచోట''[4]

'మాలపల్లి' నవలలో ఈ సమస్యకు రచయిత స్పష్టంగా ప్రతిబింబించారు. అణగారిన ప్రజల జీవితం, వారి అవమానాలు, సామాజిక పరిమితులు పాఠకులు అర్థం చేసుకునేవాల చూపాడు. అంటరానితనం సమాజాన్ని ప్రభావితం చేసే సమస్య అందువల్ల దీనిని తొలగించి సమానత్వం, సోదరభావం, మానవతా దృక్పథం పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ నవల సూచిస్తుంది.

### 4. పేదరికం మరియు కూలీల జీవితం:

గ్రామీణ సమాజంలో కూలీలు ఎంతో కష్టపడి పనిచేసినా వారికి తగిన ఫలితం, గౌరవం లభించేది కాదు. అధికారుల దోపిడీకి కూలీలు బలయ్యేవారు. శ్రమదోపిడీ జరిగేది. అధికారులు సంపన్నులై కోరింది తింటూ ఎక్కువై పడేస్తుంటే కూలీలు తినడానికి తిండిలేక బాధపడుతున్నారు. సంగదాసు వారి స్థితిని ''అయ్యా చెవులున్నవాళ్ళు వినండి. మా మాల, మాదిగ పల్లెలలో నాలుగు నెలలు పూర్తైన భోజనమంటే జొన్నన్నం, గోంగూరా, కారం — యివి కడుపునిండా తినడం, నాలుగునెలలు అర్ధభోజనం, మిగిలిన రోజులు కటిక ఉపవాసం.'' [5] అని రామానాయుడికి తెలిపాడు.

పేదరికం–విద్య, గౌరవం, అవకాశాలు, సామాజిక స్థానం వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. ఈ పేదరికం అధికారుల దోపిడీని తొలగించి ధనిక, పేద అనేభేదం లేని సమసమాజాన్ని పొందుకోవాలని దానికి అందరూ కృషి చేయాలని 'మాలపల్లి' నవల సమాజాన్ని చైతన్య పరిచింది.

### 5. కుటుంబ జీవితం:

సమాజ సంక్షేమానికి కుటుంబం ముఖ్యం. 'మాలపల్లి' నవల కుటుంబములో పెద్దలను, స్త్రీలను గౌరవించడం, సంప్రదాయాలకు ప్రాధాన్యం, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం వంటి అంశాలు ఆనాటి జీవన విధానాన్ని తెలియజేసింది.

అదే సమయంలో పేదరికం, కులవివక్ష, సామాజిక ఆంక్షలు కుటుంబ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో కూడా తెలిపింది. ఆరోగ్యకరమైన కుటుంబాలను నిర్మించుకోవాలని 'మాలపల్లి' హితబోధ చేసింది.

### 6. స్వాతంత్ర్యోద్యమ ప్రభావం:

'మాలపల్లి' రచనలో ఆనాటి జాతీయోద్యమ వాతావరణం దర్శనమిస్తుంది. భారతదేశంలో స్వాతంత్ర్య భావాలు పెరుగుతున్న కాలంలో ప్రజల్లో దేశభక్తి స్వేచ్ఛాభావం, సామాజిక సంస్కరణల పట్ల ఆసక్తి పెరిగింది.

రాజకీయ స్వాతంత్ర్యంతో సమాజంలోని కులవివక్ష, అంటరానితనం, శ్రమదోపిడీ వంటి సమస్యలు తొలగిపోతాయనే భావాన్ని 'మాలపల్లి' తెలిపింది.

**7. మతం మరియు సామాజిక జీవితం:**

ప్రజల జీవితాలలో మతం, ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు ముఖ్యమైనవి. మత విశ్వాసాలు మనిషిని ప్రభావితం చేస్తాయి. 'మాలపల్లి'లో మతపరమైన అంశాలు సామాజిక జీవితంలో మిళితమై కనిసిస్తాయి. మతం విడిచి మానవత్వం మరియు సోదరభావానికి ప్రాధాన్యం ఇవ్వాలి అనే భావన నవలలో కనిపిస్తుంది.

**8. విద్య:**

సమాజంలో మార్పు రావాలంటే విద్య అవసరం. 'మాలపల్లి'లో ప్రజలు జ్ఞానం కలిగి మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు తొలగి అనారోగ్యం పోయి మానసిక శారీరక ఆత్మీయ ఆరోగ్యం పొందాలంటే విద్య అవసరం అని రచయిత సంగదాసు, రామదాసు, రామానాయుడు వంటి ప్రముఖుల ద్వారా తెలిపాడు. స్త్రీవిద్యను ప్రోత్సహించారు. విజయ కళాశాలల నిర్మాణం చేసి ప్రజలను విద్యావంతులు కావాలని సందేశాన్నిచ్చాడు.

**ముగింపు:**

'మాలపల్లి' ఆనాటి తెలుగు సమాజంలోని పలుకోణాలను ప్రతిబింబించిన ఒక సామాజిక, రాజకీయ నవల. గ్రామీణ జీవితం, కులవ్యవస్థ, అంటరానితనం, పేదరికం, శ్రమదోపిడీ, కుటుంబ జీవనం, మత విశ్వాసాలు, ఆర్థిక స్థితి, విద్య, జాతీయోద్యమ ప్రభావాన్ని ఇందులో చిత్రించబడ్డాయి.

ప్రత్యేకంగా అణగారిన వర్గాల ప్రజల జీవనాన్ని సాహిత్య వస్తువుగా తీసుకొని వారి సమస్యలను సమాజం ముందుంచింది ఈ నవల. కులం, మతం, ఆర్థిక స్థితి వంటి భేదాలను విడిచి మానవత్వం, సమానత్వం, సోదరభావం ముఖ్యమని రచయిత ఈ నవలద్వారా తెలిపాడు.

''మాలపల్లి – సామాజిక చిత్రణ – చైతన్య స్పందన'' అనే అంశంద్వారా మనకు ఆనాటి సమాజపు పరిస్థితులతోపాటు, ఆ సమాజంలో మార్పుకోసం అవసరమైన ఆలోచనలు తెలుస్తాయి. ఈ కారణంగానే తెలుగు సాహిత్యంలో ''మాలపల్లి''కి ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది.

**ఆధార గ్రంథాలు**


1. డా. ద్వానా శాస్త్రి – తెలుగు సాహిత్య చరిత్ర, పుట. 627.
2. ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి, పుట. 22.
3. ఉన్నవ ల క్ష్మీనారాయణ – మాలపల్లి, పుట. 128.
4. గుర్రం జాషువ – గబ్బిలం
5. ఉన్నవ ల క్ష్మీనారాయణ – మాలపల్లి, పుట. 71.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# సుధామూర్తి సాహిత్యం – మహిళా చైతన్యం

– శ్రీమతి పి. శైలజ
తెలుగు సహాయాచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజ్గిరి,
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, తెలంగాణ.

**వ్యాస సంగ్రహం:**

మహిళల జీవితాలను, వారి అంతర్గత సంఘర్షణలను అత్యంత సహజంగా చిత్రించే రచయిత్రిగా సుధామూర్తి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె పాత్రలు కుటుంబ వ్యవస్థను గౌరవిస్తూనే విద్య, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన ద్వారా సాధికారతను సాధిస్తాయి. ఈ వ్యాసం సుధామూర్తి నవలలు, కథలు, బాల సాహిత్యంలో మహిళా పాత్రల నిర్మాణ క్రమాన్ని విశ్లేషిస్తుంది. అలాగే ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా ఆచరణలో సాధికారతకు చేయూతనిచ్చిన తీరును పరిశీలిస్తుంది. సాహిత్యం, జీవితం రెండింటి సమన్వయం ద్వారా సుధామూర్తి భారతీయతకు తగినట్లుగా 'స్త్రీ సాధికారత' నమూనాను ప్రతిపాదించారని ఈ అధ్యయనం నిరూపిస్తుంది.

**కీలక పదాలు:** కుటుంబ వ్యవస్థ, ఆత్మగౌరవం, స్త్రీ పాత్ర చిత్రణ, బాల సాహిత్యం, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గ్రామీణాభివృద్ధి.

## 1. పరిచయం:

ఆధునిక భారతీయ సాహిత్యంలో సుధామూర్తి విశిష్ట స్థానాన్ని ఆక్రమించారు. కన్నడ, ఆంగ్ల భాషల్లో ఆమె రచించిన 300కు పైగా రచనలు అనేక భారతీయ, విదేశీ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆమె సాహిత్యమంతటిలోనూ కనిపించే ప్రధాన అంశం మహిళా చైతన్యం, సాధికారత. సుధామూర్తి కథలు, నవలల ద్వారా మితవాద దృక్పథంతో స్త్రీ సాధికారతను ఆవిష్కరించారు. ఈ వ్యాసం సుధామూర్తి సాహిత్యంలో మహిళా చైతన్యం ఎలా చిత్రితమైందో, ఆమె పాత్రలు సాధికారతను ఎలా సాధించాయో, ఆమె వ్యక్తిగత జీవితం, సేవా కార్యక్రమాల ద్వారా ఈ సైద్ధాంతిక దృక్పథం ఆచరణలో ఎలా ప్రతిబింబించిందో పరిశీలిస్తుంది.

సుధామూర్తి భారతదేశపు తొలి మహిళా ఇంజనీర్లలో ఒకరు కావడం విశేషం. టెల్కో సంస్థ మహిళలను ఇంజనీర్లుగా నియమించని కాలంలో, ఆమె ఆ సంస్థ అధినేత జె.ఆర్.డి. టాటాకు నేరుగా లేఖ రాసి, ఆ వివక్షను సవాలు చేసి ఉద్యోగం సాధించారు. ఈ జీవితానుభవం ఆమె సాహిత్యంలో స్త్రీ పాత్రల చిత్రణకు మూలాధారంగా నిలిచింది. అందుకే ఆమె రచనలను కల్పిత సాహిత్యంగా కాక, జీవితానుభవాల ప్రతిబింబంగా పరిగణించాలి.

## 2. సాహిత్యంలో మహిళా చైతన్యం – సైద్ధాంతిక నేపథ్యం:

మహిళా చైతన్యం అనే భావన స్త్రీలు తమ సామాజిక స్థితిని, హక్కులను, సామర్థ్యాలను గుర్తించి, వాటిని ఆచరణలో పెట్టే ప్రక్రియను సూచిస్తుంది. సాధికారత అనేది చైతన్యానికి కార్యరూపం. విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారాల ద్వారా స్త్రీలు తమ జీవితాలపై నియంత్రణ సాధిస్తారు. పాశ్చాత్య స్త్రీవాద సిద్ధాంతాలు తరచుగా పురుషాధిపత్య వ్యవస్థను ప్రత్యక్షంగా ఎదిరించే ధోరణిని ప్రతిపాదిస్తే, భారతీయ సాహిత్యంలో ఎక్కువగా స్త్రీ సాధికారత అనేది కుటుంబ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించకుండా, దానితో సమన్వయం చేసుకుంటూ స్వీయ గౌరవాన్ని, స్వావలంబనను సాధించే మార్గంగా కనిపిస్తుంది.

సుధామూర్తి సాహిత్యం ఈ రెండో ధోరణికి చక్కటి ఉదాహరణ. ఆమె పాత్రలు కుటుంబ బంధాలను, సంప్రదాయ విలువలను గౌరవిస్తూనే, విద్య, వృత్తి, సామాజిక సేవ ద్వారా తమదైన గుర్తింపును ఏర్పరచుకుంటాయి. ఈ మితవాద స్త్రీవాద దృక్పథం భారతీయ మధ్యతరగతి పాఠకులకు సన్నిహితంగా అనిపించడం వల్లనే ఆమె రచనలు విస్తృత ఆదరణ పొందాయని చెప్పవచ్చు.

### 3. సాధికారత దశలు – సుధామూర్తి పాత్రల నిర్మాణ క్రమం:

సుధామూర్తి పాత్రలను నిశితంగా పరిశీలిస్తే, వాటిలో సాధికారత సాధించే క్రమం మూడు స్పష్టమైన దశలలో కనిపిస్తుంది. మొదటి దశలో కథానాయిక ఒక సంక్షోభాన్ని లేదా అన్యాయాన్ని ఎదుర్కొంటుంది. అది వ్యాధి కావచ్చు, వివక్ష కావచ్చు, లేదా కుటుంబపరమైన ఒత్తిడి కావచ్చు. రెండో దశలో ఆమెకు ఎదురైన సంక్షోభాన్ని తన శక్తిని తెలుసుకోవడానికి ఒక అవకాశంగా మలచుకుంటుంది. ఇక్కడ చదువు, ఆత్మ విశ్వాసం, ఇతరుల మద్దతు కీలక పాత్రలు పోషిస్తాయి. మూడో దశలో ఆమె తనదైన గుర్తింపును, స్వతంత్ర జీవన మార్గాన్ని ఏర్పరచుకుంటుంది. ఈ నిర్మాణ క్రమం దాదాపు అన్ని ప్రధాన నవలలలో కనిపిస్తుంది. దీనిని సుధామూర్తి సాహిత్యానికి ఒక విలక్షణమైన కథన నమూనాగా పరిగణించవచ్చు.

ఈ మూడు దశల నిర్మాణం వలన సాధికారత అనేది ఒక్కసారిగా చేకూరేది కాదని, అది స్వీయ చైతన్యం నుండి ప్రారంభమై, క్రమంగా పరిపక్వత చెందే ఒక ప్రక్రియ అని తెలుస్తుంది. ఇది పాఠకులకు, ముఖ్యంగా యువతులకు, వారి జీవితాలలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ఒక మానసిక బలాన్ని అందించడంలో సాహిత్యం పోషించే పాత్రను స్పష్టం చేస్తుంది.

### 4. నవలా సాహిత్యంలో స్త్రీ సాధికారత చిత్రణ:

సుధామూర్తి గారి నవల 'మహాశ్వేత' మహిళా సాధికారత చిత్రణకు ఒక మంచి ఉదాహరణ. బొల్లి వ్యాధిగ్రస్తురాలైన కథానాయిక సమాజం విధించే వివక్షను, భర్త తిరస్కారాన్ని ఎదుర్కొంటూ, ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నా, చివరికు ధైర్యంతో నలుగురికీ ఆదర్శంగా నిలిచేలా జీవితాన్ని పునర్ నిర్మించుకుంటుంది. భర్త తప్పు తెలుసుకుని తిరిగి రమ్మని ఆహ్వానించినా, తనను అనునిత్యం అవమానాలకు గురిచేసిన ఆ పరిసరాలలోకి తిరిగి వెళ్ళడానికి ఇష్టపడక అతడిని తిరస్కరిస్తుంది. ఇది కథానాయిక ఆత్మగౌరవానికి, స్వతంత్ర నిర్ణయాధికారానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక్కడ సాధికారత అంటే పురుషునిపై ప్రతీకారం తీర్చుకోవడం కాదని, తనకంటూ ఒక గౌరవప్రదమైన జీవితాన్ని నిర్మించుకోవడం అని పై పాత్ర ద్వారా రచయిత్రి స్పష్టం చేసారు.

'డాలర్ కోడలు' నవలలో అమెరికాలో నివసిస్తూ డాలర్లు సంపాదించే కోడలు వల్ల, సంప్రదాయ భారతీయ విలువలతో ఉన్న కోడలు ఎదుర్కొనే మానసిక, సాంస్కృతిక సంఘర్షణ చిత్రితమవుతుంది. ఇక్కడ సాధికారత అనేది భౌతికమైన సంపదతో కాక, తన మూలాలను, విలువలను నిలబెట్టుకుంటూ గుర్తింపు సాధించడంతో ముడిపడి పెట్టారు రచయిత్రి. అదేవిధంగా 'హృదయ సీమ' నవలలో ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీ పాత్రలు తమ కుటుంబ బాధ్యతలను, వృత్తిపరమైన ఆకాంక్షలను సమన్వయం చేసుకునే తీరు కనిపిస్తుంది.

'ఎండిగారి భార్య' నవలలో ఆధునిక యువతి ఆకాంక్షలకు, సాంప్రదాయ కుటుంబ విలువలకు మధ్య జరిగే సంఘర్షణ ప్రధానాంశం. ఈ నవలలో కథానాయిక కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే తన లక్ష్యాన్ని చేరుకునే మార్గాన్ని అన్వేషిస్తుంది. ఇది సాధికారత అంటే 'అన్నీ వదులుకోవడం' కాదని, సమతుల్యతను సాధించడమేనని సూచిస్తుంది. 'ఋణ విముక్తి', 'అన్వేషణ' వంటి నవలలలో కూడా కుటుంబ రహస్యాల అన్వేషణ ద్వారా స్త్రీ పాత్రలు తమ గతాన్ని అర్థం చేసుకుని, వర్తమానంలో స్థిరమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి.

ఇక 'యశస్వి', 'పరిధి' వంటి నవలలలో కూడా వృత్తిపరమైన రంగాలలో స్త్రీలు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని అధిగమించే వ్యూహాలు చిత్రితమవుతాయి. ఈ పాత్రలు తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్నేహితుల మద్దతు, కొన్నిసార్లు అర్థం చేసుకునే జీవిత భాగస్వామి సహకారం వారికి తోడ్పడతాయి. దీని ద్వారా సుధామూర్తి సాధికారతను వ్యక్తిగత పోరాటంగా కాక, సామూహిక సహకారంతో సాధించే లక్ష్యంగా చిత్రించారని అర్థమవుతుంది. దీనిని భారతీయ సామాజిక నిర్మాణానికి తగినట్టుగా ఉండే ఒక సాముదాయిక సాధికారత నమూనాగా చెప్పవచ్చు.

### 5. బాల సాహిత్యంలో బాలికా పాత్రల చిత్రణ:

పురాణేతిహాస కథలలో ఆమె ఎంపిక చేసుకున్న అనేక కథలలో బాలికలు, స్త్రీ పాత్రలు తెలివితేటలు, ధైర్యంతో సమస్యలను పరిష్కరించే విధంగా చిత్రితమయ్యాయి. చిన్నతనం నుండే బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని, నిర్ణయాధికార సామర్థ్యాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ కథలు రూపొందించబడ్డాయని ఆమె రచనా శైలిని పరిశీలిస్తే అర్థమవుతుంది. పట్టు ఎలా పుట్టింది మరిన్ని కథలు, అవ్వ

తాతల కథల సంచీ, అదృశ్యమైన ఆలయం, మరుగునపడిన అద్భుత కథలలోని అమ్మమ్మ పాత్ర జ్ఞానాన్ని, విలువలను ఒక తరం నుండి మరో తరానికి బదిలీ చేసే సంప్రదాయాన్ని పుణికిపుచ్చుకోవడం విశేషం.

ఈ విధంగా బాల సాహిత్యం ద్వారా భవిష్యత్ తరాల బాలికలలో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం సుధామూర్తి సాహిత్యంలో దీర్ఘకాలిక వ్యూహంగా కనిపిస్తుంది. వయోజన సాహిత్యంలో చిత్రించిన సాధికారత భావనలకు ఇది ఒక పునాదిగా నిలుస్తుంది. బాలలో చిన్ననాట నాటిన చైతన్య బీజాలు యుక్తవయస్సులో పరిపూర్ణ సాధికారత సాధించే దిశగా వికసిస్తాయని ఆమె సాహిత్యం సమగ్రంగా పరిశీలిస్తే స్పష్టమవుతుంది.

### 6. కథా సాహిత్యంలో మహిళా చైతన్యం:

సుధామూర్తి కథా సంపుటాలలో మహిళా చైతన్యం మరింత సూటిగా, వైవిధ్యభరితంగా చిత్రించారు. 'అమ్మమ్మ చదువు' కథలో వృద్ధాప్యంలో కూడా విద్యను అభ్యసించే మహిళ పాత్ర, వయస్సు సాధికారతకు అడ్డంకి కాదని నిరూపిస్తుంది. గ్రామీణ నేపథ్యంలో స్వయం సహాయక బృందాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే మహిళల కథలు, సాధికారత అనేది కేవలం పట్టణ, లేదా విద్యావంతులైన మహిళలకే పరిమితం కాదని, గ్రామీణ మహిళలకు కూడా అందుబాటులో ఉంటుందని చూపుతాయి.

ఆమె కథలలోని ఇతివృత్తాలలో సాంప్రదాయ కుటుంబ వ్యవస్థలోని స్త్రీల త్యాగాలను గుర్తించడం, వాటికి గౌరవం ఇవ్వడం మనకు కనిపిస్తుంది. అదే సమయంలో, స్త్రీలు తమ కోసం కూడా జీవించాలని, తమ సామర్థ్యాలను గుర్తించాలని కథలు సున్నితంగా బోధిస్తాయి. ఈ ద్వంద్వ దృక్పథం అంటే సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునిక చైతన్యాన్ని ప్రోత్సహించడం సుధామూర్తి కథా సాహిత్యానికి ఒక ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు.

### 7. మహిళా సాధికారత – ఇన్ఫోసిస్ ఫౌండేషన్ కృషి:

సుధామూర్తి సాహిత్యంలో ప్రతిపాదించిన మహిళా సాధికారత భావనలు ఆమె వ్యక్తిగత జీవితంలో, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలలో కూడా ప్రతిబింబిస్తాయి. మహిళల కోసం స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేయడం, కుట్లు అల్లికలు, జ్యువెలరీ తయారీ వంటి ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాలలో బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి కార్యక్రమాలు సాహిత్యంలో ఆమె ప్రతిపాదించిన ఆదర్శాలకు ఆచరణాత్మక రూపం. ఈ విధంగా సుధామూర్తి సాహిత్యం, జీవితం రెండూ పరస్పర పూరకాలుగా, మహిళా సాధికారత సందేశాన్ని బలోపేతం చేసే విధంగా ఉన్నాయి.

ఈ విధంగా రచయిత్రి జీవితం, ఆమె సృజించిన పాత్రల మధ్య ఉన్న సారూప్యత ఆ రచనలకు ఒక ప్రామాణికతను చేకూరుస్తుంది.

### 8. ముగింపు:

సుధామూర్తి సాహిత్యంలో మహిళా చైతన్యం, సాధికారతలు సున్నితమైన, ఆచరణాత్మక దృక్పథంతో ఆవిష్కృతమవుయ్యాయి. ఆమె పాత్రలు భారతీయ సంప్రదాయాలను ఆదరిస్తూనే విద్య, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన ద్వారా తమదైన గుర్తింపును సాధిస్తాయి. ఈ మితవాద స్త్రీవాద దృక్పథమే ఆమె సాహిత్యాన్ని విస్తృత భారతీయ పాఠకవర్గానికి అత్యంత సన్నిహితంగా చేసింది. ఆమె సాహిత్యంలో ప్రతిపాదించిన విలువలను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా ఆచరణలో పెట్టడం ద్వారా, సుధామూర్తి సాహిత్యం, జీవితం రెండింటిలోనూ మహిళా సాధికారతకు ఒక సమగ్రమైన నమూనాను అందించారని చెప్పవచ్చు. సమకాలీన భారతీయ సమాజంలో మారుతున్న మహిళా పాత్రను అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ దిశానిర్దేశం చేయడానికి ఆమె సాహిత్యం ఒక విలువైన అధ్యయన వస్తువుగా నిలుస్తుందని చెప్పవచ్చు.

### ఆధార గ్రంథాలు:

1. మూర్తి, సుధా. మహాశ్వేత. అనువాదం: జగదీశ్వరి, అలకనంద ప్రచురణలు, విజయవాడ. 2006.
2. మూర్తి, సుధా. డాలర్ కోడలు. అనువాదం: జగదీశ్వరి, అలకనంద ప్రచురణలు, విజయవాడ.2006.
3. మూర్తి, సుధా. ఋణ విముక్తి. అనువాదం: ద్వారకా, అలకనంద ప్రచురణలు, విజయవాడ, 2010.

4. మూర్తి, సుధా. అన్వేషణ. అనువాదం: జగదీశ్వరి, స్వాతి పబ్లికేషన్స్, విజయవాడ, 2001.
5. మూర్తి, సుధా. అమ్మమ్మ చదువు. అనువాదం: ద్వారకా, అలకనంద ప్రచురణలు, విజయవాడ, 2004.
6. కాకర్ల, సుజాత. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథం. తెలుగు అకాడమి, హైదరాబాదు, 2015.
7. Rao, Prema S. Enunciating the Quest of the Indian Society – An Analysis of Sudha Murthy's Novels (Doctoral thesis), Vel Tech Rangarajan Dr. Sagunthala R&D Institute of Science and Technology, 2021.
8. Vijayalakshmi, K. Familiar Relationships in the Works of Sudha Murthy (Doctoral thesis), Annamalai University, 2019.
9. Chandra Vadhana, D. From Victimization to Self-discovery in the Novels of Sudha Murthy (Doctoral thesis), The Gandhigram Rural Institute, 2020.
10. Naikar, Sudha. Fictional World of Sudha Murthy: A Study in Themes and Techniques (Doctoral thesis), Karnatak University, 2022.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# బాహ్య సౌందర్యం – అంతర్గత సామాజిక, తాత్విక దర్శనం – జానపద నిర్మాణ అంశాలు

– పి. శైలజ
తెలుగు అధ్యాపకురాలు
జిడిసి, అమలాపురం
+918985953834

**పరిశోధన పత్ర నేపథ్యం:**

ఆధునిక తెలుగు వచన కవిత్వంలో వస్తు వైవిధ్యంతో పాటు శిల్ప ప్రయోగాల అన్వేషణ నిరంతరం సాగుతూనే ఉంది. కేవలం తాత్విక లేదా వైచారిక ధోరణిలో సాగే సాధారణ వచన నడకకు భిన్నంగా, గ్రామీణ సంస్కృతిని, శ్రామిక బతుకు చిత్రాలను ప్రతిబింబించే జానపద బాణీలను, లాలిపాటల లయను వచన కవిత్వంలోకి అనుసంధానించినప్పుడు ఆ కవిత్వానికి నూతన శక్తి చేకూరుతుంది. ప్రముఖ కవి డా. సుంకర గోపాలయ్య గారి 'నీటి కుండలాంటి మనిషి' కవితా సంపుటిలోని కవితలను పరిశీలిస్తే, బాహ్య సౌందర్యంతో పాటు అంతర్గత సామాజిక, తాత్విక దర్శనం, మరియు ప్రక్రియా సరిహద్దులను చెరిపేసే జానపద శిల్ప నిర్మాణం స్పష్టంగా గోచరిస్తాయి. వచన కవిత్వంలో జానపద గేయ నిర్మాణాన్ని మేళవించి మాతృత్వాన్ని, పర్యావరణాన్ని, క్షీణిస్తున్న మానవ సంబంధాలను, మూలవాసుల అస్తిత్వ పోరాటాన్ని ఆవిష్కరించిన తీరును సమగ్రంగా విశ్లేషించడమే ఈ పరిశోధన పత్ర నేపథ్యం.

**కీలక పదాలు:** వచన కవిత్వం, జానపద నిర్మాణం, లాలిపాటల లయ, మాతృత్వం – అడవి, మానవ సంబంధాల క్షీణత, మూలవాసి అస్తిత్వం, శిల్ప విన్యాసం

**పరిచయం:**

ప్రముఖ కవి డా. సుంకర గోపాలయ్య గారు రాసిన కవితలు కేవలం బాహ్య సౌందర్యంతోనే కాకుండా, అంతర్గతంగా ఎంతో లోతైన సామాజిక, తాత్విక దర్శనంతో సాగాయి. 'నీటి కుండలాంటి మనిషి' పుస్తకంలో చోటు చేసుకున్న "అమ్మ–అడవి", "వేటగత్తె", "కపర కపర చీకటి", మరియు "చెట్టు చెట్టు రాజుకోవాల" అనే కవితలు ఆధునిక కవితా రంగంలో సరికొత్త శిల్ప విన్యాసానికి నిదర్శనంగా నిలుస్తాయి. ఇవి కేవలం వైచారిక ధోరణిలో సాగే వచన కవితలు మాత్రమే కావు; కవిత్వంలో వస్తు శిల్పాల మేళవింపును, సామాజిక అస్తిత్వాన్ని అత్యంత లోతుగా ఆవిష్కరించిన సృజనాత్మక ప్రతిబింబాలు. మానవ సంబంధాల క్షీణతను, పర్యావరణ విధ్వంసాన్ని, మూలవాసుల వేదనను మరియు మాతృత్వపు అనంతమైన ప్రేమానురాగాలను ఈ కవితలు ఒకదానితో ఒకటి అనుసంధానిస్తూ సరికొత్త కవితాత్మక ప్రపంచాన్ని మన ముందు ఆవిష్కరిస్తాయి.

సరిగ్గా గమనించినట్లయితే ఈ వచన కవితల మధ్యలో జానపద లేదా లాలిపాటల వంటి సున్నితమైన గేయ నిర్మాణం రావడం ఈ కవిత్వంలోని ఒక విశిష్టమైన శైలిగా నిలుస్తుంది. సాధారణంగా ఆధునిక వచన కవిత్వం ఒకే రకమైన వచన నడకతో లేదా వైచారిక ధోరణిలో సాగుతుంది. కానీ ఇక్కడ కవి సందర్భానుసారంగా కవితల మధ్యలోకి ఒక మధురమైన పాట లాంటి లయను, జానపద రీతులను తీసుకువచ్చి పాఠకుడిని ఒక కొత్త అనుభూతిలోకి తీసుకెళ్లారు. ఈ శైలి పాఠకుడి మనసుకు కవిత్వ సందేశాన్ని మరింత వేగంగా, గాఢంగా కదిలిస్తుంది.

**వచనంలో గేయ నిర్మాణ శిల్పం – సరిహద్దుల విలీనం:**

వచన కవిత్వం (Free Verse) అనేది ఛందస్సు, లయ, మాత్రల నియమ నిబంధనలకు దూరంగా, కేవలం వస్తువుకు ప్రాధాన్యతనిస్తూ సాగే ప్రక్రియ. దీనికి భిన్నంగా గేయ కవిత్వం లేదా పాట అనేది ఒక నిర్దిష్టమైన లయ, మాత్రా ఛందస్సు లేదా జానపద

బాణీలతో సాగుతుంది. వచన కవిత్వం రాస్తూ, హఠాత్తుగా మధ్యలో గేయ నిర్మాణాన్ని (లాలిపాట లేదా జానపద సంభాషణ శైలిని) చొప్పించడం ద్వారా కవి రెండు వేర్వేరు ప్రక్రియల సరిహద్దులను తుడిచిపెట్టే ప్రయత్నం చేశారు. ఇది శిల్పపరంగా ఒక వినూత్న ప్రయోగం.

ఈ ప్రయోగం కృత్రిమంగా కాకుండా కవితా వస్తువులో నుంచి ఎంతో సహజంగా పుట్టుకొచ్చింది. కవి ఎంచుకున్న వస్తువులు చాలావరకు పల్లెటూరి నేపథ్యం, అమ్మ, అడవి, సముద్రం వంటి ప్రకృతి సిద్ధమైన అంశాలు. జానపద శైలి అనేది పల్లెప్రజల శ్రమలోంచి, ప్రకృతిలోంచి పుట్టినది. అందువల్ల, వచన కవితల మధ్యలో పల్లెటూరి సంభాషణల రూపంలోనో లేదా జోల పాట రూపంలోనో వచ్చే ఈ లయ కవితల ఆత్మకు మరింత బలాన్ని చేకూర్చింది.

**"అమ్మ-అడవి" – మాతృత్వం, శ్రమజీవుల వేదన మరియు ప్రకృతి తాత్వికత:**

"అమ్మ-అడవి" కవిత ఆధునిక తెలుగు కవిత్వంలో మాతృత్వానికి, ప్రకృతికి మధ్య ఉన్న పరస్పర బంధాన్ని అత్యంత అర్ధంగా ఆవిష్కరించిన ఒక విశిష్టమైన రచన. ఈ కవిత కేవలం అమ్మను స్తుతించడానికో లేదా అడవి అందాలను వర్ణించడానికో పరిమితం కాకుండా, స్త్రీ మూర్తి ఓర్పును, జీవకణ సృష్టిని, శ్రమజీవుల బతుకు పోరాటాన్ని ప్రకృతి నేపథ్యంతో ముడిపెడుతూ సాగుతుంది.

కవిత ప్రారంభంలోనే కవి జననానికి, వర్ష ఋతువుకు ఉన్న లోతైన అనుబంధాన్ని ప్రకటిస్తారు:

"తొలకరి చినుకుల్లో పుట్టానని / విత్తనంలా నవ్వుతూ / తాత చెప్పేవాడని"

అంటూ ప్రకృతిలోని సృజనాత్మక ప్రక్రియతో తన పుట్టుకను ముడిపెడతారు. తొలకరి చినుకు పడగానే విత్తనం మొలకెత్తినట్లు, అమ్మ చిరునవ్వు కూడా తన ప్రాణానికి మూలమైందని చెబుతారు. ఇందుకే కవి "వర్ష ఋతువు నా రక్త సంబంధి" అని ఎంతో గాఢంగా ప్రకటిస్తారు. ఈ వాక్యం ద్వారా మానవ రక్తం కేవలం వంశ పారపర్యంగా వచ్చేది మాత్రమే కాదు, అది ప్రకృతిలోని పంచభూతాలతో, ఋతువుల మార్పులతో అనుసంధానమై ఉంటుందనే తాత్విక సత్యాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించారు.

ఈ కవితలోని అత్యంత ప్రధానమైన మరియు ఆకర్షణీయమైన భాగం వచన శైలి నుండి జానపద లాలిపాట రూపంలోకి మారే శిల్ప విన్యాసం. కవి చిన్నప్పుడు అమ్మ ఊయలలో వేసి పాడిన పాటను స్మరించుకుంటూ, వాక్యాలను కవితలో పొందుపరిచిన తీరు అద్భుతం:

"బజ్జోరా నా కన్నా మీ నాయనా దచ్చనాది వెల్లినాడు బజ్జోరా మా చిన్న మీ తాత ఉత్తరాది వెల్లినాడు. ఇంటిలోన బయం లేదు కన్నపేగు కాపలా"

ఈ పాట కేవలం నిద్రపుచ్చే సాధారణ జోలపాట కాదు. ఇందులో నాటి శ్రమజీవుల వలసల వేదన ఉంది. బతుకుదెరువు కోసం నాణ్యమైన కూలీని వెతుక్కుంటూ నాన్న దక్షిణానికి, తాత ఉత్తరానికి వెళ్లిన వలస జీవితాల ఆర్థిక ఇబ్బందులు పరోక్షంగా ధ్వనిస్తాయి. మగదిక్కు లేని ఆ ఒంటరి ఇల్లు చీకట్లో ఉన్నా, భయం లేదంటూ ధైర్యం చెప్పే ఒక తల్లి "కన్నపేగు కాపలా"గా నిలబడటం ఇక్కడ స్త్రీ శక్తికి ప్రతీకగా కనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చే లాలిపాట వాక్యాలు మరింత ప్రశాంతతను, లోతైన జీవిత పాఠాన్ని అందిస్తాయి:

"చెట్టు నిదురోయింది చెట్టు కింద నీడ నిదరోయింది. చిక్కు లేదు, చీకటి రాదు పడుకో మా నాన్నా, బతుకే పోరు బాట"

చెట్టు, దాని కింద నీడ నిద్రపోవడమనేది ప్రకృతిలోని నిశ్శబ్దానికి, రాత్రి వేళ లభించే విశ్రాంతికి సంకేతాలు. అయితే, ఆ నిశ్శబ్దం వెనుక "బతుకే పోరు బాట" అనే కఠిన సత్యాన్ని పసిప్రాయంలోనే బిడ్డ మనసులో అమ్మ ఇంజెక్ట్ చేస్తుంది. జీవితం అంటే పూలబాట కాదు, అదొక నిరంతర సంఘర్షణ అని లాలిపాట రూపంలో బోధించిన అమ్మ ఒక గొప్ప గురువుగా మనకు దర్శనమిస్తుంది.

కవిత ద్వితీయార్ధంలో కవి అమ్మ ముఖాన్ని వర్ణిస్తూ "పొయ్యిగెడ్డ ఎలుతురులో అమ్మముఖంలో/ సూరీడు వెలుగుతున్న ఆనవాళ్లు" అంటారు. ఇక్కడ పొయ్యి వెలుతురు అనేది నిరంతర శ్రమకు, కుటుంబం కోసం ఆమె పడే తపనకు ప్రతీక. ఆ శ్రమలోనే సూర్యుడి వంటి తేజస్సు, నిరంతరం ఇతరుల కోసం త్యాగం చేసే ఉదాత్తత కనిపిస్తుంది. చిట్టచివరి బిడ్డగా ఏడేళు పాలు తాగి పెరిగిన కవి, అమ్మ ముఖంలోకి చూసినప్పుడు మేఘాన్ని చూసినట్లుగా లీలగా గుర్తొస్తుందని చెబుతారు. మేఘం ఎలాగైతే ప్రతిఫలం ఆశించకుండా వర్షాన్ని ఇచ్చి భూమిని తడుపుతుందో, అమ్మ కూడా తన ప్రేమామృతాన్ని బిడ్డలకు అందిస్తుంది.

జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలో, ఎలా ఎదురీనాలో కవి ఎక్కడో విద్యాసంస్థల్లో నేర్చుకోలేదు:

"జీవితంలో కష్టాలను / జుట్టుపట్టి ఆవలికి లాగేయగల విద్య / అమ్మ దగ్గరే నేర్చుకున్నా"

అని సగర్వంగా ప్రకటిస్తారు. ఒక్కోసారి ఆ అమ్మ కష్టాల కడలిని దాటే ఓర్పులో సముద్రమంత విశాలంగా కనిపిస్తుంది.

కవిత ముగింపు చదువరులను సుదీర్ఘమైన ఆలోచనల్లోకి నెడుతుంది. కవి కాలాన్ని, ఋతువులను అమ్మతో పోలుస్తూ:

"అన్ని ఋతువులను / అమ్మలోనే చూసుకున్న / అమ్మకాలంలా సాగుతూనే ఉంది. అమ్మలందరూ అడవులే/ వాళ్ళ మీదనే/ ఋతువులు వెల్లివస్తుంటాయ్"

అమ్మ నిరంతరం మారుతూ, సమయానుకూలంగా ఆదరించే కాలం లాంటిది. చివరి వాక్యంలో "అమ్మలందరూ అడవులే" అనడం ద్వారా కవి ఒక అద్భుతమైన పోలికను తెచ్చారు. అడవి తనపైకి వచ్చే గొడ్డలి దెబ్బలను, ఎండను, వానను భరిస్తూ సమాజానికి ప్రాణవాయువును, పండ్లను, నీడను ఇస్తుంది. అలాగే అమ్మ కూడా సమాజం మరియు కుటుంబం నుండి వచ్చే అన్ని కష్టాలను, విమర్శలను ఓర్చుకుంటూ తన పిల్లలను పచ్చగా పెంచుతుంది. అడవిపై ఋతువులు వచ్చి వెళ్తున్నట్లే, అమ్మల జీవితాలపై కూడా కష్టసుఖాల ఋతువులు వచ్చిపోతుంటాయి, కానీ అడవిలాగే అమ్మ కూడా ఎప్పుడూ తన ఉనికిని, సృజనాత్మకతను కోల్పోదు.

## "కపర కపర చీకటి" – పల్లె జ్ఞాపకాలు మరియు మానవ సంబంధాల క్షీణత

"కపర కపర చీకటి" కవిత ఆధునిక మానవ సంబంధాల క్షీణతను, పల్లెటూరి నేపథ్యాన్ని మరియు చిన్ననాటి జ్ఞాపకాల వెలుగునీడలను అత్యంత ప్రతిభావంతంగా ఆవిష్కరించిన సృజనాత్మక రచన. ఈ కవిత వచన రూపంలో సాగుతూనే, గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే జానపద గీతాల నడకను (పాట లాంటి నిర్మాణాన్ని) సంతరించుకోవడం దీని ప్రత్యేకత.

కవిత ప్రారంభంలో కవి తన చిన్ననాటి పల్లెటూరి జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు:

"ఆరోజు నాకు జ్ఞాపకముంది / గూట్లోనుంచి తొంగిచూసే పికిలిపిట్ట మాదిరి / కలుజుమీద పారేనీళ్లు తల్లి గుండెల మీద పారాడే బిడ్డలెక్కి / ఏట్లో ఎక్కుతున్న చేపలు"

ఇక్కడ పల్లెటూరి పచ్చదనాన్ని, ప్రకృతి నిశ్చలత్వాన్ని కవి ఎంతో అందంగా చిత్రించారు. గూట్లో నుంచి చూసే పికిలిపిట్ట, కలుజు (కాలువ లేదా మదుము) మీద పారే నీళ్లు, ఏట్లో ఎదురెక్కుతున్న చేపలను చూసిన జ్ఞాపకం కవి మనసులో సజీవంగా ఉంది. కాలువ నీటిపై చేపలు ఎగబాకడాన్ని తల్లి గుండెలపై పిల్లలు పారాడటంతో పోల్చడం కవి యొక్క సృజనాత్మకతకు, ప్రకృతిని మాతృత్వంతో ముడిపెట్టే శైలికి అద్భుతమైన ఉదాహరణ.

ఈ కవితలోని ప్రధాన ఆకర్షణ మరియు ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాల్సిన అంశం కవిత మధ్యలో వచ్చే జానపద పాట వంటి నిర్మాణం:

"ఎవరికెవరం ఏమౌతాం ఏటి చేప యాడికెళ్తుందో గేలమేసి గుండె నాకిస్తే పానమేమో పాకమౌతుంది కొడం తెచ్చి మాయ చేసేస్తే చెరువులోకి చేప పోతుందా కపర కపర చీకటవుతుంది ఏటి నీళ్లకు ఎక్కిళ్లు అంటూ పాడిన పాట"

ఈ వాక్యాలు చదువుతుంటే వచన కవితా ధోరణి కాస్తా గ్రామీణ శ్రామిక గీతంగా రూపాంతరం చెందుతుంది. ఈ పాటలో ఒక లోతైన తాత్వికత దాగి ఉంది. "ఎవరికెవరం ఏమౌతాం" అనే ప్రశ్న మానవ సంబంధాల తాత్కాలికత్వాన్ని సూచిస్తుంది. ఏటిలో స్వేచ్ఛగా తిరిగే చేపను పట్టడానికి గేలం వేయడం, "కొడం" (చేపలు పట్టే ఒక రకమైన వెదురు పరికరం) తెచ్చి మాయ చేయడం వంటివి ఈ ప్రాపంచిక బంధాలకు, మోసాలకు ప్రతీకలు. మాయా ప్రపంచంలో చిక్కుకున్న మనిషి జీవితం చివరకు "కపర కపర చీకటి" (కారుచీకటి లేదా గాఢాంధకారం) వైపు సాగుతుందని, ఆ వేదనకు నది నీళ్లకు కూడా ఎక్కిళ్లు వస్తున్నాయని కవి హృద్యంగా వర్ణించారు.

తర్వాత కవిత వర్తమాన సామాజిక వాస్తవికత వైపు మళ్లుతుంది. పూర్వం పల్లెల్లో ఎంతో స్వచ్ఛంగా, ఆత్మీయంగా సాగిన బంధాలు నేడు ఎలా మారిపోయాయో కవి ఆవేదన చెందుతారు:

"చెరువు గుండెను సంద్రం చేసింది / నాయన భుజాన బిడ్డెక్కినట్టు / అలుగు ఎక్కిన నీటి పాదాల సవ్వడి / నీ పాటలాగానే మాయమైంది"

తండ్రి భుజాల మీద బిడ్డ ఎక్కినట్లు చెరువు అలుగు పారే దృశ్యం, ఆ నీటి సవ్వడి, ఆనాటి పల్లెటూరి పాటలు అన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. బంధాల స్థానంలో స్వార్థం పెరిగిపోవడాన్ని కవి ఈ క్రింది వాక్యాలలో ఎండగట్టారు:

"ఇప్పుడు రక్తసంబంధాల మధ్య మైలురాళ్లు చుట్టపు చూపుకొచ్చే కళ్లు లేవు బంధాలకు విలువివ్వని దాయాదులు ఇంటికొచ్చి పలకరించే నోళ్లు గూట్లో చిక్కుకున్నాయ్"

నేటి ఆధునిక కాలంలో ఆత్మీయతలు కరువైపోయాయి. రక్తసంబంధాల మధ్య "మైలురాళ్లు" (దూరాలు) పెరిగిపోయాయి. ఒకరినొకరు ఆదరంగా చూసే కళ్లు, పలకరించే నోళ్లు కరువైపోయాయని, మనుషులు యాంత్రికంగా మారిపోయారని కవి వాపోయారు. కవిత ముగింపు చదువరుల కళ్లను తడిపించేలా ఉంటుంది:

"అమ్మను పలకరించే అన్నదమ్ములు లేరు నన్ను భుజానేసుకు తిరిగిన మేనత్తలేరి కురుస్తున్న వానకు చేతులడ్డం పెట్టి తోడునిలిచిన తోబుట్టువులేది"

చిన్నప్పుడు కష్టాల వాన కురుస్తున్నప్పుడు చేతులు అడ్డం పెట్టి ఆదరించిన తోబుట్టువులు, మేనత్తలు, అమ్మను పలకరించే అన్నదమ్ములు నేడు ఎక్కడ అంటూ కవి వేసిన ప్రశ్న సమాజంలో మారుతున్న బంధాల విలువలపై ఒక పెద్ద నిరసనగా నిలుస్తుంది.

**"వేటగత్తె" మరియు "చెట్టు చెట్టు రాజుకోవాల" – ప్రతిఘటన, అస్తిత్వసామాజిక చైతన్యం**

అలాగే "వేటగత్తె" అనే కవిత సముద్రం, అలలు, మరియు మానవ జీవితంలోని నిరంతర సంఘర్షణల చుట్టూ తిరుగుతుంది. ఇందులో కూడా ఒక అంతర్లీనమైన గేయ శైలి కనిపిస్తుంది. అలల సవ్వడిని పాటతో పోలుస్తూ "అలా సముద్రాన్ని చూస్తూ / ఆమె పాట పాడుతోంది / అలల తప్పెట్ల శబ్దానికి / గొంతు కలుపుతోంది" అని కవి వర్ణించారు. ఇక్కడ సముద్రం అనేది కేవలం నీటి రాశి కాదు, అది అనంతమైన సమాజానికి, జీవితానికి ప్రతీక. ఆ సముద్రపు అలల వేగం, దుఃఖపు మలుపులను కవి ఎంతో లోతుగా విశ్లేషించారు. "పాట పొలికేకగా మారింది" అని అనడం ద్వారా నిశ్శబ్దంగా ఉన్న సమాజం లేదా ఒక వ్యక్తి తన హక్కుల కోసం లేదా అన్యాయంపై తిరగబడినప్పుడు వచ్చే చైతన్యాన్ని కవిత్వంలోకి తెచ్చారు. పీతల కవాతు, ఎదురుచూసే శంఖాలు వంటి ప్రతీకల ద్వారా తీరప్రాంత మానవ జీవితంలోని కష్టాలను, ఆవేదనను కవి ఎంతో ఉదాత్తంగా చిత్రించారు.

చివరగా "చెట్టు చెట్టు రాజుకోవాల" అనే కవిత అడవి మరియు ఆదివాసీల హక్కుల పోరాటం, గ్లోబలైజేషన్ నేపథ్యంలో వారిపై జరుగుతున్న దాడుల తీవ్రతను ఎత్తిచూపే ఒక అద్భుతమైన సామాజిక కవితగా నిలుస్తుంది. గాయపడ్డ అడవి కన్నీటి జలపాతంగా మారడం, తుపాకుల శబ్దాలకు భయపడే వాతావరణాన్ని కవి వర్ణించారు. అడవిలోకి అపరిచితులు లేదా స్వార్థపరులు ప్రవేశించి మూలవాసుల మూలాలను పెకలించివేస్తున్న తీరును ప్రస్తావిస్తూ:

"అడవిలోన / ఆంబోతులు ప్రవేశించే / మూలవాసి / మూలాలు పెకలించే / తల్లివేరు తల్లిడిల్లే / పిల్లవేరు దీపమేమో రెపరెప"

అని ఆవేదన చెందారు. ఇక్కడ ఆంబోతులు అంటే అడవిని దోచుకోవడానికి వచ్చే శక్తులు. వాటి వల్ల అడవి మనుగడ, ఆదివాసీల జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో తల్లివేరు, పిల్లవేరు ప్రతీకల ద్వారా చూపించారు. కవిత ముగింపులో "చెట్టు చెట్టు రాజుకోవాల" అంటూ ఒక విప్లవాత్మకమైన పిలుపునిస్తూ, అడవి మళ్ళీ చైతన్యవంతం కావాలని, ఆదిమ జీవవాసనలు గుప్పుమనాలని కవి బలంగా ఆకాంక్షించారు. ఇది కేవలం పర్యావరణ స్పృహే కాదు, మూలవాసుల అస్తిత్వ పోరాటానికి కవిత్వ రూపంలో ఇచ్చిన మద్దతు.

**ముగింపు:**

డాక్టర్ సుంకర గోపాలయ్య గారి కవిత్వంలో వచన రూపం ఉన్నప్పటికీ, శ్రోతలను లేదా చదువరులను ఆకట్టుకోవడానికి వారు ఎంచుకున్న "వచనంలో గేయ (పాట) శైలి" చాలా అద్భుతంగా పనిచేసింది. అమ్మ లాలిపాటలు, జానపద సంభాషణల శైలిని వచన కవిత్వంలోకి అనుసంధానించడం ద్వారా కవిత్వం క్లిష్టంగా మారకుండా, నేరుగా సామాన్యుడి హృదయానికి హత్తుకునేలా రూపుదిద్దుకుంది. ప్రకృతి, మాతృత్వం, సామాజిక అన్యాయాలపై తిరుగుబాటు, బంధాల క్షీణత అనే అంశాలు ఈ కవితల్లో ప్రధాన వస్తువులుగా నిలిచి పాఠకుడిని నిరంతరం ఆలోచింపజేస్తూ, కవితాత్మకమైన లోతుల్లోకి తీసుకెళ్తాయి. ఆధునిక వచన కవిత్వానికి జానపద నిర్మాణపు లయను జోడించి తెలుగు సాహిత్యంలో సరికొత్త శిల్ప విన్యాసానికి ఈ రచనలు ఆదర్శంగా నిలుస్తాయి.

**ఆధార గ్రంథాలు**


1. నీటి కుండలాంటి మనిషి – డాక్టర్ సుంకర గోపాలయ్య – హోరు ప్రచురణలు
2. తెలుగులో కవిత్వ ఉద్యమాలు – తెలుగు అకాడమీ ప్రచురణ
3. సుంకర గోపాలయ్య కవిత్వం మీద వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలు
4. కవిత్వ నిర్మాణ పద్ధతులు – జి. లక్ష్మీ నరసయ్య
5. కవిత్వభాష–బొల్లోజు బాబా

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


# కులవృత్తి నాగరికతకు ఇనుపరెక్కలు 'ఉసుల్లు'


**– డా. సద్మేక లలిత**

తెలుగు సహాయక ఆచార్యులు.

**తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్.**

**Mobile No. 9652134812**

**Mail. sadmeka.lalitha@gmail.com**


**ఉపోద్ఘాతం:**

ప్రాంతీయత అభివ్యక్తిగా, అస్తిత్వ గొంతుకగా తెలంగాణలో సృజనాత్మక సాహిత్యం కొత్త పుంతలు తొక్కుతున్నది. మాండలిక భాషకు పట్టం కడుతూ నవల, కథ, కవిత్వం వంటి విభిన్న ప్రక్రియలు తెలంగాణ సాహిత్యంలో పరిఢవిల్లుతున్నాయి. తెలంగాణ సామాజిక జీవన చిత్రణ నేపథ్యంగా, కథా సాహిత్యంలో అనేకమంది కథకులు విరివిగా రచనలు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, జీవనశైలి, మానవ సంబంధాల సంఘర్షణలకు ప్రాతినిధ్యం వహిస్తూ, తెలంగాణ భాషకు పరిపుష్టిని కలిగిస్తున్న రచయితల్లో కె.వి నరేందర్ గారి స్థానం ప్రత్యేకం. ఆయన రాసిన కథల్లోని 'ఉసుల్లు ' అనే కథను తెలంగాణ సామాజిక కోణంలో విశ్లేషిస్తూ,పాఠకుల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించిన తీరు ఈ పరిశోధక వ్యాసంలో విశదీకరించాను.

**పరిచయం:**

1967 జూన్ 7న జగిత్యాల జిల్లా, గొల్లపల్లి మండలం చిల్వాకోడూరులో కె.వి నరేందర్ జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు, ప్రవృత్తి రచన వ్యాసంగం. కథ, నవల, కవిత్వం వంటి ప్రక్రియల్లో వైవిధ్యమైన కథాంశాలను ఎన్నుకుని, మాండలిక భాషాపద ప్రయోగాలను సందర్భానుసారంగా ప్రయోగిస్తూ రచనలకు సహజత్వాన్ని చేకూర్చుతారు. మనోగీతం, అమ్మ, బురదలో జాబిల్లి, నాన్న, విభిన్న, ఊరు వంటి కథ సంపుటాలను వెలువరించారు. 'నేను నాయకురాలు నాగమ్మను మాట్లాడుతున్నాను' అని దీర్ఘ కవితను ఆత్మాశయ రీతిలో అద్భుతంగా రాశారు. శిథిల స్వర్గం, బర్రె అనే నవలలను రాశారు. బర్రె నవల, తెలుగు నవలా సాహిత్యంలో ఒక విలక్షణమైన ప్రయోగంగా కె.వి నరేందర్ గారికి మంచి గుర్తింపును తీసుకువచ్చింది. బర్రెను ప్రధాన పాత్రలో తీసుకుని, అలిగరి కథన పద్ధతిలో, వ్యంగ్యం ధ్వనించేలా, సమాజంలోని రుగ్మతలపై అస్త్రం సంధించారు. ఈ నవలకు 2015 లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉత్తమ నవలా రచయిత పురస్కారాన్ని ప్రదానం చేసింది. కె.వి నరేందర్ 100 కి పైగా కథలను రాశారు. ఆ కథల్లో విశిష్టమైన 101 కథలను 'కథమానం భవతి' పేరుతో ఒక సంకలనంగా తీసుకొచ్చారు. స్థానికతకు ప్రాధాన్యాన్ని ఇస్తూ, సార్వజనీన ఆమోదయోగ్య లక్షణాలున్న వీరి కథలు తమిళ, హిందీ భాషల్లోకి అనువదించబడ్డాయి. వీరి కథల్లో ఎక్కువగా సింగిల్ కాన్సెప్ట్ ( ఒకే కథాంశం)తో రాసిన కథలు వైవిధ్యాన్ని సంతరించుకున్నాయి. ఒకే ఇతివృత్తానికి దగ్గరగా ఉన్న కథలన్నింటినీ ఒక సంపుటిగా మలిచిన తీరు విలక్షణమైన ప్రయోగమని చెప్పవచ్చు. వీరి కథలు తెలంగాణ మాజానికి అద్దం పడతాయి. ప్రపంచీకరణ, తెలంగాణ గ్రామీణ జీవితం, దోపిడీ వ్యవస్థ, మానవ సంబంధాల చిత్రణను, సరళమైన, సంభాషణాత్మక శైలిలో అభివ్యక్తీకరిస్తారు.

ఊరు కథాసంపుటి కె .వి. నరేందర్ గారి సాహిత్య ప్రస్థానంలో ఒక మైలురాయి. ఈ కథ సంపుటిలో మొత్తం 14 కథలు ఉన్నాయి. తెలంగాణ పల్లెలు విధ్వంసానికి గురి అవుతున్న తీరు, గ్రామాల్లో మారుతున్న మానవీయ సంబంధాలు, సామాజిక వ్యవస్థలు తలకిందులవుతున్న వైనాలు ఈ కథల్లో కనిపిస్తాయి. ఈ కథల్లో తెలంగాణ పల్లెల్లోని వివిధ పార్శ్వాలు ఆవిష్కరించబడతాయి. ఈ కథాసంపుటిలో 'ఉసుల్లు' అనే కథను రచయిత కె.వి నరేందర్ చిత్రించిన తీరు పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. గ్రామీణ పల్లెలు కులవృత్తుల సమాహారం. ఆయా కులవృత్తులను చిత్రిస్తూనే,మారిన సమాజ పరిణామ క్రమాన్ని ఆవిష్కరించారు. రాజవ్వ 14 ఏళ్ల

వయసులో ఉన్నప్పుడు కథ ప్రారంభమవుతుంది. అప్పటినుంచి ఆమె వివాహం జరిగిన తర్వాత, సమాజంలో చోటు చేసుకున్న మార్పుల్ని, రచయిత ఒడిసి పట్టుకుని, కథలో అద్భుతంగా మలిచారు. సాకలి, బెస్త, యాదవ, గౌడ, మంగలి కుల వృత్తుల నేపథ్యాన్ని చిత్రిస్తూ, సందర్భానుసారంగా ఆయా వృత్తుల పాత్రలను కథలో చొప్పించి, ఆయా కులవృత్తుల మాండలికాలకు ప్రాణం పోశారు. పాత్రలు తమ కుల వృత్తులకు సంబంధించిన పదాలను ప్రయోగిస్తూ, పాత్రోచిత భాషలో సంభాషించిన విధానం చూస్తే, కె.వి నరేందర్ గారు పల్లె జీవితంతో ముడి వేసుకున్న అనుభవైకవేద్య జీవితానికి ప్రతిఫలనమే ఈ రచనా సృష్టి అనిపిస్తుంది.

సాకలి లింగవ్వ బిడ్డ రాజవ్వ, ఇద్దరూ కలిసి ఊర్ల, దొర గారి ఇంట్లో బట్టలు ఉతికి, సంవత్సరానికి ఒకసారి వాళ్ళు ఇచ్చే జీతం తీసుకుంటూ బతుకును వెళ్ళదీసుకునే కుటుంబం. తెలంగాణ పల్లెల్లో ఆనాటి సమాజంలో ప్రజలు కుల వృత్తులు చేసుకుంటూ ఒకరిపై ఒకరు ఆధారపడి జీవనం సాగించేవారు. వస్తుమార్పిడి పద్ధతి అమల్లో ఉండేది. ఆ జీవన విధానాన్ని ఈ కథలో రచయిత చిత్రించారు. దొరలు, గడీల వ్యవస్థ కొనసాగుతున్న కాలాన్ని రచయిత కథలో సూచించారు. దొరలు దొరసానుల దౌర్జన్యం,నిమ్న కులస్తులను అవమానించడం, తక్కువగా చూడడం వంటి అంశాలు ఈ కథలో చిత్రించబడ్డాయి. లింగవ్వ, రాజవ్వలు చాకిరేవు దగ్గర దొరసాని బట్టలుతికి, ఇంటికి తీసుకుని వెళ్లిన సందర్భంలో, దొరసాని ఇంట్లో ఉన్న ఉసుల్లను, వాళ్ళు ఎవరు తినరని వాటిని లింగవ్వకు పెడుతుంది. బయటికి వచ్చినంక వాటిని చూసి బిడ్డ రాజవ్వ "ఉసూల్లంటే ఆ పురుగులు కాదు.. మనమే.. అవి వెల్తురు దగ్గరికి పోయినట్టు మనం కుల కషిపితొని పెద్దోళ్ల ఇండలల్లకుపోతం మన రెక్కలూసిపోతాయి. వాళ్ళు మనన్ని గోలిచ్చుకుని బుక్కుతరు." (పుట. 35. ఉసుల్లు కథ, ఊరు కథా సంపుటి) అంటూ ఎంతో లోతుగా ఆలోచించి సమాజం తీరుని చెబుతుంది. ఆనాటి సమాజం పొట్టకూటికై చేసే వృత్తిని బట్టి కులాన్ని ఆపాదించి సంకెళ్ళు వేసి అగ్రకులస్తుల ఇండ్లల్లనే బతుకును బంధి చేసినై. కాలం మారకపోతాధా మనం వాళ్ళలాగా బతికేరోజులు రాకపోతాయ అంటూ రాజవ్వ పాత్ర చేత ఎంతో ప్రతీకాత్మకంగా రచయిత చేపించిన తీరు బాగుంది. రాజవ్వ పాత్ర వయసు పరిడి దృష్ట్యా అంతటి ఆలోచన శక్తి కలిగి ఉండడం కొంత అసహజమైన పాత్ర చిత్రణ లాగా అనిపిస్తుంది. సామాజిక అనుభవాల దృష్ట్యా చూస్తే పాత్ర పరిధి వయసుతో సంబంధం ఉండక పోవచ్చెమోనని కూడా అనిపిస్తుంది. కాల గమనంలో సమాజంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. రాజవ్వకు మస్కట్ లో బాగా సంపాధించి వచ్చిన శంకర్ తో వివాహం అవుతుంది. నక్సలైట్ల భయంతో దొరలు గడీలను వదిలిపెట్టి పట్నం బాట పట్టడం అక్కడ దొరసాని లాండ్రీ షాప్ పెట్టుకోవడం, దొరసాని కోడలు బ్యూటీపార్లర్ పెట్టుకోవడం అక్కడకి రాజవ్వ వచ్చి వెనకటి రోజులను గుర్తు చేసుకుంటూ కుల వృత్తుల రూపం మారిన తీరుని గమనిస్తూ ఉసుల్లకు ఇనుప రెక్కలు వస్తున్నాయి. పెత్తరీగల రెక్కలు ఊసిపోతున్నాయంటూ రాజవ్వ మనసులోని మాటలని రచయిత ప్రతీకాత్మకంగా చెప్పించిన వాక్యంతో రచయిత కథని ముగించిన ఎత్తుగడ బాగుంది.

ఈ కథలో సంపదకి మూలమైన శ్రామిక జీవులకు సరైన విలువ, గౌరవం లేకుండా ఉన్న సమాజాన్ని ఆవిష్కరించి కాలానుగమనంలో శ్రామిక జీవులక జీవితాలు మెరుగై సామాజిక విలువలు తారుమారైన విధానాన్ని రచయిత ప్రతిబింబించారు. కుల వృత్తులు రూపం మార్చుకుని లాభసాటి వ్యాపరంగా మారే సరికి అగ్రకులాల వాళ్ళు ఆయా వృత్తుల్ని చెప్పట్టిన వైనాన్ని ఈ కథలో అంతర్లీనంగా రచయిత ప్రస్తావించారు. కె. వి. నరేందర్ ఈ ఒక్క కథలోనే ఎన్నో కోణాలని ఆవిష్కరించి ఆనాటి తెలంగాణ సమాజాన్ని అత్యంత వాస్తవికంగా పాఠకుడు దర్శించగలిగేటట్టు అనుభూతిని కలిగించారు.

ఆయిటి పూనింది (వాన కాలం ప్రారంభమైంది), మొగులు (ఆకాశం), కొప్పెర (వర్షానికి తలపై వేసుకునే సంచి), అరణం (కట్నం), తపేల (పళ్ళెం) వంటి తెలంగాణ మాండలిక పదాలను కథకు జోడించడం వల్ల కథ సామాజిక వాతావరణంలో పాఠకుడిని తాదాత్మ్యం చెందించే శిల్ప నైపుణ్యాన్ని రచయిత సాదించారు. ఈ కథను సర్వసాక్షి దృష్టి కోణంలో నడిపించారు. ఆయా కుల వృత్తుల్లోని సాంస్కృతిక, వృత్తి మాండలిక పదాలను రచయిత కెవి. నరేందర్ ఎంతో ఒడుపుగా ప్రయోగించిన తీరు బాగుంది. కుల వృత్తులన్నింటికి ప్రాతినిధ్యం వహించే పాత్రలతో సంభాషిస్తున్నపుడు వారి సంస్కృతిలోని మాండలిక పదాలను ప్రయోగించి భావోద్వేగాలను పాత్రలచేత పలికించాడు.

యాదవ కులసతుడైన రాయమల్లు గొర్రెలను, రాజవ్వ అదిలిస్తూ కోపంతో పరచికాలు ఆడుతూ వ్యంగ్యంగా తిట్టినప్పుడు రాయమల్లు "నిన్ను కాటమయ్యకాడ బొంద వెట్ట" (పుట. 30. ఉసుల్లు కథ, ఊరు కథా సంపుటి) అని కోపంగా అంటాడు. తెలంగాణ

గ్రామీణ సమాజంలో ఎలాంటి భావోద్వేగానైనా ఔచిత్యమంతంగా పాత్రల ద్వారా చెప్పించారు. యాదవకులస్థులకు పశు సంపదను రక్షించే దైవం కాటమయ్య. కాబట్టే రాయమల్లులో వచ్చిన కోపాన్ని కూడా రచయిత , తన కుల సంస్కృతిలోనే వ్యక్తీకరించాడు.

సమాజంలో ఒక వృత్తిని నమ్ముకుని జీవించేవాళ్ళు అంటే ఎంత చులకన భావం ఉండేదో దొరసాని మాటల్లో వ్యక్తమవుతుంది. సాకలి లింగవ్వ, మంగలి అంజవ్వలతో "ఏమన్నా మాలెక్క దొరసాన్ల.. అది నిల్లాటలు జేయ్యాల్నాయే ఇది మైల బట్టులుతుకుడేనాయే. నీచాపు కులంలో పుడితే గా పనులు కాక ఇంకేంజేత్తరే.. ఒకతి తల్వాల బియ్యమంటుంది.. ఒకతి మైలపోలు వాడ్లు అంటుంది. (పుట. 32. ఉసుల్లు కథ, ఊరు కథా సంపుటి) దొరసాని కులాన్ని బట్టి పనులని లింగవ్వ, అంజవ్వలని మాటలతో దూషిస్తుంది. ఆనాటి సమాజంలోని కుల వ్యవస్థ తీరు తెన్నులను రచయిత విశ్లేషించాడు. పుట్టుక నుంచి చావు వరకు అయ్యే తంతుల్లో కుల వృత్తుల ప్రాధాన్యతను వివరిస్తూ అగ్ర కులాల వాళ్ళు చేసే శారీరక, మానసిక దోపిడిని రచయిత సరికొత్త కోణంలో ఆవిష్కరించారు. సామాజిక పరిణామ క్రమంలో వచ్చిన మార్పుల్ని చూస్తూ రాజవ్వ 'చిన్న కులపోల్లు చేస్తే ఒక రేటు, అదే పని వీళ్ళు చేస్తే ఒక రేటు' ఒకప్పుడు మేము చేసే వృత్తులని బట్టి మేము తక్కువ కులస్తులం అని అవమానించిన సమాజం ఇప్పుడు అవే వృత్తులను చాలా హుందాగా చేస్తుంది. అంటే సమాజంలో గౌరవం విలువ మర్యాదల్లో హెచ్చు తగ్గులు కులాన్ని బట్టి కాదని డబ్బుని బట్టి మారతాయని రచయిత ముగింపులో సూచించారు.

**ముగింపు:**

కెవి. నరేందర్ ఉసుల్లు అనే కథలో కుల వృత్తులు విధ్వంసమై ఆయా కుల వృత్తుల వాళ్ళు సమాజంలో గౌరవ మర్యాదల కొరకు వేరే జీవనోపాధిని కల్పించుకుంటున్న తీరుని ఇందులో తెలియజేశారు. కుల వృత్తులలో వస్తున్న నూతన పోకడలను అందుకోవడంలో ఆర్థిక వెనుకబాటు తనం, డబ్బున్న వాళ్ళు వారి కులవృత్తులను చెప్పటి చివరికి వారి వృత్తికి వారినే దూరం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ కులవృత్తుల్లో సామాజిక స్పృహని కలిగించారు.

**ఆధార గ్రంథాలు:**

1. నరేందర్, కె. వి. ఊరు కథా సంపుటి, ప్రథమ ముద్రణ జనవరి 2005, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.
2. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం ,ప్రథమ ముద్రణ (జనవరి,1995), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# మనసున్న 'రామక్క'

– డా. బండారి ప్రేమ్ కుమార్
సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ.
తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల, హైదరాబాద్.
9492788752
bandari.premkumar2014@gmail.com

**ఉపోద్ఘాతం:**

తెలుగు సాహిత్యం చాలా విస్తృతమైనది. విభిన్న ప్రక్రియలను ఎప్పటికప్పుడు మారుతున్న సమాజానికి, పాఠకులకు అనుగుణంగా సృష్టించుకుని, తెలుగు సాహిత్యాన్ని పరిడవిల్లేలా చేస్తుంది. ఆయా ప్రక్రియల్లో విభిన్నమైన వస్తువులు సామాజిక అవసరాల దృష్ట్యా, సామాజిక అవగాహనకై ఇంకా అనుకుంకాలుగా సృజించబడుతున్నాయి. వివిధ దేశాల నుంచి మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి అనే పేరిట మానవీయ విలువలు విధ్వంసం అవుతున్న తీరు సంస్కృతి, ప్రకృతి వనరులు వినాశనం, సులభ ధనార్జనతో పేరుకుపోతున్న స్వార్థం, మానవుడి మనుగడకే ముప్పు వాటిల్లుతుందనే స్పృహతో రచయితలు తమ కలానికి పదులు పెడుతున్నారు. వస్తువు, సంస్కృతి, మేధస్సు అన్నింటిని ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి అన్నింటిని వ్యాపార ధోరణిలోకి మార్చుకునే ప్రపంచీకరణ విషయ వలయంలో సమాజం కొట్టుమిట్టాడుతుంది. ఇటువంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న సమాజానికి చైతన్యం కలిగించడానికి ప్రపంచీకరణ పెను సవాళ్లను, దాని దుష్ప్రభావాలను నవల, నాటకం, కవిత్వం, వ్యాసం, కథ వంటి ప్రక్రియల్లో సామాజిక బాధ్యత కలిగిన రచయితలెందరో చిత్రిస్తున్నారు. ప్రపంచీకరణ ప్రభావాన్ని పట్టణాలతో పాటు పల్లె ప్రాంతాలు పరాయీకరణ చెందుతున్న తీరు చూసి తట్టుకోలేక ఆవేదనతో ఉద్వేగంతో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా చేసుకుని రచనలు చేస్తున్నారు. సమాజంలో మానవతా విలువలు పెంపొందించే దిశగా సమసమాజ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తున్న రచయితగా జాజుల గౌరి సాహిత్య ప్రస్తానం వైవిధ్యభరితం.

**కీలక పదాలు:** మానవీయ విలువలు, పర్యావరణ విధ్వంసం, ప్రపంచీకరణ, ప్రతీకాత్మక శైలి, మాండలికం.

**పరిచయం:**

కథ, నవల వంటి సృజనాత్మక ప్రక్రియల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న జాజుల గౌరి దళిత జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలు, సమాజాన్ని నిశితంగా పరిశీలించే దృష్టి కోణంలో సమాజంలోని అసమానతలు, గ్రామీణ ప్రాంతాల్లోని జీవనశైలి ఆమె రచనలకు కథా వస్తువులయ్యాయి. తెలంగాణ మాండలిక భాషా, పద ప్రయోగాలు వీరి రచనలకు మరింత వన్నె తెచ్చాయి.

1969 మార్చి2 సికింద్రాబాద్ దగ్గరలోని లోతుకుంట జాజులబాయి గడ్డపై లక్ష్మమ్మ మల్లయ్య దంపతుల ఇంట్లో జన్మించారు వీరిది వ్యవసాయక కుటుంబం. తండ్రి వ్యవసాయ పనులు లేని సమయంలో ఉప్పరి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. పేద కుటుంబం అందులో దళితులకు అక్షరం ఆమడ దూరం అనే సమాజంలో పుట్టింది. సమాజంలో వివక్ష అసమానతలు ఒక చదువు ద్వారా మాత్రమే రూపుమాపవచ్చు అనే సంకల్పంతో అక్షరాన్ని ప్రేరేపించి అత్యున్నత స్థాయిలో జర్నలిస్టుగా, రచయిత్రిగా, న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, ప్రకృతి ప్రేమికురాలిగా, మానవ వనరుల అభివృద్ధి, ప్రకృతి వనరుల నిర్వహణ, మహిళ సాధికారికతకై అనేక సేవా సంస్థల్లో పని చేస్తున్న ఆమె వ్యక్తిత్వం ఆమె ఎదిగిన తీరు ఎందరికో స్పూర్తిదాయకం.

జాజుల గౌరీ సాహితీ ప్రస్థానంలో ఆమె కథలకు ఒక విశిష్టమైన గుర్తింపు ఉంది. ఆమె కథలు బాల్యస్మృతులను తడుముతాయి. ప్రకృతి విధ్వంసం అవుతున్న తీర్పుపై ఆక్రోశంతో ప్రశ్నిస్తాయి. పురుషాధిపత్య సమాజాన్ని నిలదీస్తాయి. స్త్రీల దృక్కోణాన్ని ఆవిష్కరిస్తాయి. స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించేందుకు సంఘర్షణకు గురిచేస్తాయి. వీరి కథలన్నీ ప్రధానంగా తెలంగాణ యాసల అభివ్యక్తికరించబడ్డాయి

తెలంగాణ యాసలో జాజుల గౌరీ రచనా శైలికి ఒక ప్రత్యేక వొరవడిని తెచ్చిపెట్టింది ఇటువంటి కథల్లో కలికితురాయిలా నిలిచిపోయే కథ రామక్క. జాజుల గౌరి మన్ను బువ్వ, చెట్టునీడ, అబ్బో బంగారు సాయ ఓ లలనా.. కథా సంపుటాలను రచించారు. చెట్టు నీడ అనే కథా సంపుటిలో మొత్తం 20 కథలు ఉన్నాయి. అందులో స్త్రీని కథానాయికగా చేసి స్త్రీ విశాల దృక్పథాన్ని, నిస్వార్థ వైఖరిని, సమాజ హితం కోసం చేసే పోరాట స్ఫూర్తిని, పరిణామ క్రమంలో మౌన పోరాటం ధిక్కారస్వరంగా మారిన వైనాన్ని రచయిత్రి జాజుల గౌరి రామక్క కథలో రామక్క పాత్ర ద్వారా ఆవిష్కరించారు.

**విషయ విశ్లేషణ:**

గ్రామీణ ప్రాంతాల్లో నీటి కరువు సంభవించినప్పుడు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను, రెండు తరాలను చూస్తున్నామంటూ కథను ప్రారంబించారు. సమాజ పరిణామాన్ని విశ్లేషించుకుంటే ఏదో ఒక రూపంలో విధ్వంసం జరిగి రామక్క చూసిన సమాజానికి తన మనవరాలు ఎదుగుతున్న సమాజానికి ఎన్నో మార్పులు సంభవించాయి. ఊహించనంత దూరంగా సమాజపు పోకడలు వికృత రూపం ధరిస్తున్నాయి. మానవుని తప్పిదాల వల్ల ప్రకృతి వనరులు విధ్వంసం అయ్యి నీళ్ల కోసం అల్లాడే పరిస్థితులు చూస్తానని రామక్క అనుకోలేదు. స్కూల్లో బోర్లు వేస్తే ఎక్కడా మంచినీళ్లు పడని పరిస్థితి, ఒకవేళ నీళ్లు పడ్డా అవి ఉప్పు నీళ్లు తాగడానికి పనికిరాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పర్యవేక్షణలో రామక్క ఇంట్ల మంచినీళ్ల ఊటపడిందని తెలియగానే ఆ వార్త ఊరంతా పాకింది. గ్రామపంచాయతీ దగ్గర సర్పంచ్ శకుంతల సమక్షంలో ఊర్ల పెద్దలందరూ సమావేశమై నీళ్లను ఊరి జనానికి పంచాలని రామక్కని అడిగేసరికి సమస్య మొదలవుతుంది. రామక్క కొడుకు సత్యనారాయణ, కోడలు లక్ష్మి నీళ్లను ఉచితంగా ఇవ్వమని, అమ్ముకుంటామని అంటారు. రామక్క పెద్ద మనసుతో ఆలోచించి ఊరి దాహాన్ని తీర్చమని అడుగుతారు. రామక్క అటు కన్న కొడుకు, ఇటు తల్లి లాంటి ఊరి మాట ఇద్దరి మధ్య నలిగిపోయి ఊరి భాగు కోసం ఇంట్లో మౌనంగా నిరాహార దీక్ష చేస్తుంది. అది చూసి తట్టుకోలేక కొడుక్కి ఇష్టం లేకపోయినా తల్లి రామక్క కోసం నీళ్లను గ్రామ ప్రజలందరికి ఇవ్వడానికి ఒప్పుకుంటాడు. రామక్క ఊరి కోసం పోరాడి గెలిచింది.

ప్రపంచీకరణ కుట్రలో భాగంగా సహజ వనరులు నాశనమై, పల్లె సంస్కృతి విధ్వంసమై, డబ్బు వ్యామోహంలో పడి స్వార్థపూరితమైన మానవుని నైజాన్ని రామక్క కథలో కొడుకు సత్యనారాయణ, కోడలు లక్ష్మి పాత్రల్లో రచయిత్రి ఆవిష్కరించింది.

"పెద్ద పెద్ద కంపెనీలోల్లు గింత ప్యాకెట్ నీళ్లనే రెండు రూపాయలకు అమ్ముకుంటుండ్రు. ఊరికి ఊర్కనే నీల్లిస్తే మనకెమొస్తదే. పాపపుణ్యాల గురించి ఇయ్యాల రేపు ఎవడు ఆలోచిస్తుండు " (పుట.22 రామక్క కథ, చెట్టునీడ కథా సంపుటి) ప్రపంచీకరణ పెనుమార్పుల దాటి తెలుసుకోలేని సత్యనారాయణ ఎక్కడో బయటి ప్రపంచాల వ్యాపారలన్నీ వంట పట్టించుకుని, తాను ఒక్కడు అభివృద్ధి చెందితే చాలని డబ్బు సంపాదించాలని అనుకుంటాడు. తన గ్రామీణ పల్లె మూలాలను మరిచి, మంచినీళ్లు కూడా అమ్ముకుని సొమ్ము చేసుకుందామనే స్థాయికి అతని వ్యక్తిత్వం దిగజారుతుంది. పల్లెలు అనురాగ ఆప్యాయతలకు, బంధాలకు ఆలావాలం. కానీ పల్లెలు కూడా విచ్చిన్నమై, మనుషుల మధ్య దూరం పెరిగిపోయి, స్వార్థమే రాజ్యమేలుతున్న విషసంస్కృతి ప్రస్తుత సమాజంలో కనిపిస్తుంది.

రామక్క మాత్రం ఊరి బాగుకోసం కొడుకు సత్యనారాయణతో మాట్లాడటం మానేసి, నిద్రాహారాలు వదిలి, పరిస్థితిని బట్టి సత్యనారాయణను గట్టిగా నిలదీసి, ఊరి పక్షాన నిలిచిన ఆమె వ్యక్తిత్వం ఎంతో ఉదాత్తం. రామక్క తరంల ప్రకృతి వనరులను అందరూ ఉచితంగా వాడుకోవటమే చూసింది. కానీ తర్వాత తరాలలో వచ్చిన మార్పు, నీళ్ళ కరువు వచ్చి నీళ్ళని అమ్ముకోవడం అందునా కొడుకు సత్యనారాయణ దానికి ఆజ్యం పోయడం చూసి తట్టుకోలేకపోయింది. కొడుకులో మానవత్వం లేకుండా మారుతున్న తీరును చూసి మందలిస్తుంది.

"నోర్ముయ్ నీ అయ్య రూపమే నీకు తెల్వదు, నువ్వు ఎట్ల పెరిగినవ్ రా నాయింట్ల ఊరికి నీళ్ళు యియ్యి అంతే." (పుట. 22 రామక్క కథ, చెట్టునీడ కథా సంపుటి)

కొడుకు సత్యనారాయణ చిన్నప్పుడే, భర్త చనిపోతే రామక్క ఊరిలో కలివిడిగా ఉంటూ లౌక్యంతో కొడుకుని ప్రయోజకున్ని చేసింది. ఎవరు లేని రోజున ఊరే తనకి అండగా నిలిచింది. ఈ రోజు కొడుకు తీరుతో రామక్కలో కోపం కట్టలు తెంచుకుంది. కొడుకుని ఎదిరించి, ఊరికి నీళ్ళు ఇవ్వమని ఆజ్ఞాపిస్తుంది. ఎంత అభివృద్ధి చెందినా మన మూలాలు మర్చిపోవద్దని, నలుగురితో కలసి మెలసి జీవిస్తూ ఒకరికొకరు సహాయం అందించుకోవటంలోనే సమాజ పురోగతి దాగి ఉందనే సత్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది.

**శిల్పం:**

ఈ కథ ఊరి నీటి సమస్యగా ప్రారంభమై, తాత్కాలికంగా ఊరిలో నీటి సమస్య తీరడంతో ముగిసినట్లుగా పైకి కనిపిస్తుంది. ఈ ఒక్క కథలోనే రచయిత్రి ఎన్నో కోణాల్ని ఆవిష్కరించారు. నీటి సమస్య ఎదుర్కోవడానికి కారణాలు అన్వేషించేలా, తల్లి కొడుకుల బంధం బీటలు వారడానికి గల ప్రపంచీకరణ కుట్రలను, మారుతున్న మానవ ప్రవృత్తులను కథనంగా మలిచిన తీరు, సంఘటనలను, పాత్రలను వరుస క్రమంలో పేర్చుతూ ప్రధాన కథా వస్తువుకు అన్వయించిన పద్ధతి, రచయిత్రి జాజుల గౌరీ కథన కౌశలానికి అద్దం పట్టింది.

" ఆమె కాళ్ళను మునగదీసుకుని కట్ట పుల్లలతో భూమి మీద గీతలు గీస్తూ దీర్ఘాలోచనలో మునిగింది. (పుట.18 రామక్క కథ)

గ్రామీణ ప్రాంతంలో ఒక పాత్ర ఎలా ప్రవర్తిస్తుందో సందర్భానికి తగ్గట్టుగా, ఆ పాత్ర తాలూకు భావాలు, మన కళ్ళముందు మెదిలేలా పాత్రని సహజంగా చిత్రించిన తీరులో, రచయిత్రి అనుభవైక వేద్య జీవితం, సామాజిక పరిశీలనా దృష్టి ప్రస్ఫుటమవుతుంది.

"కండ్ల ముందు కారడవి కాన వస్తుంటే కన్నీళ్ళు భూమిని తడిపాయి (పుట. 19. రామక్క కథ)

పై వాక్యంలో శబ్ద సౌందర్యం, అర్థ సౌందర్యం ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్లుగా ప్రయోగించిన తీరు బాగుంది. కారడవి అనే పద ప్రయోగం, ఎంతో లోతైన భావానికి ప్రతీకగా ఈ వాక్యంలో ప్రయోగించిన విధానం రచయిత్రి లో గల అద్భుతమైన భావ వ్యక్తీకరణ ప్రతిభకు, కవితాత్మక శైలికి నిదర్శనంగా చెప్పవచ్చు.

రచయిత్రి జాజుల గౌరి ఈ కథను రంగారెడ్డి జిల్లా తెలంగాణ మాండలికంలో నడిపించారు. తన అనుభవాలను తాను చూసిన సామాజిక సంఘటనలను కథగా అభివ్యక్తీకరించడంలో భాష ప్రధాన పాత్ర వహించింది. కథకు సహజత్వాన్ని చేకూర్చటంలో రచయిత్రి ప్రయోగించిన భాష, శైలి పాఠకులను చదివించేలా చేస్తుంది. సిద్ది (విషయం), పుక్కటి (ఉచితం), దూప (దాహం), సోచాయించటం (ఆలోచించటం), కొరకాసు (దంతాలు తోముకునే బొగ్గు), రకం (డబ్బులు), లావు (గొప్ప) వంటి మాండలిక పదాలను సందర్భానుసారంగా ప్రయోగిస్తూ చక్కని శిల్పాన్ని పాటించారు.

తెలంగాణ మాండలికానికి నాద సౌందర్యాన్ని కలిగించే ధ్వన్యనుకరణ పదాలను విరివిగా వాడారు. అంతే కాకుండా ఆజం, రివాజు, జాగా, సమజ్ వంటి అన్యదేశ్యాలను ప్రయోగించటం వల్ల కథకు మరింత వాస్తవికత చేకూరింది. తెలంగాణ రాష్ట్రంలో అందునా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, నిజాం పరిపాలనకు ఆనవాళ్లుగా ఉర్దు పదాలు మన యాసలో చేరటం, వాటిని మనం తెలంగాణ మాండలిక పదాలేమో అన్నంతగా ప్రయోగించటం జరుగుతుంది. రచయిత కథను నడిపించడంలో సర్వసాక్షి ప్రథమ పురుష దృష్టికోణాన్ని ప్రయోగించారు. శివమ్మ, మైసమ్మ, రుద్రమ్మ, శకుంతల, రామక్క, లక్ష్మీ, సత్యనారాయణ వంటి పాత్రల హావభావాలను చక్కగా వర్ణిస్తూ, అంతరంగిక స్వభావాన్ని కూడా వ్యాఖ్యానం చేస్తూ, ప్రతీ సంఘటనకు, ప్రతీ పాత్రకు సాక్షిభూతంగా నిలబడ్డారు. పాత్రోచిత భాషలో సంభాషణలు జరిపించి, రచయిత్రి చక్కని సంభాషణాత్మక శైలిని ప్రయోగించారు. కథలో సందర్భానికి తగ్గట్టు వర్తమానంలో కథ నడిపిస్తూ, ఫ్లాష్ బ్యాక్ కథనాన్ని పాటించిన తీరు బాగుంది. ఈ కథనం రచయిత్రి దార్శనిక దృక్పథానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రపంచీకరణ కోణంలో కథావస్తువు ఎంపిక చేసుకున్నపుడు, మార్పులకు లోనవుతున్న సమాజాన్ని దర్శించిన అనుభూతి, పాఠకులకు అందించటంలో రచయిత్రి చక్కని శిల్ప నైపుణ్యాన్ని పాటించారు.

**ముగింపు:**

రామక్క కథ నీళ్ళ కరువు సమస్యగా కనిపించినా అంతర్లీనంగా కథా సంఘటనకు కార్యకారణ సంబంధాన్ని అన్వయించి చూస్తే పర్యావరణ విధ్వంసం వెనుక ఉన్న ప్రపంచీకరణ కుట్రలు తేట తెల్లమవుతాయి. ప్రపంచీకరణ ప్రభావానికి గురైన మనిషి, మానవీయ విలువల్ని కోల్పోయి, తన అస్తిత్వాన్నే కోల్పోయే సూచనలను రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. ప్రపంచీకరణ మార్పులను గుర్తించి, వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను అధిగమించేలా జాగ్రత్తగా ఉండాలని సమాజాన్ని హితవు పలికారు.

**ఆధార గ్రంథాలు:**

1. గౌరి, జాజుల. చెట్టు నీడ కథా సంపుటి(2023), విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్
2. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం(1996), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథా శిల్పం, ప్రథమ ముద్రణ జనవరి (1994), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్. .

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


# శ్రీశ్రీ దేశచరిత్రలు – సామాజిక మేలుకొలుపు


**– పెదముత్తి.ఝూన్సీ**

తెలుగు అధ్యాపకురాలు

ఆదిత్య మహిళా డిగ్రీ & పి జి కళాశాల

రాజమహేంద్రవరం

pantu7828@gmail.com


**పరిచయం:**

ఆధునిక సాహిత్యాన్ని నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అని కూడా పిలుస్తారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో 1875 నుండి ఆధునిక యుగం ప్రారంభమైంది. ఆంగ్ల సాహిత్యాన్ని అభ్యసించిన కవులు, రచయితల దృక్పథాలలో మార్పులు వచ్చి కొత్త భావాలతో, కొత్త ప్రక్రియలతో కొత్త రచనలు చేపట్టారు. కాల్పనికవాదం, మానవతావాదం వంటి పాశ్చాత్య సాహిత్య ధోరణులు ఆధునిక కవులకు కొత్త చూపును ప్రసాదించాయి. 1910 లో ప్రారంభమైన వ్యావహారిక భాషోద్యమం ఆధునిక సాహిత్య వికాసానికి కారణమైంది.

**సాహిత్యం – ఓ ఉద్వేగం:**

సాహిత్యం ఒక సుదీర్ఘమైన భావప్రసరణ. దానికి అంతం కాని, అవధులు కాని లేవు . ఏ సంకెళ్ళు – బంధించలేవు. అందుచేతనే "కాదేది కవిత కనర్హం' అంటూ కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, హీనంగా చూడకు దేన్ని" అనే కొత్త సిద్ధాంతం ప్రతిపాదించాడు.

కదిలేది, కదిలించేది
మారేది, మార్పించేది'
పాడేది, పాడించేది
పెనునిద్దుర వదిలించేది". అంటూ సాహిత్యానికి కొత్త అర్థాన్నిచ్చారు.

అందుచేతనే **'అలసిపోయిన ఆశలు**
**ప్రపంచాన్ని పలకరించని పాదాలు**
**వాస్తవంగా కాదు కదా**
**ఊహల్లో సహితం ఊసెత్తనివ్వని**
**అంతర్మథనాలు "** కవి కలం నుంచి జాలువారాయి.

సాహిత్యానికి అంతటి శక్తినిచ్చింది అక్షర రూపం దాల్చిన భాష. భాషకు సమాచారాన్ని చేరవేయడమే కాదు భావోద్వేగాల భావ ప్రసరణ కూడా తెలుసు. అందువల్లనే మనిషి యొక్క భౌతిక, మానసిక, శారీరక స్థితిగతులను కళ్ళకు కట్టినట్లుగా వివరిస్తుంది. మనలను మరో ప్రపంచంలోనికి నడిపిస్తుంది.

**శ్రీశ్రీ – మహాప్రస్థానం:**

ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ కవిత్వం మహాప్రస్థానంతోనే ప్రారంభమైంది. ప్రగతి, పురోగమనం అనే అర్థంలో అభ్యుదయం అనే పదాన్ని మొట్టమొదటిసారిగా శ్రీశ్రీ ప్రయోగించాడు. దీనిపై రష్యా విప్లవం, ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతం, మార్క్సిజం, గతి తార్కిక వాద ప్రభావం కనిపిస్తుంది.

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఈ మహాప్రస్థానం ద్వారా "రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటూ దీనంగా పలవరించే సమయాన ఉషోగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు" గా శ్రీశ్రీ చరిత్రలో 'సుస్థిర స్థానం' సంపాదించుకున్నారు.

ప్రపంచంలో ఏ దేశానికైనా, ఏ జాతి మనుగడకైనా, చరిత్ర చాలా ముఖ్యమైనది.

"చరిత్ర ఉంటేనే భవిష్యత్ కనబడుతుంది
గతం మీదనే వర్తమానం ఆధారపడుతుంది

కానీ ప్రస్తుతం ఏ గతం తాలుకు చరిత్రలు, ఏ సాహిత్యం భావోద్వేగాలు ప్రజా జీవనానికి అంతు పట్టడం లేదు.కావున లోకపుటన్యాయాలు, కాల్చేఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు, పరిష్కరించే, బహిష్కరించే నవ్య కవిత్వంగా "దేశ చరిత్రలు" ప్రస్తావించుకోవాలి.దేశ చరిత్రలు కావ్యాన్ని ఈనాటి దృష్టితో చూడాలి.

**శ్రీశ్రీ –దేశ చరిత్రలు –సామాజికత :**

**ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.**

అంటూ తార్కిక వాదంతో ప్రారంభించిన దేశచరిత్రలు వాస్తవాలు ఆలోచింపచేసేదిగా ఉంటాయి . ఈనాటి ప్రాపంచిక స్థితిగతుల్ని తెలియచేస్తుంది. ఇప్పటి ప్రపంచ పరిస్థితులకు నిలువుటద్దంగా మారింది. దానికి నిదర్శనం ఇంకా భయం గుప్పిట్లో తలదాచుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న అసాధారణ సంఘటనలు మన కళ్ళముందు కదలాడుతున్నాయి.

**ఏ యుద్ధం ఎందుకు జరిగెనో
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో?
తారీఖులు దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం**

అని ఆనాడు శ్రీశ్రీ ఉటంకించిన పంక్తులు నేటికీ సరిగ్గా సరిపోతాయి. ప్రపంచం అంతా ప్రస్తుతం యుద్ధ సంగ్రామంలో మునిగి తేలుతుంది ఏ దేశం ఎవరికి శత్రువో? ఏ దేశం ఎవరికి కాపు కాస్తుందో? బలాబలాలు తేల్చుకునే పనిలో పడింది.రాజులు–రాజ్యాలు, కత్తులతో సహవాసం చేసిన రోజులకు, దేశాలు – ప్రతినిధులు అధికారం కోసం మిసైల్స్ తో సహవాసం చేస్తున్న రోజులకు తేడా ఏముంది అప్పుడైనా, ఇప్పుడైనా ప్రాణత్యాగం చేస్తుంది, దాని తాలూకు పరిస్థితులు అనుభవిస్తుంది సామాన్యులే కదా.

**రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదికినా దొరకదు
గతమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీళ్ళతో**

మన గతమంతా రక్తంతో తడిసినా మన పిల్లల భవిష్యత్తుకు పూలతో బాటలు వేద్దాం అనుకున్నాం, కాని కన్నీళ్ళతో సమాధులు కట్టే స్థితికి దిగజారిపోయాం.మితిమీరిన అత్యాశ, అధికార దాహం, స్వార్థం, నాది అనే సంకుచిత భావన మరలా మొదటి ప్రపంచ యుద్ధ కాలానికి తీసుకు వెళ్ళి మూడవ ప్రపంచ యుద్ధానికి తెరతీస్తుందేమో! అదే కనుక జరిగితే శ్రీశ్రీ ఆశించిన నవసమాజం – శవ సమాజంగా మారక తప్పదు కదా.

**చల్లారిన సంసారాలూ**
**మరణించిన జన సందోహం**
**అసహాయుల హాహాకారం**
**చరిత్రలో నిరూపించినవి**

రాజ్యాధికారం చేపట్టిన వారు యుద్ధ ట్యాంకర్లలో క్షేమంగా ఉంటే సామాన్యులు ఆ యుద్ధానికి నిలువెత్తు సాక్ష్యాలుగా విగత జీవులై కళ్ళముందు కదలాడుతున్నారు . పేకల్లా కూలుతున్న మేడలు, ప్రాణ భయంతో చేసే హాహాకారాలు, ఆకలితో అలమటించే పసిప్రాణాలు, వారిని చూస్తూ. కన్నపేగు చేసే ఆర్తనాదాల రాకెట్ల శబ్దంలో తలదాచుకుంటున్నాయి. సైరన్ల మోతలో కనుమరుగైపోతున్నాయి.అందువల్లనే శ్రీశ్రీ చరిత్రలోకి ఎక్కిన రాజులంతా

నరహంతకులే,ప్రజల్ని కాల్చుకుని తిన్నవారే! దరిద్రుల, సామాన్యుల శవాల మీద సింహాసనం అధిష్టించిన వారే! అని విప్లవ శంఖం పూరించాడు .

**వైకింగులు, శ్వేత హూణులూ**
**సిథియన్లు, పారశీకులూ,**
**పిండారులు, థగ్గులు కట్టిరి**
**కాలానికి కత్తుల వంతెన**

ఏ నాగరికత లేని రోజులైనా, అప్పుడే ఎంతో కొంత మెరుగ్గా ఉండేదేమో."ఒక్కరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు" అనే నినాదాన్ని అందిపుచ్చుకుని సమాజ వృద్ధి కోసం పాటుపడి వారి ధన, మాన, ప్రాణాల్ని పణంగా పెట్టి తరువాతి తరాల క్షేమం కోరుకున్నారు. వారి త్యాగం వృధాగా పోయే సమయం మళ్ళీ దాపురించింది ఈ ప్రపంచానికి.

భావోద్వేగాలకు స్పందించి భావుకతను ప్రకటించే రోజులు పోయాయి. ఎదుటి వారి మానసిక స్థితికి స్పందించి మానవత్వం పురుడు పోసుకునే సున్నితత్వం సమాధి అయిపోయింది . ఆ కారణం చేతనే కాబోలు హత్యలు, దోపిడీలు, మాన భంగాలు, ఉగ్రవాదము, యుద్ధ భీభత్సం మన కళ్ళముందు కదలాడుతున్నాయి.సృష్టి రహస్యం దాచుకోవడం–దోచుకోవడంలోనూ లేదు, నిర్మలమైన మనస్సుతో ప్రేమను పంచడంలో దాగి వుంది అనే తత్త్వం బోధపడిన రోజున అభ్యుదయం అనే పదానికి అర్థం తెలుసుకున్న వాళ్ళమవుతాం. ఆ క్షణాన కన్నీటి విలువ, మన అంతరాత్మలో వున్న కంటిపాపకు పరిచయమౌతుంది.

**దేశచరిత్రలు – సామాజిక మేలుకొలుపు:**

**అజ్ఞానపు అంధయుగంలో**
**ఆకలిలో, ఆవేశంలో,**
**తెలియని ఏ తీవ్ర శక్తులో**
**నడిపిస్తే నడిచే మనుషులు**

అభ్యుదయ యుగం నాటికి, ఈనాటికి భారతదేశ స్థితిగతుల్లో, ప్రపంచ దేశాల నాగరికతల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. నాగరికులం అని చెప్పుకునే ముసుగులో మండిపోయిన మానవత్వం మనది . అభివృద్ధి సాధించాం అని చెప్పుకుంటూ అనార్తులను దోపిడీ చేసే వారసత్వం మనది. మనం బావున్నాం అంటే అర్థం అందరం బావున్నాం అనే భావన కంటికి, మనసుకు స్పష్టమైన రోజున అంధకార యుగం అంతరించినట్టు.

అలా కాకుండా ఆవేశంలో, తెలియని ఏ తీవ్ర శక్తులో మన ఆకలిని తీర్చి, మనకు ఆలోచన చెప్పినంత కాలం మనం మర మనుషులమే. ఆకలి తాలూకు వేదన, ఆవేశం చెల్లించాల్సిన మూల్యం బోధపడక కంటికి కనిపించని భావజాలంతో బంధుత్వం పెంచుకున్నంత కాలం ఏ దేశ చరిత్ర తన స్థితిగతులను మార్చుకోలేదు. మానవత్వం నిండిన సమాజాన్ని తరువాతి తరాలకు చేరవేయలేదు..

మనుషులతో కాకుండా యంత్రాలతో సహజీవనం చేసేంత నాగరికత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా సామాన్యుల జీవితాల గురించి ప్రస్తావించుకుంటున్నాం అంటే మన గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. మన వారసత్వ సంపదగా ఉన్న ప్రపంచ వింతలు, పేరు పొందిన కట్టడాలు, ఆశ్రమాలు, కోటలు మనలో అడుగంటిపోయిన సున్నితత్వాన్ని, ప్రేమతత్వాన్ని, మానవత్వాన్ని మేలుకొలపలేవు.అదే విధంగా దోచుకునే వారికి – దాచుకునే వారికి మధ్య నలిగిపోతున్న సామాన్య ప్రజల ఆర్తనాదాలు దేశచరిత్రలు కాదు కదా ప్రాపంచిక పరిశోధనలు చేసినా బయట పెట్టలేము.

**ఒక వ్యక్తిని మరొక వ్యక్తి**
**ఒక జాతిని వేరొక జాతి**
**పీడించే సాంఘిక ధర్మం**
**ఇంకానా? ఇకపై సాగదే.**

ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయిలెవ్వరు? అంటూ గళమెత్తిన గొంతు వ్యక్తి ఎదుగుదల వ్యవస్థపైనే ఆధారపడి వుందని నినదించింది. అలాగే వ్యవస్థ అభివృద్ధి వ్యక్తి పురోగతి పైన నిలబడుతుందని చెప్పకనే చెప్పింది. ఒకరు అధికారం అందిపుచ్చుకోగలిగారంటే కింది స్థాయి వాళ్ళు అందిస్తేనే అని ప్రభుత్వాలు, అధికారులు గ్రహించిన రోజున పల్లకి మోయడానికి ఏ బోయవాడు సిగ్గుపడడు.

"స్వాతంత్ర్యం, సమభావం,
సౌభ్రాతృత్వం పునాదులై ఇళ్ళు లేచి
జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, శాంతి, శాంతి జగమంతా జయిస్తుంది.
ఈ స్వప్నం నిజమౌతుంది.
ఈ స్వప్నం ఋజువవుతుంది" అని

విశ్వసించిన శ్రీశ్రీ కలలు కన్న సాంఘిక ధర్మం నిజమైన రోజున మనిషిని మనిషిగా గౌరవించే సమాజాన్ని తరువాతి తరాలకు అందించగలం.

**ముగింపు:**

శ్రీశ్రీ తన కవిత్వానికి రంగు, రుచి, వాసనా కలిగించాడు. ప్రతీకల ద్వారా జవజీవాలు కల్పించాడు , భావోద్వేగాలకు ప్రాణం వస్తే శ్రీశ్రీ కవిత్వంలా ఉంటుందేమో అనిపిస్తుంది., అక్షరాలను హత్తుకోవాలనిపిస్తుంది. పదాలతో సంభాషించాలనిపిస్తుంది. కవిత్వంతో సహజీవనం చేయాలనిపిస్తుంది. నిస్తేజంగా నీరసించి పోయిన ఆలోచనలు తట్టిలేపాలనిపిస్తుంది. బ్రతుకు మీద ఆశలకు రెక్కలు తొడగాలనిపిస్తుంది. ఇంతేలే మా బ్రతుకులు అని తలదించుకుని పోయే వాళ్ళను పలకరించి పులకరించేలా చేయాలనిపిస్తుంది.

"పదండి ముందుకు, పదండి తోసుకు" అంటూ దేశ యువతకు ఆక్సిజన్ అందించారు శ్రీశ్రీ. జీవచ్ఛవంలా మారిన సమాజానికి ప్రాణం పోశారు. ఆశలు ఆవిరైపోయి శూన్యంలా మిగిలిన ప్రపంచానికి కష్టాలు, కన్నీళ్ళతో సహవాసం చేసే జనావాహినికి, సాహిత్యం ఊపిరిపోయగలదని శ్రీశ్రీ కవిత్వం నిరూపిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**


1. శ్రీశ్రీ –మహాప్రస్థానం
2. తెలుగు సాహిత్య చరిత్ర– ద్వా నా శాస్త్రి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# "సెల్ ఫోన్ శతకము – సాంకేతిక యుగంలో మానవీయ విలువలు, సామాజిక చైతన్యం"

– డా. సుర్ల రమణ
తెలుగు అధ్యాపకులు,
SVR ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
నిడదవోలు,
చరవాణి : 9618778720

**ఉపోద్ఘాతం :**

హితేన సహితం సాహిత్యం (మంచిని తెలియజేసేదే సాహిత్యం) అనే సాహితీ లక్షణాల్ని పుణికిపుచ్చుకొన్న ప్రాచీన కావ్యప్రక్రియ శతకం. పాల్కురికి సోమనాధుని వృషాధిప శతకంతో దశదిశల వ్యాపించిన శతక వాఙ్మయం, తెలుగు సాహిత్య చరిత్రలో ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించింది. సమాజంలో నైతిక విలువలను పెంపొందింపజేస్తూ సామాన్య జనానికి కూడా అర్థమయ్యే రీతిలో జన సామాన్యంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందిన తెలుగు సాహిత్య ప్రక్రియలలో శతకం అగ్రగణ్యమైంది. ఏ సాహిత్య ప్రక్రియయైతే సమాజంలోని ప్రజల సమస్యల్ని, వాటికి పరిష్కార మార్గాలను చూపిస్తూ, ప్రజలకు మంచిని బోధిస్తుందో, ఆ ప్రక్రియ సమాజంలో కలకాలం నిలుస్తుందని నిరూపించిన సాహిత్య ప్రక్రియ శతకం.

**సెల్ ఫోన్ శతకం – నేపథ్యం :**

సెల్ ఫోన్ శతక కర్త గుమ్మా సాంబశివరావు గారు తెలుగు సాహిత్యలోకంలో ఒక ప్రముఖ విమర్శకునిగా, పుస్తక సమీక్షకునిగా, కవిగా, ఉపన్యాసకులుగా అందరికి సుపరిచితులు. ఆధునిక మానవ జీవితం మీద అత్యంత ప్రభావం చూపుతున్న సెల్ ఫోన్ మీద మొట్టమొదటిగా శతకాన్ని రచించిన ఖ్యాతి వీరికే దక్కింది.

సాంబశివరావు గారు 2004 ఫిబ్రవరి 28, 29 తేదీల్లో గూడూరులోని దువ్వూరి రమణమ్మ మహిళ కళాశాలలో ఏర్పాటు చేసిన తాళ్ళపాక వారి సాహిత్యం జాతీయ సదస్సులో పాల్గొనటానికి 28వ తేదీ మధ్యాహ్నం కృష్ణా ఎక్స్ ప్రెస్ లో విజయవాడ నుంచి బయలుదేరారు. రైలు బయలుదేరగానే ఒకదాని వెంట ఒకటి సెల్ ఫోన్ లు మోగుతూనే ఉన్నాయి. తెనాలి వెళ్ళేలోపు ఏడెనిమిదికి పైగా మోగాయి. వీటన్నిటి మోతల్ని వింటున్న రావుగారికి సెల్ ఫోన్ మీద పద్యాలు రాస్తే ఎలా ఉంటుందనే మెరుపులాంటి ఆలోచన కలగటంతో జేబులోని చిత్తుకాగితం తీసి "ఆటవెలది" పద్యాలు రాయడం మొదలుపెట్టారు. నెల్లూరు వెళ్ళేటప్పటికి దాదాపు 40 పద్యాలు రాశారు. మరలా తిరుగు ప్రయాణం పినాకినీ ఎక్స్ ప్రెస్ లో 30 పద్యాలు రాశారు. మే నెలలో విశాఖపట్టణం వెళ్తూ కొన్ని, తిరుగు ప్రయాణంలో కొన్ని మిగిలిన వాటిని జూన్ నెలలో రాసి శతకాన్ని పూర్తి చేశారు. మొత్తానికి సెల్ ఫోన్ శతకంలోని చాలా పద్యాలు రైలు ప్రయాణాల్లోనే రాశారు.

**సెల్ ఫోన్ శతకం – నీతి ప్రబోధం :**

అగ్గిపుల్ల
కుక్క పిల్ల
సబ్బు బిళ్ళ
కాదేదీ కవితకనర్హం

అన్న మహా ప్రస్థాన దార్శనికుడైన మహాకవి శ్రీశ్రీ మాటల్ని పొల్లుపోకుండ నిరూపించిన సాహిత్య రచనే ఈ సెల్ ఫోన్ శతకం. స్పందించే మనసుండాలే కాని సృష్టిలోని ప్రతి వస్తువు కవితా వస్తువేనని నిరూపించారు గుమ్మా సాంబశివరావు.

ఆధునిక పాశ్చాత్య పోకడలతో, సమాజంలో పెంపొందిన సాంకేతిక విప్లవంతో జీవన శైలిలో భాగమైంది సెల్ ఫోన్. ఒకప్పుడు భోగలాలస వస్తువుగా తన పెత్తనాన్ని చలాయించిన సెల్ ఫోన్ దాని విస్తృతిని పెంచుకొని నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు శాసించే స్థాయికి ఎదిగిందనడంలో అతిశయోక్తి లేదు.

ఫోను భోగమయ్యె పూర్వకాలమ్ములో
ఫోను అవసరమయె పోను పోను
చెవిని వదలకుండ సెల్లులుండెను నేడు
సెల్లు ఫోను లీల చెప్పతరమె

వేగంగా వాహనం నడుపుతూ, సెల్ ఫోన్ లో మాట్లాడటం ప్రమాదాలకు దారి తీస్తుందని దాని వల్ల కలిగే నష్టాన్ని వివరిస్తూ...

వాహనముల మీద వడివడిగ వెళుతూ
వదలికుండ సెల్లు వాగువారు
ముందు పొంచి యున్న ముప్పును తెలియదు
సెల్లుఫోను పీడ చెప్పతరమె

గురు, శిష్య సంబంధాలు మారుతున్న ఈ రోజుల్లో సెల్ ఫోన్ కు ప్రాధాన్యం పెరిగిందని చెప్తూ...

గురుల యిండ్లకేగి కోరి నేర్చరి నాడు
సెల్లులోనె నేడు చెప్ప 'డౌట్సు'
తీర్చు చుంద్రు గురులు తిన్నగా సెల్లులో
సెల్లుఫోను లీల చెప్పతరమే

ఒకప్పుడు గురువుల ఇంట్లో ఉంటూ, గురువు దగ్గర శిష్యరికం చేస్తూ గురుభక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని ఆర్జించేవారు. కాని గురుశిష్య సంబంధాలు క్షీణిస్తున్న ఈ రోజుల్లో చదువుతున్న విషయంలో సందేహాలు వస్తే గురువు గారి సెల్లుఫోనుకి ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకుంటారు ఆధునిక యుగపు విద్యార్థులు.

ఎనిమిదేండ్ల లోపు చినపిల్లలెప్పుడు
సెల్లు పట్టకుంట శ్రేయమగును
'రేడియేష' నుంట రెట్టింపు కీడౌను
సెల్లు ఫోను పీడ చెప్పతరమె

ఎనిమిదియేళ్ళ వయసులోపు ఉన్న పిల్లలు సెల్ ఫోన్ తీసుకోవడం చేత, అది వారి లేత మెదడును వాటి తీక్షణమైన తరంగాలతో బాధిస్తాయని, కాబట్టి పిల్లలకు సెల్ ఫోన్ లు అందించవద్దని, అది వారికి అపారమైన నష్టం కలిగిస్తుందని తల్లిదండ్రులకు సూచన.

శాంతి భద్రతలకు చక్కగా కాపాడ
రక్షక భటులకును రక్షయయ్యె
ఎచటి వార్తనైన నిట్టె చేర్చును సెల్లు
సెల్లుఫోను మహిమ చెప్పతరమె

ఉగ్రవాద దుశ్చేష్టలకు వణికిపోతున్న మానవాళిని మనో నిగ్రహంతో సుఖంగా, సంతోషంగా జీవించేలా చేస్తున్న పోలీసుశాఖ వారికి సెల్ ఫోన్ మహోపయుక్తమైనదిగా పేర్కొంటూ, ఏ వార్తనైన ఎక్కడికైనా తీసుకువెళ్ళగల సామర్థ్యం సెల్ ఫోన్ కు ఉంది.

సెల్లు నెంబరెటిగి సొల్లుగా దొక్కదు
ఫోను చేయుచుండు పోకిరగుచు
సెల్లులున్నయపుడు చిక్కులును గలుగు
సెల్లుఫోను గోల చెప్పతరమె

ఇతరులు సెల్ ఫోన్ నెంబర్లు తెలిసికొన్న కొందరు ఫోను చేసి బాధిస్తుంటారు. ఈ విధంగా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా, వాళ్ళకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారని, ఆ విధంగా అసభ్యంగా ప్రవర్తించేవాళ్ళకు కనువిప్పు కలగాలి.

చందమామఁజూచి చంటి బిడ్డదు కోర
అద్దమందు, చూపె నమ్మనాడు
నేటి అమ్మ, చూపు నీటుగా సెల్లులో
సెల్లు ఫోను లీల చెప్పరమె

చందమామ రావె! జాబిల్లి రావె! అని పాటలు పాడిన ఒకనాటి తల్లి పిల్లాడు అడిగాడని చందమామను అద్దంలో చూపింది. కాని నేటి మమ్మీ చందమామను సెల్ ఫోన్ లో నీటుగా చూపిస్తున్నది.

ఉన్నతమ్ములైన ఉద్యోగములకును
మౌఖికపు పరీక్ష మహిని నేడు
సెల్లుఫోనులోన చిత్రరీతిని సాగు
సెల్లుఫోను మహిమ చెప్పతరమె

ఉద్యోగవకాశాలను కల్పించే కొన్ని కంపెనీల వాళ్ళు నిర్వహించవలసి మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ)లను సెల్ ఫోన్ లోనే చేస్తున్నారు. ఈ విధంగా ఉద్యోగాలను సంపాదించడానికి సెల్ ఫోన్ తప్పనిసరిగా ఉండాల్సివస్తుంది.

తక్కువ ధరకు సెల్ ఫోన్ విక్రయించే సంస్థలు వినియోగదారులకు అనేక రకాల రాయితీలు చూపి, తమ వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకుంటున్నారు. సెల్ ఫోన్ తక్కువ ధరకు దొరికింది అనే సంతోషంలో వందలకొలది మాట్లాడి, బిల్లు వచ్చిన తరువాత ఏడుస్తుంటారు. కాబట్టి సెల్ ఫోన్ వాడకంలో జాగ్రత్త వహించాలి.

తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న ఉపాధ్యాయుడు సెల్ ఫోన్ కట్టేసి బోధించాలని మరియు ప్రశాంతంగా సభ జరుగుతున్నప్పుడు సెల్ ఫోన్ మ్రోగటం వల్ల సభలో ఆసక్తిగా వింటున్న వారికి ఆటంకం కలుగుతుందని ఇలాంటి సందర్భాల్లో ఫోను ఆపివేసి సభ్యతను చాటుకోవాలి.

ఆధునిక సాంకేతిక యుగంలో మనం ఎంత సుఖంగా ఉండగలుగుతున్నామో, ఆ సాంకేతిక విజ్ఞానమే మానవాళి మనుగడను నాశనం చేస్తుంది. అదే కోవకు చెందినది సెల్ ఫోన్ కూడా ఫోన్ వదిలి ఎవరైనా వెళితే, దాని దగ్గరకు ఎవరూ వెళ్ళరు. కారణం ఈ రోజుల్లో తయారు చేసే బాంబులు సెల్ ఫోన్ రూపంలో కూడా ఉంటున్నాయి. అందువల్ల ఎవరైనా సెల్ ఫోన్ వదిలి వెళితే, పోలీసులకు సమాచారం అందించాలి.

**ముగింపు :**

ఆధునిక యుగంలో ప్రసార, ప్రచార సాధనాల్లో సెల్ ఫోన్ కు ఉన్న ప్రాధాన్యమెంతటిదో అందరికీ తెలిసిందే. ఎవరి చేతిలో చూచినా, ఎవరి చెవి దగ్గర చూసినా, ఎవరి జేబులో చూసినా, ఎవరి బెల్టుకు చక్కటి పొదిలో భద్రపరచుకోవడం చూసినా సెల్ కనిపిస్తూ

ఉంటుంది. ఈనాడు సెల్ ఫోన్ చేయని పనింటూ లేదు. శుభవార్తలు, దుర్వార్తలు, ప్రేమ వార్తలు, ప్రేమ వైఫల్యాలు దృశ్యచిత్రాలును తెలియజేస్తుంది. సమాజం అభివృద్ధి చెందుతున్న కొద్ది క్రొత్త క్రొత్త నూతన టెక్నాలజీలతో నిత్యం మార్పులకు లోనవుతుంది సెల్ ఫోన్.

పాశ్చాత్యపు పోకడలతో ఉన్న ఆధునిక సమాజ స్థితిని అద్దం పట్టేది సెల్ ఫోన్ శతకం. సమాజంతో పాటు ప్రజలు మారుతారు అనడానికి సెల్ ఫోన్ శతకం ఒక చక్కని ఉదాహరణ.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర శతక సాహితి వికాసము – ఆచార్య కె. గోపాల కృష్ణారావు
2. సెల్ ఫోన్ శతకం – డా॥ గుమ్మా సాంబశివరావు
3. ప్రజాకవి వేమన – ఆచార్య ఎన్. గోపి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# గురజాడ సాహిత్యం – సామాజికత

– డా. డి. సుజాత
ఎమ్.ఏ., ఎమ్.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల,
ఎర్రగొండపాలెం

**1. ఉపోద్ఘాతం :**

"విశ్వ శ్రేయః కావ్యం" అన్నారు పెద్దలు. అంటే సమాజ శ్రేయస్సే కావ్య ముఖ్య ఉద్దేశం. ప్రాచీన కాలంలో సాహిత్యం ఎక్కువగా రాజాశ్రయంలో పురాణేతిహాసాల చుట్టూ తిరిగితే, ఆధునిక సాహిత్యం సామాన్యుడిని కేంద్రం చేసుకొని సాగింది. కాలంతో పాటు వచ్చిన సాహిత్య ప్రక్రియలు సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. అటువంటి ఆధునిక తెలుగు సాహిత్యానికి మార్గదర్శకులు, అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావుగారు. వారి రచనలు సమాజంలోని చెడును రూపుమాపడానికి, ప్రజలలో చైతన్యం తేవడానికి ఎంతగానో తోడ్పడ్డాయి. మూఢ నమ్మకాలు, అజ్ఞానం, సాంఘిక దురాచారాలపై తన కలం ద్వారా తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. ముత్యాల సరాల ఛందస్సులో అలతి అలతి పదాలతో కన్యక, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వంటి పద్య రచనలద్వారా జాతికి మేల్కొల్పు పలికారు. వీరి కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యానికే ఆణిముత్యం.

**2. కీలక పదాలు:**

ముత్యాల సరాలు = ఛందస్సు, ప్రీతి కూర్చుట = మేలు చేయుట, దురాచారాలు = చెడ్డ ఆచారాలు, విధవ = భర్తను కోల్పోయిన స్త్రీ , వకీలు = లాయరు

**3. కవి పరిచయం :**

నవ్య కవిత్వానికి వేగుచుక్క గురజాడ. అక్షరాల ద్రష్ట స్రష్ట. అచ్చమైన మహాకవి, అసలు సిసలైన సంఘ సంస్కర్త, తెలుగు నవకవనానికి అడుగుజాడ గురజాడ.

"బ్రతికి చచ్చిన ప్రజల కెవ్వడు
ప్రీతి కూర్చునొ వాడె ధన్యుడు.."

పాత కొత్తల మేలు కలయికతో తెలుగు వారి మత్తు వదలగొట్టిన మహాకవి, మనీషి గురజాడ అప్పారావుగారు. నాటి సమాజంలోని దురాచారాలను దుయ్యబట్టి నవ సమాజ నిర్మాణ సాధనకు కలాన్నే ఆయుధంగా చేసుకున్న పుణ్యమూర్తి గురజాడ. 21-9-1862లో విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరంలో కౌసల్యమ్మ, వెంకట రామదాసు దంపతులకు జన్మించారు.

**విద్యాభ్యాసం — వివాహం :**

చీపురుపల్లి, విజయనగరంలో స్కూలు విద్యనభ్యసించారు. 1882లో మెట్రిక్ పాసయ్యారు. తరువాత ఎఫ్.ఏ. చదివారు. 1884-86లో బి.ఏ పూర్తి చేశారు. 1885లో వివాహమయ్యింది. కళాశాలలోను, కలెక్టర్ ఆఫీసులోను కొంతకాలం పని చేశారు. ఆనందగజపతి సంస్థానంలో సంస్థాన పరిశోధకుడిగా, మద్రాసు యూనివర్సిటీలో ఫెలోగా పనిచేసి 1915 నవంబర్ 30న మరణించారు.

**రచనలు :** కన్యాశుల్కం నాటకం, సారంగధర ఆంగ్ల పద్యకావ్యం, దిద్దుబాటు, మీ పేరేమిటి కథలు, బిల్హణీయం నాటకం, డామన్-పితియన్ గేయం, లవణరాజు కల, కన్యక, పూర్ణమ్మ, ముత్యాల సరాలు ఛందస్సు, నీలగిరి పాటలు గేయం, సుభద్ర కావ్యం, కాసులు గేయం వీరి రచనలలో ముఖ్యమైనవి.

**ముత్యాల సరాలు :** ముత్యాల సరాలు అనే కొత్త ఛందస్సు, కొత్త కథా వస్తువు, సాంఘిక అంశాలను తీసుకొని సమాజానికి కనువిప్పు కలిగేలా లవణరాజు కల, కన్యక, పూర్ణమ్మ వంటి రచనలు చేశారు.

**4. గురజాడ రచనలు సామాజికత :**

గురజాడ వారి "కన్యాశుల్కం" నాటకం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ సంఘ సంస్కరణ నాటకం. ఇది అప్పటి సమాజంలోని దురాచారాలను ఎండగడుతూ సంఘ సంస్కరణాభిలాషతో రూపుదిద్దుకుంది. చిన్న పిల్లలను వయసుమళ్ళిన ముసలి వారికి డబ్బు ఆశ చూపి పెళ్లి చేసి వధువును అమ్మేయడం అనే దుర్మార్గపు ఆచారాన్ని ఈ నాటకం తీవ్రంగా ఖండిస్తుంది. బాల్య వివాహాలు, భర్త చనిపోయాక విధవలు పడుతున్న యాతనలు, సమాజం వారిపట్ల చూపుతున్న వివక్షత బుచ్చమ్మ పాత్ర ద్వారా చూపించారు. సాంప్రదాయ సమాజం వేశ్యగా చూసే మధురవాణి పాత్రకు అసాధారణమైన మానవత్వం, ధైర్యం ఆపాదించి ఇతరుల జీవితాలను చక్కదిద్దే శక్తిగా గురజాడ తీర్చిదిద్దారు. రామప్ప పంతులు, గిరీశం వంటి పాత్రల ద్వారా నాటి సమాజంలో పేరుకుపోయిన లంచగొండితనం, మోసాలు, దురాచారాలు, నకిలీ వేషాలు (సన్యాసులు, జోస్యులు) బయటపెట్టబడ్డాయి.

సంఘంలో జరుగుతున్న అన్యాయాలను, దురాచారాలను వ్యతిరేకిస్తూ నైతిక విలువలకు పెద్దపీట వేసిన పాత్ర సౌజన్యారావు పంతులు గారి పాత్ర. కపట నాటకాలతో గిరీశం మొదట సౌజన్యారావు పంతులుగారిని నమ్మించినా మధురవాణి ప్రవేశంతో గిరీశం ఆటకట్టించి తీవ్రంగా ఖండించి, బాధితులకు అండగా నిలుస్తారు. నాటకాన్ని సుఖాంతం చేయడంలో సౌజన్యారావు పంతులుగారి పాత్ర కీలకమైనది. ధర్మాత్ములు, నిబద్ధత కలిగిన వకీలు, మరియు సంఘంలో మంచి పేరున్న పెద్దమనిషిగా గురజాడ సౌజన్యారావుగారి పాత్రను సృష్టించారు.

అగ్నిహోత్రావధానులు కఠిన మనస్కుడు, ధనాపేక్ష, తలబిరుసుతనం కలవాడు. సమాజంలోని దురాచారాలను ప్రశ్నించకుండా తన స్వార్థం చూసుకునే పురుషాధిక్య భావజాలానికి ప్రతిరూపం.

కన్యాశుల్కం నాటకంలో అత్యంత కీలక పాత్ర గిరీశం. మాయ మాటలు చెప్పి ఎదుటివారిని బుట్టలో పడేసి మోసం చేయడంలో దిట్ట. సమాజంలో సోమరిగా బ్రతుకుతూ చలామణి అయ్యే నకిలీ మేధావులకు, దొంగ పెద్ద మనుషులకు గిరీశం పాత్ర ఒక ప్రతీక. ఎటువంటి డిగ్రీలూ లేకపోయినా, అసంబద్ధ ఆంగ్ల పదజాలంతో గొప్పలు చెప్పుకుంటూ, పరిస్థితులకు తగిన విధంగా తన సంభాషణ మారుస్తూ పబ్బం గడుపుకోవడం, అవకాశవాదిగా బతుకుతూ శిష్యుడు వెంకటేశాన్ని చెడగొట్టడం, పూటకూళ్ళ ఇళ్ళవద్ద కాలక్షేపం చేయడం, నిత్యం గిరీశం చేసే కోతలు, చెప్పే ఉచిత ఉపన్యాసాలు నాటకంలో విపరీతమైన హాస్యాన్ని పండిస్తాయి. గిరీశం పాత్ర రాకతో మొదలై, పోకతో ముగిసిన కన్యాశుల్కం నాటకం తెలుగులో అమరత్వం పొందింది. విలక్షణ పాత్రచిత్రణలో అగ్రస్థానంలో నిలిచే నాటకం ఇది.

**కన్యక :** గురజాడ రచించిన చిన్న కథాకావ్యం కన్యక. కులం కన్నా గుణం మిన్న అని, అధికారం మనిషి కళ్ళు మూయించకూడదని రచయిత ఈ కావ్యం ద్వారా నిరూపించారు. పెనుగొండ వసంత దేవరాయలు, వాసుదేవ శెట్టి కూతురు (కన్యక) చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆత్మగౌరవం, సామాజిక విలువలు నేర్పే కథ ఇది. ధనం ఉంటే చాలదు, విద్య నేర్వాలి, గద్దె నెక్కాలి, అప్పుడే మన గౌరవ, రక్షణ ఉంటుందని కన్యక పాత్ర ద్వారా గురజాడ సమాజ చైతన్యాన్ని కలిగించారు.

**పూర్ణమ్మ కథ – సామాజికత :**

ఆశ చూపి చిన్న వయసున్న ఆడపిల్లల్ని ముసలి వారికిచ్చి పెళ్లి చేస్తే ఆ ఆడపిల్లలు పొందే ఆవేదనను, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను, పసిప్రాయంలోని ఆడపిల్లల జీవితాలతో చెలగాటమాడుతూ, వారి బంగారు భవితను అంధకారంలోకి నెట్టేయడాన్ని, కన్యాశుల్క దురాచారాన్ని, సమాజంలో అబలలైన ఆడపిల్లల ఆవేదనను, వారి నిస్సహాయతను, ఆత్మహత్యే గతిగా మారిన విషాద పరిస్థితులను ఈ గేయం ద్వారా సమాజం ముందు ఉంచారు. పూర్ణమ్మ బలిదానం ఒక వ్యక్తిది కాదు, నాటి దుర్మార్గపు సాంఘిక వ్యవస్థ చేసిన హత్యగా నిరూపించారు. సమాజంలో మార్పు రావాలని, మూఢ నమ్మకాలు పోవాలని, దురాచారాలు నశించాలని కోరుకునే అభ్యుదయ భావాలు పూర్ణమ్మ కథలో కనిపిస్తాయి.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


**ముగింపు :**

గురజాడ వెంకట అప్పారావు గారి రచనలు దేశభక్తిని పెంపొందిస్తాయి. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తాయి. నాటి సమాజంలోని వ్యసనాలను, దురాచారాలను రూపుమాపుటకు కవితామార్గాన్ని చేపట్టిన మహనీయులు గురజాడ నాటికే కాదు ఏనాటికైనా చిరస్మరణీయులే.

**ఆధార గ్రంథాలు :**


1. గురజాడ కన్యక
2. గురజాడ కన్యాశుల్కం నాటకం
3. గురజాడ పూర్ణమ్మ
4. తెలుగు సాహిత్య చరిత్ర – డాక్టర్ ద్వా.నా శాస్త్రి

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# మహైక వచన కావ్యంలో సామాజికాంశాల ప్రాసంగికత

– వొటారికారి సందీప్

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,

హైదరాబాద్ విశ్వ విద్యాలయం.

#9390280093.

**వ్యాససంగ్రహం:**

సాహిత్యం సమాజం నుంచి ఎప్పుడూ విడిగా ఉండదు. ఒక సమాజంలో ఉండే మనుషులు, వాళ్లు ఎదుర్కొనే సమస్యలు, అనుభవాలు, సంఘర్షణలు సాహిత్యంలో ఏదో ఒక రూపంలో ఎప్పుడూ వ్యక్తమవుతూనే ఉంటాయి. అయితే సాహిత్యంలో అట్లా సామాజికతను కేవలం సమాజంలోని సమస్యలను నమోదు చేయడంగా మాత్రమే చూడలేం. ఒక మనిషి ఎదుర్కొనే ఆకలి, పేదరికం, శ్రమ, అణచివేత వంటి అనుభవాలకు కారణమైన సామాజిక పరిస్థితులను గుర్తించినప్పుడే ఆ రచనలోని సామాజికత మరింత స్పష్టంగా అర్థమవుతుంది. ఈ దృష్టితో చూసినప్పుడు కవిరాజ మూర్తి రచించిన, తెలుగులో తొలి వచన కావ్యంగా గుర్తింపబడుతున్న 'మహైక' కావ్యాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది. కనుక మహైక వచన కావ్యంలో కార్మికుల జీవితం, ఆకలి, పేదరికం, శ్రమ, స్త్రీల సమస్యలు, దేవదాసి వ్యవస్థ వంటి అంశాలు ఎలా వ్యక్తమయ్యాయో, వాటికి కారణమైన సామాజిక పరిస్థితులను కవి ఎలా చూపించాడో, అలాగే చైతన్యం, ఏకత్వం, పోరాటం వంటి భావాలకు కావ్యంలో ఎలాంటి స్థానం ఉందో మార్క్సిస్ట్ కోణంలో పరిశీలించడం ఈ వ్యాస ఉద్దేశం. అందువల్ల ప్రస్తుతం ఈ వచన కావ్యాన్నే ప్రథమ ఆకారంగానూ, 'మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక పరిచయం, తెలుగులో భక్తి కవిత్వం – సామాజిక విశ్లేషణ' వంటి గ్రంథాలను ద్వితీయ ఆకారాలుగానూ తీసుకున్నాను. ఇంకా ఈ వ్యాసం కోసం 'మిసిమి' వంటి అంతర్జాల పత్రికలను, ఇతరాత్ర అంతర్జాల సమాచారాలను కూడా ఉపయోగించాను. ఈ సమాచారంతో కావ్యంలో వ్యక్తమైన అంశాలను గుణాత్మక విశ్లేషణ పద్ధతిలో పరిశీలిస్తూ మహైకలో సామాజికత ఏ విధంగా రూపుదిద్దుకుందో వివరించే ప్రయత్నం చేశాను. దీనివల్ల తొలినాటి వచన కావ్యం వచ్చే నాటికి ఆ సమాజం ఎట్లాంటి దొంతరలను కలిగి ఉందో, ఆ సామాజిక వాస్తవికత మహైకలో ఏ విధంగా వ్యక్తమైందో అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసం ఉపయుక్తకరమవుతుందని చెప్పవచ్చు.

**కీలక పదాలు:** మహైక, వచన కావ్యం, సామాజికత, శ్రమ, దోపిడీ, అణచివేత, సామాజిక వైరుధ్యాలు, చైతన్యం, ఏకత్వం, పోరాటం, మార్క్సిస్ట్ దృక్పథం.

## 1. ప్రవేశిక:

సాహిత్యం సామాజిక చైతన్య రూపం. కనుక మనం ఒక కాలానికి చెందిన సాహిత్యాన్ని గమనిస్తున్నామంటే ఆ కాలానికి సంబంధించిన సమాజాన్ని కూడా అంతర్లీనంగా గమనిస్తున్నామని అర్థం. నిజానికి సాహిత్యం సమకాలీన సమాజాన్ని రికార్డు చేయడానికి తన వంతు పాత్రను పోషిస్తుందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అందుకే చరిత్రనర్థం చేసుకోవడానికి సాహిత్యం మిగతా ఉపకరణాల్లాగే ఎంతో బాగా తోడ్పడుతుందని గ్రహించాలి. ఇక సామాజికత, సామాజికాంశాలనే విషయాలను అర్థం చేసుకోవడానికి ముందు "మానవ అస్తిత్వం ప్రధానంగా రెండు విధాలుగా ఉంటుంది. వ్యక్తి, సమాజం అని. వ్యక్తిది ఏకపాత్రాభినయం. సమాజానిది సంయుక్తాభినయం. ఒకరిది వైయిక్తికం. రెండవ వారిది సామాజికం. ఒకరిది గుప్తానుభూతి మరొకరిది వ్యక్తప్రసారం. ఒకరిది లోతు. రెండవది వెడల్పు(సంజీవ దేవ్(వ్యా) 07)" అనే ప్రాథమిక అవగాహనను మనం ఏర్పరచుకొని ఉండాలి. అప్పుడే ఈ సమాజం, మళ్లీ అందులోని వ్యక్తి ప్రాధాన్యత ఏంటని మనకు అర్థమవుతుంది.

నిజానికి "సమాజ సహకారం లేకుండా వ్యక్తి తన లక్ష్యాన్ని సాధించలేడు(శివలింగం 45)" ఎందుకంటే పైకి కనిపించే మతం, వర్గం, భాష వంటి అనేకానేక అంశాలు ఒకదానికొకటి పరస్పరం ప్రభావం చేసుకున్నట్టు కనిపిస్తున్నా కూడా అంతర్గతంగా దాని పునాది

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆర్థిక సూత్రం మీదనే ఆధారపడి ఉంటుంది. ఫలితంగా అదే సమాజంలో వివిధ వైరుధ్యాలను, వైవిధ్యాలను ఏర్పరచడానికి అది కారణం అవుతుంది. అలా చూసినప్పుడు ఈ సమాజం భిన్న భావాల సమాహారం అనే విషయం మనకు అర్థమవుతుంది. కనుకనే ఒక మనిషి ఆకలితో ఉండడం, కార్మికుడిగా దుర్భరమైన జీవితాన్ని గడపడం, స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోవడం వంటి విభిన్నానుభావాల వెనుక పని చేస్తున్న సామాజిక సంబంధాలు మరింత లోతుగా తెలిసిపోతాయి.

మరి ఇలా తెలిసిన సామాజిక సంబంధాల్లో సామాజికత కేవలం సమస్యల సంఖ్యలో కొలవడం కంటే ఆ సమస్యను ఉత్పత్తి చేస్తున్న సంబంధాలను గుర్తించడం అవసరం. అట్లా చూసినప్పుడు బాధను వ్యక్తిగత దురదృష్టంగా చూపించడం ఒక పద్ధతి అయితే అదే బాధకు సామాజిక కారణం కూడా ఉంటుందని గుర్తించడం ఇంకో పద్ధతి. అలా ఈ రెండో పద్ధతిలోని సాహిత్యం తన సామాజిక అర్థాన్ని మరింత లోతుగా సంపాదించుకుంటుంది. ప్రస్తుతం ఇక్కడ చర్చించబడుతున్న మహైకను ఈ దృష్టి కోణంతో చదివితే ఇందులో ప్రస్తావించబడుతున్న 'నేను' కేవలం ఒక వ్యక్తి కాదు. అతని శరీరంలో, రక్తంలో, ఆకలిలో, చీకటిలో ఒక విస్తృత శ్రమజీవి సమాజం ఎలా విస్తరించుకుని ఉందో మనకు కనిపిస్తుంది.

అందుకే మహైకలోని సామాజికాంశాలను గమనించినప్పుడు అందులో ఏ ఏ సామాజిక సమస్యలు ఉన్నాయనే ప్రశ్నతో కాకుండా, ఈ సమస్యలకు కారణమైన సంబంధాలను కవి ఎలా చూపిస్తున్నాడు? అనే ప్రశ్నతో చూడడం ద్వారా ఇందులో శ్రమ, ఉత్పత్తి, దోపిడీ వంటి సంబంధాలు, వాటిని సమర్థించే భావజాలం అవగతమవుతుంటాయి. ఆ అవగాహన నుండే ఈ కావ్యంలో వ్యక్తిగత అనుభవం, సామూహిక చైతన్యంగా ఎలా పరిణామక్రమం చెందిందో పరిశీలనకు వస్తుంది.

**2. మహైక – కావ్య సారాంశం:**

'మహైక' కావ్యం సాధారణంగా ఒక కథను చెప్పేది కాదు. అందులో అనేక స్వరాలు, సామాజిక స్థితులు ఒకదానితో ఒకటి కలుస్తూ ఉంటాయి. కావ్య ప్రారంభంలోనే శిథిల గృహ ప్రాంగణంలో వినిపించే కేకలు ఒక వ్యక్తి అంతరంగంలోని కలతను మాత్రమే కాకుండా సమాజపు అట్టడుగు ప్రాంతాల నుంచి వినిపించే అనేక జీవిత స్వరాలను సూచిస్తాయి. చెప్పాలంటే అవన్నీ కూడా జీవితం ఎంత భీకర సంగ్రామంగా మారిపోయాయో వివరిస్తాయి.

అట్లాంటి పరిస్థితుల నుండి ఈ కావ్యాన్ని ఇంకొంచెం ముందుకెళ్లి చూస్తున్న కొద్దీ ఈ సమాజం ఉల్లిపొరల్లా ఎన్ని వైరుధ్యాలను కప్పుకొని ఉందో అర్థం అవుతుంది. అందులో భాగంగానే కార్మికుడి జీవితం ఇందులో ఒక ప్రధాన అనుభవంగా మనకు తెలుస్తుంది. ఒక సందర్భంలో భూగర్భంలోకి దిగి బొగ్గుని తొవ్వే కార్మికుడు తన శ్రమతో ఇతరుల జీవితాన్ని వెలిగిస్తున్నాడు. కానీ అతని సొంత జీవితంలో వెలిగే లేదు. ఆరున్నర సంవత్సరాలు భూమి రంధ్రంలో గడిపిన అతనికి ఇంద్రధనస్సు తెలియదు. పిల్లల ముఖాలు గుర్తు లేవు. శ్రమ అతని జీవితానికి ఆధారం కావలసింది పోయి అతని జీవితాన్ని తినేసిన ప్రక్రియగా మారినట్లు తెలుస్తుంది.

ఇక మరో సందర్భంలో స్త్రీ జీవితాన్ని ఈ సమాజం మరో రూపంలో ఎలా నిర్మించిందో ఈ కావ్యం వివరిస్తుంది. దేవదాసిగా నామకరణం చేయబడిన స్త్రీ తన యవ్వనం, శరీరం తనకు చెందకుండా పోయిన స్థితిని వ్యక్తం చేస్తుంది. ఇక్కడ వ్యక్తిగత అవమానం వెనుక ఒక సామాజిక వ్యవస్థ ఉంది. దానికి మతం పేరునిస్తుంది. సమాజం దాన్ని అంగీకరిస్తుంది. పురుషాధికారం దాని ప్రయోజనాన్ని పొందుతుంది.

అయితే అదే సమయంలో కవి కర్మఫలాన్ని ప్రశ్నిస్తాడు. బాధను గత జన్మ పాపానికి, దేవుని శాపానికి ఆపాదించే దృష్టికి బదులు మనుషుల క్రియలు, సామాజిక సంబంధాలు సమాజ నిర్మాణం వైపు దృష్టిని మళ్ళిస్తాడు. చివరికి వ్యక్తి ఒంటరి బాధ నుంచి మన అనే భావన వైపుకు కదులుతాడు. ఆ సంఘర్షణా పోరాటం ఏకత్వం, మానవత్వం వంటి భావాలు ఆ ప్రయాణంలో ఏర్పడతాయి.

**3. సామాజిక భావజాలం:**

"ఒక దేశ సామాజిక చరిత్రను అవగాహన చేసుకోవడం అంటే ఆ దేశంలోని ఉత్పత్తి శక్తుల సంబంధాలను క్రమ పద్ధతిలో పరిశీలించడమని చరిత్రకారులు పేర్కొంటారు(రాములు 21)". ఎందుకంటే అప్పుడే ఆ ప్రాంతంలో వేళ్ళూనుకున్న సమస్యలు, ఆ ప్రాంత భావజాలం ఎట్లాంటిదో తేటతెల్లమవుతుంది.

ఇక మహైక విషయానికి వస్తే, సామాజిక భావజాలం అనేది కేవలం సమాజం గురించి చెప్పిన కొన్ని అభిప్రాయాలుగా కాకుండా మనిషి తన దుఃఖానికి కారణాన్ని ఎక్కడ వెతుకుతున్నాడో, తన జీవితాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నాడో, తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎలా ప్రశ్నిస్తున్నాడో ఇందులో తెలుస్తుంది. అందుకే ఈ కావ్యంలో కనిపించే ఆకలి, పేదరికం, శ్రమ, అణిచివేత వంటి అనుభవాల వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను కూడా గమనించాల్సి ఉంటుంది. ఒక సందర్భంలో బాధిత స్త్రీ పట్ల కవి,

**"మీ ముఖంలో మూర్తీభవించిన నిశ్శబ్దం/ఏ జన్మాంతర పాపఫలం తల్లి.../ఏ దేవుడు శపించిన కోపం తల్లి..."** (కవిరాజ మూర్తి 23) అని తన బాధను వ్యక్తపరుస్తాడు. ఈ వాక్యాలను చూసినప్పుడు మొదటగా ఇది సానుభూతిలా కనిపించినప్పటికీ, ఇక్కడ కవి అంతటితో ఆగిపోకుండా ఆ బాధకు సమాజం ఇచ్చే వివరణను కూడా ప్రశ్న దిశగా తీసుకువెళ్తాడు. ఒక మనిషి దుఃఖాన్ని గత జన్మ పాపంగా భావిస్తే ఆ దుఃఖానికి కారణమైన ప్రస్తుత జీవితాన్ని ప్రశ్నించే అవసరం ఉండదు. బాధితుల జీవితంలో జరుగుతున్న దాన్ని అతని పూర్వకర్మకు అప్పగించడం ద్వారా సమాజం తన బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.

**అందుకే మరోచోట,: "కర్మఫలం కాదు కాదు/'క్రియ' లేదంటే 'కర్మ' రాదు/కర్మల మర్మాలన్నీ కలవారి దోబూచులు/సమాజం మనపై వదిలిన వడిగల రేచులు"** (కవిరాజ మూర్తి 23)అంటాడు.ఇక్కడే ఈ కావ్యం స్పష్టమైన మలుపు తీసుకుంటుంది. బాధకు కారణాన్ని గత జన్మలో వెతక్కుండా ప్రస్తుత సమాజంలోని క్రియ, సంబంధం, అధికారం వైపు దృష్టిని మళ్లిస్తుంది. 'క్రియ' అనే పదం ఈ సందర్భంలో ముఖ్యమైనది. మనిషి జీవితంలో జరుగుతున్నదంతా ముందే నిర్ణయించబడింది కాదని, మనుషుల చర్యలు కూడా దాని వెనుక ఉంటాయని అంతర్లీనంగా కవి ఇలా చెబుతూ ఉంటాడు. ఇక ఇందులో ఉపయోగించిన "కలవారి దోబూచులు", "సమాజం మనపై వదిలిన వడిగల రేచులు" అనే వాక్యాలు ఆధిపత్య సమాజం మిగతా సమాజాన్ని ఎలాంటి చట్రంలో బంధిస్తుందో తెలుపుతున్నాయి. అయితే ఈ చట్రం నుంచి బయటపడాలి అంటే "అనుభూతి నుండి భావనాత్మక ఆలోచనకు, అక్కడి నుండి ఆచరణకు ఇదే సత్యాన్ని గురించి తెలుసుకునే గతితార్కిక పంథా" (మార్క్సిస్టు తత్వశాస్త్రం ఒక పరిచయం 116) చేయాలనే లెనిన్ అభిప్రాయాన్ని గుర్తు చేసుకోవలసి ఉంటుంది.

అట్లే, ఈ సామాజిక వైరుధ్యం శ్రమజీవి జీవితంలోకి వచ్చినప్పుడు ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. **"భూగర్భం లోతుల లోనికి / పార పలుగు చేతబట్టి దునికి / నే త్రవ్విన నేలబొగ్గు / ధనవంతుల బ్రతుకుల కుగ్గు"**(కవిరాజ మూర్తి 35) అనే పంక్తుల్లో కార్మికుడి శ్రమకు, ఆ శ్రమ ఫలితం చేరే దిశకు మధ్య ఉన్న వైరుధ్యం కనిపిస్తుంది. "నే త్రవ్విన" అనే మాట కార్మికుడి శ్రమను స్పష్టంగా చూపిస్తే, "ధనవంతుల బ్రతుకుల కుగ్గు" అనే మాట ఆ శ్రమ ప్రయోజనం ఎటు చేరుతుందో తెలియజేస్తుంది. అంటే ఒకవైపు శ్రమించే మనిషి ఉండగా, మరోవైపు ఆ శ్రమ ఫలితాన్ని అనుభవించే వర్గం ఉంటుంది. ఇక్కడ శ్రమ ఒకచోట జరుగుతుంటే దాని ప్రయోజనం మరోచోటికి చేరుతున్న సామాజిక సంబంధం కనిపిస్తుంది.

అయితే ఈ శ్రమకు సంబంధించిన దోపిడీ కేవలం కార్మికుడి ఆర్థిక జీవితానికే పరిమితం కాదు. అతని వ్యక్తిగత జీవితాన్ని కూడా అది ఆక్రమిస్తుంది. ఎలాగంటే, **"కారునలుపు బాటల్లో / జాలికండ్ల సైగలలో / బరువెక్కిన ఈ కండ్లకు / భానుకాంతి అగుపించదు / బ్రతుకుదెరువు కనుపించదు"**( కవిరాజ మూర్తి 38) అంటూ కవి మరోచోట జీవితంలోని చీకటిని వివరిస్తాడు. ముఖ్యంగా **"ఆరున్నర వత్సరాలు / ఈ అవని రంధ్రంలో / నీటిలోని చేపవోలె / చీకటిలో దాగున్నా / అరుణోదయాన్ని చూడలేదు / పిల్లలముఖం గుర్తులేదు"** (కవిరాజ మూర్తి 38) కవితా వాక్యాల ద్వారా శ్రమ మనిషి జీవితాన్ని ఎంతగా ఆక్రమించిందో తెలియజేస్తారు.

ఇదే విధంగా స్త్రీ జీవితంలో కూడా దోపిడీ మరో రూపంలో వ్యక్తమవుతుంది. **"నా ఎర్రని రుధిర స్రవంతిలో / నాగరికతా ప్రపంచం నాలుకను తడుపుకుంది. / నా కష్టానికి, నా రక్తానికి ప్రతిఫలం / మిగిలిందేదో – నా ఆస్తి పంజరం"** (కవిరాజ మూర్తి 28) అనే కవితా వాక్యాల్లో స్త్రీ అనుభవ నేపథ్యంలో చదివినప్పుడు 'రుధిరం' కేవలం రక్తానికి సంబంధించిన పదంగా మాత్రమే కనిపించదు. స్త్రీ తన శరీరం, యౌవనం, శ్రమ, జీవితాన్ని సమాజం కోసం ఖర్చు చేయాల్సి వచ్చిన స్థితికి అది విస్తరిస్తుంది. నాగరికతా ప్రపంచం అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని వెనుక ఎవరి శ్రమ, ఎవరి శరీరం, ఎవరి జీవితం ఖర్చవుతున్నదనే ప్రశ్నను ఈ పంక్తులు ముందుకు తెస్తాయి. స్త్రీకి తన శరీరంపై తనకే హక్కు లేకుండా పోయిన స్థితి తరువాత వచ్చే దేవదాసి సందర్భంలో మరింత స్పష్టమవుతుంది.

**"అచంచల శిల ప్రతిమలా / రాతిమీది అజంతా గీతలా / నా యౌవనం అందరికి చెందుతుంది / నా అధరం అందరికి అందుతుంది"** (కవిరాజ మూర్తి 43)అనే దగ్గర స్త్రీ తన యౌవనం, శరీరం తనకు చెందని పరిస్థితిని వ్యక్తం చేస్తుంది. ఇక్కడ వ్యక్తిగత

అవమానం వెనుక ఒక సామాజిక వ్యవస్థ పనిచేస్తుంది. "ఒకనాటి నాగరికతా సమాజం / 'దేవదాసి అని' చేసింది నామకరణం" అనే చోట ఒక స్త్రీ జీవితాన్ని సమాజం ఒక పేరుతో నిర్వచించి, ఆ పేరుకే ఒక సామాజిక స్థానం కల్పించిన తీరు కనిపిస్తుంది. దానికి మతం ఒక రూపాన్నిస్తే, పురుషాధిక్య సమాజం దాని ప్రయోజనాన్ని పొందుతుంది. "**గుడి ప్రమిదల చల్లని వెలుగులు / పూజారి కామానికి మిణుగురులు**" అనే పంక్తుల్లో పవిత్రత పేరుతో కొనసాగుతున్న వ్యవస్థలోని వైరుధ్యాన్ని కవి బయటపెడతాడు. అందువల్ల ఇక్కడ స్త్రీ సమస్యను కేవలం వ్యక్తిగత దుఃఖంగా కాకుండా మతం, పురుషాధికారం, శరీరం, సామాజిక ప్రయోజనం మధ్య ఏర్పడిన సంబంధంగా చూడాల్సి ఉంటుంది.

ఇలా చూసినప్పుడు మహైకలో సామాజిక భావజాలం అనేది సమస్యలను వరుసగా చెప్పడం మాత్రమే కాదు. ఒక మనిషి ఆకలి, ఒక కార్మికుడి శ్రమ, ఒక స్త్రీ శరీరం వెనుక ఉన్న సామాజిక సంబంధాలను గుర్తించడం. కనుకఈ అవగాహనతోనే వ్యక్తిగత బాధలను ఎదుర్కొనే మనుషులు తమ మధ్య ఉన్న చీలికలను కూడా గుర్తించాల్సిన అవసరం వస్తుంది. అందుకే ఒకచోట

"**మనలోమన చీలిక/మన పతనానికి ఏలిక/మనలోమన చీలిక/మృత్యుదేవికి నాలుక**."( కవిరాజ మూర్తి 34) అంటాడు. ఇందులో చీలికను కేవలం వ్యక్తుల మధ్య ఉన్న విభేదంగా చూడటం లేదు. తమను అణచివేసే సామాజిక సంబంధాల నుంచి బయటపడాల్సిన మనుషుల మధ్య ఏర్పడే విభజనగా చూస్తున్నాడు. అందువల్ల ఏకత్వం ఇక్కడ ఒక నైతిక ఉపదేశం కాదు; మార్పుకు అవసరమైన సామాజిక శక్తి. అదే భావనను మరోచోట "**చేతికి చేయి కలిస్తే / రెండవక మానవుడు / మానవుడు మానవుణ్ణి కలిస్తే / బాధలు తీరకపోవు**" (కవిరాజ మూర్తి 44)అంటూ కవి ఒక ఆశావాహాన్ని వ్యక్తం చేస్తాడు.

**ముగింపు:**

మొత్తంగా మహైక వచన కావ్యాన్ని పరిశీలిస్తే, ఇందులో సామాజికాంశాలు కేవలం కావ్య వస్తువుగా మాత్రమే కాకుండా, కావ్యాన్ని నడిపించే అంతర్గత శక్తిగా పనిచేస్తున్నాయని తెలుస్తుంది. మనిషి జీవితంలోని బాధను చూపించడం నుంచి ఆ బాధకు కారణమైన సంబంధాలను గుర్తించడం వరకు సాగిన క్రమమే మహైకలోని సామాజికతకు ప్రత్యేకతను కలిగించింది. శ్రమను, దోపిడీని, అణచివేతను విడివిడిగా కాకుండా ఒకదానితో ఒకటి సంబంధం ఉన్నవిగా చూడటం వల్ల ఈ కావ్యం ఆనాటి సమాజంలోని వైరుధ్యాలను మరింత స్పష్టంగా చూపించగలిగింది.

అయితే మహైకలోని సామాజికతకు అసలు ప్రత్యేకత **బాధను చిత్రించడంలో కాకుండా, బాధ వెనుక ఉన్న సమాజాన్ని కనిపించేలా చేయడంలో ఉంది.** అందువల్లే ఈ కావ్యంలో వ్యక్తి అనుభవం క్రమంగా సామాజిక అనుభవంగా మారి, చివరకు ఏకత్వం, చైతన్యం, పోరాటం వంటి భావాలకు దారి తీస్తుంది. ఈ దృష్టిలో మహైక వచన కావ్యం తన కాలాన్ని ప్రతిబింబించిన రచనగా మాత్రమే కాకుండా, తన కాలపు సామాజిక సంబంధాలను ప్రశ్నించిన రచనగా కూడా ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.. ఇదే ఈ వచన కావ్యంలోని సామాజిక ప్రయోజనానికి ప్రధానమైన అర్థంగా గుర్తించవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. కవిరాజ మూర్తి (క). శ్రీనివాస్,సంగిశెట్టి(సం).'మహైక", పునర్ముద్రణ.,తెలంగాణ ప్రచురణలు,2017.
2. '*మార్క్సిస్ట్ తత్వ శాస్త్రం ఒక పరిచయం*', 1st.ed., న్యూ విస్టాస్ పబ్లికేషన్స్,2005.
3. రాములు.పిల్లలమర్రి, '*తెలుగులో భక్తి కవిత్వం–సామాజిక విశ్లేషణ*', 1st.ed.,ప్రజాశక్తి బూక్ హౌజ్,2012.
4. శివలింగం(వ్యా).'*సామాజిక అస్తిత్వం–వైయుక్తిత*',మిసిమి,మార్చ్ సంచిక,2001.
5. శ్రీహరి,రవ్వా(సం). '*తెలుగు ఆధునిక సాహిత్య చరిత్ర*', 1st.ed.,తెలుగు అకాడమీ.2016.
6. సంజీవ్ దేవ్(వ్యా).'*సాహిత్యం–సమాజం*',మిసిమి,డిసెంబర్ సంచిక,1994.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# దళిత సాహిత్యంలో – చోడగిరి చంద్రరావు శతకాల ప్రాశస్త్యం

**1 – గుర్రాల రమాదేవి,**
పరిశోధకురాలు,
తెలుగు విభాగం,
ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్టణం.

**2 – జర్రాఅప్పారావు**
పరిశోధక మార్గదర్శి,
తెలుగు విభాగం,
ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్టణం.

**ఉపోద్ఘాతం:**

కుల వివక్ష సామాజిక కట్టుబాట్లుగా చలామణి అవుతున్న రోజుల్లో బహుజన కులాల్లో చదువుకోవడమే గగనకుసుమం .అటువంటి వాతావరణం లో చదువుకొని పద్యాలు రాయడం అంటే సామాన్యమైన విషయం కాదు భీమ శతకం పేరుతో 300 పద్యాలు రాయడం విశేషమే ,చోడగిరి చంద్రరావు భీమ శతకం కుసుమ ధర్మన్న నుంచి నేటి వరకు వస్తున్న దళిత కవిత్వంలో ఎన్నదగినది తన సాహిత్య ప్రస్థానం అలా మొదలైంది. సమకాలీన కవులు అయినా వేదుల సత్యనారాయణ శాస్త్రి ,సి నారాయణ రెడ్డి గార్ల ప్రశంసలు అందుకున్నాడు చంద్రరావు.

**పరిచయం:**

అంబేద్కర్ పై మోజుతో గాని పద్యాల మీద మమకారంతో గాని చోటగిరి చంద్రరావు రచనలు చేయలేదు. వీరు రచనలు అన్నింటిలోనూ బహుజన తాత్విక ధోరణి ప్రత్యేకంగా కలిగి ఉంది. బహిరంగంగా అవమానపరిచే అంటరానితనం, కులవివక్షకులాల వారు కింది కులాల వారిని తక్కువ చేసే వంటివి వీరి రచనల్లో ప్రముఖంగా దర్శనమిస్తాయి.

మొహమాటం లేకుండా చెప్పాలనుకున్నది సూటిగా, నిర్భయంగా చెప్పడం చోడగిరి వారి రచనల్లో ప్రత్యేకత.కవిత నీవు కావ్య వస్తువు నీవు పంట మందు నీవు కనుల నీవు

నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే ఏమి చెప్పనయ్య భీమరాయ అని తన కావ్యాలకు వస్తువు తన దేహానికి ప్రాణము అంబేద్కర్ అని పేర్కొన్నారు. చోడగిరి చదువు ఉద్యోగం రచన వ్యాసంగం అన్ని అంబేద్కర్ చలవే అని ఆయన ప్రగాఢ విశ్వాసం.

అంబేద్కర్ వ్యక్తి పూజ చాలా ప్రమాదకరమైనది అని చెప్పారు. ఒక వ్యక్తిని దైవంశ సంభూతుడిగా ఆరాధించడం వలన అది నియంతృత్వ నికి దారితీస్తుందని అంబేద్కర్ చెప్పారు. అందువల్ల వ్యక్తి ప్రగతి కోసం కాకుండా అంబేద్కర్ జాతి ప్రగతి కోసం అహర్నిశలు జీవితాన్ని త్యాగం చేసిన వైనాన్ని వ్యక్తీకరించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని ఆకాంక్షించారు.

సమాజం ఎలా ఉందో అది సాహిత్యములో ప్రతిబింబించాలి అటువంటి సాహిత్యమే నిజమైన సాహిత్యం అనిపించు ఉంటుంది. ఆ విధమైన సాహిత్యాన్ని సృష్టించిన వారిలో చోడగిరి చంద్రరావు ప్రధమ శ్రేణిలో ఉంటాడు.

అసమానమైన అంబేద్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకున్నారు. దీని ద్వారా ఆయన రాజకీయ సామాజిక లక్ష్యాన్ని శుభోద కంగా

పద్యకరించాడు .సమాజం ఎలా చిన్నాభిన్నమైందో దానికి ప్రధాన కారణం కుల వ్యవస్థను అని ఉక్రోశించారు. దానివల్ల సాటి మనిషి ఎంత అవమానకరమైన స్థాయిలోకి నెట్టి వేయబడ్డాడు వీరు సూటిగా స్పష్టంగా చెప్పారు.

ఆవు పేడ కన్నా అంత తక్కువ వీడు

మంత్రి అయినా ముఖ్యమంత్రి అయిన

ఎవడు సృష్టి చేసే నీ కులంబుల తండ్రి

ఏమి చెప్పనయ్య భీమరాయ

అని కుల వ్యవస్థను నిరసించారు. దళితవాదానికి బలమైన తాత్విక దృక్పథం చంద్ర రావు గారి శతకాల్లో దర్శనమిస్తుంది.

ఈ దేశానికి రామాయణం కావలసి వచ్చినప్పుడు దళితుడు రాశాడు, ఈ దేశానికి భారతం కావలసి వచ్చినప్పుడు దళితుడే రాశాడు, ఈ దేశానికి రాజ్యాంగం అవసరం వచ్చినప్పుడు మా వాడే రాసాడని చెప్పారు .

గొప్ప వాళ్ళు సమాజానికి బాటలు వేసిన వారి కోసం కులాన్ని ప్రస్తావించరు అదే కులంలో పుట్టిన వారిని మాత్రం పీడిస్తారు. కోహనా మేధావులు కులాన్ని నిర్మించాలంటూ ప్రసంగాలు ఇస్తారు. లోలోపల మాత్రం కులం అలాగే ఉండాలని భావిస్తారు అని బాహాటంగా చెప్పినటువంటి వారు చోటగిరి వారు.

ఈ సమాజంలో బడుగు వర్గాలకు బావులు వేరుగా వారు నడిచే మార్గాలు వేరుగా వారు జీవించే పల్లెలు వేరుగా ఉండడాన్ని నిరసిస్తూ ఎన్నో పద్యాలను రాశారు.

నిచ్చెన మెట్ల వ్యవస్థలో అణగారిన వర్గాలకు ప్రతి వస్తువును ప్రత్యేకంగా ఉంచిన వ్యవస్థను నిశితంగా విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ ఇక్కడే ఉండడాన్ని బట్ట బయలు చేశారు రెండు గ్లాసుల విధానాన్ని కూడా చందర్రావు దుయ్యబట్టారు.

అందరూ ఒకే దేశస్థులైన దళితుల్ని ప్రత్యేకించి నీచంగా చూడడాన్ని దిగులు చెందారు ఆ దేశ మూలవాసుల్ని బానిసలుగా చూడడాన్ని ఆవేదన చెందారు దేశానికి పంటలు పండించి కాయ కష్టాన్ని దారం పోసింది దళితు లే నని అన్నారు.

అప్పట్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్ళను కట్టి ఇచ్చేవారు అవి అగ్గిపెట్టలా ఉండేవి ఎంత పేదవాళ్ళకైనా పిల్లజల్ల ఉంటారు ఆ కాలంలో పెద్ద సంతానమే ఉండేది ఆ చిన్ని గదిలో సంసారం చేయడం చాలా కష్టంగా ఉండేది ఆ విషయాన్ని చందర్రావు తన పద్య రూపంలో దుయ్యబట్టారు

బౌద్ధులందరూ అంబేద్కర్ వాదులు కాదు కానీ అంబేద్కర్ వాదులందరూ బౌద్ధులే ఇది చోడగిరి చంద్రరావుకి వర్తించింది.

అంబేద్కర్ బౌద్ధం స్వీకరించాడు, వీరు కూడా బౌద్ధాన్ని తన కావ్య వస్తువుగా స్వీకరించారు బౌద్ధ మతంలోని ఉదారతను ,సౌమ్యతను తన శతక రచనల్లో వ్యక్తీకరించారు. మహాత్మా గాంధీ రాజకీయాల్ని ఈ శతకాల్లో వ్యంగ్యంగా విమర్శించారు.

**ముగింపు:**

అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఈనాడు వెలువడుతున్న సాహిత్య తత్వానికి చందర్రావు శతక సాహిత్యం మార్గదర్శకంగా నిలుస్తుంది. అంబేద్కర్ వారి సాహిత్యం బలియాంగా రాకమునుపే తన శతకాల ద్వారా అంబేద్కర్ వాదాన్ని బలియాంగాన్ని వినిపించిన ఘనత చోడగిరి వారికే దక్కుతుంది.

**ఆధార గ్రంథాలు:**


1. హృదయ వీణ 1968
2. భీమ శతకం 1972
3. చందర్రావు కవిత 1977
4. అన్వేషణ 1981
5. భీమ శతకం _2 .1989

## సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# అడవి బాపిరాజు 'అంశుమతి' నవల – స్త్రీ పాత్రలు

**– మీసరగండ గాయత్రి దేవి,**

పరిశోధక విద్యార్థిని,

యోగివేమన విశ్వ విద్యాలయం, కడప,

చరవాణి:6300995657,

gayathri.devi219@gmail.com

**విషయ సంగ్రహం:**

తెలుగు సాహిత్యంలో 19, 20 వ శతాబ్దాలు ఎంతో పేర్కొనదగినవి. భారతదేశంలోనే కాక అటు ప్రపంచ వ్యాప్తంగా కూడా సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, మతపరంగా ఎన్నో మార్పులు సంభవించాయి. ఈ కాలాన్ని తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగంగా పరిగణిస్తారు. ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో కూడా ఎన్నో పరిణామాలు సంభవించాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన ఆధునిక ప్రక్రియలలో నవల ఒకటి. దీనికి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం ఉంది. తెలుగు సాహిత్యంలో పేరుగాంచిన నవలాకారులలో ఒకడు అడవి బాపిరాజు గారు. వారు రచించిన అంశుమతి నవలలోని స్త్రీ పాత్రలు గురించి వివరించడమే ఈ వ్యాస ఉద్దేశం.

**ప్రధానాంశాలు:** ఆధునిక సాహిత్యం, చారిత్రక నవల, అడవి బాపిరాజు, అంశుమతి నవల, స్త్రీ పాత్రలు

**ఉపోద్ఘాతం:**

తెలుగు సాహిత్యంలో ప్రఖ్యాతి గాంచిన రచయితలలో అడవి బాపిరాజు గారు ఒకరు. 19, 20 వ శతాబ్దాలలోని ప్రజలకు, నేటి కాలంలోని సాహిత్యాధ్యయనం చేసే ప్రతీ ఒక్కరికి వీరు సుపరిచితులే. వీరు కథా రచయితగా, నవలాకారుడిగా, శిల్పిగా, చిత్రకారుడిగా, నటుడుగా, కళాదర్శకుడిగా జీవితంలో ఎన్నో పాత్రలను పోషించారు. బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొందాడు. వీరు రచించిన నవలలు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందినవి. అడవి బాపిరాజు రచించిన చారిత్రక నవలల్లో ఇది అతి చిన్న నవల. చాళుక్య విష్ణువర్ధన మహారాజు, అంశుమతిల ప్రణయ గాథ వర్ణించబడింది. చారిత్రక క్రమాన్ని అనుసరించి కుబ్జ విష్ణువర్ధనుని చరిత్రను, అతని సమకాలీకులను గ్రహించి, చారిత్రకతకు దగ్గరగానే కథను రచించినట్లు కనిపిస్తోంది. దీనిలో విష్ణువర్ధనుడు చేసిన యుద్ధాలే ప్రధానంగా వివరించబడ్డాయి. ఎక్కువ వర్ణనలు లేకుండా, మితిమీరిన పాత్రల ప్రయోగంతో కథను సాగదీయకుండా రచించారు రచయిత.

**ఇతివృత్తం:**

ఆంధ్ర సామ్రాట్ గా పిలవబడుతున్న, వేంగీ మహానగర పాలకుడు, విష్ణుకుండినుడైన మంచన బట్టారుకుని ఏకైక పుత్రిక అంశుమతి. వీరి పూర్వీకులు అందరూ తరతరాలుగా గోపూరులోని గోపాద క్షేత్రంలో పూజలు చేయడం ఆనవాయితీగా ఉండేది. గోవు వీరికి కుల దేవత. అందుకు కారణం పూర్వం విజయవాడ ప్రాంతాన్ని పాలించిన మాధవవర్మ రాజు కథ. ఇతను ధర్మ బద్ధ పరాయణుడు. అతని కొడుకు దేవ వర్మ మంచివాడే అయినప్పటికీ ఒక దినాన మద్యం మత్తులో తన రథాన్ని తానే రాజ వీధిలో అతివేగంగా నడుపుకుంటూ వెళ్ళాడు. ఈ క్రమంలో అతని రథం కింద ఒక ఆవు లేగ దూడ నలిగి, ప్రాణం కోల్పోయింది. ఆవు యజమాని దూడ శవమును మోసుకొని వెంట రాగా ఆవు మాధవ వర్మ నిర్మించిన ధర్మ గంట దగ్గరకు వచ్చి, గంట తాడు లాగి మోగించింది. పురజనులు, రాజు అందరూ దానిని చూసి ఆశ్చర్యపోయారు. జరిగిన విషయం తెలుసుకున్న రాజు మాధవ వర్మ తన కొడుకుకి కూడా మరణ దండన విధించాడు. గోవు కాలి

గిట్టలకు ఇనుప మేకులు కలిగిన అచ్చులు బిగించి, దానితో తన కొడుకుని తొక్కించమని శిక్ష వేశాడు. కానీ గోవు అతన్ని తొక్కి చంపక విడిచిపెట్టింది. సాక్షాత్తు కనకదుర్గే ఈ గోవు రూపంలో వచ్చినట్లుగా అందరూ భావించారు. ఆ సమయంలో పరమ శివుడు విజయవాడ ప్రాంతంలో కనక వర్షం కురిపించినట్లుగా ప్రజలు చెప్పుకున్నారు. ఆ గోవు యజమానికి అత్యంత ఖరీదు చెల్లించి రాజు దానిని కొని, తమ కుల దైవంగా భావించి, పూజలు చేశారు. ఆ గోవు చనిపోయాక దాని విగ్రహం చేయించి, గోపాద క్షేత్రంలో గుడి కట్టించారు. ఆనాటి నుండి వారు అక్షేత్రంలో పూజలు చేస్తూ వచ్చారు.

ఆ వంశంలో జన్మించిన విష్ణుకుండిన మహారాజు కూతురైన అంశుమతికి జాతక దోషం ఉండడం వల్ల రాజ పురోహితుడి సూచన మేరకు గోపాద క్షేత్రం వద్ద గోదావరిలో వ్రతంగా స్నానాలు చేయించడానికి తీసుకువెళ్లాడు. ప్రతిరోజు అంశుమతి అత్యంత జాగ్రత్తల మధ్య నదీ స్నానం చేస్తుండేది. ఒకనాటి సాయంకాలం వ్రతం అయిపోయాక గోదావరి నదిలో నౌకా విహారానికి తన చెలికత్తె మాధవితో బయలుదేరింది. తమ వెంట సైన్యాలు, పరిచారికలు వేరొక పడవలలో వెంబడిస్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా కొందరు ముష్కరులు వారిని చుట్టుముట్టి రాకుమారి అంశమతిని, ఆమె చెలికత్తె మాధవిని ఎత్తుకొని పోయారు. ఆమెను అపహరించినది పిష్టపుర పాలకుడైన గాంగులు. వేంగి నగర పాలకుడైన విష్ణుకుండిన రాజ్యాన్ని ఆక్రమించాలని, పల్లవులతో పొత్తు చేసుకొని దానిని చుట్టుముట్టాలని పన్నాగం చేశాడు. రాజ్యం వశం కాకపోతే అంశుమతిని అపహరించుకొని వెళ్లి, పెళ్లి చేసుకొని, ఆ రాజ్యానికి అల్లుడు కావాలని ఎత్తుగడ వేశాడు.

అదే సమయానికి కుబ్జ విష్ణువర్ధనుడు జైత్ర యాత్ర చేస్తూ తమ అన్నగారి చక్రవర్తిత్వాన్ని వ్యతిరేకించిన గాంగులు రాజ్యాన్ని ముట్టడించి, అతడిని అణచి, రాజ్యాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ సమయంలో మాధవి సభలోకి వచ్చి విష్ణుకుండిన మహారాజ కుమార్తె బందీగా ఉన్నదని, విడిపించమని కోరుతుంది. కుబ్జ విష్ణువర్ధనుడు ఆమెను విడిపించి, సకల మర్యాదలతో విష్ణు కుండిన రాజైన మంచన బట్టారకునికి అప్పగించమని చెప్తాడు. అంశుమతి ఆరోగ్యం కుదుట పడ్డాక ఒకనాటి సాయంకాలం వన విహారం చేస్తున్న సమయంలో అక్కడ ఒంటరిగా ఉన్న కుబ్జ విష్ణువర్ధనుడిని చూస్తుంది. ఇద్దరూ ఒకరినొకరు పేర్లు మార్చుకొని చెప్పుకొని పరిచయం చేసుకుంటారు. అంశుమతి తనను కిరణవతిగా, రాజకుమారి చెలికత్తెనని పరిచయం చేసుకుంటుంది. విష్ణువర్ధనుడు తనను సామంతుడిగా ప్రియదర్శి అనే పేరుతో పరిచయం చేసుకుంటాడు. అంశుమతి అతనితో ప్రేమలో పడుతుంది. అతనిని తప్ప వేరొకరిని పెళ్లి చేసుకోనని ఆమె తల్లి సంజ్ఞా దేవితో చెప్తుంది. గొప్ప చాళుక్య వంశంలో పుట్టి, ఒక సాధారణ సామంతుని ప్రేమించినందుకు ఆమె తండ్రి, తల్లి ఎంతగానో బాధపడతారు. రాజ పురోహితుడి చేత అనేక పర్యాయాలు అంశుమతి జాతకాన్ని పరిశీలన చేయిస్తారు. విష్ణువర్ధనుడు వంటి ఉత్తముడైన వీరుడికి తన కూతురిని ఇవ్వాలని రాజు ఆశపడతాడు.

పిష్టపుర పాలకుడు గాంగులు మరలా తన అనుచరులైన కుంభమిత్రుడు అనే వానిని పంపి, అంశుమతిని, మాధవిని అపహరించుకు రమ్మని చెప్తాడు. కుబ్జ విష్ణువర్ధనుడు ఆ సమయంలో మంచన బట్టారకుని రాజ్యంలో అతిధిగా ఉంటాడు. అంశుమతి విష్ణు వర్ధనుడిని చూడలేదు. అతని పరివారంలో ప్రియదర్శి ఉంటాడని ఆసపడింది. మరలా ఒక సాయం సమయంలో రాజూద్యాన వనంలో అతనిని కలుస్తుంది. ఆమె మనసులోని మాటను, ప్రేమను అతనికి తెలియజేస్తుంది. కానీ విష్ణువర్ధనుడు తాను పొట్టివాడననే భావంతో ముందు కొంచెం జంకుతాడు. కానీ అతని మనసులో కూడా ఆమెపై ప్రేమ ఉంటుంది. ఒకరినొకరు తమ అసలు పేర్లను చెప్పుకుంటారు. ఇంతలో కుంభమిత్రుడు తన అనుచరులతో అంశుమతి, మాధవి మీద దాడి చేస్తాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న "విష్ణువర్ధనుడు సింహం వలె మారిపోయినాడు. అతడు నిరాయుధుడు. మొలనున్న రత్నాల పిడి గల ఛురిక తప్ప వేరొక ఆయుధము ప్రభువు కడలేదు. ఎవరు మీరు? ఈ రాజాంతఃపురోద్యానవనమునకు ఎలా వచ్చిరి?" (అంశుమతి అడవి బాపిరాజు పుట: 280) అంటూ ప్రశ్నించాడు. అతనిని చూసిన కుంభమిత్రుడు కుబ్జ విష్ణువర్ధనుడుని అపహాస్యం చేసి, అతనిపై తన గదాయుధంతో దాడి చేశాడు. కానీ విష్ణువర్ధనుడు వారినందరిని కుంభమిత్రుడి దగ్గర ఉన్న పెద్ద కత్తితోనే ఎదుర్కొంటాడు. మంచన భట్టారకుడు తన కూతురు ఇష్టపడుతుంది వేరే ఎవరినో కాదని, విష్ణు వర్ధనుడినని తెలుసుకొని విష్ణువర్ధనుని సోదరుడైన పులకేసి వల్లభుడికి వివాహ వర్తమానం పంపిస్తాడు. ఆ వర్తమానం మోసుకొచ్చిన నరసింహ భట్టుని పులకేసి ప్రభువు ఘనంగా సన్మానిస్తాడు. తన తమ్ముడు వీరుడైనప్పటికీ పొట్టివాడుగా ఉండటం వల్ల ఇన్నాళ్లూ వివాహం కాలేదని బాధపడ్డాడు. అంశుమతి దేవి వంటి సౌందర్యవతి తన తమ్ముడికి భార్యగా దొరికినందుకు తన సంతోషాన్ని తెలియజేస్తాడు. ఒక శుభముహూర్తాన వారి ఇరువురికి వివాహం జరుగుతుంది. అంతటితో కథ ముగుస్తుంది.

**చారిత్రక విశ్లేషణ:**

ఈ కథలో రచయిత చారిత్రక ఆధారాలకు అనుగుణంగానే పాత్రలను స్వీకరించారనే విషయం అర్థమవుతుంది. కథలో రచయిత చాలా భాగం వరకు గోదావరి నది ఆవిర్భావ కథను, అదేవిధంగా మాధవ వర్మ కథను కూడా చెప్పారు. గోదావరి నది పుట్టుక, గోవూరి క్షేత్రం మహత్యం విషయంలో జన ప్రసిద్ధి గాంచిన కథనే వీరు స్వీకరించారు. కానీ విజయవాడను పాలించిన మాధవ వర్మ కథ విషయంలో కొంత వైవిధ్యతను చూపించారు బాపిరాజు. ఇదే కథను "విశ్వనాథ సత్యనారాయణ కూడా తన 'ఆంధ్ర ప్రశస్తి' గ్రంథంలో తెలియజేశారు." (ఆంధ్ర ప్రశస్తి – విశ్వనాథ సత్యనారాయణ పుట: 21 & నవ వసంతం – 6వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకం – పుట: 46) విశ్వనాథ వారు చెప్పిన కథకు, బాపిరాజు గారు చెప్పిన కథకు వ్యత్యాసం ఉన్నది. మాధవ వర్మ కుమారుడి పేరును బాపిరాజు దేవవర్మగా సూచించారు. విశ్వనాథ వారు అతని పేరును ప్రకటించలేదు. కాగా దేవవర్మ మత్తుడై రథాన్ని రాజ వీధిలో వేగంగా నడిపినట్లుగా చెప్పగా విశ్వనాథ వారు మాత్రం అప్పుడే తెప్పించిన మేలు జాతి అరబీ గుర్రాలను పరీక్షించేందుకు అహంకార పూరితుడై రాజ వీధిలో, జన సమర్థంగా ఉన్నా సరే లెక్క చేయకుండా, ముందు హెచ్చరిక లేకుండా, వేగంగా పోనిచ్చినట్లుగా చెప్పారు. బాపిరాజు గారు అతని రథం క్రింద లేగ దూడ పడి మరణించినట్లుగా చిత్రించారు. విశ్వనాథ వారు మాత్రం ఒక విధవరాలి ఏకైక పుత్రుడు మరణించినట్లుగా చిత్రించారు. విశ్వనాథ వారి కథనం ప్రకారం మాధవవర్మ తన న్యాయాధిపతుల తీర్పు ప్రకారం తన కుమారుడికి శిరచ్ఛేదం చేయడం శిక్షగా విధించాడు. అతని ధర్మ పరిపాలన చూసి విజయవాడ నగరం అంతా దుర్గాదేవి కనక వర్షం కురిపించిందని, అందుకే దుర్గమ్మకు కనకదుర్గ అనే పేరు వచ్చిందని చెప్పారు. అయితే చనిపోయిన రాజకుమారుడు విధవరాలి కుమారుడు ఇద్దరూ తర్వాత తిరిగి ప్రాణం పొందుకోవటం అనేది ఈ కథలో వాస్తవికతకు దూరంగా ఉందని చెప్పవచ్చు. కానీ బాపిరాజు ఇటువంటి సందేహాలకు, అనుమానాలకు తావివ్వకుండా రాకుమారుడు అహంకారంతో కాక మత్తు వలన తెలియక చేసిన తప్పుగా, తర్వాత తాను చేసిన పనికి పశ్చాత్తాప పడినట్లుగా చిత్రించారు. మాధవవర్మ గోవుచేతనే ఇనుప మేకులు తొడిగిన కాలి గిట్టల చేత తొక్కించి చంపించమని శిక్ష వేశాడు. కానీ గోవు దేవవర్మను శిక్షించకుండా విడిచి పెట్టిందని అందుకే వారికి గోవు కుల దేవతగా మారిందని అంశమతి కథకు అన్వయించారు. బాపిరాజు గారు వాస్తవికతకు చేరువుగా రచించిన తీరు పాఠకుల్ని ఇది మెప్పించగలదు.

## అంశుమతి నవల – స్త్రీ పాత్రలు:

ఈ నవలలో స్త్రీ పాత్రలు చాలా తక్కువనే చెప్పవచ్చు. నవల కూడా చిన్నదే. ఈ నవలలోని స్త్రీ పాత్రలు పేర్కొనదగినవి. ఇందులోని పాత్రలు ఇలా ఉన్నాయి.

**1. అంశుమతి:**

అడవి బాపిరాజు రచించిన నవల అంశుమతిలో ఈమె కథానాయక. ఈమె విష్ణుకుండిన వంశీయుడైన మంచన భట్టారకుని ఏకైక పుత్రిక. "ఆమె జగదేక సుందరి. ఆమె సర్వ కళాభిజ్ఞ, శారదా రాక పూర్ణిమను గూడా నలుపు చేయగల కాంతి గలది." (అంశుమతి –అడవి బాపిరాజు – పుట: 231) పద్దెనిమిది సంవత్సరాల వయసున్న బాలిక. లోకోత్తర సుందరి అనే ప్రసిద్ధి పొందింది. ఆనాటి రాకుమారులు అందరూ ఆమెను భార్యగా వాంఛించి, మంచన బట్టారకునకు రాయబారాలు పంపించేవారు. కానీ అంశుమతి మాత్రం ఏ కారణం వల్లనో కానీ ఎవరిని అంగీకరించేది కాదు. అంశుమతి కుమారి జాతకంలో ఏదో గ్రహదోషం ఉందని రాజ జ్యోతిష్కుడు చెప్పగా అందుకు పరిష్కారంగా గోవూరులోని గోపాద క్షేత్రం వద్ద గోదావరి స్నానం చేయడానికి పరివారంతో వెళ్ళింది.

ఒకనాటి సాయంకాలం వ్రతం తీర్చిన తరువాత గోదావరిలో నౌకా విహారానికి బయలుదేరింది. ఆ సమయంలో కొందరు ఆగంతకులు ఆమె నౌకపై విరుచుకుపడి, అంశుమతిని, ఆమె చెలికత్తె మాధవి లతను అపహరించుకొని పోతారు. పిష్టపుర పాలకుడైన గాంగులు అనే అతను ఆమెను బలవంతంగా పెళ్లి చేసుకుని, సువిశాల విష్ణుకుండిన సామ్రాజ్యాన్ని తన రాజ్యంలో విలీనం చేసుకొని చక్రాధిపత్యం వహించాలని పన్నాగాలు పన్నుతుంటాడు. అందులో భాగంగానే ఆమెను అపహరించుకొని వచ్చి తన అంతఃపుర కారాగారంలో అన్న పానాదులు ఇవ్వకుండా బంధించాడు. ఆ సమయంలో అనుకోకుండా పిష్టపురం పైన దండెత్తి వచ్చిన కుబ్జ విష్ణువర్ధనుడు గాంగులు కోటను స్వాధీనం చేసుకోవడం వల్ల, అతని చొరవ వల్ల బంధ విముక్తురాలు అయింది. తన ఆరోగ్యం కుదుటపడిన

తర్వాత ఒకనాటి సాయంకాలం వన విహారం చేస్తున్న సమయంలో చక్కగా పాటలు పాడుతున్న ఒక వీరుదుని ఆమె చూస్తుంది. అతను కుబ్జ విష్ణువర్ధనుడని ఆమెకు తెలియదు. అతను కూడా తన పేరును మార్చుకొని సామంత పాలకుడిగా చెప్పాడు. అంశుమతి కూడా తనను తాను రాజకుమారికి చెలికత్తెనని పరిచయం చేసుకుంది. మొదటి చూపులోనే ఆ వీరుడిని చూసి మనసు పడింది. అతనిని గూర్చి కలలు కనేది.

విష్ణు వర్ధనుడిని చూడక మునుపు ఎప్పుడూ ముభావంగా ఉండే అంశమతి ఇప్పుడు ఆనందపూర్ణియగా మారింది. తన అంతఃపురంలో మిగతా చెలికత్తెలతో కలిసి అనిరుద్ధ వేషం వేసి నాటకమాడేది. తనను పురుష వేషంలో చూసి బాధపడుతున్న తల్లిని ఓదార్చింది. "నేను బాలకుడినై పుట్టక పోవుట నాయన గారికి మరియు నానందము సమకూర్చినది కాబోలు. ఆయా సంభాషణలలో వారాభావము వెల్లడించుచునే యున్నారు. కానీ నేను మాత్రమెన్నియో మారులు పురుషుడను కాకపోతిననియు, విష్ణుకుండిన మహా సామ్రాజ్యమును సుస్థిర మొనర్ప జాలకపోతిననియు దుఃఖించితిని" (అంశుమతి అడవి బాపిరాజు పుట: 260) అని పలికింది. ఆ సమయంలోనే తాను విష్ణు వర్ధనుడి సామంతులలో ప్రియదర్శి అనే అతనిని ప్రేమిస్తున్నట్లు తన తల్లితో చెప్పింది.

ఒకనాటి సాయంకాలమున మరలా అతనిని తమ ఉద్యానవనంలో చూసి, ఆమె మనస్సులోని ప్రేమ భావాలని అతనికి తెలియజేసింది. అతను పొట్టి వాడని ఆత్మ న్యూనతాభావానికి గురవుతున్నా సందేహించక "పొట్టి పొడుగులు ప్రేమకు ఆలంబనములు కావు. ప్రభూ! సామంతత్వము గాని, మహారాజాధికారము గాని అంతఃకరణ వృత్తికి నుద్దీపనమెట్లగును! నిజమును గోచరింప జేయునది అంతస్సాక్ష్యము. నాకా పిష్టపురముననే సత్యము దర్శనమిచ్చినది" (అంశుమతి– అడవి బాపిరాజు– పుట: 278) అని చెప్పింది. తాను ప్రేమిస్తున్నది సామంతుడైన యువకుడిని కాదని, అతనే కుబ్జ విష్ణువర్ధనుడని గ్రహించింది. వారిద్దరూ మాట్లాడుకునే సమయంలో ఆగంతకులు కొందరు తన పైన, తన చెలికత్తె మాధవిపైన మరల విరుచుకుపడ్డారు. కుబ్జవిష్ణు వర్ధనుడి వల్ల ఆమె మరలా రక్షించబడింది. అతడిని పెళ్లి చేసుకోవడం ఆమె తల్లిదండ్రులు కూడా అంగీకరించడంతో ఒక మంచి శుభముహూర్తాన అతనికి భార్యగా మారింది.

**2. జలదుర్గాంబిక:**

అంశుమతి నవలలో ఈమె బాలిక పాత్ర. జలదుర్గాన్ని పాలించు సామంత ప్రభువైన పృథ్వీశ వర్మ కొడుకుకి ఈమె కూతురు. మాధవిలతకు మేనకోడలు. మహా మంచి మాటకారి. తన అత్త మాధవిలతను చమత్కరిస్తూ సరదాగా మాట్లాడుతుంటుంది. ఆమె వయసుకి, ఆమె మాట్లాడే మాటలకు సంబంధమే లేదని మాధవి కూడా ఆశ్చర్యపోయేది.

**3. సంజ్ఞాదేవి:**

ఈమె అంశుమతి రాకుమారికి తల్లి. వేంగీ మహా సామ్రాజ్య పాలకుడైన మంచన బట్టారకుని భార్య. సంజ్ఞా దేవి హైహయుల రాజైన మాధవ వర్మ మహారాజుకి కూతురు. తన కూతురిని గోదావరి నదిలో ఆగంతకులు అపహరించకపోయిన విషయం తెలిసి విలపించింది. తన కూతురుని రక్షించిన విష్ణువర్ధన మహారాజు పైన గౌరవం ఏర్పడింది. అతనికి తమ బిడ్డని ఇచ్చి పెళ్లి చేయాలని తన భర్తతో మంత్రాంగం చేసింది. కానీ తన కూతురు వేరొక సామాన్య సామంత రాజును ఇష్టపడుతున్నదని తెలిసి కొంత కలత చెందింది. తన కూతురు పురుష వేషం వేసి నాటకాలు ఆడుతుంటే చూసి సంతోషించింది. తన కూతురు అభినయానికి ఆనందించింది. అంశుమతి కుమారి చెలికత్తె మాధవి లత ద్వారా తన కూతురు ప్రేమిస్తున్నది కుబ్జ విష్ణువర్ధనుడినని తెలిసి ఆనంద పరవశురాలైంది. ఒక శుభముహూర్తాన వారిరువుకి వివాహం చేయించింది.

**4. మాధవీలత:**

అంశుమతి నవలలో కథానాయిక అయిన అంసుమతికి ఈమె చెలికత్తె, స్నేహితురాలు. వేంగీ పురమును ఆనుకొని ఉన్న కొల్లేటి సరస్సు దిగువ భాగంలో ఉన్న జలసీమ వీరి ప్రాంతం. ఆ ప్రాంతాన్ని పాలించే భృహత్పలాయన పృధ్వీశ వర్మకు కూతురు. నిరంతరం రాజకుమారిని కనిపెట్టుకొని ఉంటుంది. మాధవీలత కూడా మంచి అందగత్తె. రాజకుమారికి, మాధవీలతకు మధ్య రహస్యాలు లేవు. అంసుమతికి గోదావరి నదిలో స్నానమాచరించే వ్రతం ఉన్నందున ఆమెతో పాటు తాను కూడా వెళ్ళింది. అక్కడ కొందరు దుర్మార్గులు తమ ఇద్దరినీ బంధించారు. ఆ తరువాత జరిగిన యుద్ధంలో ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న విష్ణువర్ధనుడికి తమ రాజకుమారి బందీయై

ఉన్నదన్న విషయం చెప్పి, ఆమెను విడిపించింది. తిరిగి తమ రాజ్యానికి అతని సహాయంతో చేరుకుంది. రాజకుమారి ప్రేమించిన యువకుడు సాక్షాత్తు విష్ణువర్ధనుడినే అని తెలుసుకొని రాజకుమారి అంశుమతి యొక్క తల్లిదండ్రులకు తెలియజేసింది. తాను కూడా విష్ణు వర్ధనుడి యొక్క సామంతులలో ఒకడైన జయనందునుడిని ప్రేమించింది.

**ముగింపు:**

అడవి బాపిరాజు గారు రచించిన నవలలలో అంశుమతి నవల చిన్నదైనా ఒకనాటి మన పాలకులలో ఒకడైన కుబ్జ విష్ణు వర్ధనుడి మనోగతం, అతని జీవితం, అంశుమతితో అతని వివాహం వివరించబడింది. కుబ్జ విష్ణు వర్ధనుడు స్వతహాగా కొద్దిగా పొట్టి వాడు. అతనిలో మానసికంగా పొట్టివాడుగా ఉన్నందుకు బాధపడుతుందేవాడు. తనను పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ఇష్టపడరేమో అనుకుంటూ ఉండేవాడు. అటువంటి అతనికి అతిలోక సుందరి వంటి అంశుమతి భార్యగా రావడం, వారి ప్రణయ, వీర గాథను చాలా చక్కగా చిత్రించిన తీరు నవలను చదివితే మనకు అర్థమవుతుంది.

**ఆధార గ్రంథాలు:**


1. అడవి బాపిరాజు అంశుమతి నవల ప్రచురణ:2002, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
2. కొర్లపాటి శ్రీరామమూర్తి తెలుగు సాహిత్య చరిత్ర– ప్రచురణ: 1991, రమణ శ్రీ ప్రచురణలు, విశాఖపట్నం
3. సహవాసి (రచన), సంపాదకుడు: డి. వెంకట్రామయ్య – నూరేళ్ళ తెలుగు నవల– ప్రచురణ: 2007, నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, కాచిగూడ
4. కోడూరి శ్రీరామమూర్తి తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ – ప్రచురణ: 2002, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, హైదరాబాద్
5. తెలుగు బాట –6, పాఠ్య పుస్తకం, పాఠ్య పుస్తక అభివృద్ధి, ప్రచురణ సంస్థ, అమరావతి.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


# సాహిత్యం – సామాజిక చైతన్యం


**– డా. ఎన్. శారద**

తెలుగు ఉపన్యాసకులు,

మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల,

విజయనగరం.

చరవాణి: 89850 76813,

Email: saradanemani24@gmail.com



**పరిచయం :**

"సహితా సాహిత్యమ్" అని ఆర్యోక్తి. హితం ఎవరికి? అంటే పాఠకునికి. పాఠకుడు సామాజికుడు. కాబట్టి హితం సమాజానికే. అలాగే కావ్య ప్రయోజనాలైన ఆనందం, ఉపదేశాలు కూడా సమాజంలోని వ్యక్తులకే. అంటే సమాజ ప్రయోజనాన్ని కాంక్షించేది సాహిత్యం కాబట్టి, సమాజంలోని మంచి, చెడ్డలు సాహిత్యంలో వ్యక్తమవుతాయి. రచయిత సమాజంలోని వ్యక్తే అవడం వలన సమాజం పట్ల రచయిత దృష్టికోణం అతని రచనలలో ప్రతిబింబిస్తుంది. ఇవన్నీ సామాజిక చైతన్యంలో భాగాలే. కాబట్టి సమాజం వలన సాహిత్యం, సాహిత్యం వలన సమాజం మార్పులను పొందుతూ ఉంటాయి. ఇది నిరంతర ప్రవాహం.



**కీలక పదాలు :** సామాజిక చైతన్యం మార్క్స్ నైతిక చైతన్యం రాజకీయ చైతన్యం వైజ్ఞానిక చైతన్యం వ్యక్తి చైతన్యం వాస్తవిక దృక్పథం – వేదాలు ఉపనిషత్తు.


**ఉపోద్ఘాతం:**

సమాజంలోని అసమానతల పట్ల అవగాహన కలిగి వుండడమే సామాజిక చైతన్యం. రచయిత సామాజికుడు. సాహిత్యం రచయిత సృష్టి అయినపుడు, సాహిత్యం సమాజ భావజాలన్నుంచే పుడుతున్నపుడు, రచయిత సృష్టించే సాహిత్యానికి సామాజిక చైతన్యం అవసరం. ప్రాచీన భారతీయ అలంకారికుల మతంలో కూడా సమాజపు సాహిత్యపు అనుబంధం విడదీయరానిదే. ప్రాచీన భారతీయాలంకారికుడు భరతుడు నాట్యశాస్త్రంలో "సుఖదుఃఖ సమన్వితమైన లోక వృత్తానుకరణం నాట్యమని" చెప్పడంలో సాహిత్యం సమాజ సంబంధాన్ని నిర్దేశించాడు.

Marx: It is not consciousness that determines life, but life that determines Consciousness.

– On literature and Art (P.43)

జీవితాన్ని నిర్ధారించేది చైతన్యం కాదు, కానీ చైతన్యాన్ని నిర్ధారించేది జీవితమే అన్నాడు.

దీనిని బట్టి సాహిత్యంలో సామాజిక చైతన్యం అంటే సమాజంలోని మార్పులకనుగుణంగా సాహిత్యాన్ని అభ్యుదయ భావాలతో ముందుకు నడిపించడం.

## సామాజిక చైతన్యం – స్వరూపాలు :

### (1) నైతిక చైతన్యం :

సమాజం కొన్ని నియమాలకు, ఆచారాలకు, నమ్మకాలకు అనుగుణంగా నడుస్తుంది. దేశ కాలాలను బట్టి, వ్యక్తులను బట్టి నీతులు మారుతూ వుంటాయి. ప్రాచీన కాలంనాటి ఆచారాలు, నమ్మకాలు నేటి ఆధునిక కాలంలో లేవు. జాతీయ ఆర్థిక విధానం,

విద్యావ్యాప్తిం ఫలితంగా సమాజపు కట్టుబాట్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా అంటరానితనం, వరకట్నం, బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి ఎన్నో దురాచారాలు నశించాయి.

ఈ మార్పులను సమాజంలో అంగీకరింప చేయడంలో సాహిత్యం పాత్ర కూడా వుంది. కులాంతర వివాహాలను, మతాంతర వివాహాలను ప్రోత్సహించడం, అస్పృశ్యత నివారణ, వితంతు వివాహాల ప్రోత్సాహం వంటి విషయాలలో మన తెలుగు సాహిత్యం తన వంతు పాత్రను పోషించింది. సమాజ అభివృద్ధికి నైతిక చైతన్యం అత్యంతావశ్యకం. విశ్వసాహిత్యం మొత్తం ఏదో ఒక నీతికి, ఏదోవిధంగా కట్టుబడే ఉంటుంది.

**(2) రాజకీయ చైతన్యం :**

సమాజంలో ఆర్థిక అసమానతలు, పీడన, దోపిడీ భావజాలాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు సాగితే అదే రాజకీయ చైతన్యం. ఇవే తీవ్రమైనపుడు విప్లవాలుగా పరిణమిస్తాయి. ఈ రాజకీయ చైతన్యం రాజుల కాలం నుండీ నేటివరకు వివిధ రూపాలలో కొనసాగింది. ప్రపంచలోని అనేక విప్లవాలు, రైతాంగ పోరాటాలు, నక్సల్ బరీ ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటాలు, ప్రజాస్వామ్య ఉద్యమాలు ఈ రాజకీయ చైతనానికి నిదర్శనాలే. ఈ వర్గ సంఘర్షణలు, పీడిత ప్రజల తిరుగుబాట్లు, ప్రజల నిరాశావాదాలూ, దేశభక్తి, సామ్రాజ్యవాద శక్తుల అన్యాయాలూ, అవినీతి, అసంతృప్తి, వలసపోరాటాలూ కళాత్మకంగా సాహిత్యంలో వ్యక్తమవడమే రాజకీయ చైతన్యం.

**(3) తాత్విక చైతన్యం :**

సాంఘిక చైతన్యంలో తాత్విక చైతన్యం కూడా ఒక భాగమే. తాత్వికతకు ఆధారం జీవితానుభవం. ప్రాచీన కాలంలో చార్వాకవాదం నుంచి ఆధునికకాలంలో హేతువాదం, మార్క్సిజం వరకూ అన్ని తత్వశాస్త్రాలనూ మౌలికంగా పరిశీలించి అధ్యయనంచేసి క్రియాశీలంగా నేటి సమాజంలో ఆశావాదాన్ని పాదుకొల్పుతూ ముందుకు పోవడమే తాత్విక చైతన్యం. సాహిత్యం సమాజంలోని ఈ తాత్తిక చైతన్యాన్ని విలువలను, ధోరణులను ప్రతిబింబించాయి.

**(4) వైజ్ఞానిక చైతన్యం :**

శాస్త్ర విజ్ఞానం పురాతన కాలంలో చక్రం కనుగొనడంతో ప్రారంభించి నేడు అణ్వస్త్రాలు, ఉపగ్రహాల సృష్టి విశ్వంలోని రహస్యాలను ఛేదించడం వరకు ఎంతో గణనీయమైన వెలుగును ప్రసాదించాయి. ఈ విజ్ఞానశాస్త్ర విజయాలు సమాజాన్ని మరింత చైతన్యవంతం చేశాయి. మూఢనమ్మకాలు నశించాయి. ఈ వైజ్ఞానిక చైతన్యం సాహిత్యంలో కూడా గణనీయమైన మార్పులను తీసుకుని వచ్చింది. ముఖ్యంగా సిగ్మండ్ ఫ్రాయిడ్ మనోవైజ్ఞానిక పరిశోధనలు సాహిత్యంలో పాత్రల మనస్తత్వాలను విశ్లేషించడానికి, మనోవిజ్ఞానిక సాహిత్యం, చైతన్య స్రవంతితో రచనలు రావడానికి ముఖ్య కారణమైంది.

**(5) కళా చైతన్యం :**

ప్రాచీనమానవుని నుండీ ఆధునికమానవుడి వరకూ కళాచైతన్యం అభివృద్ధి చెందింది. ఇది కూడ సామాజిక చైతన్యంలో ఒక భాగమే. నాటి నుండి నేటి వరకు కళ యొక్క ప్రయోజనం ఉపదేశం, ఆనందం మాత్రమే. ఇవి సమాజంలో ముడిపడినట్టివే. ఆధునిక కాలంలో నాగరికతతో పాటూ కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. కానీ వాటి ప్రయోజనాలు మారలేదు. నేటి సాహిత్యం ఆధునిక సమాజ అస్తిత్వానికి, వాస్తవికతకు ప్రతిబింబంగా నిలుస్తోంది. దీనికి అనుగుణంగానే సాహిత్యంలో అనేక ప్రక్రియలు, ఉద్యమాలు ఉద్భవించాయి.

**(6) వ్యక్తి చైతన్యం :**

సమాజంలోని సమస్యల పట్ల, వర్గసంఘర్షణలు, వాదాలు, సమాజ జీవితాన్ని గూర్చిన అవగాహనే వ్యక్తి చైతన్యం. వ్యక్తి చైతన్యమే సమాజ చైతన్యానికి పునాది. సమాజ చైతన్యం, వ్యక్తి చైతన్యం రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. అదే వ్యక్తి రచయిత అయినప్పుడు సామాజిక పరిస్థితుల్ని అవగాహన చేసుకుని తనరచనలలో ఆయా సంఘర్షణలను ప్రతిబింబిస్తాడు. ప్రశ్నిస్తాడు. పరిష్కారాలను సూచిస్తాడు, సహృదయ పాఠకునిలో ఆయా సమస్యలపట్ల, సమాజ పరిస్థితుల పట్ల అవగాహనను ఆలోచనను

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


కలిగిస్తాడు. అయితే ఈ విషయంలో రచయితకు సమాజ స్వరూపాన్ని గూర్చి శాస్త్రీయ అవగాహన అవసరం. కేవలం ఊహాప్రాతిపదికలు చేయడం ప్రమాదం. ప్రాచీనసాహిత్యదృక్పథం ఏమైనా, ఆధునికసాహిత్యం మాత్రం రచయితకు సమాజస్వరూపానికి సంబంధించి స్పష్టమైన అవగాహన అవసరమనే స్పష్టీకరిస్తుంది. ఈ సామాజిక చైతన్యం కారణంగా రచయిత రచనలు సమాజ అభివృద్ధికి, మార్పుకు దోహదపడతాయి. అయితే రచయితకు కేవలం చైతన్య స్పృహ వుంటే చాలదు. దానిని తన రచనలలో వ్యక్తం చేసే విధానం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అదే శిల్పం.

**ప్రాచీన సాహిత్యం – సామాజిక చైతన్యం :**

వేదకాలం నుండీ మన సాహిత్యాన్ని పరిశీలిస్తే వేదాలు, ఉపనిషత్తు, ఇతిహాసాలు, పురాణాలు సామాజిక చైతన్యం ఆధారంగానే రచింపబడ్డాయి. ప్రజలను ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా మలచడమే ప్రధానంగా ప్రాచీన సాహిత్యం కృషి చేసింది.

వేదాలలో నాటి సమాజంలోని ప్రజలు ప్రకృతితో మమేకమై జీవించడం కోసం ప్రకృతి శక్తుల ఆరాధన, సత్య, ధర్మాచరణ, నైతిక విలువలను గూర్చి ప్రభోదించబడింది.

ఉపనిషత్తల్లో సార్వకాలిక సత్యాల జ్ఞానం అందించాయి. స్మృతులు వర్ణాశ్రమ ధర్మాలను నిర్ణయించి సమాజాన్ని కట్టుబాట్లలో వుంచాయి. ఈ ధర్మాలనే పురాణేతిహాసాలు కథల రూపంలో ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా రాయబడ్డాయి. అనంతర కాలంలో ఈ ధర్మాలనే కావ్యాల రూపంలో చక్కని కథన రీతిలో ఆకట్టుకునే విధంగా, వర్ణనాతిశయాలతో రూపొందించబడ్డాయి. అనంతర కాలానికి ఆనందమే పరమ ప్రయోజనంగా ఉద్దేశం అనుషంగికంగా మారింది. ఏదేమైనా ప్రాచీన సాహిత్యం ధర్మబోధే లక్ష్యంగా ఆనాటి సమాజాన్ని క్రమశిక్షణతో వుంచడానికి కృషి చేసింది.

**ప్రాచీన తెలుగు సాహిత్యం:**

సంస్కృత అనువాదాలతోనే ప్రారంభమైన తెలుగు సాహిత్యం కూడా ధర్మబోధనే నాటి సాహిత్య ప్రయోజనంగా ప్రారంభించబడింది. తిక్కన కాలంలో నాటి మత వైషమ్యాలను రూపుమాపడానికి సాహిత్యం కృషి చేసిందని చెప్పవచ్చు. మహాభారతంలో అనేక కథల ద్వారా నాటి సమాజానికి నైతిక, రాజకీయ, వ్యక్తి చైతన్యాలను బోధించింది. తెలుగు సాహిత్యం శ్రీనాథుని కాలంలో క్రీడాభిరామం, పలనాటి వీరచరిత్రల వంటి కావ్యాలు నాటి సమాజాన్ని మన కళ్ళముందు వుంచుతాయి. ప్రబంధయుగపు కావ్యాలలోనూ నాటి సమాజ వ్యవస్థ ప్రతిబింబిస్తూ ఉంటుంది. దక్షిణాంధ్రయుగ సాహిత్యం నాటి సమాజ పతనావస్థను కళ్ళముందు వుంచుతుంది.

**ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యం:**

ప్రపంచ సాహిత్యంలో ఆధునిక యుగంలో అత్యంత నూతన పోకడలు ప్రారంభమయ్యాయి. అందులో ముఖ్యమైనది వాస్తవికత. ఈ ధోరణి వలన రచయితలు సమకాలీన సమాజాన్ని తమ సాహిత్యంలో ప్రతిబింబించారు. దీనివలన ఆధునిక సాహిత్యంలో సామాజిక చైతన్య విశ్లేషణ తప్పనిసరి అయింది. ఇది ప్రాచీన సాహిత్యం కంటే భిన్నమైనదిగా రూపొందింది. సాధారణ మానవుని జీవితాన్ని కళాత్మకంగా, రసాత్మకంగా తీర్చిదిద్దడం రచయిత పనిగా మారింది. ప్రపంచ ప్రసిద్ధ రచయిత మాక్సిమ్ గోర్కీ సాహిత్య ప్రయోజనాన్ని గూర్చి మట్లాడుతూ "సాహిత్యం అంటే మానవుణ్ణి గూర్చిన అధ్యయనం", "సమాజ హృదయమే సాహిత్యం", "లోకాన్నంతటినీ అవలోకించే నేత్రమే సాహిత్యం",

"సాహిత్యం గొప్పమేలు చేస్తుంది. మన చైతన్యం లోతులను పెంచి, మన జీవితానుభవాలను విశాలం చేస్తుంది. మన ఆలోచనలను తీర్చిదిద్ది. మన ఉద్రేకాలను నాజుకు పర్చి, మన మనస్సును పదును తేర్చి. ఓ విశ్వవ్యాప్తమైన పాత్ర నిర్వహిస్తుంది" అని అనడంలో మానవుణ్ణి చైతన్యవంతునిగా చేసేదే సాహిత్యం అనే అర్థం కనిపిస్తుంది.

ఆధునిక భారతీయ సాహిత్యంలో ఎన్నో విప్లవాల వెనుక దాగినది సాహిత్యమే. సమాజంలోని మార్పులతో పాటు సాహిత్యం మారింది. విలువలు మారాయి. ఆధునిక భారతీయ సాహిత్యం హేతువాద ప్రధానంగా సాగింది. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు కాలం చెల్లింది. సాహిత్యం యొక్క పరిధి, దృక్పథం విశాలమైంది. సంఘు సంస్కరణ ప్రధాన ధ్యేయంగా సామాజిక చైతన్యం ప్రారంభమైంది.

**ఆధునిక తెలుగు సాహిత్యం :**

ఆంగ్ల విద్యావ్యాప్తి కారణంగా భావజాలంలో, దృష్టికోణంలో మార్పు ప్రారంభమైంది. వీరేశలింగం పంతులు, గురజాడ రచనలలో సంఘ సంస్కరణ భావాలు సమాజాన్ని చైతన్యపరచడం ప్రారంభించాయి. అనంతర స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం దేశంలో ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించి దేశభక్తిని పాదుకొల్పింది. గాంధీ భావాలైన హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ, మద్యనిషేధం వంటివి సాహిత్యంలో భాగమయ్యాయి. భావకవిత్వం సాహిత్యంలో స్త్రీలకు గౌరవాన్ని, ప్రకృతి ప్రేమను పంచిపెట్టింది. అనంతరం వచ్చిన అభ్యుదయసాహిత్యం శ్రమజీవిని సాహిత్యపు నాయకుడ్ని చేసింది. కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ళా సహితం సాహిత్యపు వస్తువులైనాయి. అనంతర విప్లవ సాహిత్యం కవులకు నిబద్ధత, నిమగ్నతలు కూడా వుండాలనే విషయాన్ని తెలిపింది. స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాదాలు సామాజిక చైతనానికి ప్రతిబింబాలే. సమకాలీన సాహిత్యంలో పొడ సూపుతున్న భాషా, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు, మధ్యతరగతి జీవన చిత్రణ, ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలోని మార్పులు సాహిత్యంలో చోటుచేసుకోవడం సామాజిక చైతన్యం కారణంగా వస్తున్న పరిణామాలే. ఇవి ఆహ్వానించదగ్గ పరిణామాలు.

**ముగింపు :**

సమాజాన్ని వివిధ కోణాల నుండి దర్శించి దానిని సాహిత్యంలో ప్రతిభావంతంగా చిత్రించడమే సామాజిక చైతన్యం. ప్రసిద్ధ హిందీ నవలా రచయిత ప్రేమచంద్ "ఏ సాహిత్యంలో పున్నతమైన ఆలోచన వుంటుందో, స్వాతంత్ర్య భావముంటుందో, సౌందర్య సారముంటుందో, సృజనాత్మకత వుంటుందో, జీవిత వాస్తవికతల అభివ్యక్తి వుంటుందో, ఏ సాహిత్యం మనలో గతిశీలత, సంఘర్షణ, అదుర్దా కలిగిస్తుందో అదే ఉత్తమ సాహిత్యం" అన్నారు. అదే సామాజిక చైతన్యం కూడా.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు నవలలో సామాజిక చైతన్యం – పి. సంజీవమ్మ
2. సాహితీ జగతి – కాళూరి హనుమంతు రావు
3. నవలాశిల్పం వల్లంపాటి వేంకట సుబ్బయ్య
4. సాహిత్య దర్శనం – కె.వి.ఆర్. నరసింహం
5. సారస్వత వివేచన – రాచమల్లు రామచంద్రారెడ్డి
6. సాహిత్యంలో దృక్పథాలు – ఆర్.యస్. సుదర్శనం

**సాహిత్య తరంగిణి**

**ISSN:3048-5908** **(తెలుగు పరిశోధన పత్రిక)** **Impact Factor:6.673 (SJIF)**

**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**

**A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.**

# ధీరనారి నవల – సామాజిక అంశాలు

పరిశోధక విద్యార్థి: **మాణికె శివరంగస్వామి,**

పర్యవేక్షకులు: **ఆచార్య ఇరపని మాధవి,**

తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. గుంటూరు.

చరవాణి: 9492267393

**వ్యాస సంగ్రహము:**

వియోగిగారు రాసిన ఈ ధీరనారి నవలలో తల్లిదండుల బాధ్యతా రాహిత్యం, గాడి తప్పిన కుటుంబ ఆర్థిక వ్యవస్థ, ఈజీమనీ కోసం జూదం, మట్కా, పేకాటలాంటి దురలవాట్లకు బానిసైతే జీవితం ఎంత దుర్భరం అవుతుందో రచయిత వాస్తవికంగా చిత్రించారు. రాయలసీమలోని ఫ్యాక్షన్ సంస్కృతిని, ఋణ సంస్థల ఆగడాల్ని, మద్యపానం వల్ల వచ్చే అనర్థాల్ని పత్రికా ముఖంగా వెలుగులోకి తీసుకురావటంలో నాయిక కృషి ప్రశంసనీయం. సమాజంలో సగభాగమైన స్త్రీ ఉద్యోగంలో, పనిప్రదేశాల్లో ఎదుర్కునే వేధింపులను, వింతప్రవర్తనల్ని ఓ సామాన్య స్త్రీ అసమానరీతిలో అవరోధాల్ని అధిగమించటం కోసం పోరాటం చేస్తూ జన సమూహంతో ధీరనారిగా ఎలా కీర్తించబడిందో తెలపటమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**Key Words:** మట్క, పత్రికలు**,** ఎయిడ్స్**,** పేకాట**,** మైక్రోఫైనాన్స్**,** రాయలసీమ ఫ్యాక్షన్**,** జూదం మద్యపానం వ్యభిచారం

**ఉపోద్ఘాతం:**

ఆధునిక సాహితీ ప్రక్రియలలో నవల సమాజాన్ని బహుళంగా ఆకర్షిస్తుంది... అలరిస్తుంది... ఆలోచింపచేస్తుంది. ప్రాచీన కాలంలో పురాణ ప్రక్రియ ఏ ప్రాచుర్యాన్ని పొంది వుండేదో ఆధునిక కాలంలో నవల అంతటి ప్రజాదరణ పొందగలుగుతోంది.

ప్రపంచ భాషలన్నిటిలోనూ ప్రతి సంవత్సరం నవలలు వేల సంఖ్యలో వెలువడుతున్నాయి. ఇంతటి విస్తృతి మరే ప్రక్రియకు కనపడటం లేదు. ప్రపంచ భాషలో లాగా తెలుగులో కూడా ఈ పరిస్థితి గోచరిస్తుంది. నవల జీవితాన్ని నిర్ణయించేది, నియమించేది ప్రకృతి, వాస్తవికతే. ఇవి రెండు తత్వత: సజాతీయాలు. ఇవి స్వభావాన్ని నిర్దేశించే మౌళిక గుణాలు. స్వరూపంలో మార్పులు వచ్చినా ఈ మౌళిక స్వభావం మాత్రం నవలకు దూరం కారాదు.

నవలకు వాస్తవికత, కాల్పనికత, ఊహాకల్పన, చమత్కారం సమాహార స్వభావం అనే నాలుగు అంశాలు తప్పకుండా ఉండాల్సిన మౌళిక లక్షణాలు. నవల సంస్కరణ కోసం రచిస్తుంటే రచయిత వాస్తవికతకు పట్టం కడతాడు. కాల్పనిక చైతన్యంతో రచిస్తుంటే, కాల్పనికతకు ప్రాధాన్యమిస్తాడు. అద్భుత చమత్కారం కోసం రచిస్తుంటే ఊహాకల్పనకు ప్రాముఖ్యాన్ని ఇస్తాడు. ఎన్నుకొన్న వస్తువు ద్వారా నవలాకర్త తాను అనుభవించిన అనుభవాన్నో ప్రయోజనాన్నో పాఠకలోకంలో కలిగించటానికి, అనువైన ప్రక్రియా ప్రవృత్తులను ముందుగా నిర్ణయించుకుని వాటికి తగినవిధంగా తగిన ఘట్టాల్లో తగుపాళ్లలో సంఘటిత పరచి నవలను ఒక మిశ్రమ ప్రక్రియగా రూపొందిస్తాడు. ఇలా సంస్కరణ కోసం వాస్తవికతకు పట్టంకట్టిన రచయితే "శ్రీ కోపల్లె విజయ ప్రసాదు". వారి రచనలలో వాస్తవికత, సామాజిక చైతన్యం, సంస్కృతి పరిరక్షణ, మానవీయ సంబంధాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

**నవలా రచయిత – వియోగి జీవితం:**

శ్రీ కోపల్లె విజయప్రసాద్ (వియోగి) గారు 1952 జూలై 28న శ్రీమతి విమలాదేవి, కోపల్లె సుబ్రహ్మణేశ్వరరావు అనే పుణ్య దంపతులకు గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. బిఎస్సీ వరకు చదువుకుని 1973వ సం||లో హైదరాబాద్లో LICలో ఉద్యోగిగా

చేరారు. చదువు పట్ల మమకారంతో దూర విద్యా విధానంలో అనేక డిగ్రీలు పొందారు. ఒక వైపు ఉద్యోగ జీవితం మరోవైపు సాహితీ వ్యాసాంగాన్ని కొనసాగిస్తూ అనేక రచనలు చేశారు. 1973 లో 'మనసిచ్చిన మగువ' అనే రేడియో నాటికితో ప్రారంభమైన వీరి రచనలు ఇప్పటివరకు పది కథాసంపుటాలు, మూడు హాస్యకథా సంపుటాలు, మూడు పిల్లల నీతికథా సంపుటాలు 1. ప్రియా! ఓ ప్రియా, 2. విరహవీణలు, 3. బ్రతుకు, 4. విద్యార్థి, 5. దేశభక్తి, 6. చెరపకురా...!, 7. ధీరనారి, 8. వివాహవీణ మొదలైన రచనలు చేశారు. 2024 డిసెంబర్ 19 న అనారోగ్యంతో కన్నుమూశారు.

**ధీరనారి నవల ఇతివృత్తం:**

'ఇతివృత్తంతు నాట్యస్య శరీరమ్' అన్న భరతుని సూత్రం నాట్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెప్పినప్పటికీ సాహితీ ప్రక్రియలన్నిటికీ ఇదే నియమం వర్తింపజేయవచ్చు. శ్రీ కోపల్లె విజయప్రసాద్ రాసిన నవలల్లో ధీరనారి ప్రముఖమైనది. ఇందులో నవలా నాయిక నామధేయం సారిక. సారిక తండ్రి ఆదిరాజు. జన్మతః పౌరోహిత్యంతో పాటు సన్నకారు రైతుగాను కుటుంబాన్ని పోషించుకునేవాడు. వర్షాధారిత పంటపొలాన్ని సాగు చేస్తుండేవాడు. వ్యవసాయంలో కష్టనష్టాలకు తోడు నమ్మిన కులవృత్తితో కుటుంబ కష్టాలు తీరకపోవటంతో పోషణ మరింత భారమైపోయింది. ఫలితంగా భార్యాబిడ్డల్ని పోషించేందుకు అప్పులు చేయక తప్పలేదు. ఈజీమనీ కోసం పేకాట, మట్కా ఆడడం మొదలెట్టాడు. పైపెచ్చు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయాడు.

పెళ్ళీడుకొచ్చిన పెద్దమ్మాయి శాలినికి వివాహం చేద్దామని భార్య జానకి ఒత్తిడి చేస్తున్నా... చేతిలో చిల్లిగవ్వ లేదని నాన్చేవాడు. మట్కా మోజులో పడి ఉన్న కాస్త పొలం అమ్ముకోవటంతో భార్య దిగులుతో మంచాన పడుతుంది. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ, చాలీ చాలని జీతంతో శాలినీ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది.

కొంతకాలానికే జానకి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆపరేషన్ తప్పనిసరి అనటంతో చేతిలో నయాపైసాలేని ఆదిరాజు–తన కిడ్నీ అమ్మగా వచ్చిన డబ్బుతో భార్యకు వైద్యం చేయించాలనుకుంటాడు. చివరకు అప్పుల వాళ్ళు వచ్చిన డబ్బును అప్పుకింద జమకట్టుకోవటంతో తన భార్య చావుకు తానే కారకుడవుతాడు. ఉన్న ఇల్లు కూడా అప్పుల వారు స్వాధీనం చేసుకోవటంతో ఆత్మహత్యకు పాల్పడుతాడు.

తల్లిదండ్రుల్ని కోల్పోవటంతో శాలినే కుటుంబానికి పెద్ద దిక్కవుతుంది. చేయని నేరానికి శాలిని జైలుశిక్ష అనుభవించాల్సి రావటంతో సారిక, రమేష్లు అనాథ శరణాలయానికి చేరుకుంటారు. కొంతకాలానికి రమేష్ ప్రేమ వ్యామోహంలో పడి, హత్యకు గురవుతాడు. దీంతో కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుంది. వీటన్నింటికి కారణం ఆర్థిక వెనుకబాటుతనమే అని భావించిన సారిక పట్టుదలతో చదువులో తన ప్రతిభా పాటవాల్ని ప్రదర్శిస్తూ స్కాలర్షిప్తో పీహెచ్ విద్య పుర్తి చేస్తుంది.

ఉపాధి నిమిత్తం కోస్తా నుంచి రాయలసీమకు తరలివస్తుంది. ఏ పరిస్థితులైతే తన కుటుంబాన్ని తలక్రిందులు చేశాయో, వాటివల్ల కలిగిన దుష్పరిణామాల్ని వివరిస్తూ సమాజాన్ని చైతన్య పరచటంలో భాగంగా అనేక పోరాటాలు సాగించిన తీరుతెన్నులే సారికను 'ధీరనారి'గా ఆవిష్కరించబడ్డాయని తెలపటమే ఈ నవలా ఇతివృత్తం.

**నవలలోని సామాజికాంశాలు:**

మహిళా సాధికారతను సాధించేందుకు విద్య ముఖ్య సాధనం. ఆడపిల్లల చదువు అవనికంతటికి వెలుగు అన్న నానుడిని రచయిత ఈ నవలా నాయిక సారిక జీవితంలో నిరూపితమైందని రచయిత తెలిపిన తీరు హర్షించదగ్గ విషయం. కష్టనష్టాల్ని ఓర్చుకుని చదువుపై మక్కువతో ప్రభుత్వ ప్రోత్సాహకాల్ని సద్వినియోగం చేసుకుంటే సామాన్య వ్యక్తిసైతం అత్యున్నతస్థాయి విద్యను అభ్యసించవచ్చని సారిక పాత్ర ద్వారా వ్యక్తమౌతుంది.

సమాజంలో పాతుకుపోయిన మూఢాచారాలు, అంధ విశ్వాసాలు, అసాంఘికాచారాలు, దురలవాట్లపై రచయిత సారికతో చేయించిన పోరాటం సగటు మనిషిని ఆలోచింపచేస్తుంది. సంఘానికి పట్టిన పెనుభూతం మట్కా ఇది అనేక కుటుంబాల్ని ఛిద్రం చేస్తుంది. రచయిత ఈ మట్కావల్ల కలిగే అనర్థాలను కథానాయిక చేత చెప్పించిన సంభాషణలు ఆసక్తికరంగా ఉంటాయి.

'మట్కా సమాజానికి పట్టినటువంటి ఓ చీడ పురుగులాంటిది. మనిషి బలహీనతను ఆసరా చేసుకుని ఆడే నీచ నిక్రుష్టపు క్రీడ. కోటీశ్వరులు సైతం అడుక్కుతింటున్నారు దీని వ్యామోహంలో పడి. ఇలాంటి సంఘ విద్రోహక సంస్థల్ని నిషేధించాలని హరికథ, బుర్రకథల ద్వారా వీటివల్ల కలిగే దుష్పరిణామాల్ని ప్రజానీకానికి తెలియజేయటంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని రచయిత ఆకాంక్ష.'

మట్కా మనిషిని ఆర్థికంగా కృంగదీస్తే, [2]మద్యపానం ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగానూ అధఃపాతాళానికి తొక్కివేస్తుంది. సామాన్యులు దీని మత్తులో పడి, తమ కాయకష్టాన్ని కల్లుపాకల్లో ధారపోస్తున్నారని, దీని ఫలితంగా భార్య బిడ్డలు పస్తులుండాల్సి వస్తోందని రచయిత వియోగి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో రచయిత నాయికా పాత్రలో పరకాయ ప్రవేశం చేశారన్నట్టు అనిపిస్తుంది.

'ఓరేయ్! మూర్ఖుల్లారా, మీరు తాగుతోంది కల్లుకాదురా! అది కల్తీ కల్లురా. నాశనం అయిపోతారురా? మీ పిల్లల్ని కూడా రాళ్ల పాలు చేస్తారా! ఛీ... మీవి కూడా బ్రతుకులేనా? మీకు పశువులకు తేడా లేదు.' అన్న పదునైన మాటలతో మందుబాబులకు మత్తు వదిలించి, జీవితంపై ఆశ చిగురించేలా, భయభక్తులు కలిగేలా రచయిత పరుషమైన పదజాలాన్ని వాడారు. కల్లు దుకాణాన్ని మూతవేస్తే గానీ సమాజం బాగుపడదని రచయిత భావించారు.

మధ్యతరగతి కుటుంబాలకు ఆదాయం మూరెడు, వ్యయం బారెడు. గంపెడు ఆశలు బుర్రనిండా ఆలోచనలు. వీటిని ఆసరాగా చేసుకుని సులభ రీతిన అప్పులు ఇస్తామంటూ ప్రైవేట్ [3]ఋణ సంస్థలు అధిక వడ్డీల పేరిట సామాన్యుల నడ్డి విరగొడుతున్న తీరును రచయిత ఎండగట్టారు. పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఋణ సంస్థలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించాల్సిన అవసరముందని హితవు పలికారు. బాధితుల పట్ల ప్రజా సంఘాలు బాసటగా నిలవాలన్నది రచయిత ఆలోచన.

నివారణ తప్ప మందులేని రోగం " ఎయిడ్స్. భోగలాలసకు అలవాటు పడి, చెడుతిరుగుళ్లు తిరుగుతూ క్షణికానందం కోసం జీవితాల్ని నాశనం చేసుకున్న వారిపట్ల నాగరిక సమాజం ఎంత కఠినంగా ప్రవర్తిస్తుందో ఎయిడ్స్ బాధితుల జీవితాలే అందుకు నిదర్శనం. ఈ వ్యాధిపట్ల సరైన అవగాహన లేకపోవటం వల్లే ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు నాగమ్మ, పార్వతులు వివక్షకు గురవుతున్నారని రచయిత తెలిపాడు.

సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు, సంఘ విద్రోహకచర్యలు, మూఢాచారాలు, దురలవాట్లకు నిరక్షరాస్యతే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అక్షరజ్ఞానం లేనివారికి డబ్బు ఎరగా వేసి ఫ్యాక్షన్ గొడవలకు ప్రేరేపించే 'అంజిదొర, మల్లుదొర లాంటి కరుడుగట్టిన ఫ్యాక్షనిస్టులు, శాంతికాముకులుగా మారితే సమాజాభివృద్ధిని సాధించవచ్చని నిరూపించారు. వీనికి తోడు రాజకీయ చైతన్యం జత కలిస్తే సంఘాభివృద్ధి రెట్టింపు అవుతుందని రచయిత ఆశాభావం వ్యక్తం చేసినట్లు చెప్పవచ్చు.

పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు అన్న నార్లవారి మాటను రచయిత విశ్వసించి, ఈ నవలలో పత్రికారంగాన్ని సమస్యల పరిష్కారానికి సాధనంగా వినియోగించుకున్నాడని చెప్పవచ్చు. చుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని, అమాయకుల జీవితాల్ని, ఆసరాగా తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చేయటంలో మీడియా పాత్ర ఎంత కీలకమో ఈ సారిక, జర్నలిస్ట్ సాయిరాంల పాత్రల ద్వారా రచయిత విశదపరిచారు.

**ముగింపు:**

సమాజాభివృద్ధికి, తోడ్పడే విద్యా ఉపాధి అవకాశాలు కల్పించటం ప్రభుత్వాల కనీస బాధ్యత. సంఘ వినాశనానికి కారకాలైన మట్కా, జూదం, మద్యపానం, వ్యభిచారం, పేకాట లాంటి దురలవాట్లను రూపుమాపడంలో ప్రతిపౌరుడు బాధ్యత వహించాలి. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఇందుకు నిదర్శనమే గత ఉద్యమ పోరాటల ఫలితం.

రచయితే ధీరనారి నవలలో సామాజిక రుగ్మతల్ని కథావస్తువుగా తీసుకున్నాడని పై అంశాలద్వారా తేటతెల్లమవుతుంది. నవలా నాయిక అయిన సారిక చేత ఈ రుగ్మతలపైనే పోరాటం చేయించి, ప్రజల్లో మార్పును, గుణాత్మక మార్పును తీసుకువచ్చేందుకు కృషిచేశాడు. సకాలంలో సరైన విద్యా, ఉద్యోగవకాశాలు కల్పిస్తే బుద్ధిమంతులు కూడా బుద్ధిమంతులౌతారని, జూదగాళ్లు సైతం పొదుపర్లుగా మారాలని శ్రీ కోపల్లె విజయ్ ప్రసాద్ గారు పత్రికా ముఖంగా, సాహితీ వ్యాసాంగం రూపంలో అభిలషించారు.

**ఆధార గ్రంథాలు**


1. ధీరనారి – వియోగి – శ్రీకృష్ణ పబ్లికేషన్స్
2. నవలా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య నవచేతన పబ్లిషింగ్ హౌస్
3. వియోగిజీవితం – విశాలాక్షి శ్రీకృష్ణ పబ్లికేషన్స్
4. సాహిత్యంలో చర్చనీయాంశాలు – ఆచార్య జి.వి.ఎస్ తెలుగు అకాడమీ ప్రచురణ
5. సాహిత్య సమీక్ష – జి.నాగయ్య – నవ్యపరిశోధన ప్రచురణలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ఆధునిక తెలుగు సాహిత్యం – సామాజిక దృక్పథం. ప్రస్తుతం పత్రికల సేవ

– డా. ముట్నూరు ఉపేంద్రశర్మ,
ఎం.ఏ, యం.ఫిల్, యం.యడ్, పి. హెచ్ డి,
జాతీయ ప్రతిభా అవార్డు గ్రహీత,
శ్రీశ్రీ కళాపీఠం రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం,
చరవాణి: 8121559001.

ఆధునిక తెలుగు సాహిత్యం సమాజం లోని మార్పులకు అద్దం పదుతూ, సామాజిక స్పృహను పెంపొందిస్తోంది. నేటి పత్రికలు సాహిత్య సేవను వారంలో ఒక రోజును కేటాయిస్తూ కొనసాగిస్తున్నాయి. కాలానికి అనుగుణంగా సాహిత్యం కూడా రూపాంతరం చెందుతూ ఉంటుంది. తెలుగు సాహిత్యంలో 'ఆధునిక యుగం' ఒక విప్లవాత్మక దశగా చెప్పవచ్చు. ఈ యుగంలో రచయితలు కేవలం వినోదానికే కాకుండా సామాజిక చైతన్యానికి, మానవ విలువల పరిరక్షణకు, సమాజ సంస్కరణకు తమ రచనలను ఉపయోగించారు. ఈ క్రమంలో పత్రికలు కూడా సాహిత్య వికాసానికి, సామాజిక అవగాహన పెంపొందించడానికి విశేష సేవలు అందిస్తున్నాయి. ఆధునిక తెలుగు సాహిత్యం: 19వ శతాబ్దం చివరి భాగం నుండి తెలుగు సాహిత్యంలో ఆధునికత ప్రారంభమైంది. పాశ్చాత్య విద్య ప్రభావం, సామాజిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయ ఉద్యమం ప్రభావం వంటి కారణాల వల్ల కొత్త ఆలోచనలు తెలుగు సాహిత్యంలో ప్రవేశించాయి. సంప్రదాయ భావాలకు భిన్నంగా వాస్తవికత, హేతువాదం, సమానత్వం, మానవతావాదం వంటి అంశాలు ప్రధానంగా కనిపించాయి.

ఆధునిక తెలుగు సాహిత్య అభివృద్ధిలో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, శ్రీశ్రీ, విశ్వనాథ, చలం, దాశరథి, సినారె వంటి రచయితలు విశేష కృషి చేశారు. వీరి రచనల ద్వారా సమాజంలోని మూఢ నమ్మకాలు, కుల వివక్ష, స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలు, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఆధునిక సాహిత్యం కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం వంటి ప్రక్రియల ద్వారా విస్తరించింది.

ముఖ్యంగా స్వేచ్ఛాయుత కవిత్వం ఆధునిక సాహిత్య ప్రధాన లక్షణాలలో నిలిచింది. సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ ముందుకు పోవడం ఇంకో ప్రధాన లక్షణం. ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక దృక్పథం :–ఆధునిక తెలుగు సాహిత్యం సమాజ సమస్యలను కేంద్రీకరించి అభివృద్ధి చెందింది. రచయితలు తమ రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా స్త్రీ స్వేచ్ఛ, బాల్య వివాహాల నిరోధన, విధవా వివాహాల ప్రోత్సాహం మొదలైన అంశాలు ప్రధానంగా చర్చించ బడ్డాయి. గురజాడ అప్పారావు రచించిన "కన్యాశుల్కం" నాటకం సమాజంలోని దురాచారాలను ఎండగట్టిన గొప్ప రచన. శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' శ్రామికుల జీవన వాస్తవాలను ప్రతిబింబిస్తూ సమత్వ భావన ప్రోత్సహించింది. చలం రచనలు స్త్రీ స్వేచ్ఛకు కొత్త అర్థాన్నిచ్చాయి. సమాజంలో అణగారిన వర్గాల సమస్యలను 'దళిత సాహిత్యం' బలంగా ప్రతిబింబించింది. అలాగే స్త్రీవాద సాహిత్యం మహిళల హక్కులు, స్వాభిమానాన్ని ప్రోత్సహించింది. ఆధునిక సాహిత్యం కేవలం సమస్యలను చూపడమే కాకుండా పరిష్కార మార్గాలను కూడా సూచించింది.

సాహిత్యం ద్వారా సామాజిక మార్పు సాధ్యమని ఆధునిక రచయితలు విశ్వసించారు. అందుకే వారి రచనలు ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి సమాజ అభ్యుదయానికి దోహద పడ్డాయి.

**ప్రస్తుతం పత్రికల సేవ:**

పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గవ స్తంభంగా గుర్తింపు పొందాయి. సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చేరవేయడమే కాకుండా సాహిత్య వికాసానికి కూడా ముఖ్యమైన వేదికలుగా నిలుస్తున్నాయి. తెలుగు భాషలో అనేక దినపత్రికలు,

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


వార పత్రికలు, మాసపత్రికలు ప్రచురించ బడుతున్నాయి. వీటిలో సాహిత్యానికి ప్రత్యేక స్థానం కల్పించ బడుతోంది. కథలు, కవితలు, వ్యాసాలు, సమీక్షలు వంటి సాహిత్య ప్రక్రియలు పత్రికల ద్వారా ప్రజలకు చేరుతున్నాయి. నేటి పత్రికలు యువ రచయితలకు అవకాశాలు కల్పిస్తున్నాయి. కొత్త రచయితల ప్రతిభను వెలికితీసి, సాహిత్య ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. సాహిత్య పోటీలు, ప్రత్యేక సంచికలు, సాహిత్య శీర్షికల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. వీటిద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు పాఠకులు, రచయితలు ఒకే వేదికపై కలుస్తున్నారు. సాహిత్య ప్రచారం వేగంగా జరుగుతోంది. ఈ పత్రికలు, సాహిత్య సృష్టికి, సాహిత్య ప్రచారంలో చక్కటి పాత్రను పోషిస్తున్నాయి.

అయితే ప్రస్తుతం కొన్ని పత్రికలు వాణిజ్య ధోరణులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సాహిత్యానికి కేటాయించే స్థలం తగ్గుతోందని విమర్శలు వస్తున్నాయి. అయినప్పటికీ తెలుగు సాహిత్య పరిరక్షణలో పత్రికల ప్రాముఖ్యత ఎంతో ముఖ్యమైనదిగా కొనసాగుతోంది.

ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, ప్రజాశక్తి వంటి పత్రికలు 'ఆదివారం అనుబంధం' ద్వారా కథలు, కవితలు, సమీక్షలను నిరంతరం ప్రచురిస్తూ సాహిత్యాని సజీవంగా ఉంచుతున్నాయి. 'డిజిటల్ విప్లవం' ద్వారా నేడు 'సిరిమల్లె', 'వాకిలి', 'పుస్తకం.నెట్' వంటి ప్రత్యేక వెబ్ పత్రికలు ఆధునిక సాహిత్య ప్రక్రియలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు పాఠకులను చేరువ చేస్తున్నాయి.

**సమకాలీన అంశాలపై చర్చ:**

పత్రికలు కేవలం వార్తలు, సాహిత్యం... ...వంటి వాటికే పరిమితం కాక, సమాజంలో జరుగుతున్న పరిణామాలు, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక సమస్యలపై చర్చలు, వ్యాసాలను ప్రచురించి ప్రజా చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి.

సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. నేటి పత్రికలు ఆ బంధాన్ని మరింత దృఢపరుస్తూ భావితరాలకు సాహిత్య సంపదను సామాజిక స్పృహను అందిస్తున్నాయి.

**ముగింపు:**

ఆధునిక తెలుగు సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించింది. సమానత్వం, మానవతా వాదం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రజల్లో వ్యాప్తి చేసింది. ఈ సాహిత్య వికాసానికి పత్రికలు బలమైన వేదికలుగా పని చేశాయి. నేటికీ పత్రికలు సాహిత్యాని ప్రజలకు చేరవేస్తూ భాషా, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా ఆధునిక తెలుగు సాహిత్యం మరియు పత్రికలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర నిర్వహిస్తాయని మనం ఆశిద్దాం.

**సమాప్తం**

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# అస్తిత్వ సంక్షోభం నుండి కార్యాచరణ వైపు: ఆధునిక కవిత్వంలో నిరసన – చైతన్య ప్రయోజనం

– తాళ్లపెల్లి నాగలక్ష్మి
డిగ్రీ లెక్చరర్, తెలుగు
TGSWRDC (W)-WARANGAL WEST,
WARANGAL

**పరిచయం & పూర్వరంగం:**

సాహిత్యం సమాజానికి కేవలం ప్రతిబింబం మాత్రమే కాదు; సమాజ చలనశీలతను నిర్దేశించే తాత్విక మార్గదర్శి . ప్రాచీన కాలంలో "విశ్వశ్రేయః కావ్యమ్" అని సంస్కృత లాక్షణికులు నిర్వచించిన ప్రయోజనం ఆధునిక యుగానికి వచ్చేసరికి కేవలం సౌందర్యారాధనకో, రాజాస్థానాల వినోదానికో పరిమితం కాకుండా బహుముఖ విస్తరణను పొందింది. ఆధునిక యుగ ప్రవేశంతో మానవ జీవితం సంక్లిష్టమైంది. పారిశ్రామికీకరణ, వలసపాలన, పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రపంచీకరణ,కుల-వర్గ-లింగ వివక్షలు మనిషిని నిరంతర అంతర్మథనంలోకి, తీవ్రమైన అస్తిత్వ సంక్షోభంలోకి (Existential Crisis) నెట్టాయి.

అస్తిత్వ సంక్షోభం అంటే కేవలం పాశ్చాత్య తాత్వికులు చెప్పిన శూన్యతా భావన (Nihilism or Absurdism) మాత్రమే కాదు; తెలుగు సమాజ సందర్భంలో అది ఒక సమూహం లేదా వ్యక్తి తన ఆత్మగౌరవాన్ని, ఉనికిని, గుర్తింపును, హక్కులను కోల్పోయినప్పుడు అనుభవించే మానసిక, సామాజిక వేదన. తెలుగు ఆధునిక కవిత్వం ఈ వేదనను నిస్సహాయమైన మూలుగుగా మిగల్చలేదు. అది ఆ అస్తిత్వ సంక్షోభాన్ని నిరసనగా మలిచి, చివరకు వ్యవస్థను సవాలు చేసే సామూహిక కార్యాచరణగా రూపాంతరం చెందించింది.

గురజాడ,శ్రీశ్రీ యుగారంభం మొదలుకొని నేటి సమకాలీన కవితా ప్రకంపనల వరకు తెలుగు కవిత్వం నడిచిన తీరు మనిషి నిస్సహాయ అస్తిత్వం నుండి తిరుగుబాటు కార్యాచరణ వైపు సాగించిన చైతన్య ప్రయాణానికి సాక్ష్యంగా నిలుస్తుంది.

**తాత్విక భూమిక: అస్తిత్వం నుండి కార్యాచరణ దాకా:**

సాహిత్య ప్రయోజన సిద్ధాంతాలలో నిరసన, చైతన్యాలకు విశిష్టమైన స్థానముంది. కార్ల్ మార్క్స్ తన ప్రసిద్ధ సిద్ధాంత సూత్రంలో పేర్కొన్నట్లు—"తత్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ రూపాల్లో కేవలం వ్యాఖ్యానించారు , కానీ అసలైన కర్తవ్యం దాన్ని మార్చడం" (Philosophers have only interpreted the world; the point, however, is to change it). ఆధునిక తెలుగు కవిత్వం సరిగ్గా ఇదే సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకుంది.

**ఈ పరిణామ క్రమంలో మూడు ప్రధాన దశలు కనిపిస్తాయి:**

సంక్షోభ దశ (Existential Angst): వ్యవస్థలోని అసమానతలను గుర్తించి, వ్యక్తి తన ఉనికి కోల్పోతున్నానని గ్రహించే బాధాతరంగం.

**నిరసన దశ (Expression of Dissent):** ఆ వేదన కేవలం లోలోపలే కుమిలిపోకుండా, పాలకులకు, ఆధిపత్య శక్తులకు, సాంప్రదాయ విలువలకు వ్యతిరేకంగా గళమెత్తడం.

**కార్యాచరణ దశ (Praxis & Consciousness):** నిరసన కవిత్వం ప్రజలను సంఘటితం చేసి, వారిలో సామాజిక-రాజకీయ స్పృహను రగిలించి, వాస్తవ ఉద్యమాల వైపు అడుగులు వేయించడం.

ఈ మూడు దశలను తెలుగు కవిత్వంలోని వివిధ ఉద్యమ ధారల ద్వారా లోతుగా పరిశీలించవచ్చు.

**1. అభ్యుదయ, విప్లవ కవిత్వాలు: వర్గ సంక్షోభం నుండి విప్లవ కార్యాచరణకు:**

తెలుగు కవిత్వంలో నిరసనను, చైతన్యాన్ని వ్యవస్థాగత సాధనంగా మార్చిన తొలి విప్లవాత్మక శక్తి శ్రీశ్రీ. అంతకుముందున్న భావకవిత్వంలోని కాల్పనిక విరహం, నైరాశ్యం మనిషిని కార్యాచరణ వైపు నడపలేకపోయాయి. ఆ కాల్పనిక లోకం నుండి కవిత్వాన్ని భూమి మీదికి దించినవాడు శ్రీశ్రీ.

అస్తిత్వవాదంలో చెప్పే విరక్తి, పరాయీకరణ, నిర్వేదాలలోనే శ్రీశ్రీ ఆగిపోలేదు. ఆ వేదనను దాటుకుని స్వచ్ఛంద నిర్ణయం ద్వారా పోరాటాన్ని తన బాధ్యతగా ఎంచుకున్నారు.

"తాజ్ మహల్ నిర్మాణానికి

రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?

.................................

ప్రభువెక్కిన పల్లకి కాదోయ్

అది మోసిన బోయీ లెవ్వరు?"

(మహాప్రస్థానం : దేశ చరిత్రలు :పుట 88)

శ్రీశ్రీ సంధించిన ఈ ప్రశ్న చరిత్ర నిర్మాణంలో శ్రమజీవి అస్తిత్వాన్ని వెలికితీసింది. "మహాప్రస్థానం" కేవలం ఒక కవితా సంపుటి కాదు; అది శ్రమదోపిడీకి గురవుతున్న అట్టడుగు వర్గాల నిరసన ప్రకటన. శ్రీశ్రీ కవిత్వం శూన్యవాదంలో పడి కొట్టుకుపోతున్న యువతకు "మరో ప్రపంచం" అనే ఆశావహ దృక్పథాన్ని, కార్యాచరణను అందించింది.

అస్తిత్వవాదంలో అతిముఖ్యమైన సిద్ధాంతం–మనిషి తనను తాను నిర్వచించుకోవాలి . సమాజం నిర్ణయించిన పాత్రలను కాదని, తన ఉనికికి తానే బాధ్యత వహించే క్రమం 'జయభేరి ' కవితలో కనిపిస్తుంది:

"నేను సైతం

ప్రపంచాగ్నికి

సమిధనొక్కటి ఆహుతిచ్చాను!

నేను సైతం

విశ్వవృష్టికి

అశ్రువొక్కటి ధారపోశాను!"

(మహాప్రస్థానం : జయభేరి :పుట :29)

ఇక్కడ "నేను" అనేది సమూహంలో కలిసిపోయిన వ్యక్తి కాదు; తన స్వతంత్ర నిర్ణయంతో, తనను తాను త్యాగం చేయడానికి సిద్ధపడిన ఒక చైతన్యవంతమైన అస్తిత్వం. బాహ్య ప్రేరణల వల్ల కాకుండా, అంతర్గత ఎంపిక ద్వారా తాను ప్రపంచంతో ముడిపడి ఉన్నానని నిరూపించుకునే సందర్భం ఇది.

**అస్తిత్వాన్ని గుర్తించిన వ్యక్తి నిష్క్రియగా కూర్చోలేదు;** సమాజంలో క్రియాశీలక బాధ్యత తీసుకోవాలి. శ్రీశ్రీ కవిత్వం వ్యక్తిగత వేదనను సమాజ విముక్తి పోరాటంగా మలిచింది. 'మహాప్రస్థానం' శీర్షికా కవితలో అస్తిత్వ నిరాశ పూర్తిగా బద్దలై కార్యాచరణగా ఉప్పొంగుతుంది:

"మరో ప్రపంచం, మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది!

పదండి ముందుకు, పదండి త్రోసుకు,

పోదాం, పోదాం పైపైకి!"

అలాగే 'జగన్నాథుని రథచక్రాలు' కవితలో పీడితుల అస్తిత్వ రక్షణ కోసం తిరుగుబాటును కర్తవ్యంగా ప్రకటిస్తారు:

"రథచక్ర ప్రళయఘోష

భూమార్గం పట్టిస్తాను

భూకంపం పుట్టిస్తాను... అని ప్రకటిస్తాడు.

తరువాతి దశలో 1970లలో ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘం (విరసం) ఈ నిరసనను నేరుగా సాయుధ, ప్రజా పోరాటాలతో ముడిపెట్టింది. దిగంబర కవుల పచ్చి నిరసన, ఆ తర్వాత వచ్చిన చెరబండరాజు, శివసాగర్ , రచనలు కేవలం పుస్తకాలలో మాత్రమే కాక, ప్రజల గొంతుకలుగా మారి మారుమోగాయి.

విప్లవ కవులు క్షేత్రస్థాయి శ్రామికుడు, ఆదివాసి, దళితుడి అస్తిత్వ సంక్షోభాన్ని కవిత్వంలోకి తెచ్చారు. ఈ సమాజం తనను మనిషిగా గుర్తించకపోవడాన్ని, ఒక అనామకుడిగా బతకాల్సిన దుస్థితిని తీవ్రంగా ప్రశ్నించారు.

శివసాగర్ (కె.జి. సత్యమూర్తి) రాసిన పంక్తుల్లో ఉనికిని చాటే ఆరాటం కనిపిస్తుంది:

గంగ దాటెళ్ళకే చెల్లెమ్మా! కవితలో

–శూన్యమైన అస్తిత్వం :–

"వెట్టి చాకిరి చేసి మట్టికలిపే బతుకు

దండుగలు చెల్లించి దండుగయ్యే బతుకు

దొరల గాదెలు నింపి దొరలి పోయే బతుకు"

మనిషి చేసే శ్రమకు విలువ లేనప్పుడు, ఆ బతుకు "మట్టికలిసేదిగా", "దండుగయ్యేదిగా" మారుతుంది. ఇది పీడితుడి ఉనికిని నిర్వీర్యం చేసిన అస్తిత్వ వేదన.

**అస్తిత్వ నిరాకరణ – స్వయం నిర్ణయం (Existential Refusal):–**

"ఈ బతుకు మనకొద్దు చెల్లెమ్మా

ఈ వెతలు తీరాలె చెల్లెమ్మా"

బిఅస్తిత్వవాదంలో "సమ్మతిని తిరస్కరించడం" అత్యంత కీలకమైన మొదటి అడుగు. ఈ పశుప్రాయమైన ఉనికి ఇక చాలు అని తేల్చిచెప్పడం వ్యక్తిగత చైతన్యాన్ని సూచిస్తుంది.

**కార్యాచరణ వైపు పిలుపు :–**

"పిడికిళ్ళు బిగియించి చెల్లెమ్మా!

పరవళ్ళు తొక్కాలి చెల్లెమ్మా!

గంగ దాటెళ్లకే చెల్లెమ్మా! కంట నీరెట్టకే చెల్లెమ్మా!

కట్టుగా ఉండాలె చెల్లెమ్మా! కాంతులే పండాలి చెల్లెమ్మా!"

శోకాన్ని ("కంట నీరెట్టకే") పక్కన పెట్టి, పిడికిలి బిగించి ఐక్యంగా కదలడమే కార్యాచరణ. పోరాటం ద్వారా మాత్రమే పల్లెల్లో వెలుగులు, నవ్వులు సాధ్యమవుతాయని కవి నిర్దేశిస్తున్నారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**2. దళిత కవిత్వం: అంటరానితనంపై ఆత్మగౌరవ పోరాటం:**

వర్గపోరాటం శ్రామికుడి ఆర్థిక సంక్షోభాన్ని చూసింది కానీ, వేల సంవత్సరాలుగా కుల వ్యవస్థ వేళ్ళూనుకున్న భారతీయ సమాజంలో "అంటరానితనం" సృష్టించిన మానసిక, సామాజిక అస్తిత్వ విధ్వంసాన్ని సంపూర్ణంగా పట్టుకోలేకపోయింది. ఈ చారిత్రక పరిమితి నుంచే దళిత కవిత్వం ఉద్భవించింది.

కారంచేడు (1985), చుండూరు (1991) మారణకాండలు దళిత అస్తిత్వాన్ని సంక్షోభపు అంచులకు నెట్టినప్పుడు, కవిత్వం ఒక కవచంగా, కత్తిగా మారింది. బోయి భీమన్న మొదలుకొని జాషువా మీదుగా ఆధునిక దళిత కవులైన శిఖామణి,సతీష్ చందర్, మద్దూరి నగేష్‌బాబు, ఎండ్లూరి సుధాకర్ వంటి వారి రచనలు నిరసన గళాన్ని తీవ్రతరం చేశాయి.

శిఖామణి కవిత్వాన్ని ఇక్కడ పరిశీలిద్దాం

**1. అస్తిత్వ చైతన్యం (స్వీయ గుర్తింపు, ఆత్మగౌరవం) :** దళిత కవిత్వం తొలుత శతాబ్దాలుగా అణచివేతకు గురైన తమ ఉనికిని, ఆత్మగౌరవాన్ని, చారిత్రక మూలాలను గుర్తించి గర్వంగా ప్రకటించే అస్తిత్వ రూపం దాల్చింది:

**ఆత్మగౌరవ ప్రకటన ('అవర్ణం' కవిత):** సవర్ణులు సృష్టించిన వర్ణ వ్యవస్థలో తమను హీనంగా చూసిన తీరును నిరసిస్తూ, "ఏ వర్ణం వలన నేను అవమానించబడ్డానో... ఆ వర్ణాన్ని తుడిచేస్తున్నాను... కవినై వర్ణచాపాన్ని విరగగొట్టడానికొచ్చిన దళిత కవినై నేను" అంటూ దళిత అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని శిఖామణి గర్వంగా చాటారు.

**నలుపును అందంగా, సంస్కృతిగా స్వీకరించడం ('నల్లనిదానను' కవిత):** పురాణకాలం నుండి నలుపును అశుభంగా చూసే భావజాలాన్ని తిరస్కరిస్తూ, నలుపును వర్ణ వివక్షను దగ్ధం చేసే అగ్నిశిఖగా మార్చారు. "నా ధాతు శిలాజం ఆఫ్రికా చీకటి ఖండం నుండి హరప్పా మొహంజోదారో నాగరికతల వరకు నిక్షిప్తమై ఉంది" అంటూ దళిత జాతి అస్తిత్వానికి ప్రాచీన, చారిత్రక ఘనతను ఆపాదించారు.

**కుల వివక్షపై ప్రశ్న ('నాయన' కవిత):** తండ్రి పడిన అవమానాలను గుర్తుచేసుకుంటూ, "ఊరి హోటల్లో కొబ్బరిచిప్పల్లో టీ నీళ్లు తాగిన" దుస్థితిని ప్రశ్నిస్తూ, అగ్రవర్ణాల పెత్తందారీతనాన్ని ధిక్కరించి నిలదీయడమే తమ అస్తిత్వమని ప్రకటించారు.

**2. కార్యాచరణ దృక్పథం (పోరాటం, తిరుగుబాటు, ఆయుధం),:** కేవలం తమ బాధను, అస్తిత్వాన్ని చెప్పుకోవడంతో ఆగకుండా, సమాజాన్ని సమూలంగా మార్చేందుకు, రాజ్యాధికారం సాధించేందుకు కవిత్వం ఒక పోరాట కార్యాచరణగా రూపాంతరం చెందింది:

**అక్షరాన్ని ఆయుధంగా మలచడం ('కిర్రుచెప్పుల భాష' కవిత):** ఇది కేవలం ఒక కవిత మాత్రమే కాదు, ఒక దళిత దండయాత్ర. శివుని ఢమరుకం నుండి వచ్చిన అక్షరాలు కాకుండా, "వీరబాహుని కిర్రుచెప్పుల చప్పుళ్ల నుండి పుట్టిన అక్షరాలను" తీసుకొని, "చిన్నయసూరి తన బాల వ్యాకరణాన్ని దళిత వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబుగా తిరగ రాస్తున్నాడు" అని ప్రకటించారు. భాషా సంస్కృతులపై తిరుగుబాటు చేస్తూ బహుజన కార్యాచరణను నడిపించారు.

**ప్రతిఘటన మరియు రాజ్యాధికార దిశ ('ఇనపపాళీలు మొలుచుకొస్తున్నాయి', 'రాజగృహం'):** ఏకలవ్యుని వేలు కోరిన ద్రోణాచార్యుల సాంప్రదాయాన్ని హెచ్చరిస్తూ, "నేర్పని విద్యకు గురుదక్షిణ కోరిన చోట బొటనవేళ్ల స్థానంలో ఇనపపాళీలు మొలుచుకొస్తున్నాయి, అవి చరిత్రను తిరగరాస్తాయి" అంటూ ఎదురుదాడికి సిద్ధమయ్యే కార్యాచరణను స్పష్టం చేశారు. అలాగే అంబేద్కర్ నివాసం పేరుతో రాసిన 'రాజగృహం' కవిత ద్వారా రాజ్యాధికార పోరుబాటను కార్యాచరణగా నిర్దేశించారు.

**సామాజిక రుగ్మతలను ఛేదించే ఉద్యమం ('నది దాటాలి' కవిత):** ఊరికి, వాడకు మధ్య అడ్డుగా ప్రవహించే కులమనే నదిని తప్పక దాటాలని, నదిపై నిర్మించిన వంతెనను చూస్తూ "దళితులు రాజ్యాధికారానికి వచ్చినంత సంబరంగా ఉంది" అంటూ, అవమానాలను ఛేదించి సమానత్వాన్ని సాధించేందుకు కార్యాచరణలో అడుగుముందుకేయాలని పిలుపునిచ్చారు.

**హింస, దాష్టీకాలపై నేరుగా నిరసన ('అశుద్ధ మానవుడు' కవిత):** దళిత మానవుడిని జంతువుల కంటే హీనంగా చూసినప్పుడు ఆవేశంతో "ఒరేయ్ లంజకొడకా..." అంటూ తీవ్రమైన తిరుగుబాటు భాషను ప్రయోగించి, అగ్రవర్ణ వ్యవస్థ పునాదులను కదిలించేలా హెచ్చరిక జారీ చేశారు.

దళిత కవిత్వం నిస్సహాయ రోదనను తిరస్కరించింది. అది బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాన్ని (బోధించు, సమీకరించు, పోరాడు) ఆచరణాత్మకంగా అమలు చేసింది. అస్తిత్వ సంక్షోభాన్ని "దళిత చైతన్యం"గా మార్చి, రిజర్వేషన్ల రక్షణ, మానవ హక్కుల సాధన, సాహిత్య రంగంలో సమానత్వపు వాటా కోసం ఒక మహత్తర కార్యాచరణను నడిపింది.

**3. స్త్రీవాద కవిత్వం: పితృస్వామ్య సంకెళ్ళపై తిరుగుబాటు:**

శతాబ్దాలుగా ఇంటి నాలుగు గోడల మధ్య అణచివేయబడిన స్త్రీ అస్తిత్వం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. శరీరం, శ్రమ, మేధస్సులపై ఆంక్షలు విధించిన పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నిస్తూ 1980ల చివర్లో, 1990ల తొలినాళ్ళలో స్త్రీవాద కవిత్వం ఒక మహా వెల్లువలా దూసుకొచ్చింది.

"నీలిమేఘాలు" కవితా సంకలనం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి. ఓల్గా, కొండేపూడి నిర్మల, సావిత్రి, జయప్రభ, విమల, కుప్పిలి పద్మ వంటి రచయిత్రులు పితృస్వామ్య భాషను, విలువల వ్యవస్థను సమూలంగా సవాలు చేశారు.

కొండేపూడి నిర్మల "లేబర్ రూమ్" కవితలో స్త్రీ ప్రసవ వేదనను, పురుషాధిక్య సమాజపు స్వార్థాన్ని అత్యంత తీవ్రంగా నిరసించారు. అలాగే విమల రాసిన "వంటిల్లు" కవిత నిశ్శబ్ద అణచివేతపై ధ్వజమెత్తిన అద్భుత సృష్టి:

కొండేపూడి నిర్మల రాసిన 'లేబర్ రూం', విమల రాసిన 'వంటిల్లు' కవితలు తెలుగు స్త్రీవాద సాహిత్య చరిత్రలో మైలురాళ్లు. పితృస్వామ్య సమాజం శతాబ్దాలుగా స్త్రీకి ఆపాదించిన 'మాతృత్వం', 'గృహిణీ ధర్మం' అనే పవిత్ర ముసుగులను చీల్చి, స్త్రీ అస్తిత్వం (స్వీయ గుర్తింపు, ఉనికి) మరియు కార్యాచరణ (వ్యవస్థను ధిక్కరించడం, ప్రతిఘటించడం) కోణాల్లో సాగిన లోతైన విశ్లేషణ:

**1. 'లేబర్ రూం' – కొండేపూడి నిర్మల:** జీవసంబంధ అస్తిత్వం నుండి వ్యవస్థపై ప్రశ్న

పితృస్వామ్యం స్త్రీకి కల్పించిన కల్పిత శృంగార, భావోద్వేగ భ్రమలను బద్దలు కొడుతూ వాస్తవిక వేదనను అస్తిత్వంగా నిలబెట్టడం ఈ కవితలో కనిపిస్తుంది.

**రొమాంటిసిజం భ్రష్టత – నగ్న అస్తిత్వ ఆవిష్కరణ:** పితృస్వామ్యం వివాహాన్ని "తెల్లచీర, మల్లెపూలు, పాలగ్లాసు"ల అందమైన కలగా చూపిస్తుంది. కానీ లేబర్ రూంలోకి అడుగుపెట్టగానే ఆ భ్రమలన్నీ రాలిపోయి, కనిపించేది "పరాధీనతా బానిస కన్నీరూ ద్వీపాంతర వాసం" మాత్రమే. పునరుత్పత్తి ప్రక్రియలో స్త్రీ అనుభవించే ఒంటరితనం, మరణపు అంచుల దాకా వెళ్లే భౌతిక వేదన ఇక్కడ ఆమె అసలైన అస్తిత్వంగా మారుతుంది.

**శరీరం ఒక వస్తువుగా మారే హింస:** "కాళ్ళనలా ఎడం చేసి, దీనంగా హీనంగా, నీచాతినీచంగా... ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురుచూడ్డం" అన్న వర్ణన స్త్రీ శరీరాన్ని వైద్య, సామాజిక యంత్రాంగం ఒక నిర్జీవ పరికరంగా మార్చే క్రమాన్ని ఎండగడుతుంది. "ముల్లుకు గుచ్చి నిప్పులో కాలుస్తున్న చేప", "మూతి బిగించిన గోతాంలో మూగ జంతువు" వంటి ప్రతీకలు స్త్రీ శారీరక అస్తిత్వం అనుభవించే అత్యంత క్రూరమైన హింసను ప్రతిబింబిస్తాయి.

**కార్యాచరణ కోణం (ధర్మప్రశ్న & సజీవ హెచ్చరిక):** ఈ కవితలో కార్యాచరణ ప్రత్యక్ష సమ్మె రూపంలో కాకుండా, భ్రమలను కూల్చే చైతన్య విస్ఫోటనం రూపంలో కనిపిస్తుంది. "తలక్రిందులుగా వ్రేలాడదీసిన సెలైన్ బాటిల్లా / నిండు నెల్ల గర్భిణీ / ఒక్కో బొట్టు చొప్పున మొత్తం ప్రాణం ఇచ్చుకోవడానికి వస్తోంది / అడ్డు తప్పుకోండి అడ్డు తప్పుకోండి" అంటూ సమాజానికి ఇచ్చే తుది హెచ్చరిక ఒక శక్తివంతమైన కార్యాచరణ. ప్రాణం పోసే ప్రక్రియలో ప్రాణమే కోల్పోవడానికి సిద్ధపడే స్త్రీ శక్తి ముందు సాంప్రదాయ సంకెళ్లు, పురుషాధిక్య నియమాలు అడ్డు తొలగాల్సిందేనన్న ఉద్యమ నినాదం ఇందులో ఉంది.

**2. 'వంటిల్లు' – విమల:** శిక్షణా శిబిరపు అస్తిత్వం నుండి పరికరపు సంకెళ్ల తెగదెంపు

గృహహింస కేవలం కొట్టడమో తిట్టడమో కాదు; ఒక మనిషి ఉనికిని, వ్యక్తిత్వాన్ని నాలుగు గోడల మధ్య వంటపాత్రలతో కరిగిపోయేలా చేయడమే అత్యంత పెద్ద హింస అని విమల చాటిచెప్పారు.

**భ్రాంతి నుండి అస్తిత్వ స్పృహ వైపు ప్రయాణం:** బాల్యంలో "వదలని మోహమై... అద్భుత మాయా బజారు"లా కనిపించిన వంటిల్లు, వయసు పెరిగేకొద్దీ ఒక కారాగారంగా మారిన క్రమాన్ని కవయిత్రి ఆవిష్కరిస్తారు. స్త్రీకి తన ఇంటిలోని వంటగది ఆటస్థలం కాదని, అది తన గుర్తింపును హరించే "శిక్షణా శిబిరం" అని గుర్తించడమే అస్తిత్వ చైతన్యానికి తొలి అడుగు.

**అస్తిత్వ వినాశనం (పరికరంగా మారిన స్త్రీ):** "మా అమ్మ, అమ్మమ్మా... ఇంట్లో అమ్మలంతా ఇక్కడే 'స్త్రీ' లయ్యారట" అన్న పంక్తుల్లో సామాజిక లింగవివక్ష ఎలా పుడుతుందో తేటతెల్లమవుతుంది. తరతరాల స్త్రీలు వంటింట్లో తమ రక్తమాంసాలను కరిగించి చివరకు "గిన్నెలు, డబ్బాలూ, బస్తాలతో రకరకాల శవాలు నిండిన శ్మశానం"లా, ఒక "ప్రేతం"లా మిగిలిపోయారు. "మా అమ్మకు చేతులు లేవు... ఒక గరిటగానో, పెనంలానో మా వంటింటిని అలంకరించిన ఒక పరికరంలానో వుంటుంది" అనడం ద్వారా స్త్రీ తన మానవ ఉనికిని కోల్పోయి, వంటింటి సామగ్రిలో ఒక పరికరంగా మిగిలిపోయిన ఘోరమైన అస్తిత్వ శూన్యతను కవిత్వీకరించారు.

**కార్యాచరణ కోణం (ధ్వంసరచన & విముక్తి పిలుపు):** అమ్మలా తాను ఆ వంటింటి పరికరంగా మిగిలిపోవడానికి నిరాకరించడమే ఇక్కడ కార్యాచరణకు పునాది. తల్లి చేతులు కోల్పోయి ప్రేతమైతే, కూతురు ఆ విషవలయాన్ని గుర్తించి బద్దలు కొట్టే స్పృహను పొందింది. వంటిల్లు కేవలం రుచులు వండే చోటు కాదు, అది స్త్రీ అణచివేతకు కేంద్ర బిందువు అని చాటడం ద్వారా, ఆ నాలుగు గోడలను దాటి బయటపడాలనే తిరుగుబాటు కార్యాచరణకు ఈ కవిత నాంది పలికింది.

స్త్రీవాద కవిత్వం కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణగా ఆగలేదు. అది స్త్రీలను తమ హక్కుల గురించి ఆలోచింపజేసింది. గృహహింస వ్యతిరేక చట్టాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధం, ఆస్తి హక్కులు, సమాన అవకాశాల సాధన వంటి వాస్తవిక న్యాయ, సామాజిక పోరాటాలకు సైద్ధాంతిక పునాదిని నిర్మించింది. ఇది అస్తిత్వ సంక్షోభం కార్యాచరణగా మారిన ప్రక్రియకు బలమైన నిదర్శనం.

### 4. మైనారిటీ (ముస్లింవాద) కవిత్వం: విచ్ఛిన్నమవుతున్న పౌరసత్వపు ఆవేదన:

ముస్లింవాద కవిత్వంలో అస్తిత్వ సంక్షోభం నుండి కార్యాచరణ వైపు సాగిన పరిణామాన్ని క్లుప్తంగా క్రింది అంశాలు వివరిస్తాయి:

**1. అస్తిత్వ సంక్షోభం (భయం, అభద్రత, ఉనికి ప్రశ్నార్థకం):**

**బాహ్య దాడులు – దేశభక్తి శంక:** 1992 బాబ్రీ మసీదు కూల్చివేత, 2002 గుజరాత్ ఘటనలు, ప్రపంచవ్యాప్త ఉగ్రవాద పరిణామాల నేపథ్యంలో ముస్లింలు అనుమానపు చూపులకు, అభద్రతా భావానికి గురయ్యారు. తాము ఈ దేశ పౌరులమేనా అని నిరూపించుకోవాల్సిన అస్తిత్వ సంక్షోభం మొదలైంది.

**ఆత్మగౌరవ వేదన:** ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' దీర్ఘకవిత ద్వారా ముస్లింలలో ఆత్మగౌరవంతో కూడిన ప్రత్యేక అస్తిత్వ డిమాండ్ బలంగా వ్యక్తమైంది. 'వలస', 'సరిహద్దు రేఖ', 'ఆరోవర్ణం' వంటి కవితల్లో స్వదేశంలోనే పరాయివాళ్ళుగా మారిన ద్వితీయ శ్రేణి పౌరుల అస్తిత్వ వేదన కనిపిస్తుంది.

**ముస్లిం స్త్రీల సంక్షోభం:** మతం, పితృస్వామ్యం, బురఖా, తలాఖ్, బహుభార్యత్వం వంటి అంశాల మధ్య ముస్లిం స్త్రీల ఉనికి బొమ్మల్లా (ఉదా: మున్వీరున్నీసా 'గుడియా' కవిత) మరింత అణచివేతకు, అస్తిత్వ సంక్షోభానికి గురైంది.

**2. కార్యాచరణ (ప్రతిఘటన, అంతర్–బాహిర్ పోరాటం, సంస్కరణలు):** బాహ్య ప్రతిఘటన (హిందుత్వ, మతోన్మాదంపై దాడి): అస్తిత్వ సంక్షోభంలో మునిగిపోకుండా, 'జల్‌జలా', 'అజాఁ', 'గుజరాత్ గాయం', 'ముఖౌటా' వంటి సంకలనాల ద్వారా మెజారిటీ మత భావజాలాన్ని, బాహ్య శక్తుల వివక్షను కవితాత్మకంగా గట్టిగా నిలదీశారు.

**అంతర్గత పోరాటం – స్వీయ సంస్కరణలు**: కేవలం బాహ్య శత్రువును నిందించడమే కాకుండా, స్వమతంలోని ఛాందసత్వాన్ని, మతపెద్దల అవకాశవాదాన్ని ఎండగడుతూ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. స్కైబాబ ('హిజాబ్', 'సాంచా'), ఖాజా ('ఫత్వా') మొదలైన రచనలు ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాయి.

**స్త్రీల తిరుగుబాటు కార్యాచరణ:** షాజహానా 'నఖాబ్' వంటి సంకలనాలతో బురఖా సంకెళ్లను తెంచుకునే అంతర్గత ప్రజాస్వామ్య పోరాటం ప్రారంభమైంది. 'లద్దాఫ్ని' కవిత ద్వారా మాతృభాషను, తమ మూలాలను ప్రశ్నించే ప్రతిఘటనా స్వరం కార్యాచరణ రూపం దాల్చింది.

ఈ విధంగా ముస్లింవాద కవిత్వం అభద్రతా భావంతో కూడిన అస్తిత్వ సంక్షోభం నుండి మొదలై, ఒకవైపు బాహ్య దాడులను ఎదుర్కొంటూనే, మరోవైపు స్వమత సంస్కరణలు సాధించే ద్విముఖ పోరాట కార్యాచరణగా పరిణామం చెందింది.

ఖాదర్ మొహియుద్దీన్ రాసిన ప్రసిద్ధ కవిత "పుట్టుమచ్చ" ఈ సంక్షోభపు తీవ్రతను కళ్ళకు కడుతుంది:

"నేను పుట్టకముందే

దేశద్రోహుల జాబితాలో

నమోదై ఉంది నాపేరు"

స్కైబాబ, యాకూబ్, అఫ్సర్, షాజాహానా వంటి కవులు మైనారిటీల సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పడమే కాక, ప్రజాస్వామిక, సెక్యులర్ విలువల పరిరక్షణ కోసం విశాల సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చే కార్యాచరణను ప్రోత్సహించారు.

**5. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ కవిత్వం: స్వయంపాలన కార్యాచరణ:**

ఆధునిక సాహిత్యంలో అస్తిత్వ పోరాటం ఒక పూర్తిస్థాయి రాజకీయ కార్యాచరణగా, చివరకు ఒక ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంగా రూపుదిద్దుకున్న అద్భుత ఘట్టం——తెలంగాణ కవిత్వం.

దశాబ్దాల వలసపాలన, వనరుల దోపిడీ, భాషా-సాంస్కృతిక వివక్ష తెలంగాణ సమాజంలో తీవ్ర ఆత్మన్యూనతా భావాన్ని, అస్తిత్వ సంక్షోభాన్ని సృష్టించాయి. "తెలంగాణ యాస తక్కువది, ఇక్కడి సంస్కృతి మోటైనది" అనే ఆధిపత్య ధోరణిని తెలంగాణ కవిత్వం తీవ్రంగా నిరసించింది.

కాళోజీ గొడవ నిరసన అయితే, మలిదశ ఉద్యమంలో కవులు (నందిని సిధారెడ్డి, అందెశ్రీ, గోరటి వెంకన్న, జూలూరు గౌరీశంకర్, దేశపతి శ్రీనివాస్) రాసిన గీతాలు ప్రజలను లక్షల సంఖ్యలో రోడ్లపైకి రప్పించాయి. అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" ఉద్యమానికి ఆత్మగా నిలిస్తే, గోరటి వెంకన్న పల్లె కన్నీటిని కార్యాచరణ నిప్పుగా మార్చాడు. గద్దర్ రాసి పాడిన పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా గేయం మొత్తం ఉద్యమ యువతని ఉర్రుతలూగించింది.కవిత్వం ఇక్కడ పత్రికల పుటలకే పరిమితం కాలేదు; ధూంధాం వేదికలపై పాటై, ఆటై, గజ్జె కదం తొక్కి, ఒక భౌగోళిక ప్రాంతం తన రాజకీయ హక్కును సాధించుకునే స్థాయికి చేరింది.

**1. అస్తిత్వ సంక్షోభం (విధ్వంసం, అభద్రత మరియు పరాయీకరణ):** సమైక్య పాలనలోను, ప్రపంచీకరణ నేపథ్యంలోను తెలంగాణ గ్రామీణ, నగర జీవనం ఎదుర్కొన్న సాంస్కృతిక చులకనభావం, జీవనోపాధి సంక్షోభం ఈ కవితల్లో బలంగా వ్యక్తమైంది:

**గ్రామాల ముంపు, వలసల వేదన – ప్రొఫెసర్ ననుమాస స్వామి కవిత:**

"ఏలిముద్ర ఎయ్యకుండానే / నా బతుకును వీలునామాగా రాయించుకున్నోడా! / నీ వాడిన జూదంలో నా ఊళ్ళకు ఊళ్ళే / బతుకమ్మలై తేలడం తల్చుకొని ఎర్రిగా నవ్వుకుంటున్న! / నమ్ముకున్న ఆలిని / రెక్కలు రాని గద్ద గాళ్ళనీ - నెత్తికెత్తుకొని / ఇయ్యాల బతుకు దెరువుకు ఏడ్నని దేవులాడను!"

**విశ్లేషణ**: పులిచింతల ప్రాజెక్టు ముంపునకు గురైన గ్రామాల నేపథ్యం నుండి సాగిన ఈ కవిత అస్తిత్వ సంక్షోభానికి నిదర్శనం. సమైక్య పాలకుల నిర్ణయాల వల్ల ఊళ్లకు ఊళ్లే నీళ్లలో మునిగి 'బతుకమ్మలై తేలడం', బతుకుదెరువు కోల్పోయి కుటుంబంతో సహా వలసబాట పట్టాల్సి రావడం గ్రామీణ సామాజిక అస్తిత్వం ఎలా ధ్వంసమైందో చాటుతుంది.

**పండుగ ముగింపు – ఆడబిడ్డల కలత, శూన్యత – దేశపతి శ్రీనివాస్ కవిత:**

'కోళ్ళాగ గుంజుకపోతుంటే / కలతపడ్డ ఆవు / కనుగుడ్డైతది పల్లే'

**విశ్లేషణ**: పండుగ ముగిసి ఆడబిడ్డలు తిరిగి అత్తవారింటికి వెళ్తున్నప్పుడు, 'కలతపడ్డ ఆవు'లా మారే పల్లె దుస్థితి, ఇల్లు బతుకమ్మ లేని ఖాళీ తాంబాలంలా మిగిలిపోవడం గ్రామీణ కుటుంబ బంధాలలోని మానసిక సంక్షోభాన్ని, వేదనను ఆవిష్కరిస్తుంది.

**నగర అస్తిత్వంపై వివాదం ('హైదరాబాద్ ఎవరిది?' అనే ప్రశ్న):**

తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వానికి గుండెకాయ అయిన హైదరాబాద్‌పై సమైక్య పాలకులు యాజమాన్య హక్కుల పేరిట ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, తెలంగాణ ప్రజలు తీవ్రమైన ప్రాదేశిక, సాంస్కృతిక అభద్రతకు గురయ్యారు. సాహిత్య చరిత్రలో సైతం హైదరాబాద్ తొలి ఉర్దూ రాజకవి కులీ కుతుబ్‌షాహీ విస్మరించబడటం వంటి చారిత్రక ఉపేక్షలను సుంకిరెడ్డి నారాయణరెడ్డి కవిత ఎండగట్టింది.

**2. కార్యాచరణ వైపు దృక్పథం (పోరాటం, తిరుగుబాటు, ఆత్మగౌరవ ప్రకటన)** తమ సాంస్కృతిక సంపదను, గుర్తింపును కేవలం వేదనతో సరిపెట్టకుండా, వాటినే సమైక్య ఆధిపత్యాలపై పోరాడే ఆయుధాలుగా, కార్యాచరణ సాధనాలుగా మలిచిన తీరు:

**బతుకమ్మను పోరాట ఆయుధంగా మలచడం – కాసుల లింగారెడ్డి కవిత:**

'నిజాం నిరంకుశాన్ని సాయుధమై నిలువరించిన' చైతన్యమని... 'గడీల గోడలు కూల్చి/ భూస్వామ్యాన్ని భూస్థాపితం చేసిన బతుకమ్మ'

**విశ్లేషణ**: బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు; రజాకార్ల అకృత్యాలను, నిజాం నిరంకుశత్వాన్ని సాయుధంగా ఎదిరించిన చారిత్రక పోరాట వారసత్వం. సమైక్య పాలనలోని సమస్త సాంస్కృతిక ఆధిపత్యాలను తుత్తునియలు చేయడానికి ప్రజల చేతికి లభించిన "ఒక సరికొత్త ఆయుధం" బతుకమ్మ అంటూ కవి సంస్కృతిని ఉద్యమ కార్యాచరణగా తీర్చిదిద్దారు.

**నగర హక్కుపై బాహాట ప్రకటన, గళమెత్తడం – జూపాక సుభద్ర కవిత:**

"బాజాప్తుగ భాగ్యనగరం మాదే / గీ అవ్వల్ దర్జా హైద్రాబాద్ / మా వీర తెలంగాణది / పోరు తెలంగాణది / మా వేరు తెలంగాణది"

**విశ్లేషణ**: హైదరాబాద్ ఎవరిదంటూ సమైక్య పాలకులు రేకెత్తించిన వివాదానికి ఎదురుతిరిగి, ఆత్మగౌరవంతో "బాజాప్తుగ భాగ్యనగరం మాదే" అని నినదించడం నేరుగా కార్యాచరణకు దిగడమే. ఈ నగరం తరతరాల పోరు తెలంగాణదని నిరూపిస్తూ రాజకీయ, ప్రాదేశిక హక్కును ఖరాకండీగా డిమాండ్ చేశారు.

**సహజీవన చైతన్యంతో కూడిన తిరుగుబాటు – అమ్మంగి వేణుగోపాల్ కవిత:**

"తానీషా కథలో అందరికీ రాముణ్ని చూపిస్తుంది / తుర్రేబాజ్ ఖాన్ కథలో తిరుగుబాటు చెప్తుంది / తాను మాత్రం మక్కా మసీదు పావురమై ఎగురుతుంది"

**విశ్లేషణ**: హైదరాబాద్ సంస్కృతిలో భాగమైన 'తుర్రేబాజ్ ఖాన్' బ్రిటిష్‌పై చేసిన తిరుగుబాటు స్ఫూర్తిని గుర్తుచేస్తూ, గంగాజమునా తెహజీబ్‌తో నిలబడే ప్రజల ఐక్యతే ఉద్యమాన్ని ముందుకు నడిపించే పోరాట కార్యాచరణ అని ప్రకటించారు.

**సాంస్కృతిక పునరుజ్జీవనం ద్వారా ఎదురుదాడి – ఏనుగు నరసింహారెడ్డి, దేశపతి, నాంపల్లి సుజాత, కేతిరెడ్డి కవితలు:**

హేళనకు గురైన తమ భాషను, సంతలను (హుస్నాబాద్ అంగడి), బతుకమ్మ, దసరా అలాయ్-బలాయ్ పండుగలను కవిత్వంలోకి తేవడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజల్లో బలమైన ఉద్యమ ప్రేరణను, ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

ఈ విధంగా ఉద్యమ కవులు పల్లెల విధ్వంసం, హైదరాబాద్ ఉనికిపై వచ్చిన దాడుల వంటి అస్తిత్వ సంక్షోభాన్ని రికార్డు చేస్తూనే, బతుకమ్మను పోరాట ఆయుధంగా, పల్లె-నగర సంస్కృతులను ఉద్యమ జెండాలుగా ఎగరేసి తెలంగాణ విముక్తి దిశగా తిరుగులేని కార్యాచరణను నడిపించారు.

**రాజకీయ, సామాజిక చైతన్య ప్రయోజనం: సాహిత్య విలువల పునర్నిర్మాణం:;**ఆధునిక కవిత్వంలో జరిగిన ఈ పరిణామం సాహిత్య సౌందర్యశాస్త్రాన్ని కూడా సమూలంగా మార్చివేసింది.

**బిభాషా ప్రజాస్వామికీకరణ:** పండిత భాష, సంస్కృత సమాసాల స్థానంలో ప్రజా భాష, మాండలికాలు, జీవద్భాష కవిత్వ పీఠాన్ని అధిష్ఠించాయి. తెలంగాణ యాస, రాయలసీమ మాండలికం, ఉత్తరాంధ్ర గిరిజన శైలి కవిత్వంలో ప్రధాన స్రవంతిగా మారాయి.

**వస్తువులో విస్తృతి:** రాజవంశాలు, పౌరాణిక నాయకుల స్థానంలో గొర్రెల కాపరి, చెత్త ఏరుకునే బాలిక, దళిత మహిళ, వ్యవసాయ కూలీ, మైనారిటీ యువకుడు కవితా నాయకులయ్యారు.

**ప్రజాస్వామ్య సాధికారత:** ఆధునిక కవిత్వం కేవలం భావోద్వేగాల ఉపశమనం కోసం మాత్రమే పనిచేయలేదు; అది సాధారణ పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను గుర్తుచేసే రాజకీయ విద్యా సాధనంగా పనిచేసింది.

**ముగింపు:**

"అస్తిత్వ సంక్షోభం నుండి కార్యాచరణ వైపు" సాగిన ప్రయాణమే ఆధునిక తెలుగు కవిత్వ ప్రస్థానం.

మనిషి తన ఉనికికి ప్రమాదం ఏర్పడినప్పుడు కేవలం కన్నీరు కార్చితే అది విషాద కావ్యమవుతుంది; అదే మనిషి ఆ వేదనకు కారణమైన వ్యవస్థను గుర్తించి, కలం పట్టి నిరసిస్తే అది విప్లవమవుతుంది; ఆ నిరసన ద్వారా ప్రజలను జాగృతం చేసి కదం తొక్కేలా చేస్తే అది నవ సమాజ నిర్మాణానికి పునాది అవుతుంది.

తెలుగు ఆధునిక కవులు తమ సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడల్లా బాధ్యతాయుతమైన మేధావులుగా నిలబడ్డారు. శబ్దాలను ఆయుధాలుగా మలిచి, వాక్యాలను ఉద్యమ జెండాలుగా ఎగరేసి సాహిత్యాన్ని కార్యాచరణకు ప్రేరకంగా మార్చారు. నిరసన అనేది విచ్ఛిన్నం కోసం కాదని, మరింత న్యాయమైన, ప్రజాస్వామికమైన, సమానత్వంతో కూడిన సమసమాజ స్థాపన కోసమేనని ఆధునిక కవిత్వం తన చైతన్య ప్రయోజనం ద్వారా నిరూపించింది. సమకాలీన కాలంలో కూడా కొత్త రూపాల్లో ఎదురవుతున్న డిజిటల్, కార్పొరేట్, నియంతృత్వ పోకడలపై నిరసన గళాన్ని విప్పాల్సిన చారిత్రక బాధ్యత నేటి కవిత్వంపై ఇంకా సజీవంగానే ఉంది.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి
2. ఆధునిక తెలుగు సాహిత్యం లో ప్రక్రియలు –ధోరణులు –తెలుగు అకాడమి
3. జి. నాగయ్య –తెలుగు సాహిత్య సమీక్ష సంపుటాలు –
4. శ్రీశ్రీ – మహాప్రస్థానం
5. శివ సాగర్ కవిత్వం 1931–2012
6. ఎస్. వి. సత్యనారాయణ – దళిత వాద వివాదాలు ; దళిత సాహిత్యం నేపథ్యం ; దశాబ్ది కవిత
7. ఓల్గా – నీలిమేఘాలు (స్త్రీవాద కవిత్వం).
8. ఖాదర్ మొహియుద్దీన్– 'పుట్టుమచ్చ'
9. ఆచార్య డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి – తెలంగాణ సాహిత్య చరిత్ర – తెలంగాణ వివిధ సాహిత్యం ప్రక్రియలు
10. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి – గనుమ (తెలంగాణ అస్తిత్వ సాహిత్యం వ్యాసాలు ) ; వినిర్మాణం (తెలంగాణ అస్తిత్వ నిర్మాణ వ్యాసాలు )
11. కాసుల ప్రతాప రెడ్డి –తెలంగాణ సాహిత్యోద్యమాలు
12. డా. వెల్దండి శ్రీధర్ – ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కవిత్వం (ప్రపంచ తెలుగు మహాసభలు –2017)
13. ఎస్వీ. రామారావు – తెలుగులో సాహిత్య విమర్శ.

## సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# తెలుగు జానపద సాహిత్యం – సమాజంతో దానికి ఉన్న ప్రాధాన్యత

**– యస్. మణికంఠ**

బి.ఏ. మొదటి సంవత్సరం – స్పెషల్ తెలుగు విద్యార్థి

ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల,

రాజమహేంద్రవరం

### పరిచయం:

తెలుగు సాహిత్యానికి ఉన్న ప్రాచీనత, వైవిధ్యం, వైశిష్ట్యాలలో జానపద సాహిత్యం ఒక విశిష్టమైన అధ్యాయం. అక్షరజ్ఞానం విస్తృతంగా లేని కాలం నుంచే ప్రజల జీవనానుభవాలు, విశ్వాసాలు, ఆచారాలు, సంస్కృతులు, కష్టసుఖాలు, ఆశలు, ఆకాంక్షలు, సామాజిక చైతన్యం మొదలైనవి మౌఖిక రూపంలో తరతరాలకు ప్రసారం అవుతూ వచ్చాయి. ఈ ప్రజానుభవాల సృజనాత్మక వ్యక్తీకరణే **జానపద సాహిత్యం**.

'జానపదం' అనే పదానికి సాధారణంగా 'పల్లె ప్రజలు' లేదా 'ప్రజల సమూహం' అనే అర్థాలు ఉన్నాయి. అందువల్ల జానపద సాహిత్యం అనేది ఒక వ్యక్తి సృష్టికి మాత్రమే పరిమితమైన సాహిత్యం కాదు; సమాజపు సామూహిక అనుభవాల నుంచి పుట్టిన ప్రజాసాహిత్యం. ఇందులో పల్లె ప్రజల జీవన విధానం, వారి ఆలోచనా ధోరణి, నమ్మకాలు, ఆచార వ్యవహారాలు, శ్రమ సంస్కృతి, వినోదం, నీతి, హాస్యం, వ్యంగ్యం, సామాజిక స్పృహ మొదలైన అంశాలు ప్రతిబింబిస్తాయి.

### జానపద సాహిత్యం అంటే ఏమిటి?

ప్రజలు తమ అనుభవాలను, భావోద్వేగాలను, సంతోషాన్ని, విషాదాన్ని, ఉల్లాసాన్ని, ఆశలను, ఆకాంక్షలను ప్రధానంగా **మౌఖిక సంప్రదాయం** ద్వారా వ్యక్తపరచి, ఒక తరం నుంచి మరొక తరానికి అందించిన సాహిత్య రూపాలను జానపద సాహిత్యంగా పేర్కొనవచ్చు.

జానపద సాహిత్యానికి లిఖిత సాహిత్యంతో పోలిస్తే ఒక ప్రత్యేక లక్షణం ఉంది. ఇది ప్రధానంగా **వినడం—గుర్తుంచుకోవడం—చెప్పడం—తరతరాలకు అందించడం** అనే ప్రక్రియ ద్వారా జీవిస్తుంది. అందువల్ల దీనిని 'మౌఖిక సాహిత్యం' అని కూడా అంటారు.

రామాయణం, మహాభారతం వంటి ఇతిహాస కథలను పండితులు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు కూడా విని, గుర్తుంచుకొని, తమ ప్రాంతీయ భాషా శైలిలో కథలుగా, పాటలుగా, నాటక రూపాలుగా ప్రజలకు అందించారు. ఈ ప్రక్రియ జానపద సాహిత్యపు మౌఖిక శక్తిని తెలియజేస్తుంది.

### జానపద సాహిత్యంలోని ప్రధాన విభాగాలు

జానపద విజ్ఞానాన్ని విస్తృతంగా పరిశీలించినప్పుడు దానిని పలు విభాగాలుగా చూడవచ్చు. ముఖ్యంగా—

**మౌఖిక జానపద విజ్ఞానం**

**సాంఘిక జానపద ఆచారాలు**

**భౌతిక జానపద సంస్కృతి**

**జానపద ప్రదర్శన కళలు**

### 1. మౌఖిక జానపద విజ్ఞానం

ప్రజల నోటి మాటగా తరతరాలకు అందిన సాహిత్య రూపాలు మౌఖిక జానపద విజ్ఞానంలోకి వస్తాయి. వీటిలో—

సామెతలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పొడుపుకథలు

జానపద కథలు

జానపద గేయాలు

శతకాలు

జానపద నానుడులు

లాలిపాటలు

వివాహ గేయాలు

వ్యవసాయ గేయాలు

ముఖ్యమైనవి.

**"సామెత"** ప్రజల అనుభవ సారాన్ని సంక్షిప్తంగా వ్యక్తపరుస్తుంది.

**"పొడుపుకథ"** ప్రజల మేధోశక్తిని, పరిశీలనా సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

**"జానపద గేయం"** ప్రజల జీవితాన్ని, శ్రమను, భావోద్వేగాలను స్వరబద్ధం చేస్తుంది.

**2. సాంఘిక జానపద ఆచారాలు**

సమాజంలోని ప్రజలు సమూహంగా ఆచరించే సంప్రదాయాలు, ఆచారాలు, ఉత్సవాలు, పండుగలు సాంఘిక జానపద సంస్కృతిలో భాగం. జాతరలు, పండుగలు, వివాహ సంప్రదాయాలు, అంత్యక్రియల ఆచారాలు, కోలాటాలు మొదలైనవి దీనికి ఉదాహరణలు.

ఇవి వ్యక్తిని సమాజంతో అనుసంధానిస్తాయి. ముఖ్యంగా **సామూహిక ఐక్యత, పరస్పర సహకారం, సామాజిక బంధం** వంటి విలువలను బలపరుస్తాయి.

**3. భౌతిక జానపద సంస్కృతి**

ప్రజల జీవన విధానంలో ఉపయోగించే వస్తువులు, పనిముట్లు, చేతివృత్తులకు సంబంధించిన పరికరాలు భౌతిక జానపద సంస్కృతిలో భాగం.

వ్యవసాయానికి ఉపయోగించే **నాగలి, కొడవలి, ధాన్యం నిల్వ చేసే గాదులు, చేతివృత్తుల పరికరాలు, తోలుబొమ్మలు** మొదలైనవి ప్రజల భౌతిక సంస్కృతికి ప్రతీకలు.

వీటి ద్వారా ఒక ప్రాంతపు ప్రజల జీవన విధానం, వృత్తులు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత మనకు తెలుస్తాయి.

**4. జానపద ప్రదర్శన కళలు**

ప్రజలు తమ భావాలను, కథలను, సామాజిక సందేశాలను, వినోదాన్ని ప్రదర్శన రూపంలో వ్యక్తీకరించే కళలను జానపద ప్రదర్శన కళలుగా చెప్పవచ్చు.

వాటిలో—

బుర్రకథ

ఒగ్గుకథ

హరికథ

తోలుబొమ్మలాట

వీధి నాటకం

కోలాటం

తప్పెటగుళ్లు

వంటి కళారూపాలు విశేష ప్రాధాన్యత కలిగి ఉన్నాయి.

**జానపద సాహిత్యం – సమాజంతో దాని సంబంధం**

జానపద సాహిత్యం సమాజానికి కేవలం వినోదాన్ని అందించే సాధనం మాత్రమే కాదు. అది **సమాజపు జీవన దర్పణం**. ప్రజల ఆలోచనలు, విశ్వాసాలు, సామాజిక సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ వ్యవస్థ, వృత్తులు, పండుగలు, బాధలు, పోరాటాలు వంటి అనేక అంశాలను జానపద సాహిత్యం ప్రతిబింబిస్తుంది.

పల్లె ప్రజల కష్టసుఖాలు జానపద గేయాలలో వినిపిస్తాయి. వ్యవసాయ పనుల్లో శ్రమను మరిచిపోయేందుకు వారు పాడుకునే పాటలు వారి **శ్రమ సంస్కృతికి ప్రతీకలు**. పెళ్లిళ్లలో పాడే పాటలు కుటుంబ, బంధుత్వ సంబంధాలను ప్రతిబింబిస్తాయి. లాలిపాటలు తల్లి ప్రేమను వ్యక్తపరుస్తాయి. వీరగాథలు ధైర్యాన్ని, త్యాగాన్ని గుర్తుచేస్తాయి.

అందువల్ల జానపద సాహిత్యం ఒక సమాజపు **చారిత్రక జ్ఞాపకశక్తి**గా కూడా పనిచేస్తుంది.

**ఆనాటి జానపద సాహిత్యం**

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలకు ప్రత్యేకమైన స్థానం ఉండేది. వీధి నాటకం వస్తుందనే వార్త తెలిసినా, బుర్రకథ లేదా ఒగ్గుకథ ప్రదర్శన జరుగుతుందని తెలిసినా ప్రజలు కుటుంబాలతో కలిసి వెళ్లి ఆసక్తిగా వీక్షించేవారు.

తోలుబొమ్మలాట, బుర్రకథ, ఒగ్గుకథ, హరికథ వంటి కళారూపాలు ప్రజలకు వినోదాన్ని అందించడంతో పాటు **నీతి, ధర్మం, సామాజిక బాధ్యత, చారిత్రక స్పృహ** వంటి విలువలను కూడా అందించేవి.

బుర్రకథలో వినిపించే **"తందాన తానా…"** వంటి వాడుకలు ప్రేక్షకులను ఆకట్టుకునేవి. కళాకారుడు–ప్రేక్షకుడి మధ్య ఏర్పడే ప్రత్యక్ష సంబంధం జానపద ప్రదర్శన కళలకు ప్రత్యేకమైన ఆకర్షణను ఇచ్చేది.

**నేటి కాలంలో జానపద సాహిత్యం**

సాంకేతిక పరిజ్ఞానం, పట్టణీకరణ, ప్రపంచీకరణ, ఆధునిక వినోద సాధనాల విస్తరణ కారణంగా జానపద కళల ప్రదర్శనకు లభించే సామాజిక స్థలం చాలా ప్రాంతాల్లో తగ్గింది. అయితే జానపద సాహిత్యం పూర్తిగా అంతరించిపోలేదు. అది **కొత్త మాధ్యమాలను ఆశ్రయించి కొత్త రూపాల్లో మన ముందుకు వస్తోంది.**

ఒకప్పుడు గ్రామ వీధిలో వినిపించిన జానపద గేయం నేడు YouTube లేదా ఇతర డిజిటల్ వేదికల్లో వినిపిస్తోంది. బుర్రకథ, ఒగ్గుకథ వంటి కళారూపాల వీడియోలు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రేక్షకులను చేరుతున్నాయి.

అందువల్ల ఆధునిక సాంకేతికతను జానపద సాహిత్యానికి ప్రత్యర్థిగా మాత్రమే చూడకుండా, దాని **పరిరక్షణకు మరియు ప్రపంచవ్యాప్త ప్రచారానికి ఒక సాధనంగా** ఉపయోగించుకోవాలి.

**జానపద సాహిత్య పరిరక్షణ – మన బాధ్యత**

జానపద సాహిత్యం మన సామూహిక సాంస్కృతిక సంపద. ఒక తరం దానిని నిర్లక్ష్యం చేస్తే, అనేక తరాల జ్ఞాపకాలు, అనుభవాలు, కళారూపాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

అందువల్ల—

జానపద గేయాలను సేకరించాలి.

వృద్ధుల వద్ద ఉన్న మౌఖిక కథనాలను నమోదు చేయాలి.

జానపద కళాకారులను ప్రోత్సహించాలి.

పాఠశాలలు, కళాశాలల్లో జానపద కళా ప్రదర్శనలు నిర్వహించాలి.

జానపద కళారూపాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలి.

యువతను జానపద కళల వైపు ఆకర్షించాలి.

పరిశోధకులు ప్రాంతీయ జానపద సంప్రదాయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి.

**ముగింపు:**

జానపద సాహిత్యం అంటే కేవలం పల్లె పాటలు, కథలు, ఆటలు, ప్రదర్శనలు మాత్రమే కాదు. **అది ఒక సమాజపు జీవన స్మృతి; ఒక జాతి సాంస్కృతిక మూలాలను ప్రతిబింబించే అద్దం; తరతరాల అనుభవాలను భద్రపరిచే ప్రజల జ్ఞానభాండాగారం.**

**పల్లెలో పుట్టి ప్రజల పెదవులపై పెరిగి, తరతరాలుగా ప్రయాణించిన జానపద సాహిత్యం నేడు డిజిటల్ ప్రపంచంలోకి అడుగుపెట్టింది.** మారుతున్న కాలానికి అనుగుణంగా దాని రూపం మారవచ్చు; కానీ దాని ప్రాధాన్యత మాత్రం తగ్గదు.

**"మాటల్లో మాధుర్యం...**
**పాటల్లో జీవితం...**
**కథల్లో చరిత్ర...**
**ఆచారాల్లో సంస్కృతి...**
**కళల్లో ప్రజల ఆత్మ...**
**ఇదే మన జానపద సాహిత్యం!"**

కాబట్టి మన జానపద సాహిత్యాన్ని కేవలం గతానికి చెందిన సంపదగా కాకుండా **భవిష్యత్ తరాలకు అందించాల్సిన సజీవ సాంస్కృతిక వారసత్వంగా** భావించాలి.

**పదండి... మన జానపద సాహిత్యాన్ని కాపాడుకుందాం!**
**పదండి... మన పల్లె సంస్కృతిని పరిరక్షిద్దాం!**
**పదండి... మన జానపద కళలకు కొత్త జీవం పోద్దాం!**

**జానపదం బతికితే — మన సంస్కృతి బతుకుతుంది.**
**జానపదం వెలిగితే — మన తెలుగు వెలుగుతుంది.**

**ఆధార గ్రంథాలు :**

1. బిరుదురాజు రామరాజు — *తెలుగు జానపద గేయ సాహిత్యం.*
2. నాయని కృష్ణకుమారి — *జానపద గేయాలు.*
3. ఆర్వీయస్. సుందరం — *తెలుగు జానపద సాహిత్యం.*
4. ఆర్వీయస్. సుందరం — *జానపద విజ్ఞానం.*
5. వెలగా వెంకటప్పయ్య — *జానపద విజ్ఞాన వ్యాసావళి.*
6. Richard M. Dorson — *Folklore and Folklife: An Introduction.*
7. Stith Thompson — *The Folktale.*
8. Alan Dundes — *The Study of Folklore.*

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# నగరంలోవాన – జీవిత చిత్రణ

– పరుచూరి విజయలక్ష్మి
తెలుగు లెక్చరర్
ప్రభుత్వ మహిళా కళాశాల గుంటూరు.
7702519119

నా ఊహలో వచన కవిత్వం అంటే ప్రజల కవిత్వం, నా కవిత్వానికి వ్యాకరణా లు ప్రజలు, నాకు నిఘంటువులు ప్రజల కవిత్వం, నాకు అలంకారాలు ప్రజలు అని తన కవిత్వం గురించి చెప్పుకున్నవచనకవితా వనమాలి కుందుర్తి ఆంజనేయులు గుంటూరు జిల్లా కోటావారి పాలెంలో జన్మించారు. ఆయన ఎనిమిది నెలల వయసులోనే తండ్రిని పోగొట్టుకున్నారు. మాతామహుల ఇంట అతిబీదరికంలో తల్లి రెక్కల కష్టం మీద బ్రతికారు. వినుకొండలో ఎనిమిదవ తరగతి వరకు జాషువా గారి దగ్గర చదివారు. అక్కడే జాషువాగారి సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. తరువాత అభ్యుదయ వాది పులుపుల శివయ్యగారి సాంగత్యంతో అభ్యుదయ దృక్పథం అలవడింది. బెజవాడలో ఇంటర్మీడియెట్ చదువుతున్నపుడు విశ్వనాధ సత్యనారాయణ గారి దగ్గర తెలుగు అభ్యసనం చేశారు. ఇలాంటి మహామహులతో సాన్నిహిత్యమే కుందుర్తిని ఇంత గొప్ప స్థాయిలో నిలబెట్టింది. అనడంలో ఎలాంటి సందేహము లేదు. కళాశాలలో ఉన్నపుడు విశ్వనాధ గారి ప్రభావం కుందుర్తి గారి మీద చాలా ఎక్కువగానే ఉండేది. ఆయన ప్రభావంతో సంస్కృత సమాస భూయిష్టంగా "సౌప్తికం" అనే కావ్యం వ్రాసి విశ్వనాధవారికే అంకితమిచ్చారు. **పాతకాలం పద్యం, వర్తమానం వచన గేయం అని ఎలుగెత్తి చాటి, వచన కవితా పితామహుడిగా వినుతికెక్కిన కుందుర్తి ఆంజనేయులు అభ్యుదయ కవి, తెలుగు రచయిత, ఆంధ్రదేశంలో వచన కవితోద్యమానికి ఆద్యుడు. పద్యానిదే పై చేయిగా ఉన్నరోజుల్లో ఛందస్సు పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, మధ్య తరగతి, పేద, బడుగు వర్గాల జీవన స్థితిగతుల గురించి, శ్రామికులు, కర్షకుల బాధలు, వారి జీవన విధానం గురించి ఎంతో అందంగా తన కవితల ద్వారా చిత్రీకరించిన గొప్ప అభ్యుదయ కవి.**

వచన కవిత్వం రాయాలని ఒక ఉద్యమంగా ప్రచారం చేసి వర్తమాన, భవిష్యత్కాల కవులంతా వచనంలోనే కవిత్వం రాసే విధంగా పునాదులు వేశారు కుందుర్తి. ఆయన జీవితం, సాహిత్యం ఒక దానితో ఒకటి ముడిపడిపోయా యి

1941 ప్రాంతంలో మాచిరాజు దేవీప్రసాద్ గారు శ్రీశ్రీ గారి మహా ప్రస్థానం వ్రాతప్రతిని ఒకటి రాసుకొని వచ్చారు. దానిని చదివి విశ్వనాధ వారి ప్రభావం నుంచి బయటపడి శ్రీశ్రీ ప్రభావంలోకి వచ్చారు. ఆ ప్రభావంతో కుందుర్తి వ్రాసిన వచన కవితలలో సుప్రసిద్ధమైన కవిత 'నగరంలో వాన'.

కుందుర్తిగారి నగరంలో వాన కవిత సంపుటి గురించి వ్రాయాలని మొదలు పెట్టాను. కానీ 'నగరంలో వాన' అనే ఒక్క కవితలోనే ఒక కాన్వాస్ మీద ఒకతరం జీవితం, సంస్కృతి, సమాజ పరిస్థితులు అన్నీ ఒక చిత్రం లాగా మనసుమీద ముద్రించారు.

కుందుర్తిగారు నగరంలోవాన కవిత వ్రాయడానికి కారణం కృష్ణ శాస్త్రి గారని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. ఎలాగంటే కృష్ణ శాస్త్రి గారు రేడియోలో ప్రొడ్యూసరుగా ఉన్న సమయములో వర్షాకాల సమామావేశం ఏర్పాటుచేశారు. "నువ్వు బాగా రాయాలి సుమా నీ మీద ఎక్కువ ఆశ పెట్టుకొని నీకు కవిత ఇచ్చాను" అన్నారు. ఆయన ఎందుకు అలా అన్నారోగాని నాకు మాత్రం చక్కిలిగింత పెట్టినట్లైనది. ఆయనను మెప్పించి మాటదక్కించుకోవాలనే పట్టుదలతో ఆగేయం రాశాను అని కుందుర్తి వారే స్వయంగా చెప్పారు. అంతే కాకుండా దేవర కొండ కవిసమ్మేళనంలో కుందుర్తి వారు నగరంలోవాన గేయం చదివారు. ప్రక్కనే ఉన్న విశ్వనాధ వెంకటేశ్వర్లు గారు వచ్చి "మీకు సత్యనారాయణ గారి సాహిత్యంలో ఏమైనా పరిచయం ఉందా?" అని ప్రశ్నించారు "నేను ఆయన శిష్యుణ్ణి" అనిచెప్పారు కుందుర్తి. అలాచెప్పు నా సందేహం తీరిపోయింది అన్నారాయన. ఏమిటా సందేహం అని అడిగితే" నగరంలోవాన" గేయంలో వాన చినుకులను వర్ణించిన తీరు, అంత సూక్ష్మ పరిశీలన, నిశితత్వం, సత్యనారాయణగారి ఊహలానే ఉన్నాయన్నాడు. అదివిని "మంచిగేయం ఎవరికి

కావలసిన రూపంలో వారికి సాక్షాత్కరిస్తుంది కాబోలు" అనుకున్నారు కుందుర్తి. ఇంత కథ ఉంది కాబట్టే ఈ సంపుటికి "నగరంలోవాన" అనేపేరు పెట్టడం జరిగినదని, అంతేకాక కుందుర్తి హైదరాబాదు వచ్చిన తరువాత పదేళ్లకాలంలో రచించిన కవితలివి. అంటే నగరంలో ఉంటూ కుందుర్తి మేఘం కురిపించిన వచన గేయ వర్ష ధారలివి అని అర్థం చెప్పుకోవచ్చు. అందువల్లకూడా ఈ పేరు సార్ధకమైనది.

ఈ కవిత సంపుటికి "నగరంలో వాన" అని పేరు పెట్టడానికి కారణం కుందుర్తి వారే చెప్పుకున్నారు. అయితే ఏ నగరంలో వాన అని చూస్తే హైదరాబాదులో వాన. ఈ కవిత పేరు చదివి వానగురించి వచ్చిన ఎన్నో రచనల లాంటిదేమోలే అనుకున్నాను. కానీ కవిత చదువుతుంటే బాల్యం నుంచి మనిషి జీవితం మొత్తం కళ్ళకు కట్టినట్లు అనిపించింది. ఈసంపుటిలో ఉన్న నగరంలోవాన, అంతర్ముఖుడు, అభియోగం, అసమర్థ కౌమారం, గగనంలో సంక్రాంతి, సంక్రాంతి సూర్యుడు మొదలైన కవితలన్నీ కూడా మానవ జీవితాన్ని, ఆనాటి సామాజిక సాంఘిక పరిస్థితులను, మన ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తున్నాయి. సంపుటిలో ఉన్న నగరంలో వాన అనే ఒక్క కవిత గురించే వ్రాస్తున్నాను.

కవిత్వం ఒక జల్లుగా వస్తున్నట్లుగా వానజల్లు నగరంలో మొదలైంది అనిమొదలెట్టారు.

నున్నగా తెల్లగా తళతళలాడే

సిమెంటు రోడ్ల అద్దాలలోకి

మింటినుంచి మేడలు వంచి చూసి

తమ అందం చినుకుల కుప్పలుగా పోసి

అంతులేని ఆకాశ మంత ఆనందంతో ..........

హైదరాబాదు సిమెంటురోడ్లమీద వాన అనడాన్ని పరిశీలిస్తే ఈ కవిత వ్రాసే నాటికే నగరాభివృద్ధి మనకు తెలుస్తుంది.

పక్షాలు పోయినా పాదాలు వచ్చి

పర్వతాలు పారాడుతున్నట్టు

పరిగెత్తే రెండంతస్థుల బస్సులని చూసి.. పుట:335

ఈ వాక్యాలు చదివినప్పుడు ఒకప్పుడు పర్వతాలకు రెక్కలుండేవని అవి(ఇంద్రుడిచే) ఖండించ బడ్డాయనే పురాణ గాథను ఒకసారి గుర్తుకు తెస్తాయి. హైదరాబాదులో రెండంతస్థుల బస్సులు (డబుల్ డెక్కర్) ఒక ఆశ్చర్యం. అందులో ప్రయాణం ఒక మధురానుభూతి. పై అంతస్థులో కూర్చొని ప్రకృతిని ఆస్వాదిస్తూ హైదరాబాదు అందాలను తిలకిస్తూ చేసిన ప్రయాణం కళ్ళకు కట్టిన చిత్రరూపం. బస్సుల్నిచూసి పర్వతాలనుకొని వచ్చిన మేఘాలు పట్టణం చూసిన ఆనందంలో తిరిగి వెళ్ళడానికి ఇష్టపడక సినిమా చూసి ఉదయమే వెళ్ళొచ్చని ఆగిపోయాయట.1950ప్రాంతాల్లో పట్టణం రావడమేఒకవిశేషం .వచ్చిన వాళ్లు సినిమా చూడకుండా వెళ్ళేవాళ్ళు కాదు. కనుక నగరమొచ్చిన మేఘం కూడా సినిమా చూసి వెళ్లాలనుకుందేమో? అని ఒక సామాన్యుడిని మేఘంలో చూడగలిగారు కవి.

నగరాల్లో బతుకీడుస్తున్న జీవితాల్ని వివిధ కోణాల్లో చిత్రించారీ నగరంలోవాన కవితలో.కుందుర్తి కవిత్వం మధ్య తరగతి జీవితానికి ప్రతిబింబం. కవి స్వయంగా మధ్య తరగతి కుటుంబీకుడు కావడం వల్ల మధ్యతరగతి జీవితాన్ని పొల్లుపోకుండా చిత్రించారు. అటు ధనవంతులతో, ఇటు శ్రామిక వర్గంతో కలిసిపోలేక మానసిక వ్యధను అనుభవించే వీళ్ళ జీవితాలు దుర్భరమైనవి. దయనీయమైనవి. కనుకనే

నగరంలో కురిసే వానకు తెలుసు

గొడుగు జీతపు రూకల్లో మిగిల్చి

కొనగలగడం వట్టిమాటని

గోనెసంచి కప్పుకోవడం నాగరికులకు మోటని పుట:336

అంటూ మధ్యతరగతి జీవితాన్ని, మనస్తత్వాన్ని రెండు వాక్యాల్లో నిండుగా చూపారుకవి. మధ్యతరగతి వాడు శ్రామికవర్గం

(దిగువతరగతి) వైపు రాలేదు. గొడుగు మధ్యతరగతికి ప్రతిక. దిగువ మధ్య తగతివాడు లేదా మధ్యతరగతివాడు ఆర్థిక కారణాల దృష్ట్యా ఒక్కోసారి తన తరగతి విధానాన్ని కూడా నిర్వహించడానికి అశక్తుడవుతాడు. ఇది దీన స్థితి. వానలో తడవడానికి కూడా అంగీకరిస్తాడు గాని, గోనె సంచి మాత్రం కప్పుకోడు. అంటే శ్రామికవర్గం వైపు తాత్కాలికంగానైనా రాలేదు.

అదేవిధంగా మానవ మనస్తత్వ చిత్రణకూడా మనకి కవితలో కనిపిస్తుంది.

సరిగ్గా పావలా దూరాన్ని 'సవా రూపాయికి' పెంచామంటూ
వర్షాధి దేవతను రిక్షా వాండ్లు
వరాలు కోరుకుంటున్నారు
సైకిలుకు కట్టిన బిందె మీద
గుడ్డ మూత పూర్తిగా తీసేసి
వణుక్కుంటూ పాలవాడు వరండాలో నుంచున్నాడు. పుట:341

అవకాశం వచ్చినపుడే సంపాదించుకోవాలనే ఆశ, కోరిక రిక్షా వాళ్ళలో కనిపిస్తుంది. బిందె మీద మూతతీసి వర్షంలో ఉంచిన పాలవాడి కక్కుర్తి బుద్ధి ఇక్కడ కనిపిస్తుంది.

అవసరమైనపుడు అప్పు దొరకకుండా అవసరం లేనపుడు అప్పు దొరికిన విధంగా అవసరం లేని పట్నంలో పుష్కలంగా వర్షం కురుస్తుంది. దానిని కవి

స్వాగతం చెప్పని పట్న వాసాల సాగిన ఉదయపు జల్లు
రాత్రి వచ్చిన చుట్టంలా తిష్ట వేస్తుంది తీరిగ్గా

"పొద్దున వచ్చిన వాన, పొదదుగూకి వచ్చిన చుట్టం వెళ్లరు" అనే సామెతను ఇక్కడ చక్కగా వాడారు.

భూమి మీద బాధ పడుతున్న పేదవాడిని చూసి ప్రకృతి కూడా తన బాధను వర్షం రూపంలో ప్రకటించింది అంటూ కవి,

భూమ్మీద పస్తులున్న మనుషుల్ని చూసి
ఆకాశం కంటతడి పెట్టినట్లు
వాన ముమ్మరంగా కురుస్తుంటే... పుట .338

భూమ్మీద పస్తులున్న మనుషుల్ని చూసి ఆకాశం కంట తడి పెట్టినదని మనుషులలో లేని మానవత్వాన్ని ప్రకృతిలో చూశాడు.

ఆకాశపు పెండ్లికొడుకు అనేక శతాబ్దాల క్రితమే
నగర కాంతకు మెళ్ళో కట్టిన తగరపు తాళిబొట్టులా
తళతళా మెరుస్తోంది హుసేన్ సాగరం చెరువు. పుట.341

స్త్రీకి మాంగల్యం ఎంత ప్రధానమో, ఎంత నిండుదనాన్ని ఇస్తుందో అదే విధంగా హైదరాబాదుకు హుసేన్ సాగరకూడా అంత ప్రధానం, నగరానికి నిండుదనాన్ని ఇస్తుంది. అని కవి భావం.

ముసురు పట్టినపుడు సూర్యుడు మేఘాల మాటున దాగి ఉంటాడు. బయటికి రావడానికి ఎంత ప్రయత్నించిన మళ్ళీ మేఘాలు అడ్డుపడుతూనే ఉంటాయి. దానికి కవి

బతుకులోన సాధించ దలిచిన దానికి
పరిస్థితులు కలిసిరాని మానవ మాత్రుడిలా
ఆ వేయి వెలుగుల దొర కనిపించడం లేదు

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆయన రథం ఆగిందో నడుస్తుందో

ఆకాశానికే తెలియదు పుట :339

ఎన్ని ప్రయత్నాలు చేసినా మనిషి ఓడిపోతున్నపుడు కాలం కలిసి రావడం లేదు అంటాము. కాలం కలిసిరానపుడు వెయ్యి వెలుగులున్న సూర్యుడు కూడా కనుమరుగవుతాడు. కనుక నిరాశ చెందక పోరాడుతూనే ఉండండనే సందేశం చెప్పకనే చెప్పిన ట్లున్నది.

భూమి మీద పడ్డ వాన చినుకు కిటికీలోనుంచి మందు సీసాలో పడి, ఆ చినుకు శరీరం చేదేక్కడంతో ఏ కమ్మని పల్లె చేరువులోనో పడక పట్టణం ఎందుకు వచ్చాను? అని పట్నం వచ్చిన పల్లె ఆసామిలా అనుకుందట. చార్మినార్ మీద పడ్డ చినుకు సింహాసనం మీద ఎక్కినట్లు సంతోష పడిందిట. శాసన సభలో అన్నీ శాసన నిర్ణయాలు జాగుతాయికదా . అందుకే శాసన సభమీద పడ్డ చినుకు ఆకాశం వైపు చూసి వర్ష చాలు అని శాసిస్తే వాన ఆగిపోయింది అని వర్ణించి శాసన సభకున్న ప్రత్యేకతను మరోసారి ప్రకటించారు.

అంతా స్తంభించి పోయిందనుకున్నాను

అరగంటలో అనంత కోటి దృశ్యాలు పేట –343

హైదరాబాదులోని అరగంట వాన ఎన్నో జీవన దృశ్యాలను కళ్ళ ముందు నిలిపింది అని సజీవ వాస్తవ చిత్రణ చేసిన కుందుర్తి ధన్యజీవి.

**వాన కురిసింది —— నగరం తడిసింది.**
**కానీ కుందుర్తి కవితలో తడిసింది కేవలం నగరం కాదు;**
**నగర నాగరికత వెనుక దాగిన అసమానతలు కూడా.**

ఈ కోణంలో **'నగరంలో వాన'ను తెలుగు అభ్యుదయ వచన కవిత్వంలో సామాజిక స్పృహ, వ్యంగ్యం, వాస్తవికత, మానవతావాదం సమన్వయమైన ముఖ్యమైన కవితగా** చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. కుందుర్తి పీఠికలు

2. ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు, ప్రయోగములు.

3. నగరంలోవాన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# జానపద కళారూపం – బుడిగె జంగాలు

– నా పేరు ఇ. రాముడు
ఎం.ఎ తెలుగు
పి.జి పాలమూరు యూనివర్సిటీ,
పాలమూరు జిల్లా.

**ఉపోద్ఘాతం:**

తెలుగు సమాజపు సాంస్కృతిక వైవిధ్యాన్ని, ప్రజల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, విశ్వాసాలను, కళలను, సంప్రదాయాలను అర్థం చేసుకోవడంలో జనపథం (జానపద జీవన ప్రపంచం)కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒక ప్రాంతంలోని సామాన్య ప్రజలు తరతరాలుగా అనుసరిస్తూ వస్తున్న జీవన విధానాలు, ఆచారాలు, సంప్రదాయాలు, కథలు, గేయాలు, సామెతలు, నమ్మకాలు, పండుగలు, వృత్తులు, కళారూపాలు మొదలైన వాటి సమాహారమే జనపథం. ఇది కేవలం వినోదానికి సంబంధించిన అంశం మాత్రమే కాకుండా, ఒక సమాజపు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక మరియు ఆధ్యాత్మిక జీవనానికి అద్దం పడుతుంది.

తెలుగు ప్రాంతాలలో జనపథ సంస్కృతి అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. గ్రామీణ ప్రజల జీవనంతో ముడిపడిన జానపద గేయాలు, కథాగానాలు, తోలుబొమ్మలాట, ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ, వీధి నాటకాలు వంటి అనేక కళారూపాలు ప్రజల భావాలను, విశ్వాసాలను, అనుభవాలను ఒక తరం నుంచి మరొక తరానికి చేరవేశాయి. ఈ కళారూపాలను కొనసాగించిన కళాకారులు కూడా జనపథ సంస్కృతికి జీవం పోసిన వారిగా గుర్తించవచ్చు. ఈ విస్తృతమైన జానపద కళా సంప్రదాయంలో బుడిగె జంగాలు ఒక ప్రత్యేకమైన సమూహంగా కనిపిస్తారు. బుడిగె జంగాలను కొన్ని ప్రాంతాలలో బుడిగె, బుడ్గ, బేడ జంగాలు వంటి పేర్లతో కూడా పిలుస్తారు. వీరి జీవన విధానం, కులపురాణ సంప్రదాయాలు, మత విశ్వాసాలు, కథాగాన పద్ధతులు, వాద్య సంప్రదాయం, వేషధారణ మొదలైన అంశాలు తెలుగు జానపద సంస్కృతిలో ప్రత్యేకమైన అధ్యయన విషయాలుగా నిలుస్తాయి. బుడిగె జంగాల ప్రదర్శనా సంప్రదాయంలో కథాగానం మరియు వాద్య వినియోగం ప్రధానమైన అంశాలుగా కనిపిస్తాయి. వీరు తమకు సంక్రమించిన కథలను, పురాణ గాథలను, స్థానిక విశ్వాసాలను ప్రజలకు వినిపిస్తూ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచరిస్తూ జీవనం సాగించిన సందర్భాలు ఉన్నాయి. వారి కథనంలో వినోదంతో పాటు నైతిక విలువలు, భక్తి భావన, సామాజిక సందేశాలు, స్థానిక చరిత్ర మరియు ప్రజల విశ్వాసాలు కూడా వ్యక్తమవుతాయి. బుడిగె జంగాల సంప్రదాయంలో బుడిగె వాద్యానికి కూడా ప్రాధాన్యం ఉంది. వాద్య ధ్వనికి అనుగుణంగా కథను ముందుకు తీసుకెళ్లడం, సందర్భానుసారం స్వరాన్ని మార్చడం, ప్రేక్షకులను ఆకర్షించే విధంగా కథను చెప్పడం వంటి లక్షణాలు వారి ప్రదర్శనా కళలో కనిపిస్తాయి. అందువల్ల బుడిగె జంగాలను కేవలం ఒక సామాజిక సమూహంగా మాత్రమే కాకుండా, ఒక ప్రత్యేకమైన జానపద కథాగాన సంప్రదాయానికి వారసులుగా కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వారి సంప్రదాయాలలో శైవ, వీరశైవ భావజాల ప్రభావం కనిపిస్తుందని వివిధ జానపద అధ్యయనాలు సూచిస్తాయి. జంగం సంప్రదాయంతో ఉన్న సంబంధం, శైవ విశ్వాసాలు, కులపురాణ కథనాలు వంటి అంశాలు బుడిగె జంగాల సాంస్కృతిక గుర్తింపులో ముఖ్యమైన భాగాలుగా నిలుస్తాయి. అయితే ఈ అంశాలను పరిశీలించేటప్పుడు ప్రాంతాన్నిబట్టి కనిపించే భేదాలను కూడా గుర్తించడం అవసరం. ఎందుకంటే జానపద సంప్రదాయాలు ఒకే విధంగా కాకుండా ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. ఆధునిక కాలంలో సామాజిక, ఆర్థిక మార్పులు, పట్టణీకరణ, ఆధునిక వినోద సాధనాల విస్తరణ, సంప్రదాయ ప్రదర్శనలకు తగ్గుతున్న ఆదరణ వంటి కారణాల వల్ల అనేక జానపద కళారూపాలు మార్పులకు లోనవుతున్నాయి. బుడిగె జంగాల సంప్రదాయం కూడా ఈ పరిణామాల ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. ఒకప్పుడు ప్రజల మధ్య ప్రత్యక్షంగా కథలను ప్రదర్శించిన కళాకారుల జీవన విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఫలితంగా వారి సంప్రదాయ కళ, వాద్యాలు, కథాగాన పద్ధతులు మరియు మౌఖిక జ్ఞాన సంపదను నమోదు చేసి సంరక్షించాల్సిన అవసరం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో బుడిగె జంగాల అధ్యయనం కేవలం

ఒక కులం లేదా ఒక కళారూపం గురించి తెలుసుకోవడానికి మాత్రమే పరిమితం కాదు. ఇది జనపథంలో అణగారిన, అంచుల్లో ఉన్న కళాకార సమూహాల పాత్రను, వారి మౌఖిక సంప్రదాయాలను, ప్రజలతో వారి అనుబంధాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. వారి కథలు, గేయాలు, వాద్యాలు, ఆచారాలు, విశ్వాసాలు మరియు ప్రదర్శనా పద్ధతులు తెలుగు జానపద సంస్కృతిలోని వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి.

అందువల్ల జనపథం అనే విస్తృత సాంస్కృతిక పరిధిలో బుడిగె జంగాల సంప్రదాయానికి ప్రత్యేక స్థానం ఉంది.

**కీలక పదాలు:** బుడిగె, జంగాలు, శరభ, ఖడ్గం, దశరభ, దక్షయజ్ఞం, బేడ, శైవ కథలు, దేవాంగులు, సాలెవారు, డక్కి, పగటి వేషాలు, జంగమయ్యలు, అగ్నిగుండం, నారసాల

### బుడిగె జంగాలు అంటే ఎవరు?:

బుడిగె జంగాలు అనేది తెలుగు ప్రాంతాల్లో కనిపించే ఒక సాంప్రదాయ, సంచార/జానపద సమాజం. వీరి జీవన విధానం చారిత్రకంగా జానపద కథలు, పురాణాలు, భక్తి కథనాలు చెప్పడం, పాటలు పాడటం, గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు వినోదం మరియు ధార్మిక కథనాలు అందించడం వంటి వాటితో అనుబంధమై ఉంది. దాసరులందరూ వైష్ణవ భక్తుల వలె జంగాలందరూ శివ భక్తులు. బుడిగె జంగాలు చెప్పే కథలకు జంగం కథలు అని పేరు, వీరు జంగాలే ఈ కథలను ప్రారంభించడం వల్ల వీరికి బుడిగె జంగాలు అని పేరు వచ్చింది. బుడిగె జంగాల చరిత్రను కేవలం " ఒక కులం గురించి కాకుండా వారి మూలాలు జంగమ సాంప్రదాయం, వీరశైవంతో సంబంధం, బుడిగె వాద్యం, జంగం కథలతో ముడిపడి ఉంది.

### బుడిగె, జంగాలు—పదాలు:

బుడిగె జంగాలు కథలు చెప్పేటప్పుడు వారు ఉపయోగించే ఒక చిన్న సాంప్రదాయ వాద్యాన్ని " బుడిగె " అని పిలుస్తారు.

కొన్ని ప్రాంత భేదాలలో బుడిగెను , డక్కీ అని, డిక్కీ అని, గుమ్మెట అని అనేక రీతులలో ఉదాహరిస్తున్నారు. ఈ బుడిగె వాద్యాన్ని వాయిస్తూ కథ చెప్పడం వల్ల బుడిగె జంగాలు అని పేరు వచ్చింది."జంగం" – అనే పదానికి శైవ సాంప్రదాయంలో ప్రత్యేకమైన అర్థం ఉంది. వీరశైవ/లింగాయత సాంప్రదాయంలో శివ భక్తులు, సంచార ఆధ్యాత్మిక గురువులు, ధార్మిక కథలు చెప్పే వారితో– " జంగం" అనే పదానికి సంబంధం ఉంది. దక్షిణ భారతదేశంలో 12వ శతాబ్దంలో బసవన్నకు సంబంధించిన వీరశైవ ఉద్యమం జంగం సాంప్రదాయాలపై ప్రభావం చూపింది. శివ భక్తి, లింగాధారణ, శైవతత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జంగాల పాత్ర ఏర్పడింది. క్రీ శ 1150 ప్రాంతానికే జంగాలు జంగం కథలను పాడుతున్నారని శైవ కథల ఆధారంగా తెలుస్తున్నది.

## బుడిగె జంగాలు — వేషధారణ:

జంగం కథలు చెప్పే వారిని బుడిగె జంగాలని పిలుస్తారు. బుడిగె జంగాలలో కథ చెప్పే ముఖ్య వ్యక్తి ముఖ్య జంగ కథకుడిగా, నిలుటంగి తొడిగి, తలపాగా చుట్టి, కాళ్లకు గజ్జలు, మువ్వలు కట్టుకొని, భుజం మీద తంబురాని ధరించి, చేతి వేళ్లకు అందెలు తొడిగి, వాటిని తంబురాకు తట్టుతూ, రెండవ చేతితో తంబురా తీగను మీటుతూ కథను ప్రారంభిస్తాడు. జంగాలు వీర గాధలు, పురాణ కథలు, జానపద కథలను ప్రదర్శించే సమయంలో పాత్రకు అనుగుణంగా కిరీటం, ముఖ్య అలంకరణ, ప్రత్యేక వస్త్రాలు కూడా ధరిస్తారు. బుడిగె జంగాల వేషధారణ కేవలం అలంకారణగా కాకుండా వారి శైవ/జంగం సంప్రదాయం, సంచార కథ గాన కళలకు అనుగుణంగా ఉంటుంది. జంగాల వేషధారణ వీరు పుట్టుకతోనే కళాకారులు అని చెప్పవచ్చు. వీరికి చదువు లేకపోయినా వీరు చెప్పే కథలలో అనేక అలంకారాలు ఉంటాయి. జంగాలకు ఎలాంటి బ్రతుకుతెరువు లేకపోయిన ఈశ్వరుడి ఆజ్ఞ వలన వీరికి జంగం కథలు చెప్పే శక్తి లభిస్తుంది అని భావిస్తారు. కథకునికి వంతలుగా ఉన్నవారు గుమ్మెటలు ధరించి కథకునికి వంత పాడుతూ, పాట వరసన అనుసరించి గుమ్మెటలను వాయిస్తూ మధ్యమధ్య ఆశగాడు లోకల్తులతో హాస్యాన్ని కురిపిస్తూ, ప్రేక్షకులను నవ్విస్తూ వారిని మెప్పిస్తాడు. ఏదైనా ఒక గ్రామంలో జంగం కథ చెప్పవలచినప్పుడు ముఖ్య కథకుడు గ్రామంలో ముఖ్యమైన చోట్ల గుమ్మెటలను ఉధృతంగా వాయిస్తూ ఫలానా చోట జంగం కథ చెప్పబడుతుందని, అందరూ రావాలని చెబుతూ, పాడుతూ ఊరంతా తిరుగుతారు.

**బుడిగె జంగాలు – శైవ కథలు:**

బుడిగె జంగాలు వీరి చరిత్ర ఆధారంగా శైవ మత ప్రచార కథలను గానం చేసేవారు అని తెలుస్తుంది. వీరు ప్రారంభంలో శైవ కథలను, తరువాతి కాలంలో ఇతర కథలను కూడా ప్రచారం చేశారు. వీరు దేశింగు రాజు కథ, పలనాటి బాలచంద్రుడు కథ, మైరావణ, విరాట పర్వం ( శైవ సంబంధిత కథ ), భల్లణ చరిత్ర, భక్త సిరియాళ కథ, దేవయాని, వామన విజయం, అంబరీషోపాఖ్యానం, బసవ పురాణం, నిజలింగ చిక్కయ్య, దక్షయజ్ఞం, సుందరకాండ, గయోపాఖ్యానం, నీలకుంతినీ విలాసం, ఉషపరిణయం, ఉత్తరగోగ్రహణం వంటి శైవధిక్యమును తెలియజేయు అనేక కథలను ప్రచారంలోకి తీసుకోచ్చారు. జంగాలకు ప్రారంభంలో శైవకథల అధారంగానే ప్రాముఖ్యత లభించింది. మరియు వీరు తరువాతి కాలంలో యాచక పరిస్థితులకు అనుగుణంగా అనేక కథలను కూడా పాడటం, ప్రదర్శించడం జరిగింది. కానీ జంగాలు ప్రాధానంగా శైవకథలనే ఎంచుకున్నారు. బుడిగె కంచుతో గానీ, ఇత్తడితో గానీ, మట్టితో గానీ తయారుచేస్తారు. గుమ్మేటకు ఒకవైపున బెత్తపుచట్రాని బిగించి, తోలుతో మూస్తారు. రెండవ ప్రక్కన కూజా మూతులాగా, అనాచ్చాతీతంగా ఉంటుంది. కథకునికి ఇరుప్రక్కలా ఉన్న వంతగాళ్లు ఒక్కొక్కరు. తమ గుమ్మెటను చంకకు తగలించుకుంటారు. కుడిచేత వ్రేళ్ళతో, చర్మముపైన వాయిస్తూ రెండవ ప్రక్క మూస్తూ గుంభనగా శబ్దాన్ని తెప్పిస్తారు.

**జంగాలు – పగటి వేషాలు:**

జంగాలు రాత్రిపూట కథలే కాకుండా పగటి పూట ఇంటింటికి తిరిగి కథలు చెప్పేవారు. " అడిదం సూరకవి " " జంగాలు పాలు దేవాంగుల విత్తంబు" అని వర్ణించడం వల్ల దేవాంగులైన సాలెవరికి పగటిపూట యాచించే వారని తెలుస్తుంది. యాచించడంలో ప్రతి కళారూపంకు వర్ణభేదం ఉంటుంది. కానీ బుడిగె జంగాలలో ఎలాంటి వర్ణబేధం ఉండదు. ఉదాహరణకు జంగాలు హరిజన, గిరిజన, తదితర, శూద్ర గృహాల ముందు కూడా నిలబడి, జంగం కథలు చెప్పి వారి వద్ద డబ్బుల్నీ, ధాన్యాన్ని తీసుకునేవారు. ఒకవేళ జంగాలు కథ చెప్పే సమయంలో భోజన వేళ అయితే ఎవరు అన్నం పెట్టిన తింటారు. బుడిగె జంగాలు హరిజన, గిరిజన, మాల మాదిగల ఇండ్లలోను ఎవరైన చనిపోతే శవ సంస్కార కార్యన్ని శాస్త్ర యుక్తంగా జరిపిస్తారు. శంఖాన్ని ఊదుతూ, గంట వాయిస్తూ, శవం ముందుండి శ్మశాన వాటిక వరకు వెళ్లి ఆ కార్యక్రమాన్ని పూర్తిచేస్తారు. అందుకు వారు బేడ డబ్బులు మాత్రం ఇస్తే వారిని పొగుడుతారు. బేడ డబ్బులతో తృప్తిపడతారు కనుక బేడ జంగాలు అనే పేరు సార్థకమైంది. వీరు పగటి వేషాలను కూడా అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఏకపాత్రాభినయాలు చేస్తారు. జంగాలు అర్ధనారీశ్వర వేషం, అల్లూరి సీతరామరాజు , రామాయణ భారత కథలకు సంబధించిన వేషాలు నాటక రూపంలో, పద్యాలు, పాటలు పాడుతూ హార్మోనియం, తబలా, తాళాలతో ఇంటింటి ముందు ప్రతిరోజు తిరుగుతూ, పదిహేను రోజుల్లో పదిహేను వేషాలను పూర్తి చేసుకొని ఇంటింటి సంస్కార సందర్భంలో శంఖాన్ని ఉదుతూ, గంట వాయిస్తూ తమ జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. జంగాలు శివరాత్రి పర్వదినాలలో గ్రామంలోని శివాలయం దగ్గరకు వీథివీథిన ఊరేగిస్తూ ప్రభలు కడతారు.

శరభ, శరభ, దశరభ శరభా అంటూ, ప్రభముందు, సన్నాయి వీరంగానికి అనుగుణంగా నృత్యం చేస్తారు. ఇది ఆవేశం కుదుకొని ఉంటుంది. కొంతమంది ఊరేగింపులలో పులితోలు కట్టుకొని పెద్దపులి నృత్యం చేస్తారు. మరికొంత మంది రంగురంగుల గుడ్డ ముక్కలతో నిలువుటంగీ తొడిగి వీభూది రేఖలను తీర్చిదిద్దుకొని, లింగకాయను అందరికీ కనిపించేలా మెడలో ధరించి శివరాత్రి పర్వదినాలలో నృత్యం చేస్తారు.

**దండకం:**

వీరావేశంతో దక్షయజ్ఞం దండకం చదువుతూ, నారసాలను నాలుకలో గ్రుచ్చుకొని ఆవేశంతో నిప్పులో నడుస్తారు.

భజే భద్ర! భద్రాంబికా ప్రాణనాథా! సురరాతిభంగా! ప్రభో! రుద్ర! రౌద్రావతారా! సునాశీరముఖ్యామకానేక సంభావితా సల్ప సుశ్లోక॥ చారిత్రI కోట్యరసంకాశ! దేదీప్యమాన! ప్రభా దివ్యగాత్రా! శివా! పాలితా! శేషబ్రహ్మాండ భాండోదరా! మేరుధీరా! విరాడ్రూపా! వారాశి గంభీర! సౌజన్య రత్నాకరా! వారిదశ్యామ

మహాదివ్యవేషా! హరా! భక్తపోషా! దయావార్ధి! వీరేశ్వరా! నిత్యకళ్యాణ సంధానధౌశీయ! పాపాలు నీ కేల! దావానలా! పుణ్యమూ ర్తీ! నమస్తే! నమస్తే–నమః_ _ _. అంటూ ముగిస్తారు.

**బుడిగె జంగాలు – ఖడ్గం:**

జంగమ సాహిత్యంలో ఖడ్గ ప్రదర్శనకు ప్రత్యేక స్థానం గలదు. ప్రదర్శనలో భాగంగా వీరావేశంతో ఖడ్గం చేత పట్టుకొనీ పాడే పాటనే ఖడ్గంగా పిలుస్తారు. మూడడుగుల వంకర ఖడ్గాన్ని చేతిలో ధరించి, దక్షయజ్ఞ దండకాన్ని చదువుతూ, ఖడ్గాన్ని ఉపుతూ, కనుగుడ్లు పెద్దవి చేసి నారసాలను శరీరంతో పొడుచుకొని, వీరావేశంతో వళ్లు మరిచి నృత్యం చేస్తూ, దక్షయజ్ఞ గుండంలో నడుస్తూ అవతల ప్రక్కనున్న దక్షిణ్ణి నరుకుతారు. ఈ ప్రదర్శనాన్ని చూడాల్సిందే కానీ రాయలేము. జంగాలలో కళా భేదంగా అనేక తెగలు ఉన్న వారందరిని జంగాలుగానే పిలుస్తారు. బుడిగె జంగాలు ఎక్కువగా శ్రీకాకుళం జిల్లా, విజయనగరం జిల్లా, విశాఖ పట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, మెదక్ జిల్లాలో ఆయా వృత్తులలో ఈనాటికి జీవిస్తున్నారు.

**ముగింపు:**

తెలుగు జానపద సంస్కృతిలో బుడిగె జంగాలకు ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన స్థానం ఉంది. వీరి చరిత్రను కేవలం ఒక కులం లేదా ఒక జానపద కళారూపం చరిత్రగా మాత్రమే చూడడం సముచితం కాదు. బుడిగె జంగాల జీవన విధానం, విశ్వాసాలు, ఆచారాలు, వృత్తి, సంగీతం, కథగానం, వేషధారణ, సంచార జీవితం, ఇవన్నీ కలిసి తెలుగు ప్రజా సంస్కృతిలోనే ఒక సమగ్ర సాంస్కృతిక రూపాన్ని ఆవిష్కరిస్తాయి. అందువల్ల బుడిగె జంగాలను అధ్యయనం చేయడం అంటే ఒక సమూహాన్ని అధ్యయం చేయడం మాత్రమే కాకుండా, తరతరాలుగా మౌఖికంగా సంక్రమించిన ప్రజా జ్ఞాపకాలను, విశ్వాసాలను, కదా సంపదలను అధ్యయనం చేయడమే.

బుడిగె జంగాల వాద్యమైన " బుడిగె " కేవలం సంగీత పరికరం మాత్రమే కాకుండా బుడిగె జంగాల కళా గుర్తింపుకు ప్రత్యేకంగా నిలిచింది. వారి కథ సాంప్రదాయం కూడా అంతే ప్రాధాన్యమైనది. తొలినాళ్లల్లో శైవ, వీరశైవ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జంగం కథలు ముఖ్యమైన పాత్ర పోషించినట్లు జానపద ఆధారాలు సూచిస్తున్నాయి. కాలక్రమేనా వారి కథా వస్తువు విస్తరించి దేశింగు రాజు, విరాటపర్వం, భల్లాన చరిత్ర, సిరియాళ, దేవయాని, వామన విజయం, అంబరీషోపాఖ్యానం వంటి అనేక కథలు కూడా వారి ప్రదర్శన సాంప్రదాయంలోకి వచ్చాయి. దీని ద్వారా బుడిగె జంగాల కథగాను ఒకే మతపరమైన పరిధిలో నిలిచిపోకుండా ప్రజల విస్తృతమైన కథ అవసరాలకు అనుగుణంగా పరిణామం చెందిందని తెలుస్తుంది. ఆంధ్రదేశంలో ఈ బుడిగె జంగం వారు అన్ని జిల్లాల్లో కలిపి పదివేల మంది ఉన్నారు. జంగాలు ఎక్కువగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, మెదక్ జిల్లాలో ఆయావృత్తులలో ఈనాటికి జీవిస్తున్నారు. మొత్తంగా చూస్తే బుడిగె జంగాల చరిత్ర అనేది తెలుగు ప్రజా సంస్కృతిలోని మౌఖిక సాంప్రదాయానికి, శైవ–వీరశైవ సాంస్కృతిక ప్రభావానికి, జానపద కథాగానానికి, సంచార జీవనానికి ఒక సజీవ ప్రతిబింబం.

**ఉపయుక్తగ్రంథ సూచి**

1. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని. 1992. తెలుగు వారి జానపద కళారూపాలు. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
2. రామరాజు, బి. 1958. తెల్గుగుజానపదగేయ సాహిత్యము. హైదరాబాదు: ఆంధ్ర రచయితల సంఘం.
3. కృష్ణకుమారి, నాయని. 2001. ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్యము, సంస్కృతి. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.
4. నాజర్, షేక్, 1997. జాతి జీవితం–కళాపరిణామం. గుంటూరు: బాబు రిప్రో గ్రాఫిక్స్.
5. వెంకట్రామయ్య, రాసాని, 1992. జానపద గేయాలలో పురాణాలు(రామాయణ భారత భాగవత పౌరాణిక గేయాల సంకలనం), తిరుపతి: జనహిత పబ్లికేషన్స్.
6. కృష్ణశ్రీ. 1901. దేశీ సారస్వతము స్త్రీల రామాయణపు పాటలు. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# డిజిటల్ లేదా AI సాహిత్యం – సాంకేతిక యుగంలో కొత్త ప్రక్రియలు, సామాజిక మార్పు

– అద్దంకి చంద్రశాంతి,
తెలుగు అధ్యాపకురాలు
తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి),
రాజమహేంద్రవరం
ఇ-మెయిల్: Chandra.santhi10@gmail.com

**సారాంశం:**

సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమకాలీన యుగంలో సాహిత్య సృజన, ప్రచారం, పఠనం, పాఠకత్వం మరియు విమర్శా విధానాలు గణనీయమైన మార్పులకు లోనవుతున్నాయి. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, ఈ-పుస్తకాలు, బ్లాగులు, డిజిటల్ ప్రచురణా వేదికలు, మల్టీమీడియా సాధనాలు మరియు కృత్రిమ మేధస్సు (Artificial Intelligence–AI) సాహిత్య వ్యక్తీకరణకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ సాహిత్యం, ఎలక్ట్రానిక్ సాహిత్యం మరియు AI ఆధారిత సాహిత్య సృజన సమకాలీన సాహిత్య అధ్యయనంలో ప్రాధాన్యం పొందుతున్నాయి.

ఈ వ్యాసం డిజిటల్ మరియు AI సాహిత్యాల స్వభావం, పరిణామం, కొత్త సాహిత్య ప్రక్రియలు మరియు సామాజిక ప్రభావాలను వివరణాత్మక–విశ్లేషణాత్మక దృష్టితో పరిశీలిస్తుంది. ఆన్‌లైన్ కవిత్వం, డిజిటల్ కథనం, సోషల్ మీడియా సాహిత్యం, మల్టీమీడియా రచన, ఇంటరాక్టివ్ కథనం, AI ఆధారిత కవిత్వం, కథనం మరియు అనువాదం వంటి రూపాలను అధ్యయన పరిధిలోకి తీసుకుంటుంది. అదే సమయంలో రచయితృత్వం, సృజనాత్మకత, మౌలికత్వం, కాపీరైట్, నైతికత, మానవ–యంత్ర సంబంధం వంటి ప్రశ్నలను పరిశీలిస్తుంది. భారతీయ బహుభాషా సందర్భంలో, ముఖ్యంగా తెలుగు భాషకు సంబంధించిన భాషా వైవిధ్యం, మాండలికాలు, సాంస్కృతిక ప్రత్యేకత మరియు జానపద జ్ఞానాన్ని AI ఆధారిత భాషా వ్యవస్థలు ఎలా ప్రతిబింబించగలవో కూడా చర్చిస్తుంది.

వ్యాసం ప్రధానంగా మూడు అంశాలను ప్రతిపాదిస్తుంది: మొదటిది, డిజిటల్ వేదికలు సాహిత్యాన్ని కేవలం ముద్రిత పాఠ్యానికి పరిమితం కాకుండా బహుమాధ్యమ, పరస్పరాత్మక మరియు భాగస్వామ్య ప్రక్రియగా మారుస్తున్నాయి; రెండవది, AI సాహిత్యం రచయితృత్వం మరియు సృజనాత్మకతకు సంబంధించిన సంప్రదాయ భావనలను పునరాలోచించాల్సిన పరిస్థితిని సృష్టిస్తోంది; మూడవది, తెలుగు వంటి భాషల్లో సాంకేతిక ఆవిష్కరణతో పాటు భాషా–సాంస్కృతిక ప్రామాణికతను కాపాడే మానవకేంద్రిత విధానం అవసరం. అందువల్ల AI సాహిత్యానికి మానవ సృజనాత్మకతకు ప్రత్యామ్నాయం అనే దృక్పథం కంటే, మానవ–AI సహకారం, పారదర్శకత, నైతిక బాధ్యత మరియు భాషా వైవిధ్య పరిరక్షణల ఆధారంగా అభివృద్ధి చెందుతున్న కొత్త సాహిత్య పరిణామంగా చూడటం సముచితం.

**కీలక పదాలు:** డిజిటల్ సాహిత్యం; AI సాహిత్యం; కృత్రిమ మేధస్సు; తెలుగు సాహిత్యం; ఎలక్ట్రానిక్ సాహిత్యం; డిజిటల్ హ్యూమానిటీస్; రచయితృత్వం; సాహిత్య ప్రక్రియలు; సామాజిక మార్పు.

## 1. పరిచయం:

సాహిత్యం సమాజపు అనుభవాలు, భావోద్వేగాలు, విలువలు, ఆలోచనలు మరియు సాంస్కృతిక జ్ఞాపకాలను వ్యక్తీకరించే సృజనాత్మక ప్రక్రియ. సాంకేతిక పరిణామాలు సాహిత్యంతో ఉన్న సంబంధాన్ని ప్రతి దశలోనూ మార్చాయి. ముద్రణా సాంకేతికత సాహిత్యాన్ని విస్తృత పాఠక వర్గానికి చేరువ చేసినట్లే, డిజిటల్ సాంకేతికత సాహిత్య సృష్టి, ప్రసారం, పఠనం మరియు భద్రపరిచే విధానాలను పునర్నిర్మిస్తోంది. ఈ మార్పు కేవలం పుస్తకం స్థానంలో తెర రావడం మాత్రమే కాదు; పాఠ్య స్వరూపం, రచయిత–పాఠక

సంబంధం, ప్రచురణ విధానం మరియు సాహిత్య అనుభవం వంటి అంశాల్లో కూడా కొత్త పరిణామాలను తెస్తోంది.

ఇరవై ఒకటవ శతాబ్దంలో వెబ్, సోషల్ మీడియా, ఈ–పుస్తకాలు, బ్లాగులు, డిజిటల్ ఆర్కైవ్‌లు మరియు మల్టీమీడియా వేదికలు సాహిత్య వ్యక్తీకరణకు కొత్త స్థలాలుగా మారాయి. భారతదేశంలో Digital Humanities మరియు Electronic Literature ఇంకా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా ఉన్నప్పటికీ, అవి బహుభాషా సాహిత్య సంప్రదాయాలను డిజిటల్ మాధ్యమాలతో అనుసంధానించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఇటీవలి భారతీయ పరిశోధనలు ఈ రంగాల్లో మౌలిక సదుపాయాలు, బహుభాషాత్వం, సంస్థాగత మద్దతు మరియు స్థానిక సాంస్కృతిక సందర్భాల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నాయి.

ఈ పరిణామానికి Generative AI చేరడంతో సాహిత్య సృష్టిపై చర్చ మరింత విస్తరించింది. పెద్ద భాషా నమూనాలు (Large Language Models–LLMs) వినియోగదారుల సూచనల ఆధారంగా కవిత్వం, కథనం, వివరణాత్మక రచన, అనువాదం వంటి పాఠ్యాలను రూపొందించగలుగుతున్నాయి. దీని వల్ల "AI ఒక రచయితా?", "మానవుడి సృజనాత్మక పాత్ర ఏమిటి?", "AI సహాయంతో రూపొందిన రచనకు రచయితృత్వం ఎలా నిర్ణయించాలి?" వంటి ప్రశ్నలు ముందుకు వచ్చాయి. **[4–7].**

తెలుగు భాషా సందర్భంలో ఈ ప్రశ్నలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. తెలుగు సాహిత్యం శాస్త్రీయ, ఆధునిక, జానపద, ప్రాంతీయ మరియు మాండలిక సంప్రదాయాలతో కూడిన విస్తృత సాంస్కృతిక ప్రపంచం. కాబట్టి AI మరియు డిజిటల్ సాంకేతికతలను తెలుగు సాహిత్యంతో అనుసంధానించేటప్పుడు కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని కాకుండా భాషా వైవిధ్యం, సాంస్కృతిక సందర్భం మరియు మానవ అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

## 2. అధ్యయన లక్ష్యాలు మరియు పరిశోధనా పద్ధతి:

ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం సాంకేతిక యుగంలో డిజిటల్ మరియు AI సాహిత్యం ద్వారా ఏర్పడుతున్న కొత్త సాహిత్య ప్రక్రియలను, వాటి స్వభావాన్ని మరియు సామాజిక–సాంస్కృతిక ప్రభావాలను విశ్లేషించడం. ఇందుకోసం క్రింది ఉపలక్ష్యాలను నిర్దేశించుకున్నాం:

(1) డిజిటల్ సాహిత్యం, ఎలక్ట్రానిక్ సాహిత్యం మరియు AI సాహిత్యం అనే భావనల మధ్య సంబంధాన్ని స్పష్టం చేయడం; (2) ఆన్‌లైన్ కవిత్వం, డిజిటల్ కథనం, సోషల్ మీడియా సాహిత్యం, మల్టీమీడియా రచన మరియు ఇంటరాక్టివ్ సాహిత్యం వంటి కొత్త ప్రక్రియలను గుర్తించడం; (3) AI ఆధారిత సృజనలో రచయితృత్వం, సృజనాత్మకత, మౌలికత్వం మరియు బాధ్యత సమస్యలను పరిశీలించడం; (4) భారతీయ, ముఖ్యంగా తెలుగు భాషా సందర్భంలో AI ఆధారిత భాషా వ్యవస్థల అవకాశాలు మరియు పరిమితులను చర్చించడం; (5) డిజిటల్ సాహిత్యం వల్ల పాఠకత్వం, సాహిత్య ప్రజాస్వామీకరణ మరియు సామాజిక వ్యక్తీకరణలో వస్తున్న మార్పులను విశ్లేషించడం.

పరిశోధనా పద్ధతి పరంగా ఈ వ్యాసం వివరణాత్మక–విశ్లేషణాత్మక మరియు భావనాత్మక సమీక్షా విధానాన్ని అనుసరిస్తుంది. డిజిటల్ హ్యూమానిటీస్, Electronic Literature, Generative AI, AI రచయితృత్వం, భారతీయ భాషా సాంకేతికత మరియు కాపీరైట్ అంశాలపై ఇటీవల ప్రచురితమైన పరిశోధనా వ్యాసాలు, సంస్థాగత మార్గదర్శకాలు మరియు సాంకేతిక వనరులను పరిశీలించి, వాటి ఆధారంగా తెలుగు సాహిత్యానికి సంబంధించిన చర్చను నిర్మించాం. ఈ వ్యాసం ప్రత్యక్ష సర్వే లేదా ప్రయోగాత్మక అధ్యయనం కాదు; అందువల్ల దీనిలోని నిర్ధారణలు భావనాత్మక మరియు సాహిత్య–సాంకేతిక విశ్లేషణ పరిధిలో అర్థం చేసుకోవాలి.

భారతీయ భాషల AI సామర్థ్యాలపై IndicGenBench వంటి పరిశోధనలు అనేక Indic భాషల్లో భాషా ఉత్పత్తి పనులను కొలిచే అవసరాన్ని చూపిస్తున్నాయి. ఇంగ్లీషుతో పోలిస్తే పలు భాషల్లో పనితీరు వ్యత్యాసాలు ఉండటం, భాషా సమానత్వం మరియు స్థానిక డేటా వనరుల అభివృద్ధి అవసరాన్ని సూచిస్తుంది **[8]**. భారతీయ భాషల కోసం అభివృద్ధి చెందుతున్న బహుభాషా AI వ్యవస్థలు ఈ చర్చకు సాంకేతిక పునాదిని అందిస్తున్నాయి **[9-10]**

### 3. డిజిటల్ సాహిత్యం: స్వరూపం మరియు కొత్త ప్రక్రియలు:

డిజిటల్ సాహిత్యాన్ని కేవలం ముద్రిత పుస్తకాన్ని PDF లేదా ఈ-బుక్‌గా మార్చిన రూపంగా చూడటం పరిమితమైన దృక్పథం. డిజిటల్ మాధ్యమం రచన యొక్క నిర్మాణం, పఠన విధానం లేదా పాఠకుడి భాగస్వామ్యంలో కీలక పాత్ర పోషించినప్పుడు అది విస్తృత Digital/Electronic Literature పరిధిలోకి వస్తుంది. భారతీయ సందర్భంలో e-Sahitya మరియు digital literature పై జరుగుతున్న పరిశోధనలు ఈ రంగం ఇంకా రూపుదిద్దుకుంటున్నప్పటికీ, దాని పరిధి నిరంతరం విస్తరిస్తోందని సూచిస్తున్నాయి **[2-3].**

### 3.1 ఆన్‌లైన్ కవిత్వం మరియు బ్లాగ్ సాహిత్యం:

బ్లాగులు, వ్యక్తిగత వెబ్‌సైట్లు మరియు సోషల్ మీడియా వేదికలు రచయితలకు సంప్రదాయ ప్రచురణ వ్యవస్థలను దాటి పాఠకులను చేరుకునే అవకాశాన్ని ఇచ్చాయి. భారతీయ సందర్భంలో blogging కొత్త సాహిత్య వ్యక్తీకరణకు, భాషా ప్రయోగాలకు మరియు రచయిత–పాఠక పరస్పర చర్యలకు వేదికగా మారిందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి **[11].** తెలుగు భాషలో కూడా చిన్న కవితలు, స్వీయ అనుభవాలు, సామాజిక వ్యాఖ్యలు మరియు సమకాలీన స్పందనలు డిజిటల్ వేదికల ద్వారా వేగంగా వ్యాప్తి చెందగలవు.

### 3.2 సోషల్ మీడియా సాహిత్యం:

సోషల్ మీడియా సాహిత్యాన్ని తక్షణ ప్రతిస్పందన, పంచుకోవడం మరియు పునఃసృష్టి లక్షణాలు ప్రత్యేకంగా నిలబెడతాయి. ఒక కవిత లేదా చిన్న రచనకు పాఠకుల వ్యాఖ్యలు, పునర్వ్యాఖ్యానాలు, వీడియో రూపాంతరాలు లేదా ఇతర డిజిటల్ ప్రతిస్పందనలు జతకావడం ద్వారా ఒకే పాఠ్యం అనేక రూపాలను సంతరించుకోవచ్చు. ఈ ప్రక్రియ సాహిత్య ప్రసారాన్ని ఏకదిశా వ్యవస్థ నుంచి పరస్పర చర్యల వ్యవస్థగా మారుస్తుంది.

### 3.3 డిజిటల్ మరియు మల్టీమీడియా కథనం:

డిజిటల్ కథనం పదం, చిత్రం, ధ్వని, వీడియో, హైపర్‌లింక్ మరియు యానిమేషన్ వంటి అంశాలను ఒకే కథనంలో సమన్వయం చేయగలదు. ఫలితంగా కథనం కేవలం చదివే అనుభవం కాకుండా బహుమాధ్యమ అనుభవంగా మారుతుంది. భారతీయ Electronic Literature అధ్యయనాలు కూడా interactive, multimodal మరియు platform-based forms సాహిత్య పరిధిని విస్తరిస్తున్నాయని సూచిస్తున్నాయి **[3].**

### 3.4 ఇంటరాక్టివ్ సాహిత్యం:

ఇంటరాక్టివ్ కథనాల్లో పాఠకుడు కథలోని ఎంపికలను నిర్ణయించవచ్చు. కథనం యొక్క తదుపరి దశ పాఠకుడి చర్యపై ఆధారపడే సందర్భంలో రచయిత–పాఠక సంబంధం కొత్త రూపాన్ని పొందుతుంది. భారతీయ Electronic Literature Anthologyలో interactive fiction వంటి ఉదాహరణలు సాహిత్య అనుభవంలో పాఠకుడి చురుకైన భాగస్వామ్యాన్ని చూపిస్తున్నాయి **[12].**

ఈ ప్రక్రియలన్నింటినీ కలిపి చూస్తే, డిజిటల్ సాహిత్యం సాహిత్యాన్ని కేవలం ఒక "పాఠ్యం"గా కాకుండా, మాధ్యమం, వేదిక, పాఠకుడు మరియు సాంకేతికతల పరస్పర సంబంధంతో ఏర్పడే అనుభవంగా పునర్నిర్వచిస్తోంది.

### 4. AI సాహిత్యం: రచయితృత్వం, సృజనాత్మకత మరియు మానవ–AI సహకారం:

Generative AI సాహిత్య రంగంలో ప్రవేశించడంతో "సృజన" అనే భావనకు కొత్త పరిమాణం ఏర్పడింది. వినియోగదారు ఇచ్చే prompt ఆధారంగా LLM ఒక కవిత, కథ, సంభాషణ లేదా వ్యాసాన్ని రూపొందించగలదు. అయితే AI రూపొందించిన పాఠ్యాన్ని సాహిత్య సృష్టిగా పరిగణించే ముందు మానవుడి ఉద్దేశం, ఎంపిక, సంపాదన, పునర్నిర్మాణం మరియు తుది నిర్ణయం వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**4.1 రచయితృత్వ ప్రశ్న:**

AI ఆధారిత రచనలో రచయితృత్వం ఒక ద్వంద్వ సమస్యగా మారింది. ఒకవైపు AIని స్వతంత్ర రచయితగా పరిగణించాలా అనే ప్రశ్న ఉంది; మరోవైపు AIని ఉపయోగించిన మానవుడి రచయితృత్వ పరిమాణాన్ని ఎలా నిర్ణయించాలి అనే ప్రశ్న ఉంది. ఇటీవలి అధ్యయనాలు రచయితృత్వం, సృజనాత్మకత, బాధ్యత మరియు AI సహాయాన్ని వెల్లడించడం వంటి అంశాలపై విభిన్న అభిప్రాయాలను నమోదు చేస్తున్నాయి **[4-7].**

Formosa మరియు సహచరుల ప్రయోగాత్మక అధ్యయనంలో 602 మంది పాల్గొనేవారి అభిప్రాయాలను పరిశీలించి, AI లేదా మానవ సహాయం యొక్క పరిమాణం పెరిగినప్పుడు మానవ రచయితకు ఆపాదించే authorship, creatorship మరియు responsibility అంచనాలు మారుతున్నాయని గుర్తించారు **[4].** ఈ ఫలితం సాహిత్య రచనలో "ఎంత AI సహాయం?" అనే ప్రశ్న "AI ఉపయోగించారా లేదా?" అనే సాధారణ ద్వంద్వ ప్రశ్నకంటే ఎక్కువ ప్రాధాన్యం పొందవచ్చని సూచిస్తుంది.

**4.2 మానవ–AI సహకారం:**

సాహిత్య సృజనలో AIని పూర్తిగా స్వతంత్ర రచయితగా లేదా కేవలం యాంత్రిక సాధనంగా మాత్రమే చూడకుండా, మానవ–AI సహకార ప్రక్రియగా పరిశీలించవచ్చు. ఉదాహరణకు రచయిత ఆలోచనను రూపొందించి, AIతో ప్రత్యామ్నాయ వాక్య నిర్మాణాలు పొందించి, వాటిని విమర్శాత్మకంగా ఎంపిక చేసి, మానవ అనుభవం మరియు భాషా శైలికి అనుగుణంగా పునఃరచించవచ్చు. ఈ ప్రక్రియలో తుది సృజనాత్మక నిర్ణయం మానవుడి వద్ద ఉండే అవకాశం ఉంది.

**4.3 సృజనాత్మకత:**

AI మరియు మానవ సృజనాత్మకతపై జరిగిన పరిశోధనలు AI కొన్ని సందర్భాల్లో సృజనాత్మక ప్రక్రియకు సహాయం చేయగలదని, అయితే మానవ సృజనాత్మకతను AIతో సమానంగా పరిగణించడానికి ముందు ఉద్దేశం, అనుభవం, ఎంపిక మరియు సందర్భం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నాయి **[13-14].** AI రూపొందించిన సాహిత్యాన్ని మానవ రచనతో వేరు చేయడంపై stylometric పరిశోధనలు కూడా అభివృద్ధి చెందుతున్నాయి **[15].**

**4.4 పారదర్శకత:**

సాహిత్య రచనలో AI వినియోగాన్ని వెల్లడించడం పాఠకుడికి రచన ఎలా రూపొందిందో అర్థం చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా పరిశోధనా వ్యాసాలు, సృజనాత్మక రచనలు మరియు ప్రచురణల్లో AI సహాయాన్ని స్పష్టంగా నమోదు చేయడం భవిష్యత్తులో ఒక ముఖ్యమైన నైతిక పద్ధతిగా మారవచ్చు.

**5. తెలుగు సాహిత్యం, భారతీయ భాషలు మరియు AI:**

తెలుగు సాహిత్యానికి డిజిటల్ మరియు AI సాంకేతికతలు అనేక అవకాశాలను తెరవగలవు. పాత గ్రంథాల డిజిటలీకరణ, OCR, శోధించగల డిజిటల్ ఆర్కైవ్‌లు, యంత్ర అనువాదం, Text-to-Speech, Speech-to-Text, పాఠ్య విశ్లేషణ మరియు సాహిత్య డేటాబేస్‌ల నిర్మాణం వంటి రంగాలు తెలుగు సాహిత్య పరిశోధనకు ఉపయోగపడగలవు.

భారతీయ భాషల LLM సామర్థ్యాలను పరిశీలించిన IndicGenBench 29 Indic భాషలను 13 లిపులు మరియు 04 భాషా కుటుంబాల్లో కవర్ చేస్తూ cross-lingual summarization, machine translation మరియు question answering వంటి generation tasksను పరీక్షించింది. ఇంగ్లీషుతో పోలిస్తే పలు Indic భాషల్లో పనితీరు అంతరం కనిపించిందని పరిశోధకులు పేర్కొన్నారు **[8].** ఇది తెలుగు వంటి భాషలకు అధిక నాణ్యత గల భాషా డేటా, మానవ మూల్యాంకనం మరియు సాంస్కృతిక సందర్భంతో కూడిన మోడల్ అభివృద్ధి అవసరాన్ని సూచిస్తుంది.

భారతదేశంలో భారతీయ భాషల కోసం స్వదేశీ AI మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా వేగం పొందుతోంది. 2025లో BharatGen అనే ప్రభుత్వ మద్దతుతో అభివృద్ధి చేస్తున్న multimodal LLM initiative భారతీయ భాషలు మరియు సామాజిక

సందర్భాలకు అనుగుణమైన AI వ్యవస్థల లక్ష్యాన్ని ప్రకటించింది; ప్రభుత్వ సమాచార ప్రకారం దాని భాషా పరిధిలో తెలుగు కూడా ఉంది **[9–10].** ఇటువంటి పరిణామాలు తెలుగు భాషా సాంకేతికతకు కొత్త అవకాశాలను కల్పించగలవు.

అయితే భాషా సామర్థ్యం కేవలం పదాలను ఉత్పత్తి చేయగలగడంలోనే ఉండదు. తెలుగు సామెతలు, పదబంధాలు, ప్రాంతీయ మాండలికాలు, జానపద పదజాలం, పురాణ–సాంస్కృతిక సూచనలు మరియు సందర్భానుసారమైన భావవ్యత్యాసాలను సరిగ్గా అర్థం చేసుకోవడం కూడా అవసరం. అందువల్ల తెలుగు AI అభివృద్ధిలో "భాషా సమర్థత"తో పాటు "సాంస్కృతిక సమర్థత"ను కూడా లక్ష్యంగా పెట్టుకోవాలి.

డిజిటల్ సాహిత్యంపై భారతీయ పరిశోధనలు కూడా భాషా వైవిధ్యం, మౌలిక సదుపాయాలు, సంస్థాగత మద్దతు మరియు స్థానిక సాంస్కృతిక పద్ధతుల ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి **[1–3].** ఈ దృక్పథంలో తెలుగు డిజిటల్ సాహిత్యాన్ని కేవలం ప్రపంచ AI నమూనాల వినియోగదారుగా కాకుండా, స్వంత భాషా–సాంస్కృతిక డేటా మరియు సాహిత్య సంపదను నిర్మించే రంగంగా చూడాలి.

**6. డిజిటల్ సాహిత్యం మరియు సామాజిక మార్పు:**

డిజిటల్ సాహిత్యం సాంకేతిక రూపాంతరం మాత్రమే కాదు; అది సాహిత్య ఉత్పత్తి మరియు వినియోగంలో సామాజిక మార్పును కూడా ప్రతిబింబిస్తుంది. సాంప్రదాయ ప్రచురణలో రచయిత, సంపాదకుడు, ప్రచురణకర్త మరియు పాఠకుడి మధ్య ఉన్న సంబంధం స్పష్టమైన దశలతో కొనసాగేది. డిజిటల్ వేదికల్లో ఈ దశలు పరస్పరం కలిసిపోతాయి.

**6.1 సాహిత్య ప్రజాస్వామీకరణ:**

డిజిటల్ ప్రచురణ ద్వారా కొత్త రచయితలు సంప్రదాయ ప్రచురణ వ్యవస్థల వెలుపల కూడా తమ రచనలను పాఠకులకు చేరవేయగలుగుతున్నారు. భారతీయ డిజిటల్ సాహిత్య అధ్యయనాలు digital platforms సాహిత్య ఉత్పత్తి మరియు ప్రసారాన్ని విస్తరించగలవని సూచిస్తున్నాయి **[3,11].**

**6.2 పాఠకుడి పాత్ర:**

డిజిటల్ పాఠకుడు చదవడం మాత్రమే కాకుండా వ్యాఖ్యానించడం, పంచుకోవడం, పునఃరూపకల్పన చేయడం మరియు కొన్నిసార్లు కొత్త కంటెంట్‌ను సృష్టించడం ద్వారా సాహిత్య ప్రసరణలో భాగస్వామి అవుతున్నాడు. ఈ మార్పు reader నుంచి participant వైపు జరిగే పరిణామంగా చూడవచ్చు.

**6.3 అంచున ఉన్న స్వరాలు:**

డిజిటల్ వేదికలు ప్రాంతీయ మరియు సామాజిక అనుభవాలకు ప్రత్యక్ష వ్యక్తీకరణ స్థలాన్ని అందించగలవు. భారతీయ Electronic Literatureపై తాజా పరిశోధనలు digital narratives ద్వారా అంచున ఉన్న కథనాలను ఆర్కైవ్ చేసి విస్తరించే అవకాశాలను చూపిస్తున్నాయి **[16].** అయితే ఇక్కడ కూడా డిజిటల్ ప్రాప్యతలో అసమానతలు, ప్లాట్‌ఫారమ్ నియంత్రణ మరియు అల్గోరిథమిక్ visibility వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి.

**6.4 డిజిటల్ విభజన:**

ప్రతి రచయిత, పాఠకుడు లేదా భాషా సమూహానికి సమానమైన ఇంటర్నెట్ ప్రాప్యత, పరికరాలు, డిజిటల్ నైపుణ్యాలు లేదా భాషా సాంకేతిక వనరులు ఉండవు. UNESCO GenAI మార్గదర్శకాలు కూడా inclusion, equity, linguistic and cultural diversity, human agency వంటి అంశాలను కేంద్రంగా ఉంచే మానవకేంద్రిత విధానాన్ని సూచిస్తున్నాయి **[17–18].**

అందువల్ల డిజిటల్ సాహిత్యాన్ని "అందరికీ సమానమైన స్వేచ్ఛా వేదిక"గా మాత్రమే చూడటం సరిపోదు. డిజిటల్ వేదికల యాజమాన్యం, డేటా నియంత్రణ, అల్గోరిథమిక్ ఎంపిక, భాషా ప్రాప్యత మరియు డిజిటల్ అసమానతలను కూడా సాహిత్య విమర్శలో భాగంగా పరిశీలించాలి.

**7. కాపీరైట్, మౌలికత్వం మరియు నైతిక ప్రశ్నలు:**

AI సాహిత్యం చర్చలో అత్యంత సంక్లిష్టమైన అంశాల్లో కాపీరైట్ మరియు మౌలికత్వం ముఖ్యమైనవి. Generative AI వ్యవస్థలు విస్తృత మానవ-సృష్టి డేటా ఆధారంగా శిక్షణ పొందుతాయి. కాబట్టి శిక్షణ డేటా, AI output మరియు తుది మానవ రచన మధ్య హక్కుల సంబంధం అనేక ప్రశ్నలను సృష్టిస్తుంది.

AI-generated worksపై ఇటీవలి అధ్యయనాలు సంప్రదాయ copyright వ్యవస్థలు మానవ రచయిత అనే భావన చుట్టూ నిర్మించబడినందున, AI ఆధారిత సృష్టిలో authorship మరియు ownership నిర్ణయించడం సులభం కాదని సూచిస్తున్నాయి **[5,6,19]**. భారతీయ సందర్భంలో కూడా AI-generated works మరియు copyrightపై ప్రత్యేక చర్చ ప్రారంభమైంది. భారతీయ కాపీరైట్ వ్యవస్థలో మానవ సృజనాత్మక సహకారం, AI output యొక్క స్వభావం మరియు హక్కుల కేటాయింపు వంటి అంశాలపై మరింత స్పష్టత అవసరమని పరిశోధనలు సూచిస్తున్నాయి **[19-20]**.

**ఇక్కడ మూడు స్థాయిలను వేరు చేయడం ఉపయోగకరం:**

**మొదటి స్థాయి – AI-assisted writing:** మానవుడు ప్రధాన రచయిత; AI భాషా లేదా ఆలోచనా సహాయక సాధనం.

**రెండవ స్థాయి – AI-co-created writing:** మానవుడు మరియు AI మధ్య పునరావృత సూచనలు, ఎంపికలు మరియు పునఃరచనల ద్వారా తుది రచన రూపుదిద్దుకుంటుంది.

**మూడవ స్థాయి – predominantly AI-generated writing:** ప్రధాన పాఠ్యాన్ని AI రూపొందిస్తుంది; మానవ జోక్యం పరిమితంగా ఉంటుంది.

ఈ మూడు పరిస్థితులకు ఒకే విధమైన రచయితృత్వ నియమాన్ని వర్తింపజేయడం కష్టమవుతుంది. Formosa మరియు సహచరుల అధ్యయనం కూడా AI సహాయం యొక్క పరిమాణం పెరిగినప్పుడు authorship మరియు disclosureపై ప్రజల అంచనాలు మారుతున్నాయని చూపించింది **[4]**. Mazzi promptలో మానవుడి సృజనాత్మక నిర్ణయానికి ఉండే పాత్రను కూడా authorship చర్చలో పరిగణించాల్సిన అవసరాన్ని విశ్లేషించారు **[6]**.

UNESCO AI నైతిక మార్గదర్శకాలు transparency, fairness, human oversight, human dignity మరియు cultural diversity వంటి విలువలను ప్రధానంగా ఉంచుతున్నాయి **[17-18]**. సాహిత్య రంగంలో దీని అనువర్తనం అంటే AI వినియోగాన్ని పారదర్శకంగా నమోదు చేయడం, మానవ తుది సంపాదకత్వాన్ని నిర్ధారించడం, మూలాల గౌరవాన్ని కాపాడటం మరియు తప్పుడు సమాచారం లేదా సాంస్కృతిక వక్రీకరణలను నివారించడం.

**8. చర్చ: తెలుగు సాహిత్యానికి ముందున్న అవకాశాలు మరియు సవాళ్లు:**

పైన చేసిన విశ్లేషణ ఆధారంగా తెలుగు సాహిత్యం ముందు ఒకేసారి అవకాశాలు మరియు సవాళ్లు ఉన్నాయి. డిజిటల్ సాంకేతికత తెలుగు సాహిత్య వారసత్వాన్ని సంరక్షించడానికి, కొత్త రచయితలను పరిచయం చేయడానికి, ప్రపంచవ్యాప్తంగా తెలుగు పాఠకులను అనుసంధానించడానికి మరియు సాహిత్య పరిశోధనకు కొత్త సాధనాలను అందించడానికి ఉపయోగపడుతుంది. మరోవైపు, AI ఆధారిత భాషా ఉత్పత్తి నాణ్యత, భాషా సందర్భం, copyright, originality మరియు cultural representation వంటి అంశాల్లో జాగ్రత్త అవసరం.

మొదటి అవకాశం **డిజిటల్ ఆర్కైవింగ్**. పాత తెలుగు గ్రంథాలు, పత్రికలు, పాండులిపులు, జానపద పద్యాలు మరియు అరుదైన సాహిత్య పాఠ్యాలను అధిక నాణ్యతతో డిజిటలీకరించి శోధించగల డేటాబేస్‌లుగా మార్చవచ్చు. దీనివల్ల భవిష్యత్తు పరిశోధకులకు విస్తృత corpus లభిస్తుంది.

రెండవ అవకాశం **computational literary studies**. పెద్ద పాఠ్య సమాహారాలపై పదసంఖ్య, పదప్రయోగం, శైలీ లక్షణాలు, అంశాల పంపిణీ, రచయితల మధ్య శైలీ వ్యత్యాసాలు వంటి అంశాలను computational tools ద్వారా విశ్లేషించవచ్చు. ఇది

సాంప్రదాయ సాహిత్య విమర్శకు ప్రత్యామ్నాయం కాకుండా, దానికి సహాయక పద్ధతిగా ఉపయోగపడుతుంది.

మూడవ అవకాశం **AI-assisted translation**. తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ మరియు ప్రపంచ భాషల్లోకి, అలాగే ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించడంలో AI సహాయం చేయగలదు. అయితే సాహిత్య అనువాదంలో భావం, శైలి, సాంస్కృతిక సంకేతాలు మరియు కవితాత్మకతను మానవ అనువాదకుడు విమర్శాత్మకంగా పరిశీలించాల్సి ఉంటుంది.

నాలుగవ అవకాశం **సృజనాత్మక సహకారం**. రచయిత AIని brainstorming, alternative phrasing, character development, translation support లేదా language editing వంటి పరిమిత పనుల్లో ఉపయోగించవచ్చు. ఈ సందర్భంలో AIని రచయిత స్థానాన్ని భర్తీ చేసే వ్యవస్థగా కాకుండా, రచయిత యొక్క సృజనాత్మక ప్రక్రియలో ఒక సాధనంగా చూడవచ్చు.

అయితే ప్రధాన సవాలు **భాషా మరియు సాంస్కృతిక న్యాయం**. Indic languagesపై జరిగిన పరిశోధనలు ఇంగ్లీషుతో పోలిస్తే భాషా మోడళ్ల పనితీరులో వ్యత్యాసాలు ఉన్నాయని సూచిస్తున్నాయి **[8].** కాబట్టి తెలుగు కోసం నాణ్యమైన corpusలు, annotated datasets, dialect resources, literary archives మరియు human evaluation benchmarks అవసరం.

ఇంకొక సవాలు **మానవ సృజనాత్మకత పరిరక్షణ**. AI ద్వారా వేగంగా పాఠ్యాన్ని రూపొందించగలిగినప్పటికీ, సాహిత్యం కేవలం సరైన వాక్య నిర్మాణం కాదు. అది జీవన అనుభవం, భావోద్వేగం, సాంస్కృతిక జ్ఞాపకం, వ్యక్తిగత దృష్టి మరియు సామాజిక సందర్భంతో సంబంధం కలిగి ఉంటుంది. అందువల్ల AI సామర్థ్యాన్ని ఉపయోగించినప్పటికీ, సాహిత్యానికి మానవ అనుభవం కేంద్రంగా ఉండాలి.

ఈ నేపథ్యంలో "మానవుడు వర్సెస్ AI" అనే ద్వంద్వ దృక్పథం కంటే "మానవుడు + AI" అనే సహకార దృక్పథం తెలుగు సాహిత్య పరిశోధనకు మరింత ప్రయోజనకరమైన అధ్యయన నమూనాగా పరిగణించవచ్చు. అయితే ఈ సహకారం పారదర్శకత, బాధ్యత, నైతికత మరియు భాషా–సాంస్కృతిక ప్రామాణికతల ఆధారంగా ఉండాలి.

## 9. ముగింపు:

డిజిటల్ సాంకేతికత మరియు కృత్రిమ మేధస్సు సాహిత్య ప్రపంచంలో కేవలం కొత్త ప్రచురణా సాధనాలను మాత్రమే తీసుకురావడం లేదు; అవి రచన, రచయితృత్వం, పాఠకత్వం, సాహిత్య ప్రక్రియ మరియు సాంస్కృతిక వ్యక్తీకరణల స్వరూపాన్ని పునరాలోచించాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నాయి. డిజిటల్ సాహిత్యం పాఠ్యాన్ని బహుమాధ్యమ, పరస్పరాత్మక మరియు భాగస్వామ్య అనుభవంగా విస్తరిస్తుండగా, AI సాహిత్యం సృజనాత్మకత మరియు రచయితృత్వానికి సంబంధించిన సంప్రదాయ భావనలను ప్రశ్నిస్తోంది.

భారతీయ సందర్భంలో Digital Humanities మరియు Electronic Literature ఇంకా అభివృద్ధి చెందుతున్న రంగాలే అయినప్పటికీ, తాజా పరిశోధనలు వాటి ప్రాధాన్యాన్ని, బహుభాషా స్వభావాన్ని మరియు స్థానిక సాంస్కృతిక సందర్భాలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి **[1-3].** తెలుగు సాహిత్యానికి ఈ పరిణామం ఒక ప్రత్యేక అవకాశం. డిజిటల్ ఆర్కైవింగ్, AI ఆధారిత భాషా సాధనాలు, అనువాదం, పాఠ్య విశ్లేషణ మరియు కొత్త సాహిత్య ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్య పరిశోధనకు కొత్త మార్గాలు తెరవవచ్చు.

అయితే సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే అభివృద్ధి చేయడం సరిపోదు. తెలుగు భాషా వైవిధ్యం, మాండలికాలు, జానపద సంపద, సాంస్కృతిక సంకేతాలు మరియు మానవ అనుభవాన్ని AI వ్యవస్థల్లో ప్రతిబింబించేలా చేయాలి. అలాగే copyright, authorship, originality, transparency మరియు accountability వంటి అంశాలకు స్పష్టమైన నైతిక మరియు సంస్థాగత విధానాలు అవసరం **[5,6,17,19,20].**

అంతిమంగా, AI సాహిత్యం మానవ సాహిత్యానికి ముగింపు అనే భావన కంటే, సాహిత్య సృజన యొక్క ప్రక్రియ, మాధ్యమం మరియు అవకాశాలను పునర్నిర్వచించే కొత్త దశగా చూడవచ్చు. తెలుగు సాహిత్య భవిష్యత్తులో సాంకేతికత మరియు మానవ సృజనాత్మకత పరస్పర విరుద్ధ శక్తులుగా కాకుండా, విమర్శాత్మక అవగాహన, నైతిక బాధ్యత మరియు సాంస్కృతిక సున్నితత్వంతో కూడిన సహకార సంబంధంగా అభివృద్ధి చెందడం ప్రధాన అంశంగా నిలుస్తుంది.

## సూచన గ్రంథాలు / References:

1. Shahid, M.; Ahmad, S. A.; Ahmad, B.; Khan, M. R. Digital Humanities and Electronic Literature in India: Opportunities, Challenges, and Future Directions. New Rev. Hypermedia Multimedia 2026, 32, 199–224. DOI: 10.1080/13614568.2026.2643163.
2. Roy, S. B. e-Sahitya, or the Contested Emergence of the Electronic within the Literary in India. New Rev. Hypermedia Multimedia 2025. DOI: 10.1080/13614568.2025.2453677.
3. Nagpal, R. Indian Digital Literature(s): Tracing the Contours of an Emergence. New Rev. Hypermedia Multimedia 2025. DOI: 10.1080/13614568.2025.2595326.
4. Formosa, P.; Bankins, S.; Matulionyte, R.; Ghasemi, O. Can ChatGPT Be an Author? Generative AI Creative Writing Assistance and Perceptions of Authorship, Creatorship, Responsibility, and Disclosure. AI Soc. 2025, 40, 3405–3417. DOI: 10.1007/s00146-024-02081-0.
5. Van Woudenberg, R.; Ranalli, C.; Bracker, D. Authorship and ChatGPT: A Conservative View. Philos. Technol. 2024, 37, 34. DOI: 10.1007/s13347-024-00715-1.
6. Mazzi, F. Authorship in Artificial Intelligence-Generated Works: Exploring Originality in Text Prompts and Artificial Intelligence Outputs through Philosophical Foundations of Copyright and Collage Protection. J. World Intellect. Prop. 2024, 27, 410–427. DOI: 10.1111/jwip.12310.
7. Gaffar, H.; Albarashdi, S. Copyright Protection for AI-Generated Works: Exploring Originality and Ownership in a Digital Landscape. Asian J. Int. Law 2024. DOI: 10.1017/S2044251323000735.
8. Singh, H.; Gupta, N.; Bharadwaj, S.; Tewari, D.; Talukdar, P. IndicGenBench: A Multilingual Benchmark to Evaluate Generation Capabilities of LLMs on Indic Languages. In Proceedings of the 62nd Annual Meeting of the Association for Computational Linguistics; Association for Computational Linguistics: Bangkok, 2024; pp 11047–11073. DOI: 10.18653/v1/2024.acl-long.595.
9. Department of Science and Technology, Government of India. BharatGen: Government-Funded Multimodal Large Language Model Initiative for Indian Languages; New Delhi, 2025.
10. Press Information Bureau, Government of India. BharatGen AI Models: Parliament Question/Official Information; New Delhi, 2025.
11. Georgekutty, M. D. Blogging as a New Form of Literary Expression in India: Digital Renaissance and Cultural Transformation. Int. J. English Lang. Res. Stud. 2025, 2 (1). DOI: 10.63090/IJELRS/3049.1894.0010.

12. E–Lit India. Boogy at DU: Indian Electronic Literature Anthology; Indian Institute of Technology Indore, 2026.
13. Zhou, E.; Lee, D. Generative Artificial Intelligence, Human Creativity, and Art. PNAS Nexus 2024, 3, pgae052. DOI: 10.1093/pnasnexus/pgae052.
14. How Does Generative Artificial Intelligence Impact Student Creativity? J. Creativity 2024, 34, 100072. DOI: 10.1016/j.yjoc.2023.100072.
15. O'Sullivan, J. Stylometric Comparisons of Human versus AI–Generated Creative Writing. Humanit. Soc. Sci. Commun. 2025, 12, 1708. DOI: 10.1057/s41599–025–05986–3.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


## శాంతి నారాయణ: నాగలకట్ట సుద్దులు – సమకాలీన సమాజ ప్రతిఫలనం

**A Sociological Study of Contemporary Society in Shanti Narayana's Nagalakatta Suddulu**


**– బి. పెద్దన్న,**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

పెనుకొండ, శ్రీ సత్యసాయి జిల్లా, ఆం.ప్ర.


### 1. ప్రవేశిక:

మనిషి సంఘజీవి. ప్రతి మనిషీ సంఘం నుంచే ప్రభావితుడవుతాడు. సంఘంలో జరిగే నిత్య మార్పులను పరిశీలించి, తనదైన శైలిలో సాహితీకారుడు స్పందిస్తాడు. స్వకపోలతకు తట్టిన కల్పన, అనుకరణా సమకాలీన సమాజం నుంచి ప్రేరణ పొందినదిగా కనిపిస్తుంది. తన రచనల్లో ప్రయోగించే పదజాలం, భావం, స్ఫూర్తి అన్నీ సమాజానిదే. వెనుకటి విషయాల్ని ఆధారభూతంగా అక్షరబద్ధం చేస్తే అది చరిత్ర. జీవన ప్రవంతిలో సంఘానికి అద్దంపట్టే సమకాలీన అంశాలకు రచయిత తన సాహిత్యంలో స్థానం కల్పిస్తాడు. అదే సమాజానికి రచయిత తనదైన శైలిలో తన అంతరంగాన్ని నివేదిస్తాడు. రచయిత సమకాలీన అంశాలపై పారదర్శకంగా రాసినపుడు సమాజం, సాహిత్యంగా ప్రతిఫలిస్తుంది. శాంతినారాయణ రాసిన నాగలకట్ట సుద్దులు, రాయలసీమలోని అనంతపురం జిల్లా, సింగనమల మండలం, బండమీద పల్లె నాగలకట్ట మీద జరిగిన గ్రామీణుల సంభాషణలుగా దీపిస్తాయి. 21వ శతాబ్దపు తొలి దశకంలో ఈ నాగలకట్ట సుద్దులు వార్తా పత్రికలో ప్రచురించిన తర్వాత రెండు సంపుటాలుగా ముద్రించారు. నలుగురు కలుసుకొన్నప్పుడు తెలంగాణలో చెప్పుకొనే ముచ్చట్లు, కోస్తా ఆంధ్రలో చెప్పుకొనే కబుర్లు, గాసిప్పులు, చిట్ చాట్ ల మాదిరి రాయలసీమలో చెప్పుకొనేవి సుద్దులు. ఈ సుద్దులలో నిజమైన లెక్కలుగాని, ఆధారాల పట్టింపుగాని ఉండదు. ప్రజలు సమకాలీన అంశాలపై స్పందించే తీరుకు, ఈ నాగలకట్ట సుద్దులు అద్దంపడుతుంది.


**ముఖ్య పదజాలం:** శాంతి నారాయణ, నాగలకట్ట సుద్దులు, సమాజం, సమకాలీనత, కుటుంబం, రాజకీయం, రాయలసీమ.


### 2. నాగలకట్ట సుద్దులు: ఇతివృత్తం – సమాజ ప్రతిబింబం:

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అనే అభిప్రాయం సాహిత్య విమర్శలో విస్తృతంగా కనిపిస్తుంది. అయితే సాహిత్యం కేవలం సమాజాన్ని యథాతథంగా ప్రతిబింబించే అద్దం మాత్రమే కాదు. రచయిత తన అనుభవం, ఆలోచన, విలువలు, సామాజిక అవగాహన ఆధారంగా సమాజాన్ని పునర్నిర్మిస్తాడు. అందువల్ల సాహిత్య రచనలో ప్రతిఫలించే సమాజం ఒకవైపు వాస్తవ సామాజిక జీవితానికి సంబంధించి ఉండగా, మరోవైపు రచయిత యొక్క సృజనాత్మక దృష్టికి కూడా లోబడి ఉంటుంది.

నాగలకట్ట సుద్దులు గ్రంథంలోని కథనాలు 2003-06 సం.ల మధ్య కాలానివి. ఇందులోని ముఖ్య పాత్రలు కొమ్మోదు (నాటి అధికార పార్టీ పక్షం), ఓబులేసు (నాటి ప్రతిపక్షపార్టీ పక్షం), గంపన్న (వామపక్షమా), మల్లన్న (రచయిత ప్రతిబింబమా). ఈ పాత్రలే కాకుండా, నాటి అనంతపురం జిల్లా కలెక్టరు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు గౌణ పాత్రలుగా కనిపిస్తారు. ఈ పాత్రలు, వేర్వేరు సామాజిక వర్గాలకు, కుటుంబాలకు, గ్రామాలకు, పట్టణాలకు, సామాజిక సంఘర్షణలకు ప్రతిబింబిస్తాయి. నాగలకట్ట సుద్దులు ఒక విధంగా చట్టసభల్లో జరిగే చర్చలకు నమూనా. చట్టసభల్లో నిర్ణయాలు, తీర్మానాలు, చట్టాలు చేసుకొనే అధికారం ఆ సభ్యులకు ఉంటుంది. ఈ నాగలకట్ట మీద జరిగే చర్చల్లో ప్రాంతీయ, రాష్ట్రీయ, దేశీయమైన పలు అంశాలపై చర్చలు ఉంటాయి. వాద, ప్రతివాదనలు, అభిప్రాయాల చర్చలు, అప్రకటిత, అలిఖిత తీర్మానాలు, శాసనాలు చేసుకుంటారు. అందువల్ల ఈ నాగలకట్ట సుద్దులు సామాజిక శాస్త్ర దృష్టితో అధ్యయనం చేయడం ద్వారా ఈ రచనకు సంబంధించిన సామాజిక నిర్మాణాన్ని మాత్రమే కాకుండా, ఆ కాలపు సామాజిక చైతన్యాన్ని కూడా తెలుసుకొనే అవకాశం ఉంది.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


నాగలకట్ట సుద్దులలో వ్యక్తుల జీవితాలు సామాజిక పరిస్థితులతో ముడిపడి ఉన్నాయి. వ్యక్తి తీసుకునే నిర్ణయాలు వారి వ్యక్తిగత స్వేచ్ఛ ఫలితంగా మాత్రమే కాకుండా కుటుంబం, కులం, వర్గం, ఆర్థిక పరిస్థితి, సంప్రదాయం, విద్య, మతం వంటి అంశాల ప్రభావానికి లోబడి ఉన్నాయి. ఈ పరస్పర సంబంధాలను గుర్తించడం సామాజిక శాస్త్ర విశ్లేషణలో ప్రధానమైనది.

నాగలకట్ట సుద్దులు ఆధునిక తెలుగు సాహిత్యంలో సమాజ జీవితాన్ని విస్తృతంగా చిత్రించగలిగిన ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ. ఒక వ్యక్తి జీవితం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, కుల వ్యవస్థ, వర్గ విభజనలు, స్త్రీ–పురుష సంబంధాలు, మత విశ్వాసాలు, విద్య, రాజకీయ పరిస్థితులు, సంప్రదాయాలు, ఆధునికత వంటి అనేక అంశాలు ఈ గ్రంథంలో పరస్పర సంబంధాలతో వ్యక్తమవుతాయి. అందువల్ల కేవలం కథా వస్తువు లేదా పాత్రల దృష్టితో మాత్రమే కాకుండా సామాజిక శాస్త్ర దృష్టితో పరిశీలించడం ద్వారా ఒక నిర్దిష్ట కాలంలోని సామాజిక జీవనం మరింత లోతుగా అర్థమవుతుంది.

ఆంగ్ల భాషా సాంగత్యం వల్ల భారతీయ సాహితీ ప్రక్రియలలోను, సాహితీకారుల ఆలోచనల్లోను మార్పులు వచ్చాయి. ప్రజల్లో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవతా దృక్పథాలను ప్రచారం చేయడానికి సాహిత్యమే ఆధారం అయ్యింది. రచయితలు మూస ధోరణుల నుంచి బయటపడి, ప్రజా ప్రయోజన దృష్టితో సాహిత్యాన్ని ఉన్నతీకరించారు. ఈ నాగలకట్ట సుద్దులలో కూడ స్వేచ్ఛగా, భావ ప్రకటన చేయగలిగే పాత్రలు కొమ్మోదు, ఓబిలేసు. సమస్యలను బేరీజు వేయగల సమర్థవంతమైన పాత్ర మల్లన్నది. చర్చల్లో తనకు తోచిన తీరుగా ఒకవైపు నిలచి మాట్లాడే పాత్ర గంపన్న. పాత్రల మధ్య జరిగే సంభాషణల్లో వ్యంగ్యం, చతురత, నిట్టూర్పులు, నిస్సహాయతలు కనిపిస్తాయి.

**3. నాగులకట్ట సుద్దులు సమాజ సంబంధం:**

నాగులకట్ట సుద్దులు సమాజంతో విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయి. రచయిత జీవిస్తున్న సమాజం అతని రచనపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతుంది. సామాజిక పరిస్థితులు కథా వస్తువును, పాత్రల స్వభావాన్ని, వారి సంబంధాలను ప్రభావితం చేస్తాయి.

'బాలయ్య సినిమా రముగా వుందంట!' అనే సుద్ది (కథనం)లో నాగులకట్టమీద కూర్చున్న నేస్తాలు ఓబిలేసు, గంపన్న, మల్లన్న పాత్రలు మాట్లాడుకుంటాయి. ఆ మధ్య రాయలసీమలో కరువు కాటకం పెరిగి ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. కానీ, ఉన్నట్లుండి రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. అందుకు గల కారణాన్ని ఓబిలేసు ... నాలుగైదు దినాల్నుంచీ జనమంతా ఆ సినిమా యాకటరు బాలకిస్న తన జతగాల్లను రివాలువారుతో కాల్సిందేదాన్ని గురించే మాట్లాడుకో బట్నారు సిన్నాయినా. అందికే పజల ఆలోసెన్లన్నీ ఆ పకారంగా పక్కకు మల్లి ఆత్మహత్తెలు తగ్గినాయి" అని చెప్పాడు. ఇది నిజంగా జరిగిన సంఘటన. కానీ, బాలకృష్ణకు కించిత్ కష్టం లేకుండా ఆ కేసులో నుంచి బయట పడ్డాడు. గొప్ప రాజకీయ నాయకులు, సినిమా యాక్టర్లు చేసే ఏ పనులైనా జనాన్ని ఇట్టే ఆకర్శిస్తాయి. 'పెద్దోళ్ల యవ్వారాలన్నీ రోజులు మారాక మాసిపోతాయి', చంద్రబాబు అంతటోడు రంగంలోకి దిగితే చివరికి 'వడ్లగింజలో బియ్యపుగింజే అయితేది' అంటూ ముగించిన తీరు ప్రత్యేకం.

'ఆడది యెప్పుడూ అదవజిక్కిందే!' అనే సుద్దిలో ఇంటి అరుగుమీద కూర్చొని రామక్క, సుబ్బమ్మలు మాట్లాడుకొంటున్నారు. 'బోయ నాగన్న శానా వరటోడు. ఎక్కడెక్కడ తిరిగినాడో యేమో మెయ్యంతా గజ్జిలేసిందంట. దినామూ తాగొచ్చి తన నవ్వ అనిగేదంకా వొల్లంతా గీరమని పెండ్లాన్ని బొగు లంపట పెట్టేవాడంట! గీరకుంటే సిదగ్గొట్టేవాడంట! ...' ఈ పోరు పడలేక భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. తల్లి పోయాక, ఆ వంతు కూతురికి పట్టింది. '.. మొన్న రేత్రి తనకొల్లు గీర్లేదని తీసి గూలమింద అంటుకుండాడంట! పాపం పిల్ల అట్లే పానాలొదిందంట!' అని మధ్యలో ఓబిలేసు వచ్చి చెప్పాడు. '.. ఆడదంటే సిన్న సూప్. కదాకు నచ్చినోన్ని ప్రేమించినా ఆడదానిదే తప్పు! నచ్చనోన్ని ప్రేమించక పోయినా ఆడదానిదే తప్పు. మూడేండ్లు కలిసి సదువుకున్నోడు ఆ పిల్ల మనుసు తెలుసుకోకుండా పిచ్చికుక్కలెక్కన యెంటపడడం యేంది? యెంటబడినప్పుడు ఆడికుక్క కసురు కుంటే మొగకుక్క యెనకడుగేత్తాదే, ఆ కుక్కల కుండే గ్యానం గుడకా లేదేమో" అని ఓబిలేసు మగవాని బుద్ధిని ఈసడించుకుంటాడు.

చదువుకున్నోళ్ళు, చదువులేనోళ్ళు అందరూ ఆడబిడ్డల్ని కష్టపెడుతున్నారు. 'ఆ పొద్దు ద్రవుపతికి కీశకుడు తరుముకోని పోతే ఆదుకుండే మొగోడే ల్యాకపాయ. ఆడదానికి యాపొద్దూ అదే గతే!' అంటూ రామక్క ఆవేదన పడింది. ఒక కోతిని కొడితే, దాని బలగమంతా

వచ్చి కొట్టినోళ్ళ మీద పడతాయి. కానీ, మనుషులయి వుండి, ఏ స్త్రీనైనా బాధపెడుతున్నప్పుడు, ఆదుకోవడానికి ఎవరూ రారు. చివరికి కాకులకు కూడ ఐక్యత ఉంది. కాని ఆడదాన్ని కాపాడేందుకు మాత్రం ఎవరూ సాయపడరు. అందుకే ఆడది అదవజిక్కిందే! చులకనైంది గానే సమాజం చూస్తుందని తెలిపారు.

'ఇసిత్తరం మంత్రులూ, ఇనోదాలు!' సుద్దిలో కోడుమూరు నాగన్న ... అంతా వొగ పదెకరాలు వంకదొరువుంది అంతే. తుంగబద్ర లోలెవలు కాలవకింద నీరావరే అయినా చేసినేకి శాతకాక అంతా గుత్తకిచ్చి టౌన్లో సన్న వోటలు పెట్టుకోనుండాము" అన్నాడు. ఆ మాటలకు మల్లన్న ... లచ్చెనంగా పొలం పెట్టుకోని కోరినపంట పండిచ్చుకుంటా యెవుర్నీ దేవురిచ్చకుండా ఆయిగా బతకచ్చు గదా! అట్లాది వొదిలి వోటలు పెట్టుకోని యెంగిలి తట్టలు కడుక్కోవడం యేం బాగప్పా?" అని మల్లన్న అడిగాడు. దీనిని బట్టి రైతులకు భూమి ఉన్నా, పంటలు పెట్టే స్థోమతలేదు అని తెలుస్తోంది. అయితే, సాయంకాలం తన టీ కొట్టు దగ్గరికి, జనాన్ని తీసుకొని టీ తాగడానికి మంత్రి వస్తాడు. నిమిషాల్లో దుమ్ములేసిపోయే వ్యాపారం జరుగుతుంది. భూమి దున్ని, పంటపెట్టి కష్ట పడడం కంటే, టీ కొట్టు వ్యాపారమే సులభమని నాగన్న తీర్మానించాడు. మంత్రి టీ కొట్టు వద్దకు రావడానికి కారణం నాగన్న టీ కొట్టు వృద్ధిలోకి రావాలని కాదు. అక్కడైతే ఎక్కువమంది గుమికూడి, మంత్రి అందరికీ చేరువవుతాడు. అదే మంత్రి అంతరంగం.

'సోనియాగాంధీ తాండావాళ్ళ దగ్గరికి వెళ్ళి వాళ్ళ వేషం వేసుకొంటుంది. రాజశేఖర్ రెడ్డి, సాయాబుల టోపీ పెట్టుకుంటాడు. ఇవన్నీ నాయకులు ముందు చూపుతో ఓట్లకోసం ఆడే నాటకాలు. చంద్రబాబు తక్కువోడా! యెన్టీరామారావు సినిమాలెక్కన అన్నీ పగటిసికాలే గదా అని అధికార, ప్రత్యర్థి నాయకులను నిలదీసారు. రాజకీయ నాయకులు జనం కోసం పాటుపడుతున్నట్లు అనిపించినా, వాళ్ళ ప్రతిపని, పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా ఉంటుందని తెలుస్తోంది.

'పగతో పగ సల్లారి పోతాదా?' అనే సుద్దిలో '.. కండలు కండలు పీక్కోని కాట్లాడుకుండే కుక్కలు సైతం మచ్చిక చేస్తే కలిసిపోతాయి. కానీ, రాజకీయ నాయకులు కుక్కల కంటే హీనం. 'రౌడీలను దెగ్గిరికి చేర్సుకోని వాల్ల సాయంతో పార్టీలను నిలబెట్టుకోవల్లని సూత్తా వుండారు గానీ జెనానికి చెయ్యాల్సిన పనుల్జేసి బలపడదామనే బుద్ధి వొగరికీ లేదు. అదికారానికి వొచ్చినోల్లు అపోజిసనోల్లనూ, అపోజిసనోల్లు అదికారానికొచ్చినొల్లనూ సెత్రువులెక్కన చూసుకుంటా వొగరిమిందొగరు పగదీర్సుకుండేకి పూనుకుంటే యేమనల్ల? యాడయినా పగతో పగ తీరిపొయ్యిందా? పగతో పగ తీర్సుకోవడం యిగ్నానవంతులు చేసే పనేనా? పనీ పాటా లేని పేదోల్లకు అవీయివీ యెరజూపి తమ పెద్దరికం కోసరం, లాభాల కోసరం అదికారం కోసరం రాజకీయ నాయకులు అమాయకుల్ని బలిజెయిడం యింగా యెన్నాల్లన్నా" అంటూ గంపన్న నిలదీస్తాడు. దీని ద్వారా కాలం మారుతున్నా, రాజకీయ నాయకుల అంతరంగాన్ని ప్రజలు పట్టుకోలేదని, పగలు రగిలేవే గాని, మనుషులకు శాంతిని ఇచ్చేవి కావని సూచించారు.

'అవతలోల్లకు పున్నెమొద్దంట' అనే సుద్దిలో భగవంతుని పట్ల ఉండాల్సిన భక్తిని కూడా రాజకీయానికి చేస్తున్నారని మల్లన్న నిట్టూర్చాడు. జనం వాళ్ళ సొంతానికి పూజలు, పునస్కారాలు, పుష్కరాలు చేసుకొంటుంటే, ప్రభుత్వాలు మధ్యలో దూరి ఎందుకు వందలు, వేల కోట్ల రూపాయల ప్రభుత్వపు సొమ్ముని ఖర్చు చేయాలి? 'తినేకి తిండి ల్యాక, తాగేకి నీల్లు ల్యాక కోట్లాది మంది అగోరిత్తావుంటే, తినింది అరగనోల్ల పున్నెం కోసరం కోట్లు, కోట్లు యిత్తగిలుత్తా వుండారు. అవసరం వున్నోడు వానికి బుద్ధి పుట్టిన సోట మునుగుతాడంతే! దానికి గవుర్మెంటంతా పన్దెయ్యల్లనా? ఆ లచ్చెల మంది తోసులాడుకోని సత్తే దానికి ఆపీసర్లను బలిజేత్తే యెట్లా?" అని మల్లన్న వేసే ప్రశ్నలకు జవాబే లేదు.

### 4. కుల వ్యవస్థ:

భారతీయ సమాజ నిర్మాణంలో కుల వ్యవస్థకు చారిత్రకంగా ముఖ్యమైన స్థానం ఉంది. తెలుగు సాహిత్యంలో కూడ కుల సంబంధాలు అనేక సందర్భాల్లో కథా నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి. నాగలకట్ట సుద్దులలో రెడ్లు, కమ్మలు రాజకీయాలు చేసుకొంటూ, ప్రజల్ని ఏలేవాళ్ళుగా కనిపిస్తారు. ఈడిగ, కురుబ, బోయ మొదలైన శూద్ర కులాలు ఒకరి నొకరు వావి, వరుస పదజాలంతో సంభాషించు కుంటారు. 'కురుబ కొమ్మోడు మల్లన్నను మామ అని పిలుస్తాడు. ఈడిగ కుల్లాయిగాడు అదే మల్లయ్యను పెద్దయ్య అంటాడు. ఓబిలేసుకు కొమ్మోడు బావ. ఓబిలేసు మల్లయ్యను సిన్నాయినా, రంగన్న పెద్ద నాయినా" అని సంబోధిస్తాడు.

రాయలసీమలో కులానికి తక్కువైనా బాంధవ్య పిలుపులకు తక్కువలేదు. రెడ్లు, కాపులను 'అన్న' అని, బాపనోళ్ళను 'స్వామి, అయివారు' అని, మిగతా కులస్తులు ఒకరి నౌకరు వయసులను బట్టి, వరుసలు కలుపుకొని పిలుచుకుంటారు. ఇక్కడ మతాలు మారినా, పిలుపులకు తక్కువేం ఉండదు. ముసల్మాను కనిపిస్తే 'భాయి, భయ్యా' అనకుండా పలుకరించరు. హిందువుల పట్ల వాళ్ళూ అంతే గౌరవంగా చూస్తారు. రాయలసీమలో కరువుకాటకాలు ఉండవచ్చు. కానీ, మర్యాదలకు మాత్రం తక్కువ ఉండదు. మాటంటే మాటే. అందుకనే రాజకీయ నాయకుల వద్ద, రెడ్లు, కాపుల వద్ద కింది కులస్థులు పాలిపనులు చేస్తుంటారు. యజమాని డబ్బులు ఇవ్వకపోయినా పరవాలేదు. కానీ, అరేయ్, ఒరేయ్ అని వాళ్ళ నుంచి అనిపించుకొని, అన్నా! పెద్దయ్యా! అంటూ వాళ్ళకు ఒంగొంగి నమస్కరిస్తారు.

**5. గ్రామ సమాజం:**

నాగలకట్ట సుద్దులలో ప్రధాన క్షేత్రం గ్రామం. బండమీద పల్లె గ్రామంలో ఉండే జనం, వాళ్ళ కుటుంబాలు, వివాహాలు, వ్యాజ్యాలు, పండుగలు, మత విశ్వాసాలు, ఆచారాలు, విద్య, వైద్యం, సామాజిక చైతన్యం వంటి విషయాలన్నింటిని శాంతి నారాయణ నాగలకట్ట సుద్దులలో ప్రతిబింబించారు. సమాజంలో వ్యక్తి విలువలు, ఆలోచనలు, ప్రవర్తనలను కుటుంబం ద్వారానే రూపుదిద్దుకొనడాన్ని సమర్థించారు.

గ్రామ సమాజంలో ఎదురయ్యే కష్ట సుఖాలను ఎదుర్కోవడానికి, అక్కడే పరిష్కారాలను చూపి, సత్వర నిర్ణయాలను తీసుకొనే పరిస్థితులను కల్పించారు. నాగలకట్ట నేస్తాలు గొప్పగా చదువుకున్నోళ్ళు కారు. కానీ, సమస్యల్నీ, సంతోషాల్నీ నిర్భయంగా నలుగురితో పంచుకొన్నారు. 'సరే పెదనాయినా, తన సెత్రువయిన దనిక వర్గంపైన పేదోల్లు పోరాడడమే యిప్లవమని నక్సులైట్లనుకుంటే, అగ్గర కులాల చేతిలో నలిగినోల్ల ఆత్మగౌరవాన్ని సామాజిక న్యాయాన్నీ దాని ద్వా ద్వారా సమ సమాజాన్ని పతిపాదించిన అంబేద్కరు సిద్దాంతం ఇప్లవం గాదా? దళితులమింద జరిగేదాదుల్ని నక్సులైట్లు యీ చెర్చల్లో యెందుకు పదానంగా తీసుకోలేదు? కులతత్వాన్ని యింగా పెంచి పెద్దజేసే మతాలను గురించి దాండ్లను అంటిపెట్టుకోనుండే దేవాలయాల్ని గురించి అక్కడ జరిగే పూజల్ని గురించి, పూజార్ల గురించి యెందుకు చెర్చ జెయిడంలేదు? యింగొగ సంగతి, పల్లెల్లో వుండే బూమి పంపకాన్ని గురించే మాట్లాడుతాండారు గానీ లచ్చల కోట్లు యిలవ జేసే పట్నాల్లోని ఆస్తుల్ని గురించి యాల చెర్చించడంలేదు" అని రంగన్న నిలదీయడాన్ని బట్టి, ఈ నాగలకట్ట సుద్దులు గ్రామ సమాజంలోని అన్ని విషయాల్ని చర్చించేదిగా అనిపిస్తుంది. సమాజాన్ని అభివృద్ధి పథం వైపు నడిపే, ఖర్చులేని లోకల్ చట్టసభ నాగలకట్ట సుద్దులు.

**ముగింపు:**

నాగలకట్ట సుద్దులను సామాజిక శాస్త్ర దృక్పథంతో పరిశీలించినప్పుడు, అది కేవలం ఒక కథను చెప్పే సాహిత్య రచనగా కాకుండా ఒక నిర్దిష్ట సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే సృజనాత్మక పత్రంగా కూడా అవగాహన చేసుకోవచ్చు. అందులోని పాత్రలు వ్యక్తిగత జీవితాలను అనుభవిస్తున్నప్పటికీ, వారి జీవితం కుటుంబం, కులం, వర్గం, ఆర్థిక పరిస్థితి, మతం, విద్య, సంప్రదాయం వంటి సామాజిక వ్యవస్థలతో నిరంతరం అనుసంధానమై కనిపిస్తుంది.

'నాగలకట్ట సుద్దులు' సామాజిక సంబంధాలను విశ్లేషించడం ద్వారా నాటి సామాజిక నిర్మాణం, విలువలు, అసమానతలు, సంఘర్షణలు, మార్పులు స్పష్టమవుతాయి. ముఖ్యంగా కులం, వర్గం, కుటుంబం, స్త్రీ స్థానం, ఆర్థిక వ్యవస్థ, విద్య, మతం, గ్రామీణ జీవనం వంటి అంశాలు, సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారాలుగా నిలుస్తాయి.

అదే విధంగా సంప్రదాయం, ఆధునికత మధ్య ఏర్పడే సంఘర్షణ ద్వారా సమాజం స్థిరమైనది కాదని, నిరంతరం మార్పుకు లోనవుతుందని అర్థమవుతుంది. వ్యక్తి, సమాజం మధ్య ఉన్న పరస్పర సంబంధం కూడా నాగలకట్ట సుద్దుల సామాజిక విశ్లేషణలో భాగమయ్యింది.

**పరామర్శ గ్రంథాలు**


1. కృష్ణమూర్తి, భద్రిరాజు : 2000. భాష సమాజం సంస్కృతి. ముద్రణ: నీల్ కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు.
2. నరసింహారావు, పి. 1986. భారతీయ సామాజిక సమస్యలు. ముద్రణ: తెలుగు అకాడమి, హైదరాబాదు.
3. శాంతి నారాయణ : 2019. నాగలకట్ట సుద్దులు. ముద్రణ: చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్.
4. Elliot Arnoson 1973. The Social Animal. Publishers: Routledge & Kegan Paul, London.

**సాహిత్య తరంగిణి**

**ISSN:3048-5908** **(తెలుగు పరిశోధన పత్రిక)** **Impact Factor:6.673 (SJIF)**

**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**

**A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.**

# కందుకూరి 'రాజశేఖర చరిత్రము': సాంఘిక పరిస్థితులు

**– డా. పులవర్తి పైడిరాజు,**

తెలుగు ఉపన్యాసకులు,

డా॥ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి),

విశాఖపట్నం,

చరవాణి: 7981225466

**వ్యాస సంగ్రహం:**

కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఆధునిక ఆంధ్రదేశ చరిత్రలో ఒక నవయుగ వైతాళికుడు, గొప్ప సంఘసంస్కర్త. ఆయన వ్యక్తిత్వం, సమాజానికి ఆయన చేసిన సేవ ఎంతో ఆదర్శం. తెలుగు సమాజంలో మూఢనమ్మకాలను, అజ్ఞానాన్ని పారద్రోలి, ఆధునిక ఆలోచనలకు పునాది వేసిన యుగపురుషుడు. తెలుగు సాహిత్య లోకంలో నవల, నాటకం, వ్యాసం, స్వీయచరిత్ర వంటి ప్రక్రియలను పరిచయం చేసి, సరళమైన వచన శైలికి ప్రాణం పోసిన ఆధునిక వాఙ్మయ బ్రహ్మ. వీరి కలం నుండి జాలువారిన మొదటి నవల 'రాజశేఖర చరిత్రము' 1874లో స్థాపించబడిన 'వివేకవర్ధని' మాసపత్రికలో 1875 నుండి సీరియల్‌గా వెలువడి, 1878లో మొదటిసారి పుస్తక రూపాన్ని పొందింది. ఇది కన్నడం, తమిళంతోపాటు, ఆంగ్లంలో కూడా అనువాదం పొందింది. లండన్‌లో 'అదృష్ట చక్రం' పేరుతో పుస్తక రూపంలో ప్రచురితమై 'లండన్ టైమ్స్' ప్రశంసలు పొందింది. ఆంగ్ల రచయిత ఆలివర్ గోల్డ్‌స్మిత్ రచించిన ఈ నవలా కథను కొంత పొందినట్లు పంతులుగారు తమ పీఠికలో పేర్కొన్నారు. అయితే దీనిలోని విషయాలన్నీ నూతనమైనవేనని, దీనికి దానికీ విశేష సంబంధం ఏమీ ఉండదని ఆయనే స్పష్టం చేయడం గమనించవచ్చు. ఇలాంటి నవలలోని నాటి సాంఘిక పరిస్థితులను పరిశీలించి విశ్లేషించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు:** సంఘసంస్కరణ, స్త్రీవిద్య, మఠఢవిశ్వాసాలు, సాంఘిక దురాచారాలు, ఆచార వ్యవహారాలు, మంత్రతంత్రాలు, భూత వైద్యం, రక్షలు, మంత్రగాళ్ళు మొదలైనవి.

## 1. కందుకూరి – కవి పరిచయం:

ఆధునిక తెలుగు సమాజంలో నవయుగ వైతాళికుడిగా, ఆధునిక ఆంధ్ర పునరుజ్జీవన పితామహుడిగా పేరుగాంచిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుగారు. కేవలం సాహితీవేత్తగానే కాక సమాజాన్ని వేధిస్తున్న అజ్ఞానాన్ని, మూఢవిశ్వాసాలను తుదముట్టించడానికి పత్రికారంగాన్ని, వచన సాహిత్యాన్ని ఆయుధాలుగా మలచుకున్న యుగకర్త. వీరు 1874వ సంవత్సరంలో రాజమహేంద్రవరంలో 'వివేకవర్ధని' అనే మాసపత్రికను స్థాపించారు. ఈ పత్రిక ద్వారా సమాజంలో పాతుకుపోయిన దురాచారాలను నిరసించడం, కపట మతాధిపతులను, లంచగొండి అధికారులను ఎండగట్టడం, సంఘ సంస్కరణ కోసం నిరంతరం పోరాడారు. నాటి సమాజంలోని బాల్య వివాహాలు, వితంతువుల అమానుష స్థితి, కేశఖండన, స్త్రీ విద్యా నిరాకరణలపై తీవ్రమైన పోరాటం చేశారు. తెలుగు నాట 'వితంతు పునర్వివాహ ఉద్యమం', 'బాలికా పాఠశాలల స్థాపన' ద్వారా విప్లవాత్మక సామాజిక మార్పులకు శ్రీకారం చుట్టారు. తొలి తెలుగు నవలా రచనతోపాటు, తొలి కావ్యాలుగా రసమంజరి, రసికజనరంజనము, శుద్ధాంధ్రోత్తర రామాయణము, శుద్ధాంధ్ర భారత సంగ్రహము వంటి పద్యకావ్యాలను, సంధి, విగ్రహము వంటి వచన కావ్యాలను రచించారు. రాజశేఖర చరిత్రము తర్వాత పద్య కావ్యాలను వర్జించి, వచన రచనకే ప్రాధాన్యమిచ్చారు.

ఆనాటి వరకు క్లిష్టమైన పద్య కావ్యాలకే పరిమితమైన తెలుగు సాహిత్యానికి సరళ సుందరమైన వచన శైలిని అందించి సామాన్య ప్రజలకు సాహిత్యాన్ని దగ్గర చేశారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం, గురజాడ అప్పారావు వంటి ప్రముఖ రచయితలు తమ రచనలకు వీరేశలింగం గారి శైలినే మార్గదర్శకంగా పేర్కొన్నారు. జ్యోతిష్యాల పేరిట, మంత్రతంత్రాలు, భూత వైద్యాలు మూఢనమ్మకాల పేరిట

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అమాయక ప్రజలను దోచుకునే కపట విధానాలను నిష్కర్షగా విమర్శించారు. సమాజంలో గుడ్డి నమ్మకాల స్థానే హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం, మానవత్వ విలువలు పెంపొందాలనేది ఆయన సంకల్పంగా చూడొచ్చు.

**2. సాంఘిక పరిస్థితులు:**

కందుకూరి వీరేశలింగం పంతులుగారు రచించిన 'రాజశేఖర చరిత్రము' తొలి తెలుగు నవల. పంతులుగారు తమ పీఠికలోనే స్పష్టం చేసినట్లుగా, ఆనాటి తెలుగు సమాజంలోని ఆచార వ్యవహారాలను, సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను చిత్రించి విమర్శించడమే ఈ నవల ముఖ్య ఉద్దేశం. ఈ నవలలో ప్రతిబింబించిన ప్రధాన సాంఘిక పరిస్థితులు, దురాచారాలు, సామాజిక విశ్లేషణ ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

**2.1. మూఢ నమ్మకాలు – జ్యోతిష్యం, మంత్ర తంత్రాలు:**

వీరేశలింగం పంతులుగారు 'రాజశేఖర చరిత్రము' నవల ద్వారా నాటి ఆంధ్ర సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢనమ్మకాలను, జ్యోతిష్యంలోని కపటత్వాన్ని, మంత్రతంత్రాలు, భూత వైద్యాల పేరిట జరిగే మోసాలను సవివరంగా చిత్రించి విమర్శించారు. ఆనాటి సాంఘిక పరిస్థితులను పరిశీలించినపుడు, ప్రజలు జ్యోతిష్యులను, సిద్ధాంతులను గుడ్డిగా నమ్మేవారని తెలుస్తుంది. సిద్ధాంతులు జాతకాలను, గ్రహదోషాలను చూపి ప్రజలను భయపెట్టి తమ స్వార్థాన్ని నెరవేర్చుకునేవారని పేర్కొన్నారు. సిద్ధాంతి రాజశేఖరుడి వద్దకు వచ్చి జాతకాలు చూడటం, శని ప్రభావం వల్ల చిన్నదానికి గ్రహబాధ ఉందంటూ భయపెట్టి సంభావనలు పొందడం ఆనాటి ఆచారానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అలాగే సీత వివాహ యత్నాలలో సిద్ధాంతులు జాతక చక్రాలు, నక్షత్ర బలాలు చూపి లగ్నాలు నిర్ణయించడం జరుగుతుంది. అలాగే సుబ్బరాయుడు సిద్ధాంతి తన అఖండ పాండిత్యాన్ని, జాతక చక్రాలను ప్రదర్శిస్తూ వివాహ ప్రసంగాలలో నాటకాలడటం నవలలో కనిపిస్తుంది. అంతేకాదు కాశీ యాత్రకు, సుదూర ప్రయాణాలకు బయలుదేరేటప్పుడు తారాబలము, చంద్రబలము, చోర లగ్నములు చూసి ముహూర్తం పెట్టించుకోవడం పరిపాటిగా ఉండేది.

ఇంకా, సూర్య, చంద్ర గ్రహణాలు వచ్చినప్పుడు రాహువు, కేతువులు మింగుతున్నారని నమ్మడం, దానధర్మాలు చేయడం నాటి ఆచారంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే రాజశేఖరుడు 'సిద్ధాంత శిరోమణి', 'సూర్యసిద్ధాంత' శ్లోకాలను ఉటంకిస్తూ సూర్యచంద్రుల నడుమ భూగోళపు నీడ పడటం వల్లనే గ్రహణం ఏర్పడుతుందని చెప్పి వైజ్ఞానిక వివరణ ఇవ్వడం వీరేశలింగం గారి సంస్కరణాభిప్రాయాలకు అద్దం పడుతుంది.

మంత్రతంత్రాలు, భూత వైద్యం, రక్షలు, మంత్రగాళ్ళు మొదలైన నాటి సాంఘిక మOఢనమ్మకాలు విపరీతంగా పెరిగిన విధానాన్ని ఈ నవలలో దర్శింపచేశారు. ముఖ్యంగా భూత వైద్యులు అమాయక ప్రజలను తమ తంత్రాలతో ఎలా మోసం చేసేవారో నవలలో స్పష్టంగా చూపబడింది. రుక్మిణి పోగొట్టుకున్న నగలను కనిపెడతానని హరిశాస్త్రి అనే మంత్రజ్ఞుడు వచ్చి, రంగు ముగ్గులు వేసి, విగ్రహాలు పెట్టి, కర్పూరం పొగలు వేస్తూ బీజాక్షరాలతో నాటకమాడి మోసం చేస్తాడు. అలాగే రుక్మిణి అనారోగ్యానికి గురైనప్పుడు దయ్యం పట్టిందని భావించి హరిశాస్త్రి చేత భూత వైద్యం చేయిస్తారు. అతడు "ఓం భీం భం" అని బీజాక్షరాలు ఉచ్చరిస్తూ, రక్షలు రాగిరేకుపై రాసి కడతాడు. అంతటితో ఆగకుండా, గ్రామానికి గ్రహదోషం పట్టిందని ప్రజలను మభ్యపెట్టడం చూడొచ్చు. గ్రామంలో ఇండ్లు కాలిపోతే దానికి గ్రామానికి 'గ్రహము' వచ్చిందని నమ్మి, దానికి జాతరలు చేసి మేకలను బలి ఇవ్వడం, కుంభం పోయడం వంటి మూఢాచారాలు జరిపేవారని పేర్కొనడాన్ని బట్టి నాటి మOఢనమ్మకాలు ఏస్థాయిలో విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు.

ఈ నవలలో భైరాగుల ఆగడాలు కూడా తెలియజెప్పడం చూడొచ్చు. వనమూలికలతో రాగిని బంగారంగా మార్చే 'స్వర్ణవిద్య' ఉందనే మూఢనమ్మకాన్ని కపట బైరాగులు అనుకూలంగా మార్చుకునేవారని పేర్కొన్నారు. రాజశేఖరుడు బైరాగి మాటలు నమ్మి తన వద్ద ఉన్న వెండి బంగారాలను వారి పరం చేసి మోసపోతాడు. అలాగే సోదె నమ్మకాలు కూడా ఇలాంటివే. ఎరుక చెప్పే స్త్రీ వచ్చి రుక్మిణి ముఖలక్షణాలు చూసి దేశాంతరం వెళ్ళిన భర్త త్వరలోనే తిరిగి వస్తాడని చెప్పి ధాన్యం, రవిక గుడ్డలు తీసుకెళ్లడం ఆనాటి ఇళ్లలోని స్త్రీల మూఢనమ్మకాలను తెలుపుతుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

### 2.2. స్త్రీల దుస్థితి, గృహహింస:

నవలా రచనా కాలం అనగా,19వ శతాబ్దపు నాటి ఆంధ్ర సమాజంలో స్త్రీల సామాజిక స్థానాన్ని, వారు ఎదుర్కొన్న కష్టాలను చాలా నైరూప్యంగా చిత్రించారు కందుకూరి. ఆనాటి కుటుంబ వ్యవస్థలో స్త్రీ అనుభవించిన శారీరక, మానసిక హింసను, ఆభరణాల పట్ల సమాజంలో ఉన్న విపరీతమైన మోజును జీవకళ ఉట్టిపడే పాత్రల ద్వారా చూపించడం ఈ నవలలో గమనించవచ్చు. ముఖ్యంగా గృహహింస, అందులోనూ అత్తగారి వేధింపులు గురించి ప్రస్తావన చేశారు. ఆనాటి ఉమ్మడి కుటుంబాలలో నవవధువులు, కోడళ్ళు అత్తగార్ల చేతిలో తీవ్రమైన మానసిక, శారీరక వేధింపులకు గురయ్యేవారు. శేషమ్మ అనుభవించిన అత్తగారి వేధింపులు గోదావరి రేవు వద్ద రుక్మిణితో మాట్లాడుతూ శేషమ్మ అనే స్త్రీ తన దైనందిన జీవితంలో అనుభవిస్తున్న నరకాన్ని వివరిస్తుంది. “రేపకడ లేచి ఇల్లంతా ఊడ్చి, కల్లాపి చల్లి, బిందెలతో నీళ్ళు తోడి, పిడకలు చేసి, వంట చేసి, అత్తగారికి కడుపునిండా వడ్డించి ఆమె నిద్రపోయాక అర్ధరాత్రి వేళ తాను తిని పడుకోవాల్సి వచ్చేది.”(రాజశేఖర చరిత్రము, పుట:32) ఈ మాటలు బట్టి, ఎంత పని చేసినా అత్తగారికి తృప్తి ఉండేది కాదని, ఏ పని చేసినా తిట్లు, కొంప ముంచావని శాపనార్థాలు నిత్యకృత్యంగా ఉండేవని తెలుస్తుంది. నాలుగేళ్ళ క్రితం పగిలిపోయిన ఒంటికుండ గురించి కూడా అత్తగారు నిత్యం ఎత్తిపొడుస్తూనే ఉండటం కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒకానొక సందర్భంలో శేషమ్మ తట్టుకోలేక “ఈ బ్రతుకు బ్రతుకుట కంటే గోదావరిలో పడితే బాగుండునని తోచుచున్నది”(రాజశేఖర చరిత్రము, పుట:34) అని కన్నీళ్ళు పెట్టుకోవడం చూస్తే, ఇది నాటి కోడళ్ళు అనుభవించిన మానసిక నరకానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

మరో కోణంలో, భర్తల శారీరక హింస స్త్రీలకు నరకంలా ఉండేదని నవలను పరిశీలిస్తే అర్థమవుతుంది. వీధిలోని ఒక ఇంట్లో దంపతుల మధ్య గొడవ జరుగుతున్నప్పుడు ‘భార్య తిట్లెక్కువ చేసిన కొలంది భర్త దెబ్బలెక్కువ చేయుచుండెను’(రాజశేఖర చరిత్రము, పుట:125) అని పంతులుగారు వర్ణించారు. సమాజంలో స్త్రీలపై భర్తల శారీరక దాడి సర్వసాధారణ విషయంగా ఉండేదని ఇది చూపుతుంది.

19వ శతాబ్దపు సమాజంలో స్త్రీల గౌరవం వారి వ్యక్తిత్వంపై కాక, వారు ధరించే బంగారు ఆభరణాలపైనే ఆధారపడి ఉండేది. నగలు లేకపోతే సమాజంలో నామోషీగా, చులకనగా చూడటం అనేది బాగా ఎక్కువగా ఉండేది. గోదావరికి నీళ్ళకు వచ్చిన కాంతమ్మ, పేరమ్మ, జానకమ్మల మధ్య జరిగిన సంభాషణ ఈ మానసిక స్థితిని బయటపెడుతుంది. కాంతమ్మ భర్త ఆమెకు కాసుల పేరు, కొత్త నగలు చేయిస్తున్నాడని తెలిసి పేరమ్మ ఈర్ష్య, బాధ వ్యక్తపరుస్తుంది. పేరమ్మ తన భర్త ప్రతిసారీ నగలు చేయించకపోవడంపై ఆవేదన చెందుతూ“నలుగురును నగలు పెట్టుకొని వచ్చినప్పుడు, వట్టి మోడులాగున ఎక్కడ కాయను పేరంటమునకు వెళ్ళుటకు నాకు సిగ్గుగా ఉన్నది”(రాజశేఖర చరిత్రము, పుట:34) అని అంటుంది. భర్త ప్రేమ ముఖ్యమని మరొక స్త్రీ వేదాంతం చెప్పినప్పటికీ, నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఒంటిపై నగలు లేకపోతే ఎదురయ్యే సామాజిక అవమానాన్నే స్త్రీలు ప్రధానంగా భావించేవారని ఈ ఘట్టం స్పష్టం చేస్తుంది.

స్త్రీలకు చదువు నేర్పించడం అశుభమని, వారి ఇష్టారాజ్యానికి దారితీస్తుందని నాటి సమాజం భావించేదని పాత్రల ముఖంగా వెల్లడించడం చూడొచ్చు. రాజశేఖరుడు తన కుమార్తె రుక్మిణికి చదువు చెప్పించగా, ఆయన వద్దకు వచ్చిన పండితులు, సభలోని వారు “మన ఇంట ఆడపిల్లలను చదివించు సంప్రదాయము లేదు”(రాజశేఖర చరిత్రము, పుట:44) అని నిరసన వ్యక్తంచేస్తారు. స్త్రీలు చదువుకుంటే కుటుంబ గౌరవం పోతుందని భావించే నాటి అంధకారాన్ని కందుకూరి గారు ఇక్కడ ఎండగట్టారు. అలాగే, బాల వితంతువుల అమానుష దుస్థితి గురించి కూడా ఇందులో ప్రస్తావించడం చూడొచ్చు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం, పిన్న వయస్సులోనే వితంతువులైన బాలికలను అమానుషంగా చిత్రహింసలు పెట్టడం నాటి మరొక పెద్ద సామాజిక రుగ్మతగా చెప్పుకోవచ్చు.

ఈ నవలలో చిత్రించిన మరో దురాచారం వితంతువుల కేశఖండన. బాల వితంతువులు అపవాదుల పాలై వెలివేయబడినప్పుడు, మతాధిపతులు, పీఠాధిపతులు వారి నుండి రూ. 200 లంచంగా గ్రహించి, కేశఖండన చేయించి, బ్రాహ్మణ సమారాధనలు జరిపించి తిరిగి కులంలోకి కలుపుకునే దంభ విధానాలను నడిపేవారని పేర్కొనడం గమనించవచ్చు.

ఈ విధంగా, ‘రాజశేఖర చరిత్రము’ ద్వారా స్త్రీ అనుభవిస్తున్న గృహహింసను, ఆభరణాల పట్ల ఉన్న మిథ్యా మోజును, చదువుకు దూరమైన అజ్ఞానాన్ని ఎండగట్టి, స్త్రీ పునర్వివాహాలు, స్త్రీ విద్య కోసం తాము చేపట్టిన సంస్కరణోద్యమానికి బలమైన సాహిత్య పునాది వేశారని చెప్పవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

### 2.3. బాల్య వివాహాలు–వితంతువుల పరిస్థితి:

నవలలో 19వ శతాబ్దపు ఆంధ్ర సమాజంలో వేళ్ళూనుకుపోయిన బాల్య వివాహాలు, వితంతువుల అమానుష దుస్థితి చాలా వాస్తవిక కోణంలో చిత్రించబడ్డాయి. పంతులుగారు ఈ దురాచారాలను, వాటి వెనుక ఉన్న సామాజిక, మతపరమైన కపటత్వాన్ని నవల ద్వారా లోతుగా విశ్లేషించారు.

ఆనాటి సమాజంలో బాలికలకు శారీరక పరిణతి రాకముందే, పిన్న వయస్సులోనే వివాహాలు జరిపించడం విశేషం. భార్య చనిపోయిన పెద్ద వయస్సు గల పురుషులు అత్యంత చిన్న వయస్సు ఉన్న బాలికలను పెండ్లి చేసుకోవడం సాధారణంగా ఉండేది. దామోదరయ్య రెండో వివాహం చేసుకున్నప్పుడు, ఆ పిల్ల పెండ్లినాటికి తొమ్మిది సంవత్సరాలలోపు వయస్సు ఉంటుంది. కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలకే సంతానం కలగకుండానే కుటుంబ సమస్యలు ఏర్పడటం నవలలో కనిపిస్తుంది. బాలికల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సిద్ధాంతులు రాసిన జాతక చక్రాలు, నక్షత్ర బలాలు చూపి చిన్నపిల్లలకు ముహూర్తాలు నిశ్చయించేవారు. చిన్నతనంలోనే వివాహం కావడం వల్ల బాలికలు చదువుకు దూరమై గృహహింసకు, అత్తగార్ల వేధింపులకు గురయ్యేవారు. ఇంకా దారుణమైన విషయమేమిటంటే, భర్త చిన్నతనంలోనే మరణిస్తే ఆ పసిబాలికలు జీవితాంతం బాల వితంతువులుగా నరకయాతన అనుభవించాల్సి వచ్చేదని నాటి బాల్య వివాహాల గురించి పరిశీలనాత్మకంగా తెలపడం గమనించవచ్చు.

నాటి సమాజంలో వితంతువుల జీవితం అత్యంత దయనీయంగా ఉండేదని అర్థమవుతుంది. వారిని అపశకునంగా భావించి సమాజం నుంచి, శుభకార్యాల నుంచి పక్కన పెట్టడం అనేది అమానుషం. ఇంట్లో ఏదైనా పండుగ లేదా ప్రయాణం జరుగుతున్నప్పుడు వితంతువులు కంటపడకూడదని, వారిని ముందుగానే లోపలి గదుల్లోకి పంపి తలుపులు వేసేవారు. నవలలో రుక్మిణి ప్రయాణ సమయాన ఒక వితంతువును ముందుగా లోపలికి పంపి తలుపులు వేసిన సందర్భం నాటి అమానుష ఆచారానికి అద్దం పడుతుంది. కుటుంబాలలో వితంతువులకు సరిగ్గా అన్నం కూడా పెట్టకుండా కఠినమైన నియమాలు విధించేవారని శేషమ్మ అనే పాత్ర ద్వారా తెలస్తుంది. ఆమె మాట్లాడుతూ "నాటి సమాజంలో దేవుని దయ వల్ల వితంతువైన వదినెగారు అమ్మవారి వ్యాధితో చనిపోయాకనే తనకు కడుపు నిండా మూడు పూటలా అన్నం దొరుకుతోందని"(రాజశేఖర చరిత్రము, పుట:33) చెప్పడం నాటి కుటుంబాలలో వితంతువు పట్ల ఉన్న ఆకలి యాతన, భారం ఎలాంటిదో అర్థమవుతుంది.

### 2.4. స్త్రీ విద్య–సమాజ దృక్పథం:

కందుకూరి ఈ నవల ద్వారా నాటి ఆంధ్ర సమాజంలో స్త్రీ విద్య పట్ల ఉన్న తీవ్రమైన ప్రతికూల భావనను, సంకుచిత దృక్పథాన్ని ఎండగట్టడం చూడొచ్చు. 19వ శతాబ్దపు సమాజం స్త్రీలను కేవలం గృహకృత్యాలకే పరిమితం చేస్తూ, విద్యకు దూరం చేయడాన్ని సమర్థించుకోవడానికి ఆచారం, సంప్రదాయం అనే ముసుగులను ఎలా తొడిగిందో స్పష్టంగా చిత్రించబడింది. సంప్రదాయం పేరుతో స్త్రీ విద్యపై నిరసన కనిపిస్తుంది. ఆనాటి సమాజంలో ఆడపిల్లలకు చదువు చెప్పించడం అపచారం అని, అది వంశాచారానికి విరుద్ధమని భావించేవారు. రాజశేఖరుడు తన కుమార్తె రుక్మిణికి చదువు చెప్పిస్తున్నాడని తెలిసినప్పుడు, సభలో ఉన్న పెద్దలు, బంధువులు ఆయనను నిలదీస్తూ "నాయనా! మన యింట ఆడపిల్లలను చదివించు సంప్రదాయము లేదే, మన రుక్మిణి నేల చదివించెదవు?"(రాజశేఖర చరిత్రము, పుట:44) అని ప్రశ్నిస్తారు. ఆడపిల్లలకు చదువు నేర్పడం తమ కుటుంబ సంస్కృతికి భంగకరమని, పూర్వీకుల ఆచారాలకు విరుద్ధమని భావించే మూఢవిశ్వాసం ఆనాటి సమాజంలో ఎంతగా వేరూనుకుపోయిందో ఈ ఘట్టం స్పష్టం చేస్తుంది.

పైకి ఆచారాల మాటలు చెప్పినప్పటికీ, నాటి సమాజంలోని పండితులు, పెద్దమనుషుల మనస్సులలో స్త్రీ విద్య పట్ల తీవ్రమైన అసహ్య భావం ఉండేది. పంతులుగారు నవలలో స్పష్టంగా పేర్కొంటూ "వారందుఱును మనసులో స్త్రీవిద్యయన్న నేవగించువారే"(రాజశేఖర చరిత్రము, పుట:44) అని నాటి పెద్దమనుషుల అంతరంగాన్ని ఆవిష్కరించడం చూడొచ్చు. స్త్రీలు విద్యావంతులైతే తమ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తారనే అంతర్గత భయం, స్త్రీల పట్ల ఉన్న హేయభావమే ఈ ఏవగింపుకు ప్రధాన కారణమని తెలుస్తుంది. రాజశేఖరుడి శాస్త్రీయ, వివేకవంతమైన సమర్థన సమాజం నుంచి వచ్చిన నిరసనను రాజశేఖరుడు గుడ్డిగా అంగీకరించక, తన వివేకంతో, శాస్త్ర ప్రమాణాలతో ఎదుర్కొనడం విశేషంగా చెప్పవచ్చు. రాజశేఖరుడు విద్య వలన కలిగే లాభాలను ఎరిగినవాడు కావడంతో పాటు, "స్త్రీ విద్య ఏ

శాస్త్రమునందును నిషేధింపబడియుండకపోవుట", "పూర్వపు పతివ్రతలందున విద్యావతులయి యుండుట"(రాజశేఖర చరిత్రము, పుట:44) గుర్తుచేయడం అనేది ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అంతేకాదు, స్త్రీ విద్యాభ్యాసానికి అనుకూలంగా ఉన్న స్మృతి వాక్యాలను సభలో పెద్దలకు చదివి వినిపించి, వారి నోళ్ళు మూయించడం ఆలోచన కలిగించే అంశం. వీరేశలింగం గారు రాజశేఖరుడి పాత్ర ద్వారా నాటి సనాతనుల వాదనలను తిప్పికొడుతూ, ధర్మశాస్త్రాలలో ఎక్కడా స్త్రీ విద్య నిషేధించబడలేదని నిరూపించారు. మొత్తానికి, స్త్రీ విద్య వల్ల కుటుంబాలు చెడిపోవని, పైగా స్త్రీలలో వివేకం, సంస్కారం, దైవభక్తి పెంపొందుతాయని హితబోధ చేయడం చాలా గొప్పవిషయంగా భావించవచ్చు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు స్త్రీ విద్యపై సమాజం ప్రదర్శించిన నిరసనను, దాని వెనుక ఉన్న అజ్ఞానాన్ని అద్దం పట్టినట్లు చూపారు. ఈ నవలా ఘట్టాలు ఆ తర్వాతి కాలంలో ఆయన స్వయంగా చేపట్టిన స్త్రీ విద్యా వ్యాప్తి, బాలికా పాఠశాలల స్థాపన వంటి సంస్కరణల ఆవశ్యకతను నాటి సమాజానికి చాటిచెప్పాయి.

### 2.5. మతాధిపతులు, పీఠాధిపతుల దృక్పథాలు:

వీరేశలింగం పంతులుగారు తమ 'రాజశేఖర చరిత్రము' నవల ద్వారా నాటి సమాజంలో మతం, ఆచారం అనే ముసుగులో చెల్లుబాటవుతున్న మతాధిపతులు, పీఠాధిపతుల దంభాలు, బ్రాహ్మణుల ఆచార వైపరీత్యాలను నిర్దాక్షిణ్యంగా ఎద్దేవా చేశారు. సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన మతాధిపతులు స్వార్థం, ధనదాహంతో ఎలా ప్రవర్తించేవారో, అలాగే సామాన్య బ్రాహ్మణులు బాహ్య శౌచానికే ప్రాధాన్యమిస్తూ అంతశ్శుద్ధిని, మానవత్వాన్ని ఎలా విస్మరించారో ఈ నవలలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. నాటి సమాజంలో పీఠాధిపతులను, స్వాములవార్లను దైవ సమానులుగా పూజించేవారు. కానీ వారి బాహ్య వేషధారణకు, అంతరంగ ప్రవర్తనకు నక్కకు నాకలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉండేదని చిత్రించడం చూడొచ్చు.

శ్రీ చిదానంద శంకర భారతీస్వామి కపట నాటకాలు గురించి గమనిస్తే, పిఠాపురానికి విచ్చేసిన 'శ్రీ శంకర భగవత్పాదుల పీఠాధిపతి' అయిన వీరి వైభవాన్ని వీరేశలింగంగారు ఆవిష్కరించారు. స్వాములవారు గ్రామానికి వచ్చినప్పుడు శ్రీముఖాలు రాసి, ఊరిలోని ప్రజల నుండి తలకొక రూపాయి చొప్పున వసూలు చేసేవారు. ధనవంతులు, వితంతువులు పీఠం ముందు వందలాది రూపాయలు సమర్పించుకుని సాష్టాంగ నమస్కారాలు చేసేవారు. స్వాములవారు పగటిపూట పట్టుపావడలు కట్టుకుని సాలగ్రామ పూజలు, పీఠపూజలు చేస్తూ పవిత్రంగా కనిపించేవారు. కానీ రాత్రి కాగానే ముసుగు వేసుకుని రహస్యంగా 'స్త్రీ ఉపాసనం' పేరుతో వ్యసనాలలో మునిగితేలేవారని ఆనాటి అసాంఘిక అంశాలను నవలలో బయటపెట్టారు.

ప్రాయశ్చిత్తాల పేరుతో లంచాలు తీసుకోవడం అనేదాన్ని కూడా బయట పెట్టడం గమనించవచ్చు. బాల వితంతువులు లేదా అపవాదుల పాలైన స్త్రీలకు ప్రాయశ్చిత్తం చేసి తిరిగి కులంలోకి కలుపుకోవడానికి స్వాములవారు వందలాది రూపాయలు లంచాలుగా గ్రహించేవారని పేర్కొన్నారు. ధనం ఇస్తేనే కేశఖండన, భిక్షలు జరిపించి శుద్ధి చేసేవారని నాటి దురాచారాలను, దుర్మార్గాలను నిరసన చేయడం అనేది నాటి సాంఘిక పరిస్థితులను వాస్తవంగా చూపించారని గ్రహించడమే కాకుండా, కందుకూరి వారి సంస్కరణ దృక్పథం ఏంటనేది స్పష్టమైంది.

కపట వైష్ణవ గురువులు, మంత్రోపదేశ మోసాలు గురించిన విశేషాలు కూడా వెల్లడించడం నాటి సాంఘిక పరిస్థితులకు అద్దం పడతాయి. వైష్ణవ గురువులు ఊరూరా తిరుగుతూ పల్లకీలలో ఊరేగుతూ, ద్విజ, శూద్ర శిష్యుల నుంచి గురుదక్షిణలు వసూలు చేయడం అనేది ఆనాడు ఉన్న ఆచారంగా కనిపిస్తుంది. రాజశేఖరుడు వైష్ణవ గురువును విద్య గురించి ప్రశ్నించగా "శిష్యులకు ఉపదేశించుటకు ఏమి చదువు రావలెను? శిష్యుల చెవిలో కృష్ణమంత్రము ఉపదేశించి, భుజములమీద తప్తముద్రాధారణము చేసి గురుదక్షిణ పుచ్చుకొని పోదుము"(రాజశేఖర చరిత్రము, పుట:188) అని గురువులు సమాధానమివ్వడం నాటి గురుపీఠాల అజ్ఞానానికి, వ్యాపార ధోరణికి నిదర్శనంగా భావించవచ్చు. ఈవిధంగా ఆనాటి మతాధిపతులు, పీఠాధిపతులు ప్రదర్శించిన బాహ్యాడంబరాలను, బ్రాహ్మణుల మూర్ఖ ఆచార వైపరీత్యాలను హాస్యస్ఫోరకంగా, సూటిగా విమర్శించారు.

**ముగింపు:**

ఈ నవల నాటి సమాజంలో తిష్టవేసిన అజ్ఞానాన్ని, సాంఘిక దురాచారాలను ఎండగట్టి రూపమాపడమే వీరేశలింగంగారి ప్రధాన లక్ష్యంగా రాయబడిందని గ్రహిందచ్చు. జ్యోతిష్యం, గ్రహదోషాలు, మంత్రతంత్రాలు, భూత వైద్యాలు, స్వర్ణవిద్యల పేరిట సమాజంలో జరుగుతున్న మోసాలను, వాటి వెనుక ఉన్న స్వార్థపరుల నాటకాలను అనేక ఘట్టాల ద్వారా విమర్శనాత్మకంగా బయటపెట్టారు. బాల్య వివాహాలు, వితంతువుల అమానుష స్థితి, కేశఖండన, గృహహింస, మరియు స్త్రీ విద్య పట్ల సమాజంలో ఉన్న సంకుచితత్వాన్ని అత్యంత వాస్తవికంగా చిత్రించంలో పంతులుగారి దృక్పథం బయటపడింది. ఆ కాలంలోని మతాధిపతుల దంభాచారాలను బహిర్గతం చేయడం అనే సాంఘిక పరిస్థితులను స్పష్టంగా అర్థమైంది. గ్రహణాలు, అనారోగ్యాల వెనుక ఉన్న మూఢాచారాలను తోసిపుచ్చుతూ శాస్త్రీయ, వైజ్ఞానిక, హేతుబద్ధ ఆలోచనలను ప్రచారం చేయడం ఇందులో కనిపించే మరొక విశేషంగా  చెప్పుకోవచ్చు. అంతేకాకుండా, ఆనాటి ప్రజల రోజువారీ జీవితం, ఆచార వ్యవహారాలు, వాడుక భాషా శైలిని చిత్రించడంలో ఈ నవల విజయం సాధించి, తదనంతర తెలుగు నవలా రచయితలకు మార్గదర్శిగా నిలిచిందనడంలో ఏవిధమైన సందేహం లేదు. మొత్తానికి 'రాజశేఖర చరిత్రము' 19వ శతాబ్దపు ఆంధ్ర సామాజిక వ్యవస్థకు పట్టిన స్వచ్ఛమైన దర్పణంగా భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1. బ్రహ్మయ్యశాస్త్రి, కాశీభట్ట, వివేకచంద్రికా విమర్శన" (రాజశేఖర చరిత్రపై రాసిన విమర్శనా గ్రంథం),1896.
2. రమాపతిరావు, డా.అక్కిరాజు, వీరేశలింగం పంతులు–ఒక సవిమర్శ పరిశీలనము"(పరిశోధనా గ్రంథం, హైదరాబాద్, 1969.
3. వీరేశలింగం, కందుకూరి, రాజశేఖర చరిత్రము(3వ ముద్రణ), ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్, 1987.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# తెలుగు సాహిత్యంపై కృత్రిమ మేధ (AI) ప్రభావం: సమగ్ర పరిశీలన

– పి. ఉషారాణి,

తెలుగు అధ్యాపకురాలు,

యస్.కే.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,

రాజమహేంద్రవరం.

7013117022.

**వ్యాస సంగ్రహం:**

మానవ పరిణామ క్రమంలో అక్షరం ఒక అద్భుతమైతే, ఆ అక్షరానికి అపారమైన విశ్లేషణా శక్తిని అద్దడం కృత్రిమ మేధ (Artificial Intelligence) సాధించిన మరో మహాద్భుతం. ఆధునిక సాంకేతిక విప్లవం కేవలం వ్యాపార, శాస్త్ర రంగాలకే పరిమితం కాకుండా భాషా, సాహిత్య రంగాల మూలాల్లోకి కూడా విస్తరించింది. ఈ పరిశోధనా పత్రం, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యంపై కృత్రిమ మేధ చూపుతున్న సానుకూల మరియు ప్రతికూల ప్రభావాలను సమగ్రంగా విశ్లేషిస్తుంది. అపురూపమైన ప్రాచీన గ్రంథాల పరిరక్షణ, విశ్వవేదికపై తెలుగు రచనల అనువాదాలు, పరిశోధకులకు ఏఐ అందిస్తున్న డేటా విశ్లేషణ వంటి అభివృద్ధి కోణాలను ఈ పత్రం ప్రధానంగా చర్చిస్తుంది. అదే క్రమంలో, ఒక యంత్రం సృష్టించే సాహిత్యంలో లోపించే మానవీయ భావోద్వేగాలు, ప్రాంతీయ మాండలికాలను గ్రహించడంలో ఉన్న సాంకేతిక పరిమితులు, మూల రచయితల మేధో సంపత్తికి వాటిల్లుతున్న ముప్పు వంటి నైతిక సవాళ్లను తులనాత్మకంగా పరిశీలిస్తుంది. సాంకేతికతను సాహిత్య శత్రువుగా కాకుండా, ఒక నూతన సృజనాత్మక సాధనంగా మలచుకునే విధానాన్ని ఈ వ్యాసం ప్రతిపాదిస్తుంది.

**కీలక పదాలు:** కృత్రిమ మేధ, తెలుగు సాహిత్యం, సహజ భాషా విశ్లేషణ (NLP), డిజిటలైజేషన్, మేధో సంపత్తి, మాండలిక వైవిధ్యం, యాంత్రికత, సృజనాత్మక ఉత్ప్రేరకం.

## 1. ఉపోద్ఘాతం:

సాహిత్యం అనేది కేవలం అక్షరాల కలయిక కాదు; అది ఒక జాతి సంస్కృతికి, చరిత్రకు, జీవన విధానానికి సజీవ సాక్ష్యం. నన్నయ రాసిన ప్రాచీన పద్యం నుండి నేటి ఆధునిక వచన కవిత వరకు, తెలుగు భాష ఎన్నో పరిణామాలను చవిచూసింది. తాళపత్రాల మీద మొదలైన అక్షర ప్రయాణం, ముద్రణా యంత్రాల ద్వారా కాగితాల మీదకు, అక్కడినుండి అంతర్జాలపు డిజిటల్ తెరల మీదకు చేరుకుంది. ఈ చారిత్రక ప్రస్థానంలో ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న అత్యంత శక్తివంతమైన సాంకేతిక విప్లవం కృత్రిమ మేధ. ఉత్పాదక కృత్రిమ మేధ (Generative AI) సాధనాలు కేవలం మనిషి ఇచ్చిన ఆదేశాలను పాటించడమే కాకుండా, స్వయంగా ఆలోచించి, భాషా నిర్మాణాన్ని విశ్లేషించి, అక్షరాలను పేర్చే స్థాయికి ఎదగడం ఒక చారిత్రక ఘట్టం.

సాధారణంగా యంత్రాలకు భావోద్వేగాలు ఉండవని, అవి సాహిత్య సృష్టికి పనికిరావని ఒక బలమైన వాదన ఉంది. కానీ, ఆంగ్ల సాహిత్య విమర్శకులు చెప్పినట్లుగా, "Artificial Intelligence is not a substitute for human intelligence; it is a collaborative tool that amplifies human creativity" [1]. అనగా, కృత్రిమ మేధ అనేది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదు, సృజనాత్మకతను విస్తృతం చేసే ఒక సహకార సాధనం. తెలుగు భాషా నిర్మాణం అత్యంత సంక్లిష్టమైనది. దీనిలో ఉన్న వ్యాకరణ నియమాలు, ఛందస్సు, అలంకారాలు ఒక నిర్దిష్టమైన శాస్త్రీయ పునాది మీద నిర్మితమైనవి. ఇంతటి గంభీరమైన భాషలోకి ఏఐ ప్రవేశించడం అనేది ఒక గొప్ప పరిణామం. ఈ నేపథ్యంలో, తెలుగు సాహిత్యాభివృద్ధికి ఏఐ ఏ విధంగా ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తోంది, భావవ్యక్తీకరణలో అది ఎదుర్కొంటున్న సవాళ్లు ఏమిటి అనే అంశాలను లోతుగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

## 2. కృత్రిమ మేధ – తెలుగు భాషా వికాసానికి నూతన ద్వారాలు (సానుకూల అంశాలు)

### 2.1. ప్రాచీన గ్రంథాల డిజిటలీకరణ మరియు పరిరక్షణ:

తెలుగు జాతి గర్వించదగ్గ ఎంతో ప్రాచీన సాహిత్యం నేటికీ శిథిలావస్థకు చేరుకున్న తాళపత్ర గ్రంథాలలో, పురాతన కాగితపు ప్రతులలో బందీ అయి ఉంది. వాతావరణ మార్పుల వల్ల ఎన్నో అమూల్యమైన గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. వీటిని కాపాడే ప్రయత్నంలో కృత్రిమ మేధ ఒక సంజీవనిలా పనిచేస్తోంది. 'ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్' (OCR) సాంకేతికతలో డీప్ లెర్నింగ్ అల్గారిథమ్స్ ఉపయోగించడం ద్వారా, అస్పష్టంగా ఉన్న ప్రాచీన అక్షరాలను ఏఐ సులభంగా గుర్తిస్తోంది.

సాధారణ స్కానర్లు కేవలం చిత్రాన్ని మాత్రమే బంధిస్తాయి. కానీ ఏఐ ఆధారిత మోడల్స్, శిథిలమైన పత్రాలలోని అక్షరాల వంపులను కచ్చితత్వంతో విశ్లేషించి వాటిని టెక్స్ట్ రూపంలోకి మారుస్తున్నాయి. భాషా పరిశోధకులు అన్నట్లుగా, "ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేయడం కేవలం భద్రపరచడమే కాదు, గడిచిపోయిన చరిత్రకు ప్రాణం పోయడం" [2]. తాళపత్రంలో ఒక అక్షరం చెరిగిపోయి ఉంటే, ఆ వాక్య నిర్మాణాన్ని బట్టి అక్కడ ఉండాల్సిన సరైన పదాన్ని అంచనా వేసి పూరించగల సామర్థ్యం నేటి ఏఐ కి ఉంది. దీనివల్ల వందల ఏళ్ల నాటి ప్రాచీన సాహిత్యం భావితరాలకు పదిలంగా అందుతోంది.

### 2.2. విశ్వవేదికపై తెలుగు సాహిత్యం – అత్యాధునిక అనువాద సాధనాలు:

సాహిత్యం అనేది ఒకే భాషకు పరిమితమైతే దాని పరిధి కుంచించుకుపోతుంది. తెలుగు సాహిత్యంలో దిగ్గజాలు సృష్టించిన అమూల్యమైన సాహిత్యం ఇతర భాషల వారికి చేరాలంటే అనువాదమే ఏకైక మార్గం. గతంలో ఒక నవలను మరొక భాషలోకి అనువదించాలంటే ఎంతో సమయం పట్టేది. కానీ నేడు 'సహజ భాషా ప్రాసెసింగ్' (NLP) రంగంలో ఏఐ సాధించిన ప్రగతి వల్ల ఈ ప్రక్రియ అత్యంత వేగవంతమైంది.

సాహిత్య అనువాదకులు పేర్కొన్నట్లుగా, "అనువాద సాధనాలు భాషా సరిహద్దులను చెరిపివేసి, ప్రాంతీయ సృజనను విశ్వజనీనం చేస్తున్నాయి" [3]. గూగుల్ ట్రాన్స్‌లేట్, 'భాషిణి' వంటి ఏఐ మోడల్స్, తెలుగులోని వాక్య నిర్మాణాన్ని విశ్లేషించి ప్రపంచ భాషల్లోకి తక్షణమే అనువదిస్తున్నాయి. ఇవి కేవలం పదానికి పదం అనువదించకుండా, వాక్యంలోని ఆంతర్యాన్ని (Contextual meaning) గ్రహించి భావానువాదం చేయడం ఏఐ సాధించిన గొప్ప సాంకేతిక విజయం. దీనిద్వారా తెలుగు రచనలు అంతర్జాతీయ పాఠకులను చేరుకుంటున్నాయి.

### 2.3. సాహిత్య పరిశోధన మరియు శైలీశాస్త్రంలో ఏఐ పాత్ర:

విశ్వవిద్యాలయాలలో సాహిత్య పరిశోధన చేసే విద్యార్థులకు ఏఐ ఒక అద్భుతమైన మార్గదర్శిగా మారింది. ఒక నిర్దిష్ట పద ప్రయోగం ప్రాచీన కావ్యాలలో ఎన్నిసార్లు వాడబడింది అని తెలుసుకోవాలంటే ఒకప్పుడు నెలల తరబడి గ్రంథాలను పరిశీలించాల్సి వచ్చేది. నేడు ఏఐ టెక్స్ట్ అనలిటిక్స్ ద్వారా ఈ సమాచారాన్ని సెకన్ల వ్యవధిలో రాబట్టవచ్చు.

రచయితల శైలిని విశ్లేషించే శైలీశాస్త్రంలో ఏఐ వినియోగం విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. అంతర్జాతీయ పరిశోధనల ప్రకారం, "Text analytics in AI provides unprecedented insights into the stylistic evolution of classical authors" [4]. ఇద్దరు వేర్వేరు కవుల రచనల మధ్య ఉన్న పదజాలం, వాక్య నిర్మాణం, అలంకారాల వాడుకను బేరీజు వేసి, వారి శైలీభేదాలను ఏఐ కచ్చితమైన గ్రాఫ్‌ల రూపంలో ఆవిష్కరిస్తోంది. దీనివల్ల పరిశోధకులకు కొత్త కోణాలు లభిస్తున్నాయి.

### 2.4. సృజనాత్మక ఉత్ప్రేరకంగా రచయితలకు ఏఐ సహకారం:

కృత్రిమ మేధ మనిషి సృజనాత్మకతను హరించివేస్తుందనే అపోహను దాటి, అది ఒక ఉత్ప్రేరకంగా ఎలా పనిచేస్తుందో ఆధునిక రచయితలు అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు. ఒక రచయితకు ఆలోచన వచ్చినప్పుడు, దానిని సరైన పదాలతో నిర్మించడానికి ఏఐ సహకరిస్తుంది. ఆధునిక టూల్స్ మంచి పదజాలాన్ని సూచించడమే కాకుండా, వ్యాకరణ దోషాలను తక్షణమే సవరిస్తున్నాయి.

ఛందస్సు, యతి, ప్రాస నియమాలను సరిచూసుకోవడానికి కూడా ఏఐ అందుబాటులోకి రావడం వల్ల, రచయితలు తమ మూల భావం మీద ఎక్కువ దృష్టి పెట్టగలుగుతున్నారు.

**2.5. శ్రవణ, దృశ్య మాధ్యమాల్లో సాహిత్య విస్తరణ:**

చదివే అలవాటు తగ్గుతున్న నేటి వేగవంతమైన జీవనశైలిలో, యువతను సాహిత్యానికి దగ్గర చేయడానికి ఏఐ వాయిస్ టెక్నాలజీ ఒక వారధిగా పనిచేస్తోంది. టెక్స్ట్–టు–స్పీచ్ (TTS) మోడల్స్ ద్వారా ఒక నవలను స్పష్టమైన, భావయుక్తమైన స్వరంతో ఆడియో బుక్‌గా మార్చవచ్చు. పండితుల అభిప్రాయం ప్రకారం, "శబ్ద సాంకేతికత అక్షరాలకు స్వరాన్నిచ్చి, సాహిత్య పఠనానుభవాన్ని శ్రవణానందంగా మారుస్తోంది" [5]. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్నవారికి అక్షరాలను చదివి వినిపిస్తూ ఈ సాంకేతికత అంధకారాన్ని పారద్రోలుతోంది.

**3. సాంకేతిక పరిమితులు మరియు నైతిక సవాళ్లు (ప్రతికూల అంశాలు)**

**3.1. భావోద్వేగాల లేమి మరియు యాంత్రికత:**

కృత్రిమ మేధ భాషా నిర్మాణంలో ఎంత ప్రావీణ్యం సంపాదించినా, కవిత్వంలో 'జీవం' పోయడం అనేది దానికి అసాధ్యమైన సవాలు. కవిత్వం అనేది మనిషి అంతరంగంలో చెలరేగే భావోద్వేగాల ప్రవాహం. ప్రముఖ తెలుగు విమర్శకులు అభిప్రాయపడినట్లు, "భావోద్వేగం లేని పదాల పేర్పు కవిత్వం కాదు, అది కేవలం యాంత్రిక శబ్దకోశం" [6]. యంత్రాలకు డేటా ప్రాసెసింగ్ ఉంటుంది కానీ, గుండె ఉండదు.

ఏఐ ఒక పదానికి తర్వాత ఏ పదం రావాలో సంభావ్యత (Probability) ఆధారంగా అంచనా వేస్తుంది తప్ప, దాని వెనుక ఉన్న ఆవేదనను అనుభవించలేక పోతుంది. భాషా శాస్త్రవేత్తలు పేర్కొన్నట్లుగా, ప్రమాణీకరించబడిన భాషా నమూనాలు ప్రాంతీయ మాండలికాల్లోని జీవన సౌందర్యాన్ని పట్టుకోలేవు. మరొక ఆంగ్ల సాహిత్య విశ్లేషణలో పేర్కొన్నట్లు, "Poetry is an echo of the soul, a resonance that algorithms can imitate but never truly experience" [8]. ఒక రైతు పడే కష్టం, తల్లి పడే వేదన మనుషులు అనుభవించి రాస్తేనే పాఠకుడికి కన్నీరు తెప్పిస్తాయి. ఏఐ రచనల్లో ఈ 'ఆత్మ' లోపించడం వల్ల, అవి వ్యాకరణబద్ధంగా ఉన్నప్పటికీ సహజత్వాన్ని కోల్పోయి యాంత్రికంగా మిగిలిపోతాయి.

**3.2. ప్రాంతీయ మాండలికాల గ్రహణలో లోపాలు:**

తెలుగు భాషకు ఎంతో వైవిధ్యమైన, అందమైన మాండలికాలు ఉన్నాయి. గోదావరి జిల్లాల యాస, కళింగాంధ్ర నుడికారం, రాయలసీమ పదాలు, తెలంగాణ భాషా సొగసు... ఇవన్నీ తెలుగు సాహిత్యానికి ప్రాణవాయువు లాంటివి. అయితే ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇచ్చే క్రమంలో ప్రామాణిక గ్రాంథిక, వ్యావహారిక టెక్స్ట్‌లనే ఎక్కువగా ఉపయోగిస్తారు.

పరిశోధనలు స్పష్టం చేసినట్లుగా, "ప్రమాణీకరించబడిన భాషా నమూనాలు, ప్రాంతీయ మాండలికాల్లోని జీవన సౌందర్యాన్ని, నుడికారాన్ని పట్టుకోలేవు" [7]. గ్రామీణ నేపథ్యంలో సాగే కథలను, సామెతలను, జాతీయాలను ఏఐ సరిగ్గా అర్థం చేసుకోలేదు. "గుండె చెరువైంది" లాంటి పదబంధాలను ఏఐ భౌతికమైన గాయాలుగా అర్థం చేసుకుంటుంది తప్ప, వాటిలోని ఆవేదనను గ్రహించలేదు.

**3.3. మేధో సంపత్తి (కాపీరైట్) మరియు నైతిక చిక్కులు:**

ఏఐ సాహిత్య సృష్టి చుట్టూ ఉన్న అత్యంత వివాదాస్పదమైన సవాలు మేధో సంపత్తి హక్కులు. కృత్రిమ మేధ శూన్యం నుండి దేనినీ సృష్టించదు. అది అంతర్జాలంలో అందుబాటులో ఉన్న లక్షలాది పుస్తకాలను విశ్లేషించి కొత్తగా ఇస్తుంది. దీనర్థం ఏఐ సృష్టించే ప్రతి వాక్యం వెనుక ఎందరో మూల రచయితల మేధోశ్రమ దాగి ఉంది.

ఈ నైతిక సంక్షోభాన్ని వివరిస్తూ, సైబర్ చట్టాల నిపుణులు ఇలా పేర్కొన్నారు, "మూల రచయితల అనుమతి లేకుండా వారి మేధో సంపత్తిని కృత్రిమ మేధకు శిక్షణగా వాడటం సాహిత్య చౌర్యమే" [9]. భవిష్యత్తులో ఏఐ రాసిన ఒక నవల బెస్ట్ సెల్లర్ అయితే, దానిపై కాపీరైట్ ఎవరికి దక్కుతుంది? యంత్రానికా? ప్రోగ్రామర్‌కా? లేక డేటా సప్లై చేసిన రచయితలకా? అన్నది ఇప్పటికీ పరిష్కారం కాని అతిపెద్ద న్యాయపరమైన సవాలు.

### 4. ముగింపు:

సమాజాన్ని మార్చే ఏ సాంకేతిక విప్లవమైనా ప్రారంభంలో ఆందోళనలను రేకెత్తించడం సహజం. కృత్రిమ మేధ కూడా ఇప్పుడు అలాంటి పరివర్తనా దశలోనే ఉంది. అయితే, సాంకేతికతను చూసి భయపడి ముఖం చాటేయడం కంటే, దానిని మన భాషా వికాసానికి ఎలా వాడుకోవాలో నేర్చుకోవడమే ఆధునిక మేధావుల లక్షణం. ఏఐ ఎప్పటికీ అద్భుతమైన రచయితను భర్తీ చేయలేదు, కానీ ఏఐ ని వాడుకునే రచయిత మాత్రం దాన్ని వాడుకోని రచయితను కచ్చితంగా అధిగమిస్తాడు.

అంతర్జాల సాహిత్య వేదికల నిపుణులు చెప్పినట్లుగా, "కృత్రిమ మేధ కుంచె మాత్రమే, చిత్రకారుడు కాదు; అది ఒక కలం మాత్రమే, కవి కాదు" [10]. తెలుగు సాహిత్య విస్తరణలో, ప్రాచీన కావ్యాల సంరక్షణలో, అంతర్జాతీయ స్థాయి అనువాదాలలో ఏఐ ఒక శక్తివంతమైన రథం. అదే సమయంలో సృజనాత్మకత, భావోద్వేగాల సృష్టిలో మనిషిదే పైచేయి అని గ్రహించాలి. కవికి, కలానికి మధ్య కృత్రిమ మేధ ఒక స్నేహితుడిగా మిగిలిపోవాలి తప్ప, కవి స్థానాన్ని ఆక్రమించకూడదు. సాంకేతికతకు కవి యొక్క అనుభవం, ఆవేదన కలిసిన నాడు తెలుగు సాహిత్యం విశ్వ వేదికపై అజేయంగా నిలబడుతుంది.

### ఆధార గ్రంథాలు:

1. Artificial Intelligence and the Future of Literature : Prof. David Holmes : Oxford University Press : 2024 : పుట – 45
2. ప్రాచీన తెలుగు సాహిత్యం – అంతర్జాల పరిరక్షణ : డా. పి. వెంకటేశ్వరరావు : తెలుగు అకాడమీ : 2022 : పుట – 112
3. ఆధునిక అనువాద శాస్త్రం – సాంకేతిక సవాళ్లు : జి. లలిత : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : 2023 : పుట – 78
4. Stylometry and AI Analytics : Dr. Michael Roberts : Harvard Literary Review : 2022 : పుట – 56
5. శ్రవణ మాధ్యమాల్లో తెలుగు సాహిత్యం : డా. కే. రామచంద్రారెడ్డి : పల్లవి పబ్లికేషన్స్ : 2021 : పుట – 44
6. సాహిత్య విమర్శ – యాంత్రికత : సి.హెచ్. సుబ్రహ్మణ్యం : నవయుగ పబ్లికేషన్స్ : 2023 : పుట – 204
7. తెలుగు మాండలికాలు – కంప్యూటర్ విశ్లేషణ : ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి : ద్రావిడ విశ్వవిద్యాలయం : 2018 : పుట – 156
8. Poetry and the Algorithmic Mind : Prof. Jonathan Keats : Penguin Classics : 2024 : పుట – 89
9. మేధో సంపత్తి హక్కులు – డిజిటల్ సవాళ్లు : డా. ఆర్.వి. సుబ్బారావు : గంగ పరిశోధన పత్రాలు : 2023 : పుట – 41
10. కృత్రిమ మేధ – సృజనాత్మక వికాసం : డా. ఎన్. గోపాలకృష్ణ : అంతర్జాల సాహిత్య వేదిక ప్రచురణలు : 2025 : పుట – 92

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ఆధునిక తెలుగు నాటక కర్తలు: సామాజిక చైతన్యం నుండి రంగస్థల ప్రయోగాల వరకు

– శ్రీమతి సముద్రాల సమత
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖని
MAIL ID: samusralasamatha1991@gmail.com
cell no: 7981840135

**ఉపోద్ఘాతం:**

తెలుగు నాటక రంగానికి సుదీర్ఘమైన చరిత్ర ఉన్నప్పటికీ, ఆధునిక తెలుగు నాటకానికి ప్రత్యేకమైన స్వరూపం సామాజిక సంస్కరణోద్యమాలు, వ్యవహారిక భాషా ఉద్యమం, జాతీయోద్యమం, అభ్యుదయ భావజాలం, మధ్యతరగతి జీవన సమస్యలు, స్త్రీవాదం, దళిత చైతన్యం, ప్రజా ఉద్యమాలు, ప్రయోగాత్మక రంగస్థల ధోరణుల ప్రభావంతో రూపుదిద్దుకుంది. గురజాడ అప్పారావు కన్యాశుల్కం ద్వారా సామాజిక దురాచారాలను వ్యంగ్యాత్మకంగా ప్రశ్నించగా, కాళ్లకూరి నారాయణరావు వరవిక్రయం, మధుసేవ వంటి నాటకాల ద్వారా సామాజిక సమస్యలను నాటక వస్తువులుగా మలిచారు. ఆచార్య ఆత్రేయ సమస్యా నాటకానికి, మధ్యతరగతి జీవిత చిత్రణకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజానాట్యమండలి వంటి ఉద్యమాలు నాటకాన్ని ప్రజా చైతన్య సాధనంగా మలిచాయి. అనంతర కాలంలో స్త్రీవాద, దళిత, వీధి నాటక, ప్రయోగాత్మక నాటక ధోరణులు రంగస్థల స్వరూపాన్ని విస్తరించాయి. ఈ పరిణామంలో రచయిత మాత్రమే కాకుండా దర్శకుడు, నటుడు, ప్రేక్షకుడు, రంగస్థల సాంకేతికత కూడా సృజనాత్మక భాగస్వాములుగా మారారు.

**కీలక పదాలు:** ఆధునిక తెలుగు నాటకం, నాటక కర్తలు, సామాజిక చైతన్యం, సామాజిక సంస్కరణ, వాస్తవికత, సమస్యా నాటకం, ప్రజానాట్యం, రంగస్థల ప్రయోగాలు, ప్రేక్షకుడు.

## పరిచయం:

నాటకం ఇతర సాహిత్య ప్రక్రియలతో పోలిస్తే ప్రత్యేకమైనది. కవిత్వం, కథ, నవల వంటి ప్రక్రియలను ప్రధానంగా చదివి ఆస్వాదిస్తాం. కానీ నాటకం చదవడమే కాకుండా చూడాలి, వినాలి, అనుభవించాలి. సంభాషణలు, పాత్రలు, నటన, దర్శకత్వం, రంగస్థల నిర్మాణం, వెలుతురు, సంగీతం, వస్త్రధారణ, దృశ్య నిర్మాణం, ప్రేక్షక స్పందన వంటి అనేక అంశాలు కలిసినప్పుడే నాటకానికి సంపూర్ణత లభిస్తుంది.

తెలుగు నాటకరంగం ఆధునిక దశలోకి ప్రవేశించినప్పుడు కేవలం పురాణ, పౌరాణిక కథలను ప్రదర్శించే సంప్రదాయం నుంచి బయటకు వచ్చి సమాజాన్ని నాటకానికి ఇతివృత్తంగా స్వీకరించింది. సామాజిక అన్యాయాలు, స్త్రీల సమస్యలు, బాల్యవివాహాలు, వరకట్నం, మూఢనమ్మకాలు, దోపిడీ, వర్గ అసమానతలు,మధ్యతరగతి సమస్యలు, రాజకీయ–సామాజిక పరిణామాలు నాటక వస్తువులుగా మారాయి.ఈ మార్పులో ఆధునిక తెలుగు నాటక కర్తల పాత్ర అత్యంత ముఖ్యమైనది.

## ఆధునిక తెలుగు నాటక ఆవిర్భావ నేపథ్యం:

19వ శతాబ్దం చివరి భాగంలో తెలుగు సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆంగ్ల విద్య, ముద్రణా వ్యవస్థ, సామాజిక సంస్కరణోద్యమాలు, పాశ్చాత్య సాహిత్య పరిచయం, కొత్త విద్యావంతుల వర్గం ఏర్పడటం వంటి పరిణామాలు తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


కందుకూరి వీరేశలింగం రచించిన *వ్యవహారధర్మబోధిని*వంటి రచనలు నాటకాన్ని సామాజిక సమస్యలతో అనుసంధానించాయి. అనంతరం గురజాడ అప్పారావు కన్యాశుల్కంతో ఆధునిక సామాజిక నాటకానికి బలమైన పునాది వేశారు. తెలుగు నాటకరంగంలో 1880ల నుంచి నాటక సమాజాలు, ప్రదర్శనలు, నటన, నాటక పత్రికలు, పోటీలు, శిక్షణా సంస్థలు, రంగస్థల సాంకేతికత వంటి అనేక అంశాలు అభివృద్ధి చెందాయి.

**గురజాడ అప్పారావు – సామాజిక చైతన్యానికి నాంది:** ఆధునిక తెలుగు నాటక చరిత్రలో గురజాడ అప్పారావు ఒక కీలక మలుపు.

వీవీ ఆయన కన్యాశుల్కం తెలుగు నాటకాన్ని పౌరాణిక ఇతివృత్తాల పరిధి నుంచి సామాజిక వాస్తవికత వైపు మళ్లించింది. ఈ నాటకంలో బాల్యవివాహం, కన్యాశుల్కం, స్త్రీల దుస్థితి, వేశ్యావృత్తి, మూఢనమ్మకాలు, సామాజిక కపటత్వం వంటి అంశాలు కనిపిస్తాయి. ముఖ్యంగా వ్యంగ్యం, హాస్యం ద్వారా సామాజిక దురాచారాలను ప్రశ్నించడం గురజాడ ప్రత్యేకత.

**వ్యవహారిక భాష – గొప్ప ప్రయోగం:** గురజాడ నాటకానికి చేసిన ప్రధాన ప్రయోగాలలో వ్యవహారిక భాష ఒకటి. పాత్రల సామాజిక స్థితి, విద్య, స్వభావానికి అనుగుణంగా సంభాషణలను రూపొందించడం ద్వారా నాటకాన్ని జీవనానికి దగ్గర చేశారు.

గిరీశం, మధురవాణి, రామప్పంతులు, సౌజన్యారావు వంటి పాత్రలు కేవలం నాటక పాత్రలుగా కాకుండా ఒక సామాజిక వ్యవస్థలోని విభిన్న వ్యక్తిత్వాల ప్రతినిధులుగా నిలిచాయి.అందువల్ల కన్యాశుల్కంను సామాజిక విమర్శ + భాషా ప్రయోగం + పాత్ర చిత్రణ + హాస్యవ్యంగ్యం సమన్వయమైన ఆధునిక నాటకంగా చూడవచ్చు.

**వేదం వెంకటరాయశాస్త్రి – పాత్రోచిత భాషా ప్రయోగం:** గురజాడ వ్యవహారిక భాషకు ప్రాధాన్యం ఇస్తే, వేదం వెంకటరాయశాస్త్రి *ప్రతాపరుద్రీయం*లో పాత్రోచిత భాషకు ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రతి పాత్రకు ఒకే భాష కాకుండా, పాత్ర స్వభావం, సామాజిక స్థాయి, సందర్భానికి తగిన భాషను ఉపయోగించడం నాటక రచనలో ఒక ముఖ్యమైన ప్రయోగంగా గుర్తించబడింది.ఇక్కడ మనం గమనించవలసిన అంశం ఏమిటంటే భాష కేవలం సంభాషణ సాధనం కాదు; అది పాత్ర నిర్మాణానికి కూడా సాధనం.

**కాళ్లకూరి నారాయణరావు – సామాజిక సమస్యా నాటకాలు:** గురజాడ ప్రారంభించిన సామాజిక నాటక ధోరణిని కాళ్లకూరి నారాయణరావు మరింత విస్తరించారు.

**ముఖ్య నాటకాలు:;** *వరవిక్రయం, మధుసేవ, చింతామణి*

*వరవిక్రయం*లో వివాహ వ్యవస్థలోని ఆర్థిక దోపిడీ, స్త్రీ సమస్యలను ప్రశ్నించారు. మధుసేవలో మద్యపానం వంటి సామాజిక సమస్యను ఇతివృత్తంగా స్వీకరించారు.గురజాడ తరువాత దాదాపు రెండు దశాబ్దాలకు *వరవిక్రయం* వంటి రచనల ద్వారా సామాజిక నాటక ధోరణి మళ్లీ బలపడిందని సాహిత్య చరిత్ర ఆధారాలు సూచిస్తున్నాయి.

**త్రిపురనేని రామస్వామి – హేతువాద చైతన్యం:** ఆధునిక తెలుగు నాటకంలో హేతువాద, సామాజిక విమర్శకు త్రిపురనేని రామస్వామి రచనలు ప్రాధాన్యం కలిగి ఉన్నాయి.సంప్రదాయ విశ్వాసాలను ప్రశ్నించడం, కులవ్యవస్థ, మతపరమైన మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలను విమర్శించడం ఆయన రచనల్లో కనిపిస్తుంది.ఇక్కడ నాటకం కేవలం వినోదం కాకుండా ప్రశ్నించే మాధ్యమంగా మారుతుంది.

**స్వాతంత్ర్యోద్యమం – నాటకం ఒక చైతన్య సాధనం:** స్వాతంత్ర్యోద్యమ కాలంలో నాటకం ప్రజలను సమీకరించే శక్తివంతమైన కళారూపంగా మారింది.దేశభక్తి, జాతీయ ఐక్యత, వలస పాలనకు వ్యతిరేక భావాలు నాటకాల్లో వ్యక్తమయ్యాయి. దామరాజు పుండరీకాక్షుడు వంటి రచయితలు స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంతో నాటకాలను రచించారు. తరువాత సుంకర వాసిరెడ్డి వంటి రచయితల రచనల్లో ఉద్యమ నేపథ్యాలు ప్రతిఫలించాయి.

ఇక్కడ నాటకానికి కొత్త బాధ్యత ఏర్పడింది.ప్రేక్షకుడిని వినోదపరచడం మాత్రమే కాదు—ఆలోచింపజేయడం,స్పందింపజేయడం, సమాజంలో మార్పు కోసం చైతన్యపరచడం.

**ఆచార్య ఆత్రేయ – సమస్యా నాటకానికి ప్రతినిధి:** స్వాతంత్ర్యానంతర తెలుగు నాటక రంగంలో ఆచార్య ఆత్రేయ ప్రముఖ స్థానాన్ని పొందారు.

ఆయన నాటకాల్లో మధ్యతరగతి జీవితంలోని సంఘర్షణలు, నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిళ్లు, సామాజిక అసమానతలు ప్రతిబింబించాయి.

**ముఖ్య నాటకాలు:** *గౌతమ బుద్ధ, అశోక సామ్రాట్, పరివర్తన, ఈనాడు, ఎన్.జి.ఓ., విశ్వశాంతి, కప్పలు, భయం*

ఆత్రేయ ఆధునిక వాస్తవిక నాటక ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎన్.జి.ఓ. లో పట్టణ మధ్యతరగతి జీవితంలోని సమస్యలను ఒకే రంగస్థల ప్రదేశంలో ఆవిష్కరించడం గమనించదగిన నిర్మాణాత్మక లక్షణం. పరివర్తనలో దోపిడీదారు–దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య సంఘర్షణను నాటకీయంగా మలిచారు.ఆత్రేయ నాటకం ద్వారా——**సామాజిక సమస్య → వ్యక్తిగత సంఘర్షణ → మానసిక సంఘర్షణ → రంగస్థల వాస్తవికత**అనే పరిణామాన్ని బలపరిచారు.

**ప్రజానాట్యమండలి – నాటకం ప్రజల మధ్యకు:** తెలుగు నాటక చరిత్రలో ప్రజానాట్యమండలి ప్రభావాన్ని ప్రత్యేకంగా చూడాలి.

నాటకాన్ని కేవలం సభలు, థియేటర్లకే పరిమితం చేయకుండా ప్రజల మధ్యకు తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది.ప్రజా సమస్యలు, పేదరికం, దోపిడీ, సామాజిక అసమానతలు, రాజకీయ చైతన్యం వంటి అంశాలు నాటకాల్లోకి వచ్చాయి. దీంతో నాటకానికి కొత్త ప్రేక్షక వర్గం ఏర్పడింది. రంగస్థలం → వీధి → ప్రజలు అనే ప్రయాణం ప్రారంభమైంది. ప్రజానాట్యమండలి స్ఫూర్తితో నాటక రచన జనజాగృతికి ఉపయోగపడినట్లు తెలుగు నాటక చరిత్రపై లభ్యమయ్యే పరిశీలనలు పేర్కొంటున్నాయి.

**నాటక పరిషత్తులు – వాస్తవిక రంగస్థలానికి బలం:** తెలుగు నాటకరంగ అభివృద్ధిలో నాటక పరిషత్తుల పాత్ర విశేషమైనది. నాటక పోటీలు, ప్రదర్శనలు, నటుల శిక్షణ, దర్శకుల ఎదుగుదల, కొత్త రచయితలకు అవకాశాలు వంటి అంశాలకు పరిషత్తులు వేదికలుగా నిలిచాయి.

ప్రత్యేకంగా సామాజిక నాటకాలు, ఏకాంకికలు, వాస్తవిక నటనకు ప్రాధాన్యం పెరిగింది. పరిషత్ పోటీల ద్వారా వాస్తవిక నాటకానికి బలమైన ప్రోత్సాహం లభించిందని నాటక చరిత్ర పరిశీలనలు సూచిస్తున్నాయి.

**వాస్తవికత నుండి రంగస్థల ప్రయోగాల వైపు:** ఆధునిక నాటకరంగం మొదట సమాజాన్ని ప్రతిబింబించడానికి ప్రయత్నించింది. తరువాతప్రశ్నవచ్చింది:**సమాజాన్నికేవలంచూపించాలా? లేక రంగస్థల రూపాన్నే మార్చాలా?** ఈ ప్రశ్నతో రంగస్థల ప్రయోగాలు ప్రారంభమయ్యాయి.

**ప్రధాన ప్రయోగాలు:** ఒకే సెట్‌లో మొత్తం నాటకం నిర్వహించడం, తక్కువ పాత్రలతో నాటక నిర్మాణం, ఏకాంకిక నాటకాలు, వాస్తవిక నటన, సహజ సంభాషణ, కనీస రంగస్థల సామగ్రి, లైటింగ్ ప్రయోగాలు, ధ్వని ప్రయోగాలు, ప్రతీకాత్మక దృశ్య నిర్మాణం, ప్రేక్షకుడిని నాటకంలో భాగస్వామిగా చేయడం, స్వాతంత్ర్యానంతర దశలో స్టేజ్ డిజైన్, లైటింగ్, నాటక రచనలో ప్రయోగాలు జరిగాయని నాటక చరిత్రపై అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**వీధి నాటకం – రంగస్థలానికి కొత్త నిర్వచనం:** వీధి నాటకం సంప్రదాయ రంగస్థల పరిమితులను ప్రశ్నించింది. థియేటర్ హాలు అవసరం లేదు. పెద్ద సెట్ అవసరం లేదు. ఖరీదైన దుస్తులు అవసరం లేదు. ప్రేక్షకులు కుర్చీల్లో కూర్చోవాల్సిన అవసరం లేదు. **ప్రజలు ఉన్న చోటే రంగస్థలం.** ఈ భావనతో వీధి నాటకం ప్రజా ఉద్యమాలతో అనుసంధానమైంది. దళిత సమస్యలు, కుల వివక్ష, స్త్రీల సమస్యలు, సామాజిక అన్యాయాలు వంటి అంశాలను వీధి నాటకం ప్రజల్లోకి తీసుకెళ్లింది.

ఉదాహరణగా ఎం.ఎం. వినోదిని రచించిన దాహం (2002) దళితులపై జరుగుతున్న కుల వివక్ష, అసమానతలను ఇతివృత్తంగా తీసుకున్న వీధి నాటకంగా పరిశీలించబడింది. ఈ నాటకం ప్రేక్షకుల్లో స్పందన, అవగాహన, సామూహిక చైతన్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేసింది.

**స్త్రీవాద నాటక రచన:** ఆధునిక తెలుగు నాటకరంగంలో మరో ముఖ్యమైన పరిణామం **స్త్రీవాద దృక్పథం**. ప్రారంభ సామాజిక నాటకాలలో స్త్రీ ప్రధానంగా సంస్కరణకు గురయ్యే వ్యక్తిగా కనిపిస్తే, ఆధునిక స్త్రీవాద నాటకాల్లో స్త్రీ తన జీవితాన్ని తానే ప్రశ్నిస్తుంది;

పితృస్వామ్యాన్ని విమర్శిస్తుంది; తన శరీరం, స్వేచ్ఛ, వ్యక్తిత్వం గురించి మాట్లాడుతుంది; కుటుంబం, సమాజం, కులం, లింగ వివక్షను ప్రశ్నిస్తుంది. దీంతో నాటకంలో స్త్రీ **"పాత్ర" నుంచి "స్వరం"గా** మారింది.

**దళిత నాటకరంగం:** దళిత చైతన్యం ఆధునిక తెలుగు నాటకానికి మరో కొత్త దిశను ఇచ్చింది. ఇంతకు ముందు ఇతరులు చిత్రించిన దళిత జీవితం స్థానంలో, దళిత అనుభవం, అవమానం, కుల వివక్ష, సామాజిక నిరాకరణ వంటి అంశాలు స్వీయ అనుభవ స్వరంతో రంగస్థలంపైకి వచ్చాయి. దీంతో నాటకరంగంలో— ప్రతినిధిత్వం → స్వీయ ప్రతినిధిత్వం అనే మార్పు కనిపించింది.

**ప్రయోగాత్మక రంగస్థలం:** ప్రయోగాత్మక నాటకం అంటే కేవలం కొత్త కథ రాయడం కాదు.రచనలో కొత్తదనం + నటనలో కొత్తదనం + దర్శకత్వంలో కొత్తదనం + రంగస్థల నిర్మాణంలో కొత్తదనం + ప్రేక్షక సంబంధంలో కొత్తదనం కలిసినప్పుడు ప్రయోగాత్మక రంగస్థలం ఏర్పడుతుంది.

**ముఖ్యమైన ప్రయోగాలు:**

**మినిమల్ సెట్** అవసరం లేని వస్తువులను తొలగించి, కొన్ని వస్తువులతోనే మొత్తం నాటకాన్ని ఆవిష్కరించడం.

**లైటింగ్**: వెలుతురును కేవలం దృశ్యాన్ని చూపించే సాధనంగా కాకుండా భావాన్ని వ్యక్తపరిచే సాధనంగా ఉపయోగించడం.

**శబ్ద ప్రయోగం:** సంగీతం, నిశ్శబ్దం, శబ్ద ప్రభావాలను కథనంలో భాగంగా చేయడం.

**శరీర భాష:** సంభాషణ కంటే నటుడి కదలికలకు ప్రాధాన్యం ఇవ్వడం.

**బహుస్థాయి రంగస్థలం:** ఒకే వేదికపై అనేక ప్రదేశాలను సూచించడం.

**ప్రేక్షకుడితో ప్రత్యక్ష సంభాషణ:** నటుడు నేరుగా ప్రేక్షకుడితో మాట్లాడటం.

**ప్రేక్షకుడు – వీక్షకుడి నుంచి భాగస్వామి వరకు:** ఆధునిక రంగస్థల ప్రయోగాల్లో అత్యంత ముఖ్యమైన పరిణామం

**ప్రేక్షకుడి పాత్రలో వచ్చిన మార్పు:** సంప్రదాయ నాటకంలో ప్రేక్షకుడు— కూర్చుంటాడు → చూస్తాడు → వింటాడు → స్పందిస్తాడు. ప్రయోగాత్మక నాటకంలో— చూస్తాడు → ఆలోచిస్తాడు → ప్రశ్నిస్తాడు → స్పందిస్తాడు → కొన్నిసార్లు నాటకంలో భాగమవుతాడు.

అందువల్ల ఆధునిక రంగస్థలంలో ప్రేక్షకుడు కేవలం వినోదాన్ని స్వీకరించే వ్యక్తి కాదు; అర్థాన్ని నిర్మించే సహభాగి.

**ఆధునిక తెలుగు నాటకంలో సామాజిక చైతన్యం:**

ఆధునిక తెలుగు నాటక కర్తల రచనలను పరిశీలిస్తే సామాజిక చైతన్యం కింది అంశాల చుట్టూ విస్తరించినట్లు మనకి తెలుస్తుంది.

**స్త్రీ విముక్తి:** బాల్యవివాహం, వరకట్నం, స్త్రీ విద్య, పితృస్వామ్యం వంటి అంశాలు.

**కుల చైతన్యం:** కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానత.

**ఆర్థిక చైతన్యం:** పేదరికం, దోపిడీ, నిరుద్యోగం, మధ్యతరగతి ఆర్థిక సమస్యలు.

**రాజకీయ చైతన్యం:** స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, రాజకీయ అవినీతి.

**హేతువాద చైతన్యం:** మూఢనమ్మకాలు, మతపరమైన కపటత్వం, అంధ విశ్వాసాలపై విమర్శ.

**మానవతా చైతన్యం:** మనిషి స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం వంటి విలువలు.

నాటక కర్త నుంచి రంగస్థల సృజనకర్త వరకు ఆధునిక నాటకంలో రచయిత ఒక్కరే కేంద్రబిందువు కాదు.

నాటక నిర్మాణంలో—రచయిత + దర్శకుడు + నటుడు + సంగీత దర్శకుడు + సాంకేతిక నిపుణుడు + ప్రేక్షకుడు అందరూ భాగస్వాములయ్యారు.

దీంతో నాటకం ఒక సామూహిక కళారూపంగా మరింత బలపడింది.

**ఆధునిక తెలుగు నాటకానికి ఎదురవుతున్న సవాళ్లు**

ప్రస్తుతం తెలుగు నాటకరంగం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది.

సినిమాల ప్రభావం,టెలివిజన్ విస్తరణ, OTT వినోదం, ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పు,వాణిజ్యపరమైన పరిమితులు ,శాశ్వత రంగస్థలాల కొరత ,యువతలో నాటక ప్రదర్శనల పట్ల తగ్గుతున్న ఆసక్తి, నాటక శిక్షణకు పరిమిత అవకాశాలు,

మంచి నాటక రచనకు తగిన ప్రోత్సాహం లేకపోవడం,డిజిటల్ మాధ్యమాలతో నాటకాన్ని అనుసంధానించాల్సిన అవసరం. అయితే ఇదే సమయంలో డిజిటల్ మాధ్యమాలు నాటకానికి కొత్త ప్రేక్షకులను అందించే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నాయి.

**భవిష్యత్ రంగస్థలం :** భవిష్యత్తులో తెలుగు నాటకరంగం మరిన్ని కొత్త ప్రయోగాలకు వేదిక కావచ్చు.

**డిజిటల్ థియేటర్ :** ఆన్‌లైన్ ప్రదర్శనలు, రికార్డు చేసిన నాటకాలు.

**మల్టీమీడియా థియేటర్ :** వీడియో, ప్రొజెక్షన్, లైటింగ్, డిజిటల్ సౌండ్ వినియోగం.

**AI ఆధారిత రంగస్థలం :** డిజిటల్ సెట్లు, వర్చువల్ పాత్రలు, AI ఆధారిత దృశ్య రూపకల్పన వంటి ప్రయోగాలు.

**ప్రేక్షక భాగస్వామ్య నాటకం :** ప్రేక్షకుల అభిప్రాయాల ఆధారంగా కథనం మారే విధానాలు. ఇలా చూస్తే ఆధునిక తెలుగు రంగస్థలం సంప్రదాయాన్ని పూర్తిగా వదిలేయకుండా, **సాంకేతికతను స్వీకరించి కొత్త ప్రేక్షకులతో సంబంధం ఏర్పరచుకునే దిశగా** సాగవచ్చు.

**ముగింపు :**

ఆధునిక తెలుగు నాటక చరిత్రను పరిశీలిస్తే అది కేవలం నాటక రచయితల చరిత్ర కాదు. అది తెలుగు సమాజంలో వచ్చిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆలోచనా పరిణామాల చరిత్ర .

కందుకూరి నాటకాన్ని సామాజిక సంస్కరణకు అనుసంధానిస్తే, గురజాడ కన్యాశుల్కం ద్వారా సామాజిక దురాచారాలపై వ్యంగ్యాస్త్రాన్ని ప్రయోగించారు. వేదం వెంకటరాయశాస్త్రి పాత్రోచిత భాషను ప్రయోగించారు. కాళ్లకూరి సామాజిక సమస్యలను నాటక వస్తువులుగా స్వీకరించారు. త్రిపురనేని హేతువాద ఆలోచనలకు నాటకాన్ని వేదికగా చేసుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నాటకం జాతీయ చైతన్యాన్ని వ్యక్తం చేసింది. ప్రజానాట్య ఉద్యమం నాటకాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లింది. ఆత్రేయ మధ్యతరగతి జీవిత సమస్యలను వాస్తవిక నాటకంగా మలిచారు. అనంతర కాలంలో వీధి నాటకం, స్త్రీవాద నాటకం, దళిత నాటకం, ప్రయోగాత్మక రంగస్థలం నాటక పరిధిని మరింత విస్తరించాయి.

**ఆధార గ్రంథసూచి:**


1. గురజాడ అప్పారావు – **కన్యాశుల్కం**
2. వేదం వెంకటరాయశాస్త్రి – **ప్రతాపరుద్రీయం**
3. కాళ్లకూరి నారాయణరావు – **వరవిక్రయం**
4. కాళ్లకూరి నారాయణరావు – **మధుసేవ**
5. త్రిపురనేని రామస్వామి – **హేతువాద నాటక రచనలు**
6. ఆచార్య ఆత్రేయ – **ఎన్.జి.ఓ.**
7. ఆచార్య ఆత్రేయ – **పరివర్తన**
8. ఆచార్య ఆత్రేయ – **భయం**
9. తెలుగు నాటకరంగ చరిత్రకు సంబంధించిన విశ్వవిద్యాలయ పాఠ్యగ్రంథాలు
10. తెలుగు నాటక విమర్శ, రంగస్థల చరిత్రకు సంబంధించిన పరిశోధనా వ్యాసాలు.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# నవల – సామాజిక జీవిత చిత్రణ – చెరువుగండి నవల ఇతివృత్తం పరిశీలన

**– మాచర్ల శ్రీనివాసరావు,**

*పరిశోధక విద్యార్థి,*

*తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,*

*ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం*

*నాగార్జున నగర్ – గుంటూరు,*

*చరవాణి – 9618204470.*

**పత్ర సారాంశం / ఉపోద్ఘాతం:**

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు కలవు. వాటిలో పాఠకుల హృదయాలను ఒక్కోకాలంలో ఒక్కో ప్రక్రియ ఆకట్టుకుంటే నాటినుండి నేటికి ప్రజల హృదయాలను స్పందింపజేస్తూ సమాజాన్ని చైతన్య పరుస్తున్నవి నవలలు. అందరికీ అర్థమయ్యే రీతిలో సులభశైలిలో సమాజంలోని వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ అనేకమంది రచయితలు వారి వృత్తి ఏదైనప్పటికీ సాహితీ సృజనే తమ ప్రవృత్తిగా ఎంచుకొని నవలలు రాస్తున్నారు. అటువంటివారిలో వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి ఒకరు.

**కీలక పదాలు:** ముత్యాలమ్మచెరువు, పెనుకొండ, దుర్గం, ముత్యాలప్పశెట్టి, మాదిగపల్లె, మాలపల్లె, కొలకట్టి సామి, నల్లకోమటిదెబ్బ, రాగిమడిలోన, ఎర్రమ్మ, ఇరగన్న శామ్యూల్, లేపారం, మరవలి, మడినాటకం గుంజరు గోతులు, దాశయ్య, దుడ్లు, కొండసాదులు, చానసేపాయర, మొగలిపువ్వు, అగ్నిస్రష్ట, కరణం, మాలముండా చాల్లేయ్, దిగుడుబావి, చుక్కమ్మ, జెప్పినాడో, భార్గవ్, జ్ఞానసభరద్య, కాయకష్టం, వనజాక్షి, చుక్కమ్మ, ఎర్రజాజి, చెంగల్రాయుడు, పూవన్నం, రేణికాయల వంశం, మంగమ్మ, నీమైలా చేతిశక్తి దౌర్జన్య వీరత్వం దయాగుణం, సహనం, ఓర్పు, వీరవనిత, మనోధైర్యం.

## రచయిత పరిచయం:

ఈ చారిత్రాత్మక శిఖరారోహణ దశలో రాయలసీమ అనంతపురం జిల్లానుండి ఆచార్య వెంకిరెడ్డి రెడ్డప్పరెడ్డిగారు ఈ చెరువుగండి నవలను రచించారు. రెడ్డప్పగారు ఆర్థికశాస్త్ర అధ్యయనం చేసి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖలో ఆచార్యునిగా పదవీ విరమణ చేశారు. గ్రామీణాభివృద్ధిశాఖలో అనేక ప్రాజెక్టులలో పనిచేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి రెడ్డిగారు గ్రామీణ భారతదేశపు ఆర్థిక రాజకీయ సాంఘిక పార్శ్వాలు ఎలా మానవ సంబంధాలను నిర్ణయిస్తున్నాయో గ్రహించి గతి తార్కిక సూత్రాల ఆధారంగా అవగాహన చేసుకొని ఈ నవల రాశారు.

మన సమాజంలో పైపైన ఎన్నో మార్పులు వస్తున్నప్పటికీ పునాది కట్టు కదలకుండా ఉన్నదన్నమాట వాస్తవం. ఈ విషయం బాగా తెలిసినవారు మన రచయిత. ప్రముఖ కవి శ్రీ ఆరుద్రగారు 1948 ఆగష్టు 15 ఆకాశవాణి నుండి ఒక కవిత చదువుతూ... మన స్వాతంత్ర్యం ఒక మేడిపండు మన దారిద్ర్యం ఒక రాచపుండు...అన్నారు.. నాటినుండి నేటివరకు భారతదేశాన్ని వదిలిపెట్టని ఆధిపత్య దౌర్జన్యకర వ్యవస్థలపై వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డిగారికి అవగాహన ఉంది.

## ముఖ్యాంశాలు (ఉపశీర్షిక) చెరువుగండి నవల ఇతివృత్తం:

ఈ నవలలో ఎర్రమ్మ ప్రధాన పాత్ర. ఆమె దళిత మహిళ. ఆమె ఉరగుడ్లోల్లపల్లి ఇరగన్న కూతురు. శామ్యూల్ అనే ఆయన ద్వారా ఎర్రమ్మ కొంతవరకు చదువుకోగలిగింది. ఆ చదువు వృథా కాలేదు.

ఆ చదువు ప్రశ్నించే శక్తిని ఇచ్చింది. ఆమె చెరువుగండి మాలపల్లెకు నాగయ కోడలుగా దశయ్యా చర్యగా వచ్చింది. ఎర్రమ్మ 1940లో జన్మించింది. 2020దాకా 80 ఏళ్ళ బ్రతికింది. ఇద్దరు కొడుకులను కన్నది. ఇద్దర్ని చదివించింది. చెరువుపల్లెగా మొదలై ఎన్నో కులాలవారు స్థిరపడ్డారు. జీవనదం వ్యవసాయం. ఎర్రను దసయ్యం దాంపత్య జీవితం ఎంతో అన్యోన్యంగా ఉంది. మాలపల్లిలో నాగయ్య పూర్వంనుండి దేవస్రష్ట అనే భూస్వామి దగ్గర అప్పు తీసుకున్నాడు. దాని వడ్డీకివడ్డీ పెరిగిపోయింది. ఎర్రమ్మ భర్త దాసయ్య, మామ నాగయ్య ఇద్దరూ దేవస్రష్ట దగ్గర పనిచేయటానికి వెళ్లేవారు. ఇద్దరూ రోజూ పని చేసేవారు. అప్పు త్వరగా తీర్చవచ్చని ఎర్రమ్మ ఈ ఉపాయం చెప్పింది. ఆ విధంగా ఇద్దరూ రోజూ దేవస్రష్ట భూస్వామి దగ్గర జీతం చేస్తున్నారు.

ఒకరోజు నాగయ్య ఎద్దులకు గడ్డి వేస్తూ వంగి ఉండగా, ఎద్దు వచ్చి డొక్కలో (కడుపులో) పొడిచింది. ఆసుపత్రికి తీసుకువెళ్లారు కొడుకు కోడలు. డబ్బులు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించినా ఫలితం లేక పోయింది. వారం తిరగకుండానే నాగయ్య మరణించాడు.

భూస్వామి దగ్గర అప్పు తీర్చడానికి దాసయ్యతో పాటు ఎర్రమ్మకూడా జీతం చేయటానికి దేవస్రష్ట ఇంటికి వెళ్ళింది. ఆ విధంగా రోజులు గడుస్తున్నాయి. హాస్టల్లో ఉండి చదువుతున్న దేవస్రష్ట కొడుకు అగ్నిస్రష్ట ఇంటికి వచ్చాడు. తండ్రి కంటే పరమమూర్ఖుడు, దుష్టుడు. అందగత్తె అయిన ఎర్రమ్మ మీద మనసు పడి ఎన్నో విధాలుగా లొంగతీసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరకు లొంగక తప్పలేదు. దేవస్రష్ట బలవంతంతో అత్తకు కూడా ఏమి చెప్పలేక పరిస్థితులకు తలొగ్గాల్సి వచ్చింది. ఆవిధంగా శారీరకంగా ఎంతగానో అనుభవించాడు. ఎర్రమ్మ ఎంతో సహించింది. కొన్ని సంవత్సరాలకు అత్తకు జరుగుతున్న అన్యాయం తెలిసింది. ఆ బాధనే తలచుకుని మంచం పట్టి మరణించింది. ఎంతో ధైర్యం చెప్పే అత్తగారు మరణించటంతో ఎర్రమ్మకు కుడిభుజం కూలినట్లయింది. ఎర్రమ్మ, దాసయ్య రోజూ జీతం చేస్తూ అప్పు తీర్చుకుంటూ ఉన్నారు. అగ్నిస్రష్టకు వివాహం జరిగింది. భార్యకు నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. వారికి చెల్లెలంటే తగని ప్రేమ. అగ్నిస్రష్ట భార్య అన్నలకు భయపడేవాడు.

కొన్ని రోజులకు దేవస్రష్ట గుండెపోటుతో మరణించాడు. తండ్రి మరణంతో ఆస్తి అంతా తన పేరు మీదకు మార్చుకున్నాడు. ఎర్రమ్మకు కొంత ధైర్యం వచ్చింది. అగ్నిస్రష్ట భార్య మొదట ఎర్రమ్మ మీద అనుమాన పడింది. కాని చివరకు వాస్తవం తెలుసుకొని ఎర్రమ్మను ఆదరించింది. అండగా నిలచింది.

అగ్నిస్రష్ట భార్యను కొట్టి నెట్టగా అక్కడే ఉన్న బావిలోపడి చనిపోయింది. ఆ విషయం బయటకు రాకుండా దాచిపెట్టాడు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన అగ్నిస్రష్ట ఎవరికి భయపడలేదు. ఇప్పుడు ఉంపుడుగత్తె వేరే పట్టణంలో ఉంది. అగ్నిస్రష్ట నెల నెల వెళ్లి వచ్చేవాడు. కొన్ని సరుకులు వస్తువులు ఇచ్చిరమ్మని దాసయ్యను పంపాడు అగ్నిస్రష్ట. ఆ ఉంపుడుగత్తె దాసయ్య శరీరపుష్టి, సౌందర్యాన్ని చూసి అతనిని మోహించింది. కానీ దాసయ్య లొంగలేదు. ఈ విషయం అగ్నిస్రష్టకు తెలిసి దాసయ్య కాళ్లు విరగ కొట్టించి ప్రమాదంగా చిత్రించాడు. ఎర్రమ్మ అవిటి భర్తను ఇద్దరు పిల్లలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుంది. దాసయ్య తన భార్యకు జరిగిన అన్యాయం, తన అవిటితనం తట్టుకోలేక తాగుడుకు బానిస అయినాడు. ఏదో ఒక పనిచేసి తాగేవాడు. కొన్ని రోజులకు ఆరోగ్యం క్షీణించి మరణించాడు.

ఎర్రమ్మ ఇద్దరు పిల్లలను చదివిస్తూ ఉంది. పెద్ద కొడుకుకు చదువుపట్ల అశ్రద్ధ అని తెలుసుకుని, తనకు ఎంత అన్యాయం జరిగిందో, తన భర్తకు కాళ్లు ఎలా పోయాయో, ఎన్ని విధాలుగా తమ కుటుంబం నష్టపోయిందో కొడుకుకు వివరించింది. పెద్దకొడుకు తమ కుటుంబానికి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా పగ తీర్చుకోవటానికి అన్నలలో చేరినాడు. మావోయిస్టు పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవాడు.

చిన్నవాడు తల్లి దగ్గరే ఉండి చదువుకుంటూ తల్లికి సాయపడే వాడు. అగ్నిస్రష్టను చంపడానికి ప్రయత్నించాడు ఎర్రమ్మ పెద్ద కొడుకు. కానీ విఫలం అయినాడు. నక్సలైట్లు తన భూములు అన్ని ఆక్రమించుకుంటారనే అనుమానంతో అగ్నిస్రష్ట కొన్ని భూములు ఇతరుల పేరు మీదకు మార్చాడు. మరికొన్ని అమ్మి అనంతపురంలో ప్లాట్లు, ఫంక్షన్ హాల్, సినిమా థియేటర్ కొన్నాడు. రాజకీయంగా ఎదిగిన అగ్నిస్రష్ట భూములు, ఆస్తులు లెక్క చూసుకోవటానికి ఒకరోజు ఒంటరిగా చెరువు గండికి వచ్చాడన్న విషయం తెలుసుకున్న ఎర్రమ్మ తనలాగా అన్యాయానికి బలైన మరికొందరు ఆడవారిని సమీకరించింది. అగ్నిస్రష్ట అన్యాయాలను అందరికీ గుర్తు చేసింది. ఇంటిలోకి చొరబడి అందరూ అగ్నిస్రష్టను కొట్టినారు. ఎర్రమ్మ బాకు తీసుకుని క్రింద మానం నుండి పొడిస్తే పేగులు బయటకి వచ్చి చిత్రహింస అనుభవించి మరణించాడు.

అగ్నిస్రష్ట చావు చాలా ఘనంగా చేసినారు. ఆ దినం ఒక పండగ లాగా అంగరంగ వైభవంగా చేసినారు. కొడుకు రత్నసభ రాధ్య రాజకీయంగా ఎంతో ఎదిగినాడు. రత్నసభరాధ్య ఎం.ఎల్.ఏ నుండి హోమ్ మంత్రి అయినాడు. తన కుటుంబాన్ని నక్సలైట్లు నాశనం చేసినారు అని అనుకొని, తండ్రిని వాళ్లు చంపారు అని వాళ్ల మీద పగ తీర్చుకోవటం ప్రారంభించాడు.

ఎర్రమ్మ కొడుకు భార్గవ రత్నసభ రాధ్యను అన్నలతో కలసి బెదిరించి వదలి వేసినారు. అది మనసులో పెట్టుకొని ఎర్రమ్మ కొడుకును చంపించినాడు. ఎర్రమ్మ కొడుకు మరణంతో మరింతగా కృంగి పోయింది. అగ్నిస్రష్ట రెండో కొడుకు అమెరికాలో స్థిరపడి పోయినాడు. రత్నసభ రాధ్య చెరువుగండి ప్రజలను తన వైపు త్రిప్పుకొన్నాడు. మాలపల్లెల్లో చాలా మందిని గుప్పెట్లో పెట్టుకొని ఎర్రమ్మను మాలపల్లె నుంచి వెలి వేయించాడు. అయినా ధైర్యంగానే చెరువుగండి దగ్గర కొంత భూమిని కౌలుకు తీసుకుని సేద్యం చేస్తూ జీవిస్తుంది.

కొన్ని సంవత్సరాలకు రత్నసభ రాధ్య పదవి పోయింది. ఎన్నికలలో ఓడిపోయినాడు. అయినా ఆస్తి పదిరెట్లు సంపాదించాడు. రత్నసభ రాధ్యను ఒకనాడు నలుగురు మనుష్యులు మిలటరీ దుస్తులలో ఇంటి నుంచి తీసుకుని పోయి ప్రజాకోర్టు నిర్వహించారు. ప్రజల ముందు అతడు చేసిన అన్యాయాల నన్నింటినీ వివరించారు. ప్రజాకోర్టుకు హాజరు అయిన అందరూ అతనిని చంపమన్నారు.

ఎర్రమ్మకు రత్నసభరాధ్యకు పోటీ నిర్వహించి ఎర్రమ్మను ఓడిస్తే వదలేస్తామన్నారు. ఎర్రమ్మ ముసలిది. సన్నగా ఉంది. తేలికగా ఓడించి చంపవచ్చు అని పోటీకి ఒప్పుకున్నాడు. కానీ ఎర్రమ్మది గట్టి ప్రాణం. ఎర్రమ్మ కట్టెలాగా ఉంది. మొదట్లో రత్నసభ రాధ్య జుట్టు పట్టుకుని కొట్టినా చివరకు తన శక్తినంతా ఉపయోగించి ఎర్రమ్మ రత్నసభ రాధ్యను చావుదెబ్బ కొడుతుంది. నిస్సహాయ స్థితికి చేరుకున్న రత్నసభ రాధ్యను వదిలి వేస్తుంది. అందరూ చంపమని చెప్పినా, తను అలా చేస్తే వారికి మనకి వాళ్ళకు తేడా ఏమిటి అంటుంది. ఇక్కడ వేమన పద్యం గుర్తుకువస్తుంది.

"చంపదగన యట్టి శత్రువు చేత

జిక్కెనేని కీడు సేయరాదుపొసగ

మేలు చేసి పొమ్మనుటే చాలు

విశ్వదాభిరామ వినురవేమ!"

ఎర్రమ్మ దయాగుణం, వీరత్వం, సహనం, ఓర్పు, గల వీరవనిత. రత్నసభ రాధ్యకు ఎర్రమ్మ తనను చంపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎర్రమ్మ రత సభ రాజ్యను అనేక ప్రశ్నలు వేసి చివరకు అతడిని ప్రాణాలతో వదిలి పెట్టమని మావోయిస్టు పార్టీ నాయకులను కోరింది. ఎర్రమ్మ నిర్ణయాన్ని గౌరవించారు.

దాంతో రత్నసభ రాధ్య పునరాలోచనలో పడ్డాడు. తన నీచజీవితం పట్ల అతనికి అసహ్యం కలిగింది. చివరకు ఎర్రమ్మ ఇంటికిపోయి ఆమె పాదాలపై పడ్డాడు. తనను కొడుకుగా స్వీకరించమన్నాడు. తన భార్యను వదలేసినాడు. తన ఆస్తి మొత్తం చెరువుగండికి, తన నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు పెట్టాడు. ఒక పేదింటి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఎర్రమ్మ ఎంతో సంతోషించింది. చివరకు ఎర్రమ్మ ప్రశాంతంగా కన్నుమూసింది.

ఈ నవల రాజకీయ, ఆర్థిక దోపిడీలను, అణచివేతలను చిత్రించింది. ఎర్రమ్మ వామపక్ష రాజకీయాల మీద తన అభిప్రాయాన్ని చెప్పింది. నక్సల్బరీ ఉద్యమాన్ని వ్యక్తిగత కక్షలను తీర్చుకోవటానికి ఉపయోగించుకోవటాన్ని వ్యతిరేకించింది. ప్రజాకంటకుడైన అగ్రిస్రష్టను అతనిచేత పీడింపబడిన మహిళలందర్నీ సమీకరించి చంపింది.

రత్నసభరాధ్య దగ్గరకు వచ్చేసరికి ఆమె వ్యక్తి ప్రవర్తనను నమ్మింది. మనిషిని చంపడం కాదు, దుర్మార్గుడు మంచివాడిగా మారడానికి అవకాశం ఇవ్వాలనే సిద్ధాంతానికి ఆమె చేరుకుంది.

ఎర్రమ్మ జీవన ప్రస్థానంగా కనిపించే ఈ నవల సామాజిక ప్రాస్థానానికి ప్రతిబింబం. ఒక భూస్వామ్య కుంటుంబంలోని ముగ్గురు వ్యక్తుల జీవితాల మీద ఒక దళిత కుటుంబలోని ముగ్గురు వ్యక్తుల మీద చరిత్ర పరిచి చిత్రించారు.

విప్లవాన్ని గర్భంలో దాచుకున్న పరివర్తనాత్మక నవల ఇది. మీరు అనుభవిస్తున్న భూములు ఆస్తులు మీవి కావు. చాలా వారకూ ఈ ఊరి వారివే. భయపెట్టి అణచివేసి అగ్నస్రష్ట కుటుంబం లాక్కొన్నవి.

మీ తాత దోపిడీని మొదలెట్టాడు.
మీ నాన్న ఆ దోపిడీని విస్తరించాడు.

నీ తరంలో ఆ దోపిడి రాష్ట్రస్థాయికి చేరి వేలకోట్లకు ఎదిగాడు రత్నసభ రాధ్య.

ఈ దుర్మార్గుల మీద ఎర్రమ్మ చేసిన పోరాటం ఈ నవల. అనాది నుండి నేటి వరకూ భూమి, గాలి, నీరు, నిప్పు అన్నింటిని దేవుడు అందరికి సమానంగా ఇచ్చినా, బలవంతుడు బలహీనులను అన్యాయం, అక్రమం చేసి వాడికి చెందవలసిన దాన్ని దోచుకోవటం, బలహీనుడు తిరగబడడం జరుగుతూనే ఉంది. ఈ నవలలాగే అన్యాయాలు అక్రమాలపై ఎన్నో రచనలు వచ్చినాయి. వాటిలో వట్టకోట ఆళ్వారు స్వామి రాసిన 'ప్రజల మనిషి' నవలలో "కంఠీరవం" అన్న బ్రాహ్మణ పిల్లవాడు రామభూపాలరావు వంటి పాలకవర్గం మీద తిరగబడుతూ ఎలా నాయకునిగా ఎదిగాడో రచయిత వాస్తవికంగా చిత్రించాడు.

“చెరువుగండి నవలలో రెడ్డప్పగారు పదో తరగతి లోపే చదువు మానేసిన ఎర్రమ్మ, దేవస్రష్ట, అగ్నిస్రష్ట, రత్నసభరాధ్య వంటి కంటకుల దుర్మార్గులను ప్రతిఘటించే క్రమంలో విప్లవోద్యమాలను కూడా ప్రభావితం చేయగల నాయకురాలిగా ఎదిగిన క్రమాన్ని చిత్రించారు. సమాజంలో జరిగే అన్యాయాలను అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకు వచ్చి వారిలో చైతన్యం, ధైర్య సాహసాలను నిపండంలో ఎర్రమ్మ మనోధైర్యానికి ప్రతీకగా నిలించింది.

జీవితంలో అన్నీ కోల్పోయినా మనోధైర్యంతో బ్రతుకుతూ సమాజ శ్రేయస్సుకు పాటు పండింది ఎర్రమ్మ.

ఎర్రమ్మ పోరాటంలో భర్తను, అత్తను మామను కోల్పోయింది. చివరకు కొడుకును సైతం పోగొట్టుకుంది. అయినా ఎలాంటి క్లిష్ట పరిస్థితి అయినా చిమ్మచీకటిలో చిరుదీపంగా వెలుగుతూ అణగారిన జీవితంలో వెలుగును నింపింది ఎర్రమ్మ.

**ముగింపు:**

“చెరువుగండి” వర్తమాన గ్రామీణ భారత సామాజిక వాస్తవికతకు ప్రతిఫలం. భారతీయ గ్రామాల మీద కాల్పనిక వ్యామోహం ఉండే వాళ్ళ కళ్ళు తెరిపిస్తుంది. చెరువుగండి నవలలో చెరువు నిండితే పంటలు పండుతాయి. ఎంతోమందికి జీవనోపాధిని కల్పిస్తుంది. కాని అదే చెరువుకు గండి పడితే పొలాలను ఆ ప్రాతాన్ని ముంచుతుంది. చెరువు ఉగ్రరూపం దాల్చితే ఊరుకు ఊర్లు కొట్టుకుపోతాయి. ఎందరినో బలి తీసుకుంటుంది.

అదే విధంగా ఈ క్షుద్ర రాజకీయాలు ఇలాగే ఉండాలని ఎవరూ కోరుకోరు. మార్పు రావాలి. స్వచ్ఛత రావాలి. దోపిడీ తగ్గాలి. కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందించే రాజకీయం రావాలి. ఎర్రమ్మ ఈ నవలలో కొడుకుని చంపిన వానిలో ఒక తల్లి తన కొడుకును చూసేంత మార్పు రావాలి. అలాంటి మార్పు సమాజాభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది.

**ఆధార గ్రంథాలు**

1. వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి రచనలు
2. ది గ్రేట్ డిక్లైన్ కథలు – వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి.
3. నీడకు పట్టిన చీడ – వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి.
4. తెలుగు నవలానుశీలనం– యమ్. సుజాతారెడ్డి.
5. తెలుగు నవలలో సామాజిక చైతన్యం డా. పి. సంజీవమ్మ.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# నానీలు – సామాజిక స్పృహ

– డా. ఎం. పద్మగౌరి
తెలుగు అధ్యాపకులు
ప్రశాంతి నగర్ ,బొమ్మూరు
చరవాణి :9885962656

**ఉపోద్ఘాతం:**

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియలు కాలానుగుణంగా అనేక మార్పులకు లోనయ్యాయి. మారుతున్న మానవ జీవితం, సామాజిక సంబంధాలు, రాజకీయ పరిణామాలు, ఆర్థిక అసమానతలు, సాంస్కృతిక మార్పులు కవిత్వ వస్తువులోనూ, రూపంలోనూ కొత్త ప్రయోగాలకు దారితీశాయి. ఈ క్రమంలో మినీ కవిత, హైకూ, నానీ వంటి సంక్షిప్త కవితా ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. వీటిలో నానీ తన దేశీయ స్వభావం, సంక్షిప్త నిర్మాణం, భావసాంద్రత, సామాజిక పరిశీలన వంటి లక్షణాలతో విశిష్టమైన ప్రక్రియగా నిలిచింది.

నానీని కేవలం నాలుగు పాదాల సంక్షిప్త కవితగా చూడటం దాని సాహిత్య పరిధిని పరిమితం చేయడమే అవుతుంది. సమకాలీన సమాజంలోని రాజకీయ స్వార్థం, కుల వివక్ష, గ్రామీణ వలసలు, సామాజిక అసమానతలు, వ్యక్తిత్వ చిత్రణ వంటి అనేక అంశాలను నానీ తన పరిధిలోకి తీసుకుంది. కొద్దిపాటి పదాల్లో ఒక విస్తృతమైన సామాజిక అనుభవాన్ని సూచించగలగడం నానీ ప్రత్యేకత. ఈ నేపథ్యంలో 'నానీలు – సామాజిక స్పృహ' అనే అంశాన్ని వస్తువు, రూపం, అభివ్యక్తి, దేశీయత, సామాజిక విమర్శ అనే కోణాల నుంచి పరిశీలించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

**కీలకపదాలు:** నానీ, ఆధునిక తెలుగు కవిత్వం, సంక్షిప్త కవిత, సామాజిక స్పృహ, సామాజిక విమర్శ, దేశీయత, రాజకీయ చైతన్యం, కుల వ్యవస్థ, గ్రామీణ వలసలు, వ్యక్తిత్వ చిత్రణ.

**పరిచయం:**

ఆధునిక తెలుగు కవిత్వ పరిణామాన్ని పరిశీలించినప్పుడు కవితా ప్రక్రియల్లో చోటుచేసుకున్న మార్పులు ప్రత్యేకంగా గమనించదగినవి. కాలం మారుతున్న కొద్దీ మనిషి జీవనానుభవాలు మారాయి. సామాజిక సంబంధాల స్వభావం మారింది. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులను వ్యక్తీకరించడానికి పాత కవితా నిర్మాణాలు మాత్రమే సరిపోవని భావించిన కవులు కొత్త రూపాల కోసం అన్వేషించారు. ఫలితంగా ఆధునిక తెలుగు కవిత్వంలో మినీ కవిత, హైకూ, నానీ వంటి సంక్షిప్త కవితా ప్రక్రియలు ప్రాధాన్యం పొందాయి.

ఆధునిక కవిత్వంలోని ఈ ప్రయోగాలను కేవలం రూపపరమైన మార్పులుగా చూడటం సరైనది కాదు. రూపం మారినంత మాత్రాన కవిత్వ స్వభావం మారదు. కవి ఎంచుకునే వస్తువు, దాన్ని నిర్మించే విధానం, పాఠకుడికి చేరే అభివ్యక్తి. ఈ మూడింటి పరస్పర సంబంధమే కవితా స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. నానీ ప్రక్రియను పరిశీలిస్తే సంక్షిప్త రూపంలో సమకాలీన జీవితాన్ని పట్టుకోవడానికి తెలుగు కవి చేసిన సృజనాత్మక ప్రయత్నంగా అనిపిస్తుంది.

నానీలలో వ్యక్తిగత అనుభూతులతో పాటు సామాజిక అనుభవాలకు కూడా ప్రాధాన్యం లభించింది. రాజకీయ వాగ్దానాలు, అధికార స్వభావం, కుల వివక్ష, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు, సామాజిక అసమానతలు వంటి అనేక అంశాలు నానీలకు వస్తువులయ్యాయి. అందువల్ల నానీలు కేవలం సంక్షిప్త కవితా రూపంగా కాకుండా సమాజాన్ని పరిశీలించి దాని వైరుధ్యాలను పాఠకుడి ముందుంచే ఆధునిక సాహిత్య ప్రక్రియగా చెప్పవచ్చు.

### నానీ ఆవిర్భావ నేపథ్యం:

తెలుగు కవిత్వం ఆధునిక దశలోకి ప్రవేశించినప్పుడు ప్రపంచ సాహిత్య పరిణామాలతో దాని సంబంధం పెరిగింది. పాశ్చాత్య సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు తూర్పు దేశాల కవితా రూపాలు తెలుగు రచయితలకు పరిచయమయ్యాయి. ముఖ్యంగా తక్కువ పరిమాణంలో ఎక్కువ భావాన్ని వ్యక్తం చేసే కవితా రూపాలపై ఆసక్తి పెరిగింది. ఈ పరిణామానికి హైకూ, మినీ కవితలు ఒక ఉదాహరణ.

ఒక సాహిత్య ప్రక్రియ మరొక భాషలోకి వచ్చినప్పుడు అది అదే రూపంలో కొనసాగాల్సిన అవసరం లేదు. కొత్త భాష యొక్క స్వభావం, ఆ భాషను మాట్లాడే ప్రజల జీవన అనుభవాలు, సాంస్కృతిక నేపథ్యం దాని రూపాన్ని ప్రభావితం చేస్తాయి. హైకూ వంటి ప్రక్రియల పరిచయం సంక్షిప్త కవిత్వంపై ఆసక్తిని పెంచినప్పటికీ, తెలుగు కవిత్వం తన స్వీయ అవసరాలకు అనుగుణంగా కొత్త మార్గాలను ఏర్పరచుకుంది. ఆ పరిణామంలో నానీ ఒక ప్రత్యేకమైన రూపంగా అవతరించింది.

నూతన శతాబ్దం ప్రారంభ దశకు చేరుతున్న సమయంలో నానీకి రూపకల్పన జరిగినట్లు తెలుస్తుంది. ఆచార్య ఎన్. గోపీ నానీకి నిర్దిష్టమైన రూపాన్ని అందించిన ప్రముఖుడు. అప్పటికే మినీ కవిత్వం, హైకూ వంటి ప్రక్రియలు సంక్షిప్త కవిత్వానికి ఒక నేపథ్యాన్ని సిద్ధం చేశాయి. ఆ వాతావరణంలో నానీ తన ప్రత్యేక నిర్మాణంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించింది.

### నానీ రూప నిర్మాణం:

నానీని ఇతర సంక్షిప్త కవితా ప్రక్రియలతో పోల్చినప్పుడు దాని నిర్మాణ వైశిష్ట్యం స్పష్టమవు తుంది. మినీ కవిత ప్రధానంగా సంక్షిప్తతకు ప్రాధాన్యం ఇస్తుంది. హైకూకు నిర్దిష్టమైన పాద నిర్మాణం, అక్షర పరిమితి వంటి నియమాలు ఉన్నాయి. నానీ కూడా సంక్షిప్తతను స్వీకరించినప్పటికీ, దాని నిర్మాణం వాటికి పూర్తిగా అనుకరణగా ఉండదు.

నానీ సాధారణంగా నాలుగు పాదాల నిర్మాణంతో కనిపిస్తుంది. సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదు అక్షరాల పరిధిలో భావాన్ని కేంద్రీకరించడమే దాని స్వభావంగా చెప్పవచ్చు. అయితే దాని సాహిత్య విలువను కేవలం అక్షరాల సంఖ్యతో నిర్ణయించడం సాధ్యం కాదు. ఒక చిన్న పరిమాణంలో సంపూర్ణమైన భావానుభూతిని కలిగించగలగడం నానీ అసలు లక్షణం.

ఇక్కడ సంక్షిప్తత ఒక పరిమితి మాత్రమే కాదు. అది సృజనాత్మక అవకాశంగా మారుతుంది. కవి అనవసరమైన వివరణకు వెళ్లకుండా భావానికి అవసరమైన పదాలను మాత్రమే ఎంచుకోవాల్సి వస్తుంది. అందువల్ల ప్రతి పదం భావ నిర్మాణంలో పాత్ర వహిస్తుంది. ముఖ్యంగా చివరి పాదం ముందున్న భావాన్ని మరో కోణంలో చూపించడం, వ్యంగ్యాన్ని బలపరచడం లేదా ఆలోచనకు అవకాశం కల్పించడం వంటి పనులను చేయగలదు.

### వస్తువు, రూపం, అభివ్యక్తి:

నానీని అర్థం చేసుకోవడానికి వస్తువు—రూపం—అభివ్యక్తి అనే మూడు అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. కవి తన చుట్టూ కనిపించే ప్రపంచాన్ని పరిశీలించి, అందులోని ఒక ప్రత్యేకమైన అనుభవాన్ని కవితా వస్తువుగా స్వీకరిస్తాడు. రూపం విషయానికి వస్తే సంక్షిప్తత ప్రధాన లక్షణం. కానీ ఆ సంక్షిప్తత భావాన్ని కుదించడమే కాదు, దానిని కేంద్రీకరిస్తుంది. విస్తృతమైన సామాజిక సమస్యను కొన్ని పాదాల్లోనే సూచించాల్సి రావడం వల్ల కవి తన భాషను మరింత సాంద్రంగా మలచుకుంటాడు. అభివ్యక్తి విషయంలో నానీకి సృజనాత్మక స్వేచ్ఛ కనిపిస్తుంది. కవి తన భావాన్ని ప్రత్యక్షంగా చెప్పవచ్చు, వ్యంగ్యంగా చెప్పవచ్చు,ఒక ప్రతీక ద్వారా సూచించవచ్చు, రెండు విరుద్ధమైన దృశ్యాలను పక్కపక్కన ఉంచి పాఠకుడే అర్థాన్ని నిర్మించుకునేలా చేయవచ్చు. అందువల్ల నానీ పాఠకుడిపై బోధనా ప్రభావం చూపడం కంటే, ఆలోచనను ప్రేరేపించే అవకాశం ఎక్కువగా కల్పిస్తుంది.

### నానీ– దేశీయత, సామాజిక స్పృహ:

నానీని దేశీయ కవితా ప్రక్రియగా చూడటానికి ప్రధాన ఆధారం దాని వస్తు స్వభావం. నానీలో కనిపించే జీవిత దృశ్యాలు తెలుగు సమాజానికి సంబంధించినవే. గ్రామం, పట్టణం, కుటుంబం, రాజకీయ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, కుల వ్యవస్థ, ఉపాధి కోసం వలసలు వంటి అంశాలు నానీకి సహజమైన వస్తువులయ్యాయి. దేశీయత అంటే ఇతర సాహిత్య ప్రభావాలను పూర్తిగా నిరాకరించడం కాదు. ఆధునిక సాహిత్యంలో ఒక ప్రక్రియ మరొక ప్రక్రియతో సంభాషించడం సహజం. కానీ ఆ ప్రభావాన్ని తన సామాజిక అనుభవంలోకి

మార్చుకుని, కొత్త రూపంలో వ్యక్తం చేయడం ద్వారా తెలుగు కవిత్వం తన స్వతంత్రతను ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో నానీకి వచ్చిన దేశీయ స్వరూపం దాని ప్రత్యేకతను తెలియజేస్తుంది.

నానీలలో సామాజిక స్పృహ ఒక ముఖ్యమైన వ్యక్తీకరణ ధోరణిగా కనిపిస్తుంది. సమాజంలోని సమస్యలను పెద్ద ఉపన్యాసాల రూపంలో వివరించకుండా వాటిలోని ఒక కీలకమైన వైరుధ్యాన్ని పట్టుకుని కవితగా మలచడం నానీకి సాధ్యమైంది. అన్యాయం, అవినీతి, దోపిడీ, రాజకీయ స్వార్థం, కుల వివక్ష, సామాజిక అసమానతలు వంటి అంశాలు కవుల దృష్టిని ఆకర్షించాయి. వీటిని వ్యక్తీకరించేటప్పుడు కవులు నేరుగా తీర్పు చెప్పడం కంటే పరిస్థితిని ఒక దృశ్యంగా లేదా వ్యంగ్యంగా పాఠకుడి ముందుంచుతారు. ఈ విధానం వల్ల నానీలో సామాజిక విమర్శ ఒక సహజమైన కవితా లక్షణంగా మారింది.సామాజిక స్పృహ కలిగిన నానీ పాఠకుడిని కేవలం సమస్య గురించి తెలుసుకునే స్థాయిలో ఆపదు. ఆ సమస్య ఎందుకు ఏర్పడింది? దాని వెనుక ఉన్న సామాజిక నిర్మాణం ఏమిటి? మనిషి దానిని ఎలా స్వీకరిస్తున్నాడు? అనే ప్రశ్నలకు దారితీసే అవకాశం కల్పిస్తుంది.ఈ కారణంగా నానీకి ప్రశ్నించే సాహిత్య స్వభావం ఏర్పడుతుంది.

**రాజకీయ జీవితంపై నానీల స్పందన:**

సమకాలీన రాజకీయ వ్యవస్థ నానీ కవులకు ముఖ్యమైన వస్తువుగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు, అధికారంలోకి వచ్చిన తరువాత మారే రాజకీయ ప్రవర్తన, ప్రజాసేవకు బదులుగా వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే ధోరణి వంటి అంశాలను కవులు గమనించారు.

సోమపల్లి వెంకటసుబ్బయ్య రచించిన నానీలో

"అదే

వాగ్దాన పరంపర

అందలం ఎక్కేదాకా

అసలు రంగు తెలియదు" *('తొలకరి చినుకులు', పుట 30)*

ఈ నానీలో ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల మాటలకు, అధికారాన్ని పొందిన తర్వాత వారి ప్రవర్తనకు మధ్య ఏర్పడే వ్యత్యాసాన్ని కవి ఒక చిన్న దృశ్యంగా కేంద్రీకరించాడు. 'వాగ్దానం' మరియు 'అసలు రంగు' అనే భావాల మధ్య ఉన్న అంతరం రాజకీయ జీవితంలోని ఒక సామాజిక అనుభవాన్ని సూచిస్తుంది. ఇక్కడ నానీ రాజకీయ వ్యాఖ్యగా మాత్రమే నిలవకుండా, ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్రను కూడా పరోక్షంగా గుర్తుచేస్తుంది.

అదే రచయితకు చెందిన మరో నానీలో

"రాజకీయ తెరపై

ప్రధాన భూమిక అర్థం కాదు

స్వార్థం" *('తొలకరి చినుకులు', పుట 35)*

ఈ నానీలో 'ప్రధాన భూమిక' అనే నాటకీయ పదప్రయోగం రాజకీయ వ్యవస్థను ఒక వేదికగా ఊహింపజేస్తుంది. ఆ వేదికపై ప్రజాసేవ, సిద్ధాంతాలు వంటి పదాలకంటే 'స్వార్థం' ముందుకు రావడాన్ని కవి వ్యంగ్యంగా సూచిస్తున్నాడు. ఇక్కడ కొద్దిపాటి పదాలతోనే రాజకీయ వ్యవస్థపై విస్తృతమైన సామాజిక వ్యాఖ్య సాధ్యమైంది.

**కుల వ్యవస్థ:**

సమాజంలోని కుల నిర్మాణం కూడా నానీలలో ప్రశ్నించబడిన అంశాలలో ఒకటి. ఆధునికీకరణ, పట్టణీకరణ, శాస్త్రసాంకేతిక అభివృద్ధి వంటి మార్పులు జరిగినప్పటికీ కుల భావన పూర్తిగా అదృశ్యం కాలేదనే వాస్తవాన్ని తీవ్రంగా సూచిస్తుంది.

తుమ్మిడి నాగభూషణం నానీలో

"భూకంపం నిలువెత్తు భవనాలు కూల్చింది

కులం మాత్రం అలాగే నిల్చుంది" *('తెలుగు సాహిత్య చరిత్ర', పుట 620)*

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


ప్రకృతి శక్తి మరియు సామాజిక నిర్మాణం మధ్య ఒక విరుద్ధతను కవి సృష్టించాడు. భూకంపం భౌతిక నిర్మాణాలను ధ్వంసం చేస్తుంది. కానీ సమాజంలో మనుషులు నిర్మించుకున్న కుల విభజన మాత్రం కొనసాగుతుంది. అంటే భౌతిక ప్రపంచాన్ని కదిలించే ప్రకృతి శక్తికంటే సామాజికంగా మనుషుల మనస్సుల్లో ఏర్పడిన విభజనలు మరింత సంక్లిష్టమైనవని ఈ నానీ పాఠకుడిని ఆలోచింపజేస్తుంది.

**గ్రామీణ వలసల సామాజిక నేపథ్యం:**

ఆధునిక సమాజంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు జరిగే "వలస" ఒక ముఖ్యమైన సామాజిక పరిణామం. ఉపాధి, జీవనోపాధి, ఆర్థిక అవకాశాల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలను ఆశ్రయించడం వల్ల గ్రామీణ జీవన నిర్మాణంలో మార్పులు వచ్చాయి. ఈ మార్పును కూడా నానీ కవిత్వం గుర్తించింది.

సోమపల్లి వెంకటసుబ్బయ్య నానీలో

"పల్లె బాల్యం
పట్నం చేరింది
ఉత్సాహంగా ఊడిగం చేయడానికి" *('తొలకరి చినుకులు', పుట 28)*

'పల్లె బాల్యం' అనే ప్రయోగం కేవలం గ్రామంలోని చిన్నారులను మాత్రమే సూచించదు. ఉపాధి కోసం పట్టణాలకు తరలిపోయే గ్రామీణ యువతను కూడా సూచించే విస్తృత సామాజిక భావాన్ని కలిగిస్తుంది. పట్టణం వారికి ఉపాధి అవకాశాన్ని అందించినప్పటికీ ఆ వలస వెనుక గ్రామీణ జీవన ఖాళీ కూడా ఏర్పడుతుంది. కాబట్టి ఈ నానీని వలసను మాత్రమే వర్ణించే కవితగా కాకుండా గ్రామీణ జీవన మార్పుపై స్పందనగా చూడవచ్చు.

**నానీ – సామాజిక విమర్శకు సంక్షిప్త రూపం:**

నానీల సామాజిక ప్రాధాన్యాన్ని పరిశీలించినప్పుడు ఒక ముఖ్యమైన అంశం స్పష్టమవుతుంది. నానీ సమాజంపై ఉపన్యాసం చేయదు. పరిస్థితిని చూపిస్తుంది. ఆ పరిస్థితిలోని వైరుధ్యాన్ని పాఠకుడికి అనుభూతి చేయిస్తుంది. తద్వారా విమర్శ పాఠకుడి ఆలోచనలో కొనసాగుతుంది.

రాజకీయ వాగ్దానాలపై రాసిన నానీ ఒక ఎన్నికల సంఘటనను మాత్రమే సూచించినట్లు కనిపించినా దాని వెనుక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పాత్ర, నాయకత్వపు బాధ్యత, హామీల విశ్వసనీయత వంటి విస్తృతమైన ప్రశ్నలు ఉంటాయి. కుల వ్యవస్థపై రాసిన నానీ కూడా ఒక సామాజిక వాస్తవాన్ని మాత్రమే చూపించినట్లు కనిపించినా, దాని వెనుక సమానత్వం, సామాజిక న్యాయం, మానవ సంబంధాల వంటి విస్తృతమైన అంశాలు ఉన్నాయి.

ఈ విధంగా నానీ యొక్క పరిమాణం చిన్నదైనా, దాని భావ పరిధి విస్తృతమవుతుంది. సంక్షిప్తత ఇక్కడ భావ పరిమితిగా కాకుండా భావ విస్తరణకు కారణమవుతుంది

**నానీలలో వ్యక్తిత్వ చిత్రణ – సాహిత్య ప్రాధాన్యం:**

నానీలలో సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిత్వ చిత్రణకు కూడా అవకాశం ఏర్పడింది. ఒక రచయిత, విమర్శకుడు, కళాకారుడు లేదా సాహిత్య వ్యక్తి గురించి విస్తృతమైన జీవిత చరిత్రను చెప్పకుండా అతని వ్యక్తిత్వంలోని ఒక ప్రధాన లక్షణాన్ని గుర్తించి సంక్షిప్తంగా వ్యక్తీకరించడం నానీ రూపానికి అనుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో ద్వానా శాస్త్రి రచించిన **'సాహిత్య నానీలు'** ప్రస్తావించదగినది. ఇందులో సాహిత్యరంగానికి చెందిన వివిధ వ్యక్తులను నానీ రూపంలో పరిచయం చేసే ప్రయత్నం కనిపిస్తుంది. రచయితలు, రచయిత్రులు, విమర్శకులు, అవధానులు, కళారంగానికి చెందిన వ్యక్తులు వంటి విభిన్న రంగాల వ్యక్తిత్వాలు ఈ ప్రక్రియలోకి వచ్చాయి.

దాశరథి రంగాచార్య వ్యక్తిత్వాన్ని సూచించే నానీ

"అభ్యుదయ రంగాచార్యకేముంది
వేదాల పర్సువేదిని పట్టుకున్నాడు"

దాశరథిలోని సాహిత్య స్వభావాన్ని కొద్దిపాటి పదాల ద్వారా గుర్తుచేసే ప్రయత్నం కనిపిస్తుంది. ఇక్కడ నానీ ఒక వ్యక్తి

పరిచయానికి ప్రత్యామ్నాయ రూపంగా పనిచేస్తుంది. ఇది నానీకి ఉన్న వస్తు వైవిధ్యాన్ని సూచిస్తుంది.

నానీ ఒక నిర్దిష్ట రచయితతో మాత్రమే పరిమితం కాకుండా అనేక మంది కవుల సృజనాత్మక భాగస్వామ్యంతో విస్తరించింది. ఎస్సార్ భల్లం, తలకోటి పృధ్విరాజ్, యశశ్రీ రంగనాయకి, శిఖామణి, తుమ్మిడి నాగభూషణం, నేతల ప్రతాప్ కుమార్, ద్వానా శాస్త్రి తదితరులు నానీ కవితా సృజనలో భాగస్వాములయ్యారు. వీరి రచనలను పరిశీలించినప్పుడు నానీ ఒకే రకమైన భావానికి పరిమితమైన రూపం కాదని తెలుస్తుంది. వ్యక్తిగత అనుభూతి నుంచి సామాజిక సమస్య వరకు, సాహిత్య వ్యక్తిత్వం నుంచి రాజకీయ వ్యవస్థ వరకు వివిధ వస్తువులు ఇందులోకి ప్రవేశించాయి. ఈ వస్తు వైవిధ్యమే నానీ ప్రక్రియకు విస్తృతమైన సాహిత్య పరిధిని కల్పించింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ప్రక్రియ ఏర్పడటం అంటే కేవలం కొత్త పేరుతో ఒక రూపం రావడం కాదు.ఆ రూపం కాలానుగుణమైన అనుభవాన్ని వ్యక్తీకరించగల సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి. నానీ ఈ విషయంలో తన ప్రత్యేకతను ప్రదర్శించింది. సంక్షిప్తమైన నిర్మాణం ఆధునిక పాఠకుడి పఠన అనుభవానికి అనుకూలంగా ఉండటంతో పాటు, కవికి భాషను సాంద్రీకరించే అవకాశం కల్పించింది. సామాజిక సమస్యలను ప్రత్యక్షంగా చెప్పకుండా వ్యంగ్యంగా, సూచనాత్మకంగా చెప్పడం ద్వారా నానీ కవిత్వం పాఠకుడి భాగస్వామ్యాన్ని పెంచింది. మరోవైపు నానీల ద్వారా సమకాలీన సాహిత్య, సామాజిక, రాజకీయ పరిణామాలను నమోదు చేయడం కూడా సాధ్యమైంది. ఒక కాలపు ఆలోచనలు, ఆందోళనలు, వైరుధ్యాలు చిన్న కవితా రూపాల్లో నిలిచిపోవడం వల్ల నానీలు భవిష్యత్ సాహిత్య అధ్యయనానికి ఉపయోగపడే పాత్యంగా మారే అవకాశం ఉంది.

**ముగింపు:**

నానీ ఆవిర్భావాన్ని ఆధునిక తెలుగు కవిత్వంలోని ప్రయోగాత్మక చైతన్యానికి ప్రతీకగా చూడవచ్చు. సంక్షిప్తతను ఆధారంగా చేసుకున్నప్పటికీ, అది భావవ్యాప్తిని తగ్గించలేదు. వస్తువును సమకాలీన జీవితంలో నుంచి స్వీకరించడం, రూపాన్ని కేంద్రీకృతంగా నిర్మించడం, అభివ్యక్తికి తగిన స్వేచ్ఛను కల్పించడం ద్వారా నానీ తనదైన కవితా వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకుంది.

నానీలలో వ్యక్తమైన రాజకీయ, సామాజిక అంశాలను పరిశీలిస్తే సమాజంపై కవి దృష్టి ఎంత చురుకుగా పనిచేసిందో తెలుస్తుంది. రాజకీయ వాగ్దానాల వెనుక ఉన్న స్వార్థాన్ని ప్రశ్నించడం, కుల నిర్మాణం యొక్క స్థిరత్వాన్ని విమర్శించడం, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు జరిగే వలసలను గమనించడం వంటి అంశాలు నానీకి సామాజిక దృష్టిని ఇచ్చాయి. ఈ రచనల్లో కవి సమాజానికి నేరుగా తీర్పు ఇవ్వడం కంటే, ఒక పరిస్థితిని పాఠకుడి ముందుంచి అతని ఆలోచనను మేల్కొల్పే పద్ధతిని అనుసరించాడు.

ఆచార్య ఎన్ .గోపి ,ఎస్సార్ భల్లం, తలతోటి పృధ్విరాజ్, యశశ్రీ రంగనాయకి, శిఖామణి, తుమ్మిడి నాగభూషణం, నేతల ప్రతాప్ కుమార్, ద్వానా శాస్త్రి తదితరుల రచనా భాగస్వామ్యం నానీ ప్రక్రియ విస్తరణకు దోహదపడింది. సాహిత్య వ్యక్తిత్వాలను పరిచయం చేయడం నుంచి సామాజిక సమస్యలను ప్రశ్నించడం వరకు నానీ తన వస్తు పరిధిని విస్తరించుకుంది. ద్వానా శాస్త్రి 'సాహిత్య నానీలు' వంటి ప్రయత్నాలు నానీని వ్యక్తిత్వ చిత్రణకు కూడా అనుకూలమైన ప్రక్రియగా నిలబెట్టాయి.

అంతిమంగా నానీని కేవలం నాలుగు పాదాల చిన్న కవితగా నిర్వచించడం దాని సాహిత్య సామర్థ్యాన్ని పరిమితం చేయడమే అవుతుంది. అది ఆధునిక తెలుగు సమాజంలోని అనుభవాలను సంక్షిప్తంగా నమోదు చేసే ఒక కవితా సాధనం,సామాజిక వైరుధ్యాలను వెలుగులోకి తీసుకువచ్చే విమర్శనా రూపం. వస్తువు విషయంలో సమకాలీనత, రూపంలో సంక్షిప్తత, అభివ్యక్తిలో స్వేచ్ఛ, దృష్టిలో సామాజిక చైతన్యం. ఈ నాలుగు లక్షణాల సమన్వయం నానీకి ప్రత్యేకమైన సాహిత్య వ్యక్తిత్వాన్ని అందించింది. అందువల్ల ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో నానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకున్న ప్రక్రియగా గుర్తించవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1. తుమ్మిడి నాగభూషణం —— తెలుగు సాహిత్య చరిత్ర.
2. ద్వానా శాస్త్రి —— సాహిత్య నానీలు
3. వెలమలసిమ్మన్న– తెలుగు సాహిత్య చరిత్ర.
4. సోమపల్లి వెంకటసుబ్బయ్య —— తొలకరి చినుకులు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# పాలేరు పాత్రలు – సమాజ ప్రతిబింబాలు

–డా. వాసిరెడ్డి భవాని
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర )
గుంటూరు.
చరవాణి:9441289475.

**సంక్షిప్త పరిచయం:**

**నాటకము నిర్వచనము:**

''వినోదకరణం లోకే నాట్య మేతద్భవిష్యతి'' అని భరతముని తన నాట్య శాస్త్రంలో చెప్పి ఉన్నారు. వాక్కులమ్మ నిండియున్న వాం–గ్మయమునందు నాటకం యొక్క పాత్ర అత్యంత శక్తివంతమైనది.అంతే కాదు నాటకాన్తంహి సాహిత్యం అను నానుడి మనకు తెలిసినదే కదా.ఈ నాటకమునే పూర్వము దృశ్యకావ్యమనియు రూపకమనియు పిలిచేవారు. రూపకము మానవ ప్రకృతికి ప్రతిబింబం అని ప్రాచ్య పాశ్చాత్యలాక్షణికులు తెలిపి యున్నారు. పండిత పామరులను రసరమ్య లోకములలో విహరింప చేయగల శక్తి నాటకందేనని చెప్పక తప్పదు. తెలుగు నందు ఈ నాటక పదము తిక్కన గారి కవిత్వము నుండే పుట్టినదని చెప్పవచ్చును. మహాభారతము నందలి తిక్కన గారు రచించిన మహాభారతపర్వములను చదువుతున్నప్పుడు ఆ పాత్రలను మనం పరిశీలించినట్లయితే అవి మనఎదుట మాట్లాడుకొనుచున్నట్లే మనకనిపిస్తుంది. కనుకనే ఆ పాత్రలు ఇప్పటికీ ప్రజల మనసుల్లో సజీవముగా ప్రత్యక్షమవుతున్నాయి.

**సాంఘిక నాటకం:**

సమకాలీన సంఘవ్యవస్థను జీవిత సత్యాలను విభిన్న మానవ ప్రవృత్తులను జీవన సంఘర్షణలను ప్రతిఫలింప జేయునది సాంఘిక నాటకం. ఇది సమాజమునకు దర్పణం వంటిది. ఆధునిక సమాజాన్ని శస్త్ర చికిత్స చేయడానికి సాహిత్యం ఒక ఆయుధం వలే పనిచేసింది.అందులోనాటకం యొక్క పాత్ర  చెప్పుకోదగినది. తొలి దశలో నాటకం వినోదం అందిస్తే మలిదశలో నాటకం ప్రజల్లో చైతన్యాన్ని నింపింది.తెలుగు నందలి తొలి సాంఘిక నాటకం గురజాడ వారి కన్యాశుల్కమేనని చెప్పవచ్చును. (1887) కన్యాశుల్కం తర్వాత ప్రజల రచయితల దృష్టి ఆకర్షించే సాంఘిక నాటకాలను అందించిన వారు కాళ్లకూరి నారాయణరావు గారు. గురజాడ వారి కన్యాశుల్కం ఆడపిల్లలను అమ్ముకునే అనాచారాన్ని ఎదిరిస్తే కాళ్ళకూరి వారి వరవిక్రయం వరుడిని నడిబజారులో వేలం వేసే దుశ్చర్యలను ఖండించినది. ఈ విధంగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న దురాచారాలలో అంటరానితనం కూడా ఒకటి. మనిషిని మనిషి దూరంగా పెట్టే ఈ సంస్కృతిని తీవ్రంగా ఖండించిన ప్రముఖులు అనేకులు కలరు.

తొలి దళిత కవిగా ప్రసిద్ధికెక్కినది కుసుమ ధర్మన్నఅయినా కవిత్వం ద్వారా దళితులకు ఒక స్థానాన్ని ఏర్పరిచిన వాడు గుర్రం జాషువా. వారి మార్గమున నడిచి దళితులలో ఆత్మస్థైర్యమును నెలకొల్పిన మహనీయుడు బోయి భీమన్న గారు. దళితులకు ఒక అపూర్వ కానుకను పాలేరు నాటకం ద్వారా అందించిన మహనీయుడు పద్మశ్రీ బోయి భీమన్నగారు. కళా ప్రపూర్ణ బోయి భీమన్న గారు పాలేరు స్థాయి నుండి పద్మశ్రీ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తిత్వం కలవారు ఈయన పాలేరు నాటకం ఆంధ్రదేశంలో విశిష్ట సన్మానాలు గండపెండెరాలను కనకాభిషేకాలను అందించి పాలేరు పేరు వినగానే భీమన్న గారు భీమన్న పేరు వినగానే పాలేరు నాటకం జ్ఞాపకం వచ్చే విధంగా పేరు తెచ్చుకుంది. ఈ నాటకంలోని వచన రచన లబ్ద ప్రతిష్టలను చేసినది. తెలుగు భాషా సరస్వతి మణిహారంలో కొలికి పూస భీమన్న గారు. గుడిసెలలో పుట్టి గుడిసెలలో ఎదిగిన తనకు "గుడిసెలు కాలిపోతున్నాయి" అనే కవితకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం చాలా ఆశ్చర్యకరమైన విషయం అని అనేవారు.

భీమన్న గారి రచనలను గూర్చి ప్రస్తావించవలసి వస్తే అది మరో కావ్యమవుతుంది. ఆంధ్ర రాష్ట్రమంతటిని కదిలింప చేసిన నాటకాలలో పాలేరు, కూలిరాజు ముఖ్యమైనవి. పాలేరు నాటకం చూసి చైతన్యవంతమై విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్ద బడినవారు కోకొల్లలు. వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ ఆఫీసర్ శ్రీ కాకి మాధవరావు గారి మాటల్లో "నేను పాలేరుని పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు దిద్ది కలెక్టర్ స్థాయికి చేరుకున్నాను. ఈ నాటకం చూడకపోతే నేను అనామకుడిగా మిగిలిపోయే వాడినేమో" బోయి భీమన్నగారి ఋణం తీర్చుకోలేనిది అని ఎన్నో సందర్భాల్లో చెప్పి ఉన్నారు.ఈ నాటకములోని పాత్రలను నిశితంగా పరిశీలించిన యెడల ఆ నాటిసమాజ ప్రతిబింబాల వలె మనకు కన్పిస్తాయి.

**కీలక పదాలు :** పాలేరు–కామందు–సంస్కారం–విజ్ఞాన వంతులు–అభివృద్ధి–చైతన్యవంతులు–ఆదర్శ భావాలు–త్యాగం–కార్య దీక్ష–అక్షరాస్యత.

### పాలేరు నాటకము–పాత్రల పరిచయం

1. **వెంకన్న:** ఈ కథకు కథానాయకుడు చిన్ననాడే కుబేర్రావు వద్ద పాలేరుగా పెట్టబడినవాడు చదువుకుని కలెక్టర్ అయినాడు.
2. **పుల్లిగాడు**: వెంకన్న తండ్రి కుబేర్రావు దగ్గర పెద్ద పాలేరు.
3. **వీరేశు**: వెంకన్నకు పిన తండ్రి పుల్లయ్య తమ్ముడు.
4. **ఉపకారి మాస్టారు**:– రైతు వాడ గ్రామప్రజలను చైతన్యవంతుల్ని చేసి అందరినీ అక్షరాస్యులను చేయాలనుకున్నవాడు.
5. **వనబాల:** రైతు వాడలోని సంపన్నుల బిడ్డ. ఆదర్శ భావాలు గల బాలిక వెంకన్నను చదువుకి ప్రోత్సహించి అతనిని ప్రేమించినది.
6. **సుందరం:** బాల అన్నయ్య, సంస్కారం కల మనిషి అభ్యుదయ భావాలు కలవాడు.
7. **సీతమ్మ**: వెంకన్నకు పిన్ని వరసచుట్టం వీరేశు ప్రేమికురాలు తల్లి లేని వెంకన్నను తల్లిలా చూచుకునేది.
8. **కుబేర్రావు:** భూస్వామి వర్గానికి ప్రతినిధి, కామందు తనంతో పెత్తనం చెలాయించేవాడు సీత అనే స్త్రీని తన అధికారంతో చేరచడానికి ప్రయత్నం చేశాడు.
9. **రామం:** కాకినాడ అనాథ శరణాలయం మేనేజరు, సుందరం స్నేహితుడు వెంకన్నకు విద్యాబుద్ధులు నేర్పించిన వాడు.
10. **దొంగ రామన్న:** కుబేర్రావు దగ్గర రౌడీ. వెంకన్న, సీత, వీరేశులు ఊరు వదిలి వెళ్ళినప్పుడు వాళ్ళని వెతికే పనిమీద పట్నం వెళతాడు.

### పాత్రల స్వభావములు–విశ్లేషణ:

**వెంకన్న:** పాలేరు నాటకం నందలి కథానాయకుడు. కుబేర్రావు అనే అహంకారి కామందు వద్ద అణిగిమణిగి ఉండలేక అసహనంతో పని చేసే పాలేరు. చదువు అంటే అపరితమైన ఆసక్తి కలవాడు. దూడల్ని మేపుతూ తలపాగాలో పుస్తకం తీసి చదువుతూ ఉండేవాడు. సమాజంలో హెచ్చుతగ్గులు లేకుండా ఉండాలని సందేశ గీతాలు పాడేవాడు. తన వయసు కల సంపన్నుల బిడ్డ అయిన బాలతో స్నేహంగా ఉండేవాడు. ఆ చెలిమిలో తన కష్టాలకు ఓదార్పు లభించినట్లు తలచేవాడు. బిడ్డల అభివృద్ధి కోరని తన తండ్రి లాంటి వారిని అయిష్టంగా తలచేవాడు. పెద్ద పాలేరు కొడుకు చినపాలేరు కావాల్సిందేనా? ఈ నీచ పరిస్థితికి పేదరికమే కారణం కనుక ఈ పాలేరులంతా గొడ్డుమోతులు అయితే బాగుండని భావించేవాడు. ఇలా స్వతంత్రంగా ఆలోచించేవాడు.

అదే గ్రామంలో ఉపకారి అనే మాస్టారు పిల్లల్ని బడికి పంపించమంటూ సందేశాత్మక గేయాలను పాడేవాడు. ఉపకారిమాష్టారి హిత వాక్యాలను వెంకన్న బాగా ఆకలింపు చేసుకునేవాడు. వెంకన్న చదువుపై ఆసక్తి పెంచుకుంటున్నాడు అని తెలిసిన కుబేర్రావు వెంకన్న తండ్రిని పిలిచి మందలిస్తాడు. వెంకన్నతండ్రి పుల్లయ్య కొడుకును చితక్కొట్టి అడ్డు వచ్చిన ఉపకార మాస్టారు తో మాకు చదువు అచ్చి రాదని తెగేసి చెప్తాడు. వెంకన్న లాంటి రత్నం పుల్లయ్య కడుపున పుట్టడం అతని దురదృష్టమని తలచి ఎలాగైనా వెంకన్నను ఉద్ధరించాలనిఉపకారి మాష్టారు అనుకోవడం వెంకన్న జీవితంలో ఒక చక్కని మలుపుగా భావించవచ్చును. చదవులేని బ్రతుకు వ్యర్థమని

ఆత్మహత్య చేసుకోబోతున్న వెంకన్నను ఉపకారి మాస్టారు ఆపి అతనిని చదివిస్తానని హామీ ఇచ్చి సుందరం, బాల సహాయంతో కాకినాడ అనాథ శరణాలయానికి చేర్చుతాడు.ఆపరిస్థితుల్లో పట్టుదలగా చదువుకున్న కార్యశీలివెంకన్న. బి.ఏ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగంలో చేరి ఎందరికో ఆదర్శవంతమైన పాత్రగా తీర్చిదిద్దబడ్డాడు.

తాను ప్రేమించిన తనను ప్రేమించిన బాలకు తన స్నేహితుడైన రామంతో పెళ్లి నిశ్చయమైనప్పుడు తన మనసును బయటపెట్టని గంభీర స్వభావము కలవాడు. తన గ్రామంలో జరిగిన వ్యాజ్యంలో న్యాయానికి నిలబడి ధర్మ రక్షణ చేసి చిన్ననాడు తనను కష్టాలపాలు చేసిన కుబేర్రావుని సైతం క్షమించిన మనసున్న మనిషి. ఇష్టం లేని వివాహం చేసుకోలేక బాలనూతిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయినపుడు సమయానికి రక్షించిన ప్రాణప్రదాత. సుందరం విషయాన్ని తెలుసుకుని బాలను వెంకటేశ్వరరావుకిచ్చి వివాహం జరిపించాడు. ఈ విధంగా సమాజం కులమతాల అడ్డుగోడలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించి సఫలీకృతుడైన సజీవ పాత్ర వెంకన్నది.

**పుల్లయ్య :** వెంకన్న తండ్రి పుల్లయ్య కుబేర్రావు వద్ద పాలేరు. అమాయకుడు ,అజ్ఞాని నిరక్షర కుక్షి పేదవాడు కడజాతిలో పుట్టినందుకు అందరికీ అణిగిమణిగి ఉండాలనుకునేవాడు. కామందు అయిన కుబేర్రావు చెప్పిన మాటనే వేదంగా భావించేవాడు. తన వలెనే తన కొడుకు జీవితం కూడా ఉండాలనుకునేవాడు. వెంకన్న రాత్రి బడిలో చేరినట్లు తెలుసుకున్న కామందు పుల్లయ్య ను పిలిచి పాలేరు గాడిదకు చదివేందుకురా? అని అంటే కొడుకుని చితక్కొట్టాడు. ఉపకారి మాష్టారు తో మాకు చదువు అచ్చిరాదని తెగేసి చెప్పాడు. కామందు పుల్లయ్యను అనాదరంతో తనను బయటకు నెట్టినప్పుడు ఈ కామందు కోసం కష్టపడి నా జీవితాన్ని కుటుంబాన్ని నాశనం చేసుకున్నానని బాధ పడతాడు. కొడుకు కలెక్టరయ్యాడని పట్టలేని ఆనందంతో కలెక్టర్ బంగ్లా వద్దకు వెళ్లి కొడుకుని చూసుకుని మురిసిపోయాడు.

**ఉపకారి మాస్టారు** : ఈ ఉపకారి మాస్టారు పాత్ర ఈ నాటకమునకే ఆయువుపట్టు. సమాజాన్ని ఉద్ధరించడమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న పంతులు ఉపకారి. తాను అనుకున్న గమ్యాన్ని సాధించడం తప్ప మరేమీ పట్టించుకోని కార్యదీక్షా పరుడు. పల్లెలలోని అజ్ఞానాన్ని రూపుమాపడానికి ప్రయత్నం చేశాడు. పల్లెల్లోని పిల్లల బడిబాట పట్టించేందుకు ప్రబోధ గీతాలను ఆలపిస్తూ తిరుగుతుండేవాడు. పసిపిల్లలను పాలేరుగా మార్చి జాతిని శక్తి హీనం చేయకండి నేటి బాలలే రేపటి పౌరులు అంటూ చెప్పేవాడు. భరతమాత యెడల ఎనలేని గౌరవం కలిగిన వాడు దేశం అజ్ఞానాంధకారంలో ఉంటే బానిసత్వమునకు గురి అవుతుందని ప్రజలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. పాలేరైన వెంకన్నను కలెక్టర్ గా మార్చడం వెనక ఉపకారి మాస్టర్ పాత్ర ఎంతైనా ఉన్నది. “అజ్ఞానాంధకారస్య జ్ఞానాంజన శలాకయా” అను పదానికి అసలైన అర్థం గా ఉపకారిమాష్టారిని మనం చెప్పుకోవచ్చును.

**వనబాల :** పాలేరు నాటకము నందలి కథానాయక పాత్ర వనబాలది. చిన్నతనం నుంచి ధనిక, బీద తేడాలకు తాను దూరం అన్నట్లుగా పెద్ద మనసుతో పాలేరు వెంకన్నతో స్నేహం చేస్తుంది. పొలం గట్లపై వెంకన్న పాడే పాటలకు ఆకర్షితురాలు అవుతుంది. గేదె తరిమినప్పుడు భయంతో వెంకన్న ఒడిలో పడుతుంది. కులం తక్కువైనా వెంకన్న అని నోరార పిలుస్తుంది. అన్నయ్య సుందరం ఆదర్శభావాలకు ప్రతినిధి. అతనితో వెంకన్న తెలివిని గూర్చి గొప్పగా చెబుతుంది. ఆకలితో ఉన్న వెంకన్నకు రోజు ఏదో ఒకటి పెట్టి కడుపు నింపేది. వెంకన్నను కాకినాడ పంపించి చదివించడంలో బాల పాత్ర చెప్పుకోదగినది. వెంకన్న పై ఖర్చులు చదువుల కోసం ఆడవాళ్లు అపురూపంగా చూసుకునే నగలను తాను తృణప్రాయంగా త్యాగం చేస్తుంది. అది చూచిన ఉపకారి మాస్టారు బాల ఔన్నత్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. బాల అన్నయ్య సుందరం తన స్నేహితుడైన రామంతో వివాహం నిశ్చయించినప్పుడు ఆత్మహత్యకు సైతం వెనదీయలేదు. మనసు ఒకచోట మనువొకచోటఊహించుకోలేకపోయింది. తర్వాత విషయం తెలుసుకున్న బాల అన్నయ్య వెంకటేశ్వరరావుకిచ్చి చెల్లెలి వివాహం జరిపిస్తాడు. ఈ విధంగా నిమ్న జాతికి చెందినవాడైన వెంకన్నను మనసారా ప్రేమించిన అభ్యుదయ భావాలు కలిగినటువంటి యువతిగా వనబాల ను మనం భావించవచ్చును.

**సుందరం :** సుందరం బాలకు అన్నయ్య రైతువాడ గ్రామంలో కుబేర్రావుతో సమానంగా తూగగల ధనవంతులు. కుబేర్రావు ఎంత గర్వం కలవాడో సుందరం అంతటి నిగర్వి బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను జీర్ణించుకున్న వ్యక్తి. పల్లె పట్టులే దేశ సౌభాగ్యానికి నిలయాలని నమ్మిన వ్యక్తి వెంకన్న గురించి బాలచెప్పినప్పుడు అతనిని చదివించడానికి కాకినాడ హాస్టల్లో చేర్చడానికి తనవంతు సహకారాన్ని అందించిన స్నేహశీలి. వెంకన్నను మెట్రిక్యులేషన్ చదివించమని ప్రోత్సాహం ఇచ్చాడు.

రైతు వాడకు వచ్చి బాలవివాహాన్ని నిశ్చయించానని కుబే్రావుతో అన్నప్పుడు కులము మతము చూసుకొన క్కర్లేదా అని కుబేర్ రావు అడగగా రౌడీలకు దాసోహం అంటున్న ఈ సంఘాన్ని నేను లెక్క చేయనన్న ధైర్యవంతుడు. చెల్లెలు వెంకటేశ్వరరావుని ప్రేమించిందని తెలుసుకొని తన తప్పు తెలుసుకుని చెల్లెలి వివాహం వెంకటేశ్వరరావుతో జరిపించిన ఆదర్శ పురుషుడు సుందరం.

**రామం :** పాలేరు నాటకంలోని ముఖ్యపాత్రలలో రామం పాత్ర ఒకటి. కాకినాడ అర్బన్ సూపరిండెంట్ కుమారుడు రాము. బాగా చదువుకున్నవాడు సుందరం స్నేహితుడు వెంకన్న అర్బన్ ఏజ్ కి చేరలేదని తెలుసుకుని స్కౌట్స్ ని పంపి వెతికించాడు. వెంకన్న చదువుకు అన్ని విధాలా సహాయకారిగా ఉన్నాడు. రామం పెండ్లి బాలతో నిశ్చయమైందని తెలిసిన వెంకటేశ్వరరావు మనోవ్యథను గమనించి బాలను వెంకటేశ్వరరావుకి యిచ్చివివాహం చేయమని సిఫార్సు చేస్తాడు. ఈ విధంగా కథానాయకుడిని నాయికని కలిపి కథను సుఖాంతం చేయడానికి కీలకమైన భూమికగా రాము నిలిచిపోయాడు.

**కుబే్రావు :** పాలేరు నాటకంలోని భూస్వామ్య అహానికి ప్రతినిధి కుబే్రావు రైతు వాడలో ధనవంతుడు. పాలేరులను నీచంగా చూసేవాడు. వెంకన్న తెలివితేటలు సహించలేని దురహంకారి. తన దగ్గర ఉన్న పాలేరు లు తన చెప్పు కింద అణిగి మణిగి ఉండాలనుకునే మనస్తత్వం కలవాడు. పాలేరుకు చదివేందుకు అర్హతలేదనేవాడు. పాలేరు పనికి పాఠాలు ఎందుకు అని తిట్టేవాడు. వెంకన్న రాత్రి బడికి వెళ్తున్నాడు అని తెలిసి నానా రభస చేస్తాడు. వెంకన్న చేతిలో బాలయిచ్చిన అరటిపండ్లు చూసి నీ బతుక్కి అరటిపండ్లు ఎక్కడివి రా ఎన్నాళ్ళ నుండి ఈ దొంగతనాలు మొదలు పెట్టావని వెంకన్నను కొట్టబోతే ఉపకారి ధైర్యంగా అడ్డుపడతాడు. యజమానివైనా పరాయి బిడ్డను కొట్టే హక్కు నీకెక్కడిదని నిలదీస్తాడు. దాంతో ఉపకారి మీద పగ పెంచుకొని చంపించబోతాడు. దీన్నిబట్టి తనకి అడ్డొచ్చిన వారిని చంపించడానికి వెనుకాడని క్రూర మనస్తత్వం కలవాడు కుబే్రావని మనకు తెలుస్తున్నది. వీరేశు ప్రియురాలు అయిన సీత మీద మోహం తో ఆమెను బలాత్కరించడానికి ప్రయత్నిస్తాడు. దీన్నిబట్టి ఇతనికి లేని అవలక్షణం లేదనిరూఢి అవుతున్నది. తన దగ్గర పాలేరుగా పనిచేసిన వెంకన్న కలెక్టర్ గా క్యాంపు నిర్వహించి రైతు వాడకు వచ్చినప్పుడు వంగి నమస్కరించి తన అపరాధాన్ని మన్నించమంటాడు. అడుగడుగునా తనకు అడ్డుపడిన వ్యక్తిని కూడా ఉన్నత భావాలు కలిగిన వెంకటేశ్వరరావు క్షమించడంలో కుబే్రావులో మార్పు వస్తుంది.

**వ్యాస ప్రయోజనం:**

ఈ విధంగా పాలేరు నాటకం ఆనాటి సాంఘిక జీవనానికి దర్పణంగా సజీవమైన పాత్రలను అందించింది.ఆంధ్రదేశమంతటా ఈ నాటకం విజయవంతంగా ప్రదర్శించబడింది. ఈ నాటకం చూసిన ఎందరో యువకులు విద్యావంతులుగా తీర్చిదిద్దబడ్డారు. ఒక సాహితీ ప్రక్రియకు ఇంతకన్నా సాధించవలసిన విజయం ఇంకేముంటుంది పాలేరులను పాలకులుగా మార్చిన ఈ ఘనత కళా ప్రపూర్ణ డాక్టర్ బోయి భీమన్న గారికి దక్కిందనుట నిస్సంశయం అందుకు ఉదాహరణగా ఐఏఎస్ అధికారి అయిన డాక్టర్ కాకి మాధవరావు గారిని మనం సజీవ ఉదాహరణగా చెప్పుకోవచ్చును.

**ముగింపు:**

కులమతాల అడ్డుగోడలను కూలద్రోసి ధనిక,పేద వ్యత్యాసములను రూపుమాపడానికి,సమసమాజ నిర్మాణానికి ఈ పాలేరువంటినాటకాలయొక్కఆవశ్యకతఎంతైనావుంది.నిమ్నజాతులవారిఎదుగుదలకుదీనినిఒకదృష్టాంతంగాచెప్పుకొన వచ్చును. యువతబాధ్యతను గుర్తు చేసుకోవలసిన ఆవశ్యకతను ఈనాటకంద్వారా బోయిభీమన్నగారు చక్కగా తెలియపరచినారు.ఈ నాటకం ఆనాటి సమాజదర్పణం గా మనం భావింప వచ్చును.

**ఆధార గ్రంథాలు**

1. పాలేరు–నాటకం బోయిభీమన్నగారు.
2 . కన్యాశుల్కం గురజాడ అప్పారావు గారు.
3. తెలుగు నాటక వికాసము పి.ఎస్.ఆర్ అప్పారావుగారు.
4. తెలుగు సాహిత్య సమీక్ష జి.నాగయ్య

**సాహిత్య తరంగిణి**
**ISSN:3048-5908** **(తెలుగు పరిశోధన పత్రిక)** **Impact Factor:6.673 (SJIF)**
**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**
**A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.**

# వృత్తి కవిత్వం – సామాజిక చైతన్యం

**మదిరాజ్ నరేష్**
పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
చరవాణి: 9505781337
మెయిల్:madirajnaresh@gmail.com

**వ్యాససంగ్రహం:**

*"నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది...*
*ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీలెవ్వరు?"(శ్రీశ్రీ. 1950: 76)*

అంటూ సామాన్య ప్రజల జీవన చిత్రణను కవితా వస్తువుగా తీసుకునేందుకు ఆధునిక కవులకెందరికో శ్రీశ్రీ మార్గదర్శి అయ్యాడని చెప్పవచ్చు. ఈ దిశగా అనేక మంది కవులు తమ జీవిత నేపథ్యం నుంచీ కథలు, నవలలు, కవిత్వం వంటి సృజనాత్మక సాహిత్యం రాస్తున్నారు. తెలుగు సాహిత్యంలో అస్తిత్వ చైతన్యంలో భాగంగా అనేక మంది కవులు, మేధావులు తమ జీవితాలు, తమ అనుభవాలు, తమ వృత్తులు, తమ సంస్కృతులు, బాధలు, ఆకాంక్షలు మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటికి సంబంధించిన సాహిత్యం బలంగా ప్రతిఫలించట్లేదనే భావనతో కొత్తబాటలో సాహిత్య స్వరాలను తమదైన శైలిలో వినిపిస్తున్నారు. తమ గురించి తామే చెప్పుకోవడం, తమ జీవితాన్ని తామే అక్షరబద్ధం చేసుకోవడం, తమ అనుభవాలకు సాహిత్య గౌరవాన్ని కల్పించుకోవడం వంటివి ఈ అస్తిత్వ పోరాటంలో ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. ఈ క్రమంలో బి.సి. కవులు ఆత్మకథనాత్మక అనుభవాలను కవిత్వంగా వినిపిస్తూ బి.సి. వాదాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలోనే అనేక మంది కవులు తమ ఉనికిని కాపాడుకునే క్రమంలో భాగంగా విస్తృతమైన వృత్తి కవిత్వం రాస్తూ తమ అస్తిత్వాన్ని ,ఆత్మగౌరవాన్ని ప్రకటిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగిస్తున్నారు. ఈ పరిశోధనా వ్యాసంలో స్థాలీపులాకన్యాయంగా కవి వనపట్ల సుబ్బయ్య, శీలం భద్రయ్య, అవనిశ్రీ లు రాసిన వృత్తి కవిత్వాన్ని సామాజికత దృష్టితో పరిశీలించి, విశ్లేషించడమే ఈ పరిశోధనా వ్యాస ప్రధాన లక్ష్యం.

**కీలక పదాలు:** వృత్తి కవిత్వం, అస్తిత్వం, ప్రపంచీకరణ, వృత్తులు, బి.సి.ల చైతన్యం, రాజ్యాధికారం, ఆత్మగౌరవం, మదిరాజ్ నరేష్.

## 1. ఉపోద్ఘాతం:

మానవుడు సంఘజీవి. ఇతను సమాజంలో ఒక భాగంగా ఉంటూ అనేక విషయాలను గమనిస్తాడు. అరిస్టాటిల్ చెప్పినట్లు మానవునికి, సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుందని చెప్పిన విషయాలు అనేక సందర్భాల్లో రుజువు చేయబడతాయి. పుట్టిన ప్రతి మనిషి మీద సమాజంలోని అనేక అంశాల ప్రభావం ఉంటుంది. సాహిత్య సృష్టి అనేది కూడా సమాజంలో భాగంగానే జరుగుతుంది. తన చుట్టూ ఉన్న పరిసరాలు, కుటుంబ పరిస్థితులు, జీవన విధానం, జీవితంలో ఎదురౌతున్న సంఘటనలు, తల్లిదండ్రులు, మిత్రులు, పుస్తకాలు మొదలైన అంశాలన్ని ప్రతీ వ్యక్తిని ప్రభావితం చేస్తాయి. సమాజంలో తనకు జరిగిన, ఎదురైన సంఘటనల ద్వారా, ఎన్నో అనుభవాలను వస్తువుగా తీసుకొని కవులు తన ప్రతిభ ద్వారా సాహితీ సృజన కొనసాగిస్తారు. ఈ నేపథ్యంలోనే సామాజిక చైతన్యమే ఊపిరిగా చేసుకొని వృత్తి కవిత్వం వెలువరిస్తూ, అనేక మంది కవులు సమాజాన్ని చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి ముందుగా సామాజిక అంటే ఏమిటి? అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చైతన్యం అనే మాటకు తెలివి, అవగాహన, కదలిక, మార్పు అనే అర్థాలు చెప్పుకోవచ్చు. సాధారణంగా ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం, సమాజంలో మార్పును తీసుకురావడం, సమాజాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించే ప్రయత్నాన్నే సామాజిక చైతన్యంగా చెప్పవచ్చు.

ఇంకా లోతుగా చెప్పుకోవాలంటే ***"మానవ జీవితం పట్ల, ఆ జీవితాన్ని ప్రభావితం చేసే సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల పట్ల, విలువల పట్ల, వెలుగు నీడల పట్ల, కష్టసుఖాల పట్ల, పాప పుణ్యాల పట్ల, మంచిచెడ్డల పట్ల, సామాజిక ఉత్పత్తుల పట్ల, ఉత్పత్తి సంబంధాల పట్ల, సాంఘిక చరిత్ర పట్ల, సామాజిక వికాసం పట్ల, ఒకటేమిటి సమస్త విషయాల పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలిగించి సమాజంలో ఒక మార్పును తీసుకురావడానికి ప్రయత్నం చేయడమే సామాజిక చైతన్యం". (పరిచయం, పుట:55)***

ఈ విధంగా సామాజిక మార్పును ఆశిస్తూ వస్తున్న వృత్తి కవిత్వాన్ని అధ్యయనం చేయడం ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులు, ధోరణులు, వాదాలను ఇలా అనేక సామాజిక సంబంధిత అంశాలను భవిష్యత్తు పరిశోధకులు అవగతం చేసుకోవడమే కాకుండా సామాజిక దృష్టి పై ఒక స్పష్టతను పొందుతారని భావిస్తున్నాను.

### 2. కులవృత్తులు – హక్కుల పోరాటం:

తెలుగు సాహిత్య చరిత్రలో సమాజ జీవితం, శ్రమజీవుల బతుకులు, వారి కష్టాలు, ఆకాంక్షలు అనేక రూపాల్లో ప్రతిఫలిస్తున్నాయి. తొలినాళ్ల సాహిత్యంలో రాజులు, యుద్ధాలు, మతం, పురాణ ఇతివృత్తాలు ప్రధానంగా కనిపించినప్పటికీ, కాలక్రమంలో సామాన్య మానవుడి జీవితం సాహిత్య వస్తువుగా రావడం గమనించదగినది. ముఖ్యంగా ఆధునిక కాలంలో అభ్యుదయ, దళిత,బహుజన సాహిత్య ధోరణుల్లో కులవృత్తులు, ప్రజల శ్రమ, జీవన సంఘర్షణలు, సామాజిక వివక్షలు సాహిత్యంలోకి విస్తృతంగా వస్తున్నాయి. ఈ విధంగా అనేకమంది కవులు తమ గొంతును,అస్తిత్వాన్ని తెలియజేయడానికి వృత్తి కవిత్వం రాస్తున్నారు. వనపట్ల సుబ్బయ్య మంగలి వారి జీవితం గురించి అసిపె అనే దీర్ఘ కావ్యం రాశారు.

**"ఏ ఒక్కకులం ఒంటరిగా ఏమీ సాధించలేదు**
**ఏ కులానికి ఆ కులం విడివిడిగా**
**మేమెంత మందిమో మాకంత వాటా!**
**సకల సామాజిక రంగాల్లో మన వాటా**
**ఉమ్మడిగా**
**మా బి.సి.లకు జనాభా దామాషా కోటా**
**ఐడెంటిటీ అలయెన్స్**
**బి.సి. కులాలన్ని ఒకే కుల రైలు బోగీలై**
**కదలాలి ఆత్మగౌరవపోరాటంతో**
**రండి! కదలిరండి!!"(సుబ్బయ్య, వనపట్ల. 2024:129)**

ప్రాచీన కాలం నుంచి కులవృత్తులు కేవలం జీవనోపాధి మార్గాలు మాత్రమే కాకుండా తెలుగు సమాజపు సాంస్కృతిక నిర్మాణంలో భాగంగా ఉన్నాయి. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, చేనేత, మత్స్యకార, గొల్ల–కురుమ, గౌడ, రజక, నాయీబ్రాహ్మణ తదితర వృత్తిజీవులు తమ శ్రమతో సమాజ అవసరాలను తీర్చినప్పటికీ, కులవ్యవస్థలో వారికి సమానమైన గౌరవం, అవకాశాలు లభించలేదు. రాజకీయరంగంలో కూడా తీవ్రంగా అణచివేయబడుతున్నారనే విషయాన్ని వనపట్ల సుబ్బయ్య గారు ఈ దళిత, బహుజన సమాజానికి ఈ కవిత ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశారు.

పై కవితా పంక్తులలో విద్య, ఉపాధి, రాజకీయ అధికారం, ఆర్థిక వనరులు, సామాజిక గౌరవం వంటి అనేక రంగాల్లో అన్ని వర్గాల వారికి సమాన భాగస్వామ్యాన్ని కోరడం స్పష్టంగా కనిపిస్తుంది. "ఐడెంటిటీ అలయెన్స్", "బి.సి. కులాలన్ని ఒకే కుల రైలు బోగీలై" వంటి రూపకాల ద్వారా భిన్న కులాల ప్రత్యేక అస్తిత్వాలను చెరపకుండా, వాటిని ఒకే హక్కుల ఉద్యమంగా సమీకరించాల్సిన అవసరాన్ని కవి ప్రతిపాదిస్తున్నాడు. చివర్లోని "ఆత్మగౌరవ పోరాటంతో / రండి! కదలిరండి" అనే పిలుపు, కులవృత్తుల సమాజాలు తమ చారిత్రక శ్రమను గుర్తించుకుని విభజన నుంచి ఐక్యత వైపు, సేవక స్థితి నుంచి హక్కుల సాధన వైపు కదలాలనే సామూహిక చైతన్యాన్ని ఈ కవిత ద్వారా స్పష్టం చేస్తున్నారు.

**సాహిత్య తరంగిణి**

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**"మంగలి ఆత్మబంధువులారా!**
**పోరాడితే పోయేదేమిలేదు**
**కులసంకేళ్లు తప్ప**
**కోల్పోయిన కోల్పోతున్న**
**మంగలిహక్కులకై**
**సంఘటితంగా ఒకే కులంగా**
**సామాజిక హక్కులకై రణం చేద్దాం"(సుబ్బయ్య, వనపట్ల. 2024:130)**

ఈ కవిత ప్రధానంగా కులవృత్తికి సంబంధించిన జీవనాధారం, సామాజిక గౌరవం, హక్కుల పరిరక్షణతో ముడిపడి ఉంది. "పోరాడితే పోయేదేమిలేదు / కులసంకేళ్లు తప్ప" అనే పంక్తుల ద్వారా తరతరాలుగా మంగలి సమాజాన్ని బంధించిన సామాజిక పరిమితులను తెంచుకోవాలనే విముక్తి ఆకాంక్ష వ్యక్తమవుతుంది. "కోల్పోయిన కోల్పోతున్న మంగలి హక్కులకై" అనే పంక్తి గతంలో కోల్పోయిన, ప్రస్తుతం కోల్పోతున్న హక్కులను తిరిగి సాధించుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. అందుకోసం "సంఘటితంగా ఒకే కులంగా" నిలిచి సామాజిక హక్కుల కోసం సమిష్టిగా పోరాడాలని కవి పిలుపునిస్తున్నాడు. ఇక్కడ కవి తమ కుల ప్రత్యేకతలను వ్యక్తీకరిస్తూనే, బీసీ కులాలందరినీ ఏకం చేస్తూ తమ హక్కులను, సామాజిక న్యాయాన్ని సాధించాలనే స్పృహను కలిగిస్తున్నారు. ఈ గొప్ప ప్రయత్నం గమనించదగినది. అంబేద్కర్, పూలే, కాన్షీరామ్, వంటి దళిత, బహుజన నాయకుల ఆశయాలను వారి తాత్విక ఆలోచనల్లోంచి వ్యక్తపరుస్తూనే, సైద్ధాంతిక పరమైన తమ ధిక్కార స్వరాన్ని కవి సుబ్బయ్య గారు వినిపించే ప్రయత్నం చేశారు. ఈ కవితను నిశితంగా పరిశీలిస్తే దీనిలో మంగలి వృత్తి పరిరక్షణ కంటే విస్తృతంగా, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటమే ప్రధానంగా ప్రతిఫలిస్తుంది.

### 3. వృత్తుల సంక్షోభం – జీవన పోరాటం:

ఆధునిక టెక్నాలజీ యుగంలో వృత్తుల సంక్షోభం గురించి, ఆ వృత్తులనే నమ్ముకున్న ప్రజల జీవన స్థితిగతుల గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. దీన్ని అర్థం చేసుకోవడానికి ఈ సమాజాన్ని సామాజిక తాత్విక కోణంలోంచి పరిశీలించాలి. ఈ కాలపు కవులకు ఎవరి బాధలను వాళ్ళే చెప్పుకోవాలి. ఎవరి జీవితాల్ని వారే చిత్రించాలనే సోయి పెరగటం అభినందించదగిన విషయం. ఈ నేపథ్యంలోనే అవనిశ్రీ దళిత, బహుజన జీవితాల్లోని సంఘర్షణను, సంక్లిష్టతను, చీకటి కోణాలను తన కవిత్వం ద్వారా మన ముందుంచే ప్రయత్నం చేశారు.

**"మా తెనుగోళ్ళది**
**ఒళ్లంత నీసువాసన**
**జీవితమంత ఆకలివాసన**

--------------------

**సముద్రంలో**
**ఈదడం నేర్పిన ఈ జాలరికి**
**నేలపైన బత్కడం కష్టమైపోయింది". (అవనిశ్రీ. 2019:94)**

మత్స్యకారుల జీవన సంవేదనల్ని తెలిపే ఈ కవితలో చేపల వేటలో నిత్యం తడిసే శరీరాలకు అంటుకున్న నీసువాసన అనేది వారి వృత్తికి గుర్తుగా నిలుస్తుంది. కానీ ఆ వృత్తి అందించే ఆదాయం మాత్రం వారి జీవితంలోని ఆకలిని తీర్చలేని పేదరిక వాస్తవాన్ని "ఆకలివాసన" అనే ప్రతీక ద్వారా అవనిశ్రీ బలంగా చెప్పారు. సముద్రం, చెరువులు, వలలు, పడవలతో ముడిపడిన వారి శ్రమ వెనుక దాగి ఉన్న పేదరికం, అనిశ్చిత జీవనం, శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకపోవడం వంటి సమస్యలను ఈ పంక్తుల ఆధారంగా అర్థం చేసుకోవచ్చు.

అందువల్ల నీసువాసన కేవలం చేపల వాసన కాదు; అది తరతరాలుగా మత్స్యకారులు మోస్తున్న శ్రమ, పేదరికం, ఆకలి, జీవన పోరాటాల వాసనగా కవి **నీటి పాఠం నేర్పినోడు** అనే ఈ కవిత ద్వారా అద్భుతంగా ఆవిష్కరించారు.

***ఈతాకుసాటు బిడ్డలం*** అనే కవితలో కవి అవనిశ్రీ గౌడ్ల వృత్తి జీవనం గురించి, ఈ సమాజంలో వారి అవసరం గురించి చెప్తున్నే గౌడన్నలకు జరుగుతున్న అన్యాయాలను, జీవన పెనుగులాటను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

**“మేము గౌడన్నలం**
**సర్వాయిపాపన్నకు వారసులం**
**కులవృత్తి కరువై కూడు కరువైన కులపోళ్లం**
**ప్రపంచీకరణ పెనుగులాటలో**
**ఈదుల్లకల్లు కండ్లకు కనబడ్తలేదు”.** (అవనిశ్రీ. 2019:43)

అవనిశ్రీ ఈ కవితలో గౌడ్ల వృత్తి జీవన సంక్షోభాన్ని, పేదరికాన్ని, ఆకలి పోరాటాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నారు. తరతరాలుగా తాటి, ఈత చెట్లను ఆధారంగా చేసుకుని కల్లు గీసి జీవించిన గౌడ్లకు కులవృత్తి కరువవడం అంటే జీవనాధారం, కూడు కరువవడమేనని అర్థంగా తెలియజేస్తున్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో సంప్రదాయ వృత్తి క్షీణించడంతో, ఈతకల్లు కళ్లకు కనిపించని దుస్థితిని కవి ఆవేదనగా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు గౌడ్ల మండువా అనేది పేదల కష్టసుఖాలు పంచుకునేందుకు, తమ బతుకుల గురించి, భవిష్యత్తు గురించి ఆలోచనలు, ప్రణాళికలు వేసుకునే సామూహిక వేదికగా ఉండేది. కానీ ఇప్పుడు ప్రభుత్వ స్వార్థపూరిత ఆలోచనల వల్ల విదేశీ సరుకులు మన దేశానికి దిగుమతి కావడం జరుగుతున్నది. బీరుమందులు విస్తృతంగా గ్రామాలకు సైతం సరఫరా చేస్తున్నారు. ఈ కారణాల వల్ల పేదల ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, గౌడ్ల జీవితాలు మొదలైన అంశాల గురించి ఆవేదన వ్యక్తం పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక కారణాల వల్ల చాలా కుటుంబాలు పేదరికంలోకి కూరుకుపోతున్నాయి.

ఈ దేశానికి బువ్వ పెట్టే రైతుల జీవితం గురించి, అతని ఆత్మహత్యల గురించి కవి అవనిశ్రీ తీవ్రమైన ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

***“రైతు ఆత్మహత్యలే***
***కుల వృత్తులను మింగేసినాయి***
***రైతును కాపాడకపోతే***
***రాజ్యమే సర్వనాశనం”.*** (అవనిశ్రీ. 2019:93)

ఈ కవితలో కవి రైతు జీవనాన్నీ, అతని కష్టాన్ని, రైతు జీవితంపై జరుగుతున్న దోపిడీ, అన్యాయాలను వ్యక్తం చేస్తూనే వృత్తుల నాశనం గురించి వివరించే ప్రయత్నం చేశారు. రైతు ఆత్మహత్యల ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా, దానిపై ఆధారపడిన కులవృత్తులపై కూడా తీవ్రంగా పడుతుందని తెలియజేస్తున్నారు. రైతు ఆదాయం, జీవనం సంక్షోభంలో పడటంతో మంగలి, చాకలి, కుమ్మరి, కమ్మరి, గౌడ వంటి గ్రామీణ వృత్తులకూ పని, ఆదాయం తగ్గి జీవనాధారం దెబ్బతింటుందనే అంతరార్థాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల రైతును కాపాడటం అంటే వ్యవసాయాన్ని కాపాడటం మాత్రమే కాదు, దానిపై ఆధారపడిన అనేక కులవృత్తులను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడటమని గుర్తుంచుకోవాలి. చివరగా రైతును కాపాడకపోతే రాజ్యమే నాశనమవుతుందనీ కవి హెచ్చరిస్తున్నారు.

### 4. వృత్తి కవిత్వం – సామాజిక మార్పు:

వ్యక్తి అనుభవం సమాజపు వాస్తవికతతో ముడిపడినప్పుడు అది కేవలం వ్యక్తిగత భావవ్యక్తీకరణగా మిగలదు. అది ఒక సామూహిక అనుభవానికి, సామాజిక చైతన్యానికి స్వరంగా మారుతుంది. అణగారిన వర్గాల బతుకులు, వారి బాధలు, ఆకాంక్షలు వంటి అంశాలు నిరసన, ప్రశ్నించడం వంటి రూపాలలో వ్యక్తపరచడం వలన సామాజిక చైతన్యం కలుగుతుంది. **‘కులాలు, కులవృత్తుల, ఆ వృత్తుల్లో వున్న తమ తాతలు, తండ్రులు, తల్లులు పడిన బాధలకు తమ తరపు చైతన్యంతో పల్లవి కట్టే ప్రయత్నం చేశారు దళిత కవిత్వానికి**

**లేని అంతర్జాతీయ చైతన్యం ఈ కవులకు వుంది దళిత కవిత్వానికి లేని క్రమశిక్షణ ఈ బిసి కవులకుంది ఆత్మగౌరవం కేవలం రాజకీయ నినాదం కానక్కర్లేదని అదొక జీవన విధానంగా మారాలన్న ఆకాంక్షలో భాగంగా ఈ కవిత్వం వెలువడిందని నమ్మకంగా చెప్పగలం'** అని వెంటాడే కలాలు ముందుమాటలో వృత్తి కవిత్వం గురించి జూలూరు గౌరీశంకర్, ప్రసేన్ లు బలమైన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలోనే కవి వనపట్ల సుబ్బయ్య తన కవిత్వం ద్వారా సామాజిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు.

**"చావుకాడ**
**సన్నాయి వాయించు**
**స్మశానాలల్లో గుండ్లు గియ్యి**
**మండే మశాల్తి దివిటీ పట్టు**
**పెండ్లిల్లలో మైలపోలు ఎత్తు**
-------------------------
**బట్టలమ్మిన బట్టబాజి**
**నీవు కోటీశ్వరుని వయ్యావు**
**నా కూటి కుండను పగలగొద్తున్నావు**
**నాకు కూడు లేకుండా చేశావు"(సుబ్బయ్య, వనపట్ల. 2016:129,130)**

వనపట్ల సుబ్బయ్య తన కవిత్వంలో సంప్రదాయ వృత్తులు సమాజ జీవనంతో ఎంతగా ముడిపడి ఉన్నాయో, ఆధునిక సామాజిక మార్పుల ప్రభావంతో ఆ వృత్తుల జీవనాధారం ఎలా క్షీణించిందో తెలియజేస్తున్నారు. తరతరాలుగా ప్రజల అవసరాలను తీర్చుతూ వచ్చిన వృత్తిజీవులు తమ శ్రమతో సమాజానికి సేవ చేసినప్పటికీ, యంత్రాల ప్రవేశం, మార్కెట్ విస్తరణ, పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల వంటి మార్పులు వారి వృత్తులను క్రమంగా వెనక్కి నెట్టాయని కవి సూచిస్తున్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలో కొందరి సంపద పెరుగుతుండగా, అదే మార్పు సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కోల్పోవడం, పేదరికం, ఆకలి వంటి సమస్యలను మిగిల్చిందని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మార్పు అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి కాదని, ఆ మార్పు వల్ల అట్టడుగు వృత్తిజీవుల జీవితం ఎలా ప్రభావితమవుతుందో కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని వనపట్ల సుబ్బయ్య తన కవిత్వం ద్వారా తెలియజేస్తున్నారు.

కవి శీలం భద్రయ్య ముస్తాదు అనే కవితా సంపుటిలో మండువా చుట్టూ ఉన్న బహుజన సమాజాన్ని గురించి ఒక్క మాటలో చెప్పే ప్రయత్నం చేశారు.

***"మండువా దగ్గర ఒక్క పట్టుతో***
***జీవిత పాట్లన్నీ***
***పాటగా మారాయి***
***తాటిచెట్టుపై గౌడుచేయి***
***సంగీతం***
***మొదలైంది". (భద్రయ్య, శీలం. 2025:10,11)***

శీలం భద్రయ్య గారి ఈ కవితా పంక్తుల్లో మండువా కేవలం కల్లు తాగే ప్రదేశంగా కాకుండా, దళిత,బహుజన సమాజం తమ రోజువారీ కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అవమానాలు, జీవన సంఘర్షణల నుంచి కాసేపు ఊపిరి పీల్చుకునే చోటుగా గొప్పగా కవిత్వీకరించారు. మండువా దగ్గర చేరినప్పుడు ఒక్క లొట్టి కల్లు వారి శరీరానికే కాక, మనసులో పేరుకుపోయిన బాధలకు కూడా తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. రోజంతా శ్రమించిన చేతులు అక్కడ మాటల్లో కలుస్తాయి. తాటిచెట్టుపై గౌడు చేయి పడగానే పుట్టే

కల్లు వారి జీవితపు చేదును కాసేపు మరిపించే సంగీతంలా మారుతుంది. ఈ విధంగా అనేక సామాజిక వాస్తవాలను వృత్తి కవిత్వం ద్వారా కవులు చిత్రించారు.

**ముగింపు:**

భారతదేశంలో సామాజిక జీవన చక్రం నడవడానికి మూల కారకులైన బి.సి.లు, దళిత, బహుజన వర్గాలు నేటికీ కూడా అడుగడుగునా చీదరింపులకు, బెదిరింపులకు గురవుతున్నారు. దీనికి కారణం అధిక శాతం జనాభా వీరిదైనప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుతనం కలిగి ఉండటం. దీని గురించి ఆధునిక కాలంలో కవులు తమ కవిత్వం, కథలు, నవలలు వంటి ప్రక్రియల ద్వారా నిరసనను తెలియజేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ సమాజం ఇప్పటికైనా చైతన్యం పొంది మహోన్నతమైన సామాజిక ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునికీకరణ, యంత్రాధారిత ఉత్పత్తి, మార్కెట్ మార్పులతో సంప్రదాయ వృత్తులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో వృత్తిజీవుల సమస్యలు కేవలం ఆర్థిక సమస్యలుగా కాకుండా గౌరవం, ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, హక్కుల సమస్యలుగా సాహిత్యంలో వ్యక్తమయ్యాయి. ఈ కోణంలో వచ్చిన వృత్తి కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా సొంత అస్తిత్వాలు, జీవన సంఘర్షణలను, సామాజిక వాస్తవాలను అద్దం పట్టినట్లుగా చూపించవచ్చని అవగతం చేసుకున్నాను. ఈ అధ్యయనం ద్వారా వృత్తి కవిత్వం రాసిన,రాస్తున్న కవులకు ఉన్న సామాజిక స్పందనను, సమాజంపై వారికి ఉన్న అవగాహనను పరిశీలించడం జరిగింది.ఈ అధ్యయనం ద్వారా పాఠకుల్లో సామాజిక స్పృహను, సామాజిక చైతన్యాన్ని, వాస్తవిక దృక్కోణాన్ని పెంపొందించడమే కాకుండా, నూతన ఆలోచన విధానాన్ని పెంపొందించడం వంటి ప్రయోజనాన్ని ఆశించవచ్చు.

**ఉపయుక్త గ్రంథసూచీ:**


1. అవనిశ్రీ. 2019. **ఆపతి**. హైదరాబాద్: సెవెన్ హిల్స్ ప్రింటర్స్.
2. గౌరీశంకర్, జూలూరు. (సం.పా) 2001. ***వెంటాడే కలాలు (వెనుకబడిన కులాలు)***. కోదాడ: స్పృహ సాహితీ సంస్థ.
3. గౌరీశంకర్, జూలూరు. (సం.పా) 2022. ***తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమి.
4. జయప్రకాష్, ఎస్. 2003. ***పరిశోధన విధానం***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
5. భద్రయ్య, శీలం. 2025. **ముస్తాదు**. హైదారాబాద్: కర్షక్ ప్రింటర్స్.
6. రామకృష్ణ, తుమ్మల. 2014. ***పరిచయం***. చిత్తూరు: చంద్రకళ పబ్లికేషన్స్.
7. శ్రీనివాసరావు, శ్రీరంగం. 1950. ***మహాప్రస్థానం***. మచిలీపట్నం: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
8. సుబ్బయ్య, వనపట్ల. 2024. **అసిపె**. హైదరాబాద్: ఓం సాయి గ్రాఫిక్స్.
9. సుబ్బయ్య, వనపట్ల. 2016. **కుర్చీ**. హైదారాబాద్: హిమాలయ గ్రాఫిక్స్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# కాళోజి కవిత్వం – ఒక సమాలోచనం

**– డా . వి. అరుణ్ కుమార్**,
యం.ఏ, యం.ఫిల్, పి.హెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ తెలుగు,
ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం)
నాంపల్లి, హైదరాబాద్. Ph No.9866892692.
మెయిల్ ఐ. డి : varunavsai@gmail.com

తెలంగాణ ప్రాంతపు ప్రజాకవిగా పేరుపొందిన కాళోజి నారాయణరావు గారి జీవితం గురించి తెలియనట్లయితే ఆయన కవిత్వం కూడా అర్థం కాదు. ఆయన వ్యక్తిత్వ జీవితం,ప్రజా జీవితం అంటూ గిరిగిసి వేరు చేయడం కష్టం ఉద్యమాలతో మమేకమైన ప్రత్యేక వ్యక్తిత్వంలో, ఉద్యమాల్లోంచి పుట్టిన కవిత్వంతో గడిచిన విశిష్ట జీవితం కాళోజిది. కొందరు ఆయన కవిత్వం కంటే జీవితం గొప్పది అని అంటూ ఉంటారు. కాళోజి గారిని చదివితే తెలంగాణను చదివినట్లే అసలు కాళోజి జీవితమే ఒక సందేశం.

అసలు కాళోజీ జీవితం కవిత్వం వేరు వేరు కావు, ఆయన జీవితం వివిధ ఉద్యమాలతో ముడిపడి ఉంది. కాళోజి కవిత్వం మాట్లాడినంత సహజంగా ఉండడంవల్ల శిల్పం నగీసిలు లేని సాదాసీదాతనంతో వెలువడటం వల్ల ఇది కవిత్వమా అనిపించేంత ఆకృతిమ సౌందర్యంతో ఏ మడతల్లో కప్పు వడని చైతన్య తీవ్రతతో ప్రకాశిస్తుంది. అలాంటి కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన జీవితాన్ని గురించి తెలుసుకోవడం అనివార్యమవుతున్నది.

కాళోజి ఒక సంస్థ ద్వారా గాని ఒక సిద్ధాంతం ద్వారా గాని ఒక విధానం ద్వారా గాని పనిచేసే ఉంటే ఎంత విశిష్టత వచ్చేదో లేదో తెలియదు, కానీ కాళోజి తనకు తోచిన రీతిలో ప్రతిస్పందించి ప్రతిఘటించాడు అని పాములపర్తి సదాశివరావు గారు అభిప్రాయపడ్డారు. “తూర్పు మల్లారెడ్డి కాళోజి నారాయణరావు జీవితం సాహిత్యం 1989”

కాళోజిది ఒంటరి పోరాటమే ఆ పోరాట ధ్యేయం జన సమీకరణ కాదు జన శ్రేయస్సు కోసం కాపలా కాయటం అందుకే కాళోజి కవిత్వ ప్రయోజనం ప్రజలే ప్రజల తరఫున వాదించే కవి వకీలు కాళోజీ అని తూర్పు మల్లారెడ్డి ప్రకటించారు. కాళోజి నారాయణరావు జీవితం సాహిత్యం – తూర్పు మల్లారెడ్డి 1989 పుట 66

“కాల్ అన్న మనసు వెన్న కాదన్న కన్ను వాన” అని దాశరథి రంగాచార్యులు అభివ్యక్తీకరించారు

“దిక్కర వారసత్వానికి ఆయన ఎత్తి పట్టిన జెండా” అని వరవరరావు ప్రశంసించారు 2002 పుట 1 కాళోజీ ఫౌండేషన్ కాళోజి యాధిలో 2002 పుట 4

**వ్యక్తిత్వానికి మారుపేరు – కాళోజి:**

వ్యక్తిత్వానికి మారుపేరు కాళోజి **“పుట్టుక నీది చావు నీది బతుకుతా దేశానిది”** అన్న కాళోజి వ్యక్తిత్వం విశిష్టమైనది. కాళోజి మూడు అక్షరాలే మూడు కాలాలను ఉడుకెత్తించాయి, నాలుగు తరాలను వెలుగు వైపు నడిపించాయి. కాళోజి చరిత్రలో అరుదైన వ్యక్తి భారత ప్రపంచంలో ప్రత్యేకమైన తెలంగాణ వ్యక్తిత్వం కాళోజిది. కాళోజి అంటే జీవితం చారిత్రాత్మకమైన జీవితం రసాత్మకమైన కవిత్వం కాళోజి అంటే సగటు మానవుని సంఘర్షణ, సమస్త దుఃఖం అతను వాక్కులు రుక్కులు, పెనువేసిన మూర్తిమత్వం కాళోజిది జరుగుబాటు కోసం గిలగిలలాడుతున్న లోకంలో తిరుగుబాటుకు పర్యాయపదంగా జీవించిన మహా వ్యక్తి కాళోజి నారాయణరావు.

కవిగా కాళోజికి విశిష్ట స్థానం ఉంది. ఆయన రాజకీయాల్లో ఏ పార్టీకి చెందిన వాడు కానట్లే సాహిత్యంలోనూ ఆయన ఏ ధోరణికి మరే మార్గానికి చెందిన వాడు కాదు. ఏ సాహిత్య ఉద్యమం తోనూ ఆయన ప్రభావితుడు కాలేదు తెలుగులో భావ కవిత్వావిర్భావం

## సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

జరగడంతోనే కాళోజి కూడా జన్మించాడు ఆయన కలంబట్టిన నాటికి భావ కవిత్వం వెనుకంజ వేస్తూ అభ్యుదయ కవిత్వోద్యమం క్రమంగా పుంజుకుంటున్నది. ఆయన ఈ రెండిటి ప్రభావాలకు గాని మరే ప్రభావాలకు గాని లోను కాకుండా తన సొంత వ్యక్తిత్వాన్ని చివరిదాకా నిలబెట్టుకుంటూ వచ్చినారు. తెలుగులో ప్రబలిన తీవ్రవాద అస్తిత్వవాద ఛాయలేవి ఆయన మీద ప్రసరించలేదు కవిత్వం ఆత్మానందం కోసమే అని నమ్మేవాడు కాదు కాళోజి ఆయన భావకవిగా చలామణి కాలేదు అభ్యుదయ కవిగా పరిగణించడానికి వీలులేదు కవిత్వం, కవిత్వం కోసమే రాసిన వాడు కాదయానా కవిత్వాన్ని సామాజిక ప్రయోజనం కోసం వాడుకున్నాడు అంతే కాదన కవిత్వం రాసిన కథలు రాసిన మరేది రాసిన ఈ దృక్పథంతోనే రచనలు చేసినాడు. కాళోజి పేరు వినగానే మొదట గుర్తొచ్చేది నా గొడవ పైకి ఇది కాళోజి గొడవ గానే కనిపించిన ప్రజలందరికీ గొడవ పర్యవసిస్తుంది ఇది కాళోజి కవి గొడవగానే అనిపించినప్పటికీ చదివిన వానికి తమ గొడవ గానీ అర్థమవుతుంది అన్న మహాకవి శ్రీశ్రీ మాట జనం మాటగా స్థిరపడిపోయింది.

కాళోజి నా గొడవ, తుదివిజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ!బాపూ!!బాపూ వంటి దాదాపు 3వేల దాకా కవితల్ని రాశాడు అది పది సంపుటాలుగా వెలువడ్డాయి. వీటిలో పది అనువాద కవితలు కూడా ఉన్నాయి. కాళోజి కథానికలు కూడా రచించాడు. ఇంగ్లీషు మరాఠీ భాషల్లోని కథానికలను అనువాదాలు చేశాడు మరాఠీ సాహిత్యాన్ని గురించి సాహిత్యానికి జీవితానికి సంబంధించిన మౌలికమైన వ్యాసాలు ప్రకటించాడు. కాళోజి అప్పుడప్పుడు పుస్తకాలకు రాసిన పీఠికలు అయినా బుద్ధి నైసత్యానికి నికాశోపలంగా ఉన్నాయి. అంతేకాక కాళోజి బ్రెయిల్స్ ఫర్డ్ 1931లో రాసిన రెబల్ ఇండియాను “నా భారతదేశ యాత్రగా” 1941 వ సంవత్సరంలో అనువదించాడు. ఖలీల్ జీబ్రాన్ ప్రాఫిట్ కు 1968లో “జీవన గీత” పేరుతో చేసినా అనువాదం ఎంతో ప్రసిద్ధికెక్కింది విలువైన కొన్ని అనువాద గ్రంథాలు ఉన్న ఇప్పటికే అలభ్యంగా ఉన్నాయి.

### స్వాతంత్ర్యోద్యమం నుంచి ప్రజా ఉద్యమాలు:

నిజాం నిరంకుశ పరిపాలనకు ప్రజలు విసిగి బ్రతుకు చిదికి ఎదురు తిరుగుతున్న రోజుల్లో కాళోజి కవిగా నా గొడవను ప్రకటిస్తూ తలెత్తాడు, ఆనాటి సంఘర్షణాత్మకమైన సంక్లిష్ట తెలంగాణ సామాజిక జీవితంలో భాగంగా ఉంటూ పౌరహక్కులకు ఏస్థాయి భంగం కలిగిన ప్రతిఘటించ సాగాడు బాధితులను చూసి సున్నిత మానవీయ హృదయంతో కన్నీరు కారుస్తూ చలించి పోసాగాడు ఆ చలన తరంగాలే కవితలు గారు దిద్దుకున్నాయి. ఆవేదనే ఆయన కవితాత్మమై జీవితమంతా ఒక కవిత ఉద్యమం అయ్యింది కాబట్టి కాళోజి కవితకు ప్రజా హృదయ హృదయ పీఠిక లభించిందంటాడు దాశరధి కాళోజి నా గొడవను గూర్చి నడుస్తున్న చరిత్రకు రన్నింగ్ కామెంట్రీ అన్నాడు నిజమే కాళోజి కవిత్వం సమకాలిన సామాజిక చరిత్రకు గచ్ఛద్వ్యాఖ్యానం అందుకే కాళోజి కవితను గూర్చి డాక్టర్ ముకురాల రామిరెడ్డి గారు కాళోజి చెబుతూ వస్తున్న ఖతాకాలం ప్రసావిస్తూ వేదా అంటాడు తూర్పు మల్లారెడ్డి కాళోజి నారాయణరావు జీవితం సాహిత్యం 1989 పుట 55. రైతు, కూలీ, పేదవాడు, మధ్యతరగతి మనిషి, అణగారిన వర్గాలు, సాధారణ పౌరుడు——వీరి జీవితాల్లోని సమస్యలను తన కవిత్వంలోకి తీసుకొచ్చారు.అందువల్ల ఆయన కవిత్వానికి ప్రజా జీవితమే కేంద్రం.

**“నా గొడవ” – కాళోజి సాహిత్యానికి హృదయం:** కాళోజి రచనల్లో “నా గొడవ” అత్యంత ప్రాధాన్యమైనది. ***"అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవ, అన్యాయం అంతరిస్తే నా గొడవ"*** ఆయన రాసిన '**నా గొడవ**' కవితా సంపుటి కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదు, అది సమాజంలోని ప్రతి సామాన్యుడి గొడవ. “గొడవ” అనే పదాన్ని ఆయన కేవలం వ్యక్తిగత కలహం అనే అర్థంలో ఉపయోగించలేదు.

ఇక్కడ “గొడవ” అంటే: అన్యాయంపై ప్రశ్న,దోపిడీపై నిరసన,అసమానతపై ఆవేదన,అధికార దుర్వినియోగంపై విమర్శ, ప్రజల హక్కుల కోసం పోరాటం, మానవత్వం కోసం నిలబడటం అంటే “నా గొడవ” క్రమంగా “ప్రజల గొడవ”గా మారుతుంది.ఇదే కాళోజిని ఇతర కవుల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టే అంశాల్లో ఒకటి.

### కాళోజి కవిత్వంలో – ప్రధాన భావాలు

**మానవతావాదం:** కాళోజి రచనల కేంద్రంలో మనిషి ఉంటాడు. ***"పుట్టుక నీది, చావు నీది…కానీ బ్రతుకంతా దేశానిది" అంటూ*** ఆయన ఇచ్చిన నినాదం నేటికీ ఎంతో మందికి స్ఫూర్తిదాయకం .కవిత్వంలో క్లిష్టమైన అలంకారాలు, పండితులకు మాత్రమే అర్థమయ్యే సమాసాలు లేకుండా, పామరుడికి సైతం నేరుగా హృదయానికి హత్తుకునేలా సరళమైన శైలిని అవలంబించడం ఆయన కవిత్వం యొక్క

ప్రత్యేకత. **"అవనిపై జరిగేటి అవకతవకలు చూసి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు? పరుల కష్టము జూచి కరిగిపోవును గుండె మాయ మోసము జూచి మండిపోవును ఒళ్ళు" – "అన్నపురాసులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట, హంస తూలికలు ఒకచోట, అలసిన దేహాలొక చోట, సంపదలన్నీ యేక చోట, గంపెడు బలగం ఒకచోట"** వంటి కవితలు కులం, మతం, ప్రాంతం, భాష వంటి విభజనల కంటే మనిషి గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, మానవతా వాదం ముఖ్యమని ఆయన భావజాలం సూచిస్తుంది.

**ప్రజాస్వామ్యం:**

**"ప్రజాస్వామ్యమంటే కేవలం ఓట్లు వేయడం కాదు, ఓట్లు వేయించుకోవడం కాదు!**
**ఓటు వేసిన ప్రజల గొంతును, నిరంతరం వినడమే నిజమైన ప్రజాస్వామ్యం!"**

**"గద్దెనెక్కిన వారు కాదు రాజులు, గద్దె కింద ఉన్న ప్రజలే అసలైన ప్రభువులు"**
**"పాలకుడు సేవకుడిగా మారినప్పుడే, ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం!"**

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు కాదని, ప్రజల స్వేచ్ఛను గౌరవించే వ్యవస్థ కావాలని ఆయన రచనలు సూచిస్తాయి.

**అధికారవిమర్శ:** అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం కాళోజి రచనల్లో ప్రధాన లక్షణం. ***"ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్లకు కదలిక"*** అనే ఆయన మాటలు అక్షరం యొక్క శక్తిని, సమాజంలో అది తెచ్చే చైతన్యాన్ని తెలియజేస్తాయి. అధికారం ప్రజల కోసం ఉపయోగపడాలి; ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కాదు అనే భావన కనిపిస్తుంది.

తెలంగాణ శాసనసభను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా కాళోజి పంక్తులను అధికారికంగా ఉటంకించడం ఆయన ఆలోచనలు ఇప్పటికీ ప్రజాస్వామ్య చర్చల్లో ప్రాసంగికంగా ఉన్నాయనే దానికి ఉదాహరణ.

**తెలంగాణ భాష పట్ల — కాళోజి దృక్పథం:**

కాళోజి సాహిత్యంలో తెలంగాణ మాట్లాడే భాషకు సహజమైన స్థానం ఉంది. ఆయన ప్రజలు మాట్లాడే భాషను, సాహిత్యానికి దూరంగా ఉంచలేదు.అందువల్ల ఆయన తెలంగాణ భాషలో, యాసలోని పదునును, మట్టి వాసనను అక్షర రూపం ఇచ్చి, అధికారిక భాషా దౌర్జన్యాలను ధైర్యంగా ఎదిరించారు. తెలంగాణ భాష కేవలం మన మాట తీరు మాత్రమే కాదు, అది మన సంస్కృతి, మన జీవన విధానం, మన ఆత్మగౌరవానికి ప్రతీక .ఆ భాషకు, యాసకు సాహిత్య గౌరవాన్ని తీసుకురావడంలో కాళోజి గారి పాత్ర ఎంతో విశిష్టమైనది.**"బడి పలుకుల భాష కాదు ...పలుకుబడుల భాష కావాలి** "అని నమ్మిన గొప్ప కవి కాళోజీ.

**"వ్యాకరణం రాజ బాట వేస్తుంది, వాడుక పిల్ల బాట తొక్కుతుంది, సమ్మతరూప దర్శనాభిలాషి పండితుడు, అగుపడ్డ రూపమే సమ్మతము సామాన్యునికి, ఎవనికో నచ్చునట్లు పలకడం నాడు, ఎవరికి వాడు వచ్చినట్లు పలకడం ఖాయం నేడు"**

వ్యాకరణాలు గ్రాంధిక భాష పేరుతో, ప్రామాణిక భాష పేరుతో పదాలకు స్థిరరూపాన్ని కల్పించడానికి ప్రయత్నిస్తాయి. కానీ ప్రజలు వాటిని అనుసరించి పదాలను ఉచ్చరించరు, తమకు అనుకూలమైన విధంగా ఉచ్చరిస్తారు .ప్రజల ఉచ్చారణకు అనుగుణంగా వ్యాకరణాలు రాసుకోవాల్సిందే, మార్చుకోవాల్సిందే .ప్రయోగ శరణం వ్యాకరణం అన్నారు కదా !వ్యాకరణం రాజబాట లాంటిదైతే సామాన్య ప్రజలు ఆ బాటలో నడువరు, షార్ట్‌కట్‌లో వెళ్లడానికి పిల్ల బాటలు వేస్తారు .అంటే ఉచ్చారణ సౌలభ్యం కోసం పదాలను సరళీకరిస్తారు .కాళోజీ ప్రజల భాషలో కవిత్వం రాశారు కాబట్టి ఆయన కవిత్వంలో సాంప్రదాయ వ్యాకరణ లక్షణం భిన్నరూపాలు కనిపిస్తాయి.

**"తెలుగు బాస ఎన్ని తీర్లు, తెలుగు యాస ఎన్ని తీర్లు**
**వాడుక ఏ తీరుగున్న, తెలుగు బాస వాడుకయే?**

అనేది కాళోజి భాషా దృక్పథం. ఈ దృక్పథమే అసలు సిసలైన ప్రజాస్వామిక భాషా దృక్పథం, ఇది కేవలం భాషా ప్రయోగం కాదు. దాని వెనుక ఒక సాంస్కృతిక దృక్పథం ఉంది. **"ప్రజల భాష కూడా సాహిత్య భాషే."** కాళోజీ భాషను ఇతివృత్తంగా చేసుకొని కవితలు రాశారు .ప్రజల జీవద్భాషను ప్రేమించారు .తెలంగాణ మాండలిక భాషలో కవిత్వం, తెలంగాణ ప్రాంత యాస కనిపిస్తుంది. ఆయన మాటల్లో సజీవమైన తెలంగాణ మాండలిక భాష ప్రాణం పోసుకుంటుంది .ఇదీ నా గొడవ పేరు మీద ఆయన రాసుకున్న ఆత్మకథలో

పూర్తిగా తెలంగాణ మాండలిక భాషను చూడవచ్చు .సాహిత్యం, భాష ప్రజల పక్షం నిలువాలని, అవి ప్రజలను కదిలించాలని కాళోజి భావించారు .అంతేకాదు, తన కవిత్వాన్ని ఆ రీతిగా రాసి చూపించారు .భాషకు, ఇతివృత్తానికి మధ్య చక్కని సమన్వయం సాధించారు.

**వ్యంగ్యం కాళోజి ప్రత్యేక ఆయుధం:** కాళోజీ రచనలను పరిశీలిస్తే వ్యంగ్యం చాలా శక్తివంతమైన సాధనంగా కనిపిస్తుంది.

**"ఓట్లు అడిగేటప్పుడు ఓ కాళ్ళు పట్టుకుంటారు, గెలిచినంక మన నెత్తిమీద కూర్చుంటారు!**
**పదవి రాకముందు ప్రజల సేవకులంటారు, పదవి వచ్చాక ప్రజలనే బానిసలను చేస్తారు"!**

**"ఖద్దరు చొక్కా వేస్తే చాలు, బుద్ధి అంతా శుద్ధి అనుకుంటారు!**
**లోపల అంతా నలుపే ఉన్నా, బయట మాత్రం తెల్లగా కనిపిస్తారు"!**

ఆయన నేరుగా ఉపన్యాసం ఇవ్వకుండా, ఒక చిన్న వ్యాఖ్య, చమత్కారం లేదా వ్యంగ్యమైన వాక్యం ద్వారా పెద్ద సామాజిక సమస్యను పాఠకుడి ముందుంచగలిగారు. అందుకే ఆయన కవిత్వం చదివించేది మాత్రమే కాదు ఆలోచింపజేస్తుంది.

**కాళోజి కవిత్వంలో – రాజకీయ చైతన్యం:** కాళోజి రాజకీయ కవి అయినప్పటికీ ఆయన కవిత్వం కేవలం పార్టీ రాజకీయాలకు పరిమితం కాదు.ఆయనకు ముఖ్యమైనది: **"అన్యాయాన్నెదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు", "గుండె ఉబ్బి గొంతు దాటి, బయట పడ్డ అక్షరమే నా కవిత్వం..., "అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు-సకలించు ఆంధ్రుడా !చావవేటికిరా"!** ప్రజా హక్కులు, రాజకీయ వ్యవస్థల్లోని లొసుగులను, సామాన్యుడి పడే బాధలను, పరాయి భాషా వ్యామోహంలో పడి, సొంత భాషను నిర్లక్ష్యం చేసే రాజకీయ, సామాజిక నాయకులను హెచ్చరిస్తూ ఆయన రాసిన కవిత. అందువల్ల ఏ రాజకీయ వ్యవస్థలోనైనా ప్రజలకు అన్యాయం జరిగితే ఆయన ప్రశ్నించారు.ఈ స్వతంత్ర విమర్శనా ధోరణి కాళోజి వ్యక్తిత్వానికి ముఖ్యమైన లక్షణం.

**కాళోజి – తెలంగాణ సాంస్కృతిక వ్యక్తిత్వం:** కాళోజిని తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి సంబంధించిన ప్రముఖ వ్యక్తిగా కూడా చూడవచ్చు.నిజాం ప్రభుత్వంలోని రజాకార్ల ఆగడాలను సహించక, వారి అమానుష చర్యలను నిరసిస్తూ, ఈ దురాగతాలకు వ్యతిరేకంగా కాళోజీ "నగ్నసత్యాలు" అనే కవితను రాశాడు. **"ఉత్తమాటలు కట్టిపెట్టి, పెత్తనాలకు దేవులాడక, చిత్తశుద్ధిగా చేయబూనిన, చేతలెల్ల ఘటించినట్లే, న్యాయమును పాటింపనొల్లని, అధిపత్యము అండయుండిన, హత్య, దోపిడి, మానభంగాల్, నిత్య కర్మల చేరినట్లే"** అంటూ నిజాం ప్రభుత్వంపై నిప్పులు కురిపిస్తూ, తన కవితా శంఖమును ఊది, కదనరంగంలో, రాజకీయ జీవితంలో, ప్రజా ఉద్యమాల్లో ముందుంటు తన అంకిత భావాన్ని ప్రదర్శించాడు కాళోజి.

ప్రజాకవి కాళోజి చెప్పినట్టు ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నా కోలుకోవచ్చు, అధికారం కోల్పోయినా తిరిగి సాధించుకోవచ్చు .కానీ, అస్తి త్వం కోల్పోతే, సాంస్కృతికంగా తన మూలాలను తానే మరిచిపోతే ఆ జాతి మనుగడ సాగించలేదు.

**"నమ్ముకొని పెత్తనము ఇస్తే, నమ్మకము పోగొట్టుకొంటివి**

**కుప్పకావలి ఉండి కట్టలు, తప్పదీస్తివి ముద్దెరేస్తివి"**

ఒక జాతికి ప్రాణం సంస్కృతి, సాహిత్యం, కళలు .సంస్కృతికి ప్రాణం సామాజిక జీవనం .ఆత్మగౌరవం లేని జాతికి అభివృద్ధి లేదు .ఆత్మగౌరవానికి అభివృద్ధి ప్రత్యామ్నాయం కాదు .అందుకే, తెలంగాణ ఉద్యమం కేవలం నీళ్లు, నిధులు, నియామకాలు ఎజెండాతో ఆర్థికపరమైన ఉద్యమంగా కాకుండా, అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటంగా రూపుదాల్చింది.

**"తెలంగాణ వేరైతే దేశానికి ఆపత్తా? తెలంగాణ వేరైతే ఎవరికి నష్టమయ్యా?**

**బానిస సంకెళ్లు తెంచుకుని, బతుకమ్మను ఆడుకునే హక్కు మాకు లేదా?"**

ప్రాంతీయ ఆత్మగౌరవం 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో, ప్రాంతీయ వివక్ష చూపే పాలకుల రాజకీయ ఎత్తుగడలను నిరసిస్తూ ఆయన గళం విప్పారు.

**కాళోజి సాహిత్యంలో – సామాజిక విమర్శ:** కాళోజి రచనలను కేవలం "కవిత్వం"గా చదవడం కంటే సామాజిక విమర్శగా చదివితే మరింత లోతైన అర్థాలు కనిపిస్తాయి. దేశం ఈ రోజున అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితిని, మనిషిని మనిషి దోచుకునే, హతమార్చే దుస్థితిని కాళోజి **"చెల్లినోనికి నేరం చెల్లుబాటు అవుతుంటే /చెల్లనోనికి నేరం చేయక తప్పక ఉంటే /చట్ట విరుద్ధ చర్యల పుట్టయిపోదా**

**దేశం .మలిన మానవుడు సమస్త సంఘ జీవనాన్నీ, దేశాన్నీ మలినం చేసే నీచానికి పాల్పడే హీన స్థితిని మానవుని మానవుడు మానవుని మాదిరిగ / మన్నించలేనంత మలినమైనది /జగతి మలినమైనది/** " అంటూ గుండెలు బాదుకుని ఏడ్చే ఏడుపు కాళోజి కవిత .అటు ఇజాల వైరుధ్యాలు, అహాల పోటీతత్వాలూ, అక్కరలు తీర్చుకునే వలల వంచనలూ ..ప్రతి విషయం లో, ప్రతి చోట కొట్లాటలు .ఇవన్నీ' నా', 'నేను 'లోనే నన్ను అణిచిపెట్టి అహంభావిని చేస్తాయి .నా'నుంచి' మా 'వరకు, 'మన 'వరకు వచ్చే ప్రయాణమే తన జీవన ప్రయాణం అని కాళోజీ తన అసమ్మతి, నిరసన, ధిక్కారం, తిరస్కారం తన లొల్లి లక్షణమని సెలవిస్తాడు .స్వవిమర్శలో కాళోజిది భేషజాలు లే ని, మర్మం అంటు సోకని మనసు దారి .అందు కే **"నానా ఇజాల అడుగున జూడ / నా ఇజందే కనిపించును జాడ"** అని చెప్పుకొంటాడు.ఈ అంశాలు ఆయన కాలానికే పరిమితం కాకుండా నేటికీ చర్చించదగినవిగా ఉన్నాయి.

*శాంతికై పరితపించే ప్రపంచ శాంతికాముకుడు కాళోజి .కానీ యుగాలుగా తరాలుగా ఈ ప్రపంచంలో శాంతి ఎక్కడ నెలకొని ఉన్నది ? **"శాంతి శాంతట గుండె మండిపోతుంటే / కంద కరిగిపోతుంటే / బతుకు చితికి పోతుంటే / ఎముక విరిగిపోతుంటే / శాంతి శాంతట శాంతి. హింసల, అణిచివేతల, అఘాయిత్యాల లోకంలో శాంతి జపం, శాంతి తపం, శాంతి మంత్రోచ్చారణ ఫలిస్తాయా?"** కాళోజీ దృష్టిలో ఊరికే మనం వల్లించే హింస తప్పు .రాజ్యహింస చాలా పెద్ద తప్పు .దానికి ప్రతిహింస తప్పు కాదు .తన గొడవలో ఫాసిజం అంటే ఏకీభవించనోని పీక నొక్కు సిద్ధాంతం అదంతా పెద్ద రాద్ధాంతం.*

కాళోజి సాహిత్యం కేవలం గతాన్ని విమర్శించడానికే పరిమితం కాలేదు; అది భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచింది .సమాజంలోని కుళ్లును కడిగేయడానికి ఆయన సాహిత్యాన్ని ఒక సాధనంగా వాడుకున్నారు .ఆయన చేసిన సామాజిక విమర్శ నేటికీ, ఏనాటికీ సజీవమైనదే .సమాజంలో అన్యాయం జరిగినంత కాలం కాళోజి అక్షరాలు నిప్పు కణికల్లా మండుతూనే ఉంటాయి.

**కాళోజి జయంతి – తెలంగాణ భాషా దినోత్సవం:**

కాళోజి జన్మదినం సెప్టెంబర్ 9. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ భాష, మాండలికం, సాహిత్యం పట్ల ఆయన చేసిన కృషిని స్మరించుకుంటున్నారు. తెలంగాణలోని విద్యాసంస్థలు, తెలుగు విభాగాలు ఈ సందర్భంగా కవితా పఠనాలు, వ్యాసరచన, సాహిత్య చర్చలు, సదస్సులు నిర్వహిస్తుంటాయి. కాళోజిని కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమకారుడు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీతగా స్మరిస్తుంది. ఇది కాళోజి వ్యక్తిత్వం తెలంగాణ ప్రజా స్మృతిలో ఎంత బలంగా స్థిరపడిందో చూపిస్తుంది.

**ముగింపు :**

ఆయన జీవితం అనేక రంగాలలో విస్తరించింది .ఆయన న్యాయవాదిగా, రాజకీయ కార్యకర్తగా, పత్రికా సంపాదకుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, సాహితీవేత్తగా ఎంతో కృషి చేశారు .తెలంగాణ సాయుధ పోరాటం, ఆంధ్ర మహాసభ, తెలంగాణ ఉద్యమాలలో ఆయన చురుకైన పాత్ర పోషించారు .జైలు జీవితం గడిపినా, ఆయన ధైర్యం, ధృఢసంకల్పం ఏమాత్రం తగ్గలేదు .సాహిత్యరంగంలోనూ ఆయన ముద్ర వేసిన గ్రంథాలు అనేకం .నా గొడవతో పాటు మరికొన్ని రచనలు వ్రాసిన చరిత్ర, హాస్య వంగ్మయం, జ్ఞాపకాల జలపాతం, వర్తమానం, వచన కవిత్వం వంటి రచనలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయి .ఈ రచనలు కేవలం సాహిత్యరసాస్వాదనకే పరిమితం కాకుండా, సామాజిక సమస్యలపై చైతన్యం నింపాయి.

కాళోజి కృషికి గుర్తింపుగా అనేక పురస్కారాలు లభించాయి. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, అనేక విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు ఆయనకు దక్కాయి. మరణానికి ముందు తన శరీరాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేయాలని సంకల్పించడం ఆయన నిస్వార్థతకు నిలువెత్తు నిదర్శనం. కాళోజీ 2002, నవంబర్ 13న ఈ లోకాన్ని విడిచారు. ఆయన మరణం తెలంగాణ సాహిత్యరంగానికే కాకుండా, సమాజానికే ఒక అపార నష్టం. నేడు వరంగల్ లోని కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆయన పేరు సాక్షిగా నిలుస్తోంది. ఆయన రచనలపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా "నా గొడవ" అప్పటి సామాజిక–రాజకీయ దర్పణంగా పరిగణించబడుతోంది. తెలంగాణ సాహిత్యం, సామాజిక చరిత్ర, రాజకీయ పోరాటాలన్నీ కాళోజీ జీవితం, రచనలతో ముడిపడి ఉన్నాయి.

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


సూక్ష్మంగా కాళోజి కేవలం ప్రజాకవి మాత్రమే కాదు, అన్యాయం మీద అలుపెరగని పోరాటం చేసిన ఒక సామాజిక తత్వవేత్త. ఆయన ఆలోచనలు, ఆశయాలు, రచనలు తరతరాలకూ దిక్సూచి, స్ఫూర్తి. తెలంగాణ భూమి పుట్టించిన ఈ మహానుభావుడు తన జీవితం, తన రచనల ద్వారా ప్రజలకు మార్గదర్శకుడిగా నిలిచారు.

**ఉపయుక్త గ్రంథసూచి**


1 కాళోజీ జీవితం సాహిత్యం – తూర్పు మల్లారెడ్డి

2 కాళోజి యాదిలో – ప్రభాకర్ టి

3 నా గొడవ కవితలు – కాళోజి నారాయణరావు

4 కాళోజి నారాయణరావు షష్టిపూర్తి అభినందన సంచిక – శ్రీ కృష్ణదేవరాయంధ్ర భాషా నిలయం, సుల్తాన్ బజార్

5 కాళోజి నారాయణరావు షష్టిపూర్తి అభినందన సంచిక — జనధణ, వరంగల్

6 కాళోజి – దాశరధి కృష్ణమాచార్యులు, సాహిత్య అకాడమి, రవీంద్ర ,ఫిర్జాది రోడ్, న్యూఢిల్లీ

7 కాళోజి ముచ్చట్లు – రామశాస్త్రి నాగిళ్ల 2004 కాళోజి ఫౌండేషన్, వరంగల్

8 తెలంగాణ ఉద్యమం ప్రజాకవి కాళోజి కవిత్వం – బన్న ఐలయ్య , 1969

9 కాళోజి నారాయణరావు – పేరు వారం జగన్నాథం సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ

10 కాళోజి రచనల్లో — సమాజం, భాష వ్యాసం – తిరుపతి బుక్య

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# బండారు ప్రసాద మూర్తి కథలు సామాజిక స్పృహ

**1. పిడతల రామచంద్రుడు**
M.A. ( Tel), M.A.( His ),B.Sc,B.Ed , APSET
పరిశోధక విద్యార్థి ,
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్
Ph:7981066369.

**2. డా . ఇరపని మాధవి**
ప్రొఫెసర్ , పర్యవేక్షకులు ,
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం ,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం , గుంటూరు

**ఉపోద్ఘాతం:**

ప్రపంచానికి కథా బిక్ష పెట్టింది భారతదేశమే అంటారు. ఆంగ్లంలోని షార్ట్ స్టోరీ ప్రక్రియను కథానికగా తెలుగులోనికి తీసుకువచ్చింది గురజాడ అప్పారావు . పురుడు పోసుకోవడంతోనే సమాజాన్ని ప్రతిబింబిస్తూ సంస్కరిస్తూ సంతోషింప చేస్తూ నేటికీ నిత్యయవ్వనం తో పరిఢవిల్లుతుంది. ఈ ప్రక్రియలో కవి రచయిత విమర్శకుడు అయిన బండారు ప్రసాద మూర్తి జాలువారిచిన కథల ముత్యాల హారం "సగం పిట్ట". మనుషుల అంతరంగాలను , ఆధునిక సమాజం సృష్టిస్తున్న యంత్ర సంస్కృతిని , దాని కారణంగా విచ్చిన్నమవుతున్న మానవ సంబంధాలను ఆయన తన కథల్లో అత్యంత సున్నితంగా విశ్లేషణాత్మకంగా చిత్రించారు.

ప్రసాదమూర్తి కథ సంపుటం సగం పిట్ట లో 18 కథలు ఉన్నాయి. అనామక మరణం, బంగారమ్మ ,పక్కన కూర్చున్న వ్యక్తి , గోల్డీ ది గ్రేట్ ,సువర్ణ గన్నేరు పూలు ,సగం పిట్ట ,తొలిప్రేమిక, ఒక రైలు ప్రయాణం, నిడమర్రు టు హైదరాబాద్ ,వందరెక్కల స్త్రీ ,ఆ అమ్మాయి , వెలి ,జన్మభూమి, నిజంగా నేనేనా ,మోరల్ డాగ్గింగ్,రెండు ముసలి బొమ్మలు, నా బిడ్డను కాపాడండి. ఈ కథలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. సామాజిక జీవుల వేదనలను పోరాటాలను అక్షరబద్ధం చేస్తాయి. సామాన్యుడి దృక్పథం నుండి లోకపు పోకడలను పరిశీలిస్తాయి.

**కీలక పదాలు :** యంత్ర నాగరికత , శ్రామిక వలసలు , శ్రామికుల ఆత్మగౌరవం , అనాలోచిత అనుమానాలు , ఏకాంతము – ఒంటరితనము , అస్తిత్వ పోరాటం.

**నగర జీవన విధానం యంత్ర నాగరికత :**

ఆధునిక మహానగరాలలో మనుషులు యాంత్రిక జీవితాన్ని గడుపుతూ ఇలా తమ సహజత్వాన్ని కోల్పోతున్నారు. అనామకమరణం సగం పిట్ట వంటి కథలలో అద్భుతంగా చిత్రించారు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తూ చివరకు తనంతట తానే అస్తిత్వ సంక్షోభం లో పడిపోయే నగర జీవి తీరును ప్రసాదమూర్తి ఆవిష్కరించారు . సగం పిట్ట అనే కథ లో "ఒరేయ్ కోటి అభివృద్ధి కావాలంటే అందాలు వదులుకోవాలా? కొండలు, గుట్టలు ,అడవులు చూడాలంటే ప్రపంచంలో ఎక్కడకు అయినా వెళ్లి చూడొచ్చా? డబ్బున్న వాడికి అందాలు అనుభవించే హక్కు ఉందని కదా నీ అహం ? – అని ప్రశ్నిస్తూ మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని ఎలా హతమారుస్తున్నాడు అనే విషయం ఈ కథ ద్వారా కళ్ళకు కట్టాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**శ్రామిక వలసలు పల్లె జీవనం:**

నిడమర్రు టు హైదరాబాద్ బంగారమ్మ వంటి కథలలో గ్రామీణ ప్రాంతాల నుండి ఉపాధి వెతుక్కుంటూ నగరాలకు వలస వెళుతున్న ఎందరో శ్రామిక జనుల దీన గాథలు వారి వేదనలు సజీవంగా రూపుదిద్దుకున్నాయి. పల్లెల్లో మనుషులు పట్టణాలలో కూలీలుగా మారే వేదనాభరిత నేపథ్యాన్ని స్పృశించారు. శివాలు వంటి పాత్ర ద్వారా వలస బతుకుల దయనీయతను వివరిస్తూ "బాబు నీకు దన్నం పెడతాను. నేనిక్కడున్నానని మన ఊళ్లో చెప్పొద్దు రా " అని ప్రాధేయపడే దృశ్యంలో పల్లెను వదిలి పట్టణంలో అనామకులుగా బతుకులాగుతున్న శ్రామికుల ఆత్మగౌరవం ఏ గతికి దిగజారింది తెలుస్తుంది.

**మతతత్వాలు మానసిక అశాంతి:**

మతం మనుషులను ఒక నీతికి ధర్మానికి న్యాయానికి కట్టుబడేలా చేయాలి. అయితే కొన్ని సందర్భాలలో మతం సామాన్యులలో అభద్రత భావాలను అనాలోచితం అనుమానాలను ఏర్పరచి సామాన్యుల గుండెలను ఎంత క్షోభకు గురిచేస్తాయో ' ఒక రైలు ప్రయాణం ' కథలో అత్యంత హృద్యంగా చిత్రించారు. మత కల్లోలాల నేపథ్యంలో ఒక ముస్లిం జంటను చూసి భయపడిపోయే సగటు హిందూ మానసిక సంఘర్షణను వివరిస్తూ , రచయిత తన అంతర్ మతనాన్ని ఇలా రాశారు. "ముస్లిం లారా, నేను హిందువును. దయచేసి క్షమించండి. హిందువులారా, నేను ముస్లిం ను . దయచేసి బ్రతకనివ్వండి. ఉగ్రవాదులారా , నేను శాంతిని దయచేసి కరుణించండి. రాజకీయులారా నేను ఓటరును .దయచేసి విడిచిపెట్టండి . దేవుళ్ళారా నేను మనిషిని . దయచేసి పారిపోండి " అంటూ మతాల మధ్య చిక్కుకొని నలిగిపోతున్న మానవత్వాన్ని అద్దం పట్టారు.

**వృద్ధాప్యం – ఒంటరితనం:**

పిల్లలు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిపోగా, స్వదేశంలో ఒంటరిగా మిగిలిన వృద్ధ దంపతుల మానసిక వ్యధను 'సువర్ణ గన్నేరు పూలు' కథలో చక్కగా చూపించారు. వారు ప్రకృతితో, చెట్లతో మమేకమై తమ ఒంటరితనాన్ని ఎలా ఉపశమనం చేసుకుంటున్నారో వివరిస్తూ, గన్నారావు పాత్ర ద్వారా రచయిత ఈ సత్యాన్ని ఆవిష్కరిస్తారు. "పిల్లలే కాదు, ఇక్కడ ఏదీ నీది కాదు. ఈ ప్రకృతిలో నువ్వు ఒక భాగమే. కానీ నువ్వెలాంటి భాగస్వామ్యం డిమాండ్ చేయలేవు… చేతనైతే నిన్ను నువ్వు నిత్యం పూలు పూసే చెట్టులా మలచుకో."– అన్న మాటలు ప్రకృతితో మనిషికి ఉండాల్సిన సాహచర్యాన్ని గురించి తెలియజేస్తాయి.

**కుల వివక్ష – అస్తిత్వ పోరాటం:**

'వెలి' కథలో దళిత బాహ్య సమాజం ఎదుర్కొంటున్న బహిష్కరణలు, కుల అహంకారపు దాడులను కళ్లకు కట్టారు. గ్రామంలో అణగారిన వర్గాలు తమ హక్కుల కోసం, అస్తిత్వం కోసం సాగించే నిరంతర ప్రయాణాన్ని వివరిస్తూ, ఆ కలల స్వభావాన్ని ఇలా వర్ణించారు ."బొమ్మలు తలల మీద. చూపులు కనిపించే దిక్కుల మీద. కాళ్ళు ముందుకే కదులుతున్నాయి. రాళ్ళు తగిలి నెత్తుర్లు కారినా… క్రిమికీటకాలు కుట్టినా… నరాలు సలపరించినా… చంకల్లో పిల్లాజెల్లా… తట్టాబుట్టా… తలపై విగ్రహాలు ఏమీ బరువనిపించడం లేదు." స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా , దళితుల జీవన స్థితి మారలేదు అని రచయిత చెబుతున్నారు.

**రచయిత సామాజిక జీవన చిత్రణలో చూపించిన నేర్పు:** ప్రసాదమూర్తి జీవన చిత్రణలో ప్రదర్శించిన నేర్పు అనన్యసామాణికమైనది. ఆయన ఏ ఒక్క పాత్రను కేవలం మంచివారనో, చెడ్డవారనో ముద్ర వేయకుండా, మనుషుల ప్రవర్తన వెనుక ఉన్న సామాజిక, మానసిక నేపథ్యాన్ని విశ్లేషిస్తారు.

**మనోవైజ్ఞానిక విశ్లేషణ:**

పాత్రల బాహ్య ప్రవర్తన కంటే వాటి అంతరంగిక కల్లోలాన్ని, సంఘర్షణను చూపడంలో ఆయన సిద్ధహస్తులు. ఉదాహరణకు 'అనామక మరణం' కథలో, సమాజంలో జరుగుతున్న హేయమైన నేరాలను, హింసాత్మక వార్తలను భరించలేక మతిమరుపు (Alzheimer's) కావాలని కోరుకునే ఒక మేధావి మానసిక స్థితిని వివరిస్తూ రచయిత అంటారు:"కొంచెం కొంచెం మర్చిపోరా… మనమిక్కడేం చేయలేంరా. కొన్ని వార్తలు చూడలేం. చూసి తట్టుకోలేం. అలాంటివి జరక్కుండా ఆపలేం. జరిగినవి చూస్తే గుండె భరించలేదు ."ఇది ఆధునిక కాలంలో సున్నిత మనస్కులు ఎదుర్కొనే మానసిక క్షోభకు దర్పణం పడుతుంది.

**ప్రకృతి – మనిషి సంబంధం:** సృష్టిలోని ప్రతి జీవికీ బతికే హక్కు ఉందని, మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేస్తే అది తిరగబడుతుందనే సత్యాన్ని 'సగం పిట్ట' కథలో ప్రతీకాత్మకంగా చూపించారు. పిట్ట మాటల ద్వారా కోటేశ్వరరావు అంతరంగాన్ని మథింపజేస్తూ, "నీ కళ్ళు ప్రకృతి అందాలు కోరుకుంటున్నాయి. నీ దేహం..నీ మనసు సుఖాలు కోరుకుంటున్నాయి. నీకు తెలుసు. నువ్వు తప్పు చేస్తున్నావని. అయినా ఏం చేస్తావు చెప్పు. నువ్వు నీ అధీనంలో లేవురా..."అని చెప్పించడం ద్వారా రచయిత మానవ నైజంలోని ద్వంద్వత్వాన్ని ఎత్తిచూపారు.

**ముగింపు:**

బండారు ప్రసాద మూర్తి కథలు మనిషి అంతరంగాన్ని తట్టి లేపే దర్పణాలు ఆధునిక సమాజపు వివిధ కోణాలను ఆయన తన కథలలో సమర్థంగా స్పృశించారు. మనిషి మనిషిని మనిషిలా ప్రేమించాలనే తపన సమాజం మరింత మానవయంగా మారాలని ఆకాంక్ష ప్రతి కథలోను గోచరిస్తుంది సామాజిక స్పృహను ఆధారం చేసుకుని ప్రసాదమూర్తి కథ సాహిత్యం తెలుగు కథాలోకంలో అరుదైన మైలురాయిగా నిలిచిపోతుంది.

**ఆధార గ్రంథాలు ;**


1. ప్రసాదమూర్తి బండారు సగం పిట్ట
2. కథానిక స్వరూప స్వభావాలు పోరంకి దక్షిణామూర్తి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ప్రకృతి అనుబంధం – సాహిత్య ప్రతిబింబం

**డా. కందుకూరి దినేష్ బాబు**
సంస్కృత అధ్యాపకులు
ప్రభుత్వ కళాశాల,రాజమహేంద్రవరం
చరవాణి :8555984641

**అరిగెల శ్రీకాంత్**
తెలుగు పరిశోధక విద్యార్థి
ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం
చరవాణి :7981941623

**ఉపోద్ఘాతం:**

మనిషి పుట్టుక నుంచి ప్రకృతితో అతని సంబంధం కొనసాగుతూనే ఉంది. మానవ జీవనానికి అవసరమైన గాలి, నీరు, నేల, ఆహారం, అడవులు, వృక్షాలు, నదులు, జంతువులు వంటి సహజ వనరులన్నీ ప్రకృతిలోనే లభిస్తాయి. ప్రకృతిని ఆధారంగా చేసుకుని మానవ సమాజం తన జీవనాన్ని నిర్మించుకుంది. వ్యవసాయం, పశుపోషణ, వృత్తులు, గ్రామీణ జీవితం, గిరిజన సంస్కృతి వంటి అనేక జీవన విధానాలు ప్రకృతితో విడదీయలేని సంబంధాన్ని కలిగి ఉన్నాయి.

ఆధునిక నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనిషి ప్రకృతిని చూసే విధానంలో మార్పు వచ్చింది. అవసరాలను తీర్చుకోవడం నుంచి ప్రకృతిని అధికంగా వినియోగించుకోవడం వరకు మానవుడి ప్రయాణం సాగింది. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, అడవుల నరికివేత, సహజ వనరుల అధిక వినియోగం, భూమి కాలుష్యం, నీటి వనరుల క్షీణత, సంప్రదాయ వ్యవసాయ విధానాల మార్పు వంటి పరిణామాలు పర్యావరణ సమతుల్యతను ప్రభావితం చేస్తున్నాయి.

ఈ మార్పుల ప్రభావం మానవ సమాజంపై మాత్రమే కాకుండా సాహిత్యంపైనా పడింది. సాహిత్యం సమాజంలో జరుగుతున్న మార్పులను సున్నితంగా గ్రహించే ప్రక్రియ కావడంతో పర్యావరణ సమస్యలు కూడా సాహిత్య వస్తువులుగా మారాయి. ముఖ్యంగా ఆధునిక తెలుగు కథలు, నవలలు ప్రకృతిని కేవలం సౌందర్య వస్తువుగా కాకుండా మానవ అస్తిత్వంతో ముడిపడిన అంశంగా చిత్రించాయి. భూమి, నీరు, అడవులు, విత్తనాలు, వ్యవసాయం, రైతు జీవితం, గిరిజన జీవితం వంటి అంశాల ద్వారా పర్యావరణ చైతన్యాన్ని వ్యక్తం చేశాయి.

**కీలక పదాలు:** పర్యావరణ సాహిత్యం, ప్రకృతి, పర్యావరణ చైతన్యం, భూమి, నీరు, అడవులు, రైతు జీవితం, గిరిజన జీవితం, దేశీ విత్తనాలు, జీవవైవిధ్యం, ప్రకృతి పరిరక్షణ, సుస్థిర జీవనం.

**పరిచయం:**

తెలుగు సాహిత్యంలో ప్రకృతి చిత్రణకు ప్రాచీన కాలం నుంచే ప్రత్యేక స్థానం ఉంది. కవిత్వంలో ఋతువులు, వర్షాలు, నదులు, కొండలు, పూలు, చెట్లు, పక్షులు మొదలైన ప్రకృతి అంశాలు సౌందర్యానుభూతికి సాధనాలుగా నిలిచాయి. అయితే ఆధునిక కాలంలో ప్రకృతిని చూసే దృష్టిలో ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే దృష్టితో పాటు, ప్రకృతికి జరుగుతున్న నష్టాన్ని ప్రశ్నించే దృష్టి కూడా ఏర్పడింది. ఈ మార్పు ఆధునిక కథా, నవలా సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒక చెట్టు నరికివేయబడటం, ఒక చెరువు ఎండిపోవడం, భూమి సాగుకు అనుకూలంగా లేకపోవడం, సంప్రదాయ విత్తనాలు కనుమరుగవడం, అడవులు నాశనం కావడం వంటి సంఘటనలు ఇప్పుడు కేవలం నేపథ్య విషయాలు కావు. అవి పాత్రల జీవితాలను, వారి ఆర్థిక పరిస్థితులను, సామాజిక సంబంధాలను ప్రభావితం చేసే ప్రధాన సమస్యలుగా మారాయి.

పర్యావరణ సాహిత్యాన్ని ఈ నేపథ్యంలో పరిశీలించినప్పుడు ప్రకృతి సమస్యను మానవ జీవిత సమస్య నుంచి వేరు చేయలేమని తెలుస్తుంది. రైతుకు భూమి లేకపోతే వ్యవసాయం ఉండదు. నీరు లేకపోతే పంట ఉండదు. అడవి లేకపోతే అడవిపై ఆధారపడే గిరిజన జీవితం దెబ్బతింటుంది. స్థానిక విత్తనాలు నశిస్తే వ్యవసాయ జీవవైవిధ్యం తగ్గుతుంది. ఈ పరస్పర సంబంధాలను కథలు, నవలలు తమ కథనాల ద్వారా స్పష్టంగా చూపిస్తున్నాయి.

**ఆధునిక తెలుగు కథలు, నవలలు – పర్యావరణ చైతన్యం:**

తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి కథల్లో ప్రకృతి పట్ల సున్నితమైన దృష్టి కనిపిస్తుంది. ఆయన కథా రచనలను పరిశీలించినప్పుడు పర్యావరణ స్పృహ ఒక ప్రత్యేకమైన అంశంగా గుర్తించవచ్చు. ముఖ్యంగా **'జోగిపంతులు తిరిగి రాలేదు'**, **'ఉర్వి'** వంటి కథల్లో పర్యావరణ స్పృహ కనిపిస్తుంది.

'జోగిపంతులు తిరిగి రాలేదు' కథలో ప్రకృతితో మనిషికి ఉన్న సంబంధాన్ని పరిశీలించవచ్చు. ప్రకృతి మనిషికి వెలుపల ఉన్న ఒక వస్తువు కాదని, మనిషి జీవనంలో భాగమని గుర్తించే దృష్టి కథలో కనిపిస్తుంది. ప్రకృతిని కేవలం తన అవసరాలకు ఉపయోగించుకునే వస్తువుగా చూడటం వల్ల మనిషి తన జీవనానికి అవసరమైన సహజ సమతుల్యతను కోల్పోతాడు.

పర్యావరణ కోణంలో పరిశీలించినప్పుడు ప్రకృతిలో జరిగే మార్పులు మానవ జీవనంపై చూపించే ప్రభావం ప్రధానంగా ఈ కథల్లో కనిపిస్తుంది. ప్రకృతి నుంచి మనిషి దూరమవుతున్న కొద్దీ అతని జీవితం కూడా తన సహజత్వాన్ని కోల్పోతుంది. అందువల్ల ప్రకృతిని పరిరక్షించడం అనేది మానవ జీవనాన్ని పరిరక్షించడంలో భాగమవుతుంది.

**'ఉర్వి'** కథలో భూమి,మనిషి సంబంధాన్ని పర్యావరణ దృష్టితో చూడవచ్చు. భూమి మానవ జీవనానికి ప్రాథమిక ఆధారం. వ్యవసాయం, ఆహారం, నివాసం, జీవనాధారం వంటి అంశాలన్నీ భూమితో ముడిపడి ఉన్నాయి. భూమిని కేవలం ఆర్థిక విలువ కలిగిన వస్తువుగా చూడడం వల్ల దాని సహజ విలువను మరిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ తరహా కథలు పర్యావరణ సమస్యను ఒక నైతిక ప్రశ్నగా కూడా ముందుకు తెస్తాయి. మనిషికి ప్రకృతిని వినియోగించే హక్కు ఉన్నప్పటికీ, దానిని నాశనం చేసే హక్కు ఉందా? అనే ప్రశ్న పాఠకుడి ముందుకు వస్తుంది. ఈ ప్రశ్నే పర్యావరణ చైతన్యానికి ప్రాథమికమైన ఆలోచన.

**'మూగవాని పిల్లనగ్రోవి'లో భూమి—రైతు అనుబంధం:**

కేశవరెడ్డి రచించిన **'మూగవాని పిల్లనగ్రోవి'** ఆధునిక తెలుగు సాహిత్యంలో రైతు,భూమి సంబంధాన్ని బలంగా ప్రతిబింబించే రచనగా గుర్తించవచ్చు. ఈ నవలలో బక్కిరెడ్డి అనే రైతు పాత్ర ద్వారా భూమితో రైతుకు ఏర్పడే ఆత్మీయ సంబంధం వ్యక్తమవుతుంది. రైతుకు భూమి కేవలం కొనుగోలు చేయగల, అమ్మగల ఆస్తి కాదు. అతని జీవితం, శ్రమ, కుటుంబం, జ్ఞాపకాలు, భవిష్యత్తు అన్నీ భూమితో అనుసంధానమై ఉంటాయి. రైతు తన శ్రమను భూమిలో పెట్టుబడిగా పెట్టడమే కాకుండా, తన జీవితం మొత్తాన్ని దానితో ముడిపెడతాడు. అందువల్ల భూమి నుంచి అతను దూరమైతే ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా అస్తిత్వ సంక్షోభం కూడా ఏర్పడుతుంది.

ఈ అంశాన్ని పర్యావరణ దృష్టితో చూస్తే భూమి విలువ మార్కెట్ విలువకు మించినదని తెలుస్తుంది. భూమి వ్యవసాయానికి ఆధారం. వ్యవసాయం గ్రామీణ సమాజానికి ఆధారం. గ్రామీణ సమాజం అనేక కుటుంబాల జీవనాధారం. కాబట్టి భూమి రక్షణ అనేది ఒక రైతు వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజ జీవనానికి సంబంధించిన అంశం. ప్రకృతి, వ్యవసాయం, రైతు జీవితం పరస్పర సంబంధంతో కనిపిస్తాయి. వర్షం, నేల, పంట, వ్యవసాయ శ్రమ వంటి అంశాలు రైతు జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ కారణంగా రైతు జీవితం ప్రకృతి పరిస్థితులతో ఎంతగా ముడిపడి ఉందో ఈ రచన తెలియజేస్తుంది.

**'ఒంటరి'లో ప్రకృతి,మనిషి సహజీవనం:**

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రచించిన **'ఒంటరి'** ఆధునిక తెలుగు పర్యావరణ సాహిత్యంలో ముఖ్యమైన నవలగా పరిశీలించదగినది. ఈ నవలలో గ్రామీణ ప్రకృతి, వృక్షాలు, పొదలు, బీడు భూములు, వ్యవసాయం, దేశీ విత్తనాలు, చిరుధాన్యాలు వంటి అంశాలు భాగమవుతాయి. ప్రకృతిని కాపాడటానికి అవసరమైన సంప్రదాయ జ్ఞానానికి ప్రాధాన్యం కనిపిస్తుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు స్థానిక విత్తన సంపద తగ్గిపోవడం, సంప్రదాయ పంటలకు దూరమవడం వంటి పరిణామాలు పర్యావరణ పరంగా ఆలోచించాల్సిన అంశాలను ముందుకు తెస్తాయి. పాత వృక్షాలను తొలగించడం, సహజంగా ఉన్న పొదలు, బీడు ప్రాంతాలను మార్చడం వంటి చర్యలు మానవ అభివృద్ధి దృష్టిలో ఒక రకమైన మార్పుగా కనిపించవచ్చు. అయితే ఆ మార్పుల వల్ల జీవావరణంలో కలిగే నష్టాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరాన్ని రచన సూచిస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

'ఒంటరి'లో నర్సయ్య పాత్ర ప్రకృతితో సన్నిహితంగా జీవించే జీవన విధానానికి ప్రతినిధిగా కనిపిస్తుంది. అతని జీవన విధానంలో ప్రకృతిని అర్థం చేసుకోవడం, స్థానిక విత్తనాలను కాపాడటం, సహజ వ్యవసాయ పద్ధతుల పట్ల శ్రద్ధ చూపడం వంటి అంశాలు కనిపిస్తాయి. ఇక్కడ పర్యావరణ పరిరక్షణ అంటే కేవలం చెట్లను కాపాడటం కాదు. దేశీ విత్తనాలను, సంప్రదాయ వ్యవసాయ జ్ఞానాన్ని, స్థానిక జీవవైవిధ్యాన్ని, భూమి సహజత్వాన్ని కాపాడటం కూడా పర్యావరణ పరిరక్షణలో భాగమే అనే విస్తృతమైన భావన కనిపిస్తుంది.

**'అడవి బతుకులు'లో అడవి,గిరిజన జీవితం:**

దిలావర్ రచించిన **'అడవి బతుకులు'** నవల పర్యావరణం, ఆదివాసీ జీవితం, సహజ వనరుల మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించడానికి ఉపయోగపడే రచన. ఈ నవలలో చెంచు సమాజ జీవితం అడవితో అనుసంధానమై ఉంటుంది. చెంచులకు అడవి కేవలం చెట్ల సమూహం కాదు. వారి ఆహారం, జీవనాధారం, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం, జీవన విధానం అన్నీ అడవితో ముడిపడి ఉంటాయి. అందువల్ల అడవికి జరిగే నష్టం ఒక సహజ వనరుకు మాత్రమే కలిగే నష్టం కాదు. అది ఒక సమాజ జీవన విధానానికి కలిగే నష్టంగా మారుతుంది.

ఈ నవలలో సహజ వనరుల వినియోగం, అడవులపై పెరుగుతున్న ఒత్తిడి, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం వంటి అంశాలను పర్యావరణ దృష్టితో పరిశీలించవచ్చు. ముఖ్యంగా యురేనియం తవ్వకాల వంటి అంశాలు ప్రకృతి పరిరక్షణ, స్థానిక ప్రజల జీవన హక్కులు, అభివృద్ధి వంటి ప్రశ్నలను లేవనెత్తుతాయి. అభివృద్ధి పేరుతో సహజ వనరులను ఉపయోగించుకోవడం అవసరం కావచ్చు. అయితే ఆ అభివృద్ధి వల్ల స్థానిక ప్రజల జీవితం, అడవులు, నీటి వనరులు, జీవవైవిధ్యం దెబ్బతింటే ఆ పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఆలోచన పర్యావరణ సాహిత్యంలో ముఖ్యమైన అంశం.

**పర్యావరణం – వ్యవసాయం – జీవన విధానం:**

ఆధునిక తెలుగు కథలు, నవలల్లో వ్యవసాయం పర్యావరణంతో ముడిపడిన ముఖ్యమైన అంశంగా కనిపిస్తుంది. రైతు జీవితం వర్షం, నేల, విత్తనం, నీరు, కాలం వంటి ప్రకృతి అంశాలపై ఆధారపడి ఉంటుంది. 'మూగవాని పిల్లనగ్రోవి'లో భూమి–రైతు అనుబంధం, 'ఒంటరి'లో దేశీ విత్తనాలు, చిరుధాన్యాలు, సంప్రదాయ వ్యవసాయ విధానం వంటి అంశాలు ఈ సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తాయి. ఆధునిక వ్యవసాయంలో ఉత్పత్తి పెంచడం ప్రధాన లక్ష్యంగా మారినప్పుడు స్థానిక విత్తనాలు, సంప్రదాయ పంటలు, నేల సహజసారం వంటి అంశాలు వెనుకబడే అవకాశం ఉంది. స్థానిక విత్తనాల పరిరక్షణ జీవవైవిధ్యానికి మాత్రమే కాకుండా భవిష్యత్ వ్యవసాయ భద్రతకు కూడా

అవసరమైన అంశంగా పరిగణించవచ్చు. అందువల్ల సాహిత్యంలో వ్యవసాయ సమస్యను కేవలం రైతు ఆర్థిక సమస్యగా కాకుండా పర్యావరణ సమస్యగా కూడా చూడాల్సిన అవసరం కనిపిస్తుంది.

**పర్యావరణం – అడవి – జీవవైవిధ్యం:**

అడవులు పర్యావరణ సమతుల్యతలో కీలకమైన భాగం. అడవుల్లోని చెట్లు, మొక్కలు, జంతువులు, పక్షులు, సూక్ష్మజీవులు పరస్పరం ఆధారపడి జీవిస్తాయి. ఒక భాగం దెబ్బతింటే దాని ప్రభావం మొత్తం జీవావరణంపై పడుతుంది. 'అడవి బతుకులు' వంటి రచనలు అడవిని కేవలం ప్రకృతి దృశ్యంగా కాకుండా ఒక సంపూర్ణ జీవ ప్రపంచంగా చూపించే అవకాశం కల్పిస్తాయి. అడవితో జీవించే సమాజాల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు ఉన్న సామాజిక కోణం కూడా స్పష్టమవుతుంది. అడవి నశిస్తే చెట్లు మాత్రమే నశించవు. వాటిపై ఆధారపడే జీవజాలం, నీటి వనరులు, నేల, స్థానిక సంస్కృతి, ప్రజల జీవనాధారం కూడా ప్రభావితమవుతాయి. ఈ విస్తృతమైన అర్థంలో అడవి పరిరక్షణ పర్యావరణ పరిరక్షణలో ఒక ముఖ్యమైన భాగం.

**ప్రకృతి పరిరక్షణలో సాహిత్యం పాత్ర:**

సాహిత్యం శాస్త్రీయ నివేదికలా పర్యావరణ సమస్యలను గణాంకాలతో వివరించదు. అది మనిషి అనుభవం ద్వారా సమస్యను పరిచయం చేస్తుంది. రైతు భూమిని కోల్పోయినప్పుడు అతనిలో కలిగే బాధను చూపిస్తుంది. అడవి నాశనమైతే దానిపై ఆధారపడిన

సమాజం ఎలా ప్రభావితమవుతుందో చూపిస్తుంది. విత్తన సంపద తగ్గిపోతే వ్యవసాయ జీవనంలో వచ్చే మార్పులను సూచిస్తుంది. ఈ విధంగా పర్యావరణ సమస్య పాఠకుడికి ఒక జీవన అనుభవంగా మారుతుంది. అందువల్ల సాహిత్యం పర్యావరణ చైతన్యాన్ని కలిగించడంలో ప్రత్యేకమైన పాత్రను పోషిస్తుంది.

పర్యావరణ సాహిత్యంలో ముఖ్యమైన లక్షణం ఏమిటంటే అది మనిషిని ప్రకృతికి వెలుపల ఉన్నవాడిగా చూడదు. మనిషి కూడా ప్రకృతిలో ఒక భాగమే అనే భావనను ముందుకు తెస్తుంది. ప్రకృతికి కలిగే నష్టం చివరకు మానవ సమాజానికే తిరిగి వస్తుంది. ఈ పరస్పర సంబంధాన్ని కథలు, నవలలు బలంగా వ్యక్తం చేస్తున్నాయి.

**ముగింపు:**

ఆధునిక తెలుగు కథలు, నవలల్లో పర్యావరణ చైతన్యం అనేక రూపాల్లో వ్యక్తమవుతోంది. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడం నుంచి ప్రకృతి విధ్వంసాన్ని ప్రశ్నించే దిశగా సాహిత్య దృష్టి విస్తరించింది. భూమి, నీరు, అడవులు, వ్యవసాయం, విత్తనాలు, జీవవైవిధ్యం, రైతు జీవితం, గిరిజన జీవితం వంటి అంశాలు పర్యావరణ చర్చలో భాగమయ్యాయి. తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి కథల్లో ప్రకృతి పట్ల సున్నితమైన దృష్టి, కేశవరెడ్డి 'మూగవాని పిల్లనగ్రోవి'లో భూమి–రైతు అనుబంధం, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'ఒంటరి'లో ప్రకృతితో సహజీవనం మరియు దేశీ విత్తనాల ప్రాధాన్యం, దిలావర్ 'అడవి బతుకులు'లో అడవి–గిరిజన జీవన సంబంధం వంటి అంశాలు ఆధునిక తెలుగు పర్యావరణ సాహిత్యంలోని విభిన్న పార్శ్వాలను వెల్లడిస్తున్నాయి.

ఈ రచనల ద్వారా ప్రకృతి మనిషికి వెలుపల ఉన్న వస్తువు కాదని, మానవ జీవనానికి ఆధారమైన జీవావరణమని అర్థమవుతుంది. భూమిని, నీటిని, అడవులను, స్థానిక విత్తనాలను, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యత. పర్యావరణ పరిరక్షణ అనేది వ్యక్తిగత బాధ్యతతో పాటు సామాజిక బాధ్యత కూడా. పర్యావరణ పరిరక్షణపై ఈ అవగాహనను ప్రజల్లో కలిగించడంలో ఆధునిక తెలుగు కథలు, నవలలు తమదైన సాహిత్యపాత్రను నిర్వహిస్తున్నాయి. అందువల్ల పర్యావరణ సాహిత్యం కేవలం ప్రకృతి వర్ణనకు పరిమితమైన సాహిత్య ధోరణి కాదు. అది మనిషి–ప్రకృతి సంబంధాన్ని పునరాలోచింపజేసే, సహజ వనరుల విలువను గుర్తుచేసే, పర్యావరణ పరిరక్షణ పట్ల సామాజిక బాధ్యతను పెంపొందించే సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చెందుతోంది.

**ఆధార గ్రంథాలు**


1. కేశవరెడ్డి – మూగవాని పిల్లనగ్రోవి.
2. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి – ఒంటరి.
3. దిలావర్ – అడవి బతుకులు.
4. తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి – తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి కథలు.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ఆమె అడవిని జయించింది నవల – సామాజిక జీవన చిత్రణ

– ఎల్లముల మానస

పరిశోధక విద్యార్థిని

హైదరాబాదు విశ్వవిద్యాలయం

చరవాణి: 9390965210

ఇమెయిల్: 25htph06@uohyd.ac.in

**వ్యాససంగ్రహం:**

గీతాంజలి (డా. భారతి) గారు రాసిన మొదటి నవల ఆమె అడవిని జయించింది. ఈ నవల సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, పురుషాధిక్యత, కుల – మత భేదాలు, లైంగిక వేధింపులు, మానవ సంబంధాలు, ప్రపంచీకరణ ప్రభావం వంటి సామాజిక సమస్యలను తెలియజేస్తుంది. ఈ నవలపై ప్రేమకుమారి గారు“**ఆమె అడవిని జయించింది నవల – స్త్రీవాద దృక్పథం”** అనే అంశం పై తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ చేసారు. అలాగే ఎన్.సుభాషిణి గారు “**ఆమె అడవినిలా జయించింది”** అనే వ్యాసం రాసారు. ప్రస్తుత వ్యాసంలో ఈ నవలలోని వివిధ రకాల సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ,నవలలోని పాత్రలు ఏ విధంగా సామాజిక చైతన్య దిశగా ముందుకు నడిచాయో తెలియజేయడం ఈ పరిశోధన వ్యాస ప్రధాన ఉద్దేశం. ఈ నవలలో కనిపించే ఒక వ్యక్తిలోని భిన్న మనస్తత్వ ధోరణులు, విద్య,తెలివితేటలు ఉన్న స్త్రీలు కూడా మూఢవిశ్వాసాలను నమ్ముతూ భర్త ఆధీనంలో ఉండే స్త్రీల జీవితాలు, ప్రేమ – వ్యామోహాల మధ్య నలిగిపోతున్న స్త్రీలు, కులాంతర వివాహాలు చేసుకొని అటు పుట్టింటి వారికి, ఇటు అత్తింటి వారికి దూరమై నిత్యం గొడవలు పడుతూ ఉండేటటువంటి ఒక కుటుంబ వాతావరణంలో పెరుగుతున్న పిల్లల మానసిక స్థితిని, వివాహం తర్వాత స్త్రీలు తమ అస్తిత్వాన్ని ఏ విధంగా కోల్పోతున్నారు మొదలగు వంటి అంశాలను ప్రస్తుత సమాజానికి అద్దం పట్టేలా రచయిత్రి వివరించిన తీరును ఈ వ్యాసం ద్వారా తెలియజేసే ప్రయత్నం చేస్తాను. ఈ అధ్యయనం రచయిత్రి సామాజిక స్పందనను, సమాజం పై ఆమెకున్న అవగాహనను లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

**కీలక పదాలు:** పురుషాధిక్యత, కులాంతర వివాహాలు, స్త్రీల సమస్యలు, మూఢ విశ్వాసాలు, సామాజిక జీవనం.

## 1.పరిచయం:

సమాజపు స్థితిగతులకు అద్దం పట్టేదే సాహిత్యం. సమాజంలోని మార్పులు, మనుషుల జీవన విధానం సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తాయి. సాధారణంగా సామాజిక జీవన విధానం అనేది సాహిత్యంలో వివిధ పాత్రలు, సన్నివేశ కల్పనలు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, కష్టసుఖాలు మరియు ఆర్థిక – రాజకీయ పరిస్థితుల ద్వారా తెలుస్తుంది. ఈ విధమైన అంశాలను విస్తృతంగా వివరించడానికి అనువైన సాహిత్య ప్రక్రియ నవల అని చెప్పవచ్చు.ఎందుకంటే **“నవల జీవితానికి ప్రతిబింబం మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియల కన్నా దీని పరిధి విస్తృతమైంది. సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ ఆచార వ్యవహారాల్ని వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల". (పుట. 47)** అని ముదిగంటి సుజాతారెడ్డి గారు తన తెలుగు నవలానుశీలనంలో చెప్పారు. అలాగే వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు తన నవలాశిల్పంలో **“వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల”(పుట. 13)** అని చెప్పారు. తెలుగు సాహిత్యంలో బహుళ ప్రజాదరణ పొందుతున్న నవలా ప్రక్రియ సామాజిక జీవన విధానాన్ని తెలియజేయడంలో ఎంతగానో దోహదపడుతుంది. సాధారణంగా ఏ సృజనాత్మక రచనకైన సమాజమే ప్రేరణనిస్తుంది. అలాగే ఈ నవలలో రచయిత్రి తన సృజనాత్మకతతో తీర్చిదిద్దిన సంఘటనలు, సన్నివేశ కల్పనలు ఏ విధంగా సామాజిక జీవన విధానాన్ని

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలియజేస్తుందో వివరించే ప్రయత్నం చేస్తాను. ఆమె అడవిని జయించింది అనే ఈ నవల 1998 లో రాసినప్పటికీ ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు ఏ మాత్రం తీసిపోకుండా ఉంటుంది. అందుకే దీనిని జయధీర్ తిరుమల రావు గారు **అత్యాధునిక నవల** అని అన్నారు.

**2. నవల నేపథ్యం :**

ఆమె అడవిని జయించింది నవల నేపథ్యం కుటుంబాన్ని కేంద్రంగా చేసుకొని ఉంటుంది. ఇందులోని ప్రధాన పాత్రలు సంధ్య, చంద్రం, అరుంధతి, సిద్దార్థ, సంధ్య కుటుంబ సభ్యులు, చంద్రం కుటుంబ సభ్యులు. ఇందులో సమాజం ఒక అడవిగా చెప్పబడింది. అడవిలో ఎన్నో రకాల పిచ్చి చెట్లు చిక్కుముడిలాంటి తీగలు,క్రూర జంతువులుంటాయి. అలాంటి అడవిని జయించడం అంటే అజ్ఞానం, అంధకారం నుండి వెలుగులోకి వెళ్ళడమని చెప్పవచ్చు. సంధ్య తనచుట్టూ ఉన్న సామాజిక కట్టుబాట్లు, కుటుంబంలో ఎదురైన మానసిక సంఘర్షణలు, ప్రేమ వ్యామోహాల మధ్య ఊపిరాడకుండా ఉంటుంది. ఈ అడ్డంకులన్నింటినీ దాటుకుంటూ సాగిన ఆమె ప్రయాణంలో ఎదురైన అశాంతి, వేదన ఆమెను దారి తప్పించకుండా విజయవంతంగా తన లక్ష్యం వైపు ముందుకు అడుగులువేయటమే ఈ నవలలోని సారాంశం.

**3. స్త్రీల మానసిక సమస్యలు :**

సమాజంలో స్త్రీలు ఇంటిపని, వంటపని, పిల్లలు, ఉద్యోగం అంటూ నిరంతరం ప్రవహించే నదిలా మనసుకి ప్రశాంతత లేకుండా తమ రోజువారీ పనులు చేయడం వల్ల మానసికంగా ఒత్తిడికి గురై హిస్టీరియా వంటి కొత్త రోగాలను తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ఒక సంఘటననే ఈ నవలలో మనకి కనిపిస్తుంది. సంధ్య తల్లిదండ్రులది కులాంతర వివాహం. దాంతో అమ్మ బంధువులు నాన్న బంధువులు దూరమై ఒంటరి జీవితం గడుపుతుంటారు. వీరికి ఐదుగురు పిల్లలు. అందులో యమున, జగన్నాథం చెవిటివాళ్ళుగా పుట్టడంతో భర్త మీ బంధువులలోనే ఎవరో ఉన్నారు అందుకే ఇలా పుట్టారని రోజు గొడవపడేవాడు. సంధ్య తల్లి చైతన్యవంతమైన స్త్రీ, ఒక ఉద్యోగస్తురాలు అయినా కూడా భర్త కారణంగా యమున, జగన్నాథాన్ని బాగా చూసుకోవడం మిగతా పిల్లలని ఎప్పుడూ అవమానిస్తూ, బాధపెడుతూ ఉండేది. ఈ విధంగా ఆర్థికంగా తన కాళ్ల పై తాను బ్రతకగలిగే స్తోమత ఉన్న పిల్లలకోసం భర్త పురుషాహంకరాన్ని ఎదిరించలేక హిస్టీరియా బారిన పడింది.

ఇటు సంధ్య కూడా తల్లితండ్రుల నిరంతర గొడవలమధ్య చిన్నప్పటి నుండి వారి ప్రేమకి దూరమై, ప్రేమపంచాల్సినవాళ్లె అవమానిస్తుంటే ఎవరితో మాట్లాడకుండా మానసికంగా తనలో తానే బాధపడుతుంది.“**యమున మనుషులు ఎలాంటివారో ఇట్టే పట్టేస్తుంది. దాన్ని చూసి నేర్చుకో. దానిలా తెలివిగా ఉండు. నీ ముఖం... నీ బొంద.”**(**గీతాంజలి. 2022: 88,89**) అంటూ తల్లి తన చెవిటి కూతురు యమున బాధపడకూడదని సంధ్యని ఎప్పుడూ తక్కువ చేసి మాట్లాడటం అలవాటుగా మారింది. ఇలా సంధ్య బాల్యం, యవ్వనం అంతా యమునతో పోల్చబడి ఆత్మన్యూనతకు గురవుతూ గడిచింది. **“ఒకసారి పదో తరగతిలో ఉన్నప్పుడు ఓ కుంటి అబ్బాయిని రైల్వేస్టేషన్లో చూసాక ఓ కథకి ఐడియా తట్టింది. ఇంటికొచ్చి ఈజీ చెయిర్లో చెక్క ప్లాంక్ పెట్టుకుని కథ రాస్తూ ఉంటే... గేటు తీసుకుని వచ్చిన నాన్న తన పుస్తకం లాక్కుని 'ఉండు'లో 'ఉ'కు బదులుగా 'వు' రాసానని 'ముండా' నీకు తెలుగే రాయడం రాదు కథ రాస్తావే అని పుస్తకాన్ని గేటు బయటకు విసిరేశాడు.”**(**గీతాంజలి. 2022:92**) సంధ్యకి తల్లి ప్రోత్సాహమే కాదు తండ్రి ప్రోత్సాహం కూడా లభించేది కాదు. తల్లిదండ్రుల ప్రేమకి దూరమైన సంధ్య చంద్రంని ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. వివాహం చేసుకున్న తర్వాతే పరాయి స్త్రీల అందాన్ని దొంగచాటుగా చూడటం అతని బలహీనత అని తెలుస్తుంది. తన ముందే తన భర్త ఇతర స్త్రీల అందాన్ని చూస్తూ తన మనసుని వారికి అప్పచెప్పి స్పృహ లేకుండా ఉండటం సంధ్య మానసిక వేదనను పెంచుతుంది. అంతేకాకుండా ప్రేమ వివాహం కారణంగా అత్తవారింట్లో కులం పేరిట అవమానాలకు గురవుతుంది. ఇక్కడ ఒక స్త్రీ భార్యగా, తల్లిగా, కూతురిగా, కోడలిగా తన మానసిక ప్రశాంతతనుఏ విధంగా కోల్పోతుందో గమనించవచ్చు.

అలాగే నవలలో పాఠకులను ఆశ్చర్యానికి గురిచేసే మరొక సంఘటన శ్రీవిద్యకి ఉన్న **అబ్సెసివ్ కంపల్సివ్ న్యూరోసిస్** అనే వ్యాధి. చిన్నప్పటి నుండి హాస్టల్లో చదువుకున్న శ్రీవిద్యకు వంటపని పూర్తిగా రాదు. తన చదువు తర్వాత తల్లితండ్రులు ఉమ్మడి కుటుంబంలోని సంబంధం తెచ్చి వివాహం చేసారు. శ్రీవిద్య చిన్నకోడలు, మిగతా ఇద్దరి కోడళ్లు చదువుకోలే కాని ఇంటిపని, వంటపనిలో మాత్రం పి.హెచ్

డి చేసారు. అత్త తిట్లు భరించలేక శ్రీవిద్య ఎలాగైనా వంటపని చేయకున్నా కనీసం ఇంటిపనిలో అయినా అత్తమెప్పు పొందాలనే తపనతో అతి శుభ్రానికి పోయి పదే పదే తుడవటం, కడగటం చేస్తూ తనని తానే మర్చిపోయి భయంకరమైన వ్యాధిబారిన పడుతుంది.

### 3. కులాంతర వివాహాలు – అవమానాలు:

ఈ నవలలో చర్చకు పెట్టిన అంశాలలో కులాంతర వివాహాలు మరొకటి. ప్రస్తుత సమాజంలో చదువుకున్నవారు, చదువులేనివారు అనే తేడా లేకుండా అందరి మనసుల్లో బలంగా నాటుకున్నది ఏదైనా ఉంది అంటే అది కులపట్టింపు అని చెప్పవచ్చు. ఈ నవలలో అగ్రకులం వారు నిమ్న కులం వారిని నిమ్నకులం వారు అగ్ర కులం వారిని వివాహం చేసుకోవడం వల్ల వారి సంప్రదాయాలు, ఆచారాలు ఎలాంటి ప్రభావంచూపుతాయో గమనించవచ్చు. సంధ్య, చంద్రంలది కులాంతర వివాహం. చంద్రం వాళ్లది బ్రాహ్మణ కుటుంబం. ఎప్పుడు మడి, ఆచారం అంటూ ఉంటారు. సంధ్యది బి.సి కులం. వ్రతాలు, పూజలు, ఉపవాసాలు ఏమి పట్టవు పైగా చిన్నప్పటి నుండి తనని పట్టించుకోకుండా కులం పేరుతో గొడవలుపడుతున్న తల్లిదండ్రుల మధ్య పెరిగిన వ్యక్తి. కాబట్టి బాగా చదువుకొని తనకాళ్లపై తాను నిలబడి సమాజానికి తనవంతు సహాయం చేయాలనుకుంటుంది. ధనికులని, పేదవారిని, అగ్రకులం, నిమ్నకులం వంటి భేదభావం లేకుండా అందరిని గౌరవించే వ్యక్తి. సంధ్య అత్తవాళ్లు పెద్ద భూస్వాములే ఇంటినిండా నౌకర్లతో, పిల్లలతో ఎప్పుడూ సందడిగా ఉంటుంది. శ్రావణమాసం వ్రతాలకి వెళ్ళిన సంధ్య అత్తవారింట్లో కులం పేరిట నౌకర్లకు జరిగే అవమానాలను చూసి బాధపడుతుంది.**"చెంద్రి వేపచెట్టు దాటి కొంతదూరం పోయింది.వెనుక నుంచి "ఒసేయ్ చెంద్రీ! బట్టల మురికే పోతలేదు. జర మంచిగుతుకు" సుమతి హెచ్చరిక."**(గీతాంజలి.**2022**:**51**) చెంద్రి సంధ్య అత్తవాళ్ల ఇంట్లో బట్టలు ఉతికే పనిమనిషి. ఈమె ఇంట్లో తన భర్త అహంకారాన్ని అణచివేయగలుగుతుంది కాని పనిచేసే దగ్గర మాత్రం మౌనంగా ఉంటుంది. **ఒసేయ్ చంద్రి** అని పిలవాల? **చెంద్రి** అని పిలవచ్చుకదా? పనిచేసేవాళ్ళైతే గౌరవం లేకుండా పిలవాల? వీళ్లు లేకుంటే వాళ్ళకి పొద్దుగూడ పోదు. అయినా నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో కింది మెట్లు వీళ్ళవైనా అవి పైకి ఎక్కడానికి మాత్రమే పనికివస్తాయి కాని గౌరవింపడానికి కాదని రచయిత్రి సంధ్య పాత్ర ద్వారా తెలియజేస్తుంది. ఇంతటి కుల పిచ్చి ఉన్న సంధ్య అత్త తన కూతురు నిమ్నకులం వ్యక్తిని వివాహం చేసుకొని తమ కుటుంబపరువు తీసిందని ఇంట్లోకి కూడా రానివ్వకుండా వెలివేసి, సంధ్యని మాత్రం చిన్నకొడలిగా అంగీకరించింది. కారణం తనని భవిష్యత్తులో చూసుకోవాల్సింది కొడుకు కోడలు కాబట్టి. కోడలిగా అంగీకరించిందన్న మాటే కానీ వంటింట్లో ఏ పని చేయనీయదు, ఏ వస్తువు ముట్టుకోనియదు, భోజనం కూడా పైనుండి పెడుతుంది. **"సంధ్య ఏమైనా సహాయానికి వస్తుంటే "ఇదిగో సంధ్యా. బ్రాహ్మలు ఐదుగురు వస్తరు. వాళ్లకి వడ్డిస్తానని ఎగబడకు". "బ్రాహ్మణుల భోజనాలై పోయి లేస్తున్నారు ఒక్కొక్కళ్ళు. అత్తమ్మ మూలనుంచి పిలిచి "విస్తళ్ళు ఎత్తు" అంది."**( గీతాంజలి. **2022:192**) అన్నం వడ్డించడానికి పనికిరాని నా చేతులు? వాళ్ళు తిన్న ఎంగిలి ఎత్తడానికి పనికివస్తాయా? మామ బ్రతకడానికి తురుకవాని రక్తం కావాలి కానీ ఈ బ్రాహ్మణులకు వడ్డించడానికి నేను పనికిరానా? నేను ఎత్తను మీ బాపన కోడళ్లతోనే ఎత్తించుకో అని ఎంతో ధైర్యంగా చెప్తుంది సంధ్య. ఈ సందర్భంలో రచయిత్రి సంధ్య పాత్రని ఎంత చైతన్య దిశగా ముందుకు నడిపించారో తెలుస్తుంది. అలాగే నిమ్న కులం వ్యక్తిని పెళ్ళిచేసుకున్న సువర్ణ అత్తవారింట్లో ఎన్నో ఇబ్బందులకు గురవుతుంది.**"నీ కోసం వేరే మేం వండం... మీ బాపనోల్ల తిండ్లు మాకు పడవు... నువ్వు ఇప్పుడు మా కులం పిల్లవు. మీ కులం బుద్ధులు ఇడ్సిపెట్టు మా తొవ్వల నడ్వాలే" అని వేవిళ్లతో తను బాధపడ్తున్నా తన కిష్టమైనవి చేసేవారు కాదట... ఎండుచేపలో, పచ్చిచేపలో, చికెనో, మాంసమో ఏదో ఒకటి రోజూ చేసేవారట."**( గీతాంజలి. **2022:185**) బ్రాహ్మణ కట్టుబాట్లు, ఆహారం, అలవాట్లు ఉన్న సువర్ణ అత్తవారింట్లో మాంసం తినడానికి అలవాటుపడటం సుధేష్ణని ఎన్ని ఇబ్బందులకు గురిచేసారో అర్థమవుతుంది. ఇక్కడ రచయిత్రి కేవలం బ్రాహ్మణ కులం అనే కాకుండా ఎవరి కులం వారికి గొప్ప ఎవరి ఆచారాలు, సంప్రదాయాలు వారికి గొప్ప కాబట్టి కులం అనే పిచ్చి అగ్ర, నిమ్న కులాల వారిలో ఉంటుందని తెలియజేశారు.

### 4. లైంగిక వేధింపులు:

ఈ సమాజంలో స్త్రీలు నాటి నుండి నేటి వరకు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఇంట్లో, కాలేజిలో, బస్సులో ఇలా ఎన్నో చోట్ల సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎన్నో రకాల లైంగిక వేధింపులకు బలవుతున్నారు. వీటి కారణంగా స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని, తమపై తమకి ఉండే ఆత్మవిశ్వాన్ని కోల్పోతున్నారు. లైంగిక వేధింపుల పట్ల రచయిత్రి ఈ నవలలో సంధ్య పాత్ర ద్వారా పాఠకులకు మంచి సందేశాన్ని అందించారు.**"నాలుగడుగులు వేసే దిగిపోతుందనుకునే లోపలే సంధ్యని వెనక నుంచి**

**వాటేసుకున్నాడు ఒకడు. సంధ్య ఉలిక్కిపడింది. షాక్ కొట్టిందాన్లా వెనక్కి తిరిగి వాడి చెంప పగులగొట్టింది."**(గీతాంజలి.2022:19) పరీక్షకి వెళ్తున్న సంధ్య బస్సులో అనేక హింస దృశ్యాలు చూస్తుంది. ఇవన్నీ రోజు బస్సులో జరిగేవే అని అనుకొని ఎలాగోలా అందరిని దాటేస్తూ బస్సుదిగి నడుస్తుంటే వెనకనుండి ఎవడో వచ్చి వాటేసుకుంటాడు. దాంతో సంధ్యకి పాములు, జెర్రులు పారినట్టే అనిపిస్తుంది. వెనకకి తిరిగి వాడి చెంప పగలగొడుతుంది. కోపంతో ఊగిపోతూ వెదవ అంటూ అందరి ముందు తిడుతూ తలదించుకునేలా చేస్తుంది. సమాజంలో కూడా నేటి స్త్రీలు ధైర్యంతో ఇలాంటి వాళ్లని ఎదిరించాలని, ఎలాంటి సంఘటనలు ఎదురైనా తమ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తమ సమస్యలని తామే పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్ళాలని రచయిత్రి ఈ సంఘటన ద్వారా బలంగా తెలియజేస్తున్నారు. కేవలం బయటి వ్యక్తులే కాకుండా ఇంట్లో వరకట్నం కోసం తమ భర్తల చేతిలో అత్తల చేతిలో హింసకు గురయ్యే స్త్రీలుకూడా ఇంకా ఉన్నారు.**"లోపల ట్రీట్మెంట్ రూంలో వనజ మూలుగుతోంది. వనజ కాళ్లమీద భర్త వేడివేడి నీళ్ళు పోశాడు. వనజ కేకలు పెట్టుకుంటూ సంధ్య దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చింది. సంధ్య ఫస్ట్ ఎయిడ్ ఇస్తుంటే... పొయ్యిమీదనుంచి నీళ్ళు తీస్తుంటే పడ్డాయని భర్త, అత్త ఇద్దరూ వాదించారు."**( గీతాంజలి .2022:218,219) వనజ తల్లిదండ్రులు ముసలివాళ్ళు. వనజ పెళ్లికి ఒప్పుకున్న కట్నంలో ఇంకా పదివేల రూపాయలు ఇయ్యకుండనే తండ్రి మరణించాడు. దాంతో భర్త, అత్త ఇద్దరు వనజను కట్నంకోసం వేధిస్తున్నారు. కట్నం ఇయ్యకుంటే రెండోపెళ్లి చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. పాపం వనజ ఎక్కడినుండి తెస్తుంది? తల్లి ముసల్ది, పోని వనజ పనిచేసి ఇద్దామంటే రోజంతా వీళ్ళ చాకిరే సరిపోతుంది. ఇలా వనజలాంటి ఎంతో మంది స్త్రీల జీవితాలు వెలుగులోకి రాకుండా నాలుగుగోడల మధ్యనే నానా తిప్పలు పడుతూ ఉండే స్త్రీలు ఎందరో ఉన్నారు. ఇక్కడ సమస్యని ఎదిరించే సంధ్య, సమస్యకి భయపడిన వనజ ఇద్దరు లైంగిక వేధింపులకు గురైన స్త్రీలే.

**5. మూడవిశ్వాసాలు:**

సమాజంలో శతాబ్దాలుగా వస్తున్న ఒక సామాజిక సమస్య. విజ్ఞానశాస్త్రం (Science) మరియు సాంకేతికత (Technology) ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంకా దీని ప్రభావం ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా, సమాజంలో అనేక రకాల మూడవిశ్వాసాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీల విషయంలో...నెలసరి సమయంలో వంటపని, పూజపని ఏది ముట్టనియ్యరు. ఇంట్లో ఒక మూలన కూర్చోపెడతారు. ఈ నవలలో చూసినట్లయితే శ్రావణమాసం వ్రతాలకి వెళ్ళిన సంధ్యని వాళ్ళ అత్త **ముట్టుగిన అయితే చెప్పు... నోముకు పనికిరావు** అంటూ ప్రకృతి సహజ ధర్మాన్ని అపచారంగా భావిస్తుంది. అంతే కాకుండా ఆడపిల్ల ఎన్నటికైన పరాయిపిల్ల, వృద్ధాప్యంలో తల్లిదండ్రులని చూసుకోవాలన్న, తండ్రికి తలకొరివి పెట్టాలన్న ఇంటికి మగబిడ్డ ఉండాలంటారు. తల్లిదండ్రులని భారంగా భావించి వృద్ధాశ్రమంలో చేర్పించే కొడుకులు తలకొరివి పెట్టడానికి అర్హుడు కాని కూతురు అర్హురాలు కాలేదా?. ఈ విధంగా సమాజంలోని మూర్ఖ భావనలను రచయిత్రి ప్రశ్నిస్తుంది.

**6. స్త్రీల పై పురుషాధికృత ప్రభావం:**

ఈ సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ స్త్రీల పై వివిధ కోణాలలో తీవ్రమైన ప్రభావం చూపుతుంది. దీని వల్ల స్త్రీలు సామాజికంగా, ఆర్థికంగానే కాకుండా మానసికంగా కూడా ఒత్తిడికిలోనై హిస్టీరియా వంటి వ్యాధులకి గురవుతున్నారు. భర్తలు భార్యలని కట్నం కోసం, మగపిల్లవాడి కోసం, బయటికి వెళ్లి ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉండమని వేధించడం ఒక రకం అయితే భర్తల చేతిలో తిట్లు, తన్నులు తింటూ మళ్ళీ వాళ్ళు బాగుండాలని వ్రతాలు, పూజలు, ఉపవాసాలు చేసే స్త్రీలు, భర్తకి కడుపునిండా పెట్టి అడుగు మాడుచెక్కలు తింటూ, రెక్కలు ముక్కలయ్యేలా రోజంతా కూలి పని చేసి వచ్చిన డబ్బులు వాళ్ళు తాగడానికి ఇచ్చే స్త్రీలు మరో రకం. అలాగే తరతరాలుగా వస్తున్న ఆచారం స్త్రీ అంటే ఇలాగే ఉండలేమో అని ఒక రకమైన భావనను మానసికంగా మైండ్లో అయస్కాంతంలా అతికించి ఇంక తమ జీవితం ఇంతే అనుకునే అమాయకపు స్త్రీలు కొందరుంటారు. ఇలాంటి సందర్భాలను మనం ఈ నవలలో చూడవచ్చు. సంధ్య అత్తవారింట్లో అత్త , కోడళ్లు తమ భర్తలు బాగుండాలని మంగళగౌరి వ్రతం చేయటం, భర్త తిన్నాక భార్యలు కారం వేసుకొని తినడం, భర్త కడుపునిండా తిన్నారని భార్యలు సంతోషించడం, ఒక వైపు భర్త చేతిలో దెబ్బలు పడుతూనే మెడలో మంగళ సూత్రం కళ్లకద్దుకోవడం వంటి సందర్భాలు రచయిత్రి కళ్ళకు కట్టినట్లు తెలియజేశారు. **"పట్టు చీర, నల్లపూసల గొలుసు, ముత్యాల గొలుసు, ఒంటిపేట గొలుసు సూత్రాలతో చెవికి ఝుంకాలు, ముక్కుపుడక, ఆకుపచ్చ గాజులు, కాలివేళ్లకి మట్టెలు, తలలో చామంతుల దండ. తను అద్దంలో ఒక వింత మృగంలా**

**కనిపిస్తోంది కాని... తను కాదు.. సంధ్య కానేకాదు."**(గీతాంజలి. **2022:52**) ఈ విధంగా ఎంతో చైతన్యం ఉన్న సంధ్య కూడా తనకి ఇష్టం లేని పనులు చేస్తూ పితృస్వామ్య వ్యవస్థకి తలవంచింది . అంటే సమాజంలో ఒక స్త్రీ వెనకబడి ఉండటానికి కారణం కేవలం పురుషాధిక్యత మాత్రమే కాదు స్త్రీల అపనమ్మకాలు, వారి చాదస్తం కూడా అని నా అభిప్రాయం. స్త్రీలు ఇలా ఉండటానికి కూడా కారణం తరతరాల నుండి వస్తున్న పురుషాధిక్యతనే.

**ముగింపు:**

ఆమె అడవిని జయించింది నవలని పరిశీలించినప్పుడు రచయిత్రికి సమాజంపై లోతైన అవగాహన ఉందని తెలుస్తుంది. సామాజిక, ఆర్థిక, మానసిక కారణాల దృష్ట్యా స్త్రీల సమస్యలను ఈ నవలలో చర్చకి పెట్టడం వల్ల సమాజంలో స్త్రీల సమస్యల పై రచయిత్రి ఆవేదన కనిపిస్తుంది. ఈ నవల 1998 లో రాయబడినప్పటికీ ప్రస్తుత సమాజంలోని సమస్యలకు, పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండటమే ఈ నవల ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ నవలలో సందర్భానికి అనుగుణంగా సంఘటనలను కల్పిస్తూ, స్త్రీల మానసిక సమస్యలు, పితృస్వామ్య వ్యవస్థ, లైంగిక వేధింపులు, మూఢవిశ్వాసాలు మొదలగు ఎన్నో అంశాలను బలంగా ఆవిష్కరించారు. ఈ సమస్యల దృష్ట్యా సమాజం ముఖ్యంగా స్త్రీలు మరింత అవగాహన పొందాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సంధ్య లాంటి చైతన్యవంతమైన స్త్రీలు కూడా కుటుంబ పరువు కోసమే, ప్రత్యేకత కోసమో తమకి ఇష్టం లేని పనులు చేస్తూ పురుషాధిక్యతకు తలవంచుతున్న స్త్రీలు ఎంతో మంది ఈ సమాజంలో ఉన్నారు. వారందరూ కూడా వంటింటి నుండి విముక్తి పొంది చైతన్యంతో ముందుకి వచ్చి తమ సమస్యలను తాము పరిష్కరించుకోవడమే ఈ నవల ద్వారా పొందే గొప్ప ప్రయోజనం.

**ఉపయుక్త గ్రంథ సూచి**


1. గీతాంజలి. 2022. ***ఆమె అడవిని జయించింది.*** హైదరాబాద్: వెన్నెల – గీత ప్రచురణలు.
2. జయప్రకాష్ , ఎస్.2003. ***పరిశోధన విధానం.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. పితృస్వామ్య బహుళ అస్తిత్వాన్ని ప్రశ్నించిన నవల ***"ఆమె అడవిని జయించింది" – ఎస్. చంద్రయ్య*** స్త్రీవాద పత్రిక భూమిక https://share.google/Hhygv4soi949gKorL.
4. వెంకటసుబ్బయ్య,వల్లంపాటి. 1989. ***నవలాశిల్పం*** . హైదరాబాద్ విశాలాంధ్ర: పబ్లిషింగ్ హౌస్.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. 1990. ***తెలుగు నవలనుశీలనం***. హైదరాబాద్: రోహణమ్ ప్రచురణలు.
6. సుభాషిణి, ఎన్. 2025. ***గీతాంజలి సాహిత్యం – సమగ్ర పరిశీలన.*** హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# జోగులాంబ గద్వాల జిల్లా జానపద గేయాలు – ప్రయోజనం, వైశిష్ట్యం

– **టి. వెంకట నర్సింహులు** (పరిశోధక విద్యార్థి),
తెలుగు శాఖ,
హైదరాబాదు విశ్వవిద్యాలయం. హైదరాబాద్

**ఉపోద్ఘాతం:**

జానపద విజ్ఞానం ఎంతో విస్తృతమైన క్షేత్రం. వాగ్రూపమైన జానపద విజ్ఞానంలోని గేయాలు, కథాగేయాలు, గద్య కథలు, సామెతలు, పొడుపు కథలు అనే అంశాలను చేర్చి జానపద సాహిత్యం అని పిలుస్తారు. జానపద సాహిత్యంలో గేయ శాఖకు విశిష్ట స్థానమున్నది. జోగులాంబ గద్వాల జిల్లాలో క్షేత్ర పర్యటనలో భాగంగా సేకరించిన జానపద గేయాలను పరిధిగా తీసుకొని, జానపద గేయాలకు గల ప్రయోజనాలను గురించి ఈ పత్రంలో విశ్లేషించాను. గద్వాల జిల్లాలో మౌఖిక ప్రచారంలో ఉన్న పాటలలో బిరుదురాజు రామరాజు, ఆర్వీయస్ సుందరం, జి. యస్. మోహన్ మొదలైన వారు తెలిపిన జానపద గేయ ప్రయోజనాల్లో కొన్నింటిని గురించి, అవి పాటల్లో ప్రతిఫలించిన తీరును గురించి ఈ పత్రంలో చర్చించాను. జానపదులు సందర్భానుగుణంగా ఆశువుగా ఎన్నో పాటలను అల్లుకుని రాగయుక్తంగా పాడుకుంటారు. పని చేస్తున్నప్పుడు కలిగే ఒత్తిడిని తగ్గించుకొని ఉపశమనం పొందడానికి రాగాలు ఆలపిస్తారు. సమర్త, పెళ్ళి, సీమంతం ఇలా మొదలైన వేడుకలలో సందర్భోచితంగా పాటలను పాడుతారు. ఇలా వివిధ సందర్భాలలో పాడే పాటలను సేకరించి, వాటి ద్వారా జానపద గేయాలకు గల ప్రయోజనాలను తెలియజేయడం ఈ పత్ర ఉద్దేశ్యం.

**కీలక పదాలు:** జానపద సాహిత్యం, క్షేత్ర పర్యటన, జానపద గేయాలు, ప్రయోజనం, విశిష్టత, సంస్కృతి, ప్రకృతి.

**పరిచయం:**

జానపద సాహిత్యంలో జానపద గేయాలకు ఉన్న ప్రయోజనం ఏమిటో సాహిత్యాభిమానులందరికి సుపరిచితమైన విషయమే. "జానపద గేయం మొదలైన విషయాలు సామాన్య జనుల విద్యావిధానంలో ప్రముఖమైన పాత్రను వహిస్తాయి. జానపద గేయం వంటి విషయాల ద్వారా ఒక సమాజం సంస్కృతి తరతరాలకు సంక్రమిస్తుంది. గేయం, సామెత, కథలు, పురాణాలు మొదలైనవి సాంప్రదాయికమైన నమ్మకాలను, ఆచారాలను, అలవాట్లను కలకాలం నిలబెడతాయి." (తెలుగు కన్నడ జానపద గేయాలు, పుట 24) అని ఆర్వీయస్ సుందరం గారు జానపద విజ్ఞానికి అందులో భాగమైనటువంటి జానపద గేయాలు మొదలైన విషయాలకు సంబంధించిన ప్రయోజనం గురించి తెలియజేశారు. జానపదుల గుండెలను బావులతో పోల్చి, లోతైన ఆ బావులలో ఉన్న తియ్యని జలాలను జానపద గేయాలుగా పేర్కొని సాదరంగా ఆ నీళ్ళను తోడి సాహిత్య క్షేత్రంలో బంగారు పంటలు పండించవలసిన బాధ్యత సాహిత్య ప్రియులకు ఉన్నదని ఆర్వీయస్ సుందరం గారు తెలిపారు (తెలుగు కన్నడ జానపద గేయాలు, పుట 1). జోగులాంబ గద్వాల జిల్లాలో సేకరించిన పాటల ద్వారా కలిగే ప్రయోజనాలను కింది విధంగా విశ్లేషించాను.

**ఆనందం:**

"రసికులను, సహృదయులను ఆనందపరవశులను చేయడానికి గేయాలు ఉపకరించినంతగా రసవంతమైన పద్యాలు ఉపకరించవు" (తెలుగు జానపద గేయ సాహిత్యం, పుట 29) అని గేయాల వల్ల కలిగే ఆనందం గురించి తెలుపబడింది. జానపద గేయాలు పనిలో ఒత్తిడిని తగ్గించి శ్రమజీవులకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. పని చేసేటప్పుడు పాటలు పాడటం వలన గానీ, వినడం వలన గానీ, వంత పాడటం వలన గానీ ఆనందపరవశమయిన హృదయంతో రెట్టింపు ఉత్సాహంతో పనులు చేస్తారు. వేడుకల్లో పాడుకునే పాటలు కూడా మనసుకు తృప్తినిచ్చి ఆనందాన్ని కలిగిస్తాయి.

పొలాల్లో పనిచేస్తున్నప్పుడు విత్తనాలు విత్తేటప్పుడు పాడే కింది పాటను పరిశీలిస్తే,

**బిచ్చా నాటరే మామిడి బిచ్చా నాటరే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి బిచ్చా నాటరే**
**మలుకా గుద్దెనే మామిడి మలుకా గుద్దెనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి మలుకా గుద్దెనే**
**తీగే వారెనే మామిడి తీగా వారేనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి తీగా వారెనే తీగే వారెనే**
**పూతా వాట్టెనే మామిడి పూతా వాట్టెనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి పూతా వాట్టెనే**
**పిందే గాసెనే మామిడి పిందా గాసెనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి పిందా గాసెనే**
**కాయే గాసెనే మామిడి కాయే గాసెనే**
**వయ్యారి వజురాలా చెవ్వచెక్కిడి మంచి మామిడి కాయేగాసెనే**
**పండే మాగెనే మామిడి పండే మాగెనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి పండూ మాగెనే**
**పండూ దెంపెనే గోయిందు పండూ దెంపనే**
**వయ్యారి వజురాలా చెవ్వచెక్కిడి మంచి మామిడి పండూ దెంపెనే**
**కొంగూ వాట్టెనే తిరుపతమ్మ కొంగూ వాట్టెనే**
**వయ్యారి వజురాలా చెవ్వచెక్కిడి మంచి మామిడి కొంగూ వాట్టెనే**
**బంచీ పెట్టెనే తిరుపతమ్మ బంచీ పెట్టెనే**
**వయ్యారి వజురాలా సెవ్వచెక్కిడి మంచి మామిడి బంచీ పెట్టెనే**

(పాడిన వారు: వాకిటి పద్మ, వయసు – 45 సం., మన్నాపురం గ్రామం, ధరూరు మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

భూమిలో విత్తిన తర్వాత మొలక దశ నుండి క్రమేనా పెరిగి వృక్షం అయిన మామిడి చెట్టుకి కాసిన మామిడి ఫలం తియ్యదనాన్ని ఈ పాటలో రుచి చూపారు జానపదులు. ఈ పాటలో మామిడి గింజను ఉద్దేశించి బిచ్చా, గిచ్చా అనే మాటలు ప్రయోగించారు. గోవిందు అనే వ్యక్తి చెట్టు ఎక్కి మామిడి పండును తెంపాడు, దానిని అందుకోవడానికి అతని భార్య తిరుపతమ్మ చెట్టు కింద నిలబడి కొంగు చాపింది. చెట్టు నుండి అలా తెంపిన పండును తిరుపతమ్మ కోసి ముక్కలుగా చేసి అందరికీ పంచి పెట్టింది. అందరికీ పంచి పెట్టడమే ప్రకృతి తత్త్వం. అదే ఈ పాటలో కనబడింది. పంచడంలో ఉన్న ఆనందాన్ని జానపదులు గుర్తించారు. పనులు చేసేటప్పుడు పాడుకునే ఇలాంటి పాటలు ఎన్నో విషయాలను తెలియపరుస్తూ ఆనందాన్నిస్తాయి. పాట చివర్లో గోవిందు తిరుపతమ్మ అనే ఇద్దరి ఆలుమగల పేర్లు పేర్కొన్నారు. వరుస అయ్యే వాళ్ళ పేర్లను పేర్కొన్నప్పుడు పాడినవారి, అలాగే విన్నవారి ముఖాల్లో కాస్త చిరునవ్వు కలుగుతుంది. కేవలం ఆనందం మాత్రమే కాదు దీనితో పాటు ఇతర ప్రయోజనాలు కూడా జానపద గేయానికి ఉన్నాయి.

### సాంస్కృతిక వాహకం:

వివిధ వేడుకలలో సంస్కృతిని గురించి తెలిపే పాటలను పాడిన వారి నుండి విన్నవారు వాటిని గుర్తుంచుకొని సందర్భానుగుణంగా పాడతారు. ఈ విధంగా జానపద గేయాల ద్వారా ఒక జాతి సంస్కృతి ఒక తరం నుండి మరొక తరానికి అందజేయబడుతుంది.

పెళ్ళి అయిన తర్వాత నూతన వధూవరులతో పాటు ముత్తైదువులకు, ఇంటి ఆడబిడ్డలకు వాళ్ళ భర్తలకు ఒడిబియ్యం పోయడం అనే సంస్కృతి తెలుగు వారిలో కనిపిస్తుంది. అయిదు సంవత్సరాలకు ఒకసారి లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి అయినగానీ, ఊరిలో ఏవైనా ఉత్సవాలు జరిగినా, ఇంటిలో ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు కూడా ఇంటి ఆడబిడ్డను గౌరవిస్తూ ఆమెని లక్ష్మీ స్వరూపంగా భావించి ఒడిబియ్యం పోస్తారు. అయిదు లేదా తొమ్మిది మంది ముత్తైదువలతో ఒడినింపిన తర్వాత, ఇంటిలో ఉండే కలికుండ లో, ఇంటి గడప దగ్గర ఆడబిడ్డ తన చేత్తో చిటికెలు వేయాలి, తర్వాత గుడికి వెళ్ళి దైవదర్శనం చేసుకొని ఇంటికి వచ్చిన తర్వాత ఆడబిడ్డ వాళ్ళ అత్తారింటికి వెళ్లి అక్కడ నిద్ర చేయాలి అనే నమ్మకం జానపదులలో ఉంది. ఇలాంటి ఆచారాలు బాంధవ్యాలను ధృఢపరుస్తాయి. ఈ ఒడినింపడం అనే సంస్కృతిని తెలిపే పాట కిందిది.

**అత్త కమసలు** (కౌసల్య) **తెచ్చినేటివి వరటిపండ్లా గుత్తులూ**
**వరటి పండ్లా గుత్తులు సీతమ్మకీ ఒడినించరే**
**మామ దశరథుడు దెచ్చినేటివి మామిడి పండ్లా గుత్తులు**
**మమిడి పండ్లా గుత్తులు సీతమ్మకీ ఒడినించరే**

(పాడిన వారు: గోవిందమ్మ, వయసు – 59 సం., మన్నాపురం గ్రామం, ధరూరు మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

నూతన వధువుకు సారె పెట్టి, అత్తారింటికి సాగనంపే సంస్కృతిని తెలిపే పాట కిందిది.

**అందనలు పల్లకులు అతివేడ గజములూ వందనలు పల్లకులు వతివేడ గజములూ**
**విస్తినే మైగవరు నగరు గట్టి విస్తినే మైగవరు నగరు గట్టి**
**భక్తితో గనమయ్య పిలువ వచ్చీనాడు అత్తవాడకు గవరుసంపవలెనూ**
**జయమంగళం రామ శివ మంగళం జయా జయ మంగళం రామ శివ మంగళం**
**సకిలాల కొబ్బెరులు సాల ఒడిబియ్యము సకిలాల కొబ్బెరులు సాల ఒడిబియ్యము**
**సద్దిగట్టీ గవరునంపవలెను సద్దిగట్టీ గవరునంపవలెనూ**
**జయమంగళం రామ శివ మంగళం జయా జయ మంగళం రామ శివ మంగళం**
**మెట్టెలూ పిల్లెండ్లు మెడతీగ పొంపులు మెట్టెలూ పిల్లెండ్లు మెడతీగ పొంపులు**
**చిటికనేలుకు మంచి శ్రీ బొద్దులు చిటికనేలుకు మంచి శ్రీ బొద్దులూ**
**పాదివేయులు సేసు బండసరము పాదివేయులు సేసు బండసరమూ**
**జయమంగళం రామ శివ మంగళం జయా జయ మంగళం రామ శివ మంగళం**
**పుట్టినింటికి వొయ్యి ఏమి దెస్తివి గవరు పుట్టినింటికి వొయ్యి ఏమి దెస్తివి గవరు**
**చెప్పవే నాతోని సిగ్గుపడక చెప్పవే నాతోని సిగ్గుపడక**
**పసనీ పోగుల సీర పసపునీ గుంకుమ మావారు బీదవారేమిదెత్తూ**
**జయమంగళం రామ శివ మంగళం జయా జయ మంగళం రామ శివ మంగళం**
**అన్ని సొమ్ములు గలవు ఆభరణమూ గలదు అన్ని సొమ్ములు గలవు ఆభరణమూ గలదు**
**ఒప్పుకో ఓ శివుడ తప్పులేక ఒప్పుకో ఓ శివుడ తప్పులేకా**
**జయమంగళం రామ శివ మంగళం జయా జయ మంగళం రామ శివ మంగళం**

(పాడిన వారు: లక్ష్మీ కాంతమ్మ, వయసు – 80 సం., వీరాపురం గ్రామం, గద్వాల మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

పెళ్ళి కూతురిని గౌరీ దేవి స్వరూపంగా భావించి, అమ్మాయిని అత్తవారింటికి సాగనంపేటప్పుడు ఆమె వెంట పంపే ఆభరణాలు, ఆహార పదార్థాలు మొదలైనవి ఈ పాటలో పేర్కొనబడ్డాయి. పుట్టింటి నుండి ఏమి తెచ్చావు గౌరీ అని శివుడు అడగగా చీరలు, పసుపు, కుంకుమ తెచ్చాను, మావారు పేదవారు ఇంతకంటే నేనేమి తీసుకురాగలను అని గౌరీదేవి సమాధానం ఇచ్చింది. ఇక్కడ వరుడు వధువు నుండి కానుకలు ఆశించే విషయం కనబడుతుంది. అత్తింటిలో అమ్మాయి గౌరవాన్ని నిలపడానికి వధువు తరపు వారు తమ స్థోమతకు తగ్గట్టు వరునికి కట్నకానుకలు ఇచ్చే సంప్రదాయం కనిపిస్తుంది.

ఇటువంటి పాటలలో ఆచార వ్యవహారాలు మొదలైన సంస్కృతి సంబంధమైన విషయాలు కనిపిస్తాయి. జానపద గేయాలు సంస్కృతి చిహ్నాలుగా నిలుస్తాయి. కావున సాంస్కృతికమైన విషయాలను తెలియపరుస్తూ సంస్కృతి వాహకాలుగా జానపద గేయాలు దోహదపడుతున్నాయి.

**విద్యాప్రయోజనం:**

జానపద గేయం సామాన్య జనుల విద్యావిధానంలో ప్రముఖ పాత్రను వహిస్తుంది అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అమ్మలక్కలు నమిలే ఆకువక్కతో వారాలను గుర్తు పెట్టుకునే విధంగా ఉన్న పాట కిందిది

**వాకు త్యామని సేప్పనా వాకులా ఏముండనో**
**వాకులో వాదివారమని చెప్పెనే ఒగలేశుడు**
**జాజిజాజిల వాసనా జాజిసంసుల వాసనా**
**జాజిలో మొగిలి పూసే జాజి సంసుల నరసిమ్మ**
**వొక్క త్యామని సేప్పనో వొక్కలో ఏముండనో**
**వొక్కలో వొక్కపోద్దులని సెప్పెనే ఒగలేశుడు**
**జాజిజాజిల వాసనా జాజిసంసుల వాసనా**
**జాజిలో మొగిలి పూసే జాజి సంసుల నరసిమ్మ**
**సున్నము త్యామని సేప్పనో సున్నములా ఏముండనో**
**సున్నములో సుక్కురారమని సెప్పనే ఒగలేశుడు**
**జాజిజాజిల వాసనా జాజిసంసుల వాసనా**
**జాజిలో మొగిలి పూసే జాజి సంసుల నరసిమ్మ**

(పాడిన వారు: జయమ్మ, వయసు – 46 సం., ధరూరు గ్రామం & మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

ఓబులేశుడు కాస్త జానపదుల నోటిలో ఒగలేశుడు అయ్యాడు. ఓబులేశుడు అంటే నరసింహ స్వామి. జాజిపూలు అనేవి పరిమళాన్ని వెదజల్లే పూలు. ఈ పూలను వేడుకల్లో అలంకరణలకు, దేవుని పూజకు ఉపయోగిస్తారు. ఓబులేశుడు ఆకు తెమ్మని చెప్పాడు, ఆకులో ఏమున్నది? అంటే ఆకులో ఆదివారం అని ఓబులేశుడు చెప్పాడు. సున్నము తెమ్మని చెప్పాడు సున్నంలో ఏమున్నది? అంటే సున్నములో సుక్కురారము (శుక్రవారం) అని చెప్పాడు. ఈ పాటలో ఆదివారం, శుక్రవారం ప్రస్తావించబడ్డాయి, ఆకు – ఆదివారం, సున్నము – సుక్కురవారం (శుక్రవారం) పదాల మధ్య జానపదులు వేసిన ప్రాసలు వారికి ఉన్న పదజ్ఞానాన్ని తెలియజేస్తాయి.

అదే విధంగా సంఖ్యా పరిజ్ఞానాన్ని తెలిపే పాట కిందింది.

**అత్తత్త ఒక్కత్త సందమామ ఎడుగూరు యారండ్లు సందమామ**
**అందరికి సిన్నాది సందమామ గర్భమే నిలిసమ్మ సందమామ**
**ఒగటో నెల నిండ సందమామ ఒక్క పేడూ గోరే సందమామ**

**రెండో నెల నిండ సందమామ రేణు పండూ గోరే సందమామ**

**మూడో నెల నిండ సందమామ మామిళ్ళు గోరమ్మ సందమామ**

**నాలుగో నెల నిండ సందమామ వరటిపండూ గోర సందమామ**

**ఆరో నెల నిండ సందమామ వరటిపండూ గోర సందమామ**

**ఏడో నెల నిండ సందమామ ఎన్న ముద్దా గోర సందమామ**

**ఎనిమిదో నెల నిండ సందమామ ఎన్నగూర గోర సందమామ**

**తొమ్మిదో నెల నిండ సందమామ తోటకూర గోర సందమామ**

**అత్తత్త ఒక్కత్త సందమామ ఎడుగూరు యారండ్లు సందమామ**

**పాదో నెల నిండ సందమామ బాలుడే జలమించ సందమామ**

**ఎడుగూరు బావళ్ళు సందమామ పూల తోట్లల్లు గట్టి సందమామ**

**పూల తోట్లల్లు గట్టి సందమామ పేరుబెట్టీరమ్మ సందమామ**

**బాలునీ పేరంట సందమామ సిన్ని కృష్ణుడమ్మ సందమామ**

(పాడిన వారు: బోజమ్మ, వయసు – 85 సం., మన్నాపురం గ్రామం, ధరూరు మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

ఈ పాటలోని ఒకటో నెల – ఒక్కపేడు, రెండో నెల – రేగు పండు, మూడో నెల – మామిళ్ళు, ఆరో నెల – అరటి పండు, ఏడో నెల – ఎన్న ముద్ద (వెన్న ముద్ద), ఎనిమిదో నెల – ఎన్నగూర, తొమ్మిదో నెల – తోట కూర వంటి పదాల మధ్య ప్రాసలు జానపదులకు గల పదసంపదను తెలియపరుస్తున్నాయి. ఇలాంటి పాటలు ప్రజలలో విద్యాజ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

**అశ్లీల పదాలకు, భావాలకు స్థానం:**

"జానపదులకు బుద్ధి గరపడంలో జానపద విజ్ఞానం పాత్ర మహత్తరమైంది. ముఖ్యంగా జానపద విజ్ఞానం సామాన్యంగా సమాజంలో నిషిద్ధమైన వాటిని కొన్ని పరిస్థితులలో అంగీకరించేట్లు చేస్తుంది. ఉదాహరణకు సామాన్య సంభాషణలో నిషద్ధమైన అశ్లీల పదాలకు, అశ్లీల భావాలకు జానపద గేయాలలో స్థానం ఉంది." ( తెలుగు కన్నడ జానపద గేయాలు, పుట 24) అశ్లీల పదాలు గానీ, అశ్లీల అర్థాన్ని స్ఫురింపచేసే పదాలు కానీ, భావాలు కానీ జానపద గేయాలలో ప్రయోగించాడతాయి.

పెళ్ళి చూపుల్లో పాడే కింది పాటను పరిశీలిస్తే,

**చీరల్లూ దెచ్చినమూ సీతాకీ వొచ్చినమూ**

**సీరల్లు మీకాయా సీతా మాకాయ సోయ్**

**రైకల్లూ దెచ్చినమూ రమ్మాకీ వొచ్చినమూ**

**రైకల్లు మీకాయా రమా మాకాయ సోయ్**

**కుంకుమ్మ దెచ్చినమూ కుతురూకి వొచ్చినమూ**

**కుంకుమ్మ మీకాయా కుతురూ మాకాయ సోయ్**

**సొమ్ముల్లూ దెచ్చినమూ రమ్మాకీ వొచ్చినమూ**

**సొమ్ముల్లు మీకాయా రమా మాకాయ సోయ్**

**అంద్రాల్లా గుట్టాకీ గుంద్రాల్లే లేవంటా**

**మన్నపురామాడొళ్ళకీ సంద్లే లేవంట సోయ్**

**అంద్రాల్లా గట్టాకీ గుంద్రాల్లే లేవంటా**

**మన్నపూరం మోగోళ్ళకీ మీసాలే లేవంట సోయ్**

(పాడిన వారు: సత్యమ్మ, వయసు – 56 సం., మన్నాపురం గ్రామం, ధరూరు మండలం, జోగులాంబ గద్వాల జిల్లా.)

అమ్మాయిని చూడటానికి వచ్చిన మగపెళ్ళి వారు పాడే పాట ఇది. చీరలు, రవికెలు, కుంకుమ, సొమ్ములు మొదలైనవి మా వెంట తీసుకు వచ్చాము, అవన్నీ మీకు ఇచ్చి, మీ అమ్మాయిని మేము తీసుకెళ్తాము అనే ఉద్దేశ్యాన్ని ఈ పాటలో తెలియజేశారు. అంటే ఇక్కడ తాంబూలాలు మార్చుకోవడం అనే అర్థాన్ని గ్రహించాలి. ఈ పాట చివర్లో గాయకురాలు "అంద్రాల్లా గుట్టాకీ గుంద్రాల్లే లేవంటా, మన్నపురామాడొళ్ళకీ సండ్లే లేవంట సోయ్" అని పాడారు. మన్నాపురం అనే గ్రామంలో తనకు వరసయ్యే అమ్మాయిలను ఉద్దేశించి వారికి వృక్షోజాలు సరిగ్గా లేవు అని తెలపడానికి సండ్లు అనే అశ్లీల పద ప్రయోగం చేశారు. ఇలా అశ్లీల పదాలకు కూడా జానపద గేయాల్లో స్థానం ఉంది.

**ముగింపు:**

ఆనందాన్ని కలిగించడం, సాంస్కృతిక వాహకంగా నిలవడం, సామాన్య జనుల విద్యావిధానంలో పాత్ర వహించడం, సామాన్య సంభాషణలో నిషిద్ధమైన అశ్లీల పదాలకు, అశ్లీల భావాలకు, జానపద గేయాలలో స్థానం కలిగించడం, మొదలైన ప్రయోజనాలు జోగులాంబ గద్వాల జిల్లా జానపద గేయాలలో కనిపిస్తున్నాయి. మానవుల సుఖదుఃఖాలు, జీవితానుభవసారాలు జానపద గేయాల్లో ఇమిడి ఉంటాయి. మాటల రూపంలోని మనోభావాలను రాగయుక్తమైన పాటగా పాడుకునే జానపదగేయాలకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఒక ప్రాంతంలో లభించే పాటల ద్వారా ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలు తెలుస్తాయి. అనుభవజ్ఞులైన పెద్దలు పిల్లలకు తెలిపే నీతి బోధక విషయాలు, జీవిత సూత్రాలు మొదలైనవి జానపద గేయాల్లో పొందుపరచబడి ఉంటాయి. జానపద గేయాల్లో మాండలిక భాషా ప్రయోగం కనిపిస్తుంది. దీనివలన ఒక ప్రాంత భాషా స్వరూపం ఏ విధంగా ఉందో తెలుసుకోవడానికి కూడా జానపద గేయాలు ఉపయోగపడతాయి. కావున జానపద గేయాలకు సంబంధించిన పరిశోధనలు జరపవలసిన ఆవశ్యకత ఉంది.

**ఆధార గ్రంథాలు:**


1. కృష్ణ కుమారి, నాయిని. 2019. ***తెలుగు జానపద విజ్ఞానం సమాజం – సంస్కృతి – సాహిత్యం***. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.
2. మోహన్, జి. ఎస్. 2024. ***జానపద విజ్ఞానాధ్యయనం***. ద్రావిడ విశ్వవిద్యాలయం. కుప్పం.
3. రామరాజు, బిరుదురాజు. 2015. ***తెలుగు జానపదగేయ సాహిత్యము***. తెలుగు అకాడమి. హైదరాబాదు.
4. సుందరం, ఆర్వీయస్. 2017. ***తెలుగు కన్నడ జానపద గేయాలు***. కీర్తన గ్రాఫిక్స్. మైసూరు.
5. సుందరం, ఆర్వీయస్. 2018. ***ఆంధ్రుల జానపద విజ్ఞానం***. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# నందిని సిధారెడ్డి 'చిత్రకన్ను' కథ – సామాజిక చిత్రణ

– మున్నూరు వినయ్

హైదరాబాదు విశ్వవిద్యాలయం.

vinayvinnu3853@gmail.com

**ఉపోద్ఘాతం:**

కథా సాహిత్యం తెలుగు సాహిత్యంలో ప్రజల జీవితాలను, వారి అనుభవాలను, భావోద్వేగాలను, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే ప్రక్రియగా అభివృద్ధి చెందింది. కవిత్వం, నవల, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలతో పాటు కథానిక కూడా సమాజంలోని జీవన వాస్తవాలను తక్కువ పరిధిలో, ప్రభావవంతంగా వ్యక్తీకరించే ప్రక్రియగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఒక వ్యక్తి జీవితం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక అసమానతలు, ఆచార వ్యవహారాలు, విలువలు మొదలైన అంశాలు కథా వస్తువులుగా మారినప్పుడు కథ సమాజానికి ఒక దర్పణంగా నిలుస్తుంది. ఈ విధంగా కథా సాహిత్యం సమాజాన్ని కేవలం ప్రతిబింబించడమే కాకుండా, అందులోని సమస్యలను ప్రశ్నించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంత జీవితం, ప్రజల అనుభవాలు, గ్రామీణ సామాజిక వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చిన రచయితల్లో నందిని సిధారెడ్డి ప్రముఖులు. కవిగా, కథకుడిగా, పాటల రచయితగా, విమర్శకుడిగా ఆయన తెలుగు సాహిత్యంలో తనదైన స్థానాన్ని ఏర్పరచుకున్నారు. తెలంగాణ ప్రజల జీవితం, సంస్కృతి, భాష, సామాజిక సమస్యలు ఆయన సాహిత్యంలో ముఖ్యమైన అంశాలుగా కనిపిస్తాయి.

నందిని సిధారెడ్డి కథా రచనలో 'చిత్రకన్ను'కు ప్రత్యేక స్థానం ఉంది. చిత్రకన్ను కథాసంపుటి 2016లో వెలువడింది. ఈ సంపుటిలోని కథలు తెలంగాణ ప్రాంత గ్రామీణ జీవితం, సామాజిక సంబంధాలు, కష్టజీవుల అనుభవాలు, అణగారిన వర్గాల పరిస్థితులు వంటి అనేక అంశాలను ప్రతిబింబిస్తాయి. 'చిత్రకన్ను' కథలో వ్యక్తుల జీవితాల ద్వారా నాటి గ్రామీణ సమాజంలోని సామాజిక సంబంధాలు, ఆర్థిక అసమానతలు, కుటుంబ వ్యవస్థ, కుల–వర్గ ఆధిపత్య సంబంధాలు, స్త్రీల జీవన పరిస్థితులు, పేదల సమస్యలు తదితర అంశాలు ప్రతిఫలిస్తాయి. కథలోని పాత్రలు, వారి ప్రవర్తన, సంభాషణలు, సంఘటనల ద్వారా ఒక నిర్దిష్ట సామాజిక వాస్తవికతను రచయిత ఆవిష్కరించారు. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ సమాజంలోని జీవన స్థితిగతులను సహజంగా చిత్రించిన కథగా 'చిత్రకన్ను' ను చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో 'చిత్రకన్ను' కథలో ప్రతిఫలించిన సామాజిక జీవితం, సామాజిక సంబంధాలు, ఆర్థిక, కుల, వర్గ పరిస్థితులు, స్త్రీల స్థితిగతులు, గ్రామీణ జీవన వాస్తవికత మొదలైన అంశాలను పరిశీలించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

**కీలక పదాలు:** స్త్రీల స్థితిగతులు, శ్రమ దోపిడీ, గ్రామీణ వాస్తవికత, ఆర్థిక వెనుకబాటు, జీవనోపాధి.

**పరిచయం:**

నందిని సిధారెడ్డి ఆధునిక తెలుగు సాహిత్యంలో కవి, కథకుడు, గేయరచయితగా విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న రచయిత. తెలంగాణ ప్రాంత జీవన అనుభవాలు, గ్రామీణ ప్రజల జీవితాలు, సామాజిక సంబంధాలు, అట్టడుగు వర్గాల సమస్యలు, మానవీయ విలువలు ఆయన రచనల్లో ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. కవిత్వంతో పాటు కథా ప్రక్రియలోనూ ఆయన తనదైన రచనా ముద్రను ఏర్పరచుకున్నారు. ఆయన రాసిన రచనాలలో 'చిత్రకన్ను' కథాసంపుటిలో సామాజికాంశాలు ఉన్నాయి. నందిని సిధారెడ్డి ఈ కథా రచనలో సమాజంలోని సాధారణ మనుషుల జీవితం, వారి కష్టాలు, సామాజిక సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, ఆధిపత్య సంబంధాలు మొదలైన అంశాలకు ప్రాధాన్యం కనిపిస్తుంది. ముఖ్యంగా చిత్రకన్ను కథాసంపుటిలోని కథలు తెలంగాణ ప్రాంత గ్రామీణ సామాజిక

జీవితాన్ని, భూస్వామ్య–పటేల్–పట్వారీ వ్యవస్థల ప్రభావాన్ని, వ్యవసాయ కూలీలు, దళితులు, స్త్రీలు ఎదుర్కొన్న దోపిడీ వంటి సామాజిక వాస్తవాలను ప్రతిబింబిస్తాయని విమర్శకులు పేర్కొన్నారు.

'చిత్రకన్ను' కథ నందిని సిధారెడ్డి రచించిన కథల్లో ఒకటి. ఈ కథ చిత్రకన్ను కథాసంపుటిలో భాగంగా ప్రచురితమైంది. కథాసంపుటి 2016లో వెలువడినట్లు లభ్యమైన రచయిత పరిచయాల్లో నమోదైంది. అయితే 'చిత్రకన్ను' కథకు 1979 ఆగస్టు 3న ఆంధ్రజ్యోతి–వారపత్రికలో ప్రచురణ నమోదై ఉండటం గమనార్హం. కథలోని సంఘటనలు, పాత్రల జీవన విధానం, వారి పరస్పర సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక ఆచారాలు, ఆధిపత్య సంబంధాలు మొదలైన వాటి ద్వారా నాటి తెలంగాణ గ్రామీణ సమాజ జీవన చిత్రణ తెలుస్తుంది. ముఖ్యంగా సాధారణ ప్రజల జీవన అనుభవాలను కేంద్రంగా చేసుకుని సామాజిక వ్యవస్థలోని అసమానతలను, మానవ సంబంధాల్లోని సంక్లిష్టతలను రచయిత కథనంలో ప్రతిబింబించారు. ఈ కారణంగా 'చిత్రకన్ను' కథను కేవలం ఒక వ్యక్తి లేదా కుటుంబ కథగా కాకుండా, దాని వెనుక ఉన్న సామాజిక జీవన వాస్తవికతను తెలియజేసే కథగా చెప్పవచ్చు.

ఈ వ్యాసంలో 'చిత్రకన్ను' కథలో ప్రతిఫలించిన సామాజిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక అసమానతలు, కుల–వర్గ సంబంధాలు, స్త్రీల జీవన స్థితిగతులు, గ్రామీణ జీవన వాస్తవికత మొదలైన అంశాలను పరిశీలించడం జరుగుతుంది.

**చిత్రకన్ను కథ – సామాజిక చిత్రణ:**

నందిని సిధారెడ్డి రచించిన 'చిత్రకన్ను' కథ తెలంగాణ గ్రామీణ సమాజంలోని జీవన పరిస్థితులను తెలియజేసే కథ. కథలోని పాత్రలు, వారి మాటలు, ఆలోచనలు, జీవన విధానం, పరస్పర సంబంధాల ద్వారా అప్పటి సామాజిక పరిస్థితులు మనకు కనిపిస్తాయి. రచయిత ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి జీవించే సమాజాన్ని కూడా కథలో చిత్రించారు. కథలో గ్రామీణ జీవితం ప్రధానంగా కనిపిస్తుంది. గ్రామంలోని ప్రజల మధ్య ఉన్న సంబంధాలు, కుటుంబ వ్యవస్థ, పెద్దల మాటకు ఉన్న విలువ, పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఆచారాలు వంటి అంశాలు కథలో సహజంగా వ్యక్తమవుతాయి. ముఖ్యంగా సాధారణ ప్రజలు తమ జీవన సమస్యలను ఎలా ఎదుర్కొంటున్నారో రచయిత పాత్రల ద్వారా చూపించారు.

సామాజిక పరిస్థితులు: 'చిత్రకన్ను' కథలో కనిపించే సమాజం అనేక సమస్యలతో కూడి ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు తమ జీవన అవసరాల కోసం కష్టపడటం, కుటుంబ బాధ్యతలను మోయడం కథలో కనిపిస్తుంది. డబ్బు, భూమి, జీవనోపాధి వంటి అంశాలు మనుషుల మధ్య సంబంధాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి.

అదే విధంగా గ్రామీణ సమాజంలో పెద్ద–చిన్న, ధనిక–పేద, అధికారం ఉన్నవారు–సాధారణ ప్రజలు అనే తేడాలు ఉన్నట్లు కథలోని సంఘటనలు తెలియజేస్తాయి. సామాజికంగా బలమైన వ్యక్తుల మాటకు ప్రాధాన్యం ఉండటం, బలహీన వర్గాల ప్రజలు తమ సమస్యలను స్వయంగా పరిష్కరించుకోలేని పరిస్థితులు కూడా కథలో కనిపిస్తాయి. కథలోని సామాజిక పరిస్థితులను రచయిత కేవలం వివరించకుండా, వాటిని పాత్రల జీవితాల్లో జరిగిన సంఘటనల ద్వారా చూపించారు. అందువల్ల కథలోని సామాజిక వాస్తవికత సహజంగా అనిపిస్తుంది.

కుటుంబం మరియు మానవ సంబంధాలు: కథలో కుటుంబ సంబంధాలకు కూడా ప్రాధాన్యం ఉంది. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, బాధ్యత, కోపం, అభిప్రాయ భేదాలు వంటి భావాలు కనిపిస్తాయి. వ్యక్తి సమస్య కుటుంబ సమస్యగా మారడం, కుటుంబ పరిస్థితులు వ్యక్తి నిర్ణయాలను ప్రభావితం చేయడం కథలో గమనించవచ్చు. గ్రామీణ సమాజంలో వ్యక్తి ఒంటరిగా జీవించలేడు. కుటుంబం, బంధువులు, ఇరుగుపొరుగువారు, గ్రామ సమాజం అతని జీవితంలో భాగంగా ఉంటారు. ఈ పరస్పర సంబంధాలను 'చిత్రకన్ను' కథ సహజమైన రీతిలో చూపిస్తుంది.

**పాత్రల ద్వారా సామాజిక వాస్తవికత:**

**1. బాలవ్వ – డబ్బు, ఆస్తిపై మోజు:** బాలవ్వ పాత్ర ద్వారా ఆర్థిక స్వార్థం, డబ్బుపై మోజు వ్యక్తమవుతుంది. జీవితాంతం డబ్బు, బంగారం, భూమి సంపాదించడానికే ప్రాధాన్యం ఇచ్చిన ఆమె వ్యక్తిత్వం ద్వారా ఆర్థిక విలువలు మానవ సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయో రచయిత చూపించారు.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**2. నర్సయ్య** – పేదలపై ఆధిపత్య ధోరణి: నర్సయ్య పాత్ర ద్వారా ఆర్థిక ఆధిపత్యం, కుల ఆధారిత సామాజిక అసమానత వ్యక్తమవుతుంది. మాదిగలు చేసే అంత్యక్రియల పనికి తక్కువ డబ్బు ఇవ్వాలని ప్రయత్నించడం ద్వారా కష్టపడే వర్గాల శ్రమకు తగిన విలువ ఇవ్వని సామాజిక ధోరణి కనిపిస్తుంది.

**3. మీసాలతను** – శ్రమజీవుల ఆవేదన: మీసాలతను పాత్ర ద్వారా దళితులపై జరుగుతున్న ఆర్థిక దోపిడీ, శ్రమకు గుర్తింపు లేకపోవడం వ్యక్తమవుతుంది. అతని మాటల్లో తరతరాలుగా అనుభవించిన అవమానం, దోపిడీపై ఆగ్రహం కనిపిస్తుంది.

**4. ఎర్రరుమాలతను** – సామాజిక ప్రతిఘటన: ఎర్రరుమాలతను పాత్ర ద్వారా అణగారిన వర్గాల్లో పెరుగుతున్న ప్రశ్నించే స్వభావం వ్యక్తమవుతుంది. తమ శ్రమను తక్కువగా చూడటాన్ని ప్రశ్నించడం ద్వారా సామాజిక సమానత్వం కోసం ఉన్న ఆకాంక్షను రచయిత చూపించారు.

**5. నాగరాజం** – అవకాశవాద సామాజిక ధోరణి: నాగరాజం పాత్ర ద్వారా సామాజిక పరిస్థితులను తనకు అనుకూలంగా ఉపయోగించుకునే అవకాశవాద ధోరణి వ్యక్తమవుతుంది. సమస్య పరిష్కారానికి కాకుండా తన ప్రాధాన్యతను చాటుకునే విధానం ఈ పాత్రలో కనిపిస్తుంది.

**6. పరుశరాములు** – నిస్సహాయత: పరుశరాములు పాత్ర ద్వారా సామాజిక పరిస్థితుల ముందు సాధారణ మనిషి నిస్సహాయత వ్యక్తమవుతుంది. సంఘర్షణ జరుగుతున్న సమయంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోలేని అతని స్థితి సామాజిక బలహీనతను సూచిస్తుంది.

**7. మాదిగ పెద్దలు** – సామాజిక ఆధారపడే పరిస్థితి: మాదిగ పెద్దల ద్వారా అట్టడుగు వర్గాల జీవనాధారం, ఆర్థిక ఆధారపడటం వ్యక్తమవుతుంది. అంత్యక్రియల పనిని కోల్పోతే తమ జీవనోపాధి దెబ్బతింటుందనే భయం వారి పరిస్థితిని స్పష్టం చేస్తుంది.

**సామాజిక వాస్తవికత:** 'చిత్రకన్ను' కథలో సామాజిక వాస్తవికత ప్రధానమైన అంశంగా కనిపిస్తుంది. రచయిత సమాజంలోని సమస్యలను ఊహాత్మకంగా కాకుండా ప్రజల రోజువారీ జీవితానికి దగ్గరగా చిత్రించారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అసమానతలు, కుటుంబ సమస్యలు, ఆధిపత్య సంబంధాలు వంటి అంశాలు పాత్రల జీవితాలతో ముడిపడి ఉన్నాయి.

### ముగింపు:

'చిత్రకన్ను' కథ తెలంగాణ గ్రామీణ సమాజంలోని సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే కథగా నిలుస్తుంది. ముఖ్యంగా మాదిగలపై జరిగే దౌర్జన్యం, వారి శ్రమకు తగిన గుర్తింపు లేకపోవడం, ఆర్థికంగా వారిని అణచివేసే సామాజిక పరిస్థితులను రచయిత సహజంగా చిత్రించారు. మరోవైపు, ఉన్నత వర్గాలకు చెందిన వ్యక్తుల పలుకుబడి, ఆధిపత్యం, సామాజిక ప్రభావం గ్రామీణ జీవితంలో బలహీన వర్గాలపై ఎలా పనిచేస్తుందో కథలోని సంఘటనల ద్వారా చూడవచ్చు. అలాగే అణచివేతను మౌనంగా భరించే పరిస్థితితో పాటు, ఆత్మగౌరవం కోసం ప్రశ్నించే, తమ హక్కుల కోసం నిలబడే మనస్తత్వం కూడా కథలో కనిపిస్తుంది. అందువల్ల 'చిత్రకన్ను' కేవలం ఒక కుటుంబం లేదా కొంతమంది వ్యక్తుల కథగా కాకుండా, కులం, వర్గం, ఆర్థిక స్థితి, అధికారం, శ్రమ, ఆత్మగౌరవం వంటి అంశాల మధ్య ఉన్న సామాజిక సంబంధాలను తెలిపే కథగా చెప్పవచ్చు. మాదిగల జీవన వాస్తవాలను, ఉన్నత వర్గాల పలుకుబడిని ఒకే సందర్భంలో చూపించడం ద్వారా నందిని సిధారెడ్డి సమాజంలోని అసమానతలను ఈ కథ ద్వారా మన ముందుంచారు.

### ఆధార గ్రంథాలు

1. రాములు, బి. యస్. (2007). 60 ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు. సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, హైదరాబాదు: విశాల సాహిత్య అకాడమీ.
2. జోసెఫ్, కనపాల. (2020). నందిని సిధారెడ్డి కవిత్వం – సమగ్ర పరిశీలన. డా. జె. వెం కటరమణ
3. పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత వ్యాసం. మధురై. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం.
4. సిధారెడ్డి, నందిని. (2016). చిత్రకన్ను. చరిత ఇంప్రెషన్స్: హైదరాబాదు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# బి.ఎస్. రాములు "చూపు" నవల – సామాజిక జీవిన చిత్రణ

– డా. తలారి హరిష్ కుమార్
హైదరాబాదు విశ్వవిద్యాలయం.
uohharish18@gmail.com

**ఉపోద్ఘాతం:**

సమాజం అనే పదం వ్యక్తుల సమూహాన్ని మాత్రమే సూచించదు. ఇది సభ్యుల మధ్య సంభవించే పరస్పర చర్యను కూడా సూచిస్తుంది. సమాజ పరిణామ క్రమంలో మారుతున్న జీవన సరళిని భావాత్మకంగా చిత్రించేది సాహిత్యం. చరిత్ర నిర్మాణంలో సాహిత్యం ఒక భాగం కాకపోయినా చరిత్ర ఊహించని మానవ జీవితాన్ని సాహిత్యం అందిస్తుంది. సాహిత్యం సమాజాన్ని అనుక్షణం వెంటాడుతుంది. రచయిత తాను రచన చేయాలంటే ఆ కాలంలోని సామాజిక స్థితిగతులను కచ్చితంగా దృష్టిలో పెట్టుకుని వాటిని తన రచనలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చిత్రిస్తాడు. ఈ పద్ధతిని తెలుగు నవల చక్కగా అనుసరించింది. నవలల్లో వస్తువు సమాజం నుండే తీసుకోబడుతుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, హింస, మంచి, చెడులు ఇలా అనేకానేక అంశాలు సాహిత్య రచన వస్తువులవుతాయి. ఈ విధంగా సమాజంలోని వాస్తవ జీవన పరిస్థితులను పాత్రలు, సంఘటనలు, సంభాషణలు సందర్భాల ద్వారా చిత్రించడాన్ని సామాజిక చిత్రణ అంటారు.

సామాజిక విశ్లేషకులుగా, బి.ఎస్. రాములుగారు తన రచనలలో కూడా సమాజ "హితం" కోరే విధంగా ఎన్నో రచనలు చేశారు. ఒక సామాజిక వర్గాన్నే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన విషయాలు తాను చూసినవి, విన్నవి, పాత్రలుగా మలిచి, సమాజంలోని సమస్యలు ఏమిటి ? తన రచనల ద్వారా ఇంకా ఎలాంటి చైతన్యం ప్రజల్లో కల్పించాలి, అనే నూతనమైన ఆలోచనలతో ఇప్పుడున్న యువతకు ఏం నిర్దేశం చేయాలి? అనే భావనతో బి.ఎస్. రాములు రచించిన రచనల్లో "చూపు" నవల ఒకటి. సమకాలీన సామాజిక జీవన విధానంలో అనేక మార్పులు ప్రతిఫలించాయి. ముఖ్యంగా కుటుంబ సంబంధాలు, తల్లిదండ్రులు–పిల్లల అనుబంధం, పిల్లల భవిష్యత్తు, ఉద్యోగాల కారణంగా వివిధ ప్రాంతాలకు వెళ్లడం, మారుతున్న జీవనశైలి, వృద్ధుల పరిస్థితి వంటి అంశాలను రచయిత పాత్రలు మరియు సంఘటనల ద్వారా చిత్రించారు. అందువల్ల "చూపు" నవలలోని సామాజిక జీవిత చిత్రణ సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పు ఆధారంగా సామాజిక జీవన సంఘటలను తెలియజేయడం ఈ పరిశోధన పత్ర ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు:** లింగ వివక్షత, ఆర్థిక పురోగమనం, ఆర్థిక అంతరాలు, జీవనశైలి, భూస్వామ్య వ్యవస్థ, పారిశ్రామికీకరణ,

**పరిచయం:**

రచయిత బి.ఎస్. రాములు విభిన్న పాత్రల ద్వారా ఆ నాటి సమాజాన్ని చూపించడానికి "చూపు" నవలను వయస్సుల వారిగా మూడు తరాలు ఏర్పర్చుకొని సమాజంలోని ఒక వ్యక్తి సంపూర్ణ జీవితానికి సరిపడు ఆలోచనల్ని కల్గించాడు. ఇందులో మొదటితరం స్నేహితుల, రెండవ తరం స్నేహితుల యొక్క పిల్లలు, మూడవతరం పిల్లల యొక్క విద్యార్థులు. ఈ విధంగా నవల మూడు తరాలుగా ముందుకు సాగుతుంది. 1969 నాటి జై తెలంగాణ ఉద్యమం నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు పెట్టుబడిదారి విధానం, భూస్వామ్య వ్యవస్థ, పారిశ్రామికీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, దేశాభివృద్ధి, ప్రాంతీయాభివృద్ధి, తెలంగాణ వనరులు, కులం, లింగం, వర్గం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాభివృద్ధి ఏవిధంగా సాధించాలి. ఆర్థికంగా సుస్థిరత ఏ విధంగా సాధించాలి, ఆర్థిక పురోగమనం ఏ విధంగా చెందాలి. విద్యా ఉద్యోగం లాంటి సమస్యల్ని ఏ విధంగా సాధించాలి. ప్రేమలు, పెళ్ళిళ్ళ విషయంలో జీవితాన్ని ఎలా బ్యాలన్స్ చేసుకోవాలి, ప్రేమ విఫలమైతే ఏ విధమైన మార్గంలో వెళ్ళాలి. స్నేహాలు ఏ విధంగా ఉండాలి, కుటుంబ బాంధవ్యాలు ఏ విధంగా నిలుపుకోవాలి. ఆర్థిక అంతరాలు, రాజకీయ అసమానతలు, ప్రాంతీయ వెనుకబాటు తనం, దోపిడి, వెనుకబడిన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

విద్యావిధానం, లింగ వివక్షత, వీటి పరిణామాల వల్ల తెలంగాణ ఏ విధంగా ఉంది. సమాజంలో అసమానతల వల్ల సమాజం ఏ విధంగా తయారౌతున్నది. సమాజంలో సంఘజీవి ఏ విధంగా ఉండాలి. సమాజానికి ఏది అవసరం, ఏది అవసరం లేదు. సమ సమాజ నిర్మాణానికి మార్గం ఎలా వేయాలని రచయిత 31 అధ్యాయాలుగా విభజించి ఈ "చూపు" నవల ఇతివృత్త నిర్మాణాన్ని రూపొందించారు.

**చూపు నవల – సామాజిక జీవిత చిత్రణ:**

చూపు నవల వివిధ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య చిగురించిన స్నేహం ఏ విధంగా బంధుత్వానికి దారి తీసింది, వారి తర్వాత వారి వారి పిల్లల స్నేహాలు, ప్రేమలు ఏ విధంగా మలుపుతిరిగాయి అనే అంశాలు మరియు సమాజంలో స్త్రీ యొక్క ప్రాధాన్యత, పురుష ప్రవర్తన ఏవిధంగా ఉంటుంది. అనే అనేకమైన అంశాలు చిత్రించబడ్డాయి. సమాజంలో పేదవాడు ఉన్నతంగా గౌరవించబడాలి అంటే చదువే మార్గం అని ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, ఎం.బి.ఏ. సుధాకర్ లాంటి పాత్రల ద్వారా రచయిత తెలియజేశాడు. కాస్త ఆర్థిక స్థితిగతులు బాగా ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఉద్యోగంతో పాటుగా, అదనపు ఆదాయాన్ని ఎలా ఆర్జించాలి అనే ఆలోచనలతో ఎం.ఈ.ఓ. సత్తయ్య, ఆర్.డి.ఓ. వెంకటేశం పాత్రలు కన్పిస్తాయి. ఇంకా ఆర్థికంగా స్థిరత్వం కల్గిన కుటుంబాలు చదువుకంటే వ్యాపారం ఉత్తమమని కాంట్రాక్టర్ భాస్కర్, రత్నాకర్ ల పాత్రలు కన్పిస్తాయి. ఈ నవలలోని ప్రతి పాత్ర ఆదర్శంగా సమాజానికి ఎంతగానో ఉపయోగపడే విధంగా రచయిత తీర్చిదిద్దారు.

కుటుంబంలో తండ్రి పాత్ర ఎంత ప్రధానమైనదో, తండ్రి పిల్లల్ని మార్గదర్శకత్వంలో ఎలా పెట్టాలో, సమాజంలో కుటుంబ జీవనానికి తండ్రి ప్రాధాన్యత తెలియజేస్తుంది ఈ నవల. అలాగే తండ్రి యొక్క నడవడి సరిగా లేకుంటే పిల్లల జీవితాలు కూడా ఎంత సంపాదన ఉన్నా కూడా అతలాకుతలం అవుతాయని కాంట్రాక్టర్ భాస్కర్ పాత్ర ద్వారా రచయిత సమాజానికి తెలియజేశారు. పేదరికంతో ఉండి చదువే పెట్టుబడిగా, డిగ్రీతో పాటుగా ఉద్యోగాలను కూడా పెంచుకుంటూ పోయి, తనలాగే తన పిల్లలు కూడా ఆదర్శవంతంగా సమాజంలో నిలదొక్కుకోవాలని ఉన్నతంగా ఎదిగినా కూడా సమయం, డబ్బు, విలువ నేర్పిన రామచంద్రయ్య పాత్ర నేటి సమాజానికి చాలా ఉపయోగపడుతుంది.

ఆర్.డి.ఓ. వెంకటేశం లాంటి పాత్రలు యువకుల్ని ఎంతగానో చైతన్య పరిచే విధంగా ఉంటాయి. ఒకానొక సందర్భాలలో తన తండ్రి ఉద్యోగాన్ని తనకు ఇప్పించాలని ప్రాధేయపడి ఒక యువకుడు వంగి కాళ్ళు మొక్కుతున్న సమయంలో వెంకటేశం మాటల్లో యువకులు మీ మీ హక్కులకై పోరాడాలి. ఎవరికి వంగి దండం పెట్టకూడదు. రాబోయే సమసమాజ నిర్మాతలు మీరే, మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు, ఆత్మగౌరవంతో బ్రతకాలి నీ తండ్రి ఉద్యోగాన్ని నువ్వు పొందడం నీ హక్కు అని సామాజిక హక్కును గూర్చి నేటి యువతకు గుర్తుచేస్తాడు. కాని తండ్రిగా తన కొడుకు దయాకర్ ప్రవర్తనలో మార్పు తీసుకురాలేకపోతాడు. దయాకర్ తండ్రికి ఉద్యోగం ఉందని గర్వంతో, అహంకార ధోరణితో జీవితాన్ని చాలా తేలికగా తీసుకొని చపలచిత్త మనస్తత్వంతో కాలాన్ని వృదా చేసుకొని స్థిరత్వం లేక కాలయాపన చేస్తాడు. దయాకర్ లాంటి పాత్ర స్వభావం ఉన్న యువకులకు ఇదొక మంచి సందేశంతో సమాజంలోని యువకులకు రచయిత కనువిప్పుగొల్పుతాడు.

ప్రొఫెసర్ లక్ష్మీపతి ఉన్నతమైన ఉద్యోగం చేస్తూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ప్రాంతీయ అసమానతలు తెలంగాణ వెనుకబాటుతనం, దోపిడి గురించి, ప్రాంతీయ హక్కుల గురించి, విద్యార్థులకు వివరిస్తారు. ఆ సమయంలోనే లక్ష్మీపతి దగ్గర అరుణ్ అనే విద్యార్థి రిసెర్చ్ స్కాలర్ గా ఉంటాడు. అరుణ్ యొక్క కుటుంబ నేపథ్యాన్ని గమనిస్తే నాటి తెలంగాణాలో వ్యవసాయదారుల కుటుంబం కళ్ళకు కట్టినట్టుగా కన్పిస్తుంది. అరుణ్ తండ్రి వ్యవసాయంలో భాగంగా బోరు బావులు వేసి అప్పులపాలై తండ్రి మరణిస్తాడు. తల్లి యొక్క చాలీచాలని సంపాదనతో పి.హెచ్.డి. చేస్తుంటాడు. అరుణ్ చెల్లె తులసి, ఆమె భర్త సురేందర్, దుబాయ్ కి వెళ్తాడు. తిరిగి రాక దుబాయ్ లోనే మరణిస్తాడు. ఇలా తెలంగాణ ప్రాంతంలోని వలస జీవన విధానాన్ని సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన అరుణ్ లాంటి విద్యార్థి జీవితాలను వారిని వారు ప్రతిబింబంగా చూసినట్లు ఉంటుంది.

సామాజికంగా కుటుంబ జీవనంలో స్త్రీ మూర్తులను గమనించినట్లైతే ఈ పాత్రలన్నికూడా ఎంతో మంది స్త్రీలకు ప్రతి పాత్ర స్వభావం చైతన్యం కొలిపే విధంగానే ఉంటుంది. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య భార్య మాధవి సమాజంలోని ఒక ఉత్తమ ఇల్లాలుగా కన్పిస్తుంది. పిల్లలకు, భర్తకు సేవ చేయడంలో, భర్తకు బాధ్యతను గుర్తుచేయడంలో కార్యార్థిలాగా కన్పిస్తుంది. అంత గొప్ప ఇల్లాలు కనుకనే

## సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

రామచంద్రయ్య ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుని నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరకు ఎదిగాడు. అంటే ఎంత గొప్ప ఇల్లాలో మనం గమనించవచ్చు.

రామచంద్రయ్య అనే తండ్రి పాత్ర ద్వారా కూతురు మానస చదువు విషయంలో లింగ వివక్షత చూపినట్లుగా కన్పిస్తుంది. కొడుకు మనోజ్ ని హైదరాబాదులో కోచింగుకు పంపిస్తాడు. రెండవ కొడుకు మనోహర్ ను ఢిల్లీకి కోచింగుకు పంపిస్తాడు. మానసను మాత్రం ఎం.బి.బి.ఎస్. లాంగ్ టర్మ్ కోచింగ్ పంపించదు. అమ్మాయిల చదువు విషయంలో అబ్బాయిలతో సమానంగా చూడాలన్న విషయాన్ని రచయిత రామచంద్రయ్య పాత్ర ద్వారా గుర్తుచేశారు. అబ్బాయిలకు ఉండే పూర్తి స్వేచ్ఛా అమ్మాయిలకు ఉండదని మానస పాత్ర ద్వారా తెలుస్తుంది. స్త్రీలకు చదువు విషయంలో, పెళ్లి విషయంలో పూర్తి హక్కు తల్లిదండ్రులకే ఉంటుందని, స్త్రీలకు ప్రతి విషయంలో తల్లిదండ్రుల నుండి అనేక ఆంక్షలు ఉంటాయని మానస పాత్ర ద్వారా సమాజానికి రచయిత తెలియపరిచారు.

నేటి యువతీ, యువకుల్లో ప్రేమ అనే అంశం అత్యంత ప్రాధాన్యత పోషించడం సహజమే. జయ, మనోజ్ ని ప్రేమిస్తుంది. కాని సమాజంలోని ఆర్థిక, సామాజిక కారణాల మూలంగా వారి ప్రేమ విఫలమౌతుంది. జయ, మనోజ్ ల ప్రేమ విషయంలో రచయిత పాటించిన విధానం యువతను మేల్కొలుపుతుంది. యువతను సన్మార్గంలో పెట్టాలనే రచయిత సదుద్దేశ్యంతో ప్రేమలు విఫలం అయితే జీవితం పూర్తైనట్టు కాదు, ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే కాని ప్రేమే జీవితం కాదని, ప్రేమలు విఫలమై ఆత్మహత్యలు చేసుకునే ఎంతోమంది యువతకు జయ, మనోజ్ పాత్రల ద్వారా మార్గదర్శకత్వం నేర్పించాడు. ఇక్కడ జయతో ప్రేమ విఫలమైన మనోజ్ జయ భర్త రత్నాకర్ కన్న గొప్పగా బ్రతకాలని నిర్ణయించుకున్నాడు. జయ తల్లిదండ్రులకు తాను కూడా గొప్ప కాంట్రాక్టర్గా ఎదిగి సమాజం దృష్టి తన వైపు మల్లించుకున్నాడు. ఈ విధంగా యువత ప్రేమకు దూరమైతే మంచి మార్గాన్ని ఎంచుకుని జీవితంలో స్థిరత్వం పొందాలి అని రచయిత తెలిపాడు. జయ వివాహం రత్నాకర్ తో జరుగుతుంది. కాని రత్నాకర్ కూడా జయ తండ్రిలాగా సినిమాలు అని బిజినెస్ అని పరాయి కాంతతో తిరగడాన్ని జయ అస్సలు సహించదు. రత్నాకర్ తో విడాకులు తీసుకోవాలని నిశ్చయించుకోవడం సమాజంలో భర్తలేని భార్యను గురించి అనేక వాదోపవాదాలు మాట్లాడడం జరుగుతుంది. ఇక్కడ సరైన ప్రవర్తన లేని భర్త నుండి భార్య విడాకులు తీసుకోవడమే ఉత్తమమైన మార్గం అని రచయిత ఉద్దేశించారు. సమాజంలోని ఇలాంటి స్త్రీలకు ఉపదేశించారు. జయ సింగిల్ పేరెంట్గా ఉంటూ మంచి వ్యాపారవేత్తగా ఎదిగి ఎంతో మందికి ఉపాధి కల్పన ఇస్తుంది. జయ పెళ్ళి విషయంలో తండ్రి భాస్కర్ ఎంతో తప్పు చేశానని పశ్చాత్తాపడతాడు. జయ జీవితాన్ని చూస్తున్న మానస తన పెళ్ళి విషయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం మంచిదేనని అనుకుంటుంది. మానస తన భర్త ఎం.బి.ఏ. సుధాకర్ కడు పేదవాడైనప్పటికి చదువే లక్ష్యంగా పెట్టుకొని ఆర్.డి.ఓ. అవుతాడు. భర్త ఉద్యోగం నుండి తాను గౌరవ మర్యాదలు పొందుతుంది. సుధాకర్ తల్లిదండ్రులు చాలా బాగా చూసుకునే కోడలుగా మానస సమాజంలో గౌరవించబడుతుంది.

సమాజంలో తల్లిదండ్రుల పెంపకంలో పిల్లల భవిష్యత్తు ఉద్దేశించి పిల్లలు లక్ష్యానికి చేరుకోవాలనే ఆశలో ఉన్నతమైన చదువులు చదివిస్తూ వారి వారి పిల్లల్ని అమెరికా, ఆస్ట్రేలియా వివిధ దేశాలకు విలువైన జీవితం కొరకు ఎలా పంపిస్తున్నారో, చివరికి పదవి విరమణ తర్వాత రామచంద్రయ్య పిల్లలు కూడా గూడు విడిచిన పక్షుల్లాగా వారి పనుల్లో నిమగ్నమై ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. తర్వాత ఇంట్లో మిగిలింది. రామచంద్రయ్య, అతని భార్య మాధవి మాత్రమే. ప్రతి పండగకు వాళ్ళు వస్తారని ఎదురుచూపులు తప్పేవి కావు. అలా పెన్షన్తో జీవిస్తున్న రామచంద్రయ్య తన పింఛన్ లో కొంత డబ్బును ఒక నిరుపేద అమ్మాయి చదువుకి ఇచ్చి చదివిస్తూ తన చిన్ననాటి పేదరికాన్ని గుర్తు చేసుకున్నాడు. వృద్ధాప్యంలో పిల్లలకై ఎదురుచూసే తల్లిదండ్రుల ఆలోచనల్ని, ఆవేదనని, కనబరిచారు రచయిత అంతేకాకుండా వృద్ధాప్యంలో తమ పనులు తాము చేసుకోలేని స్థితిలో ఎస్.ఎస్. హాస్టల్ (సీనియర్ సిటిజన్ హాస్టల్) అనే ప్రస్తావన తీసుకువచ్చారు. దీనికి గల కారణాలుగా సామాజిక జీవన విధానంలో భాగంగా ఉద్యోగాల రీత్యా, ఉన్నతమైన భవిష్యత్ రీత్యా తల్లిదండ్రులను విడిచి వివిధ ప్రాంతాలలో జీవిస్తున్న తమ సంతానం అందుబాటులో లేక, వృద్ధాప్యంలో తమ పనులు తాము చేసుకోక, ఈ మధ్య కాలంలో కొన్ని సామాజిక మాధ్యమాలలో చూస్తున్నట్లైతే పిల్లలకు భారంగా ఉండడం ఎందుకని వృద్ధాశ్రమాలకు వెళ్ళిపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని భారం అనుకుంటే ఏంటి పరిస్థితి పిల్ల ఇంతవాళ్ళు అయ్యేవాళ్ళా వృద్ధాప్యంలో తల్లిదండ్రులను దూరం చేసుకునే పిల్లలకు తల్లిదండ్రుల మనోవేదన ఎలా ఉంటుందో రచయిత తెలియజేశాడు. బాల్యం నుండి మొదలుకొని వృద్ధాప్యం వరకు మానవుని సామాజిక కోణాన్ని వివిధ

వయస్సుల వారిగా నిశితంగా తెలియపరిచారు. జీవితంలో ఈ నవల చదివిన ప్రతి ఒక్కరు తమకు తాము ఏదో ఒక కోణంలో ఈ నవల వారి జీవితంలో ప్రతిబింబిస్తుంది.

**ముగింపు:**

మొత్తంగా బి.ఎస్. రాములు "చూపు" నవలలో సామాజిక జీవనంలోని మార్పులను కుటుంబాన్ని కేంద్రంగా చేసుకొని చిత్రించారు. రామచంద్రయ్య పాత్ర, అతని కుటుంబ పరిస్థితులు, పిల్లల ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, విదేశీ జీవితం, తల్లిదండ్రుల ఒంటరితనం, వృద్ధుల సమస్యలు వంటి అంశాలు సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను ప్రతిబింబిస్తాయి. చూపు నవల కేవలం ఒక కుటుంబానికి సంబంధించినది కాకుండా, ఆధునిక ఉద్యోగ జీవితం, కుటుంబ సంబంధాలు, తల్లిదండ్రులు–పిల్లల మధ్య దూరం, మారుతున్న సామాజిక విలువలు అనే విస్తృతమైన సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే విధంగా ఉంది.

**ఆధార గ్రంథాలు:**


1. రాములు, బి. ఎస్. 2014. **చూపు**, విశాల సాహిత్య అకాడమీ: హైదరాబాద్
2. నిర్మల కుమారి, నందిగామ. 2015. ***బి.ఎస్. రాములు కథలు సామాజిక పరిణామాలు***, విశాల సాహిత్య అకాడమీ: హైదరాబాద్
3. సంజీవమ్మ,పి. 1985. ***తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం***. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: విజయవాడ

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


# ప్రపంచీకరణ – కొలిమి కథలో వడ్రంగుల జీవితం


**– గంట అశోక్**

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం.

కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

చరవాణి: 8897976064.



**వ్యాస సంగ్రహం:**

కొలిమి కథ వడ్రంగుల జీవితాన్ని చిత్రించింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి అంతర్జాతీయ కథా పురస్కారం పొందిన కథ ఇది. ప్రపంచీకరణ మూలంగా గ్రామాల్లో చేతి వృత్తులు చేసుకుని జీవనం సాగించే వడ్రంగుల జీవితం ఎలా తారుమారు అయిందో మేరెడ్డి యాదగిరిరెడ్డి చిత్రించారు. ఈ కథకు సరిగ్గా సరిపోయే శీర్షిక ఇది. "కొలిమి" వడ్రంగుల జీవితాలలో ప్రధానమైన భాగంగా చెప్పవచ్చు. ఎప్పటి నుండో ఆదరించిన కులవృత్తులు కూలిపోవడంతో దిక్కుతోచని స్థితికి చేరుకున్న ఎందరో బ్రహ్మంల నిజ జీవిత చిత్రణే 'కొలిమి' కథ.



**కీలక పదాలు:** కొలిమి, నాగళ్ళు, కర్రు, మేడితోక, గుంటకలు, రోహిణి కార్తె, కళలు, కరణలు, దొరలు, బల్లలు, కుర్చీలు, దర్వాజాలు, కిటికీలు, తలుపులు పంచాంగం, భారతం, భాగవతం, పట్వారి తలలోనాలుక, సవ్యసాచి, నాటుతుపాకి, ట్రాక్టర్, అల్యూమినియం.


**పత్ర వివరణ:**

మేరెడ్డి యాదగిరిరెడ్డి 1947 జూలై 16 నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం గడ్డి కోడారం గ్రామంలో తండ్రి లక్ష్మీనరసింహరెడ్డి తల్లి వెంకటమ్మలకు జన్మించాడు. ఇతని చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో మేనమామల వద్ద పెరిగాడు.1970 ఫిబ్రవరిలోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో ప్రవేశించాడు.ఇతను మూడు కథాసంకలనాలను,ఒక కవితా సంపుటిని,రైతునానీలను,పిట్టగూళ్ళు పిల్లల కథ సంపుటిని,18 మంది కవులపై వ్యాసాలు రాశాడు. 2003లో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉండగానే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం జరిగింది.2004లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం జరిగింది.

'కొలిమి'కథలో వడ్రంగి వృత్తి చేసుకుని జీవించే బ్రహ్మం, కొడుకులు, భార్యతో కలిసి ఆగ్రామంలో జీవిస్తుంటారు. బ్రహ్మం ఇల్లు ఎప్పుడూ జనంతో కళకళలాడేది. వర్షం వచ్చిందంటే చాలు తెల్లారేసరికి ఊరి జనంతో బ్రహ్మం కొలిమి ప్రాంతం నిండిపోయేది. పాత నాగళ్ళు, కొత్త నాగళ్ళు, గుంటకలు, దంతెలు, నాగలి మొద్దులు, కర్రు, మేడి తోకలు అన్నీ తయారు చేయించుకునేవారు. రోహిణి కార్తె వచ్చిందంటే అస్త్రాలన్నీ సిద్ధం చేసుకుని యుద్ధానికి సిద్ధమవుతున్న సైనికుల్లా రైతులు ఉంటారు.

"కొలిమి"కథ అచ్చమైన గ్రామీణ జీవితాన్ని వాడుక పదాలను, కళలు, ఆచార వ్యవహారాలను కళ్ళకు కట్టినట్టు చిత్రించారు మేరెడ్డి యాదగిరిరెడ్డి. గ్రామాల్లో దొరలు, కరణాలు, పోలీస్ పటేళ్ళు తమ ప్రతాపాలను వృత్తుల వారిగా ప్రజలపై ప్రదర్శించడం సర్వసాధారణం. ఈ కథలో కూడా దొర కొండారెడ్డి గ్రామంలో ఎవర్ని అయినా రారా పోరా అని దాష్టికంగా దర్పంగా పిలిచేవాడు కానీ బ్రహ్మంని మాత్రం పేరుపెట్టి పిలిచేవాడు. కరణం ప్రసాదరావు, పోలీస్ పటేల్కు అజమాయిషీ ప్రజలపై ఉండేది. ఆ గ్రామంలో ఈ ముగ్గురి పని అయిన తర్వాతనే ఎవరిపని అయినా చేసేవారు బ్రహ్మం.

బ్రహ్మం కొడుకులు వీరాచారి, రామాచారి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారు. అలాగే మాదిగ లింగస్వామికి కూడా పనినేర్పి తన వద్దే పనికి పెట్టుకున్నాడు బ్రహ్మం. "అలనాటి వీరబ్రహ్మేంద్ర స్వామికి కక్కయ్య ఎంతో ఈ బ్రహ్మానికి లింగస్వామి అంత" ( కొలిమి ` మేరెడ్డి యాదగిరిరెడ్డి `పుట ` 52)

బ్రహ్మానికి కులాల పట్టింపులు లేవు అని లింగస్వామిని చూస్తే అర్థమవుతుంది. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని ఆరాదించే బ్రహ్మం ఆయనలాగే ఇతర కులాలను ఆదరించేవారు. పని ఉన్న రోజుల్లో లింగస్వామి తిండి, పడక బ్రహ్మం ఇంట్లోనే ఉండేది. పండుగ పబ్బాలకు కొత్త బట్టలు కుట్టిస్తుంటాడు. పని వున్నప్పుడల్లా రోజుల కొద్దీ పనిలో సాయపడుతుంటాడు లింగస్వామి.

బ్రహ్మం వ్యవసాయ పనిముట్లు తయారు చేయడం మాత్రమే కాకుండా "ఇండ్లు కప్పుడు, బండ్లు తయారు చేయడం, బల్లలు, కుర్చీలు, దర్వాజలు, కిటికీలు, తలుపులు చేసేవారు. వూరిలో ఎవరు కొత్తిళ్ళు కట్టినా బ్రహ్మం ముగ్గు పోయవలసిందే. పంచాంగం చూసి జనాలకు మంచి చెడ్డా చెప్పడంతో క్షణం తీరిక ఉండేది కాదు. బ్రహ్మం చదివింది నాలుగో తరగతి అయినా భారత, భాగవతాలు క్షుణ్ణంగా చదివేవాడు." (కొలిమి ` మేరెడ్డి యాదగిరి రెడ్డి ` పుట`55)

అసలు బ్రహ్మంది ఆ వూరు కాదు. దొర కొండారెడ్డి పట్వారి ప్రసాదరావు వలిగొండ నుండి బ్రహ్మాన్ని తీసుకువచ్చి ఊరి ఉమ్మడి ఆస్తిగా ఉన్న చావిడిలో తలా ఒక చేయివేసి బ్రహ్మానికి ఇల్లు కట్టించి ఇచ్చారు. అప్పటి నుండి ఆయన గ్రామంలోని వారందరికీ తలలో నాలుకలా మెలుగుతూ ఎవరికి కావలసిన పనిముట్లు వారికి చేసి ఇచ్చేవాడు. బ్రహ్మం సవ్యసాచి లాంటివాడు. చూడడానికి రివ్వటలా ఉన్నా, పనిలో అంత జగి గల మనిషి లేడంటారు ఆ ఊరి జనం. ఏ వస్తువును చూసినా క్షణాల్లో పట్టేస్తాడు. అది చేసేదాక నిద్రపోడు. చివరకు పిట్టలు గొట్టే నాటు తుపాకీ కూడా తయారు చేస్తాడు. బ్రహ్మం ఇంట్లో నాటు తుపాకీ ఉందని పోలీసులు అరెస్టు చేస్తే అతని మంచితనం గురించి తెలిసిన సి.ఐ.రవీంద్రారెడ్డి అతని వదిలేస్తాడు. ఇతరులు కష్టాల్లో ఉంటే సాయం చేసే గుణం బ్రహ్మానిది. కులవృత్తులు చేసుకునే అందరికీ అన్ని పనిముట్లు ఉచితంగానే తయారు చేసి ఇచ్చేవాడు బ్రహ్మం. ఇతర వృత్తుల వారిని గౌరవించి, వారి వృత్తులు పది కాలాలు చల్లగా ఉండాలని ఆకాంక్షించేవాడు బ్రహ్మం.

బ్రహ్మం పిల్లల్లో పిల్లవాడిగా, పనిలో నేర్పరిగా ఉంటూనే జానపద కళల్లో కూడా తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించేవాడు.

బాగోతులు, భజనపాటలు, హరికథ, బుర్రకథ, గొల్లసుద్దులు, ఒకటేమిటి బ్రహ్మానికి తెలియని విద్యాలేదు. ఓ పదిమందిని కూడేసుకుని వాళ్ళకు బ్రహ్మంగారి చరిత్ర, చెంచులక్ష్మి, సతీ సావిత్రి, సత్యహరిశ్చంద్ర, నాటకాలు నేర్పించేవాడు. ఆ గ్రామంలో ఏ శుభకార్యమైనా వాళ్ళు నాటకం ఆడవలసిందే. ఆ గ్రామానికి సింధు బాగోతులు, గొల్ల బాగోతులు, జంగాలు, తోలు బొమ్మలాట ఎవరు వచ్చినా ముందు బ్రహ్మాన్ని కలువాల్సిందే. వాల్ల గుంపులో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వారి స్థానాన్ని బ్రహ్మం భర్తీ చేయాల్సివచ్చేది. అలా రోజంతా పనులు సాయంత్రాలు చిన్నపిల్లలతో రాత్రిళ్ళు జానపద కళలతో ఎంతో హాయిగా సాగిపోయేది.

మూడు పువ్వులు ఆరు కాయలుగా సంతోషంగా సాగిపోతున్న బ్రహ్మం చెవులకు పిడుగులాంటి వార్త వినబడుతుంది. ఆ గ్రామ పెద్దదొర ట్రాక్టరు తేవడంతో అరకలతో పనిలేకుండా పోవడం అంతకుముందే దొర ఆయిల్ ఇంజిన్ తేవడంతో మోటలు కొట్టుడు బందయింది. తను ఇష్టపడి చేయించుకున్న కచ్చుడం బండిని సైతం అమ్మేసి ట్రాక్టర్ తేవడంతో అందరూ దాన్ని చూసేందుకు వెళ్ళారు. ఎవరేం తక్కువకాదు అన్నట్లు అవకాశాలు ఉన్నవారంతా ట్రాక్టర్లు కొనేస్తారు. యాంత్రీకరణ నేపథ్యంలో బయటదేశాల నుండి ఇబ్బడి ముబ్బడిగా ట్రాక్టర్లు వస్తాయి. బడా పెట్టుబడిదారి బహుళజాతి కంపెనీలు రంగ ప్రవేశం చేసి దేశంలో ట్రాక్టర్లు, యంత్రాలు తయారు చేయడం మొదలు పెడతారు. రకరకాల పనిముట్లు తయారు చేసి జనం మీదికి వదులుతారు. ఎప్పుడూ పదిమందితో కళకళలాడే బ్రహ్మం కొలిమి బోసిపోతుంది. బ్రహ్మానికి కొడుకులిద్దరికీ పనీ పాట లేకుండా పోవడంతో కాలు గాలిన పిల్లిలా పనికోసం ఊరంతా తిరిగేవారు కులవృత్తులన్నీ అల్యూమినియం వస్తువుల రాకతో కుమ్మరి వృత్తి కునారిల్లిపోతుంది. ట్రాక్టరు వచ్చి అరకలన్నీ మూలనపడి బ్రహ్మాన్ని మందలించేవారే లేకుండా పోయారు.

సంగీత సాధనతో కళకళలాడే బ్రహ్మం ఇల్లు బోసి పోయింది. జనాలు టీ.వీలకు అతుక్కుపోయారు. క్రమంగా జానపద కళలకు కూడా ఆదరణ కరువయింది. దీంతో రామాచారి, వీరాచారి, బ్రహ్మం ఏ పని దొరికితే ఆ పనికి పోవడం మొదలెడతారు. బ్రహ్మం భార్య సుశీలమ్మ ఇద్దరు కోడళ్ళను తీసుకుని కూలీ పనులకు వెళతారు. పూలమ్మిన చోటే కట్టెటమ్మే పరిస్థితి బ్రహ్మం కుటుంబానికి దాపరిస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామా ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నం కావడం, చేతి వృత్తులు అంతరించడం, రైతులు ఆర్థికంగా చితికిపోవడం, మూతపడుతున్న ఫ్యాక్టరీలు ఇవన్నీ వినాశనం అవుతున్న సమాజ పరిస్థితిని సూచిస్తున్నాయి. బహుళ జాతి సంస్థలు తమ విషయ ప్రయోగాలన్నింటినీ వర్ధమాన దేశాలపై ప్రయోగించడం జరుగుతుంది.

నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ రచించిన బతుకుతాడు నవలలో కూడా కుటీర పరిశ్రమలు, కుల వృత్తులు అంతరించిపోవడాన్ని చిత్రించారు. నేడు సమస్త వృత్తులు అంతరిస్తూ వాటి స్థానంలో బహుళ జాతి సంస్థలు విస్తరిస్తున్న తీరు ఈ నవలలో కనబడుతుంది. "కల్లులో నిషాగుణం తక్కువ ఉంటుంది. రైతులు పొలంలో ఎక్కువగా రసాయన మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని శాస్త్రజ్ఞులు చెప్పినా ఎవలింటున్నారు. ఇప్పుడు భూమిలో భూసారం లేదు. ఆ మందుల ప్రభావం తాటి చెట్టుపై పడింది. కల్లులో నిషా ఇచ్చే లక్షణం పోయింది." (బతుకుతాడు ` నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్`పుట`131)

ప్రపంచీకరణ నేపథ్యంలో సాంప్రదాయ వ్యవసాయం అంతరించి వాటి స్థానంలో విష రసాయనాలు పంట పొలాలకు విరివిగా వినియోగించడం వలన భూమి సారం దెబ్బతిని ఆ ప్రభావం తాటి చెట్లపై పడటం గమనిస్తాం కొన్ని వందల సంవత్సరాలుగా గ్రామీణ సమాజానికి ఆర్థిక స్వావలంబన అందించిన దేశీయ పరిశ్రమలు, వృత్తులు, ప్రపంచీకరణ విధానాల వలన ఒక్కసారిగా కుప్పకూలిపోవడం గమనిస్తాం. దాని ఫలితంగా అనేక వృత్తులు, చిన్న పరిశ్రమలు నేడు అనేక సమస్యలకు గురవుతూ చివరికి మూసివేతలకు దారితీస్తున్నాయి.

"ప్రపంచంలో ఒక మూల నుండి ఇంకో మూలకి సరుకులు వనరులు ఎటువంటి ఆంక్షలు లేకుండా తరలించడం. ఈ తరలింపు అంతర్జాతీయ వర్తక రూపంలో అనేక దేశాల్లో విస్తరించడానికి బహుళజాతి సంస్థల రూపంలో జరుగుతుంది" (రాజకీయ పదాల డిక్షనరీ` బాపూజీ బి.ఆర్`పుట`78)

ప్రపంచంలో ఏదో ఒక మూల వివిధ రకాల వస్తువులు ఉత్పత్తి అవుతూనే ఉంటాయి. అక్కడ ఉత్పత్తి అయిన వస్తువులు దేశంలోని అలాగే వివిధ దేశాలకు పంపిణీ చేయబడతాయి. అప్పటి వరకు ఉన్న అక్కడి ఉత్పత్తులు వాటి రాకతో మూలనపడతాయి. జాతశ్రీ ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక కథలను రాశారు. చేతివృత్తులు ఎలా మూలనపడ్డాయో, జానపద కళాకారులు ఎలా తమ జీవనోపాధి కోల్పోయారో "కుట్ర" కథలో వివరించారు. ఇందులో కూడా వడ్రంగుల జీవితాలనే చిత్రించాడు ప్రపంచీకరణ వలన వారి జీవితాల్లో మార్పులు వచ్చిన విధానాన్ని చిత్రించారు. "గుండె చెదరలేదు పని తనముంటే ఎక్కడైనా మారాజులా బతకొచ్చని తండ్రి చెప్పిన మాటలు మననం చేసుకున్నాడు. రైతువారీ పనిముట్లకు గిరాకీ తగ్గినా, ఇళ్ళలో కావలసిన సామానులూ ఇండ్లు కట్టడం, అవోయివో పనులు చేసుకుంటూ బతగ్గలమనే అనుకున్నాడు తప్ప తన ధైర్యాన్ని కోల్పోలేదు" (కుట్ర ` జాతశ్రీ`పుట`22)

ట్రాక్టరు రాకతో నాగలి, గొర్రులను మూల పడేసింది, ప్లాస్టిక్కు అల్యూమినియం వచ్చి కుమ్మరి కులవృత్తులు మూలన పడేసింది. మందు బాటిల్స్ వచ్చి గీతకారులకు జీవితం లేకుండా చేసింది. ఇవన్నీ ప్రపంచీకరణ పుణ్య ఫలమే.

ఈ ప్రపంచీకరణ ఫలితంగానే బ్రహ్మం జీవితంలో కూడా పెనుమార్పులు వస్తాయి. ఇద్దరు కొడుకులు చెరొక పని వెతుక్కుంటూ వేరేవేరు ఊళ్ళకు వెళ్ళడంతో రెక్కలుడిగిన పక్షుల్లా భార్యాభర్తలు మారిపోతారు. పనులు లేవు మరోవైపు అనారోగ్య సమస్యలు పెరగడంతో సుశీలమ్మ మీది నగలన్నీ హరించుకుపోతాయి. ఆమె మెడలో పుస్తెలు తప్ప ఏమీ మిగలలేదు. ఒకసారి డబ్బుకు చాలా ఇబ్బంది రావడంతో ప్రాణాలు కాపాడుకోవడానికి తను మరో కొడుకులా పెంచుకున్న యాపచెట్టును కొట్టి అమ్ముతాడు. వందల మందికి నీడలా నిల్చిన చెట్టు సైతం బ్రహ్మానికి సాయం చేసింది. రాను రాను సుశీలమ్మ ఎముకల గూడులో ముఖమంతా పీక్కుపోయి, బలహీనంగా తయారవుతుంది.

ప్రాణం పోతుంటే చెవుల పోగులడ్డమా అనుకుని బ్రతికుంటే బలుసాకు తిని బతకొచ్చని ఎన్నో వేల మందికి ఒంటి చేత్తో ఎన్నో వస్తువులు చేసిన పెద్ద బాడిశను, కొలిమి ముందున్న ఇనుప ధాకలిని వూడబీకి బస్తాలో మూటగట్టి కండ్ల నీళ్ళు కుక్కుకుంటూ భార్య బాధను కొంతలో కొంతైనా తగ్గించేందుకు, ఆటో కోసం బయటకు కదులుతాడు బ్రహ్మం. ఇంటి లోపలి నుండి సుశీలమ్మ ఖంగు ఖంగు మని దగ్గుతుండటంతో కథ ముగుస్తుంది.

**ముగింపు:**

ఎన్నో వేల మందికి తలలో నాలుకలా ఉన్న కులవృత్తి ప్రపంచీకరణ మూలంగా మూలనపడితే ఆ వృత్తి జీవితం ఎలా మారిపోతుందో బ్రహ్మం ఒక ఉదాహరణ, చిన్నప్పటి నుండి అన్నం పెట్టిన కులవృత్తి అమ్మలా ఆదరించిన చేతిపనులు ఒక్కసారిగా కునారిల్లిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. చేసేందుకు పనులు లేక దిక్కుతోచని దీన జీవితాలను వెళ్ళదీస్తున్న వారెందరో తోడుగా ఉండాల్సిన కొడుకులు, రెక్కలు వచ్చిన పక్షుల్లా తలోదిక్కు ఎగిరిపోవడం, ఎన్నో ఏండ్లు తిండిపెట్టిన వడ్రంగి వస్తువులను సైతం అమ్మి భార్యకు చికిత్స చేయించేందుకు ముందుకు కదిలే క్షణంలో బ్రహ్మం కళ్ళు వర్షిస్తాయి. ఎంతోమందికి బ్రతుకు దెరువు కల్పించిన వస్తువులు అవి. ప్రపంచీకరణ కొందరికి లాభం చేకూర్చితే మరికొందరికీ జీవితాలు, జ్ఞాపకాలు లేకుండా సమూలంగా తుడిచిపెడుతుంది. ప్రతి గ్రామంలో దాని తాలూకా శిథిల జ్ఞాపకాలు మనకు దర్శనమిస్తూనే ఉంటాయి. దానిని అవగాహన చేసుకున్న మేరెడ్డి కుల వృత్తుల నేపథ్యంలో చిత్రించిన కథే కొలిమి.

**ఆధార గ్రంథాలు:**

1) కొలిమి –మేరెడ్డి యాదగిరి రెడ్డి.

2) బతుకుతాడు –నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్.

3) రాజకీయ పదాల డిక్షనరీ – బాపూజీ.బి,ఆర్.

4) కుట్ర – జాత శ్రీ.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# తెలుగులో పర్యావరణ సాహిత్యం: ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ

– మోటూరి హిమబిందు,
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్

**అబ్ స్ట్రాక్ట్ (Abstract):**

మానవ మనుగడకు అత్యంత మూలమైన సహజ వనరులు విచక్షణా రహితంగా దుర్వినియోగం కావడం వల్ల నేడు పర్యావరణం తీవ్రమైన అసమతుల్యతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో పర్యావరణ స్పృహ, పరిరక్షణ ఆవశ్యకత ఏవిధంగా ప్రతిఫలించాయో ఈ పరిశోధనా వ్యాసంలో విశ్లేషించడమైనది. ప్రాచీన కావ్యాల్లో అలంకారప్రాయంగా ఉన్న ప్రకృతి వర్ణనలు, ఆధునిక యుగంలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణల ప్రభావంతో పర్యావరణ విమర్శ, సాహిత్య రూపాలుగా ఎలా రూపాంతరం చెందాయో ఈ పరిశోధన పత్రంలో చర్చించాను. ***ఎన్. గోపి 'జల గీతం', 'నానీలు', 'అక్షర వృక్షాలు'*** వంటి కవితా సంపుటాలు; ***సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'ఒంటరి', బిభూతిభూషణ్ బందోపాధ్యాయ 'వనవాసి', చంద్రలత 'రేగడి విత్తులు', చింతకింది శ్రీనివాసరావు 'మున్నీటి గీతలు'*** వంటి నవలలు; ***ద్విభాష్యం రాజేశ్వరరావు 'చెట్టంత మనిషి' నాటిక*** వంటి ప్రముఖ ప్రక్రియల ద్వారా ప్రకృతి విధ్వంసాన్ని, జల–అటవీ సంక్షోభాన్ని రచయితలు ఏవిధంగా ఎండగట్టారో విశ్లేషించడమైనది. అలాగే, సృజనాత్మక సాహిత్యంతో పాటు విమర్శనా వ్యాసాలు, పరిశోధన పత్రాలు, ప్రసార మాధ్యమాలు సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంలో పోషిస్తున్న పాత్రను ఈ పత్రంలో విశ్లేషించాను. "వృక్షో రక్షతి రక్షితః" అనే సత్యాన్ని గ్రహించి, ప్రకృతితో సహజీవనం చేయడం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమనే బలమైన సందేశాన్ని ఈ సమగ్ర పర్యావరణ సాహిత్యం చాటుతుందని భావిస్తున్నాను.

**కీలక పదాలు:** *సాహిత్య ప్రయోజనం, పర్యావరణ సాహిత్యం, పర్యావరణ విమర్శ, పర్యావరణ స్పృహ, ఆధునిక పర్యావరణ ప్రక్రియ లు, ప్రకృతి పరిరక్షణ.*

## 1. ఉపోద్ఘాతంః

పర్యావరణ సాహిత్యం ప్రాచీన సాహిత్యంలో ప్రబంధాలు,అష్టాదశ వర్ణనలలో అంతర్భాగమై ఉన్నప్పటికీ, ఆధునిక సాహిత్యంలో దాని పరిధి మరింత విస్తరించింది. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం కారణంగా పర్యావరణ పరిస్థితుల్లో అనేక మార్పులు ఏర్పడ్డాయి .జనాభా పెరుగుదల, పట్టణీకరణ, సహజ వనరుల దుర్వినియోగం పెరిగిపోయింది. దీనితో పర్యావరణం సమతౌల్యాన్ని కోల్పోవటంతో అనేకమంది రచయితలు పర్యావరణ సమస్యలపట్ల తమ వంతు బాధ్యతగా రచనలు చేయడం ప్రారంభించారు. ఈ విధంగా ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన పర్యావరణ సమస్యలు, పరిరక్షణ మొదలైన అంశాలను గురించి ఈ పత్రంలో తెలియజేయాలనుకుంటున్నాను.

### 1.1. పరిశోధనా పద్ధతి:

విశ్లేషణాత్మక పరిశోధనా పద్ధతిని అనుసరించి కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, వ్యాసం మొదలైన ప్రక్రియలను ఈ పత్రంలో అధ్యయనం చేస్తాను. ఒక అంశానికి సంబంధించి దానిలో ఉన్న వివిధ అంశాలను విభజించి వాటి మధ్య సమన్వయాన్ని, హేతుబద్ధతను పరిశీలించటమే విశ్లేషణాత్మక పరిశోధనా పద్ధతి.

#### 1.1.1 పర్యావరణం అంటే...!:

పర్యావరణాన్ని ఆంగ్లంలో" Eco అని, "Environmental" అని అంటారు. మన చుట్టూ ఆవరించి ఉన్న జీవ,నిర్జీవ సముదాయాన్ని పర్యావరణం అంటారు.మానవులు, జంతువులు, మొక్కలు, సూక్ష్మజీవులు, జలచరాలు వంటి జీవులతో పాటు నీరు, గాలి, సూర్యకాంతి, ఉష్ణోగ్రత, నేల, వాతావరణం వంటి నిర్జీవ అంశాలు పర్యావరణంలో చేరుతాయి.

తెలుగులో పర్యావరణ సాహిత్యం అనే పదాన్ని "Eco Literature" అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా వాడుతున్నారు. ఈ పదాన్ని మొదటగా William Ruece kert 1978వ సంవత్సరంలో "literature and ecology an experiment in eco Criticism "అనే వ్యాసంలో వాడారు.

### 1.1.2. పర్యావరణ నిర్వచనం:

1980లో సి.సి. పార్క్ '"ఒక నిర్ణీత సమయంలో మానవుడి చుట్టుపక్కల ఉన్న సమగ్ర పరిస్థితులు పర్యావరణం" అని నిర్వచించాడు.(ఆర్థికాభివృద్ధి – పర్యావరణం, పు:18)

### 1.1.3. పర్యావరణ సాహిత్యం– లక్షణాలు:

పర్యావరణం అనేది ఆర్థిక వస్తువుల ఉత్పత్తికి అవసరమైన సహజ వనరులను అందిస్తుంది. ఆర్థిక కార్యకలాపాల వల్ల ఉత్పన్నమయ్యే వ్యర్థాలను తనలో విలీనం చేసుకుంటుంది.అలాగే జీవావరణ సమతౌల్యాన్ని కాపాడడానికి అవసరమైన ప్రాణాధార సేవలను అందిస్తుంది. సాధారణంగా పర్యావరణానికి కాలుష్యాన్ని తనలో విలీనం చేసుకునే లక్షణం ఉంటుంది. కానీ అది పరిమితికి మించినప్పుడు పర్యావరణం అసమతుల్యానికి గురవుతుంది. పర్యావరణంలోని సహజ వనరులైన గాలి, నీరు, నేల, అడవులు, ఖనిజాలు మొదలైనవి పరిమితంగా ఉంటాయి. వీటిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా పర్యావరణం తన స్థిరత్వాన్ని కాపాడుకుంటుంది.

### 1.2 ఆధునిక సాహిత్యం( ప్రక్రియల )లో పర్యావరణ సమస్యల చిత్రణ ;

1973 వ సంవత్సరం మార్చి చివరి వారంలో ప్రారంభమైన చిప్కో ఉద్యమంతో భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు పునాది ఏర్పడింది.చిప్కో ఉద్యమం తర్వాత పర్యావరణ చైతన్య తీవ్రత భారతదేశంలో సంస్థాపరమైన కొన్ని మార్పులకు దారి తీసింది. అడవుల సంరక్షణ, వన్య జంతువుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం కొత్త చట్టాలు వచ్చాయి. ఈ సైతాంతిక నేపథ్యంలోవిపత్తులు,జల ప్రళయాలు,కరువు కాటకాలు మొదలైన విషయాలు వస్తువుగా చేసుకుని కొంత సాహిత్యం వచ్చింది. ముఖ్యంగా రాయలసీమ కరువు సాహిత్యం అంతా కూడా పర్యావరణ ప్రతికూలతకు నిదర్శనాలే. 1977 నవంబర్ 19 న ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా దివిసీమ ఉప్పెనను ప్రతీకగా తీసుకుని రాజకీయ కోణంతో నగ్నముని 'కొయ్య గుర్రం' అనే ఆధునిక కావ్యాన్ని రాశారు. ఇలా పర్యావరణ సమస్య ప్రధాన వస్తువుగా లేదా రచనలలో అంతర్భాగంమై పర్యావరణ సాహిత్యం వెలువడింది.

### 1.2.1. పర్యావరణ –కవిత్వం:

ఆధునిక సాహిత్యంలో కవిత్వం వచన కవిత, దీర్ఘ కవిత,మినీ కవిత,నానీలు మొదలైన రూపాలలో వెలువడింది. ఇటువంటి రూపంలో వెలువడిన కవిత చిన్నదైనా పెద్దదైనా ఎక్కువ సందేశాన్ని / అర్థాన్ని ఇస్తుంది అనటంలో సందేహం లేదు. దీనికి ఉదాహరణగా నానీలు చెప్పుకోవచ్చు.

కవిత్వంలో పర్యావరణ కవిత్వం(Eco- poetry) విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. పర్యావరణ పరిరక్షణను ప్రధాన వస్తువుగా/ ఇతివృత్తంగా చేసుకుని వచ్చిన కవిత్వాన్ని పర్యావరణ కవిత్వం అంటారు. పర్యావరణ కవిత్వం అనగానే మొదటిగా గుర్తొచ్చేది ఎన్. గోపి గారు రాసిన **"జల గీతం"** అనే దీర్ఘ కావ్యం.దానిలో ఒక కవితలో ఇలా అంటారు.

**"మనిషి / అవును / ఈ కాస్త భూఖండంలో / విర్రవీగుతున్న మనిషి /జలమర్మాలను కనుక్కోవడానికి / జాజ్ఞాసువుగా ఎదిగిన మనిషి / జలస్తన్యాన్ని / క్రూరంగా కుమ్ముతున్నాడు. / సమస్త జలావరణం మీద / వల విసిరాడు / మబ్బుల పొదుగుల్లోంచి / ధారలుగా కురిసిన క్షీరంలో / విషం చిమ్ముతున్నాడు. /కాల్వలు కాలకూటాలయ్యాయి /నదుల వొంటినిండా వ్రణాలు లేచాయి / సముద్ర ఘోషల్లో మూల్గులు నిండాయి. / జ్ఞానం వికసించిన జలతీరాల్లో /వాణిజ్యం పడగవిప్పింది /మితిమీరిన వాణిజ్యదాహం /నీటి ప్రాణాన్ని బలిగొంటున్నది /ఈ శతాబ్దం /ఇక కాలుష్య శతాబ్దమేనా?"**ఎన్. గోపి గారి ఈ "జల కవిత్వం" ఆధునిక మానవుడి స్వార్థపూరిత చర్యల వల్ల ప్రకృతికి, ముఖ్యంగా నీటి వనరులకు జరుగుతున్న తీవ్రమైన ముప్పును కళ్లకు కట్టినట్లు చూపుతోంది. ప్రకృతి రహస్యాలను ఛేదించి, జ్ఞానంతో ఎదిగానని గర్వపడుతున్న మనిషే. జీవనాధారమైన జలావరణాన్ని తన వాణిజ్య దాహంతో క్రూరంగా కలుషితం చేస్తున్నాడని కవి ఆవేదన వ్యక్తం చేశారు. నదులు, కాలువలు విషతుల్యమై వ్రణాలతో నిండిపోవడం, సముద్రాల ఘోషలో ఆర్తనాదాలు వినిపించడం

మానవాళి తెచ్చిపెట్టుకున్న వినాశనానికి నిదర్శనమని చెబుతూ, ఈ శతాబ్దం కేవలం కాలుష్య శతాబ్దంగానే మిగిలిపోతుందా అని హెచ్చరిస్తున్న ఈ కవిత పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను బలంగా చాటుతుంది.

**'అక్షర వృక్షాలు'** పేరుతో ఒక కవితా సంకలనం వెలువడింది. జె.బాపురెడ్డి, ఎస్వీ రామారావు, పోలేటి పార్వతీశంగార్ల సంపాదకత్వంలో 2011లో ఈ పుస్తకం వచ్చింది. దీనిలో ' పుడమి బృందావనం' పేరుతో మంత్రి లక్ష్మీనారాయణ గారి కవితలో చక్కని పర్యావరణ స్పృహన్ని చూడవచ్చు. **"ఎడారి తోడేళ్లు వికృతంగా మోరులెత్తుతాయి/ రాబందుల సమూహాలు/రాకాసి మేఘాలు అవుతాయి/అతివృష్టి అనావృష్టి అల్పం అధికం/ గ్లోబల్ వార్మింగ్ తీవ్ర ఉష్ణోగ్రతలు వడగాల్పులు /ప్రకృతి వైపరీత్యాలు /ప్రజల జీవితాలు రోదనం/చెట్లను నరకడం అడవుల్ని ఆక్రమించడం /కాలుష్యాన్ని తగ్గించే మెళకువల పట్ల అశ్రద్ధ/ వాహనాల, ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగంతో /అంతులేని నిర్లక్ష్యం అలసత్వం/మంచు పర్వతాలు కరుగుతూ ఉంటాయి/ తీరప్రాంతాలు సముద్రంతో కలిసిపోతాయి/ నదులు కలుషితం నగరాలు కలుషితం /అంతా దుర్గంధం దుర్వాసన దుర్భరం/ ఓజోన్ పొర ఛిద్రం/పగ్గాలే తెగిన అతినీలలోహిత కిరణాలు/ కొత్త కొత్త వ్యాధులు వెలుగు చూసే పాత రోగాలు/ అంటువ్యాధులు అంతుచిక్కని వ్యాధులు/ భూకంపాలు తుఫానులు ఆకస్మిక వరదలు /కరువు కాటకాలు అంతా కల్లోలమే /భూగోళము అగ్నిగోళమై నిప్పులు కక్కుతుంది/ నిప్పులు కురిపించే ఎండలు నిలువునా ముంచే వరదలు/ ప్రకృతి వికృతంగా వికట్టాటహాసం చేస్తున్నది పర్యావారణం నిలువెల్లా గాయాలతో దీనంగాచూస్తున్నది"** అని వర్ణించారు కవి.

ప్రకృతిపై మానవుడు సాగిస్తున్న విచక్షణా రహితమైన దండయాత్ర వల్ల భూగోళం ఎదుర్కొంటున్న భయానక పరిణామాలను ఈ కవిత అత్యంత శక్తివంతంగా కళ్లకు కడుతోంది. చెట్ల నరికివేత, కాలుష్యం పట్ల నిర్లక్ష్యం వంటి మానవ తప్పిదాల ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయి, ఓజోన్ పొర ఛిద్రమై అతినీలలోహిత కిరణాలు ముంచెత్తుతున్న దుస్థితిని కవి వివరించారు. ఒకవైపు మంచు పర్వతాలు కరిగి తీరప్రాంతాలు మునిగిపోతుండగా, మరోవైపు ఎండల తీవ్రత, అకస్మిక వరదలు, అనావృష్టి, భూకంపాలు వంటి విపరీతాలతో సృష్టి వికటాట్టహాసం చేస్తోంది. కొత్త కొత్త వ్యాధులు, అంటువ్యాధులతో అల్లాడిపోతున్న మానవాళిని, నిలువెల్లా గాయాలతో దీనంగా చూస్తున్న పర్యావరణ వేదనను ఈ కవిత తీవ్రంగా హెచ్చరిస్తోంది. నదులు కలుషితం కావడం, పారిశ్రామిక వ్యర్థాల వల్ల చెరువులు విషతుల్యం కావడం వంటి విషయాలు వారి కవితలలో కనిపిస్తాయి.

### 1.2.1.1 నానీలు :

లఘు కవితా ప్రక్రియలో అత్యంత ప్రజాదరణ పొందినది ఎన్. గోపి గారి నానీలు. 4 పాదాలు 25 లోపు అక్షరాలలో అర్థవంతంగా ఉన్న లఘు కవితా ప్రక్రియ.

***ఆకులు లేకుంటే /చెట్టునెలా గుర్తిస్తావ్ /పచ్చదనమే***

***చెట్టు చిరునామా!***

ఇది పై కి ఒక చెట్టు గురించి చెప్పినట్లు అనిపిస్తుంది. నిజానికి కూడా చెట్టుకి పచ్చదనం ఉండాలన్నా జీవం ఉండాలన్నా ఆకులు ఉండాలి. అలాగే జీవితం సుఖ సంతోషాలతో ఉండాలి అంటే కుటుంబం ఉండాలి. ఆ కుటుంబంలో పిల్లలు ఉండాలి. ఈ భాగాన్ని పర్యావరణ స్పృహతో మానవ జీవన సంబంధాలను వర్ణించటం ఈ నాని లోని ప్రత్యేకత.

***చెట్లు/మన ఊపిరితిత్తులు/దూయకండి వాటిపై***

***కత్తులు (గోపి కవిత్వం -II, పుట:25 )***

మనిషికి ప్రాణవాయువును ఇచ్చే చెట్లను,అడవులను అభివృద్ధి పేరుతో విచక్షణా రహితంగా నరికివేయటం, మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవటం వంటి అవివేక చర్య.

***విత్తును /చులకన చేస్తే ఎలా?రేపటి చిగురుపాటకు***

***ఇదే పల్లవి (గోపి కవిత్వం -II,*** పుట:27)

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


నేడు చిన్న విత్తనమే కావచ్చు, కానీ రేపు అదే మహావృక్షం అవ్వొచ్చు. ఎన్నో పక్షులకు, జీవులకు ఆశ్రయం కావచ్చు. నేటి ఈ చిన్న విత్తనమే రేపు మధుర ఫలాలను మనకు అందించవచ్చు. దానిని సంరక్షించినట్లయితే రేపు మన ఆయుష్యును పెంచే ఔషధం కావచ్చు. నేటి ఈ చిన్న విత్తనమే భవిష్యత్తు తరాలకు మనమిచ్చే బంగారు కానుక కావచ్చు.

***చెరువులో /బంగళాలు మొలిచాయి/నీటి తల్లికి***

***ఇన్ని సమాధులా /గోపి నానీలు (గోపి కవిత్వం -II, పుట:18 ).***

చెరువులను ఆక్రమించి రియల్ ఎస్టేట్ లు నిర్మించటం వల్ల వర్షాలలో కురిసిన నీరు ప్రవహించటానికి ఆటంకమై ఇళ్ళను ముంచివేసే చర్యను ఈ నానీలో వ్యక్తపరిచారు.

కేవలం నానీలలోనే కాకుండా, కవిత్వంలో ఉన్న ఇతర లఘు రూపాలలో కూడా పర్యావరణానికి సంబంధించిన అంశాలతో కవిత్వం ఉండే అవకాశం ఉంది.

### 1.3. పర్యావరణ కథా సాహిత్యం:

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రచురించిన కథల పుస్తకం పర్యావరణానికి సంబంధించి ముఖ్యంగా వ్యవసాయంలో విత్తనాలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన పద్ధతిలో కథలు రాయబడ్డాయి.

మణి వడ్లమానిగారు రచించిన "ఆకుపచ్చని భూమి" కథ ప్రస్తుత కాలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆధునిక చదువులు చదువుకున్న యువత సమాజం పట్ల చూపాల్సిన బాధ్యతను చిత్రించింది.ఈ కథ కొమరయ్య అనే సన్నకారు రైతు, పృధ్వి అనే అగ్రికల్చర్ బి.ఎస్సీ (B.Sc. Ag) గ్రాడ్యుయేట్ చుట్టూ తిరుగుతుంది. ఒకప్పుడు బంగారం పండించిన నేలతల్లి, ఇప్పుడు నాసిరకం విత్తనాలు, వాతావరణ మార్పులు, పెరిగిన పెట్టుబడుల వల్ల నిస్సారమైపోతుంది. దిక్కుతోచని స్థితిలో శివన్న అనే రైతు ఆత్మహత్యకు ప్రయత్నించగా, పృధ్వి , తన మిత్రుడు రవి అతడిని కాపాడతారు.

ఈ సంఘటన పృధ్విలో మార్పు తెస్తుంది. నగరంలో ఉద్యోగం చేయాలనుకున్న వాడు, తన చదువును రైతులకు ఉపయోగపడేలా మలచాలనుకుంటాడు. తన మిత్ర బృందంతో కలిసి గ్రామంలో "భూమితల్లి వ్యవసాయ క్లినిక్" (Agri Clinic) ఏర్పాటు చేస్తాడు. భూసార పరీక్షలు చేయడం, మేలురకమైన విత్తనాలను సూచించడం, సాగులో మెళకువలు నేర్పించడం ద్వారా రైతుల ఆత్మహత్యలను నివారించి, వ్యవసాయాన్ని మళ్ళీ లాభసాటిగా మార్చడమే ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం.

భూమిని ఒక ప్రాణమున్న జీవిగా (మనిషిలా) భావించి, దానికి ఇచ్చే చికిత్స గురించి రచయిత్రి ప్రస్తావించారు. మితిమీరిన రసాయనాల వాడకం లేదా అశాస్త్రీయ సాగు వల్ల భూమి నిస్సారమవ్వడం పర్యావరణానికి పెద్ద ముప్పు. దీనిని అరికట్టడమే పర్యావరణ పరిరక్షణలో మొదటి మెట్టు.

పూర్వం రైతులు తమ పంటల నుండే విత్తనాలను దాచుకునేవార. అంతే కాదు విత్తనాలను ఒకరికొకరు పంచుకునేవారు. ఇప్పుడు మార్కెట్లో దొరికే నాసిరకం లేదా హైబ్రిడ్ విత్తనాల వల్ల జీవ వైవిధ్యం (Biodiversity) దెబ్బతింటోంది. మేలురకమైన, ప్రాంతీయ వాతావరణానికి తట్టుకునే విత్తనాలను ప్రోత్సహించడం పర్యావరణానికి మేలు చేస్తుంది."ఆకుపచ్చని భూమి" కథ రైతు ఆత్మహత్యలను నివారించడమే కాకుండా, మన మూలాలైన నేల, నీరు, విత్తనం పట్ల మనం వహించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుంది. పర్యావరణం బాగుంటేనే మనిషి బాగుంటాడు, రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అనే సందేశం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది.

#### 1.3.1 రాయల సీమ కరువు కథలు:

సింగమనేని నారాయణ, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు తమ కథల్లో వాతావరణ మార్పుల వల్ల వర్షాలు కురవక, భూగర్భ జలాలు అడుగంటిపోయిన పరిస్థితిని హృదయ విదారకంగా చిత్రించారు. నేల నెర్రెలు బారడం, పశువులు నీళ్లు లేక పిట్టల్లా రాలిపోవడం ఈ కథల్లో కనిపిస్తుంది.

మహమ్మద్ దిలావర్ రాసిన "అడవి బతుకులు "కథా సంపుటి యురేనియం తవ్వకాల వల్ల మైనింగ్ ప్రాజెక్టుల వల్ల కలిగే పర్యావరణ విధ్వంశాన్ని తెలియజేస్తుంది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు అభివృద్ధి పేరుతో అడవులను ధ్వంసం చేయడంతో అక్కడ నివసించే గిరిజనులు పడే ఇబ్బందులను అంతే కాకుండా యురేనియం తవ్వకాల వల్ల, ఫ్యాక్టరీల వల్ల వెలువడే వ్యర్థాలు అడవిలోని నీ, గాలి కలుషితమై అక్కడ నివసించే గిరిజన ప్రజలకు కలిగే వింత వ్యాధులను ఈ సంపుటిలోని కథల్లో ప్రస్తావించబడింది.

అల్లం రాజయ్య కథలు దండకారణ్యంలో కలప మాఫియా వల్ల అడవులు ఎలా అంతరిస్తున్నాయో, దానిపై ఆధారపడిన గిరిజనుల బతుకులు ఎలా విపత్తులో పడ్డాయో బలంగా చిత్రించాయి.పెద్దింటి అశోక్ కుమార్ "కీలుబొమ్మలు", సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి "పిట్టపాట", పాపినేని శివశంకర్ "చివరి పిచ్చిక", డా. కాలువ మల్లయ్య "గ్లోబలైజేషన్", సలీం "రూపాయి చెట్టు", తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి "కతలవ్వ", సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి "ఆకుపచ్చని మాయ", పి. రామకృష్ణారెడ్డి "మనిషీ పశువు", పెద్దింటి అశోక్ కుమార్ "మాయిముంత", చక్రవేణు "కసాయి కరువు", జి. రామకృష్ణ "గంజి కేంద్రం", కె. సభ "పాతాళగంగ", కేతు విశ్వనాథరెడ్డి "నమ్ముకున్న నేల", సింగమనేని "అడుసు", స్వామి "నీళ్ళు", శాంతినారాయణ "కల్లమైపాయ", రాసాని "బతుకాట" రామచంద్రమౌళి "భూమిదుఃఖం" మొదలైన కథలు ఎన్నో వచ్చాయి. ఈ ప్రముఖ రచయితల కథలన్నీ తెలుగు కథా సాహిత్యంలో పర్యావరణ స్పృహ ఎంతగా వేళ్లూనుకుందో చెప్పడానికి నిలువెత్తు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. అల్లం రాజయ్య దండకారణ్యాల విధ్వంసాన్ని, గిరిజనుల ఆవేదనను ఆవిష్కరిస్తే; కేతు విశ్వనాథరెడ్డి, శాంతినారాయణ, రామచంద్రమౌళి వంటి రచయితలు నేల, నీరు, చెట్టు కోల్పోతున్న ప్రాణాధార సంబంధాలను సున్నితంగా, తీవ్రంగా చిత్రించారు. గ్లోబలైజేషన్, వాణిజ్య దాహం, యంత్ర సంస్కృతి వల్ల అడవులు కనుమరుగై, పీకలదాక కాలుష్యంలో చిక్కుకున్న మానవాళి దుస్థితిని ఈ కథలు అద్దం పట్టాయి. కేవలం మానవ సంబంధాలకే పరిమితం కాకుండా, ప్రకృతే మూలమని నమ్మి.. పర్యావరణ విధ్వంసాన్ని, జీవజాల సంక్షోభాన్ని ముందస్తుగా హెచ్చరించడంలో తెలుగు కథకులు సాహిత్యపరంగా చూపిన బాధ్యత ఎన్నదగినది.

### 1.4. పర్యావరణ నవలా సాహిత్యం:

తెలుగు నవలారంగంలో పర్యావరణ స్పృహ మానవ సంబంధాలకే పరిమితం కాకుండా, భౌగోళిక, జీవకోటి రక్షణ వరకు విస్తరించిందనడానికి ఈ నవలలు చక్కటి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. బిభూతిభూషణ్ బందోపాధ్యాయ 'అరణ్యక్' (సూరంపూడి సీతారాం తెలుగు అనువాదం **'వనవాసి'), సలీం 'గుర్రపు డెక్క'** వంటి నవలలు అడవుల విధ్వంసం, గిరిజనుల అస్తిత్వ సంక్షోభం, ప్రకృతి సౌందర్యం వెనుక ఉండే వాస్తవిక వేదనను అద్భుతంగా ఆవిష్కరించాయి. మరోవైపు చంద్రలత **'రేగడి విత్తులు'** ఆధునిక వ్యవసాయ రంగంలో వస్తున్న సంక్షోభాలను, విత్తన సమస్యలను చర్చిస్తే; సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి **'ఒంటరి'** మానవ జీవనానికి ప్రకృతికి మధ్య ఉన్న విడదీయరాని బంధాన్ని, పర్యావరణ విధ్వంస దుష్పరిణామాలను కళ్లకు కట్టింది.అలాగే, చింతకింది శ్రీనివాసరావు **'మున్నీటి గీతలు'** నవల నేటి కార్పొరేటీకరణ, రసాయన పరిశ్రమల వ్యర్థాల కారణంగా సాగర జలాలు ఎలా కలుషితమవుతున్నాయో హెచ్చరించింది. కార్పొరేట్ శక్తులు ఖనిజాల అన్వేషణ పేరిట కొండలను, అడవులను ధ్వంసం చేయడం వల్ల నదీజలాలు, సముద్రాలు కలుషితమై సమస్త జీవజాలం ముప్పును ఎదుర్కొంటున్న వైనాన్ని ఈ నవలలు గట్టిగా నిలదీశాయి. కేవలం వినోద సాధనంగా కాకుండా, ప్రకృతిని కాపాడుకోవాల్సిన చారిత్రక బాధ్యతను తెలుగు నవలలు తమ వస్తువుగా మలచుకుని పర్యావరణ సాహిత్యానికి బలమైన పునాదులు వేశాయి. అలాగే, బండి నారాయణస్వామి రాసిన **'గద్దలాడ తండాయి'** నవల రాయలసీమలో నీటి వనరులు ఎలా నాశనమయ్యాయి, వర్షాలు లేక రైతులు పడే కష్టాలు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల కరువు ఎలా శాశ్వత విపత్తుగా మారిపోయిందో ఈ నవల చారిత్రక ఆధారాలతో వివరిస్తుంది.అలాగే అక్కినేని కుటుంబరావు రాసిన **"కొల్లేటి జాడలు"** నవల కూడా పర్యావరణ పరిరక్షణ గురించి తెలియజేస్తుంది.

### 1.5. పర్యావరణ –నాటక/(నాటికలు)సాహిత్యం:

తెలుగు నాటకరంగంలో పర్యావరణ స్పృహ కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సమాజంలో బలమైన చైతన్యాన్ని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ మరియు అడవుల నరికివేత వల్ల ముప్పును ఎదుర్కొంటున్న ప్రకృతిని రక్షించుకోవాల్సిన బాధ్యతను పలు నాటికలు కళ్లకు కట్టాయి. ఇందుకు నిదర్శనంగా ద్విభాష్యం రాజేశ్వరరావు గారి **'చెట్టంత**

**మనిషి'** వంటి ప్రామాణిక నాటికలు నిలుస్తున్నాయి; ఇవి "వృక్షో రక్షతి రక్షితః" సూత్రం ఆధారంగా మొక్కల పెంపకం, కాగితం పొదుపు, మరియు కాలుష్య నివారణ ఆవశ్యకతను బలంగా చాటాయి. పాఠశాలలు, సామాజిక వేదికలపై ప్రదర్శించబడిన ఇలాంటి దృశ్య రూపకాలు.. మానవుడు తన అహంకారంతో ప్రకృతిని ధ్వంసం చేస్తూ కొనితెచ్చుకుంటున్న వినాశనాన్ని ఎండగడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక కర్తవ్యమని సమాజానికి హితవు పలికాయి.

### 1.6. పర్యావరణ విమర్శా సాహిత్యం:

ఎకో క్రిటిసిజం అనే పదాన్ని మొదట William Rueckert "literature and ecology.An experiment in eco criticism అనే వ్యాసంలో ఎకో క్రిటిసిజం అనే పదాన్ని వాడారు.

తల్లావఝల శివాజీ రామాయణ భారత ఇతిహాసాలను పర్యావరణ దృక్పథంతో అన్వయించి పరిశీలించారు. 'ఔచిత్యమ్' (AUCHITHYAM) అంతర్జాతీయ పరిశోధన జర్నల్ లో "**ప్రాచీనకవిత్వం: పర్యావరణస్పృహ, చైతన్యం**" (రచయిత: డా. సిహెచ్. లక్ష్మణచక్రవర్తి) వ్యాసంలో పర్యావరణ విమర్శకు సంబంధించి వ్యక్తమైన కొన్ని ప్రధానాంశాలు ఉన్నాయి.

కేవలం మానవ కేంద్రీకృత దృష్టిని కాకుండా, భూమిని మరియు సమస్త జీవకోటిని కేంద్రంగా చేసుకునే విమర్శనా విధానమే 'పర్యావరణ విమర్శ' (Eco-criticism) అని ఈ వ్యాసం ప్రతిపాదిస్తుంది. సమాజం, మనిషి, ప్రకృతి అన్నీ కాలుష్యం పాలవుతున్న నేపథ్యంలో సాహిత్య విమర్శ కూడా పర్యావరణ స్పృహను సంతరించుకోవాలని ఇది నొక్కిచెబుతుంది. మన ప్రాచీన కవిత్వంలో కేవలం అలంకారప్రాయంగా కాకుండా ప్రకృతిని జీవన వ్యవస్థలో ఒక కీలక భాగంలా ఎలా చిత్రీకరించారో ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. అడవులు, నదులు, పర్వతాలు, వృక్షజాలంపై మానవుడి ప్రభావం నాటి నుంచి నేటి వరకు ఎలా ఉందో ప్రాచీన కావ్యాల ఆధారంగా పరిశీలిస్తుంది. ఆధునిక కాలంలోనే కాక, ప్రాచీన కాలం నాటి సాహిత్య దృక్పథాల ద్వారా కూడా ప్రకృతితో మమేకమై జీవించాల్సిన అవసరాన్ని ఈ వ్యాసం గుర్తుచేస్తుంది. మానవుని స్వార్థం వల్ల దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి సాహిత్యపరమైన చైతన్యం ఎంత ముఖ్యమో ఇది వివరిస్తుంది.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారు రచించిన 'ఒంటరి' నవల గురించి శ్రీకాంత్ గడ్డిపాటి రాసిన ఈ సమీక్ష వ్యాసం పర్యావరణ, సాహిత్య విమర్శలో ప్రామాణింగా ఉంది. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు రచించిన 'సన్నపురెడ్డి "ఒంటరి" నవల: పర్యావరణ స్పృహ' అనే విమర్శనాత్మక వ్యాసాన్ని ద్రావిడి, జూలై-డిసెంబరు 2025 సంచికలో, ఆధునిక యాంత్రిక నాగరికత కారణంగా ప్రకృతికి, మానవునికి మధ్య తెగిపోతున్న బంధాన్ని నవల ఆధారంగా అత్యంత లోతుగా విశ్లేషించారు. డాక్టర్ రాఘవ పాత్ర ద్వారా పట్టణ కేంద్రిత వైద్య వృత్తి, వికృత జీవనశైలి, షుగర్ వంటి వ్యాధులు మానవుడిని ఏ విధంగా శారీరకంగా, మానసికంగా ఒంటరి చేస్తున్నాయో ఈ వ్యాసం ఎత్తిచూపుతుంది. నగరాల్లో పరుగులు పెట్టే మనిషికి, ప్రకృతితో మమేకమై జీవించే నర్సయ్య వంటి గ్రామీణ తాత్వికుడికి మధ్య ఉన్న తేడాను వివరిస్తూ.. కేవలం డబ్బే సర్వస్వంగా భావించే ఆధునిక సమాజం తన ఆరోగ్యాన్ని, మనశ్శాంతిని ఎలా కోల్పోతుందో విమర్శనాత్మకంగా సమీక్షించారు. అలాగే, కనుమరుగవుతున్న తృణధాన్యాలు (అరికెలు), సహజ వ్యవసాయ పద్ధతులు, చెట్ల నరికివేత వంటి పర్యావరణ సమస్యలను ఈ నవల ఎలా ప్రతిబింబించిందో వ్యాసకర్త విశదీకరించారు. కేవలం మనుషుల మధ్య జరిగే భావోద్వేగాలకే పరిమితం కాకుండా, నేల, నీరు, వృక్షజాలం, జీవవైవిధ్యం వంటి పర్యావరణ అంశాలను సాహిత్య వస్తువుగా మలచడంలో సన్నపురెడ్డి సఫలీకృతమయ్యారని ప్రశంసించారు. ప్రకృతిని కేవలం భోగవస్తువుగా కాక, సహజీవన భాగస్వామిగా చూడాలనే తాత్త్విక దృక్పథాన్ని ఈ నవల ద్వారా రచయిత సమాజానికి అందించారని, పర్యావరణ విమర్శ (Eco-criticism) కోణంలో ఇది ఒక మైలురాయి లాంటి నవల అని ఈ వ్యాసం బలంగా నిరూపించింది.

డాక్టర్ తన్నీరు కళ్యాణ్ కుమార్ రాసిన "సాహిత్యంలో పర్యావరణ స్పృహ" అనే వ్యాసం ప్రముఖ అంతర్జాల పత్రిక అయిన 'మధురవాణి' నిర్వహించిన వ్యాస పోటీలలో ఉత్తమ బహుమతి సాధించింది. దీనిలో ఆధునిక యాంత్రిక యుగంలో మితిమీరిన మానవ స్వార్థం వల్ల పర్యావరణం ఏ విధంగా కలుషితమవుతోందని, దానికి సాహిత్యకారులు తమ రచనల ద్వారా సమాజంలో ఎలాంటి పర్యావరణ స్పృహను (అవగాహనను) కల్పిస్తున్నారు అనే విషయాలను ఈ వ్యాసంలో చర్చించారు. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

పర్యావరణ సాహిత్య విమర్శలు విస్తృతంగా రాస్తున్నారు. పర్యావరణం – సమాజం, 'ప్రకృతి – పర్యావరణం' అనే రెండు పుస్తకాలను కూడా వేశారు. ఈ గ్రంథాలు కేవలం కేవలం భౌతిక దృగ్విషయాలుగా కాకుండా, మానవ మనుగడను శాసించే సామాజిక–తాత్త్విక కోణంలో పర్యావరణాన్ని విశ్లేషిస్తాయి. ఆధునిక అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసం, కాలుష్య ముప్పు, జీవవైవిధ్య సంక్షోభం వంటి అంశాలపై ఆయన శాస్త్రీయ దృక్పథంతో కూడిన లోతైన విమర్శను అందించారు. సైన్స్ వెలుగులో ప్రకృతి రక్షణ ఆవశ్యకతను నొక్కిచెబుతూ, సాహిత్యం ద్వారా పర్యావరణ చైతన్యాన్ని పాఠకులలో పెంపొందించడంలో ఆయన రచనలు దిక్సూచిగా నిలుస్తున్నాయి.

### 1.7. పర్యావరణ సాహిత్యం వ్యాస ప్రక్రియ:

సమీక్షలు, వ్యాసాలు, పరిశోధన గ్రంథాలు సమాజంలో పర్యావరణ స్పృహను పెంపొందించడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయి. సృజనాత్మక సాహిత్యాన్ని పరిచయం చేసే సమీక్ష వ్యాసాల ద్వారా ఏయే రచనలలో పర్యావరణ పరిరక్షణ అంశాలు ఉన్నాయో పాఠకులు సులభంగా గుర్తించగలుగుతారు. దీనివల్ల పర్యావరణ స్పృహ కలిగిన మంచి రచనలను చదివే అవకాశం ప్రజలకు లభిస్తుంది. అలాగే, ఈ రచనలపై వచ్చే విమర్శనాత్మక వ్యాసాల ద్వారా ఆయా రచనలు ప్రతిపాదించే సిద్ధాంతాలు, పర్యావరణ సమన్వయాలు ఎంతవరకు సబబైనవో ప్రజలు లోతుగా అవగాహన చేసుకోగలుగుతారు.

మరోవైపు, వ్యాసరచన ప్రక్రియలో భాగంగా వెలువడే పరిశోధన వ్యాసాలు, సిద్ధాంత గ్రంథాలు శోధ్ గంగ (Shodhganga) వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా మేధావులకు, విధాన నిర్ణేతలకు అందుబాటులోకి వస్తాయి. వీటి ఆధారంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో సముచితమైన పర్యావరణ పరిరక్షణ విధానాలను రూపొందించడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతేకాకుండా, ప్రసార మాధ్యమాల ద్వారా పాటలు, కథలు, నాటకాలు వంటి రూపాలు ప్రజలకు చేరువ కావడం వల్ల సమాజంలో నైతిక బాధ్యత పెరుగుతుంది.

### 1.8. ప్రసార మాధ్యమాల వల్ల ప్రయోజనాలు:

సమాజంలో పర్యావరణ స్పృహను పెంపొందించడంలో ప్రసార మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే పాటలు, కథలు, నాటకాలు అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తాయి. కేవలం శాస్త్రీయ లేదా సిద్ధాంతపరమైన విషయాల కంటే, కళాత్మక రూపాలు ప్రజల మనసులను నేరుగా తాకగలవు. ఈ ప్రక్రియ సమాజంపై చూపే ప్రభావం ప్రధానంగా క్రింది అంశాల ద్వారా స్పష్టమవుతుంది.

శాస్త్ర సాంకేతిక గ్రంథాలు లేదా పరిశోధనా పత్రాలు సాధారణ ప్రజలకు నేరుగా అర్థం కాకపోవచ్చు. కానీ లలిత కళలు, జానపద రూపాలు, రేడియో, టెలివిజన్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే కథలు, నాటకాలు ప్రతి సామాన్యుడికి సులభంగా అర్థమవుతాయి. అక్షరజ్ఞానం లేనివారికి కూడా దృశ్య–శ్రవణ మాధ్యమాల ద్వారా పర్యావరణ పరిరక్షణ సందేశం బలంగా చేరుతుంది.

### 1.9. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ: భవిష్యత్ తరాలకు సందేశం:

ప్రకృతిని ఆంగ్లంలో (nature) అని అంటారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 28వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఆరోజు ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను సంరక్షించడానికి అవసరమైన చర్యలను చేపట్టి ప్రజలను ప్రోత్సహించటం, మొక్కలు నాటడం , పరిసరాలను శుభ్రంగా ఉంచటం మొదలైన కార్యక్రమాలను చేపడతారు.

పర్యావరణ దినోత్సవాన్ని ఆంగ్లంలో 'ఎకో డే' అని,' ఎన్విరాన్మెంట్ డే' అని పిలుస్తారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి, ప్రజల్లో పర్యావరణ అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి 1972, జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రారంభించింది. ఇది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం (UNEP) ద్వారా ప్రతి సంవత్సరం నిర్వహించబడుతుంది.

"వృక్షో రక్షతి రక్షితః " అంటే చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి . పర్యావరణంలో గాలి కాలుష్యాన్ని హరించే శక్తి చెట్టుకు మాత్రమే ఉంది. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవటానికి కేవలం ప్రభుత్వాలు,సేనా సంస్థలు మాత్రమే కాకుండా ప్రజలందరూ తమ సొంత బాధ్యతగా గుర్తించినప్పుడే అది సాధ్యం అవుతుంది.

**1.10 ముగింపు:**

మొత్తంగా ఈ ప్రక్రియలన్నీ పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతూ, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే దిశగా సమాజాన్ని చైతన్యపరుస్తాయి. తెలుగు సాహిత్యంలో పర్యావరణ స్పృహ కేవలం ఒక వర్ణనాంశంగా కాకుండా, మానవ మనుగడను కాపాడుకునే చారిత్రక మరియు నైతిక బాధ్యతగా రూపాంతరం చెందిందని స్పష్టమవుతుంది. కవిత్వం, కథ, నవల, నాటకం వంటి విభిన్న సాహిత్య ప్రక్రియలు మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల ప్రకృతికి జరుగుతున్న ముప్పును, జీవజాల సంక్షోభాన్ని అత్యంత శక్తివంతంగా ఎండగట్టాయి. ఆధునిక యాంత్రిక నాగరికత, కార్పొరేట్ శక్తుల దోపిడీ కారణంగా అడవులు, నదులు, సాగరాలు కలుషితమవుతున్న వైనాన్ని ఈ సాహిత్య రూపాలు కళ్లకు కట్టడమే కాకుండా, పాఠకులలో బలమైన ఆలోచనను రేకెత్తించాయి.

**ఆధార గ్రంథాలు:**


1. సలీమ్. (2013). గుర్రపుడెక్క. విజయలక్ష్మి పబ్లికేషన్స్.
2. శ్రీనివాసరావు, చింతకింది. (2022). మున్నీటి గీతలు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA).
3. వెంకటరామిరెడ్డి, సన్నపురెడ్డి. (2017). ఒంటరి. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA).
4. కె. కేశవులు (ప్రధాన సంపాదకుడు). (2022). విత్తనం చెప్పిన కథలు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, రాష్ట్ర విత్తన & సేంద్రియ ధ్రువీకరణ ఆధారిటి, హైదరాబాద్.
5. చంద్రలత. (1997). రేగడి విత్తులు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA).
6. బందోపాధ్యాయ, బి. (2023). వనవాసి (సూరంపూడి సీతారాం, అను.; అసలు ప్రచురణ 1938). హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
7. బాపురెడ్డి, జె., రామారావు, ఎస్. వి., & పార్వతీశం, ఓలేటి. (2020). అక్షర వృక్షాలు, పర్యావరణ కవితలు. హైదరాబాదు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్.
8. గోపి, ఎన్. (2002). జల గీతం. హైదరాబాదు: చైతన్య ప్రచురణలు.
9. గోపి, ఎన్.(2010). కవిత్వం –11. హైదరాబాదు:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# జూకంటి జగన్నాథం వచన కవిత్వం – సామాజికాంశాల పరిశీలన

– బూర్ల వెంకటేశ్వర్లు,
తెలుగు సహాయాచార్యుడు,
SRR ప్రభుత్వ ఆర్ట్స్&సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్
చరవాణి:9491598040
విద్యుల్లేఖ: boorlatelugu@gmail.com

**ఉపోద్ఘాతం:**

ఆధునిక తెలుగు సృజనాత్మక రచనల్లో వచన కవిత్వం స్థిరరూపాన్ని పొందిన కవితా ప్రక్రియ. దాదాపు శతాబ్ద కాలంగా అనగా, ముప్పయ్యవ దశకం నుండి మొదలైన వచన కవిత్వం పాత కవిత్వీకరణ పద్ధతుల మీద ఒక తిరుగుబాటు మార్గంలా ఆవిర్భవించింది. అప్పటివరకూ పండిత వర్గాలకు పరిమితమైన పద్య ప్రక్రియకు బదులుగా వచన పద్యం, వచన గేయం, స్వేచ్ఛా కవిత వంటి పేర్లతో ప్రచారమై అనంతర కాలంలో ఒక స్వతంత్ర కవిత్వ ప్రక్రియగా వచన కవిత స్థిరపడింది.

వచన కవిత్వం కవితా వస్తువును, భాషను, ప్రక్రియను, భావనలను కొత్త తోవలో నడిపించింది. సామాజిక చైతన్యానికి పాదులు వేసింది. ఛందో బంధాలను తెంపి, సామాన్యుడి భాషలో ప్రజల సమస్యలను చిత్రించింది. నాటివరకూ ఉన్న పాలక సంక్షేమ దృష్టిని మరల్చి పాలిత కేంద్ర దృష్టికి తీసుకుపోయింది. సామాన్యుడి బాధలూ గాథలూ వస్తువులుగా మారినాయి. వ్యవహార భాషను వాడుకుంటూ భావ తీవ్రతతో అభివ్యక్తి వైవిధ్యంతో సామాజిక, సాహిత్య ఉద్యమాలకు వాహికగా మారింది. పేదరికం, అసమానతలు, కుల వివక్ష, దోపిడీలపై తీవ్రమైన నిరసనను తెలిపింది. అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ, ప్రాంతీయ, స్త్రీవాద, దళిత, మైనారిటీ వాద, బీసీ వాదాల కవిత్వాలుగా విస్తరించి సమాజాన్ని కదిలించింది. వ్యక్తిగత వేదన కంటే సామూహిక వేదనకు, మానవ హక్కులకు పెద్దపీట వేసింది. ప్రజల్లో చైతన్యాన్ని నింపి, అన్యాయాలను ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించింది. పాలనా విధానాలను, సామాజిక రుగ్మతలను నిలదీసింది. కవిత్వానికి సామాజిక ప్రయోజనమే అంతిమం అన్నట్టుగా ఆధునిక వచన కవిత్వం నిలబడింది.

**పరిచయం:**

ఈ కాల నేపథ్యంలో 1978 నాటి సిరిసిల్లా, జగిత్యాల రైతాంగ పోరాటాలు, దేశంలో విధించిన అత్యవసర పరిస్థితి ప్రభావాలు, విప్లవోద్యమ చైతన్యంతో జూకంటి జగన్నాథం కవిగా అంకురించారు. జూకంటి కవిత్వ నేపథ్యం గురించి ఆచార్య సి.కాశీం రాస్తూ "సహజంగా జీవితంలో నిక్షిప్తమైన పేదరికం, వరి కోతల కష్టాలు, బావి తవ్వే పనిలో మట్టి తట్టను తలకెత్తుకోవడం– మట్టితో సంభాషణ. ఇంకోవైపు అప్పటికే చదివిన చలం, శ్రీ శ్రీ, రావిశాస్త్రి, ఆరుద్ర, జూకంటిని స్థిరంగా నిలబడనివ్వలేదు. అప్పుడే మద్రాస్ నుంచి వచ్చిన నూతలపాటి గంగాధరం రాసిన చీకటిలో నుంచి, వెలుతురులోకి అని రెండు కవితా పుస్తకాలు జూకంటి కళ్ళలో వెలుగును నింపాయి"(పుట:108)[1] అన్నారు.

జూకంటి జగన్నాథం గత నాలుగు దశాబ్దాలుగా తన వస్తు విస్తృతిని, పరిధిని విశాలం చేసుకుంటూ కవిత్వ సృజన చేస్తున్నారు. స్థానిక, ప్రాదేశిక, జాతీయ, అంతర్జాతీయ మార్పులు జూకంటి కవిత్వ వస్తువులో దర్శనమిస్తాయి. అట్లాగే, సాహిత్యంలో బయలుదేరిన అనేక వాదాలు, ధోరణులు, ప్రాంతీయ ఉద్యమాలు కవితా వస్తువులుగా మారాయి. కాల క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా సమాజంలో వచ్చిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులను జూకంటి కవిత్వ వస్తువులుగా ఎన్నుకున్నాడు.

జూకంటి కవిత్వ వస్తువులో సామాజిక వాస్తవికత, మానవ జీవిత సంఘర్షణ పుష్కలంగా కనిపిస్తుంది. గ్రామ స్థాయి నుండి అగ్రరాజ్య స్థాయి వరకు పరిశీలనగా చేసిన వ్యాఖ్యానం ఉంటుంది. వ్యవస్థలలోని బోలుతనం, మానవ సంబంధాల్లోని డొల్లతనం సూక్ష్మ

దర్శిని పెట్టి చూపించినట్టుగా కనిపిస్తాయి. అసమ అభివృద్ధి, ప్రపంచీకరణ, క్విడ్ కో ప్రో వంటి వాటిని ముందే దర్శించి నిర్మించిన నైపుణ్యం తేటపడుతుంది. వివిధ ఉద్యమాలలో ప్రజల వైపు నిలబడి మాట్లాడిన ధోరణులున్నాయి.

"వస్తువు ప్రధాన లక్షణాలు చలనమూ, మార్పూ. సాహిత్య వస్తువు నిరంతర చలనంలో ఉంటుంది. అందుకు కారణం దానికి ఆధారభూతమైన సామాజిక వస్తువు ఎల్లప్పుడూ కదుల్తూ మారుతూ వుండటమే. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య నిరంతర ఘర్షణను బట్టి మానవ సంబంధాలు నిరంతరం మారుతుంటాయి. జీవిత విధానం మారుతుంటుంది. ఈ సామాజిక వస్తువుకు ప్రతిఫలనమైన సాహిత్య వస్తువు కూడా మారక తప్పదు"(పుట:83)[2] అన్న విధంగా జూకంటి కవిత్వ వస్తువులో ఆయా కాలగతులకు అనుగుణంగా వస్తువు మార్పు చెందడం కూడా చూడవచ్చు.

జూకంటి జగన్నాథం తన కవిత్వ సృజనకు సంబంధించి చాలా స్పష్టతతో ఉన్నట్టు ఆయన ముందు మాటల్లోనే తెలుస్తుంది. "బహుశా కాదు ఖచ్చితంగానే అత్యంత జాగరూకతతో వ్యవహరించాను". "కవిత్వంలో విధేయతతో బాధ్యతతో కండ్లలో వత్తులేసుకున్న మెలుకువతో ప్రయోజకత్వంతో ముందుకు అడుగులు వేసాను". "ఒక బాధామయ ప్రపంచాన్ని కవిత్వీకరించాను". (పాతాళ గరిగె ముందుమాట) అని చెప్పుకున్నారు. ఈ కవితా వాక్యాలు మొదటి కవితా సంపుటి ప్రకటించే నాటికి జూకంటికి కవిత్వ సృజన పట్ల ఉన్న సామాజిక బాధ్యతను, అవగాహనను, ప్రయోజనాన్ని, ప్రాపంచికతను చూపిస్తాయి.

**కీలక పదాలు:** వచన కవిత్వము – వస్తువు – సామాజికత – ఉద్యమాలు – ప్రయోజనం

**విషయ వివరణ:**

జూకంటి కవిత్వం 80వ దశకం నాటి విప్లవోద్యమం మొదలుకొని నేడు కొనసాగుతున్న అస్తిత్వ ఉద్యమాల దాకా వ్యాపించింది. వీరి కవిత్వంలో ప్రధానంగా సామాజిక సాహిత్య ఉద్యమాలకు సంబంధించిన అంశాలు ఎక్కువ. అందులో ప్రధానమైనవి విప్లవోద్యమం, ప్రపంచీకరణ, తెలంగాణ ప్రాంతీయోద్యమం, స్త్రీ, దళిత, బహుజన అస్తిత్వ ఉద్యమాలు.

"ప్రజల జీవితాల్లో స్తబ్దత వల్ల రాజీ ధోరణి ఏర్పడింది. సమాజంలో మార్పు ద్వారా ఈ స్తబ్దతను ఛేదించాలి. ఈ మార్పును వ్యతిరేకించే వారితో సంఘర్షణ తప్పనిసరి. పోరాడే శక్తులకు మద్దతు ఇవ్వడంతో పాటు పోరాడే అవసరాన్ని గుర్తింపచేయటం రచయితల బాధ్యత అని గుర్తింప చేయడం లక్ష్యంగా వెలువడేది విప్లవ సాహిత్యం (పుట:1035)[3]. ప్రజలూ సమాజమూ వేరువేరు కాదు. గురజాడ అన్నట్టు 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అనే స్ఫూర్తితో విప్లవ కవిత్వం వెలువడింది. జూకంటి రాసిన తొలికాలపు విప్లవోద్యమ రచనలు ఆనాటి ప్రముఖ పత్రికలైన సృజన, అరుణ తార, ప్రజాసాహితి వంటి పత్రికల్లో అచ్చైనాయి. ఈ కవితలు ఆనాటి భూస్వామ్య పెత్తందారీ వర్గాల అధికారం కేంద్రంగా నడుస్తున్న దోపిడీ సమాజ స్వభావాన్ని బద్దలు కొట్టినాయి.

జూకంటి జగన్నాథం రాసిన "జనవాక్యం" కవిత అరుణతారలో 1981లో అచ్చయింది. ఇది వర్గ శత్రువును సూటిగా ఉద్దేశించి రాసిన కవిత. సమాజంలో ఎప్పుడూ విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ ఉంటుందనేది మార్క్స్ రాసిన 'దాస్ కాపిటల్' బహిర్గతం చేసిన విషయం. ఉన్నత వర్గాలు ఎప్పుడూ నిమ్న వర్గాల శ్రమ దోపిడీ చేసి అంతకంతకూ ఎదిగిపోతూ కింది వర్గాలను అణచివేస్తుంటాయని తెలిపింది. అందువల్ల, దాన్నుండి బయటపడాలంటే పీడిత వర్గంగా ఉన్న శ్రామికులు, కార్మికులు, బానిసలు, ప్రజలు ఏకమై పోరాటం చేసినప్పుడే తమ హక్కులను పొందగలుగుతారని, రక్షించుకోగలుగుతారని మార్క్స్ సిద్ధాంతం. గతించిన చరిత్రను భౌతికవాద దృక్పథంతో పరిశోధించి, ఆర్థిక వ్యవస్థ పునాదిని బట్టి ఉపరితల అంశాలు మారుతాయని విశ్లేషించింది. అందువల్ల విప్లవ కవిత్వంలో 'వాడు' అంటే వర్గ శత్రువు, పీడకుడు, పాలకుడు, భూస్వామి, యజమానికి ప్రతీక. ఈ కవిత అభివ్యక్తి విప్లవాభివ్యక్తిలోని ఆవేశాన్ని, వ్యంగ్యాన్ని, నిలదీతను నింపుకున్నది. జూకంటి చెప్పుకున్నట్టు "ఎనభయవ దశకంలో నా చుట్టూ ఉవ్వెత్తున ఉరుమురిమి పడుతున్న జనసముద్రాలు – ఒక్కచోటా నిలబడనీయని రాజ్యహింస" (పుట:14)[4] నా కవిత్వానికి ప్రేరణలు అన్నమాటలు ఈ కవితలో ప్రతిఫలించాయి.

90 వ దశకంలో భారతదేశంలో ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రపంచీకరణకు పాదులు తీశాయి. ప్రపంచ దేశాలు, ప్రజలు, సంస్కృతి ఒక తాటి మీదికి రావడం ప్రపంచీకరణగా చెప్పుకోవచ్చు. ప్రపంచీకరణ స్వభావాన్ని బట్టి ఆర్థిక సంబంధ విషయాలలో ప్రపంచ మార్కెట్ తో అనుసంధానం కావడం మొదటిది. పెట్టుబడి ద్వారా ప్రపంచ వస్తు సేవలను స్వేచ్ఛగా అంతటికీ తరలించడం రెండవది. తద్వారా ఏర్పడే కొత్త వస్తు, సాంకేతిక వినిమయ సంస్కృతిని విస్తరించడం మూడవది. అయితే, వీటన్నిటి వలన వచ్చే లాభాలు

పెట్టుబడిదారులవి, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మార్పులవల్ల వచ్చే లాభ/నష్ట ఫలితాలు ప్రజలవి అని ప్రపంచీకరణను అర్థం చేసుకోవచ్చు. జూకంటి జగన్నాథం తన కవిత్వంలో బహుశా తెలుగు సాహిత్యంలో ఏ కవీ రాయనంత విస్తృతంగా ప్రపంచీకరణ గురించి రాశాడు. ప్రముఖ విమర్శకులు యం.నారాయణ శర్మ జూకంటి జగన్నాథం గారిని 'ప్రపంచీకరణపై గొంతెత్తిన తొలి కోడి (పుట:19)[5]' అని పిలిచారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక సంఘటనలకు తెలుగు కవులు ప్రతిస్పందించారు. నైజీరియాలో కెన్సారోవివాను ఉరితీయడాన్ని తీవ్రంగా నిరసించారు. 1997లో ప్రజారచయితల సంఘం ఒక సంకలనాన్ని తీసుకువచ్చింది. 2000 సంవత్సరంలో బషీర్బాగ్లో విద్యుత్ చార్జీల వ్యతిరేక నిరసనకారులను ప్రభుత్వం కాల్చి చంపింది. ఈ నేపథ్యంలో 'వికసించిన విద్యుత్ తేజం' కవితా సంకలనం వచ్చింది. ఈ సంఘటనతోనే 'జనకవనం' కవితా సంకలనం కూడా వచ్చింది. స్వయంగా జూకంటి జగన్నాథం, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సంప్రాదకత్వంలో ఒక బలమైన వ్యక్తీకరణగా 2001లో "గ్లోబల్ ఖడ్గం" కవితా సంకలనం తెచ్చారు. స్త్రీ వాదరచయిత్రి కొండేపూడి నిర్మల 'మల్టీనేషనల్ ముద్దు' అనే కవితా సంకలనాన్ని 2001లో ప్రకటించారు.

జూకంటి జగన్నాథం 1987లోనే తెలుగు కవులెవరూ ఇంకా ప్రపంచీకరణ గురించి గొంతెత్తకముందే "సమస్త విలువలు నశిస్తాయి/ పెట్టుబడి అన్ని రంగాలను/ ఇనుప కౌగిలిలోకి/ లాక్కొని బుజ్జగిస్తున్నప్పుడు/ సమస్త విలువలు నశించిపోతాయి/ అప్పటి వరకూ సమాజం ఉపరితలంపై చలామణి అవుతున్న/ అన్ని విలువలూ కలుషితమైపోతాయి"[6] (పుట:1.17) అని మొదటి కవితా సంపుటి "పాతాళ గరిగె" లో ప్రకటించారు. భారతదేశం 1990వ దశకం ఆరంభంలోనే నూతన ఆర్థిక సంస్కరణలైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను ప్రవేశపెట్టింది. అయితే, జూకంటి ఆనాటి సమాజంలో సంభవించబోయే పరిణామాలను దాని వెనుక ఉండే దోపిడీని ప్రతిబింబిస్తూ 1992 ఫిబ్రవరి 10న "డేగ" అనే కవిత రాశారు. 'డేగ'అనేది పెట్టుబడిదారీ వ్యవస్థకు, ప్రపంచీకరణకు ఆధునిక సాంకేతిక క్రూరత్వానికి ప్రతీక. ఆకాశంలో డేగ ఎరకోసం చక్కర్లు కొట్టినట్టు, ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా సామాన్యుల శ్రమను, పొదుపును కొల్లగొట్టడానికి నెత్తి మీద కాచుకుని తిరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "డంకెల్? ఐ.ఎం.ఎఫ్?? అగ్రరాజ్యాలు???/నీ కంట్లో నేను వేలు పెడుతా/నీవు నా నోట్లో చెయ్యి పెట్టు బాపతిగాళ్ళే (ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 1.116) అంటాడు. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అని పుస్తకానికి పేరు పెట్టడంలోనే ప్రపంచీకరణలో భాగమైన ప్రైవేటీకరణను తెరమీదికి తీస్తుంది.

ప్రపంచీకరణ తర్వాత జూకంటి కవిత్వంలో కనిపించే మరో సామాజిక ఉద్యమం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. అగ్ర దేశాల సామ్రాజ్యవాద వలస దోపిడీని వ్యతిరేకించింది ప్రపంచీకరణ వ్యతిరేకత అయితే. తెలంగాణ ఉద్యమం అంతర్గత వలస దోపిడీని వ్యతిరేకించింది. రెండిటిలోనూ బలయ్యేది సమాజంలోని పేదలే. అందుకే "తెలంగాణా పదాన్ని/ వడిసెలలో పెట్టి/ పంటను సీరుకతింటున్న/ ఆధిపత్య పక్షుల్ని గెదిమి గెదిమి కొడుత/ జీవునానికి జీవునమైన/ నా భూమిని బుద్ధితీర/ గుండెల్ల అదిమదిమి పడుత" ('బేమాన్' కవిత 2వ సమగ్ర సంపుటి పుట: 396). అని ఆధిపత్య శక్తుల మీద పోరాటాన్ని ప్రకటించాడు."ఇప్పుడు తెలంగాణలోని/ ప్రతి ఇంట్లో ఒక శిబిరం ఒక కరపత్రం/ ప్రతి పల్లె ఒక నిలువెత్తు నినాదం/ ప్రతి మనిషీ ఒక సంగ్రామ స్మారక స్థూపం (ఆత్మ గౌరవ శిబిరం 3.74) అని నాటి ఉద్యమ స్వరూపాన్ని రూపుకట్టించారు.

అంతేకాకుండా, తెలంగాణ సంస్కృతి పట్ల మమకారాన్ని, విధ్వంసమవుతున్న మానవ విలువల్ని, దుర్భరమవుతున్న జీవితాల్ని, ప్రాంతీయ నుడికారంతో కవిత్వంగా మలిచారు. "కూలీ గిట్టినట్టే వున్నది/ అంతా క్యాలి తప్పినట్లున్నది/ పని ఊడగొట్టి ఉపాధి హామి/ రైతు కూలీగా మారిండు/ కూలీ ఖాళీ అయ్యిండు/ నడిచే కాళ్లల్ల కట్టె పెట్టినట్లున్నది/ చేసే రెక్కల్ని ఇరగ్గొట్టినట్లున్నది (ఫికరు కవిత, పుట:34) అని రైతు కూలీ ఉపాధి హామీ కూలీగా మారిన సందర్భాన్ని కవిత్వం చేశారు. "ఎవరి గొంతులకు వారే/ వంతులవారి/ ఉరిత్రాళ్లు బిగించుకుంటున్న కాలం" (వాస్కోడిగామా. కామ్ పుట:47) గురించి ఆర్ద్రంగా రాశారు.

స్త్రీ వాద, దళిత వాద, మైనారిటీ బీసీ వాదాలకు సంఘీభావంగా అనేక కవితలు రాశారు జూకంటి. "కలలు పచ్చిపచ్చిగా తగులుతుంటే/ కన్నీళ్ళు ఆవిరై పోతున్నాయి/ కన్యగా, భార్యగా, తల్లిగా/ చూపుల 'తేజాబ్' నుంచి/ దైన్యంగా హీనాతిహీనంగా/ సిగ్గుగా ఘోరాతిఘోరంగా/ కనబడని కఠిన సంకెళ్ళ మధ్య/ ప్రతిసారీ నన్ను నేనుగా మనసును చంపుకు/ పతివ్రతగా ధృవీకరించుకోవాలి (బందీ పుట;121) అని స్త్రీ పురుష స్వామ్యంలో బందీ అయిన వైనాలను రాశారు. "కాకుల్లా పొడిచి పొడిచి/ మరణం శివా తొవ్వ లేకుండా చేసి/

సరిబేసి చర్చ భేష్/ చచ్చినోడూ దళితుడా వెనుకబడినోడా/ చావును రకరకాలుగా రకం చేసుకునుడు" (అశోకము పుట:49) అని రోహిత్ వేముల ఆత్మహత్య సందర్భంలో కుల పట్టింపులు గురించి నిలదీశాడు. "సర్వాయి పాపన్న వారసుడా!/ త్వరత్వరగా స్వరం పెంచు/ అగ్రవర్ణ రోగానికి/ సరియైన బహుజన మందును పంచు" (ముసుగు పుట:201) అని బహుజన స్వరాల చైతన్యావశ్యకతను గుర్తు చేశారు. జూకంటి జగన్నాథం కవిత్వమంతా సామాజిక అంశాల చుట్టే తిరుగుతూ సమాజాన్ని జాగృతం చేస్తుంది.

సుప్రసిద్ధ సాహితీ విమర్శకుడు కె.వి.ఆర్ కవిత్వ ప్రయోజనాన్ని ఇలా చెప్పారు. "వాస్తవలోకంలో ఇంకా అలివిగాని విషయాలను చైతన్య పరిధిలోకి తీసుకొచ్చి, అసాధ్యాలను గూడా సాధ్యాలే అనిపించి, తద్వారా మరింత తీవ్రమైన కార్యాచరణకు తగిన ప్రోత్సాహాన్ని కలిగించడమే అసలైన కవిత్వ ధర్మం. అదే కవిత్వ ప్రయోజనం"(పుట:125)[7]. ప్రజల చైతన్య పరిధిని విస్తరింపజేయడమే పరమ ప్రయోజనంగా జూకంటి జగన్నాథం తన కవిత్వాన్ని మలిచారు. ఎప్పుడైనా, ఎక్కడైనా సమాజం ప్రశ్నించడాన్ని మరచిపోతే, నిస్సత్తువలోకి జారిపోతే దాని నుండి మరలించడానికి కాచుకుని ఉన్నారు జూకంటి. "నా సాహిత్య తాత్త్వికతగానీ సిద్ధాంతం గానీ లెఫ్ట్ విరసం, తెలంగాణ పోరాట నేపథ్యం నుండి వచ్చినవి. ప్రజా సంక్షోభాలను, వేదనలను, ఎన్ కౌంటర్ లను, ఫాక్ట్ ఫైండింగ్ కమిటీలలో తిరిగి చూసినటువంటి వాడిని. తెలంగాణ సమాజం విషాదకరం. తెలంగాణలో నూటికి ఎనభై శాతం మంది ప్రజలు ఎప్పటికీ దెబ్బతింటూనే ఉన్నారిక్కడ. నిజాం కాలం ముందు నుంచి కూడా ఇదే జరుగుతుంది. ప్రజలు అణచివేయబడుతున్నారు, మోసం చేయబడుతున్నారు. ప్రజాస్వామ్యంలోనూ అదే జరుగుతోంది. నా రాజకీయ తాత్త్వికత ప్రధానంగా నేను లెఫ్ట్ నుండి వచ్చి, క్రమంగా నేను అంబేద్కర్, పూలేలను చదివిన తర్వాత నూటికి ఎనభై శాతం మంది ప్రజల గురించే రాయాలనే నమ్ముతున్నా. అంతిమంగా ప్రజల వేదనలే నా తాత్త్విక నేపథ్యం"[8] అని స్వయంగా ప్రకటించారు.

**ముగింపు:**

వచన కవిత్వ ప్రక్రియ ఆవిర్భావం నుండే సామాజిక చైతన్యమే ప్రయోజనంగా రూపుదాల్చింది. ఆలోచనా పరులు, బుద్ధి జీవులు, సామాజిక ఉద్యమ కారులను మేల్కొల్పింది. కవిత్వ సృజన కొన్ని వర్గాలకే పరిమితంగా ఉన్న స్థితిని మార్చి ఎంతోమంది మధ్య తరగతి చదువరులను కవులుగా తయారు చేసింది. కవిత్వ ప్రయోజనాలైన ఆనంద ఉపదేశాల స్థానంలో సామాజిక చైతన్యమే ప్రయోజనం అనే స్థితికి తీసుకువెళ్లింది. పీడితుల పక్షాన గొంతుకగా నిలిచి అస్తిత్వ ఆకాంక్షలకు వాహిక అయింది.

ఈ కవిత్వ ప్రక్రియను అందుకున్న జూకంటి జగన్నాథం ఆధునిక తెలుగు కవులలో అగ్రశ్రేణి కవిగా నిలిచారు. ఉత్తర తెలంగాణలోని మారుమూల ప్రాంతమైన సిరిసిల్లా నుండి ప్రపంచ రాజకీయాల గమనాన్ని, భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక మలుపులను, తెలుగు, తెలంగాణ ప్రాంత ప్రజా జీవన చిత్రణను వచన కవిత్వ ప్రక్రియ ద్వారా అక్షరీకరించారు. జూకంటి జగన్నాథం కవిత్వంలో తెలంగాణ నుండి మొదలుకొని ప్రపంచం దాకా విస్తరించిన ఆలోచన పరచుకొని ఉంటుంది. ప్రజల దృక్పథంనుండి రాసిన వలపోత, తలపోత, అధ్యయన సారం అడుగడుగునా దర్శనమిస్తుంది. ఆధునిక యంత్ర నాగరికత, అసమతుల్య అభివృద్ధి గ్రామాల్లో తెచ్చిన భౌతిక, మానసిక క్షేత్రాల్లో తెచ్చిన మార్పులు జూకంటి కవిత్వంలో ఉన్నాయి. ప్రపంచీకరణ ప్రభావాలు, రాజ్య స్వభావాలు, మానవ స్వభావాలు జూకంటి కవిత్వ చూపుతో స్పష్టంగా కనిపిస్తాయి. నేతన్నల ఆత్మహత్యలు, లుప్తమవుతున్న మానవ సంబంధాలు, వలస బతుకుల గోసలు, విప్లవోద్యమకారులపై హింసలువంటి అనేక సున్నితాంశాలను జూకంటి కవిత్వంలో చూడవచ్చు. ఈ కాలపు ఉద్యమాలను చైతన్య పరచడానికి నిరంతరం విరామమెరుగని కలం సైనికునిలా కవిత్వపు కన్నుతో కాపలా కాస్తున్నారు. ఇప్పటి వరకు 18 వచన కవితా సంపుటాల ద్వారా ప్రజల భాషను, సంస్కృతిని, చైతన్యాన్ని దీప్తిమంతం చేశారు.

అడుగడుగునా వీరి కవిత్వంలో సామాజిక చేతన నిబిడీకృతమై ఉన్నది. సూటిగానూ, వ్యంగ్యంగానూ, నిక్కచ్చిగానూ నిలదీసి రాయడంలోనూ ఈ కవి కవిత్వం సఫలీకృతమైంది. తాను ప్రయాణించిన కాలం పొడుగూతా మానవ జీవితంలో జరుగుతున్న పరిణామాలను, దానికి కారణమవుతున్న రాజకీయాల వికృత రూపాలను ఎప్పటికప్పుడు జూకంటి ఎత్తి చూపారు. కవితలకు, పుస్తకాలకు శీర్షికలకు ఆధునికానంతర డిక్షన్ వాడడంలోనూ ముందున్నారు. ఈ కాలపు కవిత్వంపై తనదైన ముద్రను వేసింది వీరి కవిత్వం. జూకంటి కవిత్వం సామాజిక చిత్తరువు అనడంలో ఏ సందేహమూ లేదు.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# జాషువా కవిత్వంలో సామాజిక విప్లవం

– కె. ఎం. సౌందర్యవతి

తెలుగు అధ్యాపకురాలు

ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల, రాజమహేంద్రవరం

సాహిత్యం సమాజ జీవితానికి ప్రతిబింబం. సమాజంలోని సంతోషాలు, బాధలు, సంఘర్షణలు, అన్యాయాలు, ఆశలు, ఆకాంక్షలు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. అయితే గొప్ప సాహిత్యం కేవలం సమాజాన్ని ప్రతిబింబించడంతో ఆగిపోదు. సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించి, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి, మార్పును ఆకాంక్షిస్తుంది. ఈ కోణంలో తెలుగు ఆధునిక సాహిత్యంలో గుర్రం జాషువా కవిత్వానికి ప్రత్యేకమైన స్థానం ఉంది.

జాషువా కవిత్వం ఒకవైపు పద్య సౌందర్యాన్ని, భావగాంభీర్యాన్ని కలిగి ఉండగా, మరోవైపు సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. కులం పేరుతో మనుషుల మధ్య ఏర్పడిన గోడలను, అంటరానితనాన్ని, పేదరికాన్ని, మతపరమైన వివక్షను ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఆయన కవిత్వంలో బాధ ఉంది; ఆ బాధలోంచి పుట్టిన ఆవేదన ఉంది; ఆ ఆవేదనలోంచి పుట్టిన నిరసన ఉంది; ఆ నిరసన వెనుక సమానత్వ సమాజంపై ఆశ ఉంది.

అందువల్ల జాషువా కవిత్వంలోని సామాజిక విప్లవాన్ని కేవలం నిరసనగా కాకుండా **మానవ విలువల పునర్నిర్మాణ ప్రయత్నంగా** చూడాలి.

**జాషువా కవిత్వంలో కులవివక్ష వ్యతిరేకత:** జాషువా కవిత్వంలోని ప్రధానమైన సామాజిక అంశం కులవివక్ష వ్యతిరేకత. జన్మ ఆధారంగా ఒక మనిషిని మరొక మనిషికంటే తక్కువగా చూడటాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు.

మనిషి జన్మించిన కులం అతని గుణానికి ప్రమాణం కాదని, అతని మానవత్వమే అతని అసలు విలువ అని జాషువా భావించారు. కులవ్యవస్థ వల్ల అణగారిన మనిషి అనుభవించే బాధను ఆయన తన కవిత్వంలో హృదయవిదారకంగా చిత్రించారు.

ఇక్కడ జాషువా ప్రత్యేకత ఏమిటంటే, కులవివక్షను కేవలం ఒక సామాజిక సమస్యగా మాత్రమే కాకుండా **మానవత్వానికి వ్యతిరేకమైన సమస్యగా** చూశారు.

**'గబ్బిలం' – సామాజిక విప్లవానికి ప్రతీక:** జాషువా సామాజిక విప్లవ దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి 'గబ్బిలం' అత్యంత ముఖ్యమైన రచన.

కాళిదాసు 'మేఘదూతం'లో మేఘం సందేశవాహకుడిగా ఉంటుంది. జాషువా ఈ సంప్రదాయాన్ని స్వీకరించి, ఒక అణగారిన మనిషి తన సందేశాన్ని దేవునికి చేరవేయడానికి గబ్బిలాన్ని దూతగా ఎంచుకున్న సందర్భాన్ని సృష్టించారు.

ఈ రచనలోని పరిస్థితి ఒక తీవ్రమైన సామాజిక వైరుధ్యాన్ని మన ముందుంచుతుంది. దేవాలయంలోకి ప్రవేశించే హక్కు మనిషికి లేదు; కానీ గబ్బిలం మాత్రం దేవాలయంలోకి ప్రవేశించగలదు. ఈ విరుద్ధ పరిస్థితి ద్వారా జాషువా కులవ్యవస్థలోని అసంబద్ధతను ఎత్తిచూపారు.

ఇక్కడ గబ్బిలం ఒక సాధారణ జీవి మాత్రమే కాదు. అది సమాజ అంచులకు నెట్టివేయబడిన మనిషికి ప్రతీకగా కనిపిస్తుంది.

**దేవాలయ ప్రవేశం – మానవ హక్కు:** 'గబ్బిలం'లో దేవాలయ ప్రవేశ సమస్యను ప్రస్తావించడం ద్వారా జాషువా ఒక విస్తృతమైన మానవ హక్కుల సమస్యను ముందుకు తెచ్చారు.

దేవాలయం అనేది భక్తికి, ఆధ్యాత్మికతకు, సమానత్వానికి ప్రతీకగా ఉండాలి. కానీ కులం ఆధారంగా అక్కడికి ప్రవేశించే హక్కును నిరాకరించడం ద్వారా సమాజం తన మానవతా విలువలను కోల్పోతుందని జాషువా సూచించారు.

**జాషువా కవిత్వంలో దళిత చైతన్యం:** తెలుగు సాహిత్యంలో దళిత జీవితానుభవాలను బలమైన స్వరంతో వ్యక్తం చేసిన ప్రముఖ కవిగా జాషువాను అధ్యయనం చేయవచ్చు.

ఆయన రచనల్లో అణగారిన వ్యక్తి కేవలం జాలికి పాత్రుడు కాదు. అతను తన గౌరవాన్ని కోరుకునే మనిషి. తన హక్కులను ప్రశ్నించే వ్యక్తి. తనపై జరిగే వివక్షను నిరాకరించే వ్యక్తి.

**ఇదే జాషువా కవిత్వంలోని చైతన్య స్వభావం**.: జాషువా కవిత్వంలోని దళిత చైతన్యం క్రమంగా విశ్వమానవతగా విస్తరిస్తుంది. అంటే ఒక నిర్దిష్ట వర్గం బాధతో ప్రారంభమైన ఆయన కవిత్వం చివరకు **అన్ని మనుషుల సమానత్వం** అనే విశాలమైన భావనకు చేరుతుంది.

**పేదరికం – సామాజిక విప్లవంలోని మరో కోణం:** కులవివక్షతో పాటు పేదరికం కూడా జాషువా కవిత్వంలో కనిపించే ముఖ్యమైన అంశం.

పేదరికం మనిషి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఆయన స్వయంగా అనుభవించారు. అందువల్ల పేద ప్రజల బాధల పట్ల ఆయనకు ప్రత్యేకమైన అనుభూతి ఉంది.

ఆయన కవిత్వంలో పేదరికం కేవలం ఆర్థిక సమస్యగా కనిపించదు. అది మనిషి గౌరవాన్ని, అవకాశాలను, సామాజిక స్థితిని ప్రభావితం చేసే సమస్యగా కనిపిస్తుంది.

కాబట్టి జాషువా కవిత్వంలోని పేదరిక చిత్రణ కూడా సామాజిక మార్పు అవసరాన్ని సూచిస్తుంది.

**'ఫిరదౌసి'లో సామాజిక చైతన్యం:** 'ఫిరదౌసి' జాషువా ప్రతిభకు ప్రతీకగా నిలిచిన ముఖ్యమైన ఖండకావ్యం. ఇందులో కవి, కళాకారుడు, అధికార వ్యవస్థ, ప్రతిభకు లభించే గుర్తింపు వంటి అంశాలు ప్రాధాన్యం పొందుతాయి.

ఫిరదౌసి అనే మహాకవి జీవితాన్ని ఆధారంగా చేసుకున్నప్పటికీ, జాషువా దాని ద్వారా విశాలమైన మానవీయ ప్రశ్నలను ముందుకు తెచ్చారు.

కళాకారుడి ప్రతిభకు సామాజిక స్థానం, అధికార సంబంధాలు, వ్యక్తి గౌరవం వంటి అంశాలు ఎలా ప్రభావం చూపుతాయో ఈ రచన ద్వారా పరిశీలించవచ్చు.

దీనివల్ల జాషువా సామాజిక విప్లవం కేవలం కులవివక్షకు పరిమితం కాలేదని తెలుస్తుంది.

**'కాందిశీకుడు'లో మానవతా దృక్పథం:** 'కాందిశీకుడు'లో యుద్ధం, హింస, మానవ బాధ వంటి అంశాల ద్వారా మానవ జీవితం యొక్క విలువను జాషువా ప్రతిపాదించారు.

యుద్ధాలు, రాజకీయ సంఘర్షణలు, సామాజిక విభేదాలు చివరికి సాధారణ మనిషి జీవితాన్నే దెబ్బతీస్తాయి. అందువల్ల మానవ జీవితం ఏ రాజకీయ లేదా సామాజిక ప్రయోజనం కంటే విలువైనదనే మానవతా దృష్టి ఇందులో కనిపిస్తుంది.

జాషువా దృష్టిలో నిజమైన అభివృద్ధి అంటే కేవలం భౌతిక ప్రగతి కాదు; **మనిషి పట్ల మనిషికి గౌరవం పెరగడం.**

**'క్రీస్తు చరిత్ర'లో విశ్వమానవత:** జాషువా కవిత్వంలో మతసామరస్యం, మానవతావాదం ప్రధానమైన అంశాలు. 'క్రీస్తు చరిత్ర'లో క్రీస్తు జీవితంలోని ప్రేమ, కరుణ, త్యాగం, మానవ సేవ వంటి విలువలను కవి ముందుకు తెచ్చారు.

జాషువా ఒక మతాన్ని మరొక మతానికి వ్యతిరేకంగా నిలబెట్టలేదు. వివిధ మతాలలోని మానవీయ విలువలను స్వీకరించారు.

అందువల్ల ఆయన కవిత్వంలో **మతం కంటే మానవత్వం గొప్పది** అనే భావన కనిపిస్తుంది.

**జాషువా కవిత్వంలో మానవతావాదం:** జాషువా సామాజిక విప్లవానికి ప్రాథమికమైన పునాది మానవతావాదం.

ఆయన కవిత్వంలో మనిషి గౌరవమే కేంద్రస్థానం. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి వంటి బాహ్య గుర్తింపుల కంటే మానవత్వానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు.

ఆయన కోరుకున్న సమాజంలో ప్రతి మనిషికి సమాన గౌరవం ఉండాలి. ఎవరూ అంటరానివారిగా ఉండకూడదు. ఎవరి జన్మ కూడా వారి హక్కులను నిర్ణయించకూడదు.

ఈ మానవతా దృక్పథమే ఆయన కవిత్వాన్ని సార్వకాలికంగా నిలబెట్టింది.

**'కొత్తలోకం' – భవిష్యత్ సమాజంపై ఆశయం:** జాషువా కేవలం ప్రస్తుత సమాజంలోని లోపాలను విమర్శించలేదు. సమాజం ఎలా ఉండాలో కూడా ఊహించారు.

'కొత్తలోకం' అనే భావనలో సమానత్వం, మానవ గౌరవం, సామాజిక న్యాయం ఆధారంగా ఒక కొత్త సమాజాన్ని నిర్మించాలనే ఆశయం కనిపిస్తుంది.

ఆ కొత్త సమాజంలో కులవివక్ష ఉండకూడదు. అంటరానితనం ఉండకూడదు. మతం పేరుతో మనుషులు విడిపోకూడదు. పేదరికం మనిషి గౌరవాన్ని హరించకూడదు.

అందువల్ల జాషువా కవిత్వం కేవలం **విధ్వంసక నిరసన కాదు; నిర్మాణాత్మక సామాజిక దృష్టి కూడా.**

**జాషువా భాష – సామాజిక చైతన్యానికి సాధనం:** జాషువా కవిత్వంలోని సామాజిక విప్లవాన్ని ప్రజలకు చేరువ చేసిన ప్రధాన అంశాల్లో ఆయన భాష ఒకటి.

ఆయన పద్యాల్లో ఛందస్సు, అలంకారాలు, పదసౌందర్యం ఉన్నప్పటికీ భావవ్యక్తీకరణలో స్పష్టత కనిపిస్తుంది. సామాన్య పాఠకుడిని దృష్టిలో ఉంచుకొని సామాజిక సమస్యలను వ్యక్తం చేశారు.

ఆయన భాషలో ఆవేదన ఉన్నప్పుడు పాఠకుడి హృదయాన్ని తాకుతుంది; వ్యంగ్యం ఉన్నప్పుడు ఆలోచింపజేస్తుంది; నిరసన ఉన్నప్పుడు ప్రశ్నించడానికి ప్రేరేపిస్తుంది.

అందువల్ల జాషువా భాష కేవలం కవితా భాష కాదు; **చైతన్యాన్ని కలిగించే భాష.**

**వ్యంగ్యం – సామాజిక నిరసన:** జాషువా సామాజిక దురాచారాలను విమర్శించడానికి వ్యంగ్యాన్ని సమర్థంగా ఉపయోగించారు.

సమాజంలోని వైరుధ్యాలను పాఠకుడి ముందుంచి, వాటి అసంబద్ధతను అతడే గుర్తించేలా చేయడం ఆయన రచనా విధానంలోని ప్రత్యేకత.

'గబ్బిలం'లో మనిషికి లేని దేవాలయ ప్రవేశం గబ్బిలానికి ఉండటం ఒక గాఢమైన సామాజిక వ్యంగ్యంగా కనిపిస్తుంది.

ఈ వ్యంగ్యం వెనుక తీవ్రమైన సామాజిక వేదన ఉంది. అందువల్ల జాషువా వ్యంగ్యం నవ్వించడానికి కాదు; ఆలోచింపజేయడానికి.

**జాషువా కవిత్వంలో సామాజిక సమానత్వం:** జాషువా కవిత్వంలోని ప్రధాన లక్ష్యం సమానత్వం.

ఆయన దృష్టిలో సమాజంలో ఎవరికీ జన్మ ఆధారంగా ఉన్నత స్థానం, మరొకరికి నీచ స్థానం ఉండకూడదు. ప్రతి వ్యక్తికి గౌరవం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు ఉండాలి. సామాజిక సమానత్వం అంటే కేవలం చట్టపరమైన సమానత్వం కాదు. మనుషుల మనస్సుల్లోని వివక్ష తొలగిపోవడం కూడా అవసరం. అందుకే జాషువా కవిత్వంలోని విప్లవం ముందుగా మనిషి ఆలోచనలో రావాల్సిన విప్లవం.

**వ్యక్తిగత అనుభవం నుంచి సామాజిక ఉద్యమం వరకు:** జాషువా కవిత్వంలో వ్యక్తిగత అనుభవం సామూహిక అనుభవంవి గా మారుతుంది. ఆయన ఎదుర్కొన్న కులవివక్ష ఆయన వ్యక్తిగత బాధ. కానీ ఆ బాధను ఆయన తనకే పరిమితం చేయలేదు. అదే బాధను సమాజంలోని అణగారిన వర్గాల బాధగా మలిచారు.

అందువల్ల ఆయన కవిత్వంలో వ్యక్తి ఒక ప్రతీకగా మారుతాడు. అతని బాధ ఒక వర్గం బాధగా మారుతుంది. ఆ వర్గం బాధ సమాజ సమస్యగా మారుతుంది. చివరకు అది మానవ సమానత్వానికి సంబంధించిన ప్రశ్నగా మారుతుంది.

ఈ పరిణామమే జాషువా కవిత్వానికి సామాజిక విప్లవాత్మక శక్తిని అందించింది.

జాషువా కవిత్వంలోని విప్లవం హింసకు సంబంధించినది కాదు. అది **భావాల విప్లవం, ఆలోచనల విప్లవం, మానవ విలువల విప్లవం.** కులం, మతం, పేదరికం, వివక్ష వంటి గోడలను తొలగించి, మానవత్వాన్ని కేంద్రంగా చేసుకున్న సమాజాన్ని నిర్మించాలనే ఆకాంక్ష అందులో ఉంది.

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అందువల్ల జాషువా కవిత్వాన్ని కేవలం ఒక వర్గం బాధకు ప్రతినిధిగా కాకుండా, **సామాజిక న్యాయం, సమానత్వం, మానవ గౌరవం, విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసం సాగిన సాహిత్య ఉద్యమంగా** అధ్యయనం చేయవచ్చు.

**జాషువా కవిత్వం మనిషి కోసం పలికిన కవిత్వం; మానవత్వం కోసం సాగించిన నిరంతర సామాజిక సంభాషణ.**

**ఆధార గ్రంథాలు**

జాషువా కవిత్వంలో **సామాజిక విప్లవం** అనే పరిశోధనా పత్రానికి చివర ఈ విధంగా ఆధార గ్రంథాలను ఇవ్వవచ్చు:


1. **గుర్రం జాషువా –** *గబ్బిలం*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. **గుర్రం జాషువా –** *ఫిరదౌసి*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. **గుర్రం జాషువా –** *కాందిశీకుడు*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. **గుర్రం జాషువా –** *క్రీస్తు చరిత్ర*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
5. **గుర్రం జాషువా –** *ముంతాజ్ మహల్*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
6. **గుర్రం జాషువా –** *బాపూజీ*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
7. **గుర్రం జాషువా –** కొత్తలోకం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
8. **గుర్రం జాషువా –** ముసాఫరులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
9. **దివాకర్ల వెంకటావధాని –** *తెలుగు సాహిత్య చరిత్ర*, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
10. **ఆరుద్ర –** *సమగ్రాంధ్ర సాహిత్యం*, తెలుగు సాహిత్య చరిత్రకు సంబంధించిన సంపుటాలు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# బలివాడ కాంతారావు కథలలో సామాజిక చిత్రణ

– డా. అనిత మార్గరెట్ నేలటూరి
ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
ఎస్.ఆర్.ఆర్&సి.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అ)
విజయవాడ

**ఉపోద్ఘాతం:**

తెలుగు సాహిత్య ప్రక్రియలలో విశిష్టమైనదీ, ఆధునికతను సంతరించుకున్నదీ కథాసాహిత్యం అనిచెప్పవచ్చు. కథాసాహిత్యం సుమారు వందసంవత్సరాలుగా తెలుగు పాఠకుల,సాహిత్యాభిమానుల హృదయాలలో స్థానం సంపాదించుకొని తెలుగు భాష స్థాయిని గౌరవప్రదమైనరీతిలో నిలబెట్టింది. ఆధునిక కాలంలో కథ కేవలం వినోద సాధనంగా కాక, సమాజాన్ని ప్రశ్నించి చైతన్యాన్ని రగిలించే ఒక శక్తివంతమైన ఆయుధమయ్యింది. సామాజిక అసమానతలు, అణచివేత, పేదరికం, కుల వ్యవస్థ, లింగ వివక్ష, మానవ సంబంధాల పతనం, రాజకీయ మోసాలు, వంటి అనేక సమస్యలు కథాసాహిత్యంలో స్పష్టంగా కనిపించి ఆలోచింపజేస్తాయి. ఆధునిక కథలు సమాజంలో నిశ్శబ్దంగా కొనసాగుతున్న అన్యాయాలను వెలికితీస్తూ పాఠకులలో ఆలోచనలు రేకెత్తించి, ప్రశ్నించే ధోరణి వైపు నడిపిస్తాయి. కథల ద్వారా రచయితలు తమ కాలపు సత్యాన్ని, నీతిని వెల్లడిచేసి సమాజ మార్పుకు, సంక్షేమానికి దోహదపడే భావజాలాన్ని నిర్మిస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు.

తెలుగు కథా సాహిత్యంలో పాఠకుల మనస్సును హత్తుకొనేరీతిగా, తనదైన శైలిలో కథలను సృష్టించి, రాణించి నిలిచిన చిరస్మరణీయులలో ఒక రచయిత బలివాడ కాంతారావు ముఖ్యులు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన బలివాడ రచనలు మానవ హృదయాలను స్పర్శించే రీతిగా కొనసాగుతాయి. మానవీయ విలువలు, సున్నితత్వము, ఆర్ద్రత అడుగడుగునా ఎదురవుతాయి. కథాశిల్పంలో అత్యంత విలువైన గుణం నిరాడంబరత, సామాన్య ప్రజల జీవనశైలి కనిపిస్తుంది. కథలో వెల్లడి చేయనక్కరలేని అంశాలను పాఠకుల ఆలోచనలకు వదిలివేస్తారు. వెల్లడి చేసిన విషయాలకు సంభావ్యత ఔచిత్యం సిద్ధింపజేసే రీతిలో కొనసాగుతాయి.

బలివాడ కాంతారావు శ్రీకాకుళం జిల్లాలోని మడపాం అనే గ్రామంలో జూలై 3, 1927 లో జన్మించారు. భారత నౌకాదళ ఉద్యోగిగా పనిచేశారు. 38 నవలలు, 400 పైగా కథలు రాసి ప్రసిద్ధులయ్యారు. 'పుణ్యభూమి' నవలకు 1972 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1986 లో 'వంశధార' నవలకు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించాయి. 1988 లో గోపీచంద్ అవార్డు,1996 లో మద్రాస్ కళాసాగర్ వారి విశిష్ట పురస్కారం, రా.వి.శాస్త్రి స్మారక పురస్కారం, 1993 లో అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం అందుకున్నారు. 1998 లో 'బలివాడ కాంతారావు కథ'లకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది.

బలివాడ రాసిన కథల్లో అనేకం ఉత్తరాంధ్ర జనజీవన విధానాన్ని చిత్రిస్తూ సాగిన కథలు. ఏ దశలో కూడా ఆయన ప్రమాణాలపై రాజీపడలేదు. ఆయనలోని సహజ గుణాలైన నిజాయితీ, నిక్కచ్చితనం, కరుణ, జాలి, ఆయన రచనలలో కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన కథలన్నీ చదువు ఆగు, ఆలోచించు సాగు అనే రీతిగా కొనసాగుతాయి. మిత్ర సమ్మితంగా, ఆత్మీయంగా పాఠకులను స్వాగతిస్తాయి. వారి సంస్కారోన్నతికి దోహదం చేస్తాయి. ఉద్యోగ రీత్యా దేశంలోని అనేక ప్రదేశాలలో పనిచేయటం వల్ల ఆ ప్రాంతాలలోని విభిన్న సంస్కృతులు అధ్యయనం చేయటం జరిగింది. బెంగాలీ, ఒరియా వంటి భాషలలో కూడా ప్రవేశం లభించింది. ఆయా ప్రాంతాల ప్రజలతో సంబంధ బాంధవ్యాలు ముఖ్యంగా గిరిజనుల జీవితాలు అధ్యయనం చేయటం జరిగింది. ఈ అనుభవాలు, జ్ఞానం ఆయనలోని కాల్పనికతను సుసంపన్నం చేశాయి.

బలివాడ రాసిన నాలుగు వందలకు పైగావున్న కథలలో పద్నాలుగు కథలను కథాస్రవంతి శీర్షికన అభ్యుదయ రచయితల సంఘం వారు పునర్ముద్రించారు. ఈ కథలన్నీ ఆలోచింపచేసేవిగా, ఆసక్తి కొల్పేవిగా వుండే నిరుపేద, మధ్యతరగతి జీవితాలను స్పృశించే కథలు. సమాజంలో ఎదురయ్యే అనేక వాస్తవిక సంఘటనలను రచయిత సునిశిత దృష్టితో పరిశీలించి కథాశిల్పాలుగా మలిచారు. రచయిత ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాలలో నివశించడం వల్ల, ఆయా ప్రాంతాల పేర్లు, ఊర్లు, అక్కడి సంస్కృతులు కథలలో కనిపిస్తాయి. ఈ శీర్షిక లోని పద్నాలుగు కథల పేర్లు శిశు విక్రయం, వరద వెల్లువ, భేడాఘాట్ ముసలి, ముంగిస కథ, బులెమ్మ బస్సు, నైజరు తేనె, ఓట్ల సంబరం, అశాంతి, వెలగుతున్నవీరుడు, అద్దం చెప్పిన కథ, బతుకు సంద్రం, మంటలు, అంతులేని శోకం, చక్రతీర్థ అనే కథలు ఉన్నాయి.

బలివాడ కథలు మనసుపై ముద్ర వేసే కథలు. కథావస్తువు ప్రేరణ, ఆర్ద్రత కలిగించేరీతిగా చక్కటి వర్ణనలతో ఆహ్లాదాన్నిస్తుంది. ఇలాంటి వాటిలో 'ముంగిస కథ' ఒకటి. ఈ కథలో ముంగిసను సైతం మానవతావాదంతో ముడివేయగల కథకుడిగా ఉన్నతమైన స్థితిలో కనిపిస్తాడు రచయిత. మనిషికుండే స్వార్థం, క్రూరత్వం ముందు ఉపకారం చేసే జీవి బలవ్వడం ఈ కథలో చూడవచ్చు. డాక్టరు దంపతులు ముంగిసను పెంచుకుంటారు. పిల్లలు వాళ్ళ భవిష్యత్తుకై వెళ్తే ఒంటరైన దంపతులు తమకు తోడుగా ముంగిసను పెంచుకోవడం, ఆనందంగా గడపడం చూస్తే, మనుష్యులకు పెంపుడు జంతువులకు మధ్యగల అనుబంధం మాటలకందనిదిగా కనిపిస్తుంది. పక్కింటి భైరవయ్య తన కోళ్ళు చావడానికి కారణం ఈ ముంగిసే అనుకొని భ్రమపడి దాన్ని చంపేయడం, అది అమాయకంగా నేనే పాపం చేయలేదన్నట్లుగా చూసి చనిపోవటం, చివరకు తప్పు జరిగింది వేరే ముంగిస వలన అనుకొని భైరవయ్య హతాసుడవ్వటం చూస్తే మనిషిలోని కర్కశత్వం, క్రూరత్వం, తొందరపాటు నిర్ణయం అనర్థానికి దారితీస్తుందన్న విషయాన్ని ప్రస్ఫుటం చేసింది. పెంపుడు జంతువులు చూపే విశ్వాసం, నీతి ప్రవర్తనను రచయిత ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు ఈ కథలో.

నైజరు తేనె కథలో విశృంఖలమైన నాగరికత కాటు వేస్తే ఆకుపచ్చని అడవి ఎలా విషతుల్యం అయిపోయిందో తెలియజెప్పటమే కాక, మనుష్యుల మనసులు కూడా నాగరికత ప్రభావంతో విషతుల్యం అయిన పరిస్థితులు నైజరు తేనె కథలో కనిపిస్తుంది. పదిసంవత్సరాల వ్యవధిలో రెండుసార్లు అడవి అందాలు ఆస్వాదించడానికి అడవిలోకి వెళ్ళిన వ్యక్తి తన అనుభవాలను ఏకరవు పెట్టడం ఈ కథలో చూడవచ్చు. మొదటి సారి అడవిలోకి వెళ్ళినప్పుడు అక్కడి ప్రజలు సాదరంగా ఆహ్వానించడం, ఆతిథ్యమివ్వడం, కంటిరెప్పలా చూసుకోవడం, స్వచ్ఛమైన తేనెని రుచి చూడడం, వారి నిస్వార్థ మనసులు అతనికి సంతోషాన్నివ్వడం మరలా పది సంవత్సరాల తర్వాత అదే ప్రాంతానికి వెళ్ళినపుడు ఆనాటి అభిమానాలు, ఆప్యాయతలు కనిపించవు. మనుషులందరూ స్వార్థంగా ప్రవర్తించడం, చివరకు తేనె కూడా రుచి కోల్పోవడం ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఆధునిక పోకడలకు అలవాటు పడ్డ అడవి తన సహజత్వాన్ని ఎలా కోల్పోయిందో కనిపిస్తుంది. నాగరికత పెరిగేకొద్దీ అడవి మనుష్యులు కూడా స్వార్థంగా తయారయి, మానవీయ విలువలు కోల్పోయి ప్రవర్తించడం ఈ కథలో కనిపిస్తుంది. పర్యావరణం పై తనకు గల అవగాహనను, ప్రేమను రచయిత ఈ కథ ద్వారా వ్యక్తీకరించడం జరిగింది.

వరదవెల్లువ అనే కథలో వివాహేతర సంబంధాల వలన జీవితాలు సర్వనాశనమవుతాయనే సందేశాన్నిచ్చారు రచయిత. అనైతిక చర్యలకు పాల్పడటం వలన ఎన్ని అనర్థాలు వస్తాయో తెలియజేశారు. ధనికులైన దంపతులు లోపించిన అనురాగం, ఏర్పడిన దూరం, అంతకంతకూ మరింత దూరమై ఆ స్త్రీ భర్తను నిరాకరించడం, పనివాడితో సంబంధం పెట్టుకోవడం, చివరకు పిల్లలను కూడా దగ్గరకు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎవరెంత చెప్పినా వినకపోవడం చూస్తే ఆమెకు ఐశ్వర్యంతో పాటు అహంకారం, కూడా వచ్చిందా అనిపిస్తుంది. ఆ పొగరే ఆమెను పతనం వైపు నడిపించింది. పనివాడు సిమ్మన్నలో పరివర్తన వచ్చినా అప్పటికే సమయం మించిపోయింది. వారిద్దరికీ ఆ తప్పులో భాగస్వామ్యం ఉంది. ఆ తప్పు సరిదిద్దుకోలేనిది. జీవితంలో ఎదురయ్యే ఇలాంటి తప్పిదాలవైపు ప్రయాణం చేయకూడదని, చేస్తే ఎంతో కొంత మూల్యం చెల్లించుకొనే పరిస్థితులు వస్తాయి అని రచయిత తెలియజేస్తారు.

భేడాఘాట్ మొసలి అనే కథానేపథ్యం జబల్‌పూర్, నర్మదానదీ ప్రాంతాలకు చెందింది. ఆ ప్రాంతానికి విహారయాత్రకు వస్తున్న ఒక వ్యక్తికి అతని మిత్రుడు అక్కడవుంటున్న మొసలిని చూసిరమ్మంటాడు. అయితే ఆ వ్యక్తికి నీళ్ళలోని మొసలిని చూడలేదుగానీ, మొసలి కన్నీరు కార్చి పడవనడిపే సిబ్బందిని అదుపులో ఉంచిన పడవ యజమానిని చూస్తాడు. అతని నయవంచన మాటలతో తక్కువ జీతాలను సిబ్బందికి ఇచ్చి పనిచేయించుకోవడం, మోసం చేసే మొసలి బుద్ధిలా కనబడుతుంది. ఆ వ్యక్తి సిబ్బందిని సంఘటితం చేసి ఎక్కువ జీతాలకై పోరాడమని వారిని చైతన్య పరుస్తాడు. సిబ్బంది న్యాయమైన రీతిలో జీతాలు పెంచమని అడిగినప్పుడు యజమాని వారిని

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


బెదిరించడం, సలహా ఇచ్చిన వ్యక్తి పైన దాడి చేయడానికి రావడం, సిబ్బంది అడ్డుకొని ఆ వ్యక్తిని కాపాడి క్షేమంగా పంపిస్తూ చూశారు కదా భేడాఘాట్ మొసలిని, మొసలి కన్నీరు కారుస్తున్న ఆ మోసగాడిని అని, మీరిచ్చిన చైతన్యంతో మా హక్కులు పరిరక్షించుకుంటాము ఇక మరలామోసపోము అని తెలియజేస్తారు.

**ముగింపు:**

ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, కవిత, నాటకం వంటి ప్రక్రియలకు నూతన ఒరవడి నేర్పింది గురజాడ అప్పారావు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన గురజాడ అడుగుజాడలలో నడిచి ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కళింగాంధ్ర రచయితలు శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణ బాబు, చాసో, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు వీరితో పాటు చెప్పదగిన రచయిత బలివాడ కాంతారావు. బలివాడ కేవలం తన ప్రాంతానికే పరిమితం అవ్వలేదు. ఉద్యోగరీత్యా దేశమంతా తిరిగారు. తన రచనలలో అన్ని ప్రాంతాల సమస్యలను, తన కథలలో పొందు పరచారు. ఆ జీవన వైవిధ్యాన్ని కథనం చేశారు. ఏ కాలంలో, ఏ ప్రాంతంలో ఉన్నా ఆయా సామాజిక, వ్యక్తిగత, సంక్లిష్ట జీవితం లోని అనేక పార్శ్వాలను కథాశిల్పాలుగా మలిచాడు. బాధ్యత గల రచయితగా ప్రవర్తించాడు. ఈ కథలలోని పాత్రల సామాజిక చిత్రణ పరిశీలిస్తే అవన్నీ మన చుట్టూ, మన మధ్య, మనం నిత్యం చూస్తున్న పాత్రలే. నిత్యం మనకు వినబడుతున్న అన్యాయాలే. కథలు చదువుతున్నంత సేపు మనం ఆ ప్రాంతంలో ఉన్నట్టే అనిపిస్తుంది. చూస్తూవున్నట్టే ఉంటుంది. సగటు మనిషి అంతరంగంలో చెలరేగిన సంఘర్షణకు అక్షరరూపమిచ్చిన బలివాడ ఆ కథలను మానవజీవితాన్ని అన్ని కోణాల నుండి దర్శించి ఎంతో ఉన్నతంగా ఉదాత్తంగా చిత్రీకరించి కృతార్థులయ్యారు, చరితార్థులయ్యారు.

**ఆధార గ్రంథాలు:**


1. కథాస్రవంతి – బలివాడ కాంతారావు కథలు —— ఆ అరసం, గుంటూరు
2. తెలుగు సాహిత్య చరిత్ర —— ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష —— డా॥ జి. నాగయ్య
4. బలివాడ కాంతారావు నవలలు – పరిశీలన —— డా. గజ్జా యోహాన్ బాబు
5. వివిధ భాషా సాహిత్యాలు – సాంస్కృతిక పరివర్తన —— భావవీణ ప్రత్యేక సంచిక, 2017
6. సాహిత్య రంగంలో ప్రతిభా మూర్తులు —— అత్తలూరి నరసింహారావు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ఇనాక్ 'సూర్యుడు తలెత్తాడు' కథ – దళిత అస్థిత్వ కథానాయకుడు 'రావడు'

– డా. రత్నశేఖర్ కట్టెపోగు,
ఆంధ్రోపన్యాసకులు,
ఎస్.కె.బి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, మాచర్ల,
పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**ఇనాక్ జీవితం–సాహితీ వ్యాసాంగం:**

కొలకలూరి ఇనాక్ గుంటూరుజిల్లా, వేజెండ్ల గ్రామంలో 1939 జూలై 1న రామయ్య, విశ్రాంతమ్మ దంపతులకు నిరుపేద కుటుంబంలో జన్మించారు. విద్యాభ్యాసం పూర్తైన తర్వాత గుంటూరు ఎ.సి. కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. తరువాత అనేకచోట్ల అధ్యాపకుడుగా పనిచేసి వెంకటేశ్వర యూనివర్సిటీలో అనేక పదవులను అలంకరించారు. కవిగా, కథకుడుగా, ఉపన్యాసకుడుగా, పత్రికా రచయితగా, అనువాదకుడుగా, నవలాకారుడుగా, పీఠికా రచయితగా, సమీక్షకుడుగా, విద్యావేత్తగా, అధ్యాపకుడుగా, పరిపాలనాదక్షుడుగా, దళిత జనోద్ధారకుడుగా ఖ్యాతిగాంచాడు. అనేక సాహిత్య ప్రక్రియల్ని చేపట్టి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. ఎన్నో అవార్డులు, పురస్కారాలు, సన్మానాలు ఆయన ప్రతిభకు నిదర్శనం.

దళిత జీవిత స్థితిగతులను అనుభవించి, గమనించి, వ్యధచెందిన సాహితీ స్రష్ట, క్రాంతి ద్రష్ట. దళితులు బానిసత్వంలో మ్రగ్గిపోతూ, పేదరికంలో క్రుంగిపోతూ, బతుకుబాటలో అడుగులు తడబడుతూ, ప్రగతిపథంలో నడవలేమన్న న్యూనతా భావాలను తొలగించి తన రచనలద్వారా వారిని అభ్యుదయపథంలో నడిపించడానికి పూనుకున్న కర్తవ్యదీక్షాపరుడు. తన ఆశలను, ఆశయాలను, సిద్ధాంతాలను కార్యరూపంలో పెట్టడానికి కలం చేపట్టిన కృషీవలుడు.

జాషువా ప్రభావం ఇనాక్‌పై పడింది. తాను స్వయంగా ఆవిషయాలను తెలియజేస్తూ 'జాషువా పుణ్యాత్ముడు. మహానుభావుడు, మహాకవి. మా పల్లెల్లో ఆయనొక సజీవ చైతన్యదైవం. ఆయన్ని చూడటం, తాకటం గొప్ప అనుభవం. ఆయన నివశించే ఇంటిని చూడటం ఒక ఆరాధన. కవి అంటే మా జనంలో గొప్ప గౌరవం. జాషువాను చూసే నాలో కవి కావాలన్న భీజం పడింది. మా పల్లెల ప్రజలు ఆయన పట్లచూపే భక్తి ప్రేరణ నన్ను రచయితను చేసింది. ఆయన సాహిత్యమంతా 18 ఏళ్ళకు చదివేశాను' అని చెప్పుకున్నారు.

ఇనాక్ తాతను మునసబు కొట్టి చంపాడు. అట్లా చంపి ఉండకూడదని వారి పసిమనస్సు బాధపడింది. ఆ సంఘటనే వారి మొదటి కథ 'ఉత్తరం' రాయడానికి ప్రేరణయ్యింది. ఆకలి, అస్పృశ్యత, చుట్టూ ఉన్న జీవితాలను చూసి దు:ఖంతో ఆక్రోశించటానికి సాహిత్యం అండగా నిలిచింది. సాంఘిక జీవితాన్ని, పీడనకు గురిచేస్తున్న సమాజ ధోరణిని గురించి రాశారు. వారు పుస్తకాలు చదివికాదు, సంఘాన్ని చదివి రచనలు చేశారు.

**సూర్యుడు తలెత్తాడు కథారచన – నేపథ్యం:**

'దళిత కథలు`2' (దళిత స్త్రీ సమస్యల కథలు) పేరుతో కొలకలూరి ఇనాక్, కె.లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో 1998లో కథాసంకలనాన్ని వెలువరించారు. అందులో 'ఈ సంకలనంలో మొత్తం 24 కథలున్నాయి. అందులో ప్రధానాంశం స్త్రీ సమస్య, దళితవాదం. స్త్రీవాదం ప్రధానంగా పరిశీలన పొందుతున్నకాలంలో స్త్రీ సమస్యపట్ల అవగాహనతో వెలువడ్డ దళితకథలు ప్రచురించడం ద్విధా ప్రయోజనకారి. దళిత సమస్యతో పెనవేసుకొన్న స్త్రీసమస్య ఈ కథల అంతస్సూత్రం. అయితే కొన్నింటిలో అది ప్రస్ఫుటంగా, మరికొన్నింటిలో నిగూఢంగా, మరికొన్నింటిలో అల్పంగా కనిపించవచ్చు' అని 'ఉన్నమాట' పేరుతో ఇనాక్ స్వయంగా ముందుమాటలో పేర్కొన్నారు. ఈ కథాసంకలనంలో 6వ కథగా 'సూర్యుడు తలెత్తాడు' అనే కథను ఇనాక్ రాశారు. ఈ కథలోని 'రావడు' పాత్రను రచయిత ఏ విధంగా చిత్రించాడో తెలియజెప్పడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

**సూర్యుడు తలెత్తాడు–ఇతివృత్తం:**

ఒకానొక మారుమూల పల్లెలో రావడు పగలంతా కష్టపడుతూ తనకున్న ఎకరం పొలంలో యంత్రంలా పనిచేస్తూ ఉంటాడు. పొద్దుపొడవకముందే పొలంవెళ్ళి పొద్దుపోయిన తర్వాత ఇంటికి వచ్చేవాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేవాడుకాదు. ఒకరోజు ఇంటికి వచ్చేసరికి కూతురు సీత లేచిపోయిందని జనమంతా చెప్పుకోగా విన్నాడు. ఒకరోజు పొలానికి బయలుదేరగా నెత్తురు మడుగులో పడున్న కొడుకును చూస్తాడు. ఎప్పుడూ ఊళ్ళో వాళ్లతో కోట్లాటలు పెట్టుకొని ప్రాణాలమీదకు తెచ్చుకుంటాడు.

ఒకరోజు అర్ధరాత్రి రావడు నిద్రలేచి చూడగా ఎదురుగా కూతురొచ్చి కాళ్ళు పట్టుకుంటుంది. నిండుచూలాలు కావడంతో తలనిమిరి ఇంట్లోకి తీసుకెళతాడు. మగపిల్లాడ్ని కని కూతురు చనిపోతుంది. పిల్లాడి ఆలనాపాలనా చూసే దిక్కులేక తల్లడిల్లుతున్న సమయంలో పిల్లలులేని పక్కింటావిడ వాడిని పెంచుకుంటుంది. పొలంలో రావడు పనిచేసుకుంటుండగా కొడుకును కొద్దిమంది కర్రలతో కొట్టి చంపడంతో పొలంలోనే గొయ్యితీసి పూడ్చిపెడతాడు.

ఒంటరివాడైన రావడు పొలంలోనే పాకవేసుకొని జీవనం సాగిస్తుండగా చింతయ్య వచ్చి 'ఈ పొలం నాదని' అంటాడు. ఎప్పుడో తీసుకున్న 100 రూపాయల అప్పుకు పొలాన్ని ఆక్రమించుకుంటాడు. చేసేదేమీలేక ఇక పొలంతో ఉన్న అనుబంధాన్ని విడిచిపెట్టి ఊరులో ఇల్లు మాత్రమే మిగలడంతో వారంపాటు ఇల్లు కదల్లేదు. దాంతో ఒకరోజు రావడు చెరువుగట్టు మీదకువెళ్ళి అగ్గిపెట్టెతో తనకు తాను నిప్పు అంటించుకుంటాడు. చెరువుగట్టు దిగి ఊళ్ళోకిపోతూ 'ఈ బతుకులిట్టా తగలబడ్డానికి ఈల్లేదు' అంటూ అరుచుకుంటూ పరుగెడతాడు. దాంతో కథముగుస్తుంది.

**రావడు–పాత్ర చిత్రణ:** ఈ కథలో రావడు పాత్ర కథానాయకుడు పాత్ర. ప్రతీ సందర్భంలోనూ సూర్యునితో పోలుస్తూ ప్రతీకాత్మకంగా కథను రచయిత మలిచాడు. ఉదయం, సాయంత్రం సూర్యుడు వచ్చిపోయే సందర్భాన్ని రావడు పాత్రకు అనుసంధానం చేయబడింది. రావడు చనిపోయే ముందుకూడా 'కుంకిన సూర్యుడు రావడి ముఖంలో అర్ధరాత్రి పుట్టాడంటాడు. ఎర్రగా మంటగా జ్వాలగా ముఖం. సూర్యుడు మండిపోతున్నాడంటాడు.

**'రావడు' దళితజాతికి ప్రతీక:**

ప్రతీక అనే భావన ఆధునిక సాహిత్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో ప్రతీకలున్నా, అది పాశ్చాత్య సాహిత్య ప్రభావాన్ని పొంది నేడు నూతన పోకడలను పొందింది. రెండు వస్తువుల జోడింపు ప్రతీకలో ఉంటుంది. ఐతే ప్రతీకలోని రెండవ విషయం ఎప్పుడూ వాచ్యంగా ఉండదు. అది లుప్తమై అర్థదర్శనాన్ని కలిగించాలి. ప్రాతినిధ్యం వహిస్తున్న అంశం దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో దాన్ని వ్యంగ్యంగా సూచిస్తేనే ప్రతీక అర్థమవుతుంది తప్ప వాచ్యంగా చూపడానికి వీలులేదు. వస్తువు తత్వాన్ని దర్శనం చేయగలిగినప్పుడే ప్రతీకను వాడగలడు. ఈ ప్రతీక కేవల సంకేతితార్థాన్ని మాత్రమే చెప్పదు. పైగా ఇది తార్కిక సంబంధం కలదై ఉండాలనీ లేదు. తెచ్చుకొనే ప్రతీకకు అర్థగూఢతా స్పష్టతలు ఉండాలే కాని నిర్దిష్టార్థం లక్ష్యంగా ఉండదు. కొన్నిసార్లు భౌతికవాస్తవం ఆధ్యాత్మిక వాస్తవంతో ముడిపడి ఉంటుంది.

కవి తన భావాభివ్యక్తికి ఎన్నుకొనే ప్రతీకలలో అతని సంస్కార ముద్ర కూడా ఉంటుంది. అభివ్యక్తి చేయబడేది కవి అనుభవస్థితి అయినా విశ్వజనీనంగా ఆస్వాదింపబడే ప్రతీకలద్వారా వ్యక్తమయినపుడే కవిత సామాజికుల హృదయాలకు సన్నిహితమవుతుంది. ప్రతీకలకు విశ్వజనీన ప్రవృత్తి ప్రధానం. ఎంత విశ్వజనీనాలైనా కొత్త ప్రతీకలు వస్తు స్వభావాన్ని స్పష్టంచేస్తాయి. ఆలోచనని ఇస్తాయి. కొత్తదనాన్ని రంగరించి అనుభూతిని ఇస్తాయి. నవనవోన్మేషంగా గ్రహిస్తున్న ప్రతీకలు అంతవరకు దృష్టిసారించని కొత్తకోణాలకు చూపును మరలిస్తున్నాయి. అనుభూతిని ఇస్తున్నాయి. కవితానందం మాత్రమే కాదు వివేచననూ ఇస్తున్నాయి.

కొలకలూరి ఇనాక్ తాత్త్విక, సాంస్కృతిక, ఆర్థిక కోణాలను పట్టిచూపడంలో నిజమైన దళిత జీవితం కనిపిస్తుంది. దళితులు రాసిన కథల్లో సమస్యను చెప్పడంతోపాటు, ఆ సమస్య వెనకున్న అనేక కారణాలను చెప్తూనే, వాటిని అధిగమించే తత్త్వం బాగా వ్యక్తమవుతుంది. ప్రాచ్య సాహిత్య నాయకుడికంటే పాశ్చాత్య సాహిత్య నాయకుడు మనిషికి దగ్గరివాడు. పాశ్చాత్య సాహిత్య నాయకుడు కూడా చూపలేని వాస్తవిక మానవుడు దళిత సాహిత్య నాయకుడు. నాయకుడిని గురించి భారతీయ అలంకారశాస్త్రాలలో ఆలంకారికులు

నాయకుడి గుణాలు, స్వరూపం, భేదాలు గురించి వివరించి నాయకుడి స్థానం దేవ బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల వరకు తెలియజెప్పారు. కానీ ఆధునిక సాహిత్యంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావం కారణంగా శూద్రుడికి కూడా నాయకస్థానం కల్పించబడింది.

దళిత సాహిత్యం, ప్రాచ్య ధోరణి రెండూ భిన్నమైన పార్శ్వాలు. ప్రాచ్యధోరణి నాయకుడు ఈ సాహిత్యంలో కనిపించడు. దళితుడి కులం సమాజం గౌరవించదు. అతనికి ధనంలేదు. ఉజ్జ్వల తేజోరూపం ఈ నేపథ్యం నుంచి కనిపించదు. కాని ఉన్నంతలో ఉదారత, తన పరిధిలో ధర్మవర్తనం కనిపిస్తుంది. అస్తిత్వ పోరాటం ఆత్మగౌరవ పరిరక్షణే ప్రధానమయినచోట కీర్తి ప్రతాపాల ప్రస్తావనే అసంభద్ధం. తానే నిలువ నీడలేనివాడైతే శరణాగతుడు కాగలిగే సామర్థ్యం ఎక్కడనుంచి వస్తుంది.

దళిత పురుషుడు ధీరుడిగా తిరుగుబాటు ధోరణిలో చూడటానికి కూడా అన్వేషించాలి. ప్రధానంగా దళితుడు అధీరుడిగా భావించటం కొంత వరకు సాహిత్యంలో ఉంది. కాని హృదయ లాలిత్యం, శాంతలక్షణం ఉన్నది పంచిచ్చే ఔదార్యం మాత్రం పుష్కలంగా దళితులలో ఉంది. ఔద్ధత్యం తరాలుగా అణిగి మణిగి ఉన్న కులాలలో చూడటం అసహజం. స్వభావ రీత్యాకన్నా పరిస్థితుల ప్రేరేపణలవల్ల ఉద్ధతత కొంతవరకు చూడవచ్చు.

ప్రాశ్చాత్య ప్రభావ సాహిత్యంలోని నాయక ధోరణిలో కొంతవరకు సమర్థులుగా దళితులను చూడవచ్చు. అధీరులుగా, దోపిడికి గురిఅయిన వాళ్ళుగా, కొంతవరకు సమర్థులుగా ఉండవచ్చు. దీనికి చక్కని నిదర్శనం గుర్రంజాషువా గబ్బిలం, గబ్బిలంలోని నాయకుడే. సమసమాజ కాంక్షతో, సంస్కరణ దృష్టితో, దళిత ఇతివృత్తాన్ని చేతుల్లోకి తీసుకున్న కవులు రచయితలు, తాము చూసిన, అంచనా వేసినా దళిత సమాజాన్ని, తమ ముందు దళితుల ప్రవర్తన నుంచి తాము చూసిన, అంచనా వేసినా వారి వ్యక్తిత్వాలను పాత్రలుగా మలచారు. దళితులు సమాజకోణం నుంచి సాహిత్యానికెక్కారు.

దళితుడు తనకు తగిలిన అనుభవాలను యధాతదంగా సాహిత్యం ద్వారా అందించడు. ఆ అనుభవాన్ని తానెలా చూశాడో చెప్తాడు. ఆ అనుభవాన్ని ఎన్ని రకాలుగా చూడవచ్చో ఏ రకంగా అందిస్తే అది చైతన్యపరుస్తుందో ఆలోచిస్తాడు. సమాజానికి అందించి, సమాజం దానినుంచి ఏదైనా నేర్చుకోవాలనే అందిస్తాడు. ఈ అందించే క్రమంలో నాయకుడు సాధారణంగా బాధితుడుగా, పీడితుడిగా ఘర్షించేవాడిగా, తిరగబడేవాడిగా, చైతన్యం కలవాడిగా, చంపేవాడిగా, వ్యూహకర్తగా, జయించేవాడిగా, సంయమనం కలవాడిగా, పౌరుషవంతుడిగా ఇలా ఎన్నో రకాలుగా కనిపిస్తాడు. ఈ కనిపించడం వెనక దళితుడి అనుభవం ఉంది. అందించే కోణాలు అనేకంగా ఉన్నాయి. 'ఒకే గొంతులో వేయిపార్శ్వాలు వేయి ఛాయలు, వేయి కోణాలు, వేయి జీరలు, వేయి ఆనందాలు, తరతమ స్థాయి భేద వేయి ఆగ్రహాలు ఏకకణంలో ఏకభూమిక నుంచి విన్పించే బహువచనం'గా దళిత సాహిత్యంలో నాయకుడు కనిపిస్తాడని సుంకిరెడ్డి నారాయణరెడ్డి అంటారు.

దళిత సాహిత్యంలో కథే/ఇతివృత్తమే నాయకపాత్ర ప్రధానపాత్ర పోషిస్తుంది. ఏసమస్యను లేదా సమస్యలను అయితే సాహిత్య స్రష్టలు చెప్పటానికి ఉద్దేశిస్తారో అక్కడ ఆ రచనలో ఆ సమస్యే విరాట్స్వరూపంగా కనిపిస్తుందే కాని నాయకుడు కాదు, పాత్రలు కాదు. ఇక్కడ పాత్రలకు ప్రాధాన్యం ఉన్నా, ఇతివృత్తం చదివిస్తుంది. సమస్యలు నడిపిస్తాయి. తరాలు మారినా దుస్థితి విరాట్ స్వరూపంతో నిలుస్తుంది. వచ్చిపోయే పాత్రల ప్రాధాన్యం కాదు. ఇతివృత్తం నాయకుడు. వారి సమస్యలే కథలో ప్రధానం కాని, ఏ ఒక్కడిదో ప్రాధాన్యం కాదు. జాతి పోరాటాల వ్యక్తీకరణ ఉందే కాని నాయక విజయోత్సాహం చూడలేం. సాధ్యమూ కాదు.

దళిత సాహిత్యం చిత్రించేది సమస్య అయినప్పుడు అది జాతి సంబంధి అయినప్పుడు అక్కడ వైయక్తిక ప్రాధాన్యంకాక సమష్టి ప్రాముఖ్యం ఉంటుంది. సమష్టి ప్రాధాన్యంగానే విషయం/ఇతివృత్తం సాగుతుంది. వైయక్తిక ప్రాధాన్యం ఆ సమష్టిలో కొంత కనిపించినా, మొత్తంగా అది గుంపుదిగా, గుంపులోని భాగంగా చూడగలమే కాని ఆ వ్యక్తిని ప్రత్యేకంగా గుర్తించటం అసాధ్యం.

నాయక విజయం ఇక్కడ దళిత సాహిత్యంలో చూడటం కల. రచన ఇక్కడ నాయకుడు/దళితుల వైపు నుంచే సాగుతుంది. వారి ఆశలు కోరికలు తపనలు తాపత్రయాలు పోరాటం అంతా చిత్రితమవుతుంది. అయినా వారికి లభించేది మాత్రం అరచేతిలో స్వర్గం. ఈ మాట కూడా వ్యర్థమే. భ్రమలో సైతం దళితులు స్వర్గాన్ని ఊహించలేరు. అభిజాత్యం, వర్ణాధిపత్యం తరాల ఆధిపత్యం ఇవన్నీ దళితులకు వ్యతిరేకంగానే ఎప్పుడూ ఉన్నాయి. అంటరానితనం నేరమనే చట్టాలు కాగితాలపై అమలులో ఉంటే ఆచరణలో ఉన్న కులాధిపత్యం కాగితాలపై కూడా విజయం సాధించటం దళితస్థితికి దర్పణం.

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఏకనాయకుడిగా రచన ఉంటే ఆ నాయకుడు పిపీలకంగానో, పరాజితుడిగానో ఉండటం వాస్తవం. అనుభవించే తీవ్రవేతలను విన్నవించుకొన్నాడు. ఇది ఆ ఒక్క దళితుడి వ్యథనే అనుకోవటానికి లేదు. ఇక్కడ ఆ దళితుడు ఎంత అసహాయుడో గ్రహించవచ్చు. దళితుడు ఏకనాయకంగా నడిచిన కథలో సైతం నాయకుడు విచక్షణతో ఓటమి అంగీకరించటమూ కద్దు. పోరాడలేని అసమర్థుడిగా దానిని చూడటం కంటే, మనోస్థయిర్య విజయంగా దానిని చూడాలి.

సాధారణంగా తెలుగు కథల్లో కథానాయకులు వీరోచిత కృత్యాలను సాధిస్తారు. కానీ ఈ కథ అందుకు భిన్నమైనది. ఈ కథలో కథానాయకుడు రావడు ఎక్కడా వీరోచిత కృత్యాలకు పాల్పడడు. తాను పుట్టి పెరిగిన వాతావరణం అవమానం, అణచివేతలు, హింసల మధ్య తాను ఏ సాహసం చేయాలన్నా, దాని వెనక భయం బీభత్సం స్తబ్ధత అణగిపోతున్న కోరికలూ కనిపిస్తాయి. నాయకుడిని గురించి దళిత సాహిత్యంలో ఎలాంటి ప్రలోభాలు లేవు. దళిత సాహిత్యంలో నాయకుడు పరిస్థితుల మనిషి, గుంపు మనిషి. జాతి జీవం. కుల ప్రతినిధి. కాబట్టి దళిత నాయకుడంటే దళిత జాతినే చూడగలం.

నిరాశను జయించే ప్రయత్నం, దానికి సంబంధించిన సంఘర్షణ లేకపోవటమే రావడు పాత్రను అర్థం చేసుకున్న విధానంలోని లోపం. జరగవలసినదానికీ, జరిగిన దానికీ మధ్య ఉన్న అగాధాన్ని చూపించటం మంచి శిల్పం. ఇలాంటి సందర్భాల్లో పాఠకుడు పాత్ర అవగాహనా లోపాన్నీ, అశక్తతనూ చూసి జాలి పడతాడు. శ్రమ దోపిడీని చిత్రించటంతోపాటు సమాజం శ్రమదోపిడీకి ఎలా సహకరించిందో, దాన్ని ఎలా ప్రోత్సహించి, ఒక వ్యవస్థగా తయారుచేసిందో కూడా ఈ కథ సూచిస్తుంది. వాస్తవ జీవితంపట్ల నిరాసక్తికీ, నిరాదరణకూ చిహ్నం ఈ కథ.

రావడు చివరివరకూ కష్టజీవిగానే బతకవలసి వస్తుంది. చివరికి ఉన్న ఎకరం పొలంకూడా పోయేసరికి నిరాశ కలిగి జీవితంమీద ఉన్న ఆశ చచ్చిపోయినట్లుగా కనిపిస్తుంది. ఈ కథ చివరి సంఘటన వరకూ వాస్తవికత మీద ఆధారపడి ఉంది. కథనం కూడా వాస్తవికమే. కానీ చివరి సంఘటన మాత్రం ప్రతీక. కథలోని చివరి సంఘటన కథాంశం మీద కొత్త వెలుగును ప్రసరింప చేస్తుంది. కథాంశాన్ని మలుపు తిప్పుతుంది. చివరి సంఘటనతో కథ అంతంకాదు. ఒక రకంగా ఆరంభమౌతుంది. సూర్యుడు ఎలా తిరిగి ఉదయిస్తాడో అలాగే ఉద్యమకారుడు తిరిగి వెలుతురులోకి వస్తాడు అనేది కవి ఉద్దేశ్యం.

**ముగింపు:**

సమాజానికీ వ్యక్తికీ సహజ వైరుధ్యంలేదు. సమాజంమీద తిరుగుబాటు చేసే వ్యక్తుల్లో చాలామంది సమాజ క్షేమంకోసమే చేస్తారు. సమాజంలో వ్యక్తి ఉన్నట్లే వ్యక్తిలో సమాజం ఉంటుంది. వ్యక్తులులేని సమాజంలాగే సమాజం తనలోలేని వ్యక్తి కూడా మిధ్యే. వ్యక్తుల్లోనే సమాజం ఉంటుంది. ఎలాంటి సమాజంలో కూడా వ్యక్తులందరూ ఒకేరకంగా మూసలోనుంచి తీసిన విగ్రహాల్లా ఉండరు. అలాంటివారు కొందరున్నావారు సాహిత్యంలో పాత్రలుగా, కథావస్తువులుగా పనికిరారు. కాబట్టి సాహిత్యం మరీ ముఖ్యంగా కథాసాహిత్యం సమాజంలోని వ్యక్తినీ, వ్యక్తిలోని సమాజాన్నీ, సమాజానికీ వ్యక్తికీ జరిగే సంఘర్షణ స్వభావాన్నీ చిత్రించాలి.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. ఇనాక్, కె. లక్ష్మీనారాయణ,కె (సంపా) : 1998, దళితకథలు–2, నిడో ప్రచురణలు, అనంతపురం
2. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి : 2008, కథాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
3. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్ : 2003, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత – వస్తువు, రూపం, శిల్పం, జ్యోత్స్నాకళాపీఠ ప్రచురణలు, హైదరాబాద్
4. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్ (సంపా) : 2003, తెలుగు కథాసాహిత్యం – ఆధునిక దృక్పథాలు, రూపం, శిల్పం, జ్యోత్స్నాకళాపీఠ ప్రచురణలు, హైదరాబాద్

**సాహిత్య తరంగిణి**

**ISSN:3048-5908** **(తెలుగు పరిశోధన పత్రిక)** **Impact Factor:6.673 (SJIF)**

**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**

**A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.**

# "కథాసరిత్సాగరంలో జీవన చిత్రణ – సామాజిక ప్రయోజనం" ఉపకోశా కథ ఆధారంగా ఒక పరిశీలన.

**– డా. ఆర్. అరుణా దేవి**

సంస్కృత అధ్యాపకురాలు

A.S.D. GDC. Women(A), Kakinada.

**పరిచయం:**

భారతీయ సంస్కృతిలో కథలకు విశిష్టమైన స్థానం ఉంది. కథలు కేవలం వినోదాన్ని అందించేవి మాత్రమే కాకుండా, సమాజంలోని జీవన విధానాన్ని, మానవ సంబంధాలను, వ్యక్తుల స్వభావాలను, నైతిక విలువలను ప్రతిబింబించే సాహిత్య రూపాలుగా కూడా నిలిచాయి. ముఖ్యంగా సంస్కృత కథాసాహిత్యంలో మానవ జీవితానికి సంబంధించిన అనేక పార్శ్వాలు సహజంగా చిత్రించబడ్డాయి.

'కథ' అనేది మానవ జీవితానికి అత్యంత సహజమైన సాహిత్య ప్రక్రియ. మానవుడు తన అనుభవాలను, ఆలోచనలను, భావాలను, జీవిత సత్యాలను కథల రూపంలో తరతరాలకు అందించాడు. అందువల్ల కథలు కేవలం కల్పనకు సంబంధించినవి కాకుండా, ఒక కాలంలోని సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య దర్పణాలుగా కూడా నిలుస్తాయి.

సంస్కృత సాహిత్యంలో పంచతంత్రం, హితోపదేశం, బృహత్కథ, కథాసరిత్సాగరం మొదలైనవి కథాసాహిత్య వైభవాన్ని చాటుతున్నాయి. వీటిలో సోమదేవభట్టుని కథాసరిత్సాగరం అనేక కథలు, ఉపకథలు, పాత్రలు, జీవన సంఘటనలతో కూడిన విస్తృత కథా ప్రపంచాన్ని మన ముందుంచుతుంది.

**కథాసరిత్సాగరం – పరిచయం:**

కథాసరిత్సాగరం బృహత్కథా సంప్రదాయాన్ని ఆధారంగా చేసుకున్న మహత్తర కథాగ్రంథం. సోమదేవుని రచనలో అనేక లంబకాలు, తరంగాలు, ఉపకథలు కనిపిస్తాయి. గ్రంథంలోని కథలు వినోదంతో పాటు మానవ స్వభావంలోని వైవిధ్యాన్ని కూడా ఆవిష్కరిస్తాయి. ఆనాటి సామాజిక జీవనాన్ని పరిశీలించడానికి ఉపయోగపడే సాహిత్య ఆధారంగా కూడా దీనిని చూడవచ్చు.

ఈ గ్రంథంలోని కథలలో ఉపకోశా కథ ప్రత్యేకంగా పరిశీలించదగినది. ఈ కథలో స్త్రీ యొక్క తెలివితేటలు, ఆత్మగౌరవం, సమయస్ఫూర్తి, పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి.

**ఉపకోశా కథ:**

ఉపకోశా ఉపవర్షుని కుమార్తె మరియు వరరుచికి భార్య. వరరుచి గొప్ప విద్యావంతుడు. పాణినితో జరిగిన వ్యాకరణ సంబంధమైన సంఘటనల కారణంగా వరరుచి హిమాలయాలకు వెళ్లాల్సి వస్తుంది. భర్త విజయాన్ని కోరుకుంటూ ఉపకోశా నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతూ అతని రాక కోసం ఎదురుచూస్తుంది.

కథలో ఆమె స్థితిని ఈ శ్లోకం ద్వారా రచయిత సూచిస్తాడు:

उपकोशा हि मे श्रेयः कांक्षन्ती निजमन्दिरे।

अतिष्ठत्प्रत्यहं स्नान्ती गङ्गायां नियतव्रता ॥२८॥

— कथासरित्सागर, कथापीठलम्बक, चतुर्थ तरङ्ग, 1.4.28

ఉపకోశా పాత్రలో భర్త పట్ల అనురాగంతో పాటు నియమబద్ధత, ఓర్పు, బాధ్యత వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


**ఉపకోశా ఎదుర్కొన్న పరిస్థితి:**

భర్త ఇంట్లో లేని సమయంలో రాజు యొక్క పురోహితుడు, ప్రధాన అధికారి, రాజకుమారుని మంత్రి వంటి కొందరు ఉపకోశాపై అనుచితమైన ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ సందర్భంలో ఆమె భయపడలేదు; తొందరపడలేదు. తనకు ఎదురైన పరిస్థితిని అర్థం చేసుకుని ముందుగానే ఒక వ్యూహాన్ని రూపొందించింది. తనను ఇబ్బందికి గురిచేయాలని ప్రయత్నించిన వ్యక్తులను తన బుద్ధిచాతుర్యం మరియు సమయస్ఫూర్తితో ఎదుర్కొంటుంది.

కథా మూలంలో ఆమె వారిని ఒక్కొక్కరిని వేర్వేరు సమయాల్లో ఇంటికి రమ్మని చెప్పి, తన పరిచారికల సహాయంతో ఒక పెట్టెలో దాచే విధంగా పరిస్థితిని రూపొందిస్తుంది. ఇక్కడ కథలోని ప్రధానాంశం ఉపకోశా యొక్క సమస్య పరిష్కార సామర్థ్యం. ఆమె తొందరపడి నిర్ణయం తీసుకోకుండా, పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకునే విధంగా వ్యవహరిస్తుంది.

**ధనానికి సంబంధించిన సంఘటన:**

కథలో మరో ముఖ్యమైన సంఘటన ధనానికి సంబంధించినది. వరరుచి తన సంపదను హిరణ్యగుప్తుడనే వ్యాపారివద్ద భద్రపరచి వెళ్తాడు. తరువాత ఆ ధనాన్ని తిరిగి అడిగినప్పుడు వ్యాపారి దానిని తన వద్ద లేదని నిరాకరిస్తాడు.

ఈ పరిస్థితిలో ఉపకోశా రాజు నందుని ఆశ్రయిస్తుంది. దీనికి సంబంధించిన సంఘటన శ్లోకాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తుంది:

उपकोशाप्यथ प्रातश्चेटिकानुगता गता।

गुरूणामनवेद्यैव राज्ञो नन्दस्य मन्दिरम् ॥७१॥

— कथासरित्सागर, 1.4.71

తన సమస్యను తనలోనే దాచుకోకుండా, న్యాయం జరిగే వ్యవస్థను ఆశ్రయించడం కూడా ఒక పరిష్కార మార్గమే. ఆమె తన సమస్యను స్పష్టంగా వివరిస్తుంది. తన దగ్గర ఆధారం ఉందని చెబుతుంది. ఆ తరువాత కథలోని మంజూషా సంఘటన ద్వారా నిజం బయటపడుతుంది.

ఇక్కడ కథ యొక్క ప్రధాన ఆకర్షణ కేవలం సంఘటనలో లేదు. ఒక క్లిష్టమైన పరిస్థితిలో వ్యక్తి తన వివేకాన్ని ఉపయోగించి సమస్యను ఎలా పరిష్కరించుకోవచ్చో కథ చూపిస్తుంది.

**కథలో జీవన చిత్రణ – ఉపకోశా కథ ద్వారా:**

ఉపకోశా కథ ద్వారా ఆనాటి సమాజంలోని అనేక జీవనాంశాలను గమనించవచ్చు.

1. **స్త్రీ వ్యక్తిత్వం**: కథలో స్త్రీని కేవలం కుటుంబ జీవితానికే పరిమితమైన పాత్రగా కాకుండా, తన బుద్ధి, వివేకం, సమయస్ఫూర్తితో పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తిగా చిత్రించారు.

   ఉపకోశా పాత్రలో ఆత్మవిశ్వాసం, వివేకం, ధైర్యం కనిపిస్తాయి.

2. **మానవ స్వభావ చిత్రణ:** కథలోని వ్యక్తుల ప్రవర్తన ద్వారా మానవ స్వభావంలోని వివిధ పార్శ్వాలు వ్యక్తమవుతాయి. కోరిక, స్వార్థం, మోసం, భయం, తెలివి, ధైర్యం వంటి లక్షణాలు కథా సంఘటనల ద్వారా సహజంగా వ్యక్తమవుతాయి.

3. **సామాజిక సంబంధాలు**: కుటుంబం, వివాహం, విద్య, వ్యక్తిగత సంబంధాలు, సామాజిక గౌరవం వంటి అంశాలు కథలో భాగమవుతాయి. అందువల్ల కథ ద్వారా ఆనాటి సామాజిక జీవన విధానంపై ఒక సాహిత్య దృక్పథం ఏర్పడుతుంది.

4. **విద్య మరియు మేధస్సు:** ఉపకోశా పాత్రలో విద్య వల్ల కలిగే వివేకం ప్రధానంగా కనిపిస్తుంది. జ్ఞానం కేవలం పుస్తక పరిజ్ఞానంగా కాకుండా, సంక్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యంగా ప్రతిఫలిస్తుంది.

**కథలో సామాజిక ప్రయోజనం:**

కథాసరిత్సాగరంలోని ఉపకోశా కథను ఆధునిక దృష్టితో పరిశీలించినప్పుడు కొన్ని ముఖ్యమైన సామాజిక సందేశాలు కనిపిస్తాయి.

| | | |
|---|---|---|
| **మొదటిది – ఆత్మగౌరవం** | : | వ్యక్తి తన గౌరవాన్ని కాపాడుకోవడానికి ధైర్యంగా, వివేకంతో వ్యవహరించాలి అనే భావన కథలో కనిపిస్తుంది. |
| **రెండవది – సమయస్ఫూర్తి** | : | క్లిష్టమైన పరిస్థితుల్లో భయపడకుండా, ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎంత ముఖ్యమో ఉపకోశా పాత్ర తెలియజేస్తుంది. |
| **మూడవది – స్త్రీ సాధికారత** | : | స్త్రీలలోని మేధస్సు, ధైర్యం, నిర్ణయశక్తి సమాజంలో వారికి ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని అందిస్తాయని ఈ కథను ఆధునిక దృష్టితో చదవవచ్చు. |
| **నాలుగవది – వివేకంతో సమస్య పరిష్కారం** | : | బలప్రయోగం కంటే బుద్ధి, సమయస్ఫూర్తి, వ్యూహం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చనే సందేశం కథలో కనిపిస్తుంది. |

**ఆధునిక సమాజానికి ప్రాసంగికత:**

నేటి సమాజంలో కూడా వ్యక్తులు అనేక రకాల సామాజిక, కుటుంబ, వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువతకు ఆత్మవిశ్వాసం, నిర్ణయశక్తి, సమయస్ఫూర్తి, నైతిక విచక్షణ ఎంతో అవసరం.

ఉపకోశా పాత్రను ఆధునిక దృష్టితో పరిశీలిస్తే, "సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా, ఆలోచించి, పరిస్థితిని అర్థం చేసుకుని, వివేకంతో స్పందించాలి" అనే జీవన సందేశాన్ని గ్రహించవచ్చు.

అదేవిధంగా స్త్రీని కేవలం ఒక సామాజిక పాత్రకు పరిమితం చేయకుండా, ఆలోచించే, నిర్ణయం తీసుకునే, సమస్యలను పరిష్కరించగల వ్యక్తిగా చూడాల్సిన అవసరాన్ని కూడా ఈ కథ చర్చకు తెస్తుంది.

**ముగింపు:**

కథ మనిషి జీవితానికి చాలా దగ్గరగా ఉండే సాహిత్య ప్రక్రియ. మనుషుల ప్రవర్తన, సంబంధాలు, సమస్యలు, పరిష్కారాలు కథల్లో సహజంగా ప్రతిబింబిస్తాయి. అందుకే మంచి కథ చదివినప్పుడు కథ ముగిసినా, అందులోని భావం మనతో పాటు ప్రయాణిస్తుంది.

కథాసరిత్సాగరం సంస్కృతంలోని ప్రసిద్ధ కథా సంపద. సోమదేవభట్టుడు రచించిన ఈ గ్రంథంలోని అనేక కథలు ఆనాటి సమాజాన్ని, మానవ స్వభావాన్ని వివిధ కోణాల్లో పరిచయం చేస్తాయి. వాటిలో ఉపకోశా కథ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ కథలో స్త్రీ వ్యక్తిత్వం, మేధస్సు, ఆత్మగౌరవం, సమయస్ఫూర్తి, మానవ స్వభావం, సామాజిక సంబంధాలు వంటి అంశాలు కథారూపంలో ప్రతిఫలించాయి. అందువల్ల కథాసరిత్సాగరాన్ని కేవలం వినోద కథల గ్రంథంగా కాకుండా, మానవ జీవితం మరియు సమాజాన్ని ప్రతిబింబించే సంస్కృత కథాసాహిత్య సంపదగా పరిశీలించవచ్చు.

కథ మారింది, కాలం మారింది, జీవన విధానం మారింది. కానీ వివేకం, ధైర్యం, ఆత్మగౌరవం, సమయస్ఫూర్తి వంటి విలువలు నేటికీ అవసరమే. ఈ కారణంగానే కథాసరిత్సాగరంలోని కథలు ఆధునిక సమాజంలో కూడా అధ్యయనానికి, చర్చకు ప్రాసంగికంగా నిలుస్తున్నాయి.

కథాసాహిత్యం మనకు జీవితాన్ని నేరుగా బోధించదు. అది ఒక జీవన దృశ్యాన్ని మన ముందుంచి, అందులోని అర్థాన్ని మనమే అనుభవించేలా చేస్తుంది.

ఉపకోశా కథ కూడా అలాంటి అనుభూతినే అందిస్తుంది. ఆమె జీవితంలో వచ్చిన పరిస్థితులు నేటికాలంలో అదే రూపంలో మన ముందుకు రాకపోవచ్చు. కానీ వాటిని ఎదుర్కొనే సమయంలో కనిపించిన ఆలోచన, సమయస్ఫూర్తి, ధైర్యం, న్యాయం పట్ల నమ్మకం మాత్రం ఏ కాలానికైనా సంబంధించినవే.

అందుకే ఈ కథను చదివిన తరువాత మనలో మిగిలేది ఒక సంఘటన జ్ఞాపకం మాత్రమే కాకుండా, ఒక చిన్న జీవన విశ్వాసం కావాలి—

పరిస్థితి మనకు అనుకూలంగా లేకపోయినా, మన ఆలోచనను నిలబెట్టుకోగలిగితే ముందుకు వెళ్లే మార్గం కనిపించవచ్చు.

అదే ఉపకోశా కథ మనకు అందించే అందమైన జీవన దృష్టి.

**సూచనలు**

1. सोमदेवभट्टः – कथासरित्सागरः

2. C. H. Tawney – The Kathá Sarit Ságara: Ocean of the Streams of Story

3. కథాసరిత్సాగరంలోని సంబంధిత కథా భాగాలు మరియు సంస్కృత మూలపాఠం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# కథలు – సామాజిక ప్రయోజనం, జీవన చిత్రణ

– కండ్లావత్ కుమార్ నాయక్,
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), రాజమహేంద్రవరం
ఇ-మెయిల్: naik.21436587@gmail.com

**సారాంశం:**

కథా సాహిత్యం సమాజంలోని వ్యక్తి జీవితాన్ని, కుటుంబ సంబంధాలను, ఆర్థిక పరిస్థితులను, సామాజిక వ్యవస్థలను, గ్రామీణ జీవన విధానాలను, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే శక్తివంతమైన సాహిత్య ప్రక్రియ. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు కథా రచయితలు తమ కథల ద్వారా తమకు పరిచయమైన ప్రాంతీయ జీవన వాస్తవాలను సాహిత్య రూపంలో ఆవిష్కరించారు. కోస్తా ఆంధ్రలోని గ్రామీణ జీవితం, గోదావరి–కృష్ణా నదీ తీర ప్రాంతాల సంస్కృతి, ఉత్తరాంధ్ర ప్రజల జీవన పోరాటాలు, గుంటూరు ప్రాంత సామాజిక వాతావరణం, రాయలసీమ కరువు–వ్యవసాయ జీవితం, గ్రామీణ వర్గ సంబంధాలు, మధ్యతరగతి కుటుంబ సమస్యలు వంటి అనేక అంశాలు తెలుగు కథలో ప్రతిఫలించాయి.

ఈ వ్యాసం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భౌగోళిక పరిధికి మాత్రమే పరిమితం అవుతూ, కోస్తా ఆంధ్ర మరియు రాయలసీమ ప్రాంతాలకు చెందిన ఎంపిక చేసిన కథా రచయితలు, కథాసంపుటుల ఆధారంగా కథలోని సామాజిక ప్రయోజనం మరియు జీవన చిత్రణను పరిశీలిస్తుంది. గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, త్రిపురనేని గోపీచంద్, చాగంటి సోమయాజులు (చాసో), సత్యం శంకరమంచి, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథరెడ్డి వంటి రచయితల రచనల్లో కనిపించే సామాజిక వాస్తవికత, గ్రామీణ జీవనం, మధ్యతరగతి మనస్తత్వం, పేదల జీవన సమస్యలు, కుల–వర్గ సంబంధాలు, స్త్రీ జీవితం, ప్రాంతీయ భాషా వైవిధ్యం వంటి అంశాలను ఈ అధ్యయనం విశ్లేషిస్తుంది.

**ముఖ్యపదాలు:** తెలుగు కథ, ఆంధ్రప్రదేశ్, సామాజిక ప్రయోజనం, జీవన చిత్రణ, గ్రామీణ జీవితం, రాయలసీమ, కోస్తా ఆంధ్ర, సామాజిక వాస్తవికత.

## 1. పరిచయం:

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం మాత్రమే కాకుండా సమాజాన్ని పరిశీలించే ఒక సృజనాత్మక దృష్టి కూడా. కథా సాహిత్యంలో ఈ లక్షణం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. నవలతో పోలిస్తే కథ పరిమితమైన పరిధిలో ఒక సంఘటనను, ఒక పాత్రను లేదా ఒక సామాజిక సమస్యను కేంద్రీకరించి జీవితంలోని ఒక ముఖ్యమైన కోణాన్ని సాంద్రంగా వ్యక్తీకరించగలదు.

తెలుగు కథ 20వ శతాబ్దం ప్రారంభం నుంచి సామాజిక సమస్యలతో గాఢమైన సంబంధాన్ని ఏర్పరచుకుంది. సామాజిక సంస్కరణ, అంటరానితనం, స్త్రీ సమస్యలు, వరకట్నం, గ్రామీణ జీవితం, మధ్యతరగతి మానసిక సంఘర్షణలు వంటి అంశాలు తొలినాటి తెలుగు కథల్లోనే కనిపించాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కథా సాహిత్యంలో ప్రాంతీయ జీవన వైవిధ్యం ప్రత్యేకంగా గమనించదగినది. ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర, గోదావరి–కృష్ణా పరివాహక ప్రాంతాలు, గుంటూరు–ప్రకాశం ప్రాంతాలు, రాయలసీమ వంటి భౌగోళిక ప్రాంతాలు తమ ప్రత్యేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలను కలిగి ఉన్నాయి. ఈ వైవిధ్యం కథా వస్తువులోనూ, పాత్రల రూపకల్పనలోనూ, భాషలోనూ వ్యక్తమైంది.

### 2. అధ్యయన లక్ష్యాలు మరియు పరిశోధనా పద్ధతి:

ఈ పరిశోధన ప్రధానంగా క్రింది లక్ష్యాలను కలిగి ఉంది:

1. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కథా సాహిత్యంలో జీవన చిత్రణను పరిశీలించడం.
2. కథలు ప్రతిబింబించే గ్రామీణ, పట్టణ, మధ్యతరగతి జీవన పరిస్థితులను విశ్లేషించడం.
3. కథల్లోని సామాజిక ప్రయోజనాన్ని గుర్తించడం.
4. కోస్తా ఆంధ్ర మరియు రాయలసీమ ప్రాంతీయ జీవితాల ప్రతిబింబాన్ని పరిశీలించడం.
5. సామాజిక–ఆర్థిక అసమానతలు, కుల–వర్గ సంబంధాలు, పేదరికం, కరువు, వ్యవసాయ జీవితం వంటి అంశాల చిత్రణను విశ్లేషించడం.
6. ప్రాంతీయ భాష, మాండలికం, స్థానిక సంస్కృతి కథా వాస్తవికతకు ఎలా తోడ్పడుతున్నాయో పరిశీలించడం.

**పరిశోధనా పద్ధతి:** ఈ వ్యాసం ప్రధానంగా వర్ణనాత్మక–విశ్లేషణాత్మక పద్ధతిపై ఆధారపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఎంపిక చేసిన కథా రచయితలు, కథాసంపుటులు మరియు సాహిత్య విమర్శా ఆధారాలను పరిశీలించి అంశాన్ని విశ్లేషించడం జరిగింది.

### 3. ఆంధ్రప్రదేశ్ కథలో ప్రాంతీయ జీవన చిత్రణ:

ఆంధ్రప్రదేశ్ కథా సాహిత్యంలో ప్రాంతీయత అనేది కేవలం భౌగోళిక నేపథ్యం కాదు. అది మనుషుల జీవన విధానం, వృత్తి, భాష, సంస్కృతి, ఆచారాలు, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు మొదలైన అంశాల సమాహారం.

### 3.1 ఉత్తరాంధ్ర జీవితం:

చాసో కథల్లో ఉత్తరాంధ్ర, ముఖ్యంగా శ్రీకాకుళం–విజయనగరం ప్రాంతాల ప్రజల జీవితం, పేదరికం, కుటుంబ సంబంధాలు, సామాజిక అసమానతలు ప్రతిబింబిస్తాయి. ఆయన కథల్లో సామాజిక పరిస్థితులు పాత్రల ప్రవర్తనపై చూపే ప్రభావం ముఖ్యమైనది. ప్రాంతీయ ప్రజల జీవితంలోని సుఖదుఃఖాలు, సామాజిక–ఆర్థిక ఒత్తిళ్లు ఆయన కథల్లో ప్రతిఫలిస్తాయి.

### 3.2 గోదావరి–కృష్ణా ప్రాంత జీవితం:

సత్యం శంకరమంచి రచించిన "అమరావతి కథలు" ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవన చిత్రణకు ప్రత్యేక ఉదాహరణ. ఈ కథలు గుంటూరు జిల్లా కృష్ణానది తీరంలోని అమరావతి గ్రామాన్ని, అక్కడి ప్రజల రోజువారీ జీవితాన్ని, సంప్రదాయాలను, సామాజిక సంబంధాలను చిత్రిస్తాయి. ఈ కథల్లో గ్రామం ఒక నేపథ్యం మాత్రమే కాకుండా స్వయంగా ఒక ముఖ్యమైన జీవన ప్రపంచంగా రూపుదిద్దుకుంటుంది.

"వరద" వంటి కథల్లో ప్రకృతి, నది, గ్రామీణ ప్రజల జీవితం పరస్పర సంబంధంలో కనిపిస్తాయి. ప్రకృతి విపత్తు సమయంలో వ్యక్తిగత భేదాలు పక్కకు వెళ్లి మానవ సంబంధాలు ముందుకు రావడం వంటి అంశాలు కథా జీవితానికి సామాజిక పరిమాణాన్ని అందిస్తాయి.

### 3.3 గుంటూరు ప్రాంత జీవితం:

త్రిపురనేని గోపీచంద్ కథల్లో గ్రామీణ మధ్యతరగతి జీవితం, సామాజిక–ఆర్థిక సమస్యలు మరియు గ్రామీణ ప్రజల పట్ల సానుభూతి కనిపిస్తుంది. స్థానిక సంభాషణా భాషకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కథా పాత్రలు సహజంగా రూపుదిద్దుకుంటాయి.

### 4. రాయలసీమ జీవన చిత్రణ:

ఆంధ్రప్రదేశ్ కథా సాహిత్యంలో రాయలసీమకు ప్రత్యేకమైన స్థానం ఉంది. కరువు, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుల–వర్గ సంబంధాలు, కుటుంబ సంఘర్షణలు వంటి అంశాలు రాయలసీమ కథల్లో ముఖ్యమైన వస్తువులుగా కనిపిస్తాయి.

**4.1 మధురాంతకం రాజారాం:**

మధురాంతకం రాజారాం రచనలు రాయలసీమ జీవన చిత్రణకు ముఖ్యమైన ఉదాహరణ. ఆయన కథల్లో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి మరియు గ్రామీణ ప్రజల జీవితం కనిపిస్తుంది. ఆయన రచనల్లో గ్రామీణ ప్రజల బాహ్య–అంతరంగ జీవితాన్ని, ప్రాంతీయ మాండలికాన్ని, సామాజిక వాస్తవికతను సమగ్రంగా చిత్రించే లక్షణం గమనించవచ్చు.

**4.2 కేతు విశ్వనాథరెడ్డి:**

కేతు విశ్వనాథరెడ్డి రచనలు దక్షిణ ఆంధ్ర/రాయలసీమ గ్రామీణ సమాజంలోని మార్పులను ప్రతిబింబిస్తాయి. ఆయన రచనల్లో కరువు, గ్రామీణ మార్పులు, కుల విభజనలు, వ్యవసాయం, పారిశ్రామికీకరణ ప్రభావం వంటి అంశాలు కనిపిస్తాయి. ఇక్కడ కథ ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా మారుతున్న గ్రామీణ సమాజాన్ని కూడా నమోదు చేస్తుంది.

**5. కథలో సామాజిక ప్రయోజనం:**

కథ యొక్క సామాజిక ప్రయోజనం అంటే కథ ఒక సమస్యకు ప్రత్యక్ష పరిష్కారం చెప్పడమే కాదు. సమాజంలో సాధారణంగా కనిపించే ఒక పరిస్థితిని పాఠకుడి ముందు సజీవంగా ఉంచడం కూడా సామాజిక ప్రయోజనమే. తెలుగు కథా సాహిత్యంలో సామాజిక సంస్కరణ, పేదరికం, అసమానత, స్త్రీ జీవితం, గ్రామీణ సమస్యలు వంటి అంశాలకు ప్రారంభం నుంచే ప్రాధాన్యం ఉంది.

**5.1 సామాజిక అసమానత:**

కాళీపట్నం రామారావు కథలు సామాజిక–ఆర్థిక సంబంధాలను సున్నితంగా పరిశీలిస్తాయి. "యజ్ఞం" వంటి కథల్లో గ్రామీణ భూస్వామ్య వ్యవస్థ, పేదల జీవితం మరియు సామాజిక అధికార సంబంధాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన కథల్లో మధ్యతరగతి మరియు దిగువ వర్గాల జీవన సమస్యలు సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ ప్రభావాలతో అనుసంధానమవుతాయి.

**5.2 గ్రామీణ ఆర్థిక జీవితం:**

వ్యవసాయం ఆధారంగా జీవించే కుటుంబాలు ప్రకృతి, భూమి, వర్షపాతం, అప్పులు, మార్కెట్ వ్యవస్థలపై ఆధారపడి ఉంటాయి. ఈ జీవన వాస్తవాలు కథల్లోకి వచ్చినప్పుడు గ్రామీణ సమాజం ఒక నేపథ్యంగా కాకుండా కథలోని ప్రధాన సామాజిక శక్తిగా మారుతుంది.

**5.3 మధ్యతరగతి జీవితం:**

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథల్లో కుటుంబ జీవితం, సామాజిక సంస్కరణ, గృహ సంబంధాలు, ఆచార వ్యవస్థలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఉంది. రాజమహేంద్రవరం ఆయన కథా రచనా జీవితానికి ముఖ్యమైన కేంద్రంగా నిలిచింది. కందుకూరి వీరేశలింగం సామాజిక సంస్కరణ ప్రభావం కూడా ఆయన రచనల్లో కనిపిస్తుంది.

**6. భాష, మాండలికం – జీవన చిత్రణకు ఆధారం:**

కథలో జీవన వాస్తవికతను నిర్మించడంలో భాషకు కీలకమైన పాత్ర ఉంది. పాత్రలు మాట్లాడే భాష వారి ప్రాంతం, వృత్తి, సామాజిక స్థితి, విద్య, సంస్కృతి వంటి అంశాలను తెలియజేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ కథా సాహిత్యంలో ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతీయ భాషా వైవిధ్యాలు కథలకు సహజత్వాన్ని అందించాయి. మధురాంతకం రాజారాం రచనల్లో రాయలసీమ మాండలిక వినియోగం ఆయన జీవన చిత్రణకు ముఖ్యమైన లక్షణం. అలాగే గోపీచంద్ రచనల్లో ప్రాంతీయ భాషా ప్రయోగం గ్రామీణ మధ్యతరగతి జీవితానికి సహజత్వాన్ని అందిస్తుంది. అందువల్ల మాండలికం కథలో కేవలం భాషా అలంకారం కాదు; అది ఒక ప్రాంతీయ జీవన సంస్కృతికి గుర్తింపు.

**7. కథ – సామాజిక చరిత్రకు ఒక ఆధారం:**

కథా సాహిత్యం అధికారిక చరిత్రకు ప్రత్యామ్నాయం కాకపోయినా, ఒక కాలంలోని సాధారణ ప్రజల జీవన అనుభవాలను నమోదు చేసే సాంస్కృతిక ఆధారంగా ఉపయోగపడుతుంది.

"అమరావతి కథలు" వంటి రచనలు గ్రామీణ జీవన పరిస్థితులు, స్థానిక ఆచారాలు, సామాజిక సంబంధాలు మరియు ప్రజల జీవన విధానాలను కథా రూపంలో ప్రతిబింబిస్తాయి. అదేవిధంగా చాసో, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాం, కేతు

విశ్వనాథరెడ్డి వంటి రచయితల కథల్లో ఆయా ప్రాంతాల సామాజిక మార్పుల ఆనవాళ్లు కనిపిస్తాయి. ఈ విధంగా కథ సామాజిక చరిత్రను మానవ అనుభవం ద్వారా అర్థం చేసుకునే సాహిత్య కిటికీగా పనిచేస్తుంది.

**8. చర్చ:**

ఆంధ్రప్రదేశ్ కథా సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు "జీవన చిత్రణ" మరియు "సామాజిక ప్రయోజనం" రెండూ పరస్పర సంబంధిత అంశాలని స్పష్టమవుతుంది. ఒక కథ గ్రామీణ పేదరికాన్ని చిత్రిస్తే అది కేవలం పేదరికం యొక్క వర్ణనగా ఉండదు; దాని వెనుక ఉన్న ఆర్థిక నిర్మాణాలు, సామాజిక సంబంధాలు, వ్యక్తి ఆశలు, కుటుంబ పరిస్థితులు కూడా కథలోకి వస్తాయి. అదేవిధంగా రాయలసీమ కరువు గురించి కథ రాసినప్పుడు కేవలం ప్రకృతి పరిస్థితి మాత్రమే కాకుండా రైతు జీవితం, వలస, అప్పులు, కుటుంబ సంబంధాలు, సామాజిక ఒత్తిళ్లు వంటి అనేక అంశాలు అంతర్లీనంగా ఉంటాయి.

ఇదే కథా సాహిత్య ప్రత్యేకత. సమాజాన్ని సిద్ధాంతాల ద్వారా మాత్రమే కాకుండా మనుషుల జీవితాల ద్వారా చూపించడం కథకు ఉన్న ప్రధాన సామర్థ్యం.

**9. ముగింపు:**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు కథా సాహిత్యం ప్రాంతీయ జీవన వైవిధ్యాన్ని సమర్థంగా ప్రతిబింబించిన సాహిత్య సంపద. ఉత్తరాంధ్రలోని ప్రజల జీవన అనుభవాల నుంచి గుంటూరు, కృష్ణా, గోదావరి ప్రాంతాల గ్రామీణ సంస్కృతి వరకు; రాయలసీమలోని కరువు, వ్యవసాయ జీవితం, సామాజిక సంబంధాల వరకు కథా రచయితలు విస్తృతమైన జీవన ప్రపంచాన్ని సాహిత్యంలో ఆవిష్కరించారు. గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి ప్రారంభ రచయితల సామాజిక సంస్కరణ దృక్పథం నుంచి చాసో యొక్క ప్రాంతీయ జీవన వాస్తవికత, గోపీచంద్ గ్రామీణ సామాజిక దృష్టి, సత్యం శంకరమంచి యొక్క అమరావతి గ్రామజీవితం, కాళీపట్నం రామారావు సామాజిక–ఆర్థిక వాస్తవికత, మధురాంతకం రాజారాం రాయలసీమ జీవన చిత్రణ, కేతు విశ్వనాథరెడ్డి గ్రామీణ పరివర్తనల వరకు కథా సాహిత్యం అనేక సామాజిక పార్శ్వాలను నమోదు చేసింది.

అందువల్ల ఆంధ్రప్రదేశ్ కథలను పరిశీలించడం అంటే కేవలం సాహిత్య ప్రక్రియను అధ్యయనం చేయడం కాదు; ఆంధ్రప్రదేశ్ ప్రజల సామాజిక జీవితం, ప్రాంతీయ సంస్కృతి, మారుతున్న విలువలు, ఆర్థిక సంబంధాలు మరియు మానవ అనుభవాలను సాహిత్య దృష్టితో అర్థం చేసుకోవడం కూడా.

**సూచన గ్రంథాలు / References**


1. Sankaramanchi, Satyam. Amaravati Kathalu. Navodaya Publishers, Vijayawada.
2. Chaganti Somayajulu (Chaso). Chaso: Selected Short Stories. Sahitya Akademi.
3. Kalipatnam, Rama Rao. Yagnam and Other Stories.
4. Madhurantakam Rajaram. Madhurantakam Rajaram Kathalu. Sahitya Akademi.
5. Kethu Viswanatha Reddy. Kethu Viswanatha Reddy Kathalu.
6. Gurajada Appa Rao. Selected Telugu Short Stories.
7. Sripada Subrahmanya Sastry. Selected Short Stories.
8. Tripuraneni Gopichand. Selected Short Stories.
9. Krishnamurti, Bhadriraju; Vijayasree, Changanti, eds. Gold Nuggets: Selected Post-independence Telugu Short Stories. Sahitya Akademi, 2004.
10. Viswanatha Rao, C. V.; Sundareswara Rao, K. N. "Social Consciousness in the Stories of Kalipatnam Rama Rao." International Journal of Telugu Studies, 2015.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# శతక కవి రాములుగారి సాహిత్యంలో – సామాజిక చిత్రణ

**– నెమ్మలూరి భవాని**
తెలుగు అధ్యాపకురాలు,
సర్. సి. ఆర్. ఆర్. మహిళా కళాశాల, ఏలూరు.
పరిశోధక విద్యార్థి,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్నం.
చరవాణి:8143877881

**ఉపోద్ఘాతం:**

కాలం మారుతున్న కొద్దీ సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అధునాతన సమాజంలో మనిషి మెషిన్లా పని చేస్తున్నాడు. మెషిన్లతో పని చేయిస్తున్నాడు. పని ఒత్తిడితో తన బంధాలని బంధుత్వాలకి క్రమంగా దూరమవుతూ,వ్యక్తిగత బాధ్యతల నడుమ తన సామాజిక బాధ్యతలను మర్చిపోతున్నాడు. ప్రస్తుత సమాజంలోని సామాజిక సమస్యలను స్వయంగా చూస్తూ వాటిని తమ శతక పద్యాలలో చిత్రించి సామాజిక మార్పును ఆశించిన నేటి మేటి కవి, ఏలూరు ప్రాంత నివాసి రాములు గారు.

**కవి పరిచయం:**

1947జనవరి 1 వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో, సత్యనారాయణ,చిన్నమ్మి దంపతుల ఆరవ సంతానంగా రాములు గారు జన్మించారు. ప్రైవేటు ఉద్యోగిగా కొంతకాలం పనిచేసి, ఏలూరు లోని బి.ఎస్.ఎన్. ఎల్ లో జూనియర్ టెలికాం ఆఫీసర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ, సాహిత్యం పై ఉన్న అభిలాషతో రచనా రంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. చిన్నతనం నుండి ఎన్నో నాటకాలు నటించిన వారి అనుభవం, తెలుగు భాష పై వారికి గల సహజమైన అభిమానంతో తెలుగులో రచనలు చేయడం ప్రారంభించారు. మొదట్లో చిన్న హాస్య రచనలు, కథలతో ప్రారంభమైన వీరి ప్రయాణం కొన్ని పద్య కవితలకు విస్తరించి, క్రమంగా శతక పద్యరచన వైపు వీరు దృష్టిని కొనసాగించారు. ఆటవెలది పద్యాలను అలవోకగా రచిస్తూ, ఎనిమిది శతక పద్య పుస్తకాలను ప్రచురించారు. వారి అమితమైన అనుభవ విజ్ఞానంతో రచించిన ఈ శతక పద్యాలు నేటి సమాజానికి అద్దం పడుతున్నాయి. నందివర్ధనాలు,వెలుగుపూలు అనే పేరుతో ప్రచురించబడ్డ వారి శతకాలలోని సామాజిక అంశాలను పరిశీలిద్దాం.

**సామాజిక చిత్రణ :**

నాగరికత పరంగా ముందుకెళ్తున్న సమాజంలో అనేక సమస్యల వలయంలో చిక్కి మనిషి తన మనశ్శాంతిని కోల్పోతున్నాడు. భార్యాభర్తల మధ్య సరైన సఖ్యత లేకపోవడం, మానవత్వాన్ని మరిచి మనుషులు బంధాలకు దూరమవడం, స్వార్థ చింతన తో మన చుట్టూ ఉన్న ప్రకృతిని జీవరాశిని నాశనం చేయటం వంటి ఎన్నో సమస్యలకు మనిషి కారణభూతుడవుతున్నాడు. రాములు గారు వారి శతక పద్యాలలో తమ అనుభవాల సారాన్ని జోడించి వీటన్నిటి పైన తమ దృష్టిని ప్రసరింపజేసి, వారి శతక పద్యాలలో ఎన్నో సామాజిక సమస్యలను చిత్రించారు.

**భార్యాభర్తల అనుబంధం:**

‘‘పెళ్లి’’ అనే బంధంతో ఏకమయ్యే భార్య భర్తలు ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుండాలి కానీ వారిలో వారే కలిహించకూడదు. భార్యాభర్తల బంధాన్ని గురించి తెలియజేస్తూ రాములు గారు రచించిన ఈ పద్యం పరిశీలిద్దాం.

భార్య భర్తలనెడి బాంధవ్యమే మిన్న
ఎందరున్న చుట్టు నేమిఫలము
ఇట్టి మాటలెపుడు ఎదనందు మెదిలితే
కావ్య సుధలు గావె కాపురాలు

చుట్టూ ఎంతమంది ఉన్నా చివరికి భర్తకు భార్య, భార్యకు భర్తే తోడు. ఈ మాటలు మన జ్ఞాపకంలో ఉంటే కాపురాలన్నీ కావ్యసుధలే అవుతాయని, పచ్చని కాపురాల ను మధురమైన కావ్యంతో పోల్చి, భార్యాభర్తల బంధాన్ని మరింత పటిష్టం చేశారు. ఎన్ని బంధాలు ఉన్నా భార్యాభర్తల బంధమే గొప్పదని చాటిచెప్పారు. ఇదే బాణీలో భర్తలు ఎలా ఉండాలో కూడా మరోపద్యంలో తెలియచేశారు.

కష్టమొచ్చినపుడు కంటి నీరు తుడిచి
బాధ కలిగినపుడు భద్రతొసగి
ఆపదొచ్చినపుడు ఆదుకొనెడివాడు
భర్తయన్న పేరు బడయగలడు

తనను నమ్ముకుని, తన వెంట నడిచే భార్యకి, కష్టంలో కంటి నీరు తుడిచి, బాధలో నేనున్నానని భద్రత ఇచ్చేవాడు,ఆపదలో ఆదుకునే వాడు నిజమైన బాధ్యతగల భర్త అవుతాడని చక్కని సందేశాన్నిచ్చారు. ఒకరినొకరు అర్థం చేసుకునే భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గిల్లికజ్జాలే తప్ప, పెద్ద పెను తుఫానులు చోటుచేసుకోవు. ఇటువంటి పద్యాలు ఆలుమగలకి ఆదర్శంగా నిలుస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

**కష్టేఫలి:**

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని తెలియజేస్తూ, కష్టమైన పనులు ఇష్టపడుతూ చేయాలని, కాయ కష్టమందు సుఖముంటుందని తెలియజేస్తూ ఈ క్రింది పద్యాన్ని రచించారు.

కష్టమైన పనులు ఇష్టపడుతూ చేయు
కరువు ఉండదింట సిరులపంటె
కృషిని నమ్మ వాడు ఋషితుల్యుడే కద
కాయ కష్టమందె కలదు సుఖము

కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయని శ్రమను నమ్ముకుంటే సర్వత్రా సుఖమేనని చెప్తూ...

కొండలైన తరుగు కూర్చొని తిన్నచో
కొవ్వు పెరుగు తుదకు కూడు కరువు
శ్రమను నమ్ముకున్న సర్వత్ర సుఖముందు
ఎక్కడైనా చెమట చుక్క మిన్న

కష్టపడి చెమట చుక్క చిందిస్తే ఎప్పటికైనా ఫలితం మిన్నగా ఉంటుందని పై పద్యంలో తెలియజేసారు.

**సామాజిక దృష్టి:**

ఎప్పుడైనా సరే అతి అనర్థదాయకమేనని క్రింది పద్యంలో తెలియజేశారు.

అతిగా మాటలాడ హాని ఒక్కోసారి
మితపు భాషణమ్ము హితము గూర్చు
అన్ని వేళల యందు అతి అనర్థకము యె
హద్దునందునున్న హాయి కలుగు

మాటల మంచితనంతో పాటు మితము కూడా ఉండాలని తెలియజేస్తూ ఈ పద్యాన్ని రచించారు. వీటితోపాటు మనిషిలో పెరిగిపోతున్న అహము, అసూయను దృష్టిలో ఉంచుకొని వాటిని అదుపు చేయాలని చెప్తూనే... ఒత్తిడి ఎక్కువైతే ఓర్పు నశిస్తుందని మానవతను మర్చిపోకూడదు అని తెలియజేస్తూ మరికొన్ని పద్యాలు రచించారు.

పనులు జరగలేదని పట్టు విడవకుండా, మంచి అవకాశం కోసం ఎదురు చూడాలని "వెలుగుపూలు "శతకంలో క్రింది పద్యాన్ని రచించారు.

కంటనీరు పెట్టి కంగారు పడబోకు
పనులు జరగనపుడు పట్టు విడకు
మరల తిరిగి వచ్చు మంచవకాశమ్ము
విజ్ఞులార వినుదు వెలుగు పూలు

అవకాశం చేజారిపోయిందని, అనుకున్న పనులు జరగలేదని బాధపడి పట్టు విడువ కూడదని, మంచి అవకాశం మళ్ళీ తిరిగి వస్తుందని పట్టుదలతో ప్రయత్నం చేయాలని యువతకు ఇచ్చే మంచి సూచన పై పద్యంలో కనిపిస్తుంది.

**జీవ కారుణ్య భావన :**

ప్రకృతిలో మనతోపాటు ఎన్నో జీవరాసులు నివసిస్తున్నాయి. కానీ మనిషి వ్యక్తిగత ప్రయోజనం నేపథ్యంలో స్వార్థ చింతన తో జీవరాసులని నాశనం చేస్తున్నాడు. జీవులపై ప్రేమ చూపాలని క్రింది పద్యంలో తెలియజేశారు.

ప్రేమ చూపవలెను పెంచు జంతువులపై
వ్యక్తపరచలేవు వాటి బాధ
సర్వజీవులందు సర్వేశ్వరుదు ఉండు
విజ్ఞులారా వినుదు వెలుగు పూలు

జీవులపై మనం చూపే జాలి, ప్రేమ అవి ఎప్పటికీ గుర్తుంచుకుని విశ్వాసాన్ని చూపిస్తాయి. విశ్వాసానికి మారుపేరు కుక్క యజమాని చూపే ప్రేమకు లొంగిపోయి ఎప్పటికీ తన విశ్వాసాన్ని ప్రదర్శిస్తూనే ఉంటుంది. జీవులపై వారికి గల మమకారాన్ని చాటుకుంటూ రాములు గారు రచించిన పద్యమిది.

విశ్వసించదగ్గ విశ్వాస జంతువు
జాగిలమ్ము గాదె జగతి నందు
ఆపద ఎదురైతే ఆదుకొనునుగాని
ప్రాణభయము చేత పారిపోదు

మనం చూపే కాస్త ప్రేమకు లొంగిపోయి జీవరాసులు మనతో ఒకటిగా కలిసిపోతాయని అందులోనూ కుక్క వంటి విశ్వాస జీవులు మనతోనే ఉంటూ మన క్షేమాన్ని కోరుకుంటాయని జీవరాసులని ప్రేమగా సాకాలని ఈ పద్యంలో తెలియజేశారు.

**పర్యావరణ పరిరక్షణ:**

పంచభూతములతో కూడిన ప్రకృతి మానవాళికి ఒక వరం. ప్రకృతిలో వృక్షాలు లేనిదే మానవుని మనుగడ సాగదు. అటువంటి వృక్షాలని మనస్వార్థం కోసం ఎన్నో రకాలుగా నాశనం చేస్తున్నాం చెట్లను కాపాడాలని తెలియజేస్తూ, పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ--- రాములు గారు క్రింది పద్యాన్ని రచించారు.

పంచభూతములను ప్రకృతి ప్రసాదించి

సర్వ జీవుల యెడ సమముగుండి

జీవులన్నిటికి జీవవైవిధ్యపు

కవచమందజేసి కాపు కాయు

సృష్టిలో ఉన్న భూమి, నీరు,అగ్ని,గాలి,ఆకాశం అనే పంచభూతాలను,ప్రకృతిని  ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో మనమే కలుషితం చేస్తున్నాం. కవచంలా అనుక్షణం జీవరాసిని రక్షించే ప్రకృతి కలుషితమైతే ఆ ప్రభావం అన్ని జీవుల పైన పడుతుంది. ముఖ్యంగా మానవుని మనుగడ అల్లకల్లోలం అయిపోతుంది. పర్యావరణ పరిరక్షణ భావన నేటి తరానికి కలగాలని సదుద్దేశంతో రాములు గారు రచించిన ఈ పద్యాలు--- నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

పెంచవలెను గాని త్రుంచుట సరికాదు

ప్రాణదాతలు ఇల పాదపములు

నాటుటందుకాక నరుకుటిపుడు మోజు

ఇట్టి చీడ పనులు ఎపుడు మాను

వెలుగుపూలు శతకంలో రచించిన ఈ పద్యం వృక్షో రక్షతి రక్షితః అనే నానుడి గుర్తు చేసే విధంగా ఉంది. మొక్కల్ని పెంచాలి గాని నరకడం క్షేమకరం కాదని పై పద్యంలో తెలియచేశారు. మొక్కలు నాటడం కన్నా నరకడం పైనే ఇప్పటి వారి మోజుందని అది హాని కారకమని సందేశమిచ్చారు.

**మానవీయ విలువలు:**

కోపతాపాలు మనుషులను దూరం చేసే వినాశకారకాలంటూ, మనిషి సాత్విక స్వభావాన్ని పెంపొందించుకోవాలని తెలియజేస్తూ---.

పాప కారకాలు కోపాలు తాపాలు

మనిషి తనమును అవి మంట కలుపు

సాత్వికత్వమొందు శాంతి సౌభాగ్యాలు

విజ్ఞులారా వినుడు తెలుగు పూలు

కోపంలో మనిషి తనను తానే మర్చిపోతాడని, లేనిపోని వినాసాలకి కారణం కోపమే కాబట్టి మనిషి సాత్విక స్వభావాన్ని కలిగి ఉంటే శాంతి చేకూరుతుందని పై పద్యంలో తెలియజేశారు. బంధాలకి బంధుత్వాలకి విలువని ఇవ్వాలంటూ క్రింది పద్యానల్లారు రాములు గారు.

అయినవారలంతా ఆపదలో ఉంటె

అసలు ఉండగలర అన్ని మరిచి

ఎట్లు ఉండగలరు ఏమి జరగనట్లు

విజ్ఞులార  వినుడు వెలుగు పూలు

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"కలిసి ఉంటే కలదు సుఖమన్నట్లు" ఉమ్మడి కుటుంబాలు లేకపోయినా, కనీసం ఆపదలోనైనా ఆదుకునే గుణం లేకపోతే మానవత్వం పూర్తిగా అంతరించిపోతుంది. ఎంత పరుగుల ప్రపంచంలో ఉన్న బంధాలకి బంధుత్వాలకి విలువనివ్వాలి. సాటి మనుషులకు సాయం అందించాలనే సహృదయం ఉండాలి.

**ముగింపు:**

మానవులంతా కలిసి ఉండే ఈ సమాజంలో సమిష్టి భావన అత్యంత ముఖ్యమైనది. నలుగురితో కలిసిమెలిసి ఇతరుల సమస్యలకు స్పందించే గుణం మనలో ఉండాలి.పరస్పర సహకారం సమాజాన్ని ఐకమత్యంతో ముందుకు నడిపిస్తుంది. సమాజ శ్రేయస్సు కాంక్షిస్తూ ఎందరో కవులు కలములు నాటికి నేటికి నినదిస్తూనే ఉన్నాయి. సరళమైన పదజాలంతో, చక్కని ఆటవెలదులతో రాములు గారు రచించిన ఈ శతక పద్యాలు సమ సమాజ నిర్మాణాన్ని చిత్రిస్తున్నాయి. నేటి ఆధునిక సమాజానికి ఇటువంటి పద్యాలు సులభంగా బోధపడి మార్గనిర్దేసన చేస్తాయి.

**ఆధార గ్రంధాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర – జి. నాగయ్య
2. రాములు గారి శతకములు: నందివర్ధనాలు ,వెలుగుపూలు
3. అంతర్జాలం
4. శబ్ద రత్నాకరం – బహుజన పల్లి సీతారామాచార్యులు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# 'నేనంటాను' కవితా ఖండికలో దాశరథి సామాజిక చైతన్యం – ఒక పరిశీలన

– అచ్చ.రవీందర్,
తెలుగు అధ్యాపకుడు
మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ ప్రభుత్వ గురుకుల కళాశాల సంగెం, వరంగల్.
Mail: ravindaracha114@gmail.com

**ఉపోద్ఘాతం:**

భారతదేశంలో రాజకీయాలు పతనమైపోతున్నాయని, ఉన్నత భావాలుగల నాయకులు కనుమరుగైపోతునారని, స్వల్ప కాలంలో డబ్బు సంపాదించాలని, గూండాలు, నేరస్థులు రాజకీయ వ్యాపారం చేస్తున్నారని, ప్రజల నిస్సహాయత్వాన్ని ఆసరాగా చేసుకొని కోట్లు సంపాదిం చాలని, ఓట్లు వేసిన ప్రజలను మరచిపోయి, నోట్లు సంపాదించుకొంటున్నారు, ఈ దుస్థితి ఇంకెన్నాళ్ళు? అంటూ దాశరథి భారతీయులందరికి అనేక అచరణాత్మక, ఆవశ్యకమైన అంశాలను తన ఖండికల ద్వారా ప్రదర్శించారు. వీరి రచన అందరిని వెలుగులోని తీసుకు రావడానికి ప్రయత్నించాయి. ఈనాటికి ఈ ఖండిక సజీవమే. పరిస్థితులు మారాలని, మానవుల ఆలోచనా సరళిలో మార్పరావాలని దాశరథి ఆనాడు రాసిన ఖండిక ఈనాటికి మన్నన పొందుతుంది. ఇప్పటికీ ఈ పరిస్థితులు అలాగే కొనసాగుతున్నాయనే భావించవచ్చు. దాన్ని ప్రతిపాదించిన దాశరథి గురించి....

**కీలకపదాలు:** మానవతా దృక్పథం, స్వేచ్ఛ, సమానత్వం, అధికార దుర్వినియోగం. అభ్యుదయ భావజాలం, ప్రజా చైతన్యం, ఐకమత్యం, సామాజిక చైతన్యం, ప్రజా సంకల్పం, సామాజిక స్పృహ.

**వివరణ:**

దాశరథి కృష్ణమాచార్యులు ఆయన పూర్తి పేరు. దాశరథి పేరు వినగానే రుద్రవీణ, గాలిబ్ గీతాలు, అగ్నిధార ముందుగా జ్ఞాపకానికి వస్తాయి. తెలంగాణాలోని వరంగల్లు జిల్లాలో మానుకోట తాలూకా అంటే ఇప్పటి మహబూబాబాద్ జిల్లా గూడూరులో జన్మించారు.

తెలంగాణాలోని ప్రజల కష్టాలను, ఇక్కట్లను అనుభవించి ప్రతిస్పందించిరి దాశరథి. 'నా తెలంగాణా కోటి రతనాల వీణ' అని పల్కి తెలంగాణా పోరాటములో పాల్గొని 'తరతరాల బూజు నిజాం రాజు ఖబడ్దార' అని హెచ్చరించాడు. కారాగారాన ఉన్నప్పటికీ ఆలోచనలకు, భాషకు, పాడిత్యానికి పదునుపెట్టుకొని 'ముసలి నక్కకు రాచరికము దక్కునే' అని గళమెత్తి పాడిన ఆధునికాంధ్ర వైతాళికుడు. సంస్కృతాంధ్ర, ఉర్దూ కవితలను జీర్ణించుకొని, రచనకు, వ్యక్తిత్వానికి అవసరమైన వాడిని సంత రింపచేసుకొని అపారమైన ప్రతిభను ప్రదర్శించిన మహాకవి దాశరథి.

అగ్నిధార, పునర్నవం, మహేంద్రోదయం, మహాబోధి, రుద్రవీణ, కవితాపుష్పకం, గాలిబేతాలు, దాశరథి శతకం, తిమిరంతో సమరం, ఆలోచాలోచనాలు దాశరథి రచనలు. సినిమా పాటల రచయితగా ఆంధ్ర ప్రజ లందరికీ పరిచయం. తిమిరంతో సమరం కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం. గాలిబ్ గీతాలకు ఉత్తమ అనువాదక బహుమతి, కళాప్రపూర్ణ, 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' బిరుదులు. ఆంధ్రాభిమానము, శాంతికాముకత, సర్వేజనా:సుఖినోభవంతు సర్వమానవ సౌభ్రాతృత్వం వీరికి నచ్చిన విషయాలు.

'నేనంటాను' అను ఖండిక ఆలోచనాలోచనాలు అను గ్రంథం నుండి గ్రహించబడినది. వీరుడిగా, విప్లవవాదిగా, శాంతమూర్తిగా వారి రచనలు మనకు దర్శనమిస్తాయి.

"ఆలోచనాలోచనాలు" సమాజ సహజ దర్పణంగా దర్శమనమిస్తుంది. నేటి సమాజంలో మానవుని మనస్తత్వం ఈ ఖండికలో తేటతెల్లం. కష్టించి పనిచేయా లని, ప్రజలందరూ ఐకమత్యంగా కలిసిమెలసి ఉండాలని ఈ గ్రంథంలోని సారాంశం.

ఆలోచనల యొక్క లోచనాలు ఈ ఖండిక ద్వారా దాశరథి ఉద్వేగపూరితమైన తత్వం వ్యక్తపరుస్తుంది. అర్హతలేని వాళ్ళ అందలాలు ఎక్కడం. ఆడంబరాలకు పోతే అరిష్టమని, పైపై డాబులకు విలువిస్తే లోపలున్న దంతా డొల్లన్న సంగతి గ్రహించలేరన్న హెచ్చరిక ఉంది.

కళ్లెం ఉన్నది మనచేతిలో,
గుఱ్ఱం మాత్రం పడె గోతిలో
దప్పి తీరదని నేనంటాను
నీళ్ళే అందని మన నూతిలో

ఈ ఖండికలో దాశరథి చెప్పింది కళ్ళెం మన చేతిలోనే ఉన్నది. గుఱ్ఱం మాత్రం గోతిలో పడింది. ఎంత సమర్ధ వంతమైన చోదకత్వమో. నీళ్ళే అందని నూతులున్నాయి. ఇంకా దప్పికెలా తీరుతుంది? నీరు దానంతటదే రాదు. మనం చేదుకోవాలి, దప్పిక తీరాలంటే. కనుక కళ్ళెం బిగించకపోతే బండి తల్లక్రిందులైపోతుంది. నీటితో గొంతు తడుపుకొనే అవకాశముండదని దాశరథి భావం. నేటి సమాజంలో ప్రజలెట్లా ఉన్నారంటే పడవ నడపలేని వాడు నావికుడౌతున్నాడు. పదం పాడలేనివాడు గాయ కుడౌతున్నాడు. కాబట్టి ప్రజలను పాలించలేనివారే నాయకులౌతున్నారని వేదనతో రచయిత చెపుతున్నాడు. పనికి అర్హతలేని వారు ఉంటే ఆ పని ఎంత చక్కగా నెరవేర్చబడుతుందో అర్థమవుతుంది. దేశమంతా ఇలాంటి విధానం కొనసాగితే దేశ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన కలుగుతుంది.

పై పై సొగసులు కల్లసుమా!
లోపలిదంతా డొల్లసుమా!
నిజం తెలియదని నేనంటాను
లేదా కొంపే గుల్ల సుమా!

పై పై సొగసులు అంతా అబద్ధం, లోపలంతా డొల్ల సుమా! ఆడంబరాలకు, డాంబికాలకు, దర్పాలకు విలు విస్తే మనకు మిగిలేది డొల్లేనని గుర్తు చేస్తున్నాడు. ఈ నిజము తెలుసుకొనకపోతే కొంపంతా గుల్ల అయి పోతుంది. బూడిదైపోతుంది. భవిష్యత్తు అంధకారమవు తుందని దాశరథి భావం. మన పొరుగు దేశాలు మనతో ప్రవర్తిస్తున్న తీరు ఇప్పుడు మనం గమనిస్తే దాశరథి మాటలు నిజమని నిస్సంకోచంగా ఒప్పుకోవచ్చు. స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని దశాబ్దాలు గడుస్తున్నా మనపై మన నాయకులు చూపుతున్నదంతా స్వార్థపు త్యాగాలే, అదే పైపై సొగసులు, లోపలి డొల్లగా భావించవచ్చు.

బండను కోయాలి కుసుమదాళం
గుండెను కోయాలి నయనజలం
కదనరంగమున, నేనంటాను
కత్తిని మించాలి కవుల కలం

కుసుమ దళాలు కోయాలి బండనైనా. గుండెను కోయాలి లేదా కరిగించాలి కన్నీరు. అనగా స్థూలత్వం, మూర్ఖత్వం, కాఠిన్యం సున్నితత్వానికి, కంటినీటికి కలిగి పోవాలి. అందుకే కదనరంగంలో కత్తులను కవుల కలాలు మింగేయాలి. కలాలతో పని ఉండాలిగాని కత్తుల అవ సరం రారాదని కవి హృదయ వేదన. బండను కోయలేవు పుష్పాలు, కాని గుండెను కరిగించగలవు కన్నీరు అందుకే దాశరథి కోరారు కన్నీటితోనైనా యుద్ధాన్ని నివారించాలి. కత్తికి పనిలేని కలం కావాలి మనకు, కలాన్ని నమ్మి పయ నించాలి, సాధించాలి దాశరథి ఉద్దేశం.

నవబాష్పధారలో నవ్వు కాగలవు
ముళ్ళతీగెలలోన పువ్వు కాగలవు
యత్నించి చూడమని అంటాను నేను
రాళ్ల రాసులలోన రవ్వ కాగలవు

మానవులు ప్రయత్నిస్తే ఋషులు కావచ్చును. కనుక నవ్య బాష్పధారలో నవ్వు కావచ్చును, ముళ్ళ తీగెలో పువ్వు కావచ్చును. ప్రయత్నిస్తే రాళ్ళ గుంపులో రత్నం కావచ్చును. ప్రయత్నిస్తే అసాధ్యం ఏదీ లేదు. ప్రయత్నంతో ఎలాంటి కార్యాన్నైనా సాధించగలం. కష్టంలోను నవ్వుకాగలవు, ముళ్ళలోనూ పువ్వు పూయగలవు, రాళ్ళలోనూ రవ్వ కాగలవు, ఎప్పుడంటే ప్రయత్నించినప్పుడు మాత్రమే. కాని ఆ ప్రయత్నమే లేనినాడు రాళ్ళు రాళ్ళగానే ఉంటాయి రత్నం కాలేవు.

కోటినదులు పోలలేవు ఒక్క సింధువుని
కోటితారలు పోలలేవు లోకబాంధవుని
అందుకనే గళం విప్పి నేనంటాను
కోటినేతలు పోలలేరు ఒక్క గాంధీని

ప్రకృతితో సహజీవనం చేస్తున్నాం మనం. దాని ఆదీనంలో ఉన్నాం మనం. కాని వాటిని వినియోగించి జీవించగలమే గాని వాటిని ఎదిరించి బ్రతకలేం. ఎన్ని నదులైనా చివరకు సముద్రంలో కలుస్తాయి. కనుక ఎన్ని నదులైనా సముద్రంతో సరిపోవు. కోటి తారలైనా సూర్యుని కాంతితో సమానమవుతాయా? కావు, ఎప్పటికీ కావు. అదే విధంగా ఎంతమంది నాయకులైనా త్యాగశీలి, నిస్వార్ధ నాయకుడు, భారత స్వాతంత్ర్య రథసారథి గాంధీజీతో సరికారు. ఇప్పుడు నిస్వార్థపూరిత నాయకుడు మన దేశానికి కావాలని దాశరథి భావన. అందుకే గాంధీజీలాంటి త్యాగశీలి దేశం కోరుకుంటుందని దాశరథి అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు.

బిరుదూ, సనదూ ప్రతిమానవుడికి కావాలి
పదవీ, హటరీదా ప్రతిపౌరుడికీ కావాలి
ప్రభుత్వ మెప్పుదు బడసిన పిమ్మట ఏంకావాలి?
ప్రజల మెప్పుకై ప్రభుతను దెప్పుట కావాలి !

లోకంలో ప్రతి వ్యక్తికి బిరుదు కావాలి. ప్రతి మానవుడికి పదవి, హటరీదా కావాలి. తొలుత ప్రభుత్వం మెప్పును పొందుతారు. ప్రజల మెప్పును పొందుతారు. ప్రజల మెప్పు కొరకు ప్రభుత్వంను దెప్పుట, హటరీదాలు సంపాదించు కోవాలని భావిస్తారు. ప్రభుత్వపు మెప్పును పొందుతారు. వెంటనే ఇంకొకదాని కొరకు ఆ ప్రభుత్వాంనే విమర్శిస్తారు. దాశరథిగారి మహటరీన్నతమైన ఇంకొక అభిప్రాయం ఏమంటే గంగానది భారతీయులదైనా, రావీనది పాకిస్థానీయులదైనా, నదులెట్లున్నా, ఎటు పారినా భారత, పాకిస్థానీయుల వారి హృదయం, మనస్సు కలవాలి. అలాగే ఖండాంతర వాసులైన మనసులు కలిపిన మనషులు కావాలన్నది, వర్గ వైషమ్యం తొలగా లన్నది రచయిత అభిప్రాయం. ప్రజల కొరకు ఏర్పడ్డ ప్రభుత్వాలు వారి శ్రేయస్సుకు పాటుపడాలి తప్ప ఇతరా లైన బిరుదులు, పదవులకోసం కాదు. భారతీయులందరికి సమాన పదవీ, హటరీదా లభించాలని దాశరథి ఆశిస్తున్నారు.

ఉత్తరానగల హిమాచలం
దక్షిణానగల జలధిజలం
మన అందరిదని నేనంటాను
ఐకమత్యమే మనకు బలం

ఉత్తరాన హిమాలయాలున్నా, దక్షిణాన సముద్ర జలాలున్నా అవి మనందరివి కనుక మనకున్న బలమంతా ఐకమత్యమే. కనుక కలిసి ఉంటే కలదు సుఖం అన్న మంచి భావన రచయితది. ద్వీపకల్పమైన భారతదేశానికి గల నైసర్గిక స్వరూపం అత్యున్నతమైనది. వనరులు అనంతం. ఇలాంటి సుసంపన్నంగా ఉన్న దేశాన్ని విదేశీయులనుండి పోరాడి కాపాడితే దాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత, ధర్మం మనపైనే ఉంది. కాని మన రాజకీయాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. నాయకులు పాలనావిధానంలో నిజాం పాలకులులా అంత నియం తృత్వంగా లేకపోయినా ప్రజలకు అవసరాలు తీరడం లేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఇంకా కనీస అవసరాలు కూడా తీరని ప్రజలు దేశంలో ఉన్నారంటే నాయకులంతా ఎంలాంటి పరిపాలన అందిస్తున్నారు అన్నది కళ్ళకు కట్టినట్టు మనకు తెలుస్తుంది. సంపదంతా తక్కువమంది

చేతుల్లోనే ఉందంటే సామాన్య ప్రజలకు అవసరమైన హక్కులు ఎలా అందుతాయి, దాన్ని సాధించాలంటే దాశరథి అభిప్రాయం ఐకమత్యం అనే ఆయుధాన్ని చేపట్టాలని భావించారు. అదే పై పాదాలలో ప్రతిధ్వనిం చేట్టు చేశారు దాశరథి.

రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్ ?
బుర్రలు బుర్రలు పగులక సమస్యకు లేదా సొల్యూషన్ ?
హింసా, యుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను
శాంతి ఒక్కటే మానవజాతికి సరియగు సాల్వేషన్.

రక్తం నదులై పారితేనైనా వచ్చేది రివల్యూషన్ అంటే విప్లవం? తలలు పగిలితేనైనా దొరికేది సమస్యకు సొల్యూషన్ అంటే పరిష్కారం? హింస, యుద్ధం పాత కాలంనాటివి. ఆ భావాలకు బూజు పట్టింది. కనుక మానవజాతికి ముక్తి శాంతిమాత్రమే ఎంత గొప్ప ఊహ ఆచరిస్తే ఆనందమే ఫలితం. ప్రతి సమస్యకు పరిష్కారాన్ని సూచించాలంటే తరాలకు తగ్గట్టుగా మార్గాన్ని అన్వేషిం చాలి. నూతన దారిని కనిపెట్టినప్పుడే నవీన ఆలోచనలు ముందుకు సాగుతాయి. పాత ఆలోచనలకు అభ్యుదయ మార్గాన్ని సాధించాలి. దేశ రాజకీయాలలో రావాల్సిన మార్పులు, అనన్యమైనవి. వాటిని రెవల్యూషన్తోనైనా సంపాదించాలని కాని సొల్యుషన్స్ హింసతోనూ, యుద్ధం తోనూ వచ్చినా దాని నష్టం అత్యధికం కాబట్టి శాంతి మాత్రమే మనుషులకు అవసరమైన సాల్వేషన్గా దాశరథి సూచించారు.

**ముగింపు:**

ఇది అధిక్షేపక, వ్యంగ్యాత్మక రచన. విమర్శ, కోరిక, ఊహ, ఆలోచన అన్నీ ఉన్నాయి. కనుకనే 'నేనంటాను' అన్న కవితా ఖండిక అన్నివిధాలా గొప్పదైనది. రాజ్యాధి కారంతో సంపదను సంపాధించాలన్న ఆలోచనలు రాజకీయాలలో ఎక్కువైనాయి. అధికారంతో అక్రమాలు, అరాచకాలు నిరంతరంగా, నిర్విరామంగా సాగించేందుకే రాజకీయాలుగా మారిపోయాయని కవి భావిస్తున్నారు. అందుకే కత్తిని కలంగా మార్చాలని, శాంతిని యుద్ధం లేకుండా సాధించాలని, ఐకమత్యమే బలంగా భావిం చాలని రాజకీయం ప్రజల బలంగా మారాలని కవి కోరు కుంటున్నారు. నాటినాటికి దేశపరిస్థితుల్లో మార్పు రావాలని ఆర్థికంగాను, సామాజికంగాను ప్రగతికి సాధనంగా రాజకీయాలు, నాయకులు మారాలి. ఛాందసిక భావజాలాన్ని సమాధిచేసి దేశపరిరక్షణలో భాగం – కావాలి. సంఘటితంగా ముందుకు సాగాలి. సమరంలేని సాయుధ పోరాటం సాగాలి. నిరంతరం పరిశ్రమిస్తూ ప్రజా చైతన్యం తేవాలి. సమర్థవంతమైన పరిపాలను ప్రజలకు అందించాలి. సమకాలీన పరిస్థితులకు అద్దంపట్టే ఈ కవిత ఎన్నటికి సమాధికాదు. నాయకులు, రాజకీయాలు మారేవరకు ఈ ఖండిక సజీవమై నిలిచేవుంటుంది. అభ్యుదయ భావజాలం కలిగిన దాశరథి పాలకులను పరిశీలించి మనకు అందించిన ఖండిక ఇది. అందుకే ఇది నిత్య నూతనత్వాన్ని సంతరించుకుంది. రాజకీయాలు అనవసరపు వాటిపై ఆసక్తి చూపుతూ కాలాన్ని వృథా చేయడం మంచిది కాదని కవి భావం. అభ్యుదయ మార్గాం కోసం పరితపించారు కవి. అజ్ఞానాన్ని వదలి విజ్ఞానం వైపుకు పయనించాలి మానవుని ప్రయాణం. దానికి అవసరమైన ఆలోచనలను విరామంలేకుండా ప్రయత్నించాలి. పరిస్థితులను అవగాహన చేసుకుంటూ మరమార్థాన్ని సాధించాలి. అదే దాశరథి అంతిమ లక్ష్యం.

"ఐకమత్యమే బలం బలం
అనంతశక్తి గళం గళం
మానవులకది వరం వరం
శాంతి సాధనకు ఫలం ఫలం"
"మనమందరం భారతీయులం భావితరాలకు సారధులం"

**ఆధార గ్రంథాలు:**

1. ఆలోచనాలోచనలు – దాశరథి
2. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు–తెలుగు అకాడమి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ప్రజాచైతన్య దీపిక – తెలుగు గీతిక

– డా. సి. చెన్నకేశవులు
తెలుగు అధ్యాపకులు,
పి.వి.కె.ఎన్.ప్రభుత్వ కళాశాల(స్వ), చిత్తూరు,
చరవాణి: 94943 68020

**సారాంశం :**

తెలుగు సాహిత్యంలో పాటకు ప్రత్యేకమైన స్థానం ఉంది. మానవుని భావోద్వేగాలను వ్యక్తపరచడంతో పాటు సమాజంలోని అసమానతలు, దోపిడీ, పేదరికం, నిరక్షరాస్యత, కులవివక్ష, లింగవివక్ష, సామాజిక రుగ్మతలు, రాజకీయ అన్యాయాలు వంటి వాటిని ప్రజల ముందుకు తీసుకురావడంలో పాట ప్రధాన పాత్ర పోషించింది. చదువుకున్నవారికి మాత్రమే పరిమితమైన సాహిత్య ప్రక్రియలకు భిన్నంగా పాట సాధారణ ప్రజలకు సులభంగా చేరుతుంది. అందువల్ల ప్రజాచైతన్యాన్ని కలిగించే శక్తివంతమైన సాధనంగా తెలుగుపాట పరిణమించింది. జానపదగేయాల నుంచి ఆధునికసాహిత్యంలోని జాతీయోద్యమ, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద, సినీగీతాల వరకు సామాజిక చైతన్య భావజాలం విస్తరించింది. ఈ వ్యాసం తెలుగుపాట సామాజిక నిర్మాణంలో పోషించిన పాత్రను పరిశీలిస్తుంది.

**కీలకపదాలు :** తెలుగుపాట, ప్రజాచైతన్యం, జాతీయోద్యమ గీతాలు, అభ్యుదయ గీతాలు, విప్లవ గీతాలు, దళిత గీతాలు, స్త్రీవాద గీతాలు, సినీ గీతాలు.

**పరిచయం :**

సాహిత్యం సమాజానికి దిక్సూచి. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రతిబింబించడమే కాకుండా, సమాజాన్ని మార్చే శక్తిని కూడా సాహిత్యం కలిగి ఉంటుంది. ఈ దృష్టిలో పరిశీలించినప్పుడు పాటకు మరింత ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తుంది.

పాటలో సంగీతం, పదం, భావం అనే మూడు అంశాలు సమన్వయమై ఉంటాయి. అందువల్ల పాట వినేవారి హృదయాన్ని త్వరగా చేరుతుంది. చదవలేని వ్యక్తి కూడా పాటను వినగలడు; పాడగలడు; తన అనుభవాలతో దానిని అనుసంధానించుకోగలడు. ఈ కారణంగానే సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి పాట ఒక శక్తివంతమైన మాధ్యమంగా ఉపకరించింది. తెలుగు సమాజంలో ప్రజల జీవనవిధానం, కష్టాలు, ఆశలు, ఆకాంక్షలు, నిరసనలు, పోరాటాలు సామాజికాంశాలు పాటల్లో ప్రతిబింబించాయి.

సమాజంలోని పరిస్థితుల పట్ల వ్యక్తులకు కలిగే అవగాహన, స్పందన, ప్రశ్నించే తత్వం, మార్పును కోరుకొనే భావన ఇవన్నీ ప్రజాచైతన్యాన్ని కలిగిస్తాయి. సమాజంలోని సమస్యలను గుర్తించడం మాత్రమే ప్రజాచైతన్యం కాదు. వాటి కారణాలను అర్థం చేసుకోవడం, వాటిని గురించి ఆలోచించడం, అవసరమైన మార్పు కోసం స్పందించడం కూడా ప్రజాచైతన్యంలో భాగమే. పాట ఈ చైతన్యాన్ని కలిగించడంలో ముఖ్య పాత్రను పోషిస్తుంది.

తెలుగుపాటకు సుదర్ఘీమైన చరిత్ర ఉంది. తెలుగు జానపద సంప్రదాయంలో పాట ప్రజలజీవితంలో అంతర్భాగంగా ఉంది. వీటిలో సామాన్య ప్రజలజీవితం అత్యంత సహజంగా ప్రతిబింబిస్తుంది. రైతులు, కూలీలు, మహిళలు, చేతివృత్తులవారు, గ్రామీణ ప్రజలు తమ సుఖదు:ఖాలను పాటల ద్వారా వ్యక్తం చేశారు. వ్యవసాయ పాటలు, పెళ్ళిపాటలు, జోలపాటలు, కోలాటపాటలు, వీరగాథలు మొదలైన వాటిద్వారా ప్రజలు తమ జీవన అనుభవాలను వ్యక్త పరచారు. కాలక్రమంలో పాట కేవలం వినోద సాధనంగా కాకుండా సామాజిక వ్యాఖ్యాన సాధనంగా, ప్రజాచైతన్య దీపికగా రూపాంతరం చెందింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తి గీతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. జాతీయోద్యమాన్ని పెంపొందించడంలోను, ప్రజాచైతన్యాన్ని కలిగించడంలోను దేశభక్తి గీతాలు ఎంతో ఉపకరించాయి. దేశం, మాతృభూమి, స్వాతంత్ర్యం, త్యాగం, ఐక్యత వంటి

భావాలను పాటలు ప్రజల్లో పెంపొందించాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో సభలు, ప్రదర్శనలు, ఊరేగింపుల్లో ప్రజలను ఏకం చేయడానికి పాటలు ఎంతగానో ఉపయుక్తమయ్యాయి.

జాతీయోద్యమకాలంలో "మేలుకొలుపు" పేరుతో ఒక ప్రబోధగీతం వెలువడింది.

"మేలుకొనుమీ భరతపుత్రుడ / మేలుకొనుమీ సుజనమిత్రుడ

మేలుకొనుమీ సచ్చరిత్రుడ / మేలుకొనవయ్యా! వత్సా! మేలుకో"

అనే పల్లవితో ప్రారంభమయ్యే ఈ పాటలో "వేడుకను జాతీయతాయను వేగుచుక్క పొడిచిందనీ, కూడి వందేమాతరంబని కుక్కుటములరచెన్" అనీ ప్రబోధించారు. "అందరూ ముందడుగు వేస్తుంటే పందవలె నిద్రపోవడం పాడికాదు" అనే హెచ్చరికతో పాటు "ధీరవరుడవు నీ స్వశక్తి తెలుసుకొనుమయ్య!" అంటూ కొండంత ఆత్మవిశ్వాసాన్ని తెలుగువారి గుండెల్లో ప్రతిధ్వనింపజేసిందీ గీతం.

దేశభక్తికి కొత్త నిర్వచనాన్ని, ఆంధ్రులకు అంతర్జాతీయ దృష్టిని అందించినది గురజాడ అప్పారావు గారి "దేశభక్తి" గీతం. భాషలోను, భావంలోను, రూపంలోను, వస్తువులోను, ఛందస్సులోను నూతనత్వానికి ఒరవడి దిద్దింది ఈ గీతం.

రాయప్రోలు సుబ్బారావు రాసిన "జన్మభూమి" గేయం జాతీయ భావాలతో, దేశాభిమాన స్ఫూర్తిని కలిగించింది.

దేవుపల్లి కృష్ణశాస్త్రిగారు రాసిన "జాతీయగీతం" సుప్రసిద్ధమైనది.

జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ, దివ్యదాత్రి / జయ జయ జయ శతసహస్ర నరనారీ హృదయనేత్రి

అంటూ "జయ దిశాంత గత శకుంత దివ్యగాన పరితోషణ, జయ గాయక వైతాళిక గళ విశాల పద వివరణ" అంటూ సాగే ఈ గీతం ఆనాడు ప్రార్థనాగీతమయ్యింది.

దామరాజు పుండరీకాక్షుడు

"శ్రీ గాంధీ నామం మరువాం మరువాం / సిద్ధము జైలుకు వెరువాం వెరువాం"

అంటూ లాఠీ దెబ్బలతో బెదరమని, మేటి తుపాకులతో చెదరమనీ, గాంధీజీ చూపిన మార్గంలో స్వరాజ్యాన్ని సాధిస్తామనీ వర్ణించారు.

జాతీయ గేయ కవిసార్వభౌమ గరిమెళ్ళ సత్యనారాయణగారి "మాకొద్దీ తెల్లదొరతనము" గీతం ఊరూరా వాడవాడలా ప్రజలగొంతుల్లో ప్రతి ధ్వనించింది. స్వాతంత్ర్య సమర శంఖారావంగా జానపద బాణీలో హృదయాలను తాకే రీతిలో గరిమెళ్ళ ఈ గీతాన్ని పాడుతుంటే ప్రజలు ఉర్రూతలూగేవారు. కుల మత భేదాలు కాల్చి వేయాలని, ప్రపంచంలో శాంతి దివ్వెల్ని మనదేశం వెలిగించాలని ఆశించిన శాంతికాముకుడు గరిమెళ్ళ.

త్రిపురనేని రామస్వామి చౌదరి సత్యాగ్ర హులను కీర్తిస్తూ

"వీరగంధము దెచ్చినారము / వీరుడెవ్వ డొ దెల్పుడీ

పూ సి పోదుము, మెడను వైతుము / పూలదండలు భక్తితో" అంటూ కవితా నీరాజనాలందించారు.

దేశభక్తి గీతాలు సహజోద్రేకంతో, భక్త్యావేశంతో వెలువడ్డాయి. ఇవి ప్రజాచైతన్యాన్ని ప్రజ్వలింపజేసి, జాతిని సమైక్యం చేశాయి.

చారిత్రాత్మక తెలంగాణ సాయుధపోరాటంలో ప్రజలను మమేకం చేయడంలో పాటలు ఇతోధికంగా తోడ్పడ్డాయి. నిజాం పాలనకు వ్యతిరేకంగా వెలువడిన గీతాల పరాకాష్ట "యాదగిరి" గానం చేసిన "నైజాము సర్కరోడా" గీతం.

"నైజాము సర్కరోడా / నాజీల మించినోడా

యమ బాధపెట్టిని కొడుకో / నైజాము సర్కరోడా `````

గోలకొండ ఖిల్లా కింద నీ / గోరి కడ్తం కొడుకో / నైజాము సర్కరోడా"

అని ప్రజల దృఢ సంకల్పాన్ని, సదాగ్రహాన్ని స్పష్టంచేసింది ఈ పాట.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


"ఓరి నిజాము పిశాచమా! కానరాదు / నిన్ను బోలినరాజు మాకెన్నడేమి

తీగెలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణ కోటిరతనాల వీణ"

అంటూ దిక్కులు పిక్కటిల్లేలా గర్జించాడు దాశరథి. సుద్దాల హనుమంతు, తిరునగరి రామాంజనేయులు వంటి వారు తమ పాటల ద్వారా ప్రజల్ని సంఘటిత పరిచారు.

సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా వెలువడిన అభ్యుదయ కవిత్వోద్యమంలో కూడా పాట ప్రధానభూమిక పోషించింది. శ్రీశ్రీ "మహాప్రస్థానం"లోని కవితలన్నీ గానయోగ్యంగా ఉన్నాయి. ఇవి వాస్తవికతను ప్రతిబింబిస్తూ శ్రామికజన పక్షం వహిస్తూ సామాజిక చైతన్యాన్ని కలిగించాయి.

దాశరథి రాసిన

"ఆ చల్లని సముద్ర గర్భం దాచిన / బడబానలమెంతో

ఆ నల్లని ఆకాశంలో కానరాని / భాస్కరులెందరో గీతంలో

ఒక రాజును గెలిపించుటకై / ఒరిగిన నరకంఠాలెన్నో

కులమతాల సుడిగుండాలకు / బలియైన పవిత్రులెందరో

అన్నార్తులు అనాథలుండని / ఆ నవయుగ మందెంతదూరం

కరువంటూ కాటకమంటూ / కనిపించని కాలాలెపుడో

శ్రమ జీవుల పచ్చినెత్తురులు /తాగని ధనవంతులెందరో" అంటూ అభ్యుదయాన్ని ఆకాంక్షించారు.

అభ్యుదయ భావజాలం బలపడిన ఈ కాలంలో పాట సామాజిక మార్పుకు మరింతగా దోహదపడింది. శ్రమజీవుల జీవితాలను, పేదల సమస్యలను, సామాజిక అసమానతలను, పెత్తందార్ల దోపిడీని ప్రశ్నించే పాటలెన్నో వెలువడ్డాయి. ఈ దశలో పాట లక్ష్యం కేవలం ఆనందాన్ని అందించడానికి పరిమితం కాకుండా ఆలోచింపజేయడం, ప్రశ్నించడం, చైతన్యపరచడంగా మారింది.

తెలుగు సాహిత్యంలో సామాజిక మార్పును బలంగా కోరుకొన్న మరో ధోరణి విప్లవగీతాలు. ప్రజా సమస్యలు, భూసమస్యలు, శ్రమ, దోపిడీ, సామాజిక అసమానతలు ఈ పాటల్లో ప్రధానంగా కనిపిస్తాయి.

"కొండలు పగలేసినం – బండలనూ పిండినం /

మానెత్తురె కంకరగా `ప్రాజెక్టులు గట్టినం / శ్రమ ఎవడిదిరో `సిరి ఎవడిదిరా"

సంపద సృష్టిస్తున్న కార్మికులకు దానిపై హక్కులేదు కానీ పెట్టుబడిదారీ వర్గం ఆ సంపదను అనుభవిస్తున్నదన్న ఆగ్రహం ఇందులో కనిపిస్తుంది. విప్లవ గీతాలు గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం పొందాయి. పాట ద్వారా సమస్యను ప్రజల అనుభవంతో అనుసంధానించడం విప్లవ గీతాల ప్రత్యేకత.

ఆధునిక సాహిత్యంలో సంఘసంస్కరణ కవిత్వంలోనే దళిత గీతాలు కనిపిస్తాయి.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి / అందారు ఒక్కటై ఉండాలి సక్కంగ

వర్ణాలు యెక్కువ పుట్టంగ లేదయ్య / మమ్మేల క్రిందికి క్రుమ్మేరు మానోరు"

అని ఆ కాలంలోనే అస్పృశ్యతను 'మాలవాండ్రపాట' నిరసించింది.

"మంచి చెడ్డలు మనుజులందున / యెంచి చూడగ రెండెకులములు

మంచి యన్నది మాలయైతే / మాలనే నగుదు నోయ్"

అని నొక్కివక్కాణించాడు గురజాడ అప్పారావు. దళిత గీతాలలో దళిత జీవితం, అవమానాలు, సామాజిక వివక్ష వంటి అంశాలు బలంగా వ్యక్తమయ్యాయి. ఈ గీతాలలో కేవలం బాధ మాత్రమే కాకుండా ప్రతిఘటన, ఆత్మగౌరవం, హక్కుల సాధనకు పోరాటం, ప్రజాచైతన్యం కూడా కనిపిస్తాయి.

సమాజంలో మహిళ స్థానం, ఆమెపై విధించే ఆంక్షలు, కుటుంబ వ్యవస్థలోని అసమానతలు, విద్య, స్వేచ్ఛ వంటి తెలుగు పాటల్లో వ్యక్తమయ్యాయి. గురజాడ అప్పారావు రాసిన 'పూర్ణమ్మ' గేయం స్త్రీ జీవితంలోని విషాదాన్ని, బాల్యవివాహం, కన్యాశుల్కం వంటి సాంఘికదురాచారాల ప్రభావాన్ని ప్రతిబింబించింది.

"కాసుకులోనై తల్లీతండ్రీ / నెనరూ న్యాయం విడనాడి

పుత్తడి బొమ్మా పూర్ణమ్మ నొక / ముదుసలి మొగుడికి ముడివేస్రీ"

"ఆటపాటల తోటికన్నియలు / మొగుడు తాతయని కేలించ

ఆటల పాటల కలయక / పూర్ణమ దుర్గను జేరి దు:ఖించె"

బాల్యవివాహం, స్వేచ్ఛారాహిత్యం, పితృస్వామ్య ఆధిపత్యం వంటి అంశాలు పూర్ణమ్మ గేయంలో చిత్రించబడ్డాయి. స్త్రీ విముక్తి, స్త్రీ స్వాతంత్ర్యం, సమానత్వం వంటి స్త్రీవాద చైతన్య బీజాలు ఈ గేయంలో స్పష్టంగా కనిపిస్తాయి. పూర్ణమ్మ ఆత్మార్పణం శ్రోతల్ని కదిలింపజేస్తుంది.

"పుణ్యభూమిలో పూసిన ఓపువ్వా / విరిసీ విరియని ఓ చిరునవ్వా

పారాణింకా ఆరనేలేదు / తోరణాలు కళ వాడనేలేదు

పెళ్ళి పందిరి తీయనేలేదు / అప్పగింతలు అవ్వనేలేదు / వరకట్నానికి బలి అయ్యావా"

అనే గీతం కూడా స్త్రీలపై జరుగుతున్న దుర్మార్గాలను వ్యక్తీకరించింది. వరకట్నం, బాల్యవివాహం, గృహహింస, విద్య, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలు స్త్రీ చైతన్య గీతాలకు వస్తువులయ్యాయి. స్త్రీని కేవలం భార్యగా, తల్లిగా, కుమార్తెగా మాత్రమే కాకుండా స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మనిషిగా చూడాలనే భావన స్త్రీవాద గీతాలలో వ్యక్తమవుతుంది.

సమాజంపై సినిమాలు విశేషప్రభావాన్ని కలిగిస్తాయి. సినిమా పాటల్లో ప్రేమ, ప్రకృతి, కుటుంబం వంటి అంశాలతోపాటు సామాజిక సందేశం, ప్రజాచైతన్యం కూడా వ్యక్తమయ్యాయి.

ఆకలి రాజ్యం సినిమాలో

"సాపాటు ఎటూ లేదు /పాటైనా పాడు బ్రదర్

రాజధాని నగరంలో / వీధి వీధి నీది నాదే బ్రదర్

స్వతంత్ర దేశంలో / చావు కూడా పెళ్ళి లాంటిదే బ్రదర్"

పాట నిరుద్యోగ సమస్యను, పేదరికాన్ని చిత్రించింది.

'గాయం' సినిమాలో

"నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని / అగ్గితోటికడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని

మారదు లోకం మారదు కాలం / దేవుడు దిగిరానీ ఎవ్వరు ఏమైపోనీ

మారదు లోకం మారదు కాలం"

పాట ప్రజాచైతన్య గీతానికి ప్రతీక. సినిమా పాటలకు పెద్ద సంఖ్యలో శ్రోతలు ఉంటారు. ఈ జనాదరణ కారణంగా సామాజిక సందేశం విస్తృతంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. తద్వారా ప్రజాచైతన్యాన్ని ప్రాదుకొల్పడానికి సినిమా పాటలు ఇతోధికంగా ఉపకరిస్తాయి.

తెలుగుపాట తెలుగు ప్రజల జీవితంలో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంది. జానపదుల నోట పుట్టిన పాట నుంచి ఆధునిక డిజిటల్ వేదికలపై వినిపిస్తున్న పాట వరకు దాని పరిణామం సమాజ పరిణామంతో ముడిపడి ఉంది. పాట ప్రజల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. సమస్యలను వెల్లడిస్తుంది. అన్యాయాలను ప్రశ్నిస్తుంది. ఆలోచనలను రేకెత్తిస్తుంది. మానవతా విలువలను పెంపొందిస్తుంది. సమానత్వ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

భావనను బలపరుస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో సంఘసంస్కరణ, జాతీయోద్యమం, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద గేయాలతోపాటు సినీగీతాలు సైతం ప్రజాచైతన్యానికి వాహకాలుగా నిలిచాయి. ఈ కారణంగా తెలుగుపాట కేవలం వినోదసాధనంగా మాత్రమే కాకుండా సమాజాన్ని ప్రతిబింబించే, ప్రశ్నించే చైతన్య సాధనంగా కూడా నిలిచింది.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగులో కవిత్వోద్యమం – తెలుగు అకాడమి, హైదరాబాదు.
2. తెలుగులో ఉద్యమగీతాలు – డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ అభ్యుద రచయితల సంఘం, హైదరాబాద్.
3. మహాప్రస్థానం – శ్రీశ్రీ, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ.
4. ముత్యాల సరాలు – గురజాడ అప్పారావు, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ.
5. ఆంధ్ర సాహిత్య చరిత్ర – దివాకర్ల వెంకటావధాని, జి.వి.సుబ్బరామిరెడ్డి, తెలుగు అకాడమి, హైదరాబాదు.
6. దళిత సాహిత్యం – తాత్విక దృక్పథం – జి.లక్ష్మీనరసయ్య, దళిత సాహిత్య ప్రచురణ.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# నూతన కవితా రూపం 'కైతికాలు' – స్వరూప స్వభావాలు, సామాజిక దృక్పథం: సమగ్ర పరిశీలన

– సందుపట్ల మధు
సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం
పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),
హనుమకొండ, తెలంగాణ
ఈమెయిల్: smadhu970@gmail.com

**పరిశోధనా సంగ్రహం:**

తెలుగు కవితా వికాసంలో ప్రక్రియా పరమైన ప్రయోగాలు నిరంతరం సాగుతూనే ఉన్నాయి. ప్రాచీన ఛందోబద్ధ మార్గాల నుంచి వచన కవిత్వం, మినీ కవిత, హైకూ, నానీలు, గజల్, రుబాయీల వంటి లఘు రూపాల బాటలో సమకాలీన కాలంలో ఉద్భవించిన విలక్షణ సృష్టి 'కైతికాలు'. 2018 అక్టోబరులో కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన కవి గోస్కుల రమేశ్ రూపొందించిన ఈ రూపం అనతికాలంలోనే విస్తృత పాఠకాదరణ చూరగొంది. ఆరు పాదాల విలక్షణ నిర్మాణం, మాత్రల నియమం, అంత్యానుప్రాస సౌందర్యం, ఐదో పాదపు మకుట విరుపు, ఆరో పాదపు కొసమెరుపులతో కైతికాలు సరికొత్త కావ్య శిల్పాన్ని సంతరించుకున్నాయి. ఈ పరిశోధనా వ్యాసం కైతిక ప్రక్రియ ఆవిర్భావ నేపథ్యం, ఛందో-శిల్ప లక్షణాలు, సామాజిక-రాజకీయ చైతన్యం, తాత్త్వికత మరియు కొలాం గిరిజన జీవన చిత్రీకరణ (ఆత్రం మోతీరామ్ 'దండారి' ప్రత్యేక పరిశీలన) వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషిస్తుంది.

**కీలక పదాలు:** కైతికాలు, గోస్కుల రమేశ్, లఘు కవితా రూపాలు, మాత్ర ఛందస్సు, సామాజిక చైతన్యం, దండారి, కొలాం గిరిజనులు, ప్రపంచ రికార్డు.

## 1. ఉపోద్ఘాతం

సాహిత్యం సమాజ గమనానికి అద్దం పడుతుంది. మారుతున్న కాలం, ఆధునిక మానవుని తీరికలేని జీవనశైలి సాహిత్య ప్రక్రియలలో సంక్షిప్తతను, గాఢతను అనివార్యం చేశాయి. దీర్ఘ కావ్యాల స్థానంలో భావ సాంద్రత కలిగిన లఘు కవితారూపాలు నేడు అత్యంత ప్రజాదరణ పొందుతున్నాయి. తెలుగు సాహిత్యంలో హైకూలు, నానీలు, రెక్కలు వంటి లఘు కవితా ప్రక్రియలు కొనసాగుతున్న నేపథ్యంలో, తెలుగుదనపు సొగసుతో, సరళ మాత్ర ఛందోబద్ధమైన నియమాలతో ఉద్భవించిన నూతన ప్రక్రియే 'కైతికాలు'. భాషా సాహిత్యాల పురోగమనానికి సృజనాత్మకతతో కూడిన మార్పు అత్యంత ఆవశ్యకం. ఆ మార్పు భాష మౌలిక సౌందర్యాన్ని కాపాడుతూనే ఆధునిక ఆలోచనలకు వాహికగా నిలవాలి. ఆ కోవలోనే కైతికాలు ప్రస్తుత సమాజానికి అర్థమయ్యే సరళ రీతిలో, చమత్కార మెరుపులతో, ఆలోచనాత్మక ముగింపులతో సాహితీ రంగంలో సరికొత్త సంచలనాన్ని సృష్టించాయి.

## 2. కైతికాల ఆవిర్భావం – చారిత్రక నేపథ్యం

కైతిక కవితా రూపానికి మూలకర్త కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నివాసి అయిన ప్రముఖ కవి గోస్కుల రమేశ్. 2018 అక్టోబర్ నెలలో ఆయన ఈ నూతన కవితా ప్రక్రియకు బీజం వేశారు. లఘు కవితారూపాలలో అంతగా కానరాని ఒక నిర్దిష్ట లయ, అంత్యానుప్రాసల జిగి, కొసమెరుపు వ్యంగ్య బాణాన్ని జోడించి కైతిక రూపాన్ని ఆయన తీర్చిదిద్దారు. ప్రక్రియ ప్రారంభమైన అనతికాలంలోనే దాదాపు రెండు వందల మందికి పైగా కవులు, కవయిత్రులు దీనిని స్వీకరించి రచనలు చేయడం ఒక విశేష పరిణామం.

సాహిత్య చరిత్రలో ఏ కొత్త రూపం వచ్చినా ప్రారంభ దశలో సహజంగానే చర్చోపచర్చలు, సంయమనం ఎదురవుతాయి. కైతిక రూపంపై కూడా తొలినాళ్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, రచయితల నిరంతర సాధన, వస్తు నవ్యత, పాఠకుల హృదయాలను

కదిలించిన విధానం ఈ ప్రక్రియను స్థిరపరిచాయి. కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే యాభైకి పైగా కైతిక కవితా సంకలనాలు ముద్రణకు నోచుకుని, లండన్ కేంద్రంగా పనిచేసే ప్రఖ్యాత 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ ద్వారా ప్రపంచ రికార్డుల్లో నమోదు కావడం ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలోనే అపూర్వ ఘట్టం.

### 3. కైతిక నిర్మాణ శిల్పం – ఛందో నియమాలు

కైతికం కేవలం స్వేచ్ఛా వచనం కాదు; అలాగని క్లిష్టమైన వృత్త ఛందస్సుల సంకెళ్లూ కావు. సామాన్య పాఠకుడికి సైతం లయబద్ధంగా వినిపించే మాత్రల పరిమితి దీని సొంతం. కైతిక ప్రక్రియకు నిర్దేశించిన మౌలిక నిర్మాణ నియమాలు క్రింది విధంగా ఉంటాయి:

- **పాదాల సంఖ్య:** కైతికం ఖచ్చితంగా ఆరు పాదాల సంక్షిప్త నిర్మాణాన్ని కలిగి ఉంటుంది.
- **మాత్రా నియమం (1 నుండి 4 పాదాలు):** మొదటి నాలుగు పాదాలలో ప్రతి పాదంలోనూ తొమ్మిది నుండి పన్నెండు మాత్రల పరిమితి ఉండాలి. ఇది కవితకు నడకను, సంగీతాత్మక లయను చేకూరుస్తుంది.
- **అంత్యానుప్రాస విధి:** రెండవ మరియు నాల్గవ పాదాల చివర అంత్యానుప్రాస తప్పనిసరిగా కుదరాలి. ఇది శ్రవణ సుభగత్వాన్ని పెంచుతుంది.
- **మకుట ప్రయోగం (5వ పాదం):** ఐదవ పాదంలో ప్రధానంగా 'వారెవ్వా' లేదా పై నాలుగు పాదాలలోని భావాన్ని బలపరిచే మకుటం లేదా కీలక పదం ప్రయోగించబడుతుంది.
- **కొసమెరుపు లేదా జాతీయం (6వ పాదం):** ఆరవ పాదంలో కవితాత్మక వాక్యం, సరికొత్త పదబంధం లేదా జాతీయం కొసమెరుపుగా నిలిచి పాఠకుడి ఆలోచనను తట్టిలేపుతుంది.
- **ఐదు, ఆరు పాదాల సౌలభ్యం:** ఐదు, ఆరు పాదాలకు కఠినమైన మాత్రా ఛందస్సు నియమం వర్తించదు. కానీ భావ సమతౌల్యం కోసం సమతూకమైన అక్షరాల నిడివి ఉండాలి; దీర్ఘ వాక్యాలుగా విస్తరించకూడదు.

ఈ నియమాల అమరిక వల్ల కైతికం చదివినప్పుడు మొదటి నాలుగు పాదాలు నేపథ్యాన్ని నిర్మిస్తే, ఐదవ పాదం ఆశ్చర్యాన్ని లేదా అంగీకారాన్ని వ్యక్తపరుస్తుంది; ఆరవ పాదం మెరుపులాంటి భావ చమత్కారంతో ముగుస్తుంది.

### 4. కైతికాల్లో కవితా సౌందర్యం – వస్తు వైవిధ్యం

కైతికాలు కేవలం అనుభూతి కవిత్వానికే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ, తాత్త్విక, కుటుంబ సంబంధాలు, ప్రకృతి సౌందర్యం తదితర విభిన్న కోణాలను స్పృశించాయి. కొన్ని ప్రాతినిధ్య కైతికాలను పరిశీలిస్తే వాటి శిల్ప సౌందర్యం స్పష్టమవుతుంది:

**అ) కవి అంతరంగం – సామాజిక నిబద్ధత:** కవి సామాజిక బాధ్యతను, సృజనాత్మకతను ఆవిష్కరిస్తూ కైతిక సృష్టికర్త గోస్కుల రమేశ్ గారు చిత్రించిన తీరు:

లోకాన్ని చూసొచ్చి  
కాగితముల మలిపిస్తడు  
కవనంలో దిగుతడు  
మర్మం విప్పేస్తడు  
**వారెవ్వా వీరుడు**  
**కలం నడుపు ధీరుడు** – గోస్కుల రమేశ్ ('చీకట్లో చిరుదివ్వెలు')

కవి సమాజాన్ని లోతుగా పరిశీలించి, సత్యాలను నిగ్గుతేల్చి కాగితంపై కవనంగా మలిచే క్రమాన్ని ఇందులో అత్యంత సూటిగా, గౌరవప్రదంగా ప్రకటించారు.

**ఆ) తాత్త్విక వివేకం – జీవిత సత్యాలు:** కష్టాలు ఎదురైనప్పుడు అధైర్యపడకుండా జీవితాన్ని ఎలా స్వీకరించాలో గుడిపూడి రాధికారాణి గారు అద్భుతంగా తెలియజేశారు:

ఎండలోన ఎండినాక
నుయ్యి తవ్వుటెంత తప్పు
ఎదురు దెబ్బ తగిలినాక
నేల చూచుటెంత తప్పు
**వారెవ్వా జీవితం**
**బోలెడంత అనుభవం** – గుడిపూడి రాధికారాణి ('జీవిత సత్యాలు')

ముందుచూపు లేని నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూనే, ఎదురయ్యే ప్రతి ఆటంకం జీవితంలో ఒక గుణపాఠమని, అనుభవమే గొప్ప పాఠశాల అని ప్రబోధించడం ఈ కైతిక విశిష్టత.

**ఇ) స్త్రీవాద స్పృహ – మానవ సంబంధాలు:** మహిళా శక్తిని, సమాజంలో స్త్రీ పాత్రను మార విజయలక్ష్మి గారు పొందుపరిచిన విధానం:

తల్లిగాను ఆమె
అర్థాంగి ఆమె
కూతురుగా ఆమె
లేకుంటే ఆమే
**వారెవ్వా ఆమె**
**అంతా శూన్యమే** – మార విజయలక్ష్మి ('వెన్నెల వన్నెలు')

కుటుంబంలో, సృష్టిలో స్త్రీ లేకపోతే శూన్యమే మిగులుతుందనే వాస్తవాన్ని అక్షరాల్లో అత్యంత గాఢంగా నింపారు.

**ఈ) సాహిత్య ప్రశంస:** కవిత్వ ప్రాధాన్యతను మంచికట్ల శ్రీనివాస్ గారు విశిష్టంగా వర్ణించారు:

కవిత్వమొక వాగు చెలిమె
కావ్యమొక జీవనది
సాహిత్యం సప్త నదుల
సంగమాల అంబుధి
**వారెవ్వా ప్రవాహం**
**కట్టలు తెంచు ఉత్సాహం** – *మంచికట్ల శ్రీనివాస్ ('మెరుపులు')*

**ఉ) సమకాలీన రాజకీయ వ్యంగ్యం:** సమకాలీన రాజకీయాలపై ప్రజాక్షేత్ర విమర్శను సంధిస్తూ మంచికట్ల భాస్కర్ సంధించిన కైతిక శరం:

చెప్తారు నీతులు
తీస్తారు గోతులు
నిజమేదో తెలియని
అమాయక ప్రజలు
**వారెవ్వా నేతలవి**
**నేటికీ మారని వెతలు** – *మంచికట్ల భాస్కర్ ('నడిచే నక్షత్రాలు')*

**ఊ) పర్యావరణ స్పృహ – గ్రామీణ సంస్కృతి:** గ్రామీణ జీవనం, మూగజీవులతో మానవ అనుబంధాన్ని ఎం.వి. ఉమాదేవి గారు చిత్రీకరించిన తీరు:

వరండాలో వరికంకులు
వేలాడ గట్టగానూ
పిచ్చికమ్మలు పొద్దున్నే
ఊయలలూగి తినునూ
**వారెవ్వా నాటి ఇల్లు**
**మూగజీవుల స్నేహితులు** – *యం.వి. ఉమాదేవి ('జేగంటలు')*

### 5. గిరిజన జీవన దర్పణం – ఆత్రం మోతీరామ్ 'దండారి' ప్రత్యేక పరిశీలన

ఈ పరిశోధనలోని అత్యంత కీలకమైన, ప్రత్యేకమైన అంశం – ఆదివాసీల జీవన చిత్రీకరణలో కైతిక ప్రక్రియ పోషించిన పాత్ర. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాచీన తెగ అయిన కొలాం గిరిజన జాతి జీవన విధానంపై తెలుగు సాహిత్యంలో వెలువడిన తొలి కవితా గ్రంథం ఆత్రం మోతీరామ్ రాసిన 'దండారి'. కొలాం గిరిజనుల ఆచారాలు, కట్టుబాట్లు, పండుగలు, సాంస్కృతిక విశేషాలను కైతిక రూపంలో తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేసిన మొదటి ఆదివాసీ కవిగా ఆత్రం మోతీరామ్ చరిత్రకెక్కారు.

కొలాం తెగ స్త్రీల సంప్రదాయ పచ్చబొట్టు సౌందర్యాన్ని వర్ణిస్తూ మోతీరామ్ రాసిన కైతికం విశేషమైనది:

పదేళ్ల వయసులో
పచ్చబొట్టు అలంకారం
కొలాం సాంప్రదాయం
చూడచక్కని సింగారం
**చంద్రబింబ మొఖానికి**
**ఇంద్రజాలమై వెలిగే** – *ఆత్రం మోతీరామ్ ('దండారి')*

ఆదివాసీల విశిష్ట నృత్యం, సాంస్కృతిక వేడుక అయిన 'దండారి' ఉత్సవ నేపథ్యాన్ని, వారి సంస్కృతీ వైభవాన్ని ఆధునిక లఘు కవితా ప్రక్రియలో ఒదిగించి చెప్పడం ద్వారా కైతిక ప్రక్రియ ప్రాంతీయ, జాతి సరిహద్దులను దాటి విశాల సామాజిక పార్శ్వాలను ఎలా తనలో ఇముడ్చుకుందో నిరూపితమవుతుంది.

### 6. కైతిక ప్రక్రియపై సాహితీ విమర్శకుల దృక్పథం

కైతిక ప్రక్రియ కేవలం కవులకే కాకుండా ప్రముఖ పరిశోధకులు, విమర్శకుల దృష్టినీ విశేషంగా ఆకర్షించింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. దార్ల వెంకటేశ్వరరావు, ప్రముఖ విమర్శకులు డా. మచ్చ హరిదాసు, రావుల రాజేషం, పరవస్తు విష్వక్సేన, బండారి సునీత, మూర్తి శ్రీదేవి, స్తంభంకాడి గంగాధర్ వంటి విద్వాంసులు వివిధ దినపత్రికలు మరియు సాహిత్య పత్రికలలో కైతిక రూప సౌందర్యంపై లోతైన విశ్లేషణలు వెలువరించారు. సరళమైన తెలుగు జాతీయాలు, లోకోక్తులు, గ్రామీణ పలుకుబడులతో సాగే ఈ రూపం తెలుగు భాషా పరిరక్షణకు, యువతరంలో సాహిత్య జిజ్ఞాసను పెంచడానికి ఒక ఉత్తమ మాధ్యమమని విమర్శకులు ముక్తకంఠంతో కొనియాడారు.

### 7. ముగింపు

తెలుగు కవితా రంగంలో ఉదయించిన 'కైతికాలు' నేడు లఘు కవితా ప్రక్రియల సరసన సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. భాషలో నవ్యత, భావంలో గాఢత, నిర్మాణంలో క్రమశిక్షణ, ముగింపులో కొసమెరుపుల మేళవింపు కైతికాలను విజయవంతమైన ప్రక్రియగా నిలబెట్టాయి. సామాజిక రుగ్మతలను ఎండగట్టడంలోనూ, మానవీయ విలువలను ప్రబోధించడంలోనూ, చివరకు అట్టడుగు గిరిజన తెగల సాంస్కృతిక మూలాలను అక్షరబద్ధం చేయడంలోనూ కైతికాలు సఫలీకృతమయ్యాయి. అనతికాలంలోనే ప్రపంచ రికార్డులను

సాధించి, విద్యార్థుల నుంచి సీనియర్ కవుల దాకా వేలాది మందిని కలంపట్టేలా చేసిన కైతిక ప్రక్రియ ఆధునిక తెలుగు సాహిత్య వికాసంలో నిస్సందేహంగా ఒక మైలురాయి.

**8. ఉపయుక్త గ్రంథ సూచి**


**[1]** గోస్కుల రమేశ్ (2018), చీకట్లో చిరుదివ్వెలు, కైతిక కవితా సంకలనం, హుజురాబాద్.

**[2]** గోస్కుల రమేశ్ (2019), కైతికాలు సంకలనం (ప్రపంచ రికార్డుల ప్రత్యేక సంచిక).

**[3]** ఆత్రం మోతీరామ్ (2019), దండారి (కొలాం గిరిజన జీవన కైతికాలు), ఆదిలాబాద్.

**[4]** గుడిపూడి రాధికారాణి (2019), జీవిత సత్యాలు (కైతికాలు).

**[5]** మార విజయలక్ష్మి (2019), వెన్నెల వన్నెలు (కైతిక సంపుటి).

**[6]** మంచికట్ల శ్రీనివాస్ (2019), కైతికాల మెరుపులు, సాహిత్య ప్రచురణలు.

**[7]** మంచికట్ల భాస్కర్ (2019), నడిచే నక్షత్రాలు, కరీంనగర్.

**[8]** తాళ్ళ సత్యనారాయణ (2019), సామాజిక సుమాలు, వరంగల్.

**[9]** డాక్టర్ వి. జలంధర్ (2019), ఉదయ కిరణాలు (కైతికాలు).

**[10]** డాక్టర్ దివిటీ అంజనీ దేవి (2020), కాంతి కిరణాలు, హైదరాబాద్.

**[11]** యం.వి. ఉమాదేవి (2019), జేగంటలు, కైతిక కవితా సంపుటి.

**[12]** కడారి దశరథం (2019), కైతిక క్షేత్రం, సాహితీ సమితి.

**[13]** డా. దార్ల వెంకటేశ్వరరావు (2019), 'కైతిక ప్రక్రియ – సాహిత్య పరిమళం', అభిప్రాయ మాలిక విశ్లేషణ వ్యాసం.

**[14]** డా. మచ్చ హరిదాసు (2020), 'కైతికాల్లో లయ – భావ గాఢత', సాహిత్య విమర్శనా పత్రం.

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


## గిరిజనుల జీవన చిత్రణ


– శ్రీ యమ్. శ్రీనివాస ప్రసాద్

తెలుగు అధ్యాపకులు

సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డీగ్రీ మహిళా కళాశాల

కంచికచర్ల, ఎన్టీఆర్ జిల్లా

+918897619148

smaddala71@gmail.com


**ఉపోద్ఘాతం:**

భారతీయసమాజంలో అత్యంత ప్రాచీనమైన, వైవిధ్యభరితమైన జీవన స్రవంతి గిరిజనులది. గిరిజనులు అంటే కొండలు,కోనలు,అడవులలో నివసించే ప్రకృతి పుత్రులు వీరికి 'ఆదివాసులు' వన్యవాసులు, ;అరణ్యవాసులు;అని అనేక పేర్లు వున్నాయి. నాగరిక సమాజానికి దూరంగా,ప్రకృతితో మమేకమై జీవించే గిరిజనుల జీవన విధానం వారి ఆచార వ్యవహారాలు, నమ్మకాలు ఒక విశిష్టమైన సంస్కృతిని సంతరించుకున్నాయి. గిరిజన సాహిత్యం, సంస్కృతి మరియు సామాజిక పరివర్తనం అనే అంశం భారతీయ సమాజంలో అత్యంత కీలమమైనది. భారతదేశంలో ఆదిమ తెగలు లేదా గిరిజనులు సమాజానికి మూలస్తంభాలు. ఆధునికత వైపు పయనిస్తున్నప్రస్తుత తరుణంలో వారి సాహిత్యం, సంస్కృతి మరియు వారు ఎదుర్కొంటున్న సామాజిక మార్పులపై ఉపోద్ఘాతం.

**1. గిరిజనులు పరిచయం:**

భారతదేశంలో అనేక భాషలు, జాతులు, మతాలు, ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాలు, జీవన విధానాలతో కూడిన వైవిధ్యభరితమైన దేశం. ఈ విధానంలో గిరిజన సమాజాలకు ప్రత్యేకమైన స్థానం వుంది. అడవులు, కొండలు,కొనాలు,నదులు,ప్రకృతి వనరులతో సహజీవనం చేస్తూ శతాబ్ధాలుగా తమదైన జీవన విధానాన్ని కొనసాగిస్తున్న గిరిజన సమూహాలు భారతీయ సంస్కృతికి విలువైన సంపదను అందించాయి

**2. గిరిజన సాహిత్యం స్వరూప స్వభావాలు:**

గిరిజనుల జీవన అనుభావాలు,ఆలోచనలు,భావోద్వేగాలు, సామాజిక పరిస్థితులు ప్రకృతితో వారి సంబంధం,ఆచార వ్యవహారాలు,పోరాటాలు మొదలైన ప్రతిబింబించే గిరిజన సాహిత్యాని గిరిజన సాహిత్యం అని చెప్పవచ్చు. ప్రధానంగా మౌఖిక సాహిత్యం. రాతపూర్వకంగా సాహిత్యం విస్తరించకముందే గిరిజన సమాజాల్లో కథలు, గేయాలు, పురణగాథలు, సామెతలు, పొడుపుకథలు, వీరగాథలు,పాటల రూపంలో తరతరాలకు అందాయి. ఒక తరం చెప్పిన కథను తరువాత తరం గుర్తుంచుకుని అందిచడం ద్వారా వారి సాహిత్యంజీవించివుంది.అందువల్లగిరిజనసాహిత్యంపుస్తకాలలోమాత్రమేకాకుండావారిజీవితంలో,వారిపాటలో,నృత్యంలో,పండుగలో వారి జ్ఞాపకాలలో వుంటుంది.

**3.గిరిజన జానపద గేయాలు:**

గిరిజన సాహిత్యంలో పాటకు అత్యంత ప్రాధాన్యం వుంది. వ్యవసాయం,వేట,పండుగలు,వివాహాలు, ప్రకృతి,ప్రేమ,వీరత్వం,సామాజిక సంఘటనలు మొదలైన అంశాలు వారి పాటలో కనిపిస్తాయి. వీరి పాటలు ప్రకృతితో ముడిపడి వుంటాయి. వర్షం కోసం, పంటల కొత్త సమయాలలో,పండుగలో పాడే పాటలు వీరి జీవితాన్ని ప్రతిబింబిస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**4. కథలు మరియు పురాణాలు:**

విశ్వం ఎలా పుట్టింది, తమ తెగ ఎలా ఏర్పడింది వంటి అంశాలపై అనేక కథలు ప్రచారంలో వున్నాయి. ఇవి వారి నైతిక విలువలను కాపాడతాయి. విటి ద్వారా తమ సమూహం యొక్క ఉనికి, చరిత్ర,సంప్రదాయాలను తరువాత తరాలకు తెలియజేస్తాయి.

**5. సామెతలు,పొడుపుకథలు:**

గిరిజన ససమెతలో వారి అనుభవజ్ఞానం కనిపిస్తుంది. ప్రకృతి,వ్యవసాయం,జీవన విధానం, కుటుంబ సంబంధాలు, సామాజిక ప్రవర్తన మొదలైన వాటిపై వారి పరిశీలన సామెతల రూపంలో వ్యక్తమవుతాయి.

**6. ఆధునిక గిరిజన రచనలు:**

విద్యవకాశాలు పెరగడం, ముద్రణారంగం అభివృద్ధి చెందడం, ఉన్నత విద్య అందుబాటులోకి రావడం వల్ల గిరిజన సమాజానికి చెందిన రచయితలు తమ అనుభవాలను కథలు, కవితలు,వ్యాసాలు,ఆత్మకథలు వంటి రూపాలలో వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఆధునిక రచనలో అస్తిత్వం,భూమి,అడవి,హక్కులు,విద్య,సామాజిక వివక్ష, రాజకీయ చైతన్యం,సాంస్కృతిక పరిరక్షణ వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

**7. గిరిజన సాహిత్యంలోని గేయాలు:**

గిరిజన సాహిత్యంలో పాటలకు అత్యంత ప్రాధాన్యం వుంది. గిరిజన సమాజాలలో పాటలు వారి దైనందిన జీవితం, పండుగలు, వ్యవసాయం, ప్రకృతి, ప్రేమ వివాహం, సామాజిక సంబంధాలు, పోరాటాలను వ్యక్తపరుస్తాయి.

పాటల ప్రధాన రకాలు

- ❖ పంటల పండుగ పాటలు
- ❖ వివాహ గేయాలు
- ❖ శ్రమ గేయాలు
- ❖ ప్రకృతి గేయాలు
- ❖ వీరగాథా గేయాలు
- ❖ ఆచార, పూజా సంబంధిత పాటలు

గిరిజన పండుగలు వారి వ్యవసాయ జీవనంతో,ప్రకృతితో,పూర్వీకుల ఆరాధనతో ముడుపడి వుంటాయి. పండుగల సందర్భంగా పాటలు పాడటం,నృత్యాలు చేయడం,సామూహికంగా ఆచారాలు నిర్వహిచడం ద్వారా సామాజిక ఐక్యత పెరుగుతుంది.

**8. నృత్యాలు:**

గిరిజన నృత్యాల్లో సమూహికత ప్రధాన లక్షణం. వ్యక్తిగత ప్రదర్శనకంటే సమూహంగా పాల్గొనడం ఎక్కువగా కనిపిస్తుంది. వారి నృత్యాలు పండుగలు,వివాహాలు,సామాజిక కార్యక్రమాలతో ముడుపడి వుంటాయి.

**9. వస్త్రధారణ, ఆభరణాలు:**

గిరిజనుల వస్త్రధారణ, ఆభరణాలు కూడా వారి సంస్కృతిక గుర్తింపును తెలియజేస్తాయి. స్థానికంగా లభించే పదార్ధాలతో తయారయ్యే ఆభరణాలు వారి కళామాత్మక నైపుణ్యానికి నిదర్శనాలు.

**10. గిరిజన సాహిత్యంలో ప్రకృతి:**

గిరిజన సాహిత్యంలో ప్రకృతికి మరియు మానవజీవితానికి విడదీయరాని ఆవినవభావ సంబంధం వుంది. అడవి వారి జీవితానికి ఆధారం,చెట్లు వారికి ఆహారం,ఔషధం,నివాసానికి అవసరమైన పదార్ధాలను అందిస్తాయి. నదులు,వాగులు వారి జీవనానికి ఆధారం. జంతువులు, పక్షులు వారి కథల్లో భాగమవుతాయి. అందువల్ల గిరిజన సాహిత్యంలో ప్రకృతి వర్ణనకు ప్రత్యేక స్థానం వుంది.

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


### 11. గిరిజన సాహిత్యంలో అస్తిత్వ చైతన్యం:

ప్రతి సమాజానికి తన భాష,సంస్కృతి,భూమి,సంప్రదాయాలు, చరిత్ర,సామూహిక జ్ఞాపకాలు అస్తిత్వానికి పునాదులు. గిరిజన సమాజం ఆధునికీకరణ ప్రభావంతో అనేక మార్పులు ఎదుర్కొంటోంది. ఆడవులపై ఆధారపడిన జీవన విధానం మారడం,ఉపాధి అవకాశాల్లో మార్పులు, పట్టణీకరణ,విద్య విస్తరణ,ఇతర సామాజిక సమూహాలతో సంబంధాలు పెరగడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.

### 12. సామాజిక పరివర్తన:

సమాజం స్థిరంగా ఉండదు. కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. ఈ మార్పునే  సామాజిక పరివర్తన. గిరిజన సమాజంలో కూడా విద్య,ఆరోగ్యం,రవాణా,సమాచార సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు,ఉపాధి అవకాశాలు,పట్టణ సంబంధాలు వంటి అంశాల ద్వారా మార్పులు చోటు చేసుకున్నాయి.

### 13. విద్య ద్వారా పరివర్తన:

విద్య గిరిజన సమాజంలో సామాజిక అవగాహన గొప్ప మార్పుకు కారణమవుతుంది. విద్య వల్ల తమ హక్కులు,అవకాశాలు,బాధ్యతలు, రాజ్యాంగ పరిరక్షణలు, ప్రభుత్వ పథకాలు, సమాజంలో తమ స్థానం గురించి తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. విద్యవంతులైన గిరిజన యువత తమ సమాజ సమస్యలను సాహిత్య రూపంలో వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా విద్య సాహిత్య చైతన్యానికి దోహదం చేస్తోంది.

### 14. మహిళలలో చైతన్యం:

గిరిజన మహిళా అభివృద్ధిలో విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గిరిజన మహిళలు కుటుంబం,వ్యవసాయం,అటవీ ఆధారిత జీవనం వంటి అనేక రంగాల్లో కీలక పాత్రను పోషిస్తున్నారు. విద్య,స్వయం సహాయక సంఘాలు,ఉపాధి అవకాశాలు,సామాజిక అవగాహన పెరగడం వల్ల మహిళలలో కూడా హక్కులపై చైతన్యం పెరుగుతుంది.

**హక్కులపై అవగాహన:** భూమి,అడవి,జీవనోపాధి,విద్య,ఆరోగ్యం,రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై గిరిజన సమాజంలో అవగాహన పెరగడానికి సాహిత్యం ఒక సాధనంగా ఉపయోగ పడుతుంది.

### 15. ఆధునికత – గిరిజన సంస్కృతి:

విద్య – వైద్యం: ఆధునిక అభివృద్ధి వల్ల గిరిజనులకు విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

సామాజిక చైతన్యం: ఆర్థిక ఏకీకరణ మరియు సాంకేతిక వల్ల సమాజంలో గిరిజనుల కదలికలను వనరుల లభ్యత మెరుగుపడుతున్నాయి.

### 16. గిరిజన సాహిత్యం – పర్యావరణ చైతన్యం:

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యల్లో పర్యావరణ సంక్షోభం ఒకటి. అడవులు నరికివేత, నీటి సమస్యలు,వాతావరణ మార్పులు వంటి అంశాలు మానవళికి సవాలుగా మారాయి. ప్రకృతిని కేవలం ఆర్థిక వనరుగా కాకుండా జీవన భాగంగా చూడటం, అవసరానికి మించి వనరులను వినియోగించకపోవడం, సమూహ ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి విలువలు పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయి.

### 17. గిరిజన సంస్కృతి పరిరక్షణ అవసరం:

గిరిజన సంస్కృతి భారతదేశం సాంస్కృతిక వైవిధ్యంలో ఒక విలువైన భాగం. దానిని కేవలం ప్రదర్శన వస్తువుగా చూడకూడదు.

సంస్కృతిని పరిరక్షించాలంటే

1. గిరిజన భాషలను సంరక్షించాలి
2. మౌఖిక సాహిత్యాన్ని సేకరించి భద్రపరచాలి

3. గిరిజన గేయాలు, కథలు,పురాణాలను పత్రికరించాలి.
4. సంప్రదాయ కళలకు ప్రోత్సాహం ఇవ్వాలి.
5. గిరిజన యువతకు తమ సంస్కృతి పట్ల అవగాహన కల్పించాలి.
6. గిరిజన రచయితలకు ప్రోత్సహించాలి.
7. వారి సాంస్కృతిక జ్ఞానాన్ని గౌరవించాలి.
8. వారి సంప్రదాయ జ్ఞానాన్ని వాణిజ్య ప్రయోజనాలకు దుర్వినియోగం చేయకుండా రక్షించాలి.

**18. సామాజిక పరివర్తనలో యువత పాత్ర:**

గిరిజన సమాజ భవిష్యత్ యువతపై ఆధారాపాది ఉంది. విద్యను అభ్యసిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ తమ సంస్కృతిని కాపాడుకోవాలి. డిజిటల్ మాధ్యమాల ద్వారా గిరిజన పాటలు. కథలు. నృత్యాలు,కళలు,భాషలను కొత్త తరాలకు పరిచయం చేయవచ్చు.

**19. గిరిజన సాహిత్యం మనకు నేర్పే విలువలు:**

గిరిజన సాహిత్యం మనకు సమాజంపై, ప్రకృతిపై మరియు మానవ సంబంధాలపై అత్యంత ఉన్నత విలువలు నేర్పుతుంది. ఆధునిక సమాజం మరచిపోతున్న అనేక సహజ సిద్దమైన జీవన సూత్రాలను గిరిజన సాహిత్యం తెలియజేస్తుంది. ప్రకృతిని ప్రేమించడం,గౌరవించడం గిరిజనులు ప్రకృతిని తమ కుటుంబంలో భాగంగా భావిస్తారు.

విచెట్లను,నదులను,కొండలను దైవంగా భావించి పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడాలని సందేశం ఇస్తారు. కలసికట్టుగా జీవించండం చాలా ఇష్టం. స్వచ్ఛమైన మనసు వంటి నైతిక విలువలు వారి సాహిత్యంలో ప్రధానంగా ఉంటాయి.

**ముగింపు:**

గిరిజన సాహిత్యం అంటే కేవలం అడవులలో నివసించే ఒక సమాజం కథ కాదు. ప్రకృతితో మానవుడి సంబంధానికి,సామూహిక జీవన విలువలకు,అస్తిత్వ పోరాటానికి,సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక. గిరిజన సంస్కృతిలోని పాట,నృత్యం,కథ,ఆచారం, పండుగ,భాష – ప్రతి అంశం వెనుక ఒక జీవన తత్వం ఉంది. సామాజిక పరివర్తనం అంటే పాతదాన్ని పూర్తిగా తొలగించి కొత్తదాన్ని తీసుకురావడం కాదు. మంచిని కాపాడుకుంటూ,అవసరమైన మార్పును తీసుకురావడం పరివర్తనం.

ముఖ్యంగా గిరిజనుల గురించి ఇతరులు మాత్రమే మాట్లాడే పరిస్థితి నుంచి, గిరిజనులు తమగొంతుతో, తమ భాషలో, తమ అనుభవాలను తామే చెపుకునే స్థతికి రావడం సామాజిక,సాహిత్య పరివర్తనలో అత్యంత ముఖ్యమైనది.

గిరిజన సాహిత్యం వారి జీవన స్వరం
గిరిజన సంస్కృతి వారి అస్థిత్వ గుర్తింపు

సామాజిక పరివర్తనం వారి భవిష్యత్తు ప్రయాణం కోసం ఈ ముదు పరస్పరం కలిసినపుడే సమగ్ర సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది. గిరిజన సమాజాన్ని అభివృద్ధి చేయడం అంటే వారి సంస్కృతిని మారెచ్చేయడం కాదు . వారి సంస్కృతిని గౌరవిస్తూ,వారి హక్కులను కాపాడుతూ, వారి సమర్ధ్యాలను వెలికితేసే అవకాశాలను కల్పించడం.

**ఆధార గ్రంథాలు:**

1. "ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి – సాహిత్యం" — డా. ఆర్.వి.ఎస్. సుందరం.
2. "తెలుగు జానపద విజ్ఞాన భిక్షువులు" – ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు.
3. "గిరిజన సంస్కృతి" (తెలుగు అకాడమీ ప్రచురణ) — హైదరాబాద్.
4. భారత ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ వార్షిక నివేదికలు (Annual Reports of Ministry of Tribal Affairs).

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# శ్రీ వేలూరి శివరామ శాస్త్రి జీవిత చరిత్ర – వ్యక్తిత్వ నిర్మాణం –ప్రేరణ

– డా. దాసరి సుశీల్ ప్రత్యూష

ఎం.ఎ (తెలుగు) ,ఎం.ఎ (సోషియాలజీ), ఎమ్.ఎడ్,పిహెచ్.డి

తెలుగు విభాగాధిపతి,

అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ,గుడివాడ.

వేలూరి వారి సాహిత్యం ఒక స్రవంతి. పుంఖాను పుంఖాలుగా వారి కలం నుండి ఎన్నో రచనలు ప్రవాహంగా సాగాయి. ఆయన ఎవ్వరికి అనుకరణ కాదు. ఆయనే ఎందరికో అనుకరణ, వేదాంతిగా, నాటక కర్తగా, అవధానిగా, నవలా రచయితగా, కథకునిగా, వ్యాసకర్తగా, సంఘ సంస్కరణాభిలాషిగా, బహుభాషావేత్తగా, జాతీయతా వాదిగా, కర్మయోగిలా రాణించారు. ఎన్నో రీతులతో పరిశోధనలో నిత్య కృషీవలుడై, సత్య సాధకుడై కవిత్వం సమాజ ప్రయోజనం కోసమేనని నమ్మి దానిని నిజం చేసిన కార్యదీక్షాపరుడు, తెలుగు సాహితీ కళామతల్లికి ఎనలేని సేవ చేసిన సాహిత్యోపాసకుడు వేలూరి శివరామశాస్త్రి. వేలూరి జీవితం, సాహిత్యం ఎందరికో స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం.

**బాల్యం – విద్యాభ్యాసం:**

శివరామశాస్త్రి గారి పూర్వీకులు సనాతనవాదులు, పండిత కుటుంబం మరియు సంపన్నులు; ఒకవైపు సరస్వతీ, మరొకవైపు లక్ష్మి విలసిల్లిన విశిష్టవథం కలిగిన గృహం వారిది. సర్వకళలకు కాణాచిగా వున్న నాటి కృష్ణాజిల్లాలోని 'చిరివాడ' అనే అగ్రహారంలో పూజ్యులైన విశాలాక్షి వేంకటేశ్వరావధానులకు 9 ఏప్రియల్ 1892 సంలో జన్మించారు. వారి తాతగారు చంద్రశేఖరయ్య గారు సదాచార సంపన్నులు, నిత్యాగ్నిహోత్రులు, ఆ రోజులలో ఆ ప్రాంతములో వారంటే తెలియనివారు లేదు.

వంశానుక్రమంగా సంభవించిన పాండిత్య జ్ఞానముచే శాస్త్రి గారి తండ్రిగారు సమస్త వేదవేదాంగాలను అధ్యయనం చేసి అపార జ్ఞానాన్ని సముపార్జన చేసి విశష్టపథంలో సారిన వేదాంగవేత్త, ఇలా సనాతన సంప్రదాయ, పండిత కుటుంబంలో జన్మించిన శివరామశాస్త్రికి ఆ సుగంధము అంటక మానుతుందా? ఆ పరంపరలోనే వారి బాల్యం సాగింది తల్లి విశాలాక్షి జ్ఞానసంపన్నురాలు, ఐదుగురు కుమారులను, ఇద్దరు కుమార్తెలను విజ్ఞానవేత్తలుగా తీర్చిదిద్దింది. విశాలాక్ష్మమ్మగారు ఆ ఇంటికి తులసి చెట్టులాంటిది.

శివరామశాస్త్రి తాతగారు చంద్రశేఖరయ్యగారు, తండ్రి వేంకటేశ్వరావధానులు,విశాలాక్షి సోదరులు యజ్ఞనారాయణ శాస్త్రి, చంద్రశేఖరం,కృష్ణమూర్తి,చిదానందం,సోదరీమణులు అన్నపూర్ణమ్మ,సీతమ్మ.

**విద్యాభ్యాసం:**

శివరామశాస్త్రి గారు జన్మస్థలమైన 'చిరివాడ'లో ప్రాథమిక విద్యనభ్యసించారు. వారి మేనమామ గారైన శోభనాద్రి శాస్త్రి గారి స్వగ్రామమైన అగిరిపల్లిలో కొంతకాలం చదువుకున్నారు. తరువాత ఏలూరులో చీమలకొండ అనంత రామయ్యగారి దగ్గర 'ఫోర్తుఫారం' పూర్తి చేశారు. తిరిగి 'ఆగిరిపల్లి' వచ్చి సంస్కృత పాఠశాలలో చేరారు. అక్కడ బ్రహ్మశ్రీ వేమూరి రామబ్రహ్మశాస్త్రి గారి దగ్గర తర్కం, వేదాంతం నేర్చుకున్నారు. గరికపాటి బుచ్చయ్యగారి దగ్గర కావ్యం, నాటకాలు పఠించారు.

శాస్త్రి గారికి ధారణాశక్తి ఉగ్గుపాలతో సంక్రమించిన వరం. వారు ఏకసంధాగ్రహి, ఆ రోజులలో గురుకులవాస విధానంలో విద్యాబోధన వుండేది. శిష్యులకు గురువులు రెండు శ్లోకాలు చెప్పి వల్లె వేయించేవారు. శాస్త్రిగారికి అవి సరిపోక 20-25 శ్లోకాలు చెప్పించుకొని, నేర్చుకుని మరునాడు గురువుగారికి అప్పజెప్పేవారు. ఆ విధంగా చిన్న వయస్సులోనే పంచకావ్యాలను నేర్చుకున్నారు. వారి ఆసక్తి అమితమైనది. ఎంతటి క్లిష్టమైన విషయాలనైనా తేలికగా అభ్యసించేవారు.

వేలూరి శివరామశాస్త్రి గారి సాహితీ ప్రస్థానం అవధానాలతో ప్రారంభమైంది. 1910-12 సం|| కాలంలో ఎన్నో అవధానాలు నిర్వహించారు. తరువాత వారి దృష్టి కథానికల మీదకు మళ్ళింది. వారి రచనలు ఖండ కావ్యాలుగా శారద, భారతి, కృష్ణా పత్రిక, గోల్కొండుతో ఆంధ్రపత్రికల్లో ప్రచురితమయ్యాయి.

కథానిక సాహిత్యంలో వారిది అందెవేసిన చేయి. దాదాపు '80' కథానికలు రచించారు. ఎన్నో పత్రికలలో ప్రచురితం అయ్యాయి. నవలలు, అనువాద గ్రంథాలు వేదాంతగ్రంథాలు వారి కలం నుండి సరికొత్త రూపు దాల్చుకున్నాయి. ఆయన సాహిత్యం సెలయేరు ప్రయాణం. అదొక మకరందపు కుప్ప. వారి రచనలలో అద్వైతానంద సిద్ధి, జిజ్ఞాస, తత్త్వాన్వేషణ, పరిశీలన, లోకజ్ఞత నిండుగా కనిపిస్తాయి. శాస్త్రిగారి రచనలలో విశిష్టపథాన్ని అందుకున్నవి వారి కథలు, నాటకాలు నాటి సమాజ స్థితిగతులను, ఎన్నో లోక వృత్తాంశాలను దృశ్యకావ్యంగా చూపించారు. వాటిని పరిశీలన చేస్తే వారి సాహిత్యాంతరంగం పాఠకులకు నూతన ఉత్తేజాన్నిస్తుంది.

**రచనలు:**

**కథానికలు**

"1. కథాషట్కము 1949,2 కథాసప్తకము 1950, 3. కథా భారతి 1985 4. బాలవిజ్ఞాన కథలు 1969

**నాటకములు**

మాధవ వర్మ 1920, ప్రథమ సాంధికుడు -1924. వేతసి 1924, గురుదక్షిణ 1929, అరణ్యపర్వశేషోన్నయం 1960

సులతానీ 1987"

**బిరుదులు - సన్మానాలు:**

శివరామశాస్త్రి గారికి సన్మానాలకు కొదువ లేదు. వారి గురువులకు వలెనే వారు. కూడా విశిష్టమైన పురస్కారాలు అందుకున్నారు. రాజశ్రీ శ్రీ శోభనాద్రి అప్పారావు గారు "ఆస్థానకవిగా" స్థానమిచ్చి గౌరవించారు.

పూసపాటి ఆనంద గజపతిరాజు గారు వేయిన్నూటపదహారు రూపాయలతో సన్మానించారు.

వేంకటగిరి రాజావారు ఐదువేల రూపాయల విలువ కలిగిన బంగారు అంగుళీయకంతో సత్కరించారు.

మైసూర్ మహారాజావారు శ్రీ విక్రమదేవవర్మగారు తమ ఆస్థానంలో 'అవధాన సభలు" జరిపి సన్మానించారు.

1986 నెంుులో తిరువాన్కూరు మహారాజావారు తన అజ్ఞానంలో శాస్త్రి "సంపూర్ణశతావధానం" చేయించి సన్మానించారు.1912 మదరాసులో తెలుగు విద్యార్థులు శతావధానం ఏర్పాటు చేయించి మదరాసు గవర్నర్ చేతుల మీదుగా శాస్త్రిగారిని సింహతలాటముతో 1949లో భారతి 'రజతోత్సవ మహాసభలో శ్రీ శివలెంక శంభు ప్రసాద్ గారు వెండి. పళ్ళెం, వెండి కలశం శాస్త్రి గారికి సమర్పించి గౌరవించారు.

1967 జనవరి 7న 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ' వారు శాస్త్రి గారికి విశిష్ట సభ్యత్వమునిచ్చి సత్కరించింది.

1967 జనవరి 27న నూజివీడు రాజా మేకా రంగయ్యప్పారావు శాస్త్రిగారిని సత్కరించారు

ఇలా ఎన్నో సన్మానాలను, సత్కారాలను వివిధ ప్రముఖుల నుండి అందుకుని వాటికి వన్నెలద్దిన విశిష్ట కవి వేలూరి శివరామశాస్త్రి. అనాటి కాలాన్ని బట్టి చూస్తే వారు అందుకున్న గౌరవాలు ఎంతో విశేషమైనవి. వారి కవితాశక్తి సాహిత్య కృషి వెలకట్టలేనిది. వారు నిత్య గ్రంథాన్వేషి, నిరంతరాన్వేషి ఆంధ్ర వాఙ్మయానికి వారు చేసిన కృషి శ్లాఘనీయం. వారి రచనలు నేటి తరానికి మార్గదర్శకం. దాదాపు ఐదు దశాబ్దాలు తెలుగు సాహితీరంగంలో మహోన్నత మూర్తిగా వెలుగొందారు. తెలుగు సాహితీ కళామతల్లికి ఎనలేని సేవ చేసి తరించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి:**

శివరామశాస్త్రి గారు గొప్ప సారస్వతోపాసకుడు, పండితోత్తముడు. అపారమైన సాహిత్యాభిలాష కలవాడు. ఆయన కవిత్వం బహుముఖాలుగా సాగింది. సంప్రదాయ విద్య 'అవధానం' నేర్చుకుని శతావధానులైనారు.

శాస్త్రిగారు గురుపరంపరలో తిరుపతి వేంకట కవుల దగ్గర నేర్చుకున్న అవధానం వారి జీవితంలో ఒక స్వర్ణాక్షలేఖ్యము. రోజుల్లో అవధానం జంటగాను, ఒంటిగాను నిర్వహించేవారు. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదరకవులు, రామకృష్ణ కవులు. జంట కవులు, శాస్త్రి గారు జంటగా తిరుపతి వేంకట కవులతోను చేశారు. ఒంటరిగాను అవధానాలు నిర్వహించారు, కావ్యం, నాటకం, పురాణం వంటి విభిన్న ప్రక్రియలలో సంస్కృతాంధ్ర భాషలలో అనంతమైన సాహితీ కృషి చేసిన ఘనుడు.

**అనువాదకునిగా!:**

శాస్త్రి గారి సాహిత్యంలో మరో మైలురాయి అనువాదం. మహాత్ముని ఆత్మకథను ఆంధ్రానువాదం చేశారు. గాంధీగారి ఆత్మకథ గుజరాతీ భాషలో వుంది. దానిని చాలామంది ఇతర భాషలలోకి అనువదించారు. శాస్త్రిగారు మాత్రం గుజరాతీ భాషలో వున్న గాంధీగారి 'ఆత్మకథ'ను అనువదించడం కోసం ఆయన స్వయంగా గుజరాతీ భాషను నేర్చుకున్నారు. ఆ భాషను అధ్యయనం చేశారు. అందువల్ల ఆ గ్రంథాన్ని సంపూర్ణంగా పరిశీలన చేసి, అందులోని మహాత్ముని ఆత్మగతానుభావాలను, సిద్ధాంతాలను తన అనువాదంలో స్పష్టంగా తెలియపరిచారు.

గాంధీజీ ఆత్మకథను అనువదించడానికి ప్రేరేపించిన అంశం సత్యశోధన. ఆ సత్య సాక్షాత్కారం కోసం నిరంతరం తపన పడ్డారు. అందువల్ల వీరిద్దరి భావాలు సమతూకంలో సాగాయి. వీరు సర్వభూత హితాన్ని కోరుకున్నవారే. వేదాంత మార్గాన్ని అవలంభించిన వారే. అందువల్లనే మహాత్ముని ప్రభావం శాస్త్రి గారి మీద విశేషంగా కనిపిస్తుంది.

గాంధీజీ ఆత్మకథను అనువదించడమేకాదు వారి ఆశయాలను, ఆదర్శాలను, ఉద్యమాలను, సత్యాగ్రహాలను ఆచరించి పాల్గొని వారి మార్గంలో పయనించారు. ఖద్దరు వస్త్రాలు ధరించారు. వారి గ్రామాభ్యుదయ, హరిజనోద్ధరణ ఉద్యమాలలో స్వయంగా పాల్గొన్నారు. ఒక గొప్ప వ్యక్తి యొక్క చరిత్రను అనంచడంలో కేవలం ఆనువాదము ఆ మహాత్ముడినే తనలో నిలుపుకుని ఈ గ్రంథోన్ని అనువడించి స్వతంత్రతావ్యంగా రచిం తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న రచనా విధానానికి వేలూరివారు శ్రీకారం చుట్టారు

వేలూరి శివరామశాస్త్రి అవధానిగా, అనువాదకునిగా, నవలా రచయితగా నాటక కర్తగా, కథా రచయితగా, శాస్త్ర కోవిదుడుగా, వ్యాసకర్తగా పలు విధిస్తు ప్రక్రియల ద సంస్కృతాంధ్ర భాషల యందు వారి ప్రతిభ ఎనలేనిది. వారి రచనలు నిలువెత్తు పోసిన కుప్ప. అందు ఎన్నో మేలైన మంచి విత్తనాలు కలవు. అవి భావితరాలకు భాగ్యరేఖలు, విలువైన సంపదలు,

ఇన్ని విభిన్నమైన రీతులలో వారు చేసిన కృషి తెలుగు సాహిత్య వాఙ్మయంలో ఒక మైలురాయి. అందుకే వారి ప్రతిభ "బహుముఖ ప్రజ్ఞాశాలి"గా మార్చి వారిని ఉన్నత శిఖరాల మీద నిలిపింది.

**వేలూరి వారి జీవితంలోమరచిపోలేని సంఘటనలు:**

వేలూరి శివరామశాస్త్రి గారి జీవితంలో మరిచిపోలేని కొన్ని సంఘటనలున్నాయి. జీవితంలో ఎన్నో సమస్యలు మన జీవితాలను మార్చివేసేవి వుంటాయి. కొన్ని చిన్నపాటి సమస్యలైతే కొన్ని మనలను ఎంతో బాధకు గురిచేస్తాయి. శాస్త్రిగారి విషయంలో జరిగిన సంఘటనలు చాలా బాధాకరమైనవి అవి ఎవ్వరూ తీర్చలేనివి. మనిషికి ఎంత విజ్ఞానం, పాండిత్యం పేరు ప్రతిష్టలున్న అవన్నీ కుటుంబం తరువాతనే కదా! అదీగాక భార్య పురుషుని జీవితంలో సగ భాగమని మనం ఒప్పుకోవలసిందే. శాస్త్రిగారు తన భార్య విషయంలో పడిన కష్టాలను చూస్తే ఆయనకు ఆమె పట్ల ఉన్న అచంచలమైన ప్రేమానురాగాలు తెలుస్తాయి.

**ఆశ్రమ జీవితం:**

శాస్త్రి గారికి అత్యంత దుర్భరజీవితం ఆయన భార్య ఉబ్బస వ్యాధితో మంచాన పడటం, ఇంగ్లీషు మందులకు, ఆయుర్వేదానికి కూడా రోగం లొంగలేదు. భార్య అవస్థను చూస్తూ ఉండలేకపోయారు. ఆయన ప్రకృతి ఆరాధకుడు. ఏకాంత జీవితం అంటే ఇష్టం అనురక్తి వున్నవాడు. ఆమెను ప్రశాంతమైన ప్రదేశమున వుంచవలెనని కుటుంబ సమేతంగా ఆగిరిపల్లి నుండి కాపురం ఐదుమైళ్ళ దూరంలో వున్న 'సూరవరం' గ్రామానికి మార్చాడు. ఆ గ్రామం ప్రకృతి రమణీయతతో నిండి ప్రశాంతతకు నిలయంగా శోభిల్లుతుంది.

అక్కడ పన్నెండు ఎకరాల భూమి కొని, మామిడి తోటను పెంచుకొని, కుటీరము నిర్మించుకొని ఆశ్రమ జీవితాన్ని ప్రారంభించారు. వ్యవసాయం ప్రారంభించారు. పోతన మహాకవివలె 'హలము–కలము' చేతపట్టి కవితా సేద్యము ప్రారంభించారు. ఆ వనంలో ఆయనొక తపస్విలాగా, యోగిలాగా దర్శనమిచ్చేవారు. ఈ ఆశ్రమ జీవితం వారి జీవితంలో మరచిపోలేని సంఘటన.

**చిరివాడ అగ్నిప్రమాదం:**

1921 సం||లో ఏలూరులో గురువులు దివాకర్ల తిరుపతి శాస్త్రి గారి స్మారక సభలో పాల్గొనడానికి వెళుతూ తాను కష్టపడి రచించిన పద్మపురాణం, ముక్తాలత, మణిమేఖల వంటి స్వతంత్ర కావ్యాలు ఒక ట్రంకు పెట్టెలో పెట్టి వాటిని సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి గారి గదిలో వుంచి వెళ్ళారు. గదితాళం బ్రద్దలు కొట్టి కొందరు దొంగలు ట్రంకుపెట్టెను అపహరించుకుని పోయారు. అది వారి జీవితంలో విషాదకరమైన సన్నివేశం.1926వ సంవత్సరంలో శాస్త్రిగారు సూరవరం తోటలో నివాసం వుంటునప్పుడు చిరివాడలో పెద్ద అగ్ని ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో తన ఇంటిలోని తన అమూల్యమైన సమస్త వాఙ్మయం అగ్నిజ్వాలల్లో ఆహూతైపోయింది. అది తెలిసి పరుగున వచ్చి భస్మావశేషాలైన పత్రాలను చేతిలోపోసుకొని శిరమాన పెట్టుకొని..... పెద్దగా దుఃఖిస్తూ.......

"పెంచితి పెద్ద చేసితిని బ్రీతియుతంబుగ రాణివాసయం

దుంచితి, రాజయోగ్యకుసుమోపవనంబులు క్రుమ్మరిల్లని

నిర్మించితి విస్మరించితిని మేదిని మింటిని నొక్కపెట్టి

నర్పించితి నిన్ను ననగ్నికిన్ బెన్ బలిగా, కవితా సరస్వతీ

అంటూ ఎలుగెత్తి విలపించిన ఆర్ద్ర హృదయం, నిండైన వ్యక్తిత్వం శాస్త్రిగారిది.

తన కవితా సరస్వతీని చివరకు అగ్నికి బలి చేశానని గుండెలు పగిలేలా రోదించిన వారిని చూసిన వారంతా కంట తడిపెట్టుకున్నారు. దొంగలు ఎత్తుకునిపోగా మిగిలినవి అగ్నిదేవుడికి ఆహుతైనాయి. ఈ రెండు సంఘటనలు శాస్త్రి గారికి సాహిత్యం మీదనే కాకుండా జీవితం మీదనే విరక్తిని కలిగించాయి.

సహజంగా ఎవరికైనా జీవితంలో ఎన్నో అద్భుత సంఘటనలు గుర్తుకు వస్తాయి. శాస్త్రి గారికి మాత్రం ఈ చేదు సంఘటనలు మిగిలాయి. భార్య చనిపోయి, రచనలు బూడిదైపోయి వైరాగ్య భావంతో జీవితం సాగించారు.

ఆధ్యాత్మిక సాధన కోసం, మానసిక ప్రశాంతత కోసం వారు పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిని సందర్శించి వారి సన్నిధిలో కొంతకాలం జీవించారు. అది వారికి దివ్యౌషధముగా పనిచేసింది.

**వ్యక్తిత్వం:**

వేలూరి వారి జీవిత విశేషాలలో మనం వేనోళ్ళ కీర్తించదగినది. వారి వ్యక్తిత్వం. మాటతీరు నిబద్ధత, నిరాడంబరత, సహనశీలత, దానగుణం. ఎన్నదగినవి ఆయన మానవతావాది. కేవలం తన రచనలలోనే సమాజానికి మంచి చేయడం కాదని జీవితంలో వాటిని ఆచరించిన మహా మనీషి వేలూరి. ఆయన జీవితం వ్యక్తిత్వం ఆదర్శనీయం సున్నితమైన మనస్తత్వం విశాలమైన వ్యక్తిత్వం కలిగినవాడు.

వేలూరి వారి నిండు వ్యక్తిత్వాన్ని తెలిపిన కొన్ని సంఘటలను పరిశీలించవలసి ఉంది.

వేలూరి శివరామశాస్త్రి గారు నివసించే ఇంటికి సమీపంలో ఒక పేదరైతు వుండేవాడు. కష్టపడి పనిచేసి జీవించేవారు. ఆయనకు ఒక కూతురుంది. గ్రామంలో వున్న 'షావుకారు' మూడు వందల రూపాయలు అప్పిస్తానన్నాడు. అతని మాటలు నమ్మి ఆ రైతు కూతురు పెళ్ళి నిశ్చయించుకున్నాడు. అయితే 'షావుకారు' సమయానికి డబ్బివ్వలేదు. రైతు మంచం పట్టాడు. మరో రెండు రోజులలో పెళ్ళి, ఇల్లంతా దుఃఖంతో నిండిపోయి వుంది. శాస్త్రిగారు భార్యను పిలిచి ఆమెతో రైతు వాళ్ళ ఇంట్లో పెళ్ళి హడావుడి యేమి కనిపించడంలేదు ఇల్లంతా నిశ్శబ్దంగా వున్నదేమిటి? అని అడిగారు.

'షావుకారు' డబ్బిస్తానని చెప్పి చివరకు దబ్బివ్వలేదంట, పెళ్ళి ఆగిపోయింది. పిల్ల తండ్రి మంచమెక్కాడు' అని కామేశ్వరమ్మగారన్నారు.

శాస్త్రిగారు వెంటనే రైతును పిలిచి విషయాలు అడిగి తెలుసుకుని, భార్యను పిలిచి "మెడలో వున్న కట్ల కాసుల దండ అతనికివ్వు, అది అమ్మి పిల్ల పెళ్ళి చేసుకుంటాడు" అన్నారు. ఆ ఇల్లాలు మారు మాట్లాడకుండా మెదలోని బంగారు నగ తీసి యిచ్చింది. రైతు సంభ్రమాశ్చర్యాలతో బాబూ! పెళ్ళి కాగానే ఇల్లే అమ్మి బాకీ తీర్చుకుంటాను అన్నాడు. "అక్కర్లేదు. పిల్ల పెళ్ళి నేనే చేశాననుకో" అన్నారు శాస్త్రిగారు. ఆ తండ్రి కళ్ళ వెంట ఆనంద భాష్పాలు శాస్త్రిగారి పాదాల మీద జల జల రాలాయి"?

ఇంతకంటే వారి వ్యక్తిత్వానికి, దాతృత్యానికి, మంచితనానికి, మానవతాదృక్పథానికి ఇంకేం నిదర్శనం కావాలి. సద్భావ పుష్పాలతో తయారైన సమజీవన పుష్పహారం శాస్త్రి గారు, ఇందులో వారి శ్రీమతి కామేశ్వరమ్మ గారికి సగ భాగం పుణ్యం వుంది. వారిద్దరి వ్యక్తిత్వం అభినందించదగినది. మానవతా దృష్టిని మించిన మంచి వ్యక్తిత్వం లేదంటారు. శాస్త్రిగారు. అదే వారి మంచి వ్యక్తిత్వానికి వన్నెలద్దినది.

మంచి వ్యక్తిత్వమంటే మంచి మనస్సు ఉండటం . మంచి హృదయం ఉండటం సుఖాలను సమతూకంలో చూడటం ఇవన్నీ శాస్త్రిగారికి వర్తిస్తాయి. శాస్త్రిగారి వ్యక్తిత్వంలో మనకు కనిపించే ఎన్నో మంచి లక్షణాలున్నాయి.

సూరవరం తోటలో వున్నప్పుడు ఉప్పరవెంకటేశు వారికి నమ్మినబంటు అతనికి వివాహం కూడా చేశారు. తాను సూరవరం తోట నుండి చిరివాడకు వెళ్ళేటప్పుడు 'నాలుగు ఎకరాల పొలం' ఉప్పర వెంకటేశుకు వ్రాసి యిచ్చారు. శాస్త్రిగారి వ్యక్తిత్వానికి ఇదొక మచ్చు తునక."ఆయన నమ్మిన వారికి దేవుడు– నచ్చకపోతే అమడదూరంలో వుంచేవాడు" అంటాడు వెంకటేశు.

శాస్త్రిగారి జీవితంలో ఇలాంటివి ఎన్నో మనకు కనిపిస్తాయి. ఒక్కొక్క సంఘటన శాస్త్రిగారి వ్యక్తిత్వాన్ని పెంచేవిగా కనిపిస్తాయి. వారి నిరాడంబరజీవితం, తత్త్వసాధన, ప్రకృతిని ప్రేమించుట, పుస్తక పఠనం,వ్యవసాయం,నిత్యజపధ్యానాదులు, వేదాంత పఠనం వంటి నిత్యదైనందిన కార్యక్రమాలు వారి చక్కని వ్యక్తిత్వానికి జీవితానికి నిండైన శోభను చేకూర్చినాయి. వారి జీవితం నుండి మనం ఎన్నో అమూల్యమైన విషయాలను నేర్చుకుని అలవరచుకోవచ్చని వారి వ్యక్తిత్వాన్ని గమనిస్తే మనకు అర్థం అవుతుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. వేలూరి శివరామశాస్త్రి కథలు –మొదటి సంపుటం
2. వేలూరి శివరామశాస్త్రి కథలు –రెండవ సంపుటం
3. శ్రీ వేలూరి శివరామ శాస్త్రి జీవిత రేఖలు – జంధ్యాల మహతీ శంకర్

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


# ఆధునిక సాహిత్యం సాంకేతికత – గ్రామీణ యువత వ్యవసాయం


**– డా. పెద్దింటి ముకుందరావు**

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ

ఐఐఐటీ – శ్రీకాకుళం, ఆర్.జి.యు.కె.టి

చరవాణి: 9866979370



**వ్యాస సంగ్రహం:**

1990ల తర్వాత ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ ,సాంఘిక ,ఆర్థిక ,రాజకీయ ,సామాజిక ,సాంస్కృతిక రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి .ఒకవైపు అవసరాల్ని తీర్చడంలో అనాయాస పరిస్థితులు సృష్టించినా ,మరోవైపు ప్రతిక్షణం భయం గుప్పెట్లో ప్రాణాల్ని ఇచ్చుకోవల్సినంతగా శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయి .ఈ నేపథ్యంలో ఎల్.పి.జి .నమూనా రావడం అది ఒకవైపు సమాజానికి హితాన్ని కలిగిస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తూనే మరొకవైపు సంస్కరణల వలన పేద ప్రజల గుండెలు గుబెలుమనేలా నిత్యావసర వస్తువుల ధరల భారం ,వ్యవసాయ విత్తనాల మార్పిడి ,ఎరువుల ప్రభావం లాంటి అంశాలు సాంకేతికంగా వచ్చిన విప్లవం వల్ల మీడియా ,ఇంటర్నెట్ వ్యవస్థలు సాంస్కృతికంగా భారతీయ సమాజాన్ని ఆలోచనలో పడేస్తున్నాయి .వాటికి మూలకారణమైనాయి.


**ఆధునిక సాహిత్యం:**

సాహిత్యంలో ఆధునికత ఎప్పుడూ రెండు వ్యవస్థల ఘర్షణలోంచి రూపొందుతుంది .ఆ ఘర్షణ ఎన్నో రంగాల్లో, ఎన్నో రూపాల్లో ఉండవచ్చు. వ్యవస్థాత్మకమైన ఈ ఘర్షణయే సాహిత్య అభివ్యక్తిలో ఎన్నో మార్పులను తెస్తుంది .కొంచెంగానో ,ఎక్కువగానో ఈ ఆధునికత అనేది ఏ కాలం సాహిత్యంలోనైనా ఉంటుంది .ఒక స్థిర రూపంలో ఉన్న వ్యవస్థలో మౌలికమైన మార్పులు వచ్చే దశలో ఆ మార్పులను వేగవంతం చేయడానికి సాహితీపరుల రచనల్లో పరుచుకున్నది ఆధునికత. ప్రస్తుత సమాజంలో సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందులో ముఖ్యమైనది కృత్రిమ మేధస్సు. మానవజీవన విధానాన్ని పూర్తిగా మార్చేస్తున్న శక్తివంతమైన ఆయుధం సాంకేతికత. ముఖ్యంగా మన భారతదేశం విస్తృత జనాభాతో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంది. ఏదైనా ఒక కొత్త అంశం సామాజిక వ్యవస్థ పైన ప్రభావం చూపితే అది విస్తృత స్థాయిలో ప్రభావం చూపుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెద్దఎత్తున తెలుగు ప్రజానీకం ఎఐ ను వాడుతోంది. ఎఐ అనుకూల అంశాలతో పాటు సమజాం ఎలాంటి సవాళ్ళను ఎదుర్కొంటుంది అనే విషయంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**సాంకేతికత:**

సాంకేతికతని శాస్త్రవేత్తలు 'పారిశ్రామిక కళ' అంటారు. ఉన్నస్థితి నుండి ఉన్నత స్థితిలోకి మనిషిని చేర్చే ఒక సాధనం సాంకేతికత. సాంకేతిక నిపుణుడూ సాధకుడే! ఐతిహాసిక యుగంలో సాధకులు, విలువలకు కట్టుబడి తమ తమ అస్త్ర శస్త్రాల్ని ఉపయోగించారు. సాంకేతికాభివృద్ధి వేగంగా సాగుతోంది. ఒక ఉపకరణాన్ని వాడటం మొదలు పెట్టేలోపే తర్వాతి జనరేషన్ ఉపకరణాలు మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి.ఇంత వేగాన్ని అందుకోవాలనే తపన మనలో చాలినంత లేనిమాట కూడా నిజం. రేపు ఏ మార్పు రాబోతోందో ముందుగానే పసిగట్టలేకపోవటం,అందుకు తగినంత సన్నద్ధత ప్రదర్శించలేకపోవటం వ్యక్తులుగా మన లోపం, డిజిటల్ బాలుడు కంప్యూటర్లో అక్షరాలు దిద్దుకుంటుంటే సాహిత్య భానుడు మసకదీపం కాంతిలో వెలిసిపోతున్న అక్షరాల్ని వెదుక్కొంటున్నాడు.

సాంకేతిక ప్రగతికి కూడా సృజనాత్మకత అనేది ఎంతో అవసరం. అది సారస్వతం వలన మాత్రమే సాధ్యం. సాంకేతికత కున్నంత విజన్ సారస్వతానికి కూడా ఉండాలి. మనం మారాల్సింది ఇక్కడే! మార్పు అనివార్యమైనదే! మారుతున్న కాలమాన పరిస్థితులకు

అనుగుణంగా మనమూ మారాలి. తిరస్కారం ధిక్కారం పరిష్కారాలు కావు. ఎంతదూరం వచ్చామో వెనక్కి చూసుకుంటూనే ఎంత వేగంగా సాగాలో ముందుకు చూసుకుంటూ దూసుకు పోగలిగిన జాతి అభ్యుదయాన్ని సాధిస్తుంది. దక్షిణకొరియా లాంటి చిన్నదేశాలు ఈ సూత్రాన్ని అవలంబించి రాణించాయి.

**గ్రామాలు – పచ్చని పొలాలు:**

ఒకప్పుడు మన గ్రామాలు పచ్చని పొలాలు, నిండు చెరువులతో కళకళలాడేవి. మట్టి వాసనతో కూడిన జీవితం ఎంతో ఆనందాన్నిచ్చేది. కానీ, నేడు ఆ దృశ్యం మారిపోయింది. యువత పట్టణాలకు వలస వెళ్లడం, వ్యవసాయంపై ఆసక్తి తగ్గడం, వాతావరణ మార్పులు, లాభాలు తగ్గిపోవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టాయి. ముఖ్యంగా, యువతరం వ్యవసాయానికి దూరమవడం మన దేశ భవిష్యత్తుకు పెద్ద సవాల్‌గా మారింది. ఎందుకంటే, అన్నం పండించే చేతులు లేకపోతే అభివృద్ధికి అర్థం ఉండదు. అయితే ఈ పరిస్థితి నిరాశ కలిగించేది కాదు. ఆధునిక సాంకేతికతను (Technology) అందిపుచ్చుకుంటే, వ్యవసాయాన్ని లాభదాయకమైన, ఆకర్షణీయమైన వృత్తిగా మార్చి యువతను మళ్లీ గ్రామాలకు ఆకర్షించవచ్చు. యువశక్తిలో ఉన్న సృజనాత్మకత (Creativity), సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నైపుణ్యాలను వ్యవసాయానికి జోడిస్తే, నూతన మార్పునకు నాంది పలకవచ్చు.

**యువత వ్యవసాయానికి కొత్త ఊపిరి:**

యువతరం అంతా ప్రపంచాన్ని సాంకేతికతే శాసిస్తుందని నమ్ముతుంటే, వయసు మళ్లిన ఎముకలు సళ్లిన ముదుసలులు సాంకేతికత చేసే హాని గురించి. మాత్రమే ఆలోచిస్తున్నారు. కొత్తతరం రేపటి గురించి ఆలోచిస్తుంటే పాతతరం నిన్నల్లోనే బతుకు వెళ్ళమార్చటం సరికాదు. లాభనష్టాలు రెండూ ఉంటాయి ఏ అంశానికైనా! నష్టం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూనే మేలు మీద దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. అందరికన్నా ఎక్కువగా సాంకేతికతని ఉపయోగించుకోగలిగిన సాధకులకు రాణింపు ఎక్కువగా ఉంటుంది. సాంకేతిక సాధకుల ముందు సాహిత్య సాధకులు వెలవెలబోకూడదు.

వ్యవసాయం కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు. అది ఒక వ్యాపార అవకాశం (Business opportunity), నూతన ఆవిష్కరణలకు వేదిక, శాస్త్ర సాంకేతికతలతో కలిసి ఎదిగే రంగం. యువత తమలోని శక్తిని వ్యవసాయంలో వినియోగిస్తే, అది వారి భవిష్యత్తుకు మాత్రమే కాదు, దేశానికి కూడా ఒక కొత్త మార్గాన్ని చూపుతుంది. ప్రస్తుత ఆధునికత వ్యవసాయ రంగంలో పంట యొక్క నిరంతర పర్యవేక్షణ కొరకు మనిషి అందుబాటులో ఉండడం తప్పనిసరి. ప్రస్తుతం మారుతున్న కాలంలో ఉద్యోగ రీత్యా పల్లెల నుండి పట్టణాలకి వలస వెళ్ళే యువతకి తగ్గట్టు వ్యవసాయ ఆధునికతలో మార్పులు తప్పనిసరి. Sensor based Automated Agriculture system ద్వారా RF transceiver, LoRa మరియు DVFS లను ఉపయోగించి SoC సహాయంతో పంటని ప్రపంచంలో ఎక్కడినుంచి అయినా నిరంతరం పర్యవేక్షిస్తూ, పంట స్థితిని బట్టి తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధానం ఉమ్మడి వ్యవసాయానికి నాంధి పలికితే మరింత లాభదాయకంగా మారే అవకాశం ఉంది.

**వ్యవసాయంలో నూతన టెక్నాలజీ తో నూతన ఒరవడి:** యువతకు సాంకేతికత బాగా తెలుసు. వారి నైపుణ్యాలను వ్యవసాయంలో ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు.

**స్మార్ట్ ఫార్మింగ్ డ్రోన్‌ల వినియోగం:** డ్రోన్‌లతో పురుగుమందులు చల్లడం, పంటల ఆరోగ్యాన్ని పరిశీలించడం వంటివి చేయడం ద్వారా సమయం, ఖర్చు ఆదా అవుతుంది. సెన్సార్ల సహాయం పొలంలో సెన్సార్లను అమర్చి నేల ఆరోగ్య స్థితి, తేమ, ఉష్ణోగ్రత వంటి వివరాలను మొబైల్‌లో తెలుసుకోవచ్చు. దీని ద్వారా నీరు, ఎరువుల వాడకాన్ని నియంత్రించి, పెట్టుబడి తగ్గించుకోవచ్చు.

**ఆటోమేషన్ – రోబోటిక్స్:** పంట కోత, విత్తనాలు వేయడం వంటి పనులకు రోబోలను ఉపయోగించడం ద్వారా ఖర్చు, శ్రమ తగ్గుతాయి.

**హైడ్రోపోనిక్స్ వెర్టికల్ ఫార్మింగ్:**

**హైడ్రోపోనిక్స్:** నేల అవసరం లేకుండా కేవలం నీటిలో పంటలు పండించడం. దీని ద్వారా పట్టణ ప్రాంతాల్లోనూ వ్యవసాయం చేయవచ్చు. తక్కువ స్థలంలో భవనాల్లోనే నిలువుగా పంటలు పండించడం. ఇది పట్టణ యువతకు సరికొత్త వ్యవసాయ మార్గాన్ని చూపిస్తుంది.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిగ్ డేటా:**

మార్కెట్ ధరల అంచనా: ఏఐ ఆధారంగా పంటల ధరలు ఎప్పుడు పెరుగుతాయో, తగ్గుతాయో ముందుగానే అంచనా వేసి సరైన సమయంలో పంటను అమ్ముకోవచ్చు. పంటల వ్యాధుల గుర్తింపు: పంటలకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు.

**యువరైతు కేవలం శ్రమించేవాడు కాదు వ్యాపారవేత్త:** పంటలు పండించడమే కాకుండా, వాటికి విలువను జోడించి యువత తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

**అగ్రి ఎంట్రప్రెన్యూర్‌షిప్:** టమాటాలతో కెచప్, పండ్లతో జ్యూస్‌లు, జామ్‌లు వంటివి తయారు చేసి మార్కెటింగ్ చేస్తే, వ్యవసాయం ఒక లాభదాయకమైన వ్యాపారంగా మారుతుంది.

**డిజిటల్ మార్కెటింగ్:** సోషల్ మీడియా, ఈ–కామర్స్ తమ ఉత్పత్తులను సోషల్ మీడియా, ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నేరుగా వినియోగదారులకు అమ్ముకోవచ్చు. దీని వల్ల మధ్యవర్తుల అవసరం లేకుండా పూర్తి లాభం రైతుకే దక్కుతుంది.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థలు:**

రైతులు కలిసి ఎఫ్.పి.ఒ గా ఏర్పడితే, పెద్ద ఎత్తున విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం, మార్కెటింగ్‌లో లాభాలు పొందడం వంటివి సులభమవుతాయి. ఇది రైతులందరికీ బలమైన వ్యాపార అవకాశాన్ని అందిస్తుంది.ఈ సందర్భంగా జూన్ 7న జరిగే ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం, ఆహార, మానవ ఆరోగ్యం. ఆర్థిక శ్రేయస్సు, వ్యవసాయం, మార్కెట్ యాక్సెస్, పర్యాటకం మరియు స్థిరమైన అభివృద్ధికి దోహదపడే ఆహార ప్రమాదాలను నివారించడానికి, గుర్తించడానికి, నిర్వహించడానికి సహాయపడే చర్యలపై దృష్టిని ఆకర్షించడం మరియు ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆయా సంస్థల ద్వారా ఆహార పరిశుభ్రతా స్టార్టప్ లను ముందుకు తీసుకురావాలని కోరుకుంటున్నాయి. అలాంటి వాటిలో గ్రోలాక్ ఒకటి. వారు తమను తాము హైడ్రోపోనిక్స్ ఇతర నేలలేని వ్యవసాయ పద్ధతులను ప్రధాన ఆహార వనరుగా మార్చడానికి ప్రయత్నిస్తున్న మరియు నూతన ఆవిష్కరణలు చేస్తున్న యువకుల బృందంగా పిలుచుకుంటారు.

**నూతన విధానాలు ప్రభుత్వ ప్రోత్సాహం:**

యువత వ్యవసాయంలోకి అడుగుపెట్టడానికి ప్రభుత్వ సహకారం చాలా ముఖ్యం.

ఆర్థిక సహాయం: తక్కువ వడ్డీకే రుణాలు, వ్యవసాయ స్టార్టప్‌లకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలి.

ఆధునిక వ్యవసాయం, పంటల ప్రాసెసింగ్, మార్కెటింగ్, డిజిటల్ టెక్నాలజీపై యువతకు శిక్షణ ఇవ్వాలి.

ప్రత్యేక రసాయనాలు లేకుండా పండించిన సేంద్రియ పంటలకు (Organic Crops) ప్రత్యేక కనీస మద్దతు ధర (MSP)ను అందిస్తే, యువత ఈ రంగం వైపు ఆకర్షితులవుతారు.

**ముగింపు:**

కృత్రిమ మేధస్సు తెలుగు సమాజానికి ఒక పెద్ద అవకాశం, ఒక సవాలు. సరైన విధంగా వినియోగిస్తే ఇది అభివృద్ధికి దారితీస్తుంది. బాధ్యతతో ఉపయోగించడం అత్యవసరం. తక్కువ ధరలో ఎఐ చాట్‌బాట్‌లను తయారు చేయడం ద్వారా అమెరికా కంపెనీలకు చైనా కంపెనీ డీప్‌సీక్ గట్టి పోటీనిస్తోంది. అయితే భవిష్యత్తుకు సంబంధించి ఓ డీప్‌సీక్ పరిశోధకుడు ఒక భయానకమైన విషయాన్ని తెలిపారు. ఈ సాంకేతికత సమాజానికి ప్రమాదకరమని, ఇది కొంతకాలం మానవాళికి ప్రయోజనం చేకూర్చనుంది. కానీ దీర ఎఐ సమాజానికి ఒక పెద్ద సవాలుగా మారవచ్చు అని చైనా ప్రభుత్వ కార్యక్రమంలో డీప్‌సీక్ సీనియర్ రీసెర్చర్ చెన్ డై ఈ భయాన్ని వ్యక్తం చేశారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డు పడతారని జెఫ్రీ హింటన్ అన్నారు. అదే సమయంలో ప్రజలు ఉద్యోగాలు కోల్పోతారని స్పష్టం చేశారు. కొత్త రకం ఉద్యోగాలు పుట్టుకురావాలని, లేకపోతే టెక్నాలజీ ఉద్యోగాలను లాగేసుకునే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ సమస్యను కేవలం AIకి ఆపాదించకూడదని జెఫ్రీ హింటన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను ఈ విధంగానే

తయారు చేయడం వల్ల సమస్య వస్తోందన్నారు. ఇకపై రైతు అంటే కేవలం నాగలి పట్టుకునేవాడు కాదు. అతను డేటా విశ్లేషించే శాస్త్రవేత్త, టెక్నాలజీని వాడే ఇంజనీర్, తమ ఉత్పత్తులను స్వయంగా మార్కెటింగ్ చేసే వ్యాపారవేత్త.

"రైతు = శాస్త్రవేత్త + వ్యాపారవేత్త + సాంకేతిక నిపుణుడు" – ఇదే నేటి వ్యవసాయానికి కొత్త నిర్వచనం.

యువత సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార దృష్టితో వ్యవసాయం గౌరవప్రదమైన, లాభదాయకమైన వృత్తిగా మారుతుంది. ప్రభుత్వ సహకారం, నూతన విధానాలు, మార్కెట్ అవకాశాలు తోడైతే గ్రామాలు తిరిగి సస్యశ్యామలమవుతాయి. యువత వ్యవసాయాన్ని తిరిగి ఆలింగనం చేసుకోవడమే గ్రామాల పునరుజ్జీవనానికి, నవభారత నిర్మాణానికి శక్తి.

**ఆధారగ్రంథాలు**


1. విలోకనం – అద్దేపల్లి రామ్మోహన్ రావు
2. మార్పు వ్యాస సంకలనం, ప్రపంచ తెలుగు రచయితల మాహాసభలు
3. వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలు

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


## కథానిక సామాజిక ప్రయోజనాలు – జీవన చిత్రణ


**– అవ్వోల్ల అనిల్ కుమార్**

(పరిశోధక విద్యార్థి),

తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం



**వ్యాస సంగ్రహం:**

మానవుడి ఊహ ఏనాడు రెక్క విప్పుకున్నదో ఆనాడే పుట్టింది కథ. చెట్టుకొకకథ, గుట్టకొకకథ, పువ్వుకొకకథ, వెలినవ్వుకొక కథ. మానవుని బహిరంతరాల్లో కన్ను చూసేది కొంత, మనసు చూసేది మరికొంత కలసి అందంగా హృదయైకవేద్యంగా కథ రూపం పొంది శ్రోతలను అలరిస్తూ వస్తున్నాయి అంటారు,పోరంకి దక్షిణామూర్తి గారు. అలా వచ్చిన కథల్లో సామాజిక ప్రయోజనాన్ని ఆ కథలు ఎంతవరకు సాధించగలిగాయి. అనే కోణంలో ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల రాజమండ్రి వారు నిర్వహించే ఆధునిక సాహిత్య ప్రక్రియలు సామాజిక ప్రయోజనాలు అనే ప్రధాన అంశానికి చేరువగా చేర్చిన ఉప అంశమైన కథలు సామాజిక ప్రయోజనం జీవన చిత్రన అనే అంశం మీద ఈ వ్యాసం రాస్తున్నాను. ముందుగా కథకు సంబంధించిన సంక్షిప్త నిర్వచనం వివరణ ఇచ్చి, సమకాలీన కథల్లో వస్తు వైవిధ్యతతో తీసుకోబడిన సామాజిక సమస్యలేవి ఆ సామాజిక సమస్యలు ఎంతవరకు కథలల్లో సామాజిక ప్రయోజనాన్ని సాధించాయి. వాటిని కథలల్లో ఎలా చిత్రించారు. వారు పాటించిన పద్ధతులు ఏమిటి? అన్న అంశాలను స్పష్టంగా, క్లుప్తంగా వివరించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం. కథలు సామాజిక ప్రయోజనాలు జీవన చిత్రన అనే అంశానికి పరిశీలనగా ఆడెపు లక్ష్మీపతి గారి కథలను స్వీకరించాను.



**కీలక పదాలు**: ఫ్యూడల్ వ్యవస్థ, సామాన్యుల జీవితాలు, రైతు జీవితాలు, చేనేత బతుకులు, మానవ సంబంధాలు, చైతన్య స్రవంతి.


**ఉపోద్ఘాతం:**

ఇంగ్లీషులో “షార్ట్ స్టోరీ” అన్నదాన్ని అనువదించుకొని తెలుగు రచయితలు “చిన్న కథ” అనే అంటూ వచ్చారు. ఇప్పటికీ కొందరు అలానే వ్యవహరిస్తున్నారు. ఇలా ఉండగా 1936లో ఇంద్రగంటి హనుమచ్చా శాస్త్రి గారు “ప్రతిభ’ పత్రికలో ఒక వ్యాసం రాస్తూ “కథానిక” అన్న పేరు సిద్ధమై ఉందన్నారు.

ఆడెపు లక్ష్మీపతి గారు వస్తూ వైవిధ్యతతో కూడిన సామాజిక సమస్యలను వెతికి పట్టుకున్నారు. మీరు జీవితానికి దగ్గరగా వాస్తవిక వాద శిల్పంతో ఎక్కువ కథలు రాశారు. కొన్ని కథలను చైతన్య స్రవంతి ధోరణి లో రాశారు. కొన్ని కథలను వాస్తవిక వాద శిల్పాన్ని, చైతన్య శిల్పాన్ని రెండింటినీ కలిపి కొత్త టెక్నిక్ తో కథా రచనలు చేశారు. వస్తు శిల్ప సమన్వయం వీరిని ఒక మేధా శిల్పిగా నిలబెడుతుంది.

**వీరుఎన్నుకున్న కథా వస్తువులన్ని సామాజిక సమస్యలే :**

సంప్రదాయక వృత్తి జీవితాల్లోని సంక్షోభం. నిజాం కాలం నాటి పరిస్థితులు. భూస్వామ్య జమీందారుల దౌర్జన్యాలు. ఫ్యూడల్ వ్యవస్థ కింద నలిగిన సామాన్యుల జీవితాలు. పల్లె జీవన చిత్రణ. రైతుజీవనచిత్రణ. చేనేత బ్రతుకుల ఇక్కట్లు. స్త్రీలఇక్కట్లు. మానవ సంబంధాలు. ప్రపంచీకరణ. ఉన్నత వర్గ ఊరేగింపులు. పేదల ఆకలి చావులు. కరువైన మానవత్వం.వృద్ధుల సమస్యలు. నేటి యువతీ యువకుల జీవనశైలి. పతనమవుతున్న నైతిక విలువలు. మధ్య తరగతి వారి మనస్తత్వ చిత్రణ. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ. చైతన్య స్రవంతి ధోరణి. సమకాలీన సమాజంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాల మోజు. అక్కరకు రానీ టీచర్ ఉద్యోగాలు. పేదల ప్రేమలు.వలస బతుకు వెతలు. వివిధ ఉద్యమాల ప్రభావం. యువతపై రాజకీయాల ప్రభావం. పక్కదారి పడుతున్న ప్రభుత్వ పథకాలు. కడుపు మండిన ప్రజల తిరుగుబాటు. స్వాతంత్రం వచ్చినాక కూడా మారని పరిస్థితులు. కోటి ఆశలతో కొత్త నగరానికి వలసలు – కొత్త రూపంలో అనుభవం అయ్యే సమస్యలు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో కూడా స్థూలంగా ఇవే సామాజిక సమస్యలు అభివృద్ధికి ఆటంకాలుగా నిలుస్తున్నాయి. సామాజిక స్పృహ

కలిగిన కొందరు రచయితలు ఈ సామాజిక సమస్యలను రూపుమాపి ప్రజలందరిలో సామాజిక చైతన్యం నింపేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు అలా కృషి చేస్తున్న అభ్యుదయ విప్లవ రచయిత ఆడెపు లక్ష్మీపతి.

**పరిచయం:**

వస్తుగాఢత, శిల్పనైపుణ్యం, మేధో స్పర్శ, మేలిమి కలయికలతో కథలు రాసే రచయిత (మరపురాని ప్రయాణ కథలు. పు 83) ఆడెపు లక్ష్మీపతి. 1955 మార్చి5 కరీంనగర్ జిల్లాలో ఒక చేనేత కుటుంబంలో పుట్టారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో 30 సంవత్సరాలు ఉద్యోగం చేసి స్వచ్ఛంద పదవి విరమన పొందారు. వీరి మొదటి కథ "ఆదర్శం"1972లో అచ్చయింది. ఇప్పటివరకు 25 కథలకు పైగా రాశారు. వీరి రచనలు రాశిలో తక్కువైనా వాసిలో పేరెన్నికమైనవి. వీరి కథలన్నీ దేనికదే ప్రత్యేకతతో నిలుస్తుంది. "నాలుగు దృశ్యాలు", "త్రిభుజపు నాలుగో కోణం" పేరుతో రెండు కథ సంపుటాలను వెలువరించారు. వీటిలో కొన్ని కథలు ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి. డజనుకు పైగా కథలు పలు ప్రతిష్టాత్మక సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. వీరు కథకులు మాత్రమే కాదు విమర్శకులు కూడా "దిక్చక్రం" అనే విమర్శ వ్యాస సంపుటిని ప్రచురించారు. మీరు అనువాదకులు కూడా.

"తత్వవేత్తలు ఇప్పటిదాకా సమాజాన్ని అనేక రకాలుగా విశ్లేషించారు. ఇప్పుడు కావలసింది దాన్ని మార్చడం". అన్నది కార్ల్ మార్క్స్ అభిప్రాయం. అంటే ఇక్కడ సమాజాన్ని విశ్లేషించడం చాలిక దానికి మార్పు అవసరం. ఆ మార్పు ఎలా వస్తుంది? నేటి సమాజం చైతన్యవంతం అయితే వస్తుంది. నేటి సమాజం ఎలా చైతన్యవంతం అవుతుందంటే కథలు, నవలలు, వ్యాసాలు వంటి తదితర సాహిత్య ప్రక్రియల ద్వారా సమాజం చైతన్యవంతం అవుతుంది. మరి సాహిత్యం ఇప్పుడు ఎలా ఉంది. అన్నదాన్ని ఒక చిన్న పరిశీలనగా చూద్దాం. సాహిత్యం మూడు రకాలుగా ఉంటుంది. ఒకటి సమాజాన్ని వెనక్కినెట్టేది. రెండవది సమాజాన్ని ఉన్నచోటనే ఉంచేది. మూడవది సమాజాన్ని ముందుకు నడిపించేది. ముందటిది లేదా మొదటిది తిరోగమనవాద సాహిత్యం. రెండవది యధాతథవాద సాహిత్యం. మూడవది పురోగమన వాద సాహిత్యం. రెండవది సారాంశంలో మొదటిదానికన్నా భిన్నంగా కనిపించిన గట్టిగా లాగితే అది మొదట దాంట్లోనే కలుస్తుంది. మరి ఈ రకంగా ఆలోచించినప్పుడు సాహిత్యం కేవలం రెండు రకాలే అనిపిస్తుంది. "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అనుకునే వాళ్ళు మొదటి రకం సాహిత్యాన్ని. "మంచి గతమున కొంచమే నోయ్ "అనుకునే వాళ్ళు రెండో రకం సాహిత్యాన్నిసృష్టిస్తారు, చదువుతారు, ప్రచారం చేస్తారు. ఆదరిస్తారు. ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల రాజమండ్రి వారు నిర్వహించే ఆధునిక సాహిత్య ప్రక్రియలు సామాజిక ప్రయోజనాలు అనే అంశం కూడా రెండో రకం సాహిత్యం కిందికి వస్తుందని, ఇది పురోగమనవాద సాహిత్యమేనని ఈ సాహిత్య అంశం ద్వారా కార్ల్ మార్క్స్ అన్నట్టు సమాజంలో మార్పు వస్తుందని నా ప్రగాఢ కాంక్ష.

**లక్ష్మీపతి కథలు – సామాజిక ప్రయోజనాలు జీవన చిత్రణ**

**నాలుగు దృశ్యాలు కథ;** ఈ కథ విస్తృతి పరంగా పెద్ద కథ. ఈ కథ రెండు మూడు రకాల సామాజిక ప్రయోజనాలను పొందింది. ఒకటి సమకాలీన తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువు.. చదువు అంటూ ఒక మర బొమ్మల తయారు చేస్తున్నారు. వారిని స్కూల్ అనే జైలు గోడల్లో బంధించి చదువు సాఫ్ట్వేర్ ఉద్యోగం అనే ఆలోచనలోనే బ్రతుకుతున్నారు. ఈ కథలో ఇంకో ముఖ్య విషయం ఈ తరం తల్లిదండ్రులు తమ మూలాలను మర్చిపోతున్నారు. పిల్లలను సృజనాత్మక శక్తిని వారి నుంచి దూరం చేస్తున్నారు. ఈ తరం వారికి పాత తరాల వారిని అందించి పిల్లలలో ఉన్న సృజనాత్మకత అభివృద్ధి చెందడానికి పాత తరం వారు అనగా అమ్మమ్మ,నాన్నమ్మ,తాతయ్య. వంటి వారు ఎంతో అవసరమని ఈ కథ నొక్కి చెబుతోంది. ఇక చివరలో ఈ కథలో కొసమెరుపు ఏమిటంటే సునీల్ వాళ్ళ డాడీ వృత్తిరీత్యా జర్నలిస్ట్ ఎక్కడో ఉన్న బాల కార్మికుడిని విడిపించడానికి ఎన్నో పాట్లు పడుతుంటాడు. కానీ తన ఇంట్లోనే ఒక బాల కార్మికుడు ఉన్నాడనే విషయం ఆయనకు అర్థం కాదు.

**నేటి యువతీ యువకుల జీవనశైలికి నిలువుటద్దం – నిశ్చలన చిత్రం కథ:** ఈ కథ అందించే అద్భుతమైన సందేశం లేదా ప్రయోజనం ఏమిటంటే.. ఉన్నత వర్గాలు తమ సంపాదనలో పడి తమ పిల్లల ప్రేమానుబంధాలకు దూరంగా ఉంటారు. వారేం చేస్తున్నారు? ఎలా ఉన్నారు? అన్న విషయాలేవీ పట్టించుకోరు. కాలేజీలకు, స్కూళ్లకు కావాల్సిన ఫీజులు మాత్రమే కడతారు. కానీ తమ పిల్లలు ఏ జీవనశైలితో మెలుగుతున్నరు. వారి స్నేహాలు ఎలా ఉన్నాయి. వారు మత్తు వస్తువులకు ఎలా అలవాటు పడుతున్నారు. అనే అంశాలను

చక్కని కథనంతో యదార్థంగా చిత్రీకరించారు. కథలోకెళితే రవివర్మ మంచి ఫోటోగ్రాఫర్. ఆయనకు సెమీన్యూడ్ ఫోటోలు తీయడంలో మంచి కళ ఉన్నది. అది గుర్తించిన ఒక పత్రిక సంస్థ ఉద్యోగాన్ని ఆఫర్ చేస్తుంది. లాభార్జననే ధ్యేయంగా ఉన్న పత్రిక సంస్థ కాబట్టి నైతిక అంశాలులేవి పట్టించుకోదు. రవి వర్మ కూడా సంపాదన అనే మత్తులో పడి, అమ్మాయిల సెమీ న్యూడ్ ఫోటోలు తీయడంలో చేయి తిరిగిన వాడిగా పేరు ఎక్కుతాడు. ఒకరోజు ఒక అమ్మాయి ఫోటో షూటింగ్ అయిపోయిన తర్వాత ఆమె ఒక డ్రగ్ ఎడిక్ట్ అని తెలుస్తుంది. ఆమెతో చొరవ తీసుకొని మాట్లాడిన అతనికి ఆమెకు ఒక బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని, అతడు కూడా డ్రగ్స్ ఎడిక్ట్ అని అతను చాలా మంచి మంచివాడని చెబుతుంది. ఈ కథలో కొసమెరుపు ఏమిటంటే ఆ సెమిన్యూడ్ గర్ల్ బాయ్ ఫ్రెండ్ ఫోటోగ్రాఫర్ కొడుకు ఇద్దరు ఒకటేనని తెలిసి రవివర్మ గుండె ఆగినంత పనైతుంది. కొడుకు ఇంజనీరింగ్ చదివి గొప్పవాడవుతాడు అనుకుంటే కళ్ళ ముందే అతని జీవితం మత్తు,అమ్మాయిలు.. అనే వ్యసనాల పాలు కావడం ఆ ఫోటోగ్రాఫర్ కు జీర్ణించుకోలేని వాస్తవమవుతుంది. ఈ కథ యదార్థవాదంతో చిత్రించబడింది. ఈ కథ నేటి యువతీ యువకుల జీవనశైలికి అద్దం పడుతుంది.

**ఫ్యూడల్ వ్యవస్థ కింద నలిగిన దళితుల జీవితాలు**

**రాబందులు కథ :** ఒక గ్రామంలో రామయ్య అనే మోతుబరి రైతు. ఏదో అనారోగ్యంతో తన ఎద్దు చనిపోతుంది. ఆ చనిపోయిన ఎద్దును జగ్గడు అనే నిరుపేద దళిత వ్యక్తి ఎద్దు తోలును వలిచేందుకు ప్రయత్నిస్తాడు. కారణం డప్పు తయారు చేసుకోవడానికి, ఆ డప్పే వారిని పోషిస్తుంది కాబట్టి. దాని కోసమె ఎద్దు చర్మం ఒలుస్తుంటాడు. అది సహించలేని రామయ్య వికృతమైన ఆక్రోషంతో ఒక పెద్ద కర్రతో చితకబాదుతాడు. ఆ నొప్పికి తాళలేక జగ్గడు ఎద్దు చర్మాన్ని ఒలవడం ఆపేస్తాడు. ఆ జగ్గాడి కుటుంబం ఆకలి చావుల పాలవుతుంది.చివరికి ఆ జగ్గడు కూడా నొప్పులకు తాళలేక చనిపోతాడు. ఆ చనిపోయిన ఎద్దు మాంసం కంపు కొడుతూ వ్యర్థంగా పడి ఉంటుంది అది కేవలం రాబందులకు(గద్దలకు) మాత్రమే ఇష్టమైన ఆహారంగా మారుతుంది. ఈ కథ అందించిన సామాజిక ప్రయోజనం ఏమిటంటే దళితుల్లో కూడా చైతన్యం రావాలి. వారికి బతకడానికి డప్పు తప్ప ఇంకో మార్గం లేదు. ఆ డప్పు తయారు చేసుకుందామంటే ఎద్దు చర్మం కావాలి. కానీ ఎద్దును కోయనివ్వరు,చర్మాన్ని ఒలవనివ్వరు. అంటే ఇక్కడ పశువులకు ఉన్నంత విలువ కూడా దళితులకు లేదనే వాస్తవికమైన అంశాన్ని తెలియజేయడమే కాక ఎంతమంది దళితులు ఇలా ఆకలి చావులు పాలయ్యారో కథ యదార్థంగా వాస్తవికంగా చిత్రించింది.

**బంద్ కథ**: ఒక సమాజపు నష్టాన్నికి వ్యతిరేకంగానే బంద్ ప్రకటించిన, అదే సమాజంలో అంతర్భాగమైన చిన్న వ్యాపారస్తుల, కూలీ చేస్తే తప్ప పూట గడవని కార్మికుల పాలిట ఈ బందు అనేది ఇంకో అదనపు నష్టాన్ని కలిగిస్తుందన్న సూక్ష్మవిషయాన్ని లక్ష్మీపతి కథ వస్తువుగా స్వీకరించడం అతని లోచూపుకు నిదర్శనం.

**సాధరణ రైతు జీవితాన్ని ప్రతిబింబించే కథ – ఆక్రోశం :** ఈ కథలో ఆనాటి వివిధ ఉద్యమాలకు నాయకుడిగా సత్తయ్య పాత్ర ఉంటుంది. అతని తండ్రి వెంకటి పాత్ర వెట్టి చాకిరి బానిసత్వాలకు ప్రతీక. ఈ కథ అనేక సామాజిక అంశాలను ప్రస్తావించింది. ఉదాహరణకు సంచార జాతుల సమస్యలు. వెట్టిచాకిరి బానిసత్వం. సత్తయ్య చేసే విప్లవ ప్రబోధం. వర్గ సంఘర్షణ. స్త్రీ –పురుష సంబంధాలు. ధనిక వర్గాలకు కొమ్ముగాసే పోలీసు వ్యవస్థ. దినసరికూలీలు.తొవ్వలు బంద్. మొదలైన అంశాలను ప్రస్తావించింది . కథలోకెలితే ఆనాటి ఉద్యమాలకు నాయకుడిగా ఉన్న సత్తయ్య పాత్ర దొరల పన్నాగాలకు బలైపోయి, తల్లిదండ్రులను శోకసముద్రంలో ముంచేస్తుంది. తన కొడుకు జ్ఞాపకాలకు బానిసైన వెంకటి అన్న పానీయాలను కూడా మర్చిపోతాడు. కొద్దిసేపటి తర్వాత గుర్తుకు వచ్చి తిందామని చూస్తే, ఒక కుక్క తన సద్దిని నేలపాలు చేసి తింటూ ఉంటుంది. ఆ కోపంతో తన ఆక్రోశానంతా కుక్కపై చూపించి ఏదో సాధించానన్న తృప్తితో తీరిగ్గా బీడీ కాల్చుకుంటాడు. పల్లెకు సంబంధించిన సమగ్ర అంశాలను. పల్లె జనుల మనస్తత్వాలను వాస్తవికవాద చిత్రణతో. సహజత్వం ఉట్టిపడేలా చిత్రించిన కథ ఆక్రోశం.

ఈ కథ సాధించిన ప్రయోజనం నాటి గ్రామీణ జీవితాల్లో రైతు జీవితాల్లో మార్పు సాధించడం. గ్రామీణ జీవితాల్లో కొద్ది వరకు మార్పు సాధించిన, రైతు జీవితాల్లో మాత్రం ఎటువంటి మార్పు సాధించలేకపోయింది ఈ కథ.

**చైతన్య స్రవంతి ధోరణి: "మనిషి జీవితాన్ని బాహ్య సంఘటనలు మాత్రమే నిర్మించవు. అతని అంతరంగంలో క్షణం క్షణం ప్రవహించే ఆలోచనలే నిజమైన జీవితాన్ని నిర్మిస్తాయి".** అన్న అవగాహన నుంచి ఈ చైతన్య స్రవంతి అనే ఆధునిక కథన పద్ధతి

పుట్టుకొచ్చింది. ఇది ఆడెపు లక్ష్మీపతి గారికి ఎంతో ఇష్టమైన టెక్నిక్. ఈ శిల్పంతోనే లక్ష్మీపతి గారు జీవన్మృతుడు, తిర్యగ్రేఖ, విధ్వంసదృశ్యం మొదలైన కథలు చైతన్య స్రవంతి శిల్పంలో సమర్థవంతంగా వచ్చిన కథలు. ఈ చైతన్య స్రవంతి శిల్పం ద్వారా కథ సాధించే సామాజిక ప్రయోజనం ఏమిటంటే వ్యక్తుల బాహ్య పరిస్థితులతో పాటు, అంతర్ పరివర్తనను కూడా కథలో పొందుపరచడం జరుగుతుంది. అందువల్ల పాత్ర బాహ్యచిత్రణ తో పాటు మనసులోపలి అంతర్ ఆలోచనల ప్రవాహాలను కూడా ఆవిష్కరించే అవకాశం ఈ ధోరణిలో ఉంటుంది.

**జీవన్మృతుడు కథ,: 1990 నాటి పరిస్థితులను** అంటే గ్లోబలైజేషన్ ఎఫెక్ట్ ఉద్యోగుల మీద ఎలా పడుతుందో చిత్రించిన మొదటి కథ జీవన్మృతుడు. ఈ ఎఫెక్ట్ వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా కరీంనగర్, అదిలాబాద్ ప్రాంతాల నుండి రియాద్ వలసలను ఈ కథ చిత్రిస్తుంది. ఈ కథ అంతర్ ఆలోచనలతో ఉత్తమ పురుష కోణంతో నడుస్తుంది. ఈ కథ డబ్బు డబ్బు అంటూ సంపాదన కోసం పరుగెట్టె ఒక ఇంజనీర్ గురించి అతడికి ఇష్టం లేకున్నా రియాద్ లో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసిన తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్ళవలసి వస్తుంది. అక్కడకు వెళ్లాక తన తల్లి చివరి చూపుకు కూడా నోచుకోలేక పోయినా దుర్భరమైన పరిస్థితులను వలస బతుకుల వెతలను వాస్తవిక కోణంలో,చైతన్య స్రవంతి కోణంలో చిత్రించిన కథ జీవన్మృతుడు.

**పతనమైపోయిన కుటుంబ మానవ విలువల సమూహ దృశ్యాలే విధ్వంసదృశ్యం కథ :**

మధ్యతరగతి జీవితం ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొంటుంది అన్న అంశాన్నిచిత్రించిన కథ ఇది . ఒక్క స్త్రీ రెండు గంటల వ్యవధిలో మార్కెట్కు వెళ్ళి కూరగాయలు కొంటున్నప్పటి నుంచి ఆమె మనస్సు ఒక ఆలోచనల ప్రవాహం అవుతుంది. ఆ ఆలోచనలన్నీ ఒక క్రమబద్ధంగా ఉండవు ఉదాహరణకు ధరలు మండిపోవడం, పిల్లల చదువు ఖర్చులు, వారి ఉద్యోగ ప్రయత్నాల కోసం చేసే ఖర్చులు, ఇంటి దగ్గర కూడా పనివారందరు తమ రేట్లను పెంచడం .అంటే పాలవాడు, పనివాడు, చాపల అమ్మేవాడు, చాకలివాడు. వీరు రేట్లు పెంచడానికి చూసి కథానాయక కించిత్ కోపం, కించిత్ కుళ్ళుతో తిట్టిపోయడం , శాపనార్థాలు పెట్టడం వంటివి చేస్తుంది, వెంటనే ఇంకో ఆలోచన **గొర్రె తోక జీతాలు బర్రెతోక ఖర్చులు**. ఆ వెంటనే ఆరోగ్యాలోచనలతో డాక్టర్లకి ఏమీ మస్తు చెబుతుంటారు. మంచి ప్రోటీన్ల ఆహారం తీసుకోవాలి అని , అంటే జీడిపప్పు బాదం గుడ్లు అమ్మో వీటన్నిటికీ రేట్లు మండిపోతున్నాయి. అయినా **మోసే వాడికి తెలుసు కాడి బరువు.** అని తినే పదార్థాలను కూడా తగ్గించుకోవడం. ఈ వాక్యాలు మధ్యతరగతి జీవితాలకు, వారి మనస్తత్వాలకు అద్దం పడుతున్నాయి. నేటి సమాజం సంపాదించడానికి వంద మార్గాలు వెతుక్కుంటే, మోసం చేయడానికి వెయ్యి మార్గాలను వెతుక్కుంటున్నారు. ఉదాహరణకు వడ్డీచిట్టీల మోసం, అధిక వడ్డీ వస్తుందని ఆశతో వేలకువేలు సామాన్య జనులు మోసపోతున్నారు. వ్యాపారంలో దళారుల మోసం. హాస్టల్ నుంచి ఇంటికి వచ్చే పిల్లలు ధరించే దుస్తుల్లో కూడా వారి శరీర సౌష్టవాన్ని చూసి సొల్లు కార్చుకునే సిగ్గులేని సమాజం మానవ విలువల్ని మంటగల్పుతుంది. ఈ కథకు విధ్వంసదృశ్యం అనే పేరును ఎందుకు పెట్టాడో ఈ రెండు వాక్యాలు ద్వారా మనకు అవగతం అవుతుంది. **"నలభై లో పడి కూడా నీ పర్సనాలిటీ చాలా బాగుంది. మంచి తిండి తింటే ఇంకా నిగనిగలాడతావ్. ఆరు నెలల ఒకసారి బొంబాయి, మద్రాస్ నగరాల కెళ్ళి వారం రోజులు గుట్టుగా గడిపి వేలకు వేలు సంపాదిస్తున్న వారు ఈ పట్నంలో ఐదారుగురు ఉన్నారు"...** పై వాక్యాల ద్వారా కథ చెప్పే సామాజిక ప్రయోజనం ఏమిటంటే సమకాలీన సమాజం ఏ విధంగా విధ్వంసం అవుతుందో. ఎందుకు సమాజం కుళ్ళు,కుతంత్రాలు,ఈర్ష ద్వేషాలతోరగిలిపోతుందో వాటికి గల కారణాలను కూడా కథ వివరిస్తుంది. ఈ కథ వాస్తవికవాద కోణం మరియు చైతన్య స్రవంతి ధోరణి రెండు కలిసిన ఒక కొత్త టెక్నిక్ తో సమాజ వర్తమాన స్థితిని కళ్ళకు కట్టినట్టు వివరిస్తుంది.

**స్త్రీల ఇక్కట్లు:** సమాజంలో స్త్రీ – పురుష భేదమే నిజమైన భేదం. కుల వర్గాది బేధాలు మానవ కల్పితాలు స్త్రీ –పురుష భేదం ప్రకృతి సిద్ధం. సమాజంలో కూడా స్త్రీ – పురుష సంబంధాలకే అగ్రస్థానం. అయితే ఈ వర్గ సమాజంలో స్త్రీ పురుష సంబంధాలను కూడా ఆర్థిక స్థితిగతులే నిర్ణయిస్తున్నాయి.

**వ్యభిచారం కథ:** ఈ కథ అందించే సామాజిక ప్రయోజనం ఏమిటంటే, సమకాలీన సమాజంలో జరుగుతున్న పెళ్ళి చూపులన్నీ అమ్మాయిల పాలిట మానసిక వ్యభిచారం లాంటివే అని నిరూపించిన కథ వ్యభిచారం.

**మలుపు కథ:** ఈ కథ అందించే సామాజిక ప్రయోజనం. ఎవరెంత ప్రేమ చూపెట్టిన కన్నతల్లి ప్రేమకు సాటి రాదనే సత్యం. ఒక వితంతువు రెండవ పెళ్లి చేసుకుని తన రెండవ భర్తని, తనను తన బిడ్డకు దూరం చెయ్యొద్దని అతనిని మార్చడం ద్వారా రెండవ

పెళ్లిళ్లు సమాజం చేపట్టవచ్చనే భావన, ఈకథలో కనిపిస్తుంది. తన కూతురు కాకపోయినా ప్రేమించే మనస్తత్వం రెండో భర్తలోఉండటం గమనించదగ్గ విశేషం . ఆయన ఆ పాపని తన సొంత కూతురిగా భావించడం, భార్యకు మాట ఇవ్వడం. ఇద్దరు కలిసి పాపను ప్రేమానురాగాలతో చూసుకోవడం ,కథ సాహిత్యంలో ఒక కొత్త వస్తువుగా రూపుదిద్దుకుంది.

**ముగింపు:**

పై కథలన్నింటినీ పరిశీలించిన మీదట మనకు అవగతమయ్యే విషయం ఏమిటంటే, “కథల ప్రయోజనాలు ఎన్ని ఉన్నా, ముఖ్యంగా అవి ఒక జాతి జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. వారి సామాజిక జీవన పరిణామ క్రమంలోని ముఖ్యమైన దశలను, ఘట్టాలను అక్షరబద్ధం చేస్తాయి. కొండకచో సాధారణ చరిత్రకెక్కని సాంస్కృతిక, సంప్రదాయక, రాజకీయ, ఆర్థిక అంశాలను భావితరాల వారికి అందిస్తాయి”.

**ఆధార గ్రంథాలు:**

1) ఖదీర్ బాబు, మహమ్మద్. 2026. ***మరుపురాని ప్రయాణ కథలు***. హైదరాబాద్ : అన్వీక్షికి పబ్లికేషన్స్.
2) దక్షిణామూర్తి, పోరంకి. 2009. ***కథానిక స్వరూప స్వభావాలు***. హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీసెస్.
3) నాగయ్య, జి. 2021.***తెలుగుసాహిత్యసమీక్ష(ద్వితీయ సంపుటి)***. హైదరాబాద్: నవ్య పరిశోధక ప్రచురణలు.
4) చంద్రశేఖర రెడ్డి, రాచపాలెం. 2023. ***మన కథానికలు (తెలుగు కథానికల మీద విమర్శ వ్యాసాలు).*** అనంతపురం. వెంకీ రెడ్డి పబ్లిషర్స్.
5) లక్ష్మీపతి, ఆడెపు. 1997. ***నాలుగు దృశ్యాలు***. గోదావరిఖని : ఆదిత్య పబ్లికేషన్స్.
6) లక్ష్మీపతి, ఆడెపు. 2000. ***త్రిభుజపు నాలుగో కోణం***. హైదరాబాద్: అన్వీక్షికి పబ్లికేషన్స్.
7) లక్ష్మీపతి, ఆడెపు. 2022.***దిక్చక్రం***. హైదరాబాద్: ఆదిత్య లిటరరీ పబ్లికేషన్స్.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# అబ్బూరి ఛాయాదేవి కథలు – సామాజిక దృక్పథం

– డా. గంధం అరుణ

సహాయాచార్యులు

రాయసీమ విశ్వవిద్యాలయం,కర్నూలు.

ఫోన్ : 9701786222

**పరిచయం:**

తెలుగు కథా సాహిత్య పరిణామంలో అబ్బూరి ఛాయాదేవి ఒక ప్రత్యేకమైన కథకురాలిగా గుర్తింపు పొందారు. ఆమె రచనల్లో మధ్యతరగతి కుటుంబ జీవితం, స్త్రీల అనుభవాలు, కుటుంబ సంబంధాలు, వివాహ వ్యవస్థ, స్త్రీ–పురుష అసమానత, వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవం, ఆధునికత–సంప్రదాయాల మధ్య సంఘర్షణ వంటి అంశాలు సహజమైన సామాజిక జీవనం వ్యక్తమవుతాయి. ఆమె కథల్లో సామాజిక సమస్యలు నినాదాల రూపంలో కాకుండా, రోజువారీ జీవితంలోని చిన్న సంఘటనల రూపంలో పాఠకుడి ముందుకు వస్తాయి.ఛాయాదేవి స్వయంగా తన దృక్పథాన్ని "స్త్రీవాద దృక్పథం, మానవతావాద దృక్పథం" గా పేర్కొన్నారు. తన రచనల్లో సందేశం ఉండాలని, అయితే అది పాఠం చెప్పినట్లు లేదా ఉపదేశించినట్లు కాకుండా సూచనాత్మకంగా, పరోక్షంగా పాఠకుడిని ఆకట్టుకునే విధంగా ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయం ఆమె కథా శిల్పాన్ని అర్థం చేసుకోవడానికి కీలకమైన ఆధారం.ఈ నేపథ్యంలో అబ్బూరి ఛాయాదేవి కథలను కేవలం "స్త్రీ సమస్యల కథలు"గా కాకుండా, **వ్యక్తి–కుటుంబం–సమాజం మధ్య ఉన్న సంబంధాలను పరిశీలించే సామాజిక కథలుగా** అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

**అబ్బూరి ఛాయాదేవి – జీవితం, విద్య, సాహిత్యం:**

అబ్బూరి ఛాయాదేవి 1933 అక్టోబర్ 13న రాజమండ్రిలో జన్మించారు. ఆమె బాల్యం, విద్యాభ్యాసం, కుటుంబ వాతావరణం ఆమె ఆలోచనా ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో 1951–53 మధ్య ఎం.ఏ. చదివినట్లు జీవితచరిత్రాత్మక ఆధారాలు తెలియజేస్తున్నాయి.ఆమెకు చిన్ననాటి నుంచే పఠనాభిరుచి ఉండేది. ఆర్.కె. నారాయణ్, షేక్స్‌పియర్, రుడాల్ఫ్ బీజియర్ వంటి ఆంగ్ల రచయితలతో పాటు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గురజాడ అప్పారావు వంటి తెలుగు రచయితలు తనను ప్రభావితం చేశారని ఆమె స్వయంగా తెలిపారు.ఆమె రచనా జీవితపు ప్రారంభానికి సంబంధించి ఆధారాల్లో కొంత భేదం కనిపిస్తుంది. ఒక ఇంటర్వ్యూలో ఆమె తన మొదటి కథ **"అనుబంధం"** అని, అది నిజాం కళాశాల విద్యార్థి పత్రికలో ప్రచురితమైందని చెప్పారు. మరో సాహిత్య పరిశీలనలో **"అనుభూతి"** కథ 1952–53 ప్రాంతంలో ప్రచురితమైన తొలి రచనగా పేర్కొనబడింది. కాబట్టి పరిశోధనా రచనలో ఈ అంశాన్ని "మొదటి కథ పేరుపై ఆధారాల్లో భేదం ఉంది" అని నమోదు చేయడం సముచితం.ఇది ఒక ముఖ్యమైన అంశాన్ని తెలియజేస్తుంది. ఛాయాదేవి కథా రచన అకస్మాత్తుగా ఏర్పడిన సాహిత్య వ్యాసంగం కాదు; పఠనం, వ్యక్తిగత అనుభవం, కుటుంబ పరిశీలన, సమాజాన్ని గమనించే స్వభావం వంటి అంశాల సమ్మేళనం నుంచి అది రూపుదిద్దుకుంది.

**ఉద్యోగ జీవితం – సాహిత్య దృష్టి విస్తరణ:** ఛాయాదేవి గ్రంథాలయ రంగంలో పనిచేశారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఉప గ్రంథాలయాధికారిణిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. అంతకుముందు డిఫెన్స్ సర్వీసెస్ లైబ్రరీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ గ్రంథాలయాల్లోనూ పనిచేశారు. గ్రంథాలయ వృత్తి ఆమె సాహిత్య దృష్టికి ఉపయోగపడిన అంశంగా చూడవచ్చు. వివిధ భాషల, వివిధ సంస్కృతుల, వివిధ ఆలోచనా ధోరణుల సాహిత్యాన్ని పరిచయం చేసుకునే అవకాశం ఆమెకు లభించింది. అనువాదకురాలిగా కూడా ఆమె పనిచేశారు. జిడ్డు కృష్ణమూర్తి రచనలను తెలుగులోకి తీసుకురావడంలో ఆమె పాత్రను తరువాతి విమర్శకులు ప్రత్యేకంగా గుర్తించారు.

ఆమె భర్త అబ్బూరి వరదరాజేశ్వరరావు కూడా రచయిత, విమర్శకుడు. సాహిత్య వాతావరణంలో కొనసాగిన కుటుంబ జీవితం ఆమె రచనా ప్రయాణానికి అనుకూలమైన మేధోపరిసరాలను కల్పించింది.

**ఛాయాదేవి సాహిత్యం:** అబ్బూరి ఛాయాదేవి కథలు సంఖ్యాపరంగా విస్తారమైనవి కాకపోయినా, అనుభూతి సాంద్రత, పరిశీలనా శక్తి, సామాజిక స్పృహల వల్ల ప్రత్యేకమైన గుర్తింపును పొందాయి. "తనకు చాలా తీవ్రంగా అనిపించినప్పుడే రాస్తాను" అని ఆమె స్వయంగా చెప్పిన మాటలు ఆమె రచనా పద్ధతిని సూచిస్తాయి.ఆమె కథలు హిందీ, తమిళం, మరాఠీ, కన్నడ తదితర భాషల్లోకి అనువదించబడ్డాయి. తన మార్గం కథా సంపుటిలోని కథల శైలి సులభంగా, వాడుక భాషకు దగ్గరగా ఉండటం, కథనం ప్రధానంగా ఉత్తమ పురుషలో సాగడం వంటి అంశాలను విమర్శకులు గుర్తించారు.

ఆమె రచనల్లో ముఖ్యమైనవి:

* *అబ్బూరి ఛాయాదేవి కథలు*
* *తన మార్గం*
* *మృత్యుంజయ*
* *చైనాలో ఛాయాచిత్రాలు*
* *అనగనగా కథలు*
* *అపరిచిత లేఖ*
* *వరదస్మృతి*
* *వరదోక్తులు*
* *వ్యాస చిత్రాలు*
* *మన జీవితాలు*
* జిడ్డు కృష్ణమూర్తి రచనలకు సంబంధించిన అనువాదాలు, వ్యాఖ్యానాలు

ఈ రచనల ద్వారా ఆమె కథకురాలిగానే కాకుండా వ్యాసకర్త, అనువాదకురాలు, సంపాదకురాలు, కాలమిస్టుగా కూడా తన బహుముఖ ప్రతిభను చూపించారు.

**ఛాయాదేవి కథల్లో సామాజిక దృక్పథం:**

ఛాయాదేవి కథల సామాజిక దృక్పథాన్ని పరిశీలించినప్పుడు ప్రధానంగా ఐదు అంశాలు కనిపిస్తాయి:

1. స్త్రీ–పురుష అసమానత
2. కుటుంబ వ్యవస్థలో స్త్రీ స్థానం
3. వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవం
4. మధ్యతరగతి జీవితంలోని ఒత్తిళ్లు
5. ఆధునికత–సంప్రదాయాల మధ్య సంఘర్షణ

ఆమె కథల్లో సామాజిక సమస్య ఒక సిద్ధాంత ప్రకటనగా కనిపించదు. అది ఒక ఇంట్లో జరుగుతున్న చిన్న సంఘటనగా, ఒక భార్య అనుభవంగా, ఒక తల్లి ఆవేదనగా, ఒక ఉద్యోగినికి ఎదురయ్యే సమస్యగా లేదా ఒక కూతురు ఆలోచనగా కనిపిస్తుంది.

ఇదే ఛాయాదేవి కథా విధానంలోని ప్రత్యేకత.

**స్త్రీ–పురుష అసమానత:** ఛాయాదేవి కథల్లో అత్యంత స్పష్టంగా కనిపించే సామాజిక సమస్య స్త్రీ–పురుష అసమానత.

సమాజం పురుషుడికి ఇచ్చే స్వేచ్ఛ, నిర్ణయాధికారం, సామాజిక గౌరవం స్త్రీకి అదే స్థాయిలో లభించకపోవడాన్ని ఆమె కథలు ప్రశ్నిస్తాయి. స్త్రీ చదువుకున్నా, ఉద్యోగం చేసినా, సంపాదించినా, కుటుంబ నిర్ణయాల్లో ఆమె మాటకు సమానమైన విలువ లేకపోవడం ఆమె రచనల్లో సమస్యగా మారుతుంది.అయితే ఈ విమర్శ పురుష వ్యతిరేకతగా మారదు. వ్యవస్థలోని అసమానతను ప్రశ్నించడమే ప్రధానంగా కనిపిస్తుంది.

ఈ విషయాన్ని ఛాయాదేవి స్వయంగా తన స్త్రీవాద, మానవతావాద దృక్పథం ద్వారా స్పష్టం చేశారు. ఆమెకు స్త్రీవాదం అంటే పురుష ద్వేషం కాదు. స్త్రీకి సమానమైన మానవ గౌరవం, స్వేచ్ఛ, వ్యక్తిత్వం లభించాలనే దృక్పథం.

**'బోన్సాయ్ బ్రతుకు' – స్త్రీ జీవితానికి ప్రతీక:**

అబ్బూరి ఛాయాదేవి సామాజిక దృక్పథాన్ని అత్యంత ప్రతీకాత్మకంగా వ్యక్తీకరించే కథల్లో **'బోన్సాయ్ బ్రతుకు'** ముఖ్యమైనది. బోన్సాయ్ మొక్క సహజంగా విస్తరించి పెరిగే సామర్థ్యం ఉన్నప్పటికీ, దాని పెరుగుదలను నియంత్రించి చిన్న పరిమాణంలో ఉంచుతారు. ఈ మొక్కను స్త్రీ జీవితానికి ప్రతీకగా ఉపయోగించడం ద్వారా రచయిత్రి ఒక లోతైన సామాజిక వాస్తవాన్ని సూచించారు.స్త్రీకి కూడా ప్రతిభ, జ్ఞానం, ఆశలు, స్వప్నాలు, స్వతంత్ర ఆలోచనలు ఉంటాయి. అయితే కుటుంబ నియమాలు, సామాజిక అంచనాలు, లింగ వివక్ష, వివాహ వ్యవస్థలోని అసమానతలు ఆమె వ్యక్తిత్వ వికాసాన్ని పరిమితం చేయవచ్చు.కథలోని బోన్సాయ్ అందమైన అలంకార వస్తువు మాత్రమే కాదు సహజమైన ఎదుగుదలను కృత్రిమంగా నియంత్రించే సామాజిక నిర్మాణానికి ప్రతీక.ఈ కథ స్త్రీవాద సాహిత్య చర్చల్లోనూ ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. భూమికలోని సాహిత్య చర్చలు కూడా ఛాయాదేవి 'బోన్సాయ్ బ్రతుకు'ను స్త్రీ జీవితంలోని అణచివేతను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన కథ.

**'సుఖాంతం' – కుటుంబ వ్యవస్థలో స్త్రీ శ్రమ:** 'సుఖాంతం' కథ కుటుంబ వ్యవస్థలో స్త్రీపై పడే కనిపించని భారాన్ని విశ్లేషించే ముఖ్యమైన కథ. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ, భర్త అవసరాలు, కుటుంబ సభ్యుల బాధ్యతలు – ఇవన్నీ స్త్రీ సహజమైన కర్తవ్యాలుగా భావించే సామాజిక ధోరణిని కథ ప్రశ్నిస్తుంది.ఈ కథలో స్త్రీకి విశ్రాంతి, వ్యక్తిగత సమయం, స్వీయ జీవితం లేకుండా పోవడం ఒక మానసిక సంక్షోభంగా మారుతుంది. కథలోని "సుఖాంతం" అనే శీర్షిక కూడా వ్యంగ్యార్థాన్ని సంతరించుకుంది.ఈ కథకు వ్యక్తిగత అనుభవాల ఆధారం ఉన్నట్లు ఛాయాదేవి స్వయంగా తెలిపారు. తన తల్లి, అక్క, అత్తగారు, రెండవ ఆడపడుచు తదితరుల అనుభవాలతో పాటు తన చిన్ననాటి అనుభవాలను కలిపి కథను రూపొందించినట్లు ఆమె చెప్పారు.

**'స్పర్శ' – ఆర్థిక వనరుల కంటే భావోద్వేగ సంబంధం:** ఛాయాదేవి కథల్లో కుటుంబాన్ని కేవలం ఆర్థిక యూనిట్‌గా కాకుండా భావోద్వేగ సంబంధాల సమాహారంగా చూడవచ్చు.'స్పర్శ' కథలో పిల్లలకు తల్లిదండ్రుల నుంచి లభించాల్సిన ప్రేమ, సమయం, ఆప్యాయత వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. తల్లిదండ్రులు పిల్లలకు విద్య, ఆహారం, వస్త్రాలు, ఆర్థిక భద్రత అందించడం మాత్రమే వారి బాధ్యత కాదని; పిల్లల భావోద్వేగ ప్రపంచంలోనూ వారు భాగస్వాములు కావాలని కథ సూచిస్తుంది.ఇక్కడ రచయిత్రి ఆధునిక జీవన విధానంలోని ఒక విరుద్ధతను చూపిస్తుంది. ఆర్థిక ప్రగతి పెరిగినా, కుటుంబ సభ్యుల మధ్య భావోద్వేగ దూరం పెరిగే అవకాశం ఉంది. అందువల్ల 'స్పర్శ' కుటుంబ సంబంధాల్లో మానవీయ అనుబంధం అవసరాన్ని గుర్తుచేసే కథగా పరిగణించవచ్చు.

**'మృత్యుంజయ' – తండ్రి–కూతురు అనుబంధం:** 'మృత్యుంజయ' సాధారణ కథా నిర్మాణానికి భిన్నమైన రచన. తండ్రి–కూతురు మధ్య లేఖల ద్వారా ఏర్పడే అనుబంధాన్ని ఇందులో చూడవచ్చు.ఇది కుటుంబ బంధాన్ని కేవలం భావోద్వేగ స్థాయిలో కాకుండా, ఆలోచనల పరస్పర మార్పిడిగా కూడా చూపిస్తుంది.

తండ్రి–కూతురు సంబంధంలో ప్రేమతో పాటు మేధో సంబంధం, అనుభవాల పంచుకోవడం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు చోటు చేసుకుంటాయి.

**వివాహం – స్త్రీ నిర్ణయాధికారం:** 'ఎవర్ని చేసుకోను?', 'నిర్ణయం', 'స్థానమహిమ' వంటి రచనల్లో వివాహం విషయంలో స్త్రీ నిర్ణయానికి ఉన్న ప్రాధాన్యత కనిపిస్తుంది.

సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో వివాహం చాలా సందర్భాల్లో కుటుంబ నిర్ణయంగా ఉండేది. అయితే వివాహం అనేది వ్యక్తి జీవితాన్ని దీర్ఘకాలం ప్రభావితం చేసే నిర్ణయం. కాబట్టి అందులో స్త్రీ అభిప్రాయానికి స్థానం ఉండాలనే ప్రశ్నను ఛాయాదేవి కథలు ముందుకు తెస్తాయి.

'ఎవర్ని చేసుకోను?' కథకు సంబంధించిన రచయిత్రి స్వీయ వివరణ కూడా ఆసక్తికరం. ఒక పరిశోధనా ప్రశ్నావళిని ఆధారంగా చేసుకుని కథను రూపొందించే ప్రయోగం చేసినట్లు, ఆ తరువాత జ్యోతి పత్రిక కోసం అదే తరహాలో ఈ కథను రాసినట్లు ఆమె తెలిపారు.

**'ప్రయాణం' – స్త్రీ తన మార్గాన్ని తానే ఎంచుకోవడం:** 'ప్రయాణం' కథను ఛాయాదేవి స్త్రీ స్వతంత్రతకు సంబంధించిన తన ఆలోచనల పరిణామంతో అనుసంధానించినట్లు విమర్శకులు పేర్కొన్నారు.తరువాతి కాలంలో ఈ కథను తాను మళ్లీ రాయాల్సి వస్తే కథానాయిక తన జీవితాన్ని తానే నిర్మించుకునే విధంగా ముగింపు మార్చేవాణ్ణేమోనని ఛాయాదేవి చెప్పినట్లు సాహిత్య పరిశీలనలు నమోదు చేశాయి.

ఈ వ్యాఖ్య రచయిత్రి సృజనాత్మక పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైనది. ఒక రచయిత తన పాత రచనను తిరిగి పరిశీలిస్తూ, కాలానుగుణంగా తన ఆలోచనల్లో వచ్చిన మార్పును అంగీకరించడం ఇందులో కనిపిస్తుంది.

**'ఆఖరి ఐదు నక్షత్రాలు' – సామాజిక సంస్థల వాణిజ్యీకరణ:** ఛాయాదేవి రచనలను కేవలం స్త్రీ సమస్యలకు పరిమితం చేయడం సరికాదు.'ఆఖరి ఐదు నక్షత్రాలు' వంటి కథల్లో ఆధునిక వైద్య రంగం, వినియోగ సంస్కృతి, డబ్బు ప్రాధాన్యత వంటి విస్తృత సామాజిక సమస్యలు కనిపిస్తాయి.వైద్యం మానవ సేవకు సంబంధించిన రంగం అయినప్పటికీ అది పూర్తిగా వాణిజ్య ప్రయోజనాల ఆధీనంలోకి వెళ్లినప్పుడు సాధారణ రోగి ఎదుర్కొనే సమస్యలను కథ ప్రశ్నిస్తుంది.

ఇక్కడ కూడా రచయిత్రి ఒక సిద్ధాంతాన్ని ఉపదేశించకుండా, ఒక సామాజిక అనుభవాన్ని కథా వస్తువుగా మార్చడం.

**మధ్యతరగతి జీవితం – ఛాయాదేవి కథల సామాజిక నేపథ్యం:** ఛాయాదేవి కథలకు మధ్యతరగతి కుటుంబం ప్రధాన సామాజిక వేదిక. మధ్యతరగతి కుటుంబంలో ఆర్థిక పరిమితులు, పిల్లల విద్య, వివాహం, ఉద్యోగం, కుటుంబ గౌరవం, బంధువుల అభిప్రాయాలు, సంప్రదాయ విలువలు – ఇవన్నీ వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి.ప్రత్యేకంగా స్త్రీ ఈ అన్ని ఒత్తిళ్లను ఒకేసారి ఎదుర్కొనే పరిస్థితిని రచయిత్రి గమనించారు. అందువల్ల ఆమె కథల్లో వంటగది, పడకగది, కార్యాలయం, కుటుంబ సంభాషణ వంటి సాధారణ ప్రదేశాలే సామాజిక పరిశీలనకు వేదికలుగా మారతాయి.ఇదే ఆమె కథలకు సహజత్వాన్ని ఇచ్చింది.

**ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం – ద్వంద్వ బాధ్యత:** స్త్రీ ఉద్యోగంలోకి రావడం ఆధునిక సమాజంలో ఒక ముఖ్యమైన మార్పు. కానీ ఉద్యోగం వచ్చినంత మాత్రాన స్త్రీకి పూర్తి స్వేచ్ఛ లభించదు.

ఉద్యోగ బాధ్యతలతో పాటు ఇంటి పనులు, పిల్లల సంరక్షణ, కుటుంబ సభ్యుల అవసరాలు కూడా ప్రధానంగా స్త్రీ బాధ్యతగానే కొనసాగితే ఆమెపై "రెండు పనుల" భారం పడుతుంది. ఛాయాదేవి కథల్లో కనిపించే ఉద్యోగినుల సమస్యలను ఈ సామాజిక నేపథ్యంతో చదవవచ్చు.

ఇక్కడ రచయిత్రి సూచించే ప్రధాన విషయం: స్త్రీకి ఉద్యోగం కల్పించడం మాత్రమే సమానత్వం కాదు కుటుంబ బాధ్యతల్లోనూ సమాన భాగస్వామ్యం అవసరం.

**ఆధునికత – సంప్రదాయం:** ఛాయాదేవి కథల్లో సంప్రదాయం మొత్తాన్ని తిరస్కరించడం కనిపించదు. అదే సమయంలో వ్యక్తి స్వేచ్ఛను అడ్డుకునే సంప్రదాయాలను ఆమె ప్రశ్నిస్తారు.కుటుంబం, వివాహం, బంధాలు వంటి సంస్థలు మానవ జీవితంలో అవసరమైనవేనని ఆమె స్వయంగా పేర్కొన్నారు. సమస్య సంస్థల ఉనికిలో కాదు; వాటిలో ఏర్పడే స్వార్థం, ఆధిపత్యం, అసమానతలలో ఉందని ఆమె దృక్పథం.

అందువల్ల ఆమె రచనలను "సంప్రదాయ వ్యతిరేక" సాహిత్యంగా సరళీకరించడం కంటే, సంప్రదాయాన్ని మానవీయ విలువలతో పునఃపరిశీలించే సాహిత్యంగా చూడటం

**స్త్రీవాద దృక్పథం:** ఛాయాదేవి రచనల్లో స్త్రీవాదం నినాదాత్మకంగా కాకుండా జీవనానుభవాత్మకంగా కనిపిస్తుంది.

ఆమె కథల్లో స్త్రీ:

* బాధపడే వ్యక్తి మాత్రమే కాదు;
* ఆలోచించే వ్యక్తి;
* ప్రశ్నించే వ్యక్తి;
* నిర్ణయం తీసుకునే వ్యక్తి;
* తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకునే వ్యక్తి;
* తన జీవితానికి తానే బాధ్యత వహించాలనుకునే వ్యక్తి.

ఇదే కారణంగా ఆమె కథలను తెలుగు స్త్రీవాద కథా పరిణామంలో ముఖ్యమైన భాగంగా పరిశీలించవచ్చు.

భూమికలో జరిగిన కథా చర్చల్లో కూడా స్త్రీ జీవితంలోని అణచివేతను వ్యక్తిగత సమస్యగా మాత్రమే కాకుండా, విస్తృతమైన సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ప్రస్తావించబడింది. ఛాయాదేవి 'బోన్సాయ్ బ్రతుకు' ఈ చర్చలో ఉదాహరణగా నిలిచింది.

**మానవతావాద దృక్పథం:** ఛాయాదేవి స్త్రీవాద రచయిత్రి అయినప్పటికీ ఆమె రచనల అంతిమ లక్ష్యం మానవ సంబంధాలను మరింత మానవీయంగా మార్చడమే.

స్త్రీ—పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, కుటుంబంలో అనురాగం, తల్లిదండ్రులు—పిల్లల మధ్య అనుబంధం, వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవం వంటి విలువలు ఆమె కథల్లో కనిపిస్తాయి.

అందువల్ల ఆమె స్త్రీవాద దృక్పథానికి మానవతావాదం అంతర్భాగంగా ఉంటుంది.

ఆమె స్వయంగా తన దృక్పథాన్ని "స్త్రీవాద" మరియు "మానవతావాద" దృక్పథాలుగా పేర్కొనడం దీనికి ప్రత్యక్ష ఆధారం.

**జిడ్డు కృష్ణమూర్తి ప్రభావం:**

ఛాయాదేవి సాహిత్య వ్యక్తిత్వంలో జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనా ప్రభావం కూడా ప్రస్తావించదగినది. మనిషి తనను తాను పరిశీలించుకోవడం, తనలోని భయాలను, స్వార్థాన్ని, బంధనాలను గమనించడం, తన ఆలోచనా విధానాన్ని ప్రశ్నించుకోవడం వంటి అంశాలు ఆమె రచనల్లో అంతర్ముఖతకు దోహదం చేశాయి.ఆమె అనువాద, వ్యాఖ్యాన రచనల్లోనూ ఈ ఆలోచనా సంబంధం కనిపిస్తుంది. అయితే ఆమె కథలను కేవలం కృష్ణమూర్తి తత్వానికి అన్వయించి చూడటం కంటే, ఆ తాత్విక ప్రభావం ఆమె సామాజిక పరిశీలనతో ఎలా మిళితమైందో అధ్యయనం చేయడం ప్రయోజనకరం.

**తన మార్గం' – ఛాయాదేవి సాహిత్య ప్రస్థానంలో మైలురాయి: 'తన మార్గం '** కథా సంపుటి ఛాయాదేవి సాహిత్య జీవితంలో అత్యంత ప్రాముఖ్యమైన గ్రంథం. ఈ సంపుటికి **2005లో తెలుగు భాషకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు** లభించింది. సాహిత్య అకాడమీ అధికారిక అవార్డు జాబితాలో *Tana Margam (Short Stories)* పేరుతో అబ్బూరి ఛాయాదేవి నమోదు చేయబడ్డారు. ఈ సంపుటిలోని కథలను పరిశీలిస్తే స్త్రీ జీవితంలో కాలానుగుణంగా వచ్చిన మార్పులు, కుటుంబ సంబంధాల్లో వచ్చిన పరిణామాలు, వ్యక్తి స్వేచ్ఛపై పెరిగిన అవగాహన, అయినప్పటికీ కొనసాగుతున్న కొన్ని సామాజిక పరిమితులు వంటి అంశాలు కనిపిస్తాయి.

అందువల్ల తన మార్గంను కేవలం కథా సంపుటిగా మాత్రమే కాకుండా, ఒక కాలంలో స్త్రీ జీవితం ఎదుర్కొన్న సామాజిక పరిణామాలను నమోదు చేసిన సాహిత్య పత్రంగా కూడా పరిశీలించవచ్చు.

**ముగింపు:**

అబ్బూరి ఛాయాదేవి తెలుగు కథా సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న రచయిత్రి. ఆమె కథలు స్త్రీల జీవితంలోని బాధలను మాత్రమే నమోదు చేయలేదు. ఆ బాధలకు కారణమయ్యే కుటుంబ, సామాజిక, సాంస్కృతిక నిర్మాణాలను కూడా ప్రశ్నించాయి.'బోన్సాయ్ బ్రతుకు'లో స్త్రీ వ్యక్తిత్వాన్ని కుదించే సామాజిక పరిమితులకు బోన్సాయ్ ప్రతీకగా నిలుస్తుంది. 'సుఖాంతం'

లో కుటుంబ వ్యవస్థలో స్త్రీ పై పడే కనిపించని శ్రమ, మానసిక భారం బయటపడుతుంది. 'స్పర్శ' లో కుటుంబ సంబంధాల భావోద్వేగ అవసరం వ్యక్తమవుతుంది. 'మృత్యుంజయ' లో తండ్రి–కూతురు అనుబంధానికి మేధో, మానవీయ కోణాలు జతవుతాయి. 'ఎవర్ని చేసుకోను?' వంటి కథల్లో స్త్రీ జీవిత నిర్ణయాల్లో ఆమె స్వరానికి ప్రాధాన్యం ప్రశ్నగా నిలుస్తుంది. 'తన మార్గం'లో స్త్రీ తన జీవితానికి తానే మార్గాన్ని ఎంచుకోవాలనే భావన మరింత విస్తృత సామాజిక అర్థాన్ని సంతరించుకుంటుంది.ఆమె కథల గొప్పతనం పెద్ద పెద్ద నినాదాల్లో లేదు. సాధారణ జీవితాన్ని సూక్ష్మంగా పరిశీలించి, అందులో దాగి ఉన్న అసమానతను పాఠకుడికి కనిపించేలా చేయడంలో ఉంది. అందుకే అబ్బూరి ఛాయాదేవి కథలను చదవడం అంటే కేవలం ఒక రచయిత్రి కథలను చదవడం కాదు; ఒక కాలపు కుటుంబ జీవితం, స్త్రీ అనుభవం, మధ్యతరగతి మనస్తత్వం, సామాజిక మార్పు, వ్యక్తి స్వేచ్ఛ వంటి అంశాలను పరిశీలించడం కూడా.ఆమె కథలు మనకు ఒక ముఖ్యమైన మానవీయ సత్యాన్ని గుర్తుచేస్తాయి: స్త్రీ కుటుంబంలోని ఒక పాత్ర మాత్రమే కాదు; తనకంటూ ఆలోచనలు, ఆకాంక్షలు, స్వప్నాలు, నిర్ణయాలు, వ్యక్తిత్వం కలిగిన సంపూర్ణ మనిషి.ఈ దృష్టిలో అబ్బూరి ఛాయాదేవి కథా సాహిత్యం తెలుగు సాహిత్య చరిత్రలోనే కాకుండా, స్త్రీ జీవితాన్ని సామాజిక సందర్భంలో అధ్యయనం చేసే పరిశోధనలో కూడా ప్రాముఖ్యమైన ఆధారంగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు – పరిశోధనా సూచిక**

1. **అబ్బూరి ఛాయాదేవి**, *తన మార్గం, కథా సంపుటి.*
2. **అబ్బూరి ఛాయాదేవి**, *అబ్బూరి ఛాయాదేవి కథలు.*
3. **అబ్బూరి ఛాయాదేవి**, *మృత్యుంజయ.*
4. **అబ్బూరి ఛాయాదేవి**, *వైనాలో ఛాయాచిత్రాలు.*
5. **అబ్బూరి ఛాయాదేవి**, *వ్యాస చిత్రాలు.*
6. **అబ్బూరి ఛాయాదేవి**, *వరదస్మృతి.*
7. **భూమిక – స్త్రీవాద పత్రిక**, "సృజనాత్మకత, తాత్వికతలే నా కలం బలం – అబ్బూరి ఛాయాదేవి."
8. **భూమిక – స్త్రీవాద పత్రిక**, "తన మార్గం వైపునకు ప్రయాణం చేసిన అబ్బూరి ఛాయాదేవి" – డా. వేలూరి శ్రీదేవి.
9. **భూమిక – స్త్రీవాద పత్రిక**, "బోన్సాయ్ బ్రతుకు – అబ్బూరి ఛాయాదేవి కథ."
10. **భూమిక – స్త్రీవాద పత్రిక**, "తెలుగు కథ విస్తృతి, వైవిధ్యం, పరిధి – అబ్బూరి ఛాయాదేవి."
11. **ఈమాట**, "నిండైన జీవితం – అబ్బూరి ఛాయాదేవి" – జీవిత, కథా నేపథ్య పరిశీలన.
12. **భూమిక**, అబ్బూరి ఛాయాదేవి స్మారక వ్యాసాలు, జీవిత–సాహిత్య విశ్లేషణలు.

**సాహిత్య తరంగిణి**

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# "గిరిజన సాహిత్యము – ఆధునికత – విశ్లేషణ"

**– డా. గౌరారపు శ్రీనివాస్,**

తెలుగు శాఖాధిపతి,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి.

**1. ఉపోద్ఘాతం.**

గిరిజన సాహిత్యం అత్యంత ప్రాచీనమైనది. ఆదిమ జాతుల జీవన విధానం, ఆచారాలు, సంస్కృతులు, ప్రకృతితో వారి సంబంధాలు వంటి ఎన్నో విశిష్టమైన అంశాలు వీరి సాహిత్యంలో కనిపిస్తుంది. అయితే వీరి సాహిత్యము మౌఖికమైనది. అక్షర బద్ధం లేనిది. అనేక ఆదిమ భాషలకు లిపి లేనందున వారు తాము మాట్లాడే భాషలోనే తమను గురించి విశేషాలను తర్వాతి తరాలకు అందించారు.

అత్యంత ప్రాచీనత కలిగిన ఈ గిరిజన సాహిత్యాన్ని అంతరించిపోకుండా కాపాడవలసిన బాధ్యత మన మీద ఉంది.ఈ ఆధునిక యుగంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్న నేపథ్యంలో గిరిజన సాహిత్యం మీద ఇంకా విస్తృతమైన పరిశోధనలు జరగవలసిన అవసరము ఉంది.

గిరిజన సాహిత్యంలో మౌఖిక కథలు, పాటలు, నృత్య రూపకాలు, ప్రకృతి ఆరాధన, భాష, సంస్కృతి, జీవనశైలి వంటి ఎన్నో అంశాలు ప్రస్తావనకు వస్తాయి .వాటి గురించి కొంత విశ్లేషణను ఈ వ్యాసంలో వివరించడం జరిగింది. గిరిజనుల మీద వస్తున్న సాహిత్యం గురించి వారికి వివరించి దానిలో వారిని భాగస్వామ్యం చేస్తే మరింత మెరుగైన సాహిత్యం మనకు లభ్యమవుతుంది.

**2. గిరిజన సాహిత్యం అంటే:**

ఆదిమవాసుల లేదా గిరిజనుల సమస్త జీవితాన్ని గురించి విశ్లేషించేది గిరిజన సాహిత్యం. నాగరిక సమాజానికి దూరంగా అడవులు, కొండలు, కోనలు, అరణ్యాలలో నివసించే వారి సంపూర్ణ జీవన విధానాన్ని అధ్యయనం చేయడం వల్ల వారి గురించి ప్రపంచానికి తెలుస్తుంది. దీనివల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి అనే ప్రశ్నకు సమాధానంగా వారిని చైతన్యవంతమైన నాగరిక సమాజంలోకి తీసుకురావడం లేదా దానిని పరిచయం చేయడం అంతేకాక మనకు తెలియని ఎన్నో విషయాలను వారి నుండి తెలుసుకోవడం జరుగుతుంది.

ఈ వ్యాసంలో కొన్ని అంశాలను మాత్రమే తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. సహజ సిద్ధమైన వారి జీవన విధానం ప్రకృతితో వారి పయనం, వారి భాషలు, కళలు, పండుగలు ఇలా ఎన్నో మనం తెలుసుకోవచ్చు. ఆధునిక సమాజం గురించి, కొత్త విజ్ఞానాన్ని వారికి అందించవచ్చు. విద్య, వైద్య, నవీన జీవన విధానం నాగరికతల గురించి చెప్పి వారిలో చైతన్యం కలిగించడానికి గిరిజన సాహిత్యం ఉపయోగపడుతుంది. విభిన్నమైన జాతుల మధ్య సమన్వయస్థితిని కలిగించడానికి ఉపయోగపడుతుంది.

**3. గిరిజన సాహిత్యం:**

**ఆధునికత – విశ్లేషణ**

**3.1 మౌఖిక కథలు:**

గిరిజన సాహిత్యం ఎక్కువగా మౌఖిక రూపంలోనే వస్తుంది. జానపద కథలు ,గిరిజన పాటలు ,సామెతలు, పొడుపు కథలు, ప్రధానంగా ఉంటాయి . లిపి లేకపోవడం వల్ల సాహిత్యం ఎక్కువగా నోటి ద్వారానే సాగుతూ ఉంది .గిరిజన మౌఖిక కథలు ఆదివాసి జీవితాలను, చరిత్రను తరతరాలకు అందించే ప్రాచీన మౌఖిక సంపదలు ఈ కథలు .గిరిజన ప్రజలకు సొంత లిపి లేకపోవడం వల్ల వాళ్ళ పురాణాలు, ఇతిహాసాలు ,వంశావళిలు, నైతిక నియమాలు, వ్యవసాయ విజ్ఞానం వ్యక్తి నుండి వ్యక్తికి నోటి మాట ద్వారానే ప్రచారం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

జరిగాయి. ప్రకృతి నియమాలు ,వేట, వలస, కరువు కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణం, చారిత్రక విషయాలను వారు కథల ద్వారా తర్వాత తరాలకు అందించారు .సాంస్కృతిక జీవనం ,దండయాత్రలు, పోరాటాలు, స్థితిగతులు ఈ జానపద కథల ద్వారానే సాగాయి.

**ఆధునికత:** కాలానుగుణమైన మార్పుల వల్ల కోయ,సవర, గదబ ,కొండదొర మొదలైన తెగల జీవితాలను తెలియజేస్తూ చాలా కథలు, కథా సంపుటాలు లిఖిత సాహిత్యం రూపంలో అభివృద్ధి చెందుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గిరిజనుల జీవన సంస్కృతులను, మౌఖిక కథలను బహుళ ప్రాచుర్యములోకి తీసుకురావడం మంచి పరిణామం.

### 3.2. గిరిజన పాటలు:

గిరిజనుల పండుగలు, వేడుకలు, జాతరలు వారి భావోద్వేగాలు వారి పాటలలో కనిపిస్తాయి. అడవులు, కొండలు, ప్రకృతి మధ్య జీవిస్తూ ఆ చెట్లను, నదులను కీర్తిస్తూ ఆలపించే ప్రకృతి ఆరాధన పాటలు ప్రధానంగా కనిపిస్తాయి. పంట కాలములోనూ, పండుగ సమయాలలో వారి సాంప్రదాయాలకు అనుగుణంగా వారి పాటలు ఉంటాయి. చర్మాలు, చెక్కలు, బూరలు, వెదురు వంటి వాటితో చేసిన వాయిద్యాల మేళవింపు ఈ పాటలలో కనిపిస్తుంది. ప్రధానంగా ఈ పాటల ద్వారా వాళ్ల సమిష్టి జీవన విధానం తెలుస్తుంది .వారి పాటలు వారి శ్రమైక జీవనం నుండి ఆశువుగా వచ్చినవే అని మనం గ్రహించాలి.

**ఆధునికత:** సాంప్రదాయకమైన వారి పాటల సాహిత్యం ఈరోజు ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందాయి . నాటకాలు, సినిమాలలో జానపద పాటల జోరు కొనసాగుతుంది. ఎంతో మంది గాయకులు ఈ పాటలకు ప్రాణం పోస్తున్నారు .దీనివల్ల వారి అస్తిత్వం నాగరిక సమాజానికి చేరువవుతుంది.

### 3.3. నృత్య రూపకాలు:

గిరిజనుల జీవన విధానములో ప్రధానమైనది నృత్యం .వారి ప్రతి ఆనందానికి నృత్యమే ప్రధానం. పండుగ, వేట, ఆరాధన ఏదైనా నృత్యాలలో సాగుతుంది. మన రాష్ట్రంలో అరకు పరిసర ప్రాంతాలలో గిరిజనుల దింసా నృత్యరూపకం ఎంతో పేరు కలిగినది. గిరిజన స్త్రీలు ఈ నృత్యాన్ని చేస్తారు. వివాహ వేడుకలు చైత్రమాసంలో జరుగుతాయి .ఇంకా లంబాడి ,కోయ, చెంచు మొదలైన జాతుల వారు వివిధరూపకాలు ప్రదర్శిస్తారు. ఈ నృత్యాలు వారి జీవనాన్ని, సంస్కృతిని తెలియజేస్తాయి .ఈ నృత్యాలు ప్రతి తెగల వారి ఆచారాలను అనుసరించి సాగుతాయి.

**ఆధునికత:** ఎన్నో తరాలుగా కేవలం గిరిజనుల జీవితాలు తండాలకు, వారి ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ నృత్య రూపకాలు ఇప్పుడు ఎంతో ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. కవుల రచనలు ,టెలివిజన్ , వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందరికీ చేరువైనాయి. చాలామంది గిరిజన తెగలను సందర్శిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా గిరిజన ఉత్సవాలను నిర్వహించడం విశేషం.

### 3.4. ప్రకృతి ఆరాధన:

గిరిజనుల ప్రధాన ఆరాధన దేవత ప్రకృతి. వారి జీవితమంతా ప్రకృతి తోనే ముడిపడి ఉంటుంది. ప్రకృతి వారి అవసరాలకు ఉపయోగపడే వనరు. అదే వారి దైవం అనుట సమంజసం. చెట్లను పూజించే విధానం తెగను బట్టి మారుతుంది. విప్ప చెట్లు ,మద్ది, రావి, సాలవృక్షాలు ఆరాధన దేవతలు .అడవులలోని కొన్ని ప్రదేశాలను పవిత్రవనాలుగా భావించి పూజిస్తారు. కొండ దేవతలను పెద్దదేవుడుగా భావించి పూజిస్తారు. వ్యవసాయం ముందు, పంట చేతికి వచ్చిన తర్వాత కొండ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. సర్పాలను పూజించే విధానం కూడా ఉంది. వర్షాల కోసం భూమి పూజ చేస్తారు .పర్యావరణ పరిరక్షణ వారి ప్రధాన ధ్యేయంగా ఉంటుంది. అవసరానికి తగినట్లుగానే ప్రకృతిని గౌరవించి పూజించి ఉపయోగించుకుంటారు.

**ఆధునికత:** గిరిజన సాహిత్యంలో కనిపిస్తున్న ప్రకృతి ఆరాధన, పర్యావరణ పరిరక్షణ మీద ఎంతో మంది శాస్త్రవేత్తలు, భాషా సాహితివేతలు పరిశోధనలు చేస్తున్నారు. దీనివల్ల ఎన్నో విషయాలు గిరిజనుల నుండి నేటితరం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

**3.5 భాష – సంస్కృతి:**

గిరిజనుల సాహిత్యంలో ప్రధాన వస్తువు భాష, సంస్కృతులు. భాష మౌఖిక రూపంలో ఉండడం వలన వారి ఆచార వ్యవహారాలు వారి సంస్కృతి మీద ప్రభావం చూపాయి.ప్రతి గిరిజన తెగకు మాండలికాలు ఉన్నాయి ఉదాహరణకు కోయ,చెంచు, లంబాడి వీరు వారి వారి భాషలలోనే మాట్లాడుకుంటారు .గిరిజన భాషలకు సొంత లిపి ఉండదు. గిరిజనుల సంస్కృతిలో ప్రధానమైనది వారి జీవన విధానం, నృత్యాలు ,సంగీతము, ప్రకృతి ఆరాధన, పండుగలు ఆచారాలు మనకు కనిపిస్తాయి .ఆహారం ప్రత్యేకమైన విధానంగా కనిపిస్తుంది .గిరిజనులు ఆదిమ జాతులుగా పిలువబడి అడవులలో జీవిస్తున్నారు అనడం కంటే వాటిని రక్షిస్తున్నారనడం సమంజసం.

**ఆధునికత**: గిరిజనుల జీవనశైలి, సంస్కృతి, భాష ,ప్రకృతి తత్వం తెలుసుకుంటే మనకు జ్ఞానం కలుగుతుంది. గిరిజనుల సాహిత్యం గురించి పరిశోధనలు జరిపి వాటిని ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉంది .ఎందుకంటే గిరిజన వాసులే ప్రకృతిని, సంస్కృతిని, భాషను పరిరక్షిస్తున్నారన్నది నిజం. దీనిని నాగరికత సమాజం గుర్తించాలి.

**4. సామాజిక ప్రయోజనం:**

గిరిజన సాహిత్యం : మౌఖిక రూపంలో సాగిన వారి సాహిత్యం నేడు లిఖిత రూపంలోకి రావడం శుభ పరిణామం .గిరిజన సాహిత్యం వల్ల ప్రధానంగా కలిగే సామాజిక ప్రయోజనాలు సంస్కృతి, సాంప్రదాయాల రక్షణ. ఆధునిక ప్రపంచంలో గిరిజన తెగల ఆచారాలు ,పండుగలు, జీవన విధానం ఈ సాహిత్యం ద్వారా భవిష్యత్ తరాలకు అందించబడుతుంది. సామాజిక చైతన్యం ,హక్కుల పరిరక్షణ, పర్యావరణ స్పృహ కలుగుతుంది. సామూహికతత్వం నిరాడంబరత వంటి మానవ విలువలు పెరుగుతాయి. ఎంతో మంది గిరిజన వీరుల చరిత్రలో ప్రపంచానికి తెలుస్తాయి. ప్రకృతి పరిరక్షణ, సహజ జీవన విధానం గురించి తెలుస్తుంది. మారుతున్న కాలానుగుణంగా గిరిజనుల జీవితాలలో వస్తున్న నూతన మార్పులను తెలియజేయడానికి ఈ సాహిత్యం ఉపయోగపడుతుంది.

## ఉపసంహారం:

గిరిజన సాహిత్యం – ఆధునికత – విశ్లేషణ అనే ఈ వ్యాసంలో గిరిజన సాహిత్యం గురించి దాని ప్రయోజనం, మౌఖిక సాహిత్యము ,గిరిజనుల పాటలు, ప్రకృతి ఆరాధన, భాష, సంస్కృతి వంటి విశిష్ట అంశాలను విశ్లేషించి అందులోని కొన్ని విషయాలను చర్చించి దానివల్ల కలిగే సామాజిక ప్రయోజనాన్ని గురించి వివరించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు:**


1. గిరిజన సాహిత్యం – భాష – సంస్కృతి –డాక్టర్ తాటికాయల భోజన్న , ఆనంది ప్రచురణలు ,ధర్మపురి, జగిత్యాల.
2. గిరిజన సాహిత్యం – ప్రజాశక్తి బుక్ హౌస్ .
3. తెలుగు కావ్యాలలో – గిరిజన సంస్కృతి , డాక్టర్ బి. రామాచార్యులు
4. తెలుగు గిరిజన సాహిత్యం , సాహితి అకాడమీ

# సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.


## ఆధునిక సాహిత్య ప్రయోజనం: ఆశయాలు – ఆచరణ – సమకాలీన సంక్షోభం

(సామూహిక ఆత్మవంచన, ముఠాతత్వం, సాహిత్య విచ్ఛిన్నతపై ఒక నిర్దిష్ట సమాజశాస్త్రీయ పరిశీలన)


**– జి. వీరన్న**

వృత్తి–డైరెక్టర్,డెక్కన్ చాయ్ ప్రైవేట్ లిమిటెడ్.

9705492532.

హనుమకొండ–తెలంగాణ


### 1. ప్రవేశిక: సాహిత్య ప్రయోజన భావన – చారిత్రక పరిణామం

భారతీయ అలంకార శాస్త్రంలో కావ్య ప్రయోజనాన్ని నిర్వచిస్తూ భరతుడు, భామహుడు, మమ్మటుడు వంటి లాక్షణికులు పలు ప్రాతిపదికలను ప్రతిపాదించారు. మమ్మటుని 'కావ్యప్రకాశం' కావ్య ప్రయోజనాలను ఇలా క్రోడీకరిస్తుంది:

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే |
సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే ||"

సాహిత్యం కీర్తిని, సంపదను, లోకజ్ఞానాన్ని ఇస్తూనే 'శివేతర క్షతి' (అమంగళాన్ని, అశుభాన్ని తొలగించడం) అనే అత్యున్నత సామాజిక ప్రయోజనాన్ని సాధించాలని ప్రాచీన సిద్ధాంతం నిర్దేశించింది. ఆధునిక యుగానికి వచ్చేసరికి ఈ "శివేతర క్షతి" అనేది సామాజిక రుగ్మతల నిర్మూలనగా, అభ్యుదయ భావజాల వ్యాప్తిగా, ప్రజాస్వామిక విలువల రక్షణగా రూపాంతరం చెందింది.

తెలుగు సాహిత్యంలో కందుకూరి వీరేశలింగం గారి 'సత్యరాజా పూర్వదేశ యాత్రలు', 'రాజశేఖర చరిత్రము'లతో ప్రారంభమైన ఆధునిక యుగం సమాజ సంస్కరణను తన ప్రధాన ప్రయోజనంగా స్వీకరించింది. గురజాడ 'ముత్యాల సరాలు' ద్వారా ప్రజా జీవితంలోకి సాహిత్యపు పరిధిని విస్తరించగా, శ్రీశ్రీ 'మహాప్రస్థానం' సాహిత్యాన్ని పీడిత వర్గాల విముక్తి పోరాట ఆయుధంగా మలిచింది. కాళోజీ, జాషువా వంటి రచయితలు అక్షరాన్ని ప్రజల చేతికిచ్చి అధికార కేంద్రాలను నిలదీసే నైతిక బలాన్ని చేకూర్చారు.

అయితే, గత నాలుగు దశాబ్దాలుగా ఉద్భవించిన నయా ఉదారవాదం (Neo-liberalism), సమాచార సాంకేతిక విప్లవం, వినియోగదారుల విపణి సంస్కృతి సాహిత్యపు మౌలిక నిర్మాణాన్ని సమూలంగా మార్చివేశాయి. నేడు వెలువడుతున్న ఆధునిక తెలుగు సాహిత్యం తన ప్రాథమిక ప్రయోజనమైన ప్రజాశ్రేయస్సును నెరవేరుస్తోందా లేక కొద్దిమంది ఆత్మోత్కర్షకు, ముఠా రాజకీయాలకు సాధనంగా మారి నిష్క్రియాపరత్వంలోకి జారిపోయిందా అన్నది నిష్పాక్షికంగా శోధించాల్సిన అకడమిక్ అవసరం ఏర్పడింది.

### 2. సిద్ధాంత భూమిక & విశ్లేషణాత్మక దృక్కోణాలు

వర్తమాన సాహిత్య సంక్షోభాన్ని విశ్లేషించడానికి మూడు ప్రధాన సామాజిక, సాహిత్య సిద్ధాంతాలను ఆలంబనగా తీసుకోవచ్చు:

**2.1 మార్క్సిస్ట్ కళా సిద్ధాంతం (Marxist Aesthetics & Alienation):** కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన 'అన్యాక్రాంత భావన' (Alienation) ప్రకారం, పెట్టుబడిదారీ సమాజంలో కళాకారుడు తన ఉత్పత్తి నుంచి, తోటి మనుషుల నుండి పరాయీకరణకు గురవుతాడు. కళ ఒక విప్లవాత్మక శ్రమ కాకుండా, కేవలం మార్కెట్ సరుకుగా లేదా మేధోవిలాసంగా దిగజారినప్పుడు అది సామాజిక వాస్తవికత నుండి తెగిపోతుంది.

**2.2 పియరీ బోర్దియూ 'సాంస్కృతిక పెట్టుబడి' (Pierre Bourdieu's Theory of Cultural Capital):** బోర్దియూ ప్రతిపాదించిన 'లిటరరీ ఫీల్డ్' (Literary Field) సిద్ధాంతం ప్రకారం, రచయితలు ప్రాథమికంగా సంస్కృతిని విస్తరించడం కంటే 'సాంస్కృతిక పెట్టుబడి'ని, సామాజిక పలుకుబడిని (Symbolic Power) సాధించడానికి తాపత్రయపడతారు. దీనివల్ల గ్రూపులు, పరస్పర పొగడ్తలు, అవార్డు లాబీయింగ్‌లు ఏర్పడతాయి.

**2.3 జుర్గెన్ హేబర్‌మాస్ 'ప్రజాక్షేత్ర నిర్మాణాత్మక రూపాంతరం (Structural Transformation of the Public Sphere):** హేబర్‌మాస్ ప్రతిపాదించిన ప్రజాక్షేత్రం (Public Sphere) నేడు కార్పొరేట్ శక్తుల, సోషల్ మీడియా అల్గారిథమ్‌ల ధాటికి విచ్ఛిన్నమైంది. ఆలోచనాత్మకమైన బహిరంగ చర్చల స్థానాన్ని కొనుగోలు శక్తి, ప్రచారం, వర్చువల్ ఆర్భాటాలు ఆక్రమించాయి.

**3. సామాజిక-రాజకీయ కారణాలు: సమాజ నిర్లిప్తత & వినియోగదారుని స్వార్థం**

ఆధునిక సమాజం తీవ్రమైన నయా-ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో చిక్కుకుంది. మధ్యతరగతి మానవుడు ఆర్థిక భద్రత, ఈఎంఐల భారం, కార్పొరేట్ పరుగు పందెంలో చిక్కుకుని 'సామూహిక బాధ్యత' (Collective Responsibility) నుంచి వైదొలిగి 'తీవ్ర వ్యక్తివాదం' (Hyper-Individualism) లోకి జారుకున్నాడు.

**3.1 నైతిక స్పందనల క్షీణత:** ఒకప్పుడు సమాజంలో అన్యాయం జరిగితే జనం నిరసించేవారు. నేడు రాజ్యాంగ వ్యవస్థలు బలహీనపడుతున్నా, నిరుద్యోగం, పేదరికం, దళితులు-మహిళలపై దాడులు పెచ్చరిల్లుతున్నా వ్యక్తిగతంగా తనకు హాని జరగనంతవరకు సమాజం నిశ్శబ్దంగా ఉంటోంది.

**3.2 రచయితల భౌతిక వాతావరణం:** రచయిత సమాజం నుంచి వేరుగా ఉండదు. రచయితలు సైతం సురక్షితమైన మధ్యతరగతి గూళ్ళలో, ఏసీ గదుల్లో కూర్చుని తాత్విక భాషలో సమస్యలను స్పృశిస్తున్నారు తప్ప, క్షేత్రస్థాయి పోరాటాలతో వారికి సంబంధాలు తెగిపోయాయి. ఫలితంగా రచనల్లో రక్తమాంసాలు తగ్గి, నిష్ఫలమైన పదాల కూర్పు మిగులుతోంది.

**4. డిజిటల్ సంస్కృతి, సోషల్ మీడియా మరియు వర్చువల్ ఎకో-ఛాంబర్స్**

సోషల్ మీడియా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్) ప్రవేశంతో తెలుగు సాహిత్యంలో ప్రజాస్వామీకరణ జరిగిందని భావించినప్పటికీ, అది తీవ్రమైన వ్యవస్థాగత నష్టాన్ని మిగిల్చింది:

**4.1 లైకుల సంస్కృతి – మిథ్యా విప్లవం:** రచయిత ఏదో ఒక సామాజిక సమస్యపై నాలుగు లైన్ల పోస్ట్ పెట్టగానే అంతర్గత వర్గం స్పందించి "యుగకర్త", "మహాకవి" అంటూ కామెంట్లు కురిపిస్తుంది. దీనితో తాను వ్యవస్థను మార్చేస్తున్నాననే మానసిక సంతృప్తి రచయితకు లభిస్తుంది.

**4.2 భజన, అవార్డుల సంస్కృతి:** "వాళ్ళే రాసుకొని వాళ్ళే పొగుడుకొనే" సంస్కృతి:

ఒక రచయిత తన పుస్తకానికి తానే పీఠిక రాయించుకోవడానికి అనుకూలమైన వ్యక్తిని ఎంచుకుంటాడు; ఆవిష్కరణ సభలో పొగిడేవారికే మైక్ ఇస్తాడు; చివరకు పత్రికల్లో తానే మారుపేర్లతో సమీక్షలు రాయించుకుంటాడు. ఇలాంటి భావ దారిద్ర్యం పాఠకుడిని సాహిత్యం నుంచి శాశ్వతంగా దూరం చేస్తోంది.

**స్వకీర్తి ప్రదర్శన:** సాహిత్యం మానవ వేదనలను అక్షరీకరించే పవిత్ర సాధనం కాకుండా, విజిటింగ్ కార్డు లాంటి ఒక "స్టేటస్ సింబల్"గా మారింది. కవితలు, కథలు కేవలం సోషల్ మీడియాలో తమ ఫొటోలతో పాటు సర్క్యులేట్ చేసుకోవడానికే పరిమితమవుతున్నాయి.

**5. పఠనా సంస్కృతి పతనం — అంతరిస్తున్న పాఠక వర్గం**

సాహిత్య ప్రయోజన సూత్రంలో ప్రాథమిక వాటాదారుడైన 'పాఠకుడు' నేడు అదృశ్యమవుతున్నాడు. ఈ పతనానికి దోహదం చేసిన అంశాలు:

**5.1. విద్యావ్యవస్థ సాంకేతికతత్వం:** పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో మానవీయ శాస్త్రాలు (Humanities), మాతృభాషా సాహిత్య అధ్యయనం అడుగంటింది. విద్య కేవలం ఉపాధిని ఇచ్చే నైపుణ్యాల కార్ఖానాగా మారింది తప్ప, విమర్శనాత్మక ఆలోచనను (Critical Thinking) పెంచే సాహిత్యానికి ప్రాధాన్యత లేకుండా పోయింది.

**5.2 అటెన్షన్ ఎకానమీ (Attention Economy):** డిజిటల్ స్క్రీన్‌లు, రీల్స్, షార్ట్స్ మనిషి మెదడును కేవలం క్షణికానందానికి అలవాటు చేశాయి. ఒక లోతైన ఆలోచనను రేకెత్తించే 300 పేజీల నవలను, సంక్లిష్టమైన కవితను చదివే ఓపిక, వ్యవధానం యువతరంలో నశించాయి.

**5.3 పుస్తక విపణి పతనం:** ఒకప్పుడు వేల సంఖ్యలో అమ్ముడైన తెలుగు పుస్తకాలు, నేడు ముద్రించే కనీస 500 కాపీలు కూడా పూర్తి స్థాయిలో అమ్ముడుపోవట్లేదు. కొనుగోలు చేసేవారు కూడా తోటి రచయితలు లేదా ఆత్మీయులే తప్ప సాధారణ ప్రజలు కారు. చదివేవాడు లేనప్పుడు సాహిత్యం సామాజిక పరివర్తన సాధనం ఎలా కాగలదు?

### 6. సమాజాన్ని శాసించి, ప్రభావితం చేసిన ఒకప్పటి సాహిత్య దృష్టాంతాలు

గతంలో తెలుగు సాహిత్యం సమాజానికి సమాంతరంగా నడవడమే కాకుండా, సామాజిక మార్పుకు చోదక శక్తిగా (Catalyst) పనిచేసిందనడానికి చరిత్రలో స్పష్టమైన నిరూపణలు ఉన్నాయి:

**6.1 కన్యాశుల్కం (గురజాడ అప్పారావు):** నాటకమనే సాహిత్య ప్రక్రియ సమాజంలోని కుళ్ళిన సంప్రదాయాలను ఎలా కూల్చగలదో నిరూపించిన రచన. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలపై ఈ నాటకం తీవ్ర చర్చను రేకెత్తించింది. వ్యవహారిక భాషలో రాసిన ఈ నాటకం సామాజిక సంస్కరణోద్యమానికి సాహిత్య ఆయుధంగా మారింది.

**6.2 మాలపల్లి (ఉన్నవ లక్ష్మీనారాయణ):** అంటరానితనం, దళిత రైతుల దోపిడీ, గాంధేయ-కమ్యూనిస్టు భావజాలాల కలయికతో వచ్చిన ఈ నవల తెలుగునాట ప్రకంపనలు సృష్టించింది. ఈ నవల ప్రజలను ఎంతగా చైతన్యపరిచిందంటే, బ్రిటిష్ ప్రభుత్వం 1923లో దీనిపై నిషేధం విధించింది. సాహిత్యానికి ఉన్న సామాజిక బలానికి ప్రభుత్వ నిషేధమే ప్రత్యక్ష సాక్ష్యం.

**6.3 మహాప్రస్థానం (శ్రీశ్రీ):** "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అంటూ శ్రీశ్రీ సంధించిన కవితా పంక్తులు అప్పటి యువతను, శ్రామిక వర్గాన్ని ఉర్రూతలూగించాయి. ఇది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా కార్మిక కర్షక పోరాటాలకు, విప్లవ ఉద్యమాలకు ఊపిరిపోసింది.

**6.4 గబ్బిలం (గుర్రం జాషువా):** కాళిదాసు 'మేఘదూతం' సంస్కృత కావ్య సంప్రదాయాన్ని తిరగరాస్తూ, ఒక అంటరానివాడు కాశీ విశ్వనాథునికి సందేశం పంపే రూపకల్పన ద్వారా అస్పృశ్యతపై జాషువా సంధించిన తాత్విక అస్త్రమిది. సమాజంలో వర్ణవివక్షపై ఆత్మపరిశీలన రేకెత్తించిన గొప్ప కావ్యం.

**6.5 నా గొడవ (కాళోజీ నారాయణరావు):** తెలంగాణ సాయుధ పోరాట కాలం నుండి సమకాలీన రాజకీయ దౌర్జన్యాల వరకు కాళోజీ కలం నిరసన గళమై నిలిచింది. "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అంటూ ఆయన రాసిన పంక్తులు ప్రజల్లో తీవ్రమైన చైతన్యాన్ని, నిరంకుశ పాలనపై ఉద్యమ స్ఫూర్తిని రగిల్చాయి.

**6.6 తెలంగాణ మలిదశ ఉద్యమ గీతాలు :** మలి దశ ఉద్యమంలో నందిని సిధారెడ్డి, గోరటి వెంకన్న , గద్దర్, జయరాజ్, అందెశ్రీ, దరువు ఎల్లన్న, మిట్టపల్లి సురేందర్, అన్నవరం దేవేందర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఇలా ఏంటో మంది తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా తీవ్రమైన సాహిత్య సృజన చేశారు. ఇవి ఒక రాజకీయ ఆకాంక్షకు సాంస్కృతిక బలాన్ని అందించిన ఆధునిక దృష్టాంతాలు.

### 7. నేటి సమకాలీన సాహిత్యపు లోతైన జాడ్యాలు

పై ఉన్నతమైన చరిత్రతో పోలిస్తే, నేటి ఆధునిక తెలుగు సాహిత్యం క్రింది ప్రధాన అంతర్గత వ్యాధులతో తీవ్ర క్షీణతను ఎదుర్కొంటోంది:

**7.1 సిండికేట్ పాలిటిక్స్ & సాహిత్య మాఫియా:** సాహిత్య రంగం నేడు కొందరు వ్యక్తులు, సంస్థల ఆధిపత్యంలోకి వెళ్ళిపోయింది. ఏ రచన వెలుగులోకి రావాలి, ఎవరికి గుర్తింపు దక్కాలి అనేది ఈ 'సిండికేట్లు' నిర్ణయిస్తున్నాయి. పత్రికలు, సాహిత్య శీర్షికలు కేవలం తమ వర్గానికి చెందిన వారి రచనలనే ప్రోత్సహిస్తూ, స్వతంత్ర ప్రతిభావంతులను అణచివేస్తున్నాయి.

**7.2 అవార్డు లాబీయింగ్ & అధికార దాసోహం:** ఒకప్పుడు రచయితలు పాలకుల తప్పులను నిర్భయంగా ఎండగట్టేవారు. నేడు కేంద్ర సాహిత్య అకాడమీ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు, ట్రస్టుల అవార్డుల కోసం రచయితలే స్వయంగా జ్యూరీ సభ్యుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ లాబీయింగ్ చేసుకుంటున్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అవార్డులు రావనే భయంతో నిశ్శబ్దంగా ఉండటం నేటి రచయితల నైతిక దిగజారుడుతనానికి నిదర్శనం.

**7.3 సోషల్ మీడియా హైపర్-ప్రమోషన్ (అతిశయోక్తి రోగం):** రచనలోని విషయం పది శాతమైతే, దాని ప్రచారం తొంభై శాతం ఉండే సంస్కృతి పెరిగింది. పుస్తకం అచ్చవకముందే కవర్ పేజీలు, ప్రోమోలు, వర్చువల్ ఆర్భాటాలతో హోరెత్తిస్తున్నారు. సరుకు లేని రచనలను కూడా అంతర్గత గ్రూపుల ద్వారా 'శతాబ్దపు ఉత్తమ రచన'గా ప్రచారం చేస్తూ పాఠకులను మోసం చేస్తున్నారు.

**7.4 నిజమైన బాధ లేని 'కృత్రిమ వేదన' (Artificial Emotions):** క్షేత్రస్థాయి సమస్యలను అనుభవించకుండా, కేవలం లైబ్రరీల్లోని పుస్తకాలు లేదా వార్తాపత్రికల హెడ్‌లైన్స్ చూసి వాక్యాల గారడీతో రాసే కవిత్వం పెరిగింది. దళిత, స్త్రీవాద, పల్లెటూరి బాధలను కూడా కొందరు తమ పేజీల కోసమో, తాత్విక ఆడంబరం కోసమో ఒక ఫ్యాషన్‌లా వాడుకుంటున్నారు తప్ప వాటి వెనుక నిజమైన ఆర్తి గానీ, నిబద్ధత గానీ ఉండటం లేదు.

**7.5 అసహనం & మేధో అహంకారం:** నేటి రచయితల్లో విమర్శను స్వీకరించే సంయమనం బొత్తిగా నశించింది. ఎవరైనా నిజాయితీగా పుస్తకంలోని లోపాలను సమీక్షిస్తే, ఆ విమర్శకుడిపై కుల, ప్రాంతీయ, రాజకీయ ముద్రలు వేసి సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి దిగుతున్నారు. మేధోపరమైన చర్చలకు తావులేకుండా తిట్లదండకాలతో ఎదురుదాడి చేయడం ఒక ప్రమాదకరమైన జాడ్యంగా మారింది.

### 8. సాహిత్య విమర్శ తిరోగమనం – జవాబుదారీతనం లోపించడం

ఒక భాషలో నిష్పాక్షికమైన సాహిత్య విమర్శ సజీవంగా ఉన్నంతకాలమే ఆ సాహిత్యం ఆరోగ్యంగా ఉంటుంది. తెలుగులో కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, రాచమల్లు రామచంద్రారెడ్డి, చేకూరి రామారావు వంటి మహామహులు రచనలోని మెరుగులతో పాటు లోపాలను కూడా నిర్భయంగా ఎత్తిచూపారు.

నిష్పాక్షిక విమర్శ అదృశ్యమయ్యాక లోపభూయిష్టమైన రచనలు కూడా 'క్లాసిక్స్'గా చలామణి అవుతున్నాయి. ఫలితంగా సాహిత్యం ప్రజలకు దిక్సూచిగా ఉండే నైతిక బలాన్ని కోల్పోయింది.

**9. అస్తిత్వవాదాల పరిమితులు:** విశాల మానవతా స్పృహ నుంచి సంకుచితత్వానికి

1980, 90ల దశకాల్లో తెలుగు సాహిత్యంలోకి దూసుకొచ్చిన దళిత, స్త్రీవాద, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలు సాహిత్యాన్ని ప్రజాస్వామికీకరించాయి. శతాబ్దాలుగా అణచివేయబడిన వర్గాల గొంతుకకు అవి స్థానం కల్పించాయి. ఇది నిస్సందేహంగా గొప్ప పరిణామం. అయితే, వర్తమానంలో ఈ అస్తిత్వవాదాలు తీవ్రమైన సంకుచితత్వంలోకి జారిపోయాయి:

**9.1 విశ్వజనీనత కొరవడటం:** తన నిర్దిష్ట సమస్యను మానవాళి మొత్తాన్ని కదిలించే స్థాయికి విస్తరించడంలో నేటి అస్తిత్వవాదాలు విఫలమవుతున్నాయి.

**9.2 సామాజిక వేర్పాటు (Ghettoization):** "మా బాధను మేము మాత్రమే అనుభవించగలం, ఇతరులు దాని గురించి రాయకూడదు/మాట్లాడకూడదు" అనే తీవ్రమైన వైఖరి వల్ల విస్తృత సమాజంతో బంధాలు తెగిపోయాయి. ఫలితంగా ఆ రచనలు కేవలం ఆయా వర్గాలకే పరిమితమై, సమాజంలోని ఇతర వర్గాలను ప్రభావితం చేయలేకపోతున్నాయి.

**10. భాషా-శిల్ప స్తబ్దత:** ఆధునిక సమస్యలకు పాతబడిన వ్యక్తీకరణలు

సమకాలీన సమాజం డేటా వలసవాదం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వస్తున్న నిరుద్యోగం, పర్యావరణ వినాశనం, తీవ్ర మానసిక ఒంటరితనం వంటి సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది.

**10.1 మూస భావ వ్యక్తీకరణల పునరావృతం:** నేటి కవులు చాలామంది ఇంకా 1970ల నాటి పాతబడిన రూపకాలను (Metaphors) వాడటం మానలేదు.

**10.2 సమకాలీన స్పృహ లోపించడం:** ఆధునిక యువత ఆలోచనా శైలి, వారు వాడే నవ్య భాష, వారు ఎదుర్కొంటున్న ఉనికి పోరాటాలు సాహిత్య శిల్పంలోకి చొచ్చుకురాలేకపోతున్నాయి. జీవం లేని, కృత్రిమమైన పదజాలంతో రాసే రచనలు యువతను కదిలించలేకపోతున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**11. చారిత్రక తులనాత్మక పరిశీలన:** గతం వర్సెస్ వర్తమానం

ఆధునిక సాహిత్య ప్రయోజనం ఏ విధంగా అడుగంటిందో తెలుసుకోవడానికి వివిధ యుగాల్లోని సాహిత్య ప్రభావశీలతను ఈ కింది పట్టిక స్పష్టం చేస్తుంది:

| కొలమానం | గతం (ఉద్యమ, సంస్కరణ కాలం) | వర్తమానం (ఆధునిక కాలం) |
|---|---|---|
| **రచన ప్రేరణ** | ప్రజా వేదన, వ్యవస్థ మార్పు, సామాజిక బాధ్యత | స్వీయ కీర్తి, సోషల్ మీడియా అటెన్షన్, గుర్తింపు |
| **సంబంధం** | క్షేత్రస్థాయి ప్రజలు, పోరాటాలు, బాధితులు | ఫేస్‌బుక్ సర్కిల్స్, క్లబ్బులు, సాహిత్య గోష్ఠులు |
| **లక్ష్యం** | భావజాల వ్యాప్తి, పాలకుల నిలదీత | పుస్తకావిష్కరణ సభలు, సన్మానాలు, అవార్డులు |
| **ప్రభావం** | చట్టసభలు, ప్రజా ఉద్యమాలను కదిలించిన స్థాయి | పౌర సమాజాన్ని కూడా కదిలించలేని నిస్సహాయత |
| **ఫలితం** | చట్టాల మార్పు, నిషేధాలు, ప్రజా చైతన్యం | తాత్కాలిక లైకులు, ముఠాల పొగడ్తలు, నిశ్శబ్దం |

**12. సాహిత్య ప్రయోజన పునరుద్ధరణ:** మార్గాలు & కార్యాచరణ

ఆధునిక సాహిత్యం తన ప్రాథమిక ప్రయోజనాన్ని తిరిగి పొందాలంటే వ్యవస్థాగతమైన పునర్నిర్మాణం తప్పనిసరి:

**12.1 సాహిత్య సిండికేట్లను విచ్ఛిన్నం చేయడం:** కుల, ప్రాంతీయ, వ్యక్తిగత ముఠాలను దాటి కేవలం రచనలోని సామాజిక దృక్పథం, కళాత్మక విలువలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకునే వాతావరణం రావాలి.

**12.2 నిష్పాక్షిక విమర్శకు ఊపిరి పోయడం:** విశ్వవిద్యాలయాలు, పరిశోధనా పత్రికలు గ్రంథ సమీక్షలను నిక్కచ్చిగా నిర్వహించాలి. నాణ్యత లేని రచనలను నిర్మొహమాటంగా తిరస్కరించే ధైర్యం విమర్శకులకు ఉండాలి.

**12.3 పాఠకుడి వద్దకు సాహిత్యం:** పుస్తకాలను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గ్రామీణ గ్రంథాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు విస్తరింపజేయాలి. డిజిటల్ మాధ్యమాలను (పాడ్‌కాస్ట్‌లు, ఆడియో బుక్స్, వెబ్ సిరీస్ మాధ్యమాలు) సాహిత్య వ్యాప్తికి ప్రయోజనకరంగా మలచుకోవాలి.

**12.4 సమకాలీన అంశాలపై దృష్టి:** సైబర్ నేరాలు, ఆర్థిక దోపిడీలు, పర్యావరణ వినాశనం వంటి నేటి తరం సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, మానవీయ కోణంలో రచనలు సాగాలి.

**ముగింపు:**

"సాహిత్యం సమాజాన్ని మారుస్తుంది" అనే వాక్యం ప్రస్తుతం ఒక పవిత్రమైన నినాదంగా మిగిలిపోయిందే తప్ప, వర్తమాన వాస్తవికతగా నిలవలేకపోయింది. ఒక రచన సమాజంలోని ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయలేనప్పుడు, పాలకుల నిరంకుశత్వాన్ని నిలదీయలేనప్పుడు, బాధితుడి గాయానికి సాంత్వన చేకూర్చలేనప్పుడు—దానిని గొప్ప సాహిత్యమని భావించడం సామూహిక ఆత్మవంచన మాత్రమే అవుతుంది.

మాలపల్లి, కన్యాశుల్కం, మహాప్రస్థానం సృష్టించిన ప్రకంపనలు నేటి రచనల్లో కనిపించకపోవడానికి కారణం రచయితల నైతిక నిబద్ధత లోపించడమే. సాహిత్యకారులు తమ స్వార్థపూరిత గూళ్ళను, ముఠా రాజకీయాలను, అవార్డుల దాసోహాన్ని వీడి, నేలమీది వాస్తవాలతో తమ అక్షరాలను ముడిపెట్టినప్పుడే సాహిత్యానికి అసలైన ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. లేనిపక్షంలో, చరిత్ర పుటల్లో నేటి ఆధునిక తెలుగు సాహిత్యం ప్రభావం చూపని ఒక నిష్ఫల అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదముంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

**ఉపయుక్త గ్రంథ సూచి (Bibliography)**

1. ఆరుద్ర. (1965). సమగ్ర ఆంధ్ర సాహిత్యం.
2. కుటుంబరావు, కొడవటిగంటి. (1980). సాహిత్య వ్యాసాలు.
3. గురజాడ అప్పారావు. (1892). కన్యాశుల్కము. విజయనగరం.
4. చేకూరి రామారావు. (1998). చేరాతలు. హైదరాబాద్: నవచేతన పబ్లికేషన్స్.
5. ఉన్నవ లక్ష్మీనారాయణ. (1922). మాలపల్లి.
6. రాచమల్లు రామచంద్రారెడ్డి. (1978). సారస్వత వివేచన.
7. శ్రీశ్రీ. (1950). మహాప్రస్థానం.
8. త్రిపురనేని మధుసూదన రావు –సాహిత్య సర్వస్వం 1 మరియు 2
9. రాచాపాలెం చంద్ర శేఖర్ రెడ్డి – చర్చ ; తెలుగు సాహిత్య విమర్శ –భావజాల అధ్యయనం
10. ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం – సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు
11. జి. లక్ష్మీనర్సయ్య – కవిత్వం చర్చనీయాంశాలు
12. Bourdieu, Pierre. (1993). The Field of Cultural Production: Essays on Art and Literature. New York: Columbia University Press.
13. Habermas, Jürgen. (1989). The Structural Transformation of the Public Sphere. Cambridge: MIT Press.
14. Williams, Raymond. (1977). Marxism and Literature. Oxford: Oxford University Press.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

# ఆరుద్ర 'కాటమరాజు కథ' —— నాటకశిల్పం, సామాజిక ప్రయోజనం

– డా. డి. ధాత్రి కుమారి
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి),
గుంటూరు, ఆంధ్రప్రదేశ్
చరావాణి: 9989753424

**వ్యాస సంగ్రహం:**

*తెలుగు వీరగాథల్లో అన్నిటికంటే పెద్దదైన కాటమరాజు కథను ఆరుద్ర 1961లో స్టేజి నాటకంగా మలిచారు. పశువుల మేత కోసం నెల్లూరు సీమకు వచ్చిన యాదవులకూ నెల్లూరు రాజుకూ మధ్య ఒక చిలుక చావుతో మొదలైన గొడవ పుల్లరి ఒప్పందాన్ని తెంచి, ఎర్రగడ్డపాడు యుద్ధంలో ఇరుపక్షాల వినాశనంగా ముగియడమే ఈ నాటక కథ. మూడు తరాల 32 గాథల సమూహం నుంచి ఈ ఒక్క యుద్ధ ఘట్టాన్ని ఎంచుకొని, మూలానికి భంగం కలగని కల్పనలతో, సహగమనం వంటి అమానుష ఘట్టాలను వదిలేస్తూ ఆరుద్ర ఈ గాథను రంగస్థలానికి తీసుకొచ్చిన తీరు, ఆరుద్ర చేసిన కల్పనలు, ఛాయానాటకం, ఆద్యంత సామ్యం వంటి శిల్ప విశేషాలు ఇందులో చర్చకు వస్తాయి. మూల గాథ యుద్ధాన్ని కీర్తిస్తే ఆరుద్ర నాటకం దాన్ని ప్రశ్నిస్తుంది; ఈ మార్పే ఈ నాటకానికి నేటి యుద్ధాలు, వనరుల పోరాటాలు, అధికారంలో అవినీతి నేపథ్యంలో ప్రాసంగికతను, సామాజిక ప్రయోజనాన్ని ఇస్తుందని ఈ వ్యాసంలో విశ్లేషించడమైనది.*

**కీలక పదాలు:** కాటమరాజు కథ, ఆరుద్ర, వీరగాథ, నాటకశిల్పం, ఛాయానాటకం, సామాజిక ప్రయోజనం

## 1. భూమిక:

ఒక చిలుక చావు ఒక జాతినే నాశనం చేయగలదా?

ఏడు శతాబ్దాల క్రితం నెల్లూరు సీమలో అదే జరిగిందని యాదవుల వీరగాథలు చెబుతున్నాయి. గంగ జాతరల్లో కొమ్ములు ఊదుతూ తరతరాలుగా యాదవుల వీరగాథలు పాడే గాథాకారుల సంప్రదాయం తెలుగు పల్లెల్లో ఇప్పటికీ కనిపిస్తుంది. వారు పాడే కథల్లో అన్నిటికంటే పెద్దది కాటమరాజు కథ. ఈ మౌఖిక గాథను ఆరుద్ర 1961లో స్టేజి నాటకంగా మలిచారు. పైకి ఇది యాదవులకూ నెల్లూరు రాజుకూ జరిగిన పాత యుద్ధం-కథే; లోపల మాత్రం ఒక సమాజపు ఆత్మగౌరవం, అధికారం చేసే అన్యాయం, యుద్ధం మిగిల్చే శూన్యం ఉన్నాయి. ఆరుద్ర ఈ గాథను రంగస్థలం కోసం ఎలా మలిచారో, ఆ ప్రయత్నం నేటి సమాజానికి ఏం చెబుతుందో విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

## 2. కవి పరిచయం:

ఆరుద్ర అనే కలం పేరుతో ప్రసిద్ధుడైన భాగవతుల సదాశివ శంకరశాస్త్రి పుట్టింది విశాఖపట్నంలో, 1925 ఆగస్టు 31న. వీరు వరుసకు శ్రీశ్రీకి మేనల్లుడు అవుతారు. తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంగా రాసిన 'త్వమేవాహం'తో అభ్యుదయ కవిగా పేరు తెచ్చుకున్నారు. 'బీదల పాట్లు' (1950) నుంచి దాదాపు నలభై ఏళ్ళు సినిమాలకు పాటలూ మాటలూ రాశారు. మరోవైపు తెలుగు సాహిత్య చరిత్రను ఒకేచోట చూపించాలన్న తపనతో 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' రాశారు. 1985లో 'కళాప్రపూర్ణ', 1987లో 'గురజాడ గురుపీఠం'కు సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న వీరు 1998 జూన్ 4న కన్నుమూశారు.

**3. కాటమరాజు కథ —— విస్తృతి:**

కాటమరాజు కథ ఒక్క కథ కాదు; కాటమరాజు తాత ఆవుల వలురాజు నుంచి కాటమరాజు దాకా మూడు తరాల వీరుల కథను చెప్పే ముప్పై రెండు గాథల సమూహం. కొన్ని గాథల్లోని వంశవృక్షాలు కాటమరాజును చంద్రవంశ క్షత్రియుడిగా, శ్రీకృష్ణుడికి 23వ తరంవాడిగా చెబుతాయి [పు.2]. ప్రజలు దీన్ని 'యాదవ భారతం' అంటారు; తాటాకు ప్రతులను ఎద్దుల మీద మోసుకొని గాథాకారులు ఊరూరా తిరిగి ఊరూరా తిరిగి ఈ వీరగాథలను పాడేవారు. అందువల్ల 'యాదవ భారతం ఎద్దుమోత బరువు' అనే సామెత పుట్టింది. ఈ కథలను కాపాడింది యాదవులను ఆశ్రయించి బతికే కొమ్ములవారు అనే మాదిగ గాథాకారులు [10], యాదవుల్లోని 'సుద్దుల గొల్లలు' లేదా 'తెరచీర భక్తులు'. చారిత్రకంగా కాటమరాజుతో తలపడింది నెల్లూరు చోళ ప్రభువు నల్లసిద్ధి; నాటకంలో ఆ రాజు 'మనుమసిద్ధి రాజు'గా కనిపిస్తాడు. కాటమరాజు కథ మన సంస్కృతిలో భాగమైన ఉపసంస్కృతికి ఆయువు పట్టు. అచ్చమైన తెలుగుదనానికి మణి దర్పణం.

**4. సంక్షిప్త ఇతివృత్తం:**

కాటమరాజు కథలోని ముప్పై రెండు గాథల్లోంచి ఆరుద్ర కథాచక్రం చివరి యుద్ధమైన 'ఎర్రగడ్డపాటి పోట్లాట'ను వెన్నెముకగా తీసుకొని, దానికి 'భట్టు రాయబారం'ను అతికించారు. పశువుల మేత కోసం కాటమరాజు నెల్లూరు సీమకు వస్తాడు. మందలో పుట్టే కోడెదూడలను పుల్లరి (మేపు సుంకం)గా ఇచ్చేలా రాజుతో ఒప్పందం కుదురుతుంది. రాజు ఉంపుడుగత్తె చిలకసాని చిలుక మందను బెదరగొడితే ఒక యాదవ వీరుడు దాన్ని చంపుతాడు. పగబట్టిన ఆమె రాజుకు తెలియకుండా బోయల చేత పశువులను చంపిస్తుంది. మందకే నష్టం జరిగాక పుల్లరి ఎక్కడిదని యాదవులు వెనుతిరుగుతారు. రాయబారం విఫలమై ఎర్రగడ్డపాడు దగ్గర ఘోర యుద్ధం జరుగుతుంది. ఒక చిలుక దగ్గర మొదలైన చిన్న నిప్పురవ్వ ఒక జాతినే దహించే మంటగా ఎలా మారుతుందో చూపడమే ఈ నాటకంలో ప్రధాన ఇతివృత్తం.

## 5. నాటకంలోని కల్పనలు, మార్పులు:

ఆరుద్ర ఈ నాటకంలో మూల కథను ఎక్కడా తలకిందులు చేయలేదు. వారు జోడించిన కీలకమైన కల్పన రాయశృంగారభట్టు లంచం: భట్టు ఖడ్గతిక్కనకు తెలియకుండా యాదవుల దగ్గర లంచం తీసుకుంటే, అపవాదు తిక్కనపై పడుతుంది. గాథలో తిక్కన యుద్ధానికి కారణం రాజభక్తి మాత్రమే; నాటకంలో దానికి వ్యక్తిగత గాయం తోడై, అతని చావు వీరమరణం నుంచి విషాదంగా మారుతుంది. తిక్కన ఇంటి స్త్రీలను వీరవనితలుగా చూపడం కూడా ఆరుద్ర సృష్టే. గాథల్లో ఉన్న జానమ్మ(చానమ్మ) సహగమనాన్ని మాత్రం వారు కావాలనే వదిలేశారు; చరిత్రను గౌరవిస్తూనే దానిలోని అమానుషాన్ని వేదిక మీద కీర్తించకూడదన్న స్పృహ ఇందులో ఉంది.

**6. పౌరాణిక పోలికలు:**

కథాచక్రాన్ని 'యాదవ భారతం' అన్నా, ఆరుద్ర నాటకం ఎక్కువగా రామాయణాన్నే గుర్తుచేస్తుందని మొదట గుర్తించింది తంగిరాల వారే [2, పు. xv–xvi]. కాటమరాజులో రాముడు, ఎఱ్ఱయ్యలో లక్ష్మణుడు, సిరిదేవిలో కైక, చిలకసానిలో శూర్పణఖ, సిద్ధిరాజులో రావణుడు కనిపిస్తారు; చిలుక మాయలేడి, పశుగణం వానరసేన. ప్రేక్షకుడికి అంతగా తెలియని జానపద గాథను అతనికి బాగా తెలిసిన ఇతిహాసాల చట్రంలో పెట్టడం ద్వారా ఆరుద్ర ఆ గాథకు గౌరవాన్నీ, ప్రేక్షకుల ఆదరణను తీసుకువచ్చారు.

**7. పాత్రల విశ్లేషణ:**

నాటకాన్ని నడిపేది కాటమరాజు ఆత్మస్థైర్యం. తన మందకోసం రాజ్యానికి ఎదురునిలిచినా యుద్ధం మీద అతనికి భ్రమలు లేవు: సిద్ధిరాజు "ఆధునిక పరికరాలతో, అధునాతన యంత్రతంత్రాలతో పోరాడినవాడికే విజయం" (పు. 127). అన్న మాటలకు కాటయ "ఏ యుద్ధంలో గెలిచినవాడైనా మరుక్షణంనుంచే క్షణక్షణం ఓడిపోతాడు" (పు. 127) అనే యాదార్థాన్ని తెలియజేస్తాడు. బలాన్ని నమ్ముకున్న అధికారానికీ–నీతిని నమ్ముకున్న సమాజానికీ మధ్య సంఘర్షణ మొత్తం ఈ రెండు వాక్యాల్లో ఉంది. వీరి మధ్య నలిగిపోయే ఖడ్గతిక్కన శత్రుపక్షంలో ఉన్నా నాటకంలో అత్యంత ఉదాత్తమైన పాత్ర; అతని మరణం నాటకంలో కరుణకు కేంద్రం.

**8. నాటకశిల్ప లక్షణాలు:**

నాటక లక్షణాల పరంగా చూస్తే ఈ నాటకానికి అంకాలు లేవు; నాటకం మొత్తం 'ముప్పై నాలుగు' రంగాల్లో నడుస్తుంది. రాయబారాన్ని దాదాపు యథాతథంగా తీసుకోవడంతో పదహారవ రంగం మాత్రం పొడవు ఎక్కువైంది; నాటకానికి ఆయువుపట్టైన యుద్ధభాగం త్వరగా ముగిసిపోవడం ఒక లోటు. ద్విపదలను వచనంలోకి మార్చినా యతిప్రాసలను నిలిపారు. చాటుపద్యాలను తగిన చోట్ల పొదిగారు; పద్యం లేని నాటకాన్ని తెలుగు ప్రేక్షకుడు ఆదరించడన్నది వారికి తెలుసుకాబట్టి అలా చేశారు.

దీనిలో ప్రధాన రసం వీరం; శృంగార, హాస్య రసాలు దానికి తోడు. వేదిక మీద చూపలేని యుద్ధాన్ని ఆరుద్ర పదమూడవ రంగంలో ఛాయానాటకంగా చూపారు; నీడల్లో కనిపించే యుద్ధం ప్రేక్షకుడి ఊహకు చోటిస్తుంది. నిర్మాణంలో అన్నిటికంటే అర్థవంతమైనది ఆద్యంత సామ్యం (ring composition); మొదటి రంగమూ చివరి రంగమూ 'గంగగుడి'యే (పు. 1, 129). మొదట సంబరంతో ఉన్న అదే గుడి చివర శోకంతో నిండి ఉంటుంది; మధ్యలో ఒక జాతి నాశనమైంది. ధర్మానికి జయం, లోకానికి శాంతి కోరే కొమరుబంగరుభట్టు పద్యంతో తెర పడుతుంది. సంస్కృత నాటకాల భరతవాక్యాన్ని ఆరుద్ర ఆధునిక శాంతి సందేశంగా మార్చారు.

**9. తులనాత్మక విశ్లేషణ:**

'పల్నాటి వీరచరిత్ర' కు 'కాటమరాజు కథ' కు మధ్య ఆసక్తికరమైన పోలికలు కనిపిస్తాయి. పల్నాటి గాథను మాల గాథాకారులు, కాటమరాజు గాథను మాదిగ గాథాకారులు కాపాడారు; ఒకదానికి చెన్నకేశవుడు, మరొకదానికి గంగ కేంద్రం; రెండింట్లోనూ గెలిచిందెవరో తేలదు. మూల గాథకూ నాటకానికీ అసలు తేడా ఒక్కటే: గాథ యుద్ధాన్ని కీర్తిస్తుంది, నాటకం దాన్ని ప్రశ్నిస్తుంది. గాథలో యుద్ధం గౌరవమైతే నాటకంలో అది గాయం.

**10. ప్రాసంగికత —— సామాజిక ప్రయోజనం:**

ఎక్కడో ఒక చోట ఎప్పుడూ యుద్ధం జరుగుతున్న ఈ రోజుల్లో, గెలిచినవాడూ ఓడిపోతాడన్న కాటమరాజు మాట ఒక హెచ్చరిక. కథ అడుగున ఉన్నది మేత భూమి కోసం పశుపోషకులకూ రాజ్యానికీ జరిగిన ఘర్షణ; పశువుల మేతకు పచ్చిక బయళ్ళు కరవైపోయి పశుపోషకులు బతుకుతెరువు కోసం పోరాడుతున్న పరిస్థితిని కవి మన కనులముందు ప్రత్యక్షీకరింపజేశారు. సహగమనాన్ని వదిలి స్త్రీని శక్తిగా చూపడం, దళిత గాథాకారుల కృషిని ప్రధాన స్రవంతికి తేవడం ఈ నాటకం చేసిన మరో గొప్ప అంశంగా చెప్పవచ్చు. గుండంచర్ల కాటమరాజు గుడిలో ఏటా జరిగే తిరునాళ్ళకు రైతులు బొల్లావులను తోలుకొని రావడం [5] ఈ గాథ ఇప్పటికీ సజీవంగా ఉందని చెబుతుంది.

**11. ఉపసంహారం:**

ఒక చిలుక చావు ఒక జాతినే నాశనం చేయగలదా? ఆరుద్ర నాటకం ఇచ్చే జవాబు స్పష్టం: నాశనం చేసింది చిలుక కాదు; అధికారపు అహంకారం, అవినీతి, పగ, యుద్ధం మీద నమ్మకం. ఆరుద్ర 'కాటమరాజు కథ' పాత వీరగాథను కొత్త వేదిక మీదికి తెచ్చిన నాటకం మాత్రమే కాదు; అన్యాయం ముందు తలవంచని ఒక సమాజపు ఆత్మగౌరవానికి అద్దం. యుద్ధ విజయాన్ని కాక శాంతిని సందేశంగా చెప్పిన ఈ నాటకం, ఆధునిక సాహిత్య ప్రక్రియ సమాజానికి ఎలా ఉపయోగపడగలదో చూపుతుంది. పండితుడి పరిశోధనా దృష్టినీ, కవి హృదయాన్నీ, రంగస్థల నేర్పునూ ఒకే రచనలో మేళవించి, జానపద వీరగాథకు శాంతి గొంతును ఇచ్చిన ఆరుద్ర తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ చిరస్మరణీయులు.

**ఆధార గ్రంథాలు**


1. ఆరుద్ర. కాటమరాజు కథ (స్టేజి నాటకం). ప్రథమ ముద్రణ. చెన్నై: స్త్రీశక్తి ప్రచురణలు, 1999.
2. తంగిరాల వెంకటసుబ్బారావు. "ఆరుద్ర అద్భుతసృష్టి కాటమరాజు నాటకం" (పీఠిక). ఆరుద్ర, కాటమరాజు కథ, 1999.

3. తంగిరాల వెంకటసుబ్బారావు (సంపా.). కాటమరాజు కథలు. సంపుటాలు 1–2. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1976–78.
4. తంగిరాల వెంకటసుబ్బారావు. తెలుగు వీరగాథా కవిత్వము (పరిశోధన). తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
5. రామలక్ష్మి, కె. “ఈ నాటక రచన గురించి.” ఆరుద్ర, కాటమరాజు కథ, 1999.
6. బిరుదురాజు రామరాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. హైదరాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు, 1978 (ద్వి.ము.).
7. నాయని కృష్ణకుమారి. తెలుగు జానపద గేయగాథలు. 1977.
8. పోణంగి శ్రీరామ అప్పారావు. తెలుగు నాటక వికాసం. 1967.
9. Roghair, Gene H. The Epic of Palnadu. Oxford: Clarendon Press, 1982.
10. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి. తెలుగువారి జానపద కళారూపాలు (‘కాటమరాజు కొమ్ము కథలు’ అధ్యాయం).